నోట్ ఆన్ సేఫ్ గార్డ్స్ చట్టంగా మారి.. రాష్ట్రం పేరు మార్చి!

ఫిబ్రవరి 6 తరువాయి

15. పెద్ద మనుషుల ఒప్పందానికి సంబంధించి కింది వాక్యాలను పరిశీలించండి.

1. పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం భవిష్యత్తులో జరిగే నియామకాలన్నీ జనాభా ప్రాతిపదికనే జరుగుతాయి

2. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో జరుగుతున్న పొరపాట్లను సరిదిద్ది, తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను నివారించే నిమిత్తం జీవో నం. 610ను విడుదల చేసింది

3. పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం రాష్ట్ర కేబినెట్‌లో ఇరు ప్రాంతాలకు ఆంధ్రా- తెలంగాణ ప్రాంతాల వారికి మంత్రి పదవులు 50:50 నిష్పత్తిలో ఉండాలి

4. 1953లో భారత ప్రభుత్వం జస్టిస్ ఫజల్ అలీ నేతృత్వంలో రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌ను నియమించింది

పై వాక్యాల్లో సరైనది ఏది?

ఎ) 1, 2 సరైనవి   బి) 1, 2, 4 సరైనవి
సి) 2, 3 సరైనవి   డి) పైవన్నీ

జవాబు : బి

వివరణ –

- రాష్ట్రానికి సంబంధించిన కేంద్ర, రాష్ట్ర సాధారణ పరిపాలనా వ్యయం ఆంధ్ర, తెలంగాణ జనాభా నిష్పత్తి ప్రకారం భరించాలి. ముఖ్యంగా తెలంగాణ మిగులు నిధులు ఆ ప్రాంత అభివృద్ధికే కేటాయించాలి. 5 సంవత్సరాల వరకు ఈ ఏర్పాటు ఉండాలి. ఆ తరువాత తెలంగాణ శాసన సభ్యులు కోరిన పక్షంలో ఈ గడువును మరో ఐదు సంవత్సరాలు పొడిగించవచ్చు.
- రాష్ట్ర శాసనసభలో తెలంగాణ సభ్యులు నిర్ణయించిన విధంగానే మద్య నిషేధం అమలు చేయాలి
- ఏకీకరణ కారణంగా, ఉద్యోగాలు తగ్గించాల్సి వస్తే ఈ తగ్గింపు జనాభా నిష్పత్తి ప్రకారం జరగాలి ముమ్మందు రాబోయే ఉద్యోగాలు రెండు ప్రాంతాల జనాభా ప్రాతిపదికపై ఉండాలి.
- ఐదేళ్లపాటు తెలంగాణలో పరిపాలన, న్యాయశాఖల్లో ఉర్దూ భాషకున్న స్థానం కొనసాగాలి. తరువాత ప్రాంతీయ మండలి ఈ అంశాన్ని చర్చించి, అవసరమైతే సవరించవచ్చు. ఉద్యోగంలో చేరిన రెండేళ్లలోగా తెలుగు నేర్చుకోవాలనే నియమం ఉండవచ్చు.
- తెలంగాణలో జనాభా నిష్పత్తి ప్రకారం నిర్ణయించిన ఉద్యోగాల్లో చేరడానికి అభ్యర్థులు ఆ ప్రాంతంలో 12 సంవత్సరాలు నివాసం ఉండి ఉండాలి.
- తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి చెందడానికి ఒక ప్రాంతీయ సంఘం ఉండాలి
- తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయ భూముల అమ్మకం, ప్రాంతీయ సంఘం ఆధీనంలో ఉండాలి
- ఈ ప్రాంతీయ సంఘంలో 20 మంది సభ్యులు ఉండాలి. తెలంగాణలోని తొమ్మిది జిల్లాల ప్రతినిధులుగా 9 మంది శాసనసభ్యులను శాసనసభ ఎన్నుకోవాలి. సభలోని తెలంగాణ సభ్యులు పార్లమెంట్ నుంచి గానీ, అసెంబ్లీ నుంచి గానీ, ఆరుగురు సభ్యులను ఎన్నుకొంటారు. ముఖ్యమంత్రి, స్పీకర్ మినహా తెలంగాణ ప్రాంతానికి చెందిన మంత్రులంతా ఈ సంఘంలో సభ్యులుగా ఉంటారు.
- ప్రాంతీయ సంఘాన్ని రాజ్యాంగంలో 371 ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి నియమిస్తారు. అందువల్ల ఇది చట్టబద్ధమైన సంస్థ. ప్రణాళికా రచన, అభివృద్ధి వ్యవహారాలు, నీటి పారుదల, ఇతర వ్యవసాయ పథకాలు, పారిశ్రామికాభివృద్ధి, తెలంగాణలో ఉద్యోగాలు, ప్రజారోగ్యం, మద్యపాన నిషేధం వంటి అంశాలను ప్రాంతీయ సంఘం పరిశీలించి సముచిత నిర్ణయాలు తీసుకొంటుంది. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రాంతీయ సంఘానికి మధ్య అభిప్రాయ భేదం కలిగితే తుది నిర్ణయం కోసం, కేంద్ర ప్రభుత్వానికి నివేదించవచ్చు. ఈ ఏర్పాటు మధ్యలో, మరో ఒప్పందం లేకపోతే సమీక్ష పది సంవత్సరాల తరువాత జరుగుతుంది.
- మంత్రి వర్గ నిర్మాణంలో ఆంధ్ర ప్రాంతం నుంచి 60 శాతం, తెలంగాణ ప్రాంతం నుంచి 40 శాతం ఉండాలి. తెలంగాణ ప్రాంతం నుంచి ముస్లిం మంత్రి కూడా ఉండాలి.
- హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు 1962 వరకు తెలంగాణకు ప్రత్యేక కాంగ్రెస్ కమిటీ ఉండాలని కోరుతున్నారు. దీనికి ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షులు అభ్యంతరం తెలియజేయలేదు.

INDIA
TELANGANA
HYDERABAD
ANDHRA PRADESH

గ్రూప్స్ ప్రత్యేకం
ఉద్యమ చరిత్ర

16. పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం కింది శాఖల్లో ఏ రెండింటిని తెలంగాణ వారికి కేటాయించాలి.

ఎ. హోం, ఆర్థిక, రెవెన్యూ, విద్య, వాణిజ్యం, పరిశ్రమలు
బి. హోం, రెవెన్యూ, పరిశ్రమలు, విద్య, ప్లానింగ్
సి. హోం, ఆర్థిక, రెవెన్యూ, ప్లానింగ్, అభివృద్ధి, వాణిజ్యం, పరిశ్రమలు
డి. ఆర్థిక, విద్యుచ్ఛక్తి, పరిశ్రమలు, విద్య, రూరల్ డెవలప్‌మెంట్

జవాబు : సి

వివరణ :

- రాష్ట్రానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర సాధారణ పరిపాలనా వ్యయం ఆంధ్ర, తెలంగాణ జనాభా నిష్పత్తి ప్రకారం భరించాలి. ముఖ్యంగా తెలంగాణ మిగులు నిధులు ఆ ప్రాంత అభివృద్ధికే కేటాయించాలి. 5 సంవత్సరాల వరకు ఈ ఏర్పాటు ఉండాలి. ఆ తరువాత తెలంగాణ శాసన సభ్యులు కోరిన పక్షంలో ఈ గడువును మరో ఐదు సంవత్సరాలు పొడిగించవచ్చు.
- ప్రణాళికా రచన, అభివృద్ధి వ్యవహారాలు, నీటి పారుదల, ఇతర వ్యవసాయ పథకాలు, పారిశ్రామికాభివృద్ధి, తెలంగాణలో ఉద్యోగాలు, ప్రజారోగ్యం, మద్యపాన నిషేధం వంటి అంశాలను ప్రాంతీయ సంఘం పరిశీలించి సముచిత నిర్ణయాలు తీసుకొంటుంది.
- రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రాంతీయ సంఘానికి మధ్య అభిప్రాయ భేదం కలిగితే తుది నిర్ణయం కోసం, కేంద్ర ప్రభుత్వానికి నివేదించవచ్చు. ఈ ఏర్పాటు మధ్యలో, మరో ఒప్పందం లేకపోతే సమీక్ష పది సంవత్సరాల తరువాత జరుగుతుంది.
- ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతం వారైతే, ఉపముఖ్యమంత్రి తెలంగాణ వారై ఉండాలి. తెలంగాణ వ్యక్తి ముఖ్యమంత్రి అయితే కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. హోం, ఆర్థిక, రెవెన్యూ, ప్రణాళికాభివృద్ధి, వాణిజ్య, పారిశ్రామిక శాఖల్లో కనీసం రెండైనా తెలంగాణ వారికి ఇవ్వాలి.

17. తెలంగాణ ప్రాంతీయ కమిటీ మూడు స్థాయీ ఉపసంఘాలను ఏర్పాటు చేసింది. అవి

1. స్థానిక పాలన, ప్రజారోగ్య సాయీ ఉపసంఘం

2. విద్యా విషయ స్థాయీ ఉపసంఘం

3. అభివృద్ధి విషయాల స్థాయీ ఉపసంఘం

పై వాక్యాల్లో సరైనది/సరికానిది ఏది?

ఎ) 1, 2 సరైనవి   బి) 1, 3 సరైనవి
సి) 2, 3 సరైనవి   డి) పైవన్నీ

జవాబు : ఎ

వివరణ – తెలంగాణ ప్రాంతీయ కమిటీ మూడు స్థాయీ ఉపసంఘాలను ఏర్పాటు చేసింది. అవి

1. స్థానిక పాలన, ప్రజారోగ్య స్థాయీ ఉపసంఘం

2. విద్యా విషయ స్థాయీ ఉపసంఘం

3. అభివృద్ధి విషయాల స్థాయీ ఉపసంఘం

18. తెలంగాణ ప్రాంతీయ కమిటీ అధికారాలు, విధులు గురించి కింది వాక్యాలను పరిశీలించండి.

1. తెలంగాణ ప్రాంత ప్రాథమిక, మాధ్యమిక విద్యాభివృద్ధిని పరిశీలించి అవసరమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తుంది

2. తెలంగాణ ప్రాంతంలోని విద్యా సంస్థల్లో ప్రవేశాలను నియంత్రిస్తుంది

పై వాక్యాల్లో సరైనది/సరికానిది ఏది?

ఎ) 1 సరైనది   బి) 2 సరైనది
సి) 1, 2 సరైనవి   డి) పైవేవీ సరైనవి కావు

జవాబు : సి

వివరణ – తెలంగాణ ప్రాంతీయ కమిటీ అధికారాలు, విధులు

- తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయ భూముల అమ్మకాలకు తెలంగాణ ప్రాంతీయ కమిటీ ఆమోదం తప్పనిసరి. భూమి అమ్మకాలు మొత్తం తెలంగాణ ప్రాంతీయ కమిటీ నియంత్రణలో ఉంటాయి
- రాష్ట్ర శాసనసభ రూపొందించిన సాధారణ ప్రణాళిక, అభివృద్ధి సంస్థలు, జిల్లా బోర్డు, జిల్లా సంస్థలకు సంక్రమించే రాజ్యాంగబద్ధ అధికారాలను పరిశీలిస్తుంది
- తెలంగాణ ప్రాంత ప్రాథమిక, మాధ్యమిక విద్యాభివృద్ధిని పరిశీలించి అవసరమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తుంది
- తెలంగాణ ప్రాంతంలోని విద్యా సంస్థల్లో ప్రవేశాలను నియంత్రిస్తుంది
- మద్యపాన నిషేధం విషయాన్ని పరిశీలించి సలహాలిస్తుంది
- కుటీర చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయం, సహకార సంఘాలు, మార్కెట్లు, సంతలు వంటివి కూడా తెలంగాణ ప్రాంతీయ కమిటీ పరిధిలోకి వస్తాయి. తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగ నియామకాలను సైతం తెలంగాణ ప్రాంతీయ కమిటీ పరిశీలిస్తుంది.

19. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ఏర్పడిన మొదటి మంత్రి వర్గం గురించి కింది వాక్యాలను పరిశీలించండి.

1. నీలం సంజీవరెడ్డి – ముఖ్యమంత్రి, జనరల్ అడ్మినిస్ట్రేషన్, హోం, ప్లానింగ్, రవాణా

2. కేవీ రంగారెడ్డి – రెవెన్యూ శాఖ

3. కళా వెంకటరెడ్డి – ఆర్థిక శాఖ, అమ్మకం పన్నులు, భూ సంస్కరణలు

4. జేవీ నర్సింగారావు – విద్యుచ్ఛక్తి, నీటిపారుదల

పై వాక్యాల్లో సరైనది/సరికానిది ఏది?

ఎ) 1, 2 సరైనవి   బి) 1, 3 సరైనవి
సి) 2, 4 సరైనవి   డి) పైవన్నీ

జవాబు : డి

వివరణ –

1. నీలం సంజీవరెడ్డి – ముఖ్యమంత్రి, జనరల్ అడ్మినిస్ట్రేషన్, హోం, ప్లానింగ్, రవాణా

2. కేవీ రంగారెడ్డి – రెవెన్యూ శాఖ

3. కళా వెంకటరెడ్డి – ఆర్థిక శాఖ, అమ్మకం పన్నులు, భూ సంస్కరణలు

4. జేవీ నర్సింగారావు – విద్యుచ్ఛక్తి, నీటిపారుదల

20. కింది వాక్యాలను పరిశీలించండి.

1. రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ సంతకంతో పెద్దమనుషుల ఒప్పందం 'నోట్ ఆన్ సేఫ్ గార్డ్స్' పేరుతో చట్టంగా మారింది

2. ఆంధ్ర, తెలంగాణ ప్రాంత నాయకుల సమావేశంలో కొత్త రాష్ట్రం పేరును ఆంధ్ర–తెలంగాణ అని నిర్ణయించారు

పై వాక్యాల్లో సరైనది/సరికానిది ఏది?

ఎ) 1 సరైనది   బి) 2 సరైనది
సి) 1, 2 సరైనవి   డి) పైవేవీ సరైనవి కావు

జవాబు : సి

వివరణ – ఆంధ్రప్రదేశ్ అవతరణ 1956, ఆగస్టు 10న పెద్దమనుషుల ఒప్పందంలోని అంశాలకు సంబంధించి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బీఎన్ డాతర్ ఒక నోటీసు లోక్‌సభకు, అదే నోటు ఆంధ్రరాష్ట్రం అసెంబ్లీకి కూడా పంపించారు. ఈ బిల్లులో తెలంగాణకు కల్పించిన పరిరక్షణలను 'నోట్ ఆన్ సేఫ్ గార్డ్స్' అనే పేరుతో పేర్కొన్నారు.

- 1956, ఆగస్టు 14న ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు సంతకంతో ఒప్పంద పత్రం విడుదలైంది. రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ సంతకంతో పెద్దమనుషుల ఒప్పందం 'నోట్ ఆన్ సేఫ్ గార్డ్స్' పేరుతో చట్టంగా మారింది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంత నాయకుల సమావేశంలో కొత్త రాష్ట్రం పేరును ఆంధ్ర–తెలంగాణ అని నిర్ణయించారు. బిల్లులో ఆ విధంగానే పేర్కొన్నారు. కానీ, బిల్లు సెలెక్ట్ కమిటీ పరిశీలనలో రాష్ట్రం పేరును ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు. ఇందుకు ఆంధ్రుల ఒత్తిడే కారణం అని తేలింది.

21. కింది వాక్యాలను పరిశీలించండి.

1. 1958లో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఆంధ్రలో తెలంగాణ ప్రాంతీయ కమిటీని ఏర్పరిచారు

2. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి తెలంగాణ ప్రాంతీయ కమిటీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు

పై వాక్యాల్లో సరైనది/సరికానిది ఏది?

ఎ) 1 సరైనది   బి) 2 సరైనది
సి) 1, 2 సరైనవి   డి) పైవేవీ సరైనవి కావు

జవాబు : ఎ

వివరణ – 1958లో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతీయ కమిటీని ఏర్పరిచారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి తెలంగాణ ప్రాంతీయ కమిటీ కార్యవర్గాన్ని ఏర్పటు చేయలేదు.

- ఈ సంఘానికి చట్టబద్ధత కల్పించినప్పటికీ దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1960లో కార్యవర్గాన్ని నియమించాడు. తద్వారా తెలంగాణ ప్రాంతీయ సంఘం ప్రాణం పోసుకుంది.

దొమ్మటి తిరుపతి
ఫ్యాకల్టీ,
ఎస్ జే ట్యుటోరియల్స్

విద్య, ఉద్యోగ సమాచారం

హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీలో..

చెన్నై ఆవడిలోని ఆర్మ్‌డ్ వెహికల్ నిగం లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)లో ఫిక్స్‌డ్/కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 32
- **పోస్టులు:** కన్సల్టెంట్, సీనియర్ డిజైన్ ఇంజినీర్, మేనేజర్, ప్రొడక్షన్ ఇంజినీర్, క్వాలిటీ ఇంజినీర్
- **విభాగాలు:** సైబర్ సెక్యూరిటీ, ఎలక్ట్రికల్, మెకానికల్
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.avnl.co.in

నేవల్ అకాడమీలో..

కేరళ ఎజిమళలోని ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ)లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 270
- **పోస్టులు:** షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్
- **విభాగాలు:** ఎగ్జిక్యూటివ్ బ్రాంచీ, పైలట్, లాజిస్టిక్స్, ఎడ్యుకేషన్, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ తదితరాలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** http://https//www.joinindiannavy.gov.in

వరంగల్ నిట్‌లో...

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 5
- **పోస్టులు:** ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్, రీసెర్చ్ అసోసియేట్
- **అర్హతలు,** ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- **దరఖాస్తు:** ఈ–మెయిల్ ద్వారా
- **చివరితేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** https://nitw.ac.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్–1 : జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

భారతదేశం- నేలలు

ఎర్రనేలలు ఏ పంటకు అనుకూలంగా ఉంటాయి?

గ్రూప్స్ ప్రత్యేకం
పాలిటీ

1. అధిక ఉష్ణోగ్రతలు అధిక వర్షపాతం ఏకాంతరంగా ఉండే ప్రాంతాల్లో ఏర్పడే నేలలు?

1. లాటరైట్ నేలలు
2. నల్లరేగడి నేలలు
3. ఎర్రనేలలు
4. పర్వత నేలలు

2. కింది వాటిని జతపరచండి?

ఎ. ఒండలి నేలలు   1. ఎగువ పీఠభూమి
బి. నల్లనేలలు   2. మధ్య పీఠభూమి
సి. ఎర్రనేలలు   3. దక్కన్ పీఠభూమి
డి. లాటరైట్   4. నదీ పరీవాహక ప్రాంతం

1. ఎ–4, బి–3, సి–1, డి–2
2. ఎ–4, బి–2, సి–3, డి–1
3. ఎ–1, బి–2, సి–3, డి–4
4. ఎ–4, బి–3, సి–2, డి–1

3. కింది వానిలో సరిఐనది కానిది ఏది?

1. ఎర్ర నేలల్లో ఇనుము ఎక్కువగా ఉంటుంది
2. నల్ల నేలల్లో ఫాస్పరస్ ఎక్కువగా ఉంటుంది
3. నల్ల నేలల్లో పొటాష్ ఎక్కువగా ఉంటుంది
4. ఏదీ కాదు

4. గంగా, సింధూ మైదానాల ముఖ్యమైన లక్షణం ఏది?

1. హిమాలయాల వల్ల ఏర్పడ్డాయి
2. హ్యూమస్ ఎక్కువ
3. ద్వీపకల్పం వల్ల ఏర్పడ్డాయి
4. ఏదీకాదు

5. గంగా–సింధూ మైదానాలు సారవంతంగా ఉండటానికి కారణాలేవి?

1. అధిక వర్షపాతం& అడవులు
2. పర్వతాల నుంచి నదులు తెచ్చిన మట్టి
3. నీటి పారుదల సౌకర్యాలు
4. ఏదీ కాదు

6. కింది వాటిలో ఏ నేలలు పూర్వకాలం నుంచి అతి ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి?

1. ఒండలి   2. ఎర్ర
3. నల్ల, ఒండలి
4. నల్ల, ఎర్ర

7. భూమి పై పొరలపై లవణాలు ఏర్పరచడాన్ని ఏమంటారు?

1. పడ్జోలైజేషన్   2. గ్లైజేషన్
3. లైటరైజేషన్   4. కాల్సిఫికేషన్

8. గాలి ద్వారా నేలకోత నివారణకు ఉపయోగించేది?

ఎ. టెరెసి వ్యవసాయం
బి. గాలి నివారణ పద్ధతి
సి. వృక్షాలను తీసివేయడం
డి. బి, సి, డి

1. ఎ, బి, డి   2. బి, సి, డి
3. ఎ, బి   4. బి, డి

9. ఏ రకమైన నేలలకు ఉపరితలంపై సేంద్రీయ పదార్థాలుంటాయి?

1. పీటా
2. అల్యూవియల్
3. లాటరైట్   4. ఎర్రనేలలు

10. లాటరైట్ అత్యధికంగా కేంద్రీకృతం చెందిన రాష్ట్రం ఏది?

1. గుజరాత్   2. రాజస్థాన్
3. ఒడిశా   4. జమ్మూకశ్మీర్

11. కింది వాటిలో సరైనవి గుర్తించండి.

ప్రతిపాదన (ఎ): పారే నీళ్లు, పవనాల మూలంగా భూమి పై పొర కొట్టుకుపోవడాన్ని భూ క్రమక్షయం అంటారు

కారణం (ఆర్): ఒండ్రు మట్టి నేలలు సారవంతంగా ఉండి అన్ని రకాల పంటలు సేద్యానికి అనువుగా ఉంటాయి

1. ఎ, ఆర్ వైయక్తికంగా ఒప్పు.. ఎ, ఆర్‌కు సరైన వివరణ
2. ఎ, ఆర్ వైయక్తికంగా ఒప్పు.. ఎ, ఆర్ కు సరైన వివరణ కాదు
3. ఎ ఒప్పు, ఆర్ తప్పు
4. ఎ తప్పు, ఆర్ ఒప్పు

12. దేశంలో అత్యధిక ప్రాంతాన్ని ఏ రకపు నేలలు ఆవరించి వున్నాయి?

1. ఒండ్రు నేలలు
2. లాటరైట్ నేలలు
3. ఎర్ర నేలలు
4. నల్లరేగడి నేలలు

13. మృత్తికా క్రమక్షయాన్ని అరికట్టడానికి ప్రభుత్వం ఏ పద్ధతులను ప్రోత్సహిస్తుంది?

ఎ. వ్యవసాయంపై ఒత్తిడి తగ్గించడం
బి. పంట మార్పిడి పద్ధతి
సి. కాంటూర్ బండింగ్
డి. వనీకరణ

1. ఎ, బి   2. బి, సి
3. ఎ, డి   4. సి, డి

14. కింది వాటిలో సరైనవి గుర్తించండి.

ప్రతిపాదన (ఎ): బసాల్ట్ శిలల శైథిల్యం వల్ల నల్లరేగడి భూములు ఏర్పడ్డాయి

కారణం (ఆర్): నల్లరేగడి భూములు అధిక తేమను నిలుపుకొనే సామర్థ్యం గలవి

సరైన జవాబును ఎంపిక చేయండి?

1. ఎ, ఆర్ రెండు నిజం (ఎ)కు (ఆర్) సరైన వివరణ
2. (ఎ), (ఆర్) రెండు నిజం, (ఎ)కు (ఆర్) సరైన వివరణ కాదు
3. (ఎ) నిజం, (ఆర్) తప్పు
4. (ఎ) తప్పు, (ఆర్) నిజం

15. ఎర్రనేలలు ఏ పంటకు అనుకూలంగా ఉంటాయి?

1. చిరుధాన్యాలు
2. లాటరైట్ నేలలు
3. ఎర్రనేలలు
4. నల్లరేగడి నేలలు

16. నల్ల నేలలను తక్కువగా దున్నటం అవసరం ఎందుకంటే?

1. అతి సారవంతమైనవి
2. అవి లావా నుంచి పుట్టినవి
3. వీటిలో చాలా ఇనుము , అల్యూమినియం సమ్మేళనాలు ఉంటాయి
4. అవి ఎండినప్పుడు పగుళ్లు ఏర్పడుతాయి

17. ప్రపంచ పృథ్వీ దినం?

1. ఏప్రిల్ 22   2. మార్చి 22
3. ఫిబ్రవరి 22   4. జనవరి 22

18. ఎర్ర నేలలు అధికంగా కనిపించే రాష్ట్రాలు?

1. పంజాబ్, హర్యానా
2. హిమాచల్ ప్రదేశ్ , జమ్మూకశ్మీర్
3. రాజస్థాన్, గుజరాత్
4. తమిళనాడు , ఆంధ్రప్రదేశ్

19. నల్లరేగడి ప్రాంతం ఎక్కువగా ఉన్న రాష్ట్రం?

1. అసోం   2. బీహార్
3. పంజాబ్   4.మహారాష్ట్ర

20. కింది వాటిలో ఏ రకపు భూమి తడిగా ఉన్నప్పుడు పొంగి, పొడిగా ఉన్నప్పుడు పగుళ్లు ఏర్పడును?

1. ఒండలి భూమి
2. లాటరైట్ భూమి
3. నల్లరేగడి భూమి
4. ఎర్రభూమి

21. అరణ్యాలు నాశనం కావడం వల్ల కలిగే నష్టం?

1. వృక్ష సంపద నశించడం
2. నేల క్రమక్షయం
3. మూలకాలు తొలగిపోవడం
4. వర్షపాతం తగ్గడం

22. ఎర్రనేలలు ఏ పంటకు అనుకూలంగా ఉంటాయి?

1. చిరుధాన్యాలు   2. పప్పుధాన్యాలు
3. వాణిజ్య పంటలు 4. తోట పంటలు

23. 'జల పట్టిక' దేన్ని సూచిస్తుంది?

1. అల్పగాఢత ఉన్న మండలం
2. అధికంగా ఉన్న మండలం
3. భూ గర్భంలో కాలువల రూపంలో ప్రవహించే నీరు
4. పారగమ్యం గల, పారగమ్యం లేని రాళ్లు స్పర్శించే మండలం

24. పంజాబ్ నుంచి అసోం వరకు విస్తరించి ఉన్న ఇండో–గంగా మైదానంలో ఏ రకమైన నేలలు ఉన్నాయి ?

1. బ్లాక్ నేలలు   2. రెడ్ నేలలు
3. లాటరైట్ నేలలు
4. అల్యూవియల్ నేలలు

25. 'ఇండో –గ్యాంగ్‌టిక్' మైదానంలో సాధారణంగా లభించే మట్టి ఏది?

1. నల్లరేగడి   2. ఎర్రరేగడి
3. ఒండ్రు మట్టి   4. ఎడారి

26. నేల పగుళ్లను నివారించేది?

1. పార్కులు ఉద్యానవనాలు
2. వర్షాలు   3. గాలులు
4. నదులు

27. 'వరల్డ్ వైడ్ ల్యాండ్ డే'గా ఏ రోజున గుర్తించారు?

1. ఫిబ్రవరి 14   2. ఫిబ్రవరి 2
3. ఫిబ్రవరి 28   4. ఫిబ్రవరి 29

28. దేశంలో అత్యంత పెద్దది- అత్యంత ప్రధానమైన నేలమార్గం?

1. అల్యూవియల్ సాయిల్
2. బ్లాక్ సాయిల్   3. రెడ్ సాయిల్
4. లాటరైట్ సాయిల్

29. అగ్నిపర్వతాల నుంచి వెలువడిన లావా నిక్షేపణాల ఫలితంగా ఏర్పడిన మృత్తిక?

1. ఎర్ర కంకర మృత్తిక
2. నల్ల మృత్తిక   3. ఎర్ర మృత్తిక
4. ఒండ్రు మట్టి మృత్తిక

30. ఇనుము ఆక్సైడ్ వల్ల ఉండే నేల రంగు?

1. రేగర్   2. బంగర్
3. ఎర్రమట్టి   4. ఆల్కలైన్

31. ఏ భూమికి తక్కువ ఎరువులు అవసరమవుతాయి?

1. నల్లరేగడి   2. లోమిభూమి
3. లాటరైట్ భూమి
4. అల్యూవియల్ భూమి

32. ఖాదర్ నేలలు ఎక్కడ ఉంటాయి?

1. ఎక్కువ ఎత్తయిన వాలులు
2. తక్కువ చదరంగా ఉండే ప్రాంతాలు
3. ఇన్‌పేడ్‌మంట్ మైదానాలు
4. వరద మైదానాలు

33. ఇండియాలో నేలల రకాలు?

1. అల్యూవియల్ నేలలు
2. బ్లాక్ నేలలు   3. రెడ్ నేలలు
4. పైవన్నీ

34. హ్యూమస్ అధికంగా ఉండే చెర్నోజెమ్ రేగడి భూములు ఉన్న ప్రాంతం?

1. అమెజాన్ తీరం
2. ఈజిప్ట్
3. ఉక్రెయిన్   4. గంగా తీరం

35. కింది వాటిలో నిర్మూలనం దేనిపై భయంకరమైన ప్రభావాన్ని చూపిస్తాయి?

1. పచ్చిక బీడుల విస్తీర్ణాన్ని పెంచడంపై
2. సూర్యరశ్మిపై
3. మృత్తిక సంరక్షణ
4. మృత్తిక క్రమక్షయం

36. మృత్తిక నేలల్లోని పొరలను ఏమంటారు?

1. హార్ట్ ప్యాన్స్   2. ప్రొఫైల్
3. పెడకల్స్   4. హొరైజెన్స్

37. కింది భూముల్లో దేన్ని నల్లరేగడి భూములని కూడా పేర్కొంటారు?

1. తుండా భూములు
2. చెర్నోజెమ్ భూములు
3. ప్రయరీ భూములు
4. లాటరైట్ భూములు

38. 'రెగర్' అనే పదం కింది వాటిలో ఒకదానికి నిర్దేశించబడుతుంది?

1. డెల్టా ఒండ్రు మృత్తికలు
2. లాటరైట్ మృత్తికలు
3. నల్లరేగడి మృత్తికలు
4. ఎర్ర పీతవర్ణం

39. ఇండియాలో పీట రకం భూసారం కలిగిన నేలలు ఎక్కువగా ఎక్కడ ఉన్నాయి?

1. బీహార్   2. ఒడిశా
3. కేరళ   4. గుజరాత్

40. దేశంలో లాటరైట్ మృత్తికలు ఏ ప్రాంతంలో లభ్యమవుతాయి?

1. గంగా మైదానం
2. పశ్చిమ కనుమలు
3. పంజాబ్ మైదానం
4. మల్వా పీఠభూమి

41. మట్టినుంచి మినరల్స్ అధికంగా వచ్చే అత్యంత ప్రభావ వంతమైన సేద్యపు పద్ధతి ఏది?

1. ఒక ఆకృతిలో దున్నడం
2. టెర్రసింగ్
3. పంట మార్పిడి
4. దుక్కి చేయడం

42. దేశంలో దక్కన్ ప్రాంతంలో అతి ముఖ్యమైన నేల రకం?

1. ఎరుపు నేలలు
2. నల్లమట్టి నేలలు
3. లాటరైట్ నేలలు
4. ఒండ్రు నేలలు

43. తేయాకు సాగుకు అనువైన భూమి?

1. ఎర్ర నేలలు   2. నల్ల నేలలు
3. ఒండ్రు నేలలు   4. జేగురు నేలలు

44. కింది వాటిలో ఏ రాష్ట్రం ఒండ్రుమట్టి నేలలు ఉండవు?

1. తమిళనాడు   2. మధ్యప్రదేశ్
3. ఒడిశా   4. పశ్చిమబెంగాల్

45. లాటరైట్ నేలలు ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి?

1. తమిళనాడు   2. కర్ణాటక
3. ఒడిశా   4. పైవన్నీ

జవాబులు

1.1	2.4	3.2	4.1	5.2
6.1	7.4	8.3	9.1	10.3
11.2	12.1	13.4	14.2	15.2
16.4	17.1	18.4	19.4	20.3
21.2	22.2	23.3	24.4	25.3
26.1	27.2	28.3	29.2	30.3
31.1	32.4	33.4	34.3	35.4
36.4	37.2	38.3	39.3	40.2
41.3	42.2	43.4	44.2	45.4

ఆంజనేయులు
ఫ్యాకల్టీ, ఏకేఆర్ స్టడీ సర్కిల్
వికారాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమే అని తీర్పునిచ్చిన కేసు?

ప్రవేశిక - విమర్శనాత్మక పరిశీలన

వివాదాలు - సుప్రీంకోర్టు తీర్పులు

రాజ్యాంగ సారాంశం మొత్తం ప్రవేశికలో నిక్షిప్తమై ఉంటుంది. ఇది రాజ్యాంగంలో అంతర్భాగమా, కాదా అనే అంశంపై సుప్రీంకోర్టు భిన్నమైన తీర్పులను వెలువరించింది.

1960లో బెరుబారి వర్సెస్ యూనియన్ కేసులో సుప్రీంకోర్టు ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని పేర్కొంది. ఈ సందర్భంలో ప్రకరణ 143 ప్రకారం సలహా పూర్వక అభిప్రాయాన్ని చెప్పింది. కానీ 1973లో కేశవానంద భారతి కేసులో తీర్పునిస్తూ దీనికి పూర్తి భిన్నంగా.. ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమేనని వ్యాఖ్యానించింది. 1995లో ఎల్ఐసీ ఆఫ్ ఇండియా కేసులో కూడా అత్యున్నత ధర్మాసనం ఇదే అభిప్రాయాన్ని పునరుద్ఘాటించింది.

రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశికపై ఓటింగ్ నిర్వహించినప్పుడు కూడా 'ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం' అని డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు స్థిరీకరించింది.

ప్రవేశిక ప్రయోజనం

ప్రవేశిక రాజ్యాంగ ఆత్మ, హృదయం. ఇది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను తెలుసుకోవడానికి ఆధారం. ఇది రాజ్యాంగానికి సూక్ష్మరూపం (Constitution in Miniature). ఇందులో రాజ్యాంగ తాత్విక పునాదులు ఉన్నాయి.

ప్రయోజనాలు

- ఇది రాజ్యాంగ ఆధారాలను తెలుపుతుంది.
- రాజ్యాంగ ఆమోద తేదీని తెలుపుతుంది.
- రాజ్యాంగాన్ని సక్రమంగా వ్యాఖ్యానించడానికి న్యాయస్థానాలకు చట్టపర సహాయకారిగా ఉపయోగపడుతుంది.

విమర్శ

- ప్రవేశికకు న్యాయ సంరక్షణ (Non-Justiciable) లేదు. ఇందులో పేర్కొన్న ఆశయాలను అమలు పరచకపోతే న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవు.
- ఇందులో పేర్కొన్న భావజాలానికి నిర్దిష్ట నిర్వచనాలు లేవు.
- హక్కుల ప్రస్తావన లేదు.
- శాసనాధికారాలకు ఇది ఆధారం కాదు.
- సమకాలీన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో ప్రవేశికలోని కొన్ని ఆదర్శాలు అమలుకు నోచుకోవట్లేదని చెప్పవచ్చు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రవేశిక - సుప్రీంకోర్టు తీర్పులు వివాదం	సంవత్సరం	సుప్రీంకోర్టు తీర్పు సారాంశం
ఎ.కె. గోపాలన్ కేసు	1950	ప్రవేశిక రాజ్యాంగ ప్రకరణల అర్థాన్ని, పరిధిని నియంత్రిస్తుంది.
బెరుబారి వర్సెస్ యూనియన్ కేసు	1960	ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదు.
గోలక్‌నాథ్ కేసు	1967	ప్రవేశిక రాజ్యాంగ ఆదర్శాలకు, ఆశయాలకు సూక్ష్మ రూపం.
కేశవానంద భారతి కేసు	1973	ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగమే. మౌలిక నిర్మాణం పరిధిలోకి వస్తుంది. పరిమితంగా సవరించవచ్చు.
ఎక్సెల్ వేర్ కేసు	1979	సామ్యవాదం పద నిర్వచనం.
నకారా కేసు	1983	సామ్యవాదం అనేది గాంధీయిజం, మార్క్సిజం కలయిక.
ఎస్.ఆర్.బొమ్మాయ్ కేసు	1994	లౌకికతత్వం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది.
ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా	1995	ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగమని పునరుద్ఘాటించింది.
అశోక్‌కుమార్ గుప్తా కేసు	1997	సామాజిక న్యాయం అనేది ప్రాథమిక హక్కు.
అరుణా రాయ్ కేసు	2002	విద్యా సంస్థల్లో మత విలువల బోధన లౌకికతత్వానికి వ్యతిరేకం కాదు.

ప్రవేశిక - పరిశీలన

భారత రాజ్యాంగానికి హృదయం, ఆత్మగా పరిగణిస్తున్న ప్రవేశిక ప్రాముఖ్యంపై భిన్న అభిప్రాయాలున్నాయి. ప్రవేశికకు న్యాయ సంరక్షణ లేదు. అంటే ఇందులో పొందుపర్చిన ఆశయాలు, లక్ష్యాలు స్వతంత్రంగా అమల్లోకి రావు. వాటిని అమలుపరచాలని పౌరులు న్యాయస్థానాన్ని ఆశ్రయించలేరు. ఆ విధంగా న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేయలేవు. కాబట్టి అత్యంత పవిత్రమైన ఈ ఆశయాలకు ఆచరణ లేదా అమలు చేయకపోవడం వల్ల వాటి సార్థకతపై తీవ్ర విమర్శ ఉంది. అయితే రాజ్యాంగంలోని ప్రకరణల భావం లేదా ఆచరణీయతపై సక్రమంగా వ్యాఖ్యానించడానికి ప్రవేశికలోని సారాంశాన్ని న్యాయస్థానాలు ప్రాతిపదికగా తీసుకుంటాయి. ప్రవేశికకు స్వతంత్రంగా ప్రాముఖ్యం లేకపోయినా, ఇందులోని ఆదర్శాలను అమలు చేస్తూ పార్లమెంటు చట్టం చేసినప్పుడు లేదా ఆ విధంగా చేసిన చట్టాలను అమలు చేయనప్పుడు, న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు.

ప్రవేశికపై ప్రముఖుల అభిప్రాయాలు

- ప్రవేశిక అనేది భారత ప్రజాస్వామ్య గణతంత్రానికి రాజకీయ జాతకం (Political Horoscope) **-కె.యం. మున్షీ**
- రాజ్యాంగంలో ప్రవేశిక అత్యంత పవిత్ర మైన భాగం. ఇది రాజ్యాంగ ఆత్మ. రాజ్యాంగానికి తాళంచెవి లాంటిది. **- పండిట్ ఠాకూర్‌దాస్ భార్గవ**
- రాజ్యాంగానికి ప్రవేశిక ఒక గుర్తింపు పత్రం లాంటిది. **- ఎం.ఎ. నాని పాల్కీవాలా**
- రాజ్యాంగానికి ప్రవేశిక కీలక సూచిక లాంటిది. అలాంటి సూచికలు సాధారణంగా పాశ్చాత్య రాజ్య వ్యవస్థలో ఉంటాయి. ఇది భారత రాజ్యాంగంలో ఉన్నందుకు నేను పులకించి గర్వపడుతున్నాను. **- సర్ ఎర్నస్ట్ బార్కర్**
- ప్రవేశిక మన కలలు, ఆలోచనలకు రాజ్యాంగంలో వ్యక్తీకరించుకున్న అభిమతం. **- అల్లాడి కృష్ణస్వామి అయ్యర్**
- భారత రాజ్యాంగ ప్రవేశిక అమెరికా స్వతంత్ర ప్రకటన మాదిరిగానే రాజ్యాంగ ఆత్మ. రాజకీయ వ్యవస్థ స్వరూపం, పవిత్ర నిర్ణయాన్ని తెలియజేస్తుంది. విప్లవం తప్ప మరొకటి దీన్ని మార్చలేదు. **- జస్టిస్ హిదయతుల్లా**
- ప్రవేశిక ఒక నిశ్చితమైన తీర్మానం, హామీ. **- నెహ్రూ**
- రాజ్యాంగ ప్రాధాన్యాల లక్షణ సారం ప్రవేశిక. **- మథోల్కర్**
- ప్రవేశిక అనేది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను, లక్ష్యాలను తెలుసుకోవడానికి ఒక తాళం చెవి లాంటిది. **- జె. డయ్యర్**
- ప్రవేశిక రాజ్యాంగానికి ఆధారం కాదు, అలాగే పరిమితి కాదు. **- సుప్రీంకోర్టు**

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రవేశిక భావాన్ని మన రాజ్యాంగకర్తలు ఏ దేశ రాజ్యాంగం నుంచి తీసుకున్నారు?
   ఎ) యు.ఎస్.ఎ. బి) యు.కె.
   సి) యు.ఎస్.ఎస్.ఆర్. డి) జర్మనీ
2. భారత రాజ్యాంగంలోని రిపబ్లిక్ అనే పదాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
   ఎ) ఫ్రెంచి రాజ్యాంగం
   బి) జర్మనీ రాజ్యాంగం
   సి) యు.ఎస్. రాజ్యాంగం
   డి) యు.కె. రాజ్యాంగం
3. రాజ్యాన్ని మతం నుంచి వేరు చేయడాన్ని ఏమంటారు?
   ఎ) నాస్తికవాదం బి) సామ్యవాదం
   సి) లౌకికవాదం డి) సాంఘికన్యాయం
4. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ అధికారాలను పరిమితం చేసేది?
   ఎ) ప్రజలు బి) రాజ్యాంగం
   సి) పార్లమెంటు డి) పత్రికలు

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) సి; 4) బి.

మాదిరి ప్రశ్నలు

1. ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగం అని, అదేవిధంగా కాదనీ పరస్పర వివాదాస్పదమైన తీర్పులను సుప్రీంకోర్టు ఏయే కేసుల్లో వ్యక్తీకరించింది?
   ఎ) ఎ.కె.గోపాలన్, గోలక్‌నాథ్
   బి) కేశవానంద భారతి, గోలక్‌నాథ్
   సి) మేనకాగాంధీ, మినర్వా మిల్స్
   డి) పైవేవీ కాదు
2. ప్రవేశిక నుంచి ఏం రాబట్టవచ్చు?
   ఎ) రాజ్యాంగానికి ఆధారం
   బి) రాజకీయ వ్యవస్థ లక్ష్యాలు
   సి) ప్రభుత్వ స్వరూపం డి) పైవన్నీ
3. సమగ్రత అనే పదజాలాన్ని ప్రవేశికలోకి చేర్చడానికి కారణం?
   ఎ) ప్రవేశిక రాజ్యాంగ అంతర్భాగం
   బి) వేర్పాటువాద ఉద్యమాలు
   సి) సుప్రీంకోర్టు తీర్పులు డి) ఎ, సి
4. ప్రవేశికలో సమకాలీన ప్రాముఖ్యతను, వివాదాన్ని సంతరించుకున్న పదాలు?
   ఎ) లౌకికతత్వం, సామ్యవాదం
   బి) ఐక్యత, సమగ్రత
   సి) గణతంత్రం, సార్వభౌమాధికారం
   డి) పైవన్నీ
5. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ ప్రవేశికలో చేర్చిన పదాలేవి?
   ఎ) సామ్యవాద, లౌకిక
   బి) ప్రజాస్వామిక
   సి) సార్వభౌమ డి) రిపబ్లిక్
6. భారత రాజ్యాంగంలో సంక్షేమ రాజ్యం అనే భావనను ఎక్కడ పొందుపరిచారు?
   ఎ) ప్రాథమిక హక్కులు
   బి) పీఠిక
   సి) రాజ్య విధానం – ఆదేశిక సూత్రాలు
   డి) నాలుగో షెడ్యూల్
7. కింది వాటిలో భారత రాజ్యాంగంలోని సమాఖ్య లక్షణాలు?
   i) దృఢ రాజ్యాంగం
   ii) ద్విసభా విధానం
   iii) సి.ఎ.జి. కార్యాలయం
   iv) సమష్టి బాధ్యత
   ఎ) i, ii, iii బి) i, iv
   సి) i, ii, iii, iv డి) i, ii
8. 'రాజ్యాంగానికి ప్రవేశిక ఒక గుర్తింపు పత్రం లాంటిది' అని పేర్కొన్నవారు?
   ఎ) జస్టిస్ హిదయతుల్లా
   బి) అంబేద్కర్
   సి) మహాత్మాగాంధీ
   డి) ఎం.ఎ. నాని పాల్కీవాలా
9. ప్రవేశిక-గ్రహించిన అంశాలకు సంబంధించి కిందివాటిలో సరికాని జత?
   ఎ) ప్రజాస్వామ్యం – అమెరికా
   బి) గణతంత్రం – ఫ్రాన్స్
   సి) సామ్యవాదం – రష్యా
   డి) లౌకిక – బ్రిటన్
10. సుప్రీంకోర్టు ఏ కేసులో ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని తీర్పునిచ్చింది?
    ఎ) కేశవానంద భారతి కేసు
    బి) బెరుబారి వర్సెస్ యూనియన్ కేసు
    సి) ఎస్.ఆర్. బొమ్మాయ్ కేసు
    డి) మినర్వా మిల్స్ కేసు

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) ఎ; 5) ఎ;
6) సి; 7) డి; 8) డి; 9) డి; 10) బి.

వెయ్యి స్తంభాల గుడిని నిర్మించింది ఎవరు?

తొలి కాకతీయులు

తొలి కాకతీయులు (కాకతీయ వంశంలోని ఆదిపురుషులు) రాష్ట్రకూటుల సేనానులుగా తెలంగాణకు వచ్చారని పీవీ పరబ్రహ్మశాస్త్రి నిరూపించారు. వీరు తమ పేరు చివరన రాష్ట్రకూట నామాన్ని (గుండియ రాష్ట్రకూట, ఎర్రయ రాష్ట్రకూట) ధరించేవారు. రాష్ట్రకూటుల రాజ చిహ్నమైన 'గరుడ'(గరుడబేతయ)ను తమ పతాకాలపై ఉంచుకునేవారు. రాష్ట్రకూటుల ఆస్థాన మతమైన జైనాన్ని అవలంభించడం, వారి వృష్టి వంశాన్నే తమ వంశంగా చెప్పుకోవడం లాంటి కారణాల వల్ల కాకతీయులు రాష్ట్రకూట వంశస్థులేనని స్పష్టమవుతోంది. స్థానిక (తెలంగాణ) బోయ, పుళింద జాతులవారు జైనమతం ద్వారా సాంఘికోన్నతి సాధించి రాష్ట్రకూటుల వద్ద సైనికోద్యోగులుగా చేరి క్రమంగా సామంతులయ్యారనే అభిప్రాయమూ ఉంది.

ఈ వంశానికి ఆద్యుడైన వెన్నరాజు (క్రీ.శ. 750 –768) రాష్ట్రకూట సేనాని, సామంతుడు. ఆదిలాబాద్ పశ్చిమప్రాంతం, బాసర, ముథోల్, కుబేరు (కుబీర్), భైంసా(మహిషా) ప్రాంతాలు ఇతని రాజ్యంలో ఉండేవి. ఇతడి తర్వాత మొదటి గుండరాజు (క్రీ.శ.768–824), రెండో గుండరాజు (క్రీ.శ.824– 870), మూడో గుండరాజు (క్రీ.శ.870 – 895) రాష్ట్రకూటుల సేనానులుగా, సామంతులుగా పనిచేశారు. వీరి కాలం తదితర విషయాల్లో చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి.

ఎర్రయరాజు (895-940)

ఈ వంశంలో మొదటి నలుగురి తర్వాత ఎర్రయరాజు (క్రీ.శ.895–940) కూడా రాష్ట్రకూటుల సేనానిగా కురవాడి సీమను పాలించాడు. వేంగి చాళుక్యులకు లోబడి ముదిగొండ చాళుక్యులు పాలించిన నేటి ఖమ్మం, వరంగల్ జిల్లాలోని కొరవి ప్రాంతమే కురవాడి సీమ. ముదిగొండ చాళుక్యులను తరిమేసి రాష్ట్రకూటులు ఎర్రయరాజును ఈ ప్రాంతానికి సామంతుడిగా నియమించారు. అయితే క్రీ.శ.934లో ముదిగొండ చాళుక్యులు ఆ ప్రాంతాన్ని తిరిగి ఆక్రమించారు. ఎర్రయ కొడుకు బేతియకు పెద్ద ప్రాధాన్యం లేదు. తర్వాత బేతియ కొడుకు నాలుగో గుండరాజు(క్రీ.శ.955–990) రాష్ట్రకూటుల సేనానిగా నియమితుడై కొరవిసీమను తిరిగి ఆక్రమించాడు. తూర్పు చాళుక్యులైన రెండో అమ్మరాజు, దానార్ణవుడి మధ్య కుటుంబ కలహాలు తలెత్తాయి. నాలుగో గుండరాజు దానార్ణవుడి పక్షం వహించి కొరవిసీమను పొందాడు.

క్రీ.శ.973లో కల్యాణీ చాళుక్య రెండో తైలపుడు రాష్ట్రకూట రాజ్యాన్ని ఆక్రమించాడు. దీంతో తైలపుణ్ని ఆశ్రయించిన ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజు.. విరియాల ఎర్రసేనాని ద్వారా తిరిగి కొరవిసీమను పొందగలిగాడు. దీంతో కాకతీయులు గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. కానీ తన భార్య విరియాల కామసాని వినతి మేరకు ఎర్రసేనాని కల్యాణీ చాళుక్య చక్రవర్తిని ఒప్పించి మొదటి బేతరాజు(క్రీ.శ.992–1052)ను అనుమకొండ విషయపాలకుడిగా నియమించాడు. కామసాని మొదటి బేతరాజు (గరుడ బేతరాజు) మేనత్త, గుండరాజు సోదరి.

మొదటి ప్రోలరాజు

బేతరాజు కల్యాణీ చాళుక్య సామంతుడిగా స్థిరపడ్డాడు. ఇతడి రాజ్యం కొరివిసీమ సరిహద్దు నుంచి కరీంనగర్ మండలంలో ఉన్న శనిగరం వరకు వ్యాపించింది. బేతరాజు తర్వాత అతడి కొడుకు మొదటి ప్రోలరాజు (క్రీ.శ.1052–1076) రాజ్యానికొచ్చాడు. ఇతడు వేములవాడ చాళుక్యరాజు భద్రగుణ్ణి (మూడో బద్దెగుడు) ఓడించి సబ్బిసాయర మండలం(కరీంనగర్ ప్రాంతం)లోని కొన్ని ప్రాంతాలను జయించాడు. అనుమకొండ విషయాన్ని మొదటి బేతరాజు తొలుత పొందినప్పటికీ శాశ్వతమాన్యంగా పొందింది మాత్రం ప్రోలరాజే.

ప్రోలుడు చిత్రకూటలో అరాచకత్వాన్ని అణచివేయడం, బద్దెగుణ్ని జయించడం, కొంకణంపై విజయం సాధించడం వల్ల అతడి శౌర్యప్రతాపాలకు గుర్తింపుగా చక్రవర్తి అనుమకొండను శాశ్వతమాన్యంగా ఇచ్చాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

రెండో బేతరాజు

ఒకటో సోమేశ్వరుడు క్రీ.శ.1068లో మరణించాడు. తర్వాత చక్రవర్తిగా వచ్చిన రెండో సోమేశ్వరుణ్ని తొలగించి అధికారంలోకి రావాలని ఆరో విక్రమాదిత్యుడు వీలైనంత మంది మాండలికులను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేశాడు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రోలుడు, అతడి కుమారుడు రెండో బేతరాజు.. ఆరో విక్రమాదిత్యుడికి అండగా నిలిచారు. అది ప్రోలుడి తర్వాత రాజైన రెండో బేతరాజు (క్రీ.శ.1076–1108)కు ఉపయోగపడింది. పారమార జగద్దేవుడు స్వాతంత్ర్యం ప్రకటించుకోవడమూ దీనికి దోహదం చేసింది. జగద్దేవుడి నుంచి సబ్బి సహస్రం మొత్తాన్ని విక్రమాదిత్యుడు బేతరాజుకు ఇచ్చినట్లు పద్మాక్షి ఆలయ శాసనం ద్వారా తెలుస్తోంది. శనిగరం ప్రాంతంతోపాటు సబ్బి సహస్రం కాకతీయ రాజ్యంలో చేరాయి. ముదిగొండ చాళుక్యుల రాజ్యంలోని కొన్ని భాగాలు కూడా ఇతడి రాజ్యంలో చేరాయి. ఇతడు అనుమకొండలో బేతేశ్వరాలయాన్ని, తన తండ్రి పేరుతో ప్రోలేశ్వరాలయాన్ని నిర్మించాడు.

రెండో ప్రోలరాజు

బేతరాజు తర్వాత ఇతడి పెద్ద కొడుకు దుర్గరాజు (క్రీ.శ.1108–క్రీ.శ.1116) రాజయ్యాడు. పదవీచ్యుతుడైన కొలనుపాక రాజు జగద్దేవుని ప్రోత్సాహంతో పొలవాస పాలకుడు మేడరాజు స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో పారమార జగద్దేవుని స్థానంలో కుమార సోమేశ్వరుడు(క్రీ.శ.1108–1125) కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడయ్యాడు. ఈ తిరుగుబాట్లను అణచడానికి కుమార సోమేశ్వరుడికి అండగా నిలిచిన రెండో ప్రోలరాజు(క్రీ.శ.1116–1157) జగద్దేవుడిని పారదోలి సోదరుడు దుర్గరాజును పదవీచ్యుతుణ్ని చేసి సింహాసనం అధిష్టించాడు. చాళుక్య చక్రవర్తుల నుంచి స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించిన సామంతులందరితో యుద్ధం చేసి ఓడించాడు. ఈ రకంగా తెలంగాణ మొత్తాన్ని జయించి కల్యాణీ చాళుక్య ప్రతాపచక్రవర్తి రెండో జగద్దేకమల్లుడు (క్రీ.శ.1138 –1150)కి విధేయుడిగా ఉన్నాడు.

రెండో ప్రోలరాజు విజయాలు

కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడైన కుమార సోమేశ్వరుడు తన తండ్రి విక్రమాదిత్యుడి అనంతరం క్రీ.శ.1126లో మూడో సోమేశ్వరుడిగా రాజ్యానికొచ్చాడు. అంతకుముందు నుంచే కందూరునాడును పాలిస్తున్న యువరాజు కుమార తైలపుడు (క్రీ.శ.1110–1137) తన సోదరుడు మూడో సోమేశ్వరుడికి వ్యతిరేకంగా దక్షిణ తెలంగాణలో స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఈ ప్రయత్నంలోనే మూడో సోమేశ్వరుడికి అనుకూలుడైన కందూరి చోడ మొదటి గోకర్ణుడిని చంపించి కందూరునాడును శ్రీదేవి తొండయ, గోవింద దండేశులకు పంచి సామంతులుగా చేసుకున్నాడు. దీంతో మొదటి గోకర్ణుడి కుమారుడు రెండో ఉదయచోడుడు మూడో సోమేశ్వరుణ్ని ఆశ్రయించాడు. సోమేశ్వరుడి ఆదేశంతో రెండో ప్రోలుడు శ్రీదేవి తొండయ, గోవింద దండేశులను ఓడించి ఉదయ చోడుడికి(క్రీ.శ.1131–36) పట్టం కట్టాడు. ఈ రకంగా దక్షిణ తెలంగాణ మీద ప్రోలుడు ఆధిక్యం సాధించాడు.

తన అనుయాయుల ఓటమిని జీర్ణించుకోలేని తైలపుడు కాకతీయుల ఉత్తర సరిహద్దులో ఉన్న పొలవాస రాజైన మేడరాజును, అతడి తమ్ముడు గుండరాజును ప్రేరేపించాడు. అప్పటికే వీరు చాళుక్య చక్రవర్తుల పట్ల అవిధేయులుగా ఉన్నారు. రెండో జగద్దేకమల్లుడి(క్రీ.శ.1138–1150) పక్షాన నిలబడి ప్రోలరాజు గుండనను సంహరించాడు. గుండన కుటుంబానికి చెందిన ఏడో రాజును పారదోలాడు. ఈ విజయంతో ప్రోలరాజు ఉత్తర తెలంగాణ మీద ఆధిక్యత సాధించాడు. చక్రవర్తి పక్షాన కుమార తైలపుడిని ఓడించాడు. ఈ విజయోత్సాహంతో కృష్ణానది దాటి శ్రీశైలంలో విజయస్తంభం నాటించాడు. తెలంగాణపై ఆధిక్యం సాధించాక తీరాంధ్రను జయించే ప్రయత్నంలో మరణించాడు. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని ఇతడే ప్రారంభించాడు. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ప్రోలరాజు భార్య. వీరి కుమారులు.. రుద్రదేవుడు, మహాదేవుడు, హరిహరుడు, గణపతి, రేపొల్ల దుర్గరాజు. తండ్రి మరణానంతరం పెద్దకుమారుడైన రుద్రదేవుడు(క్రీ.శ.1158–క్రీ.శ.1195) రాజ్యానికొచ్చాడు.

మూడు సామంత రాజ్యాలు

కాకతీయ రాజ్య పరిసరాల్లో మూడు సామంత రాజ్యాలు ఉండేవి. తూర్పున ముదిగొండ చాళుక్యులు, వాయవ్యంగా కరీంనగర్ జిల్లాలో పొలవాస నాయకులు, దక్షిణాన కందూరు చోడులు ఉండేవారు. అనుమకొండ విషయానికి పశ్చిమాన ఉన్న ప్రాంతం రాజు ప్రత్యక్ష ఆధీనంలో ఉండేది. అనుమకొండకు నైరుతి దిశగా కొలనుపాక కేంద్రంగా రాజప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పాలించేవారు. ప్రోలరాజు వీరిపై ఆధిక్యత సాధించిన సందర్భంలో రుద్రదేవుడు సింహాసనం అధిష్టించాడు.

రుద్రదేవుడు

తైలపుడు తన సోదరుడు జగదేక మల్లుని పదవీచిత్యుణ్ని చేసి అధికారంలోకి వచ్చాడు. కాబట్టి పరబ్రహ్మ శాస్త్రి పేర్కొన్న తైలపుడు ఈ మూడో తైలపుడు కావడానికే ఎక్కువ అవకాశం ఉంది. పదవీభ్రష్టులైన కల్యాణి చాళుక్య రాజులు తమ పూర్వవైభవాన్ని తిరిగి సంతరించుకోలేరని నిర్ణయించుకున్న రుద్రదేవుడు క్రీ.శ.1162/3లో సార్వభౌమత్వాన్ని ప్రకటించుకున్నాడు. తెలంగాణలో తిరుగులేని ప్రభువుగా మారిన తర్వాత తీరాంధ్రపై దృష్టి పెట్టాడు.

వేయి స్తంభాల గుడి

రుద్రదేవుడు(క్రీ.శ.1158–క్రీ.శ.1195) తన తండ్రిని చంపిన వెలనాటి రాజుపై మొదట విజృంభించాడు. పల్నాటి యుద్ధంలో నలగామరాజుకు సహాయపడ్డాడు. ధాన్యకటకాన్ని స్వాధీనం చేసుకున్నాడు. దుర్జయులను ఓడించి త్రిపురాంతకాన్ని జయించాడు. క్రీ.శ.1186 నాటికి తీరాంధ్రను గెలిచాడు. ఈ రకంగా రుద్రదేవుడు కాకతీయ సామ్రాజ్యానికి గట్టి పునాదులు వేశాడు. ఈ విజయాల్లో సహాయం చేసిన రేచర్ల బేతిరెడ్డికి నల్లగొండ జిల్లాలోని ఆమనగల్లును, చెరకు రెడ్లకు జమ్ములూరును ఇచ్చాడు. ఇతడి రాజ్యం ఉత్తరాన గోదావరి, పశ్చిమాన బీదరు, దక్షిణాన శ్రీశైలం, తూర్పున సముద్రం వరకు విస్తరించిందని వేయి స్తంభాల గుడి శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రదేవుడు ఓరుగల్లు కోట నిర్మాణాన్ని కొంతమేర పూర్తిచేశాడు. రుద్రేశ్వర దేవాలయాన్ని కట్టించాడు. ఇదే వేయి స్తంభాల గుడి.

మహాదేవుడు

రుద్రదేవుడికి కుమారులు లేకపోవడం వల్ల తమ్ముడు మహాదేవుడు(క్రీ.శ.1195–1198) రాజ్యానికి వచ్చాడు. ఇతడు జైతుగి (క్రీ.శ.1192–1200) కాలంలో యాదవరాజ్యం మీద చేసిన యుద్ధంలో మరణించాడు. మహాదేవుని భార్య రాణి బయ్యాంబ. గణపతిదేవుడు, మైలాంబ, కుందమాంబ వీరి సంతానం. యాదవరాజులు గణపతిని బంధించారు. ఇదే అదనుగా ముదిగొండ చాళుక్యులు, వెలనాటి చోళులు, చోళరాజులు కాకతీయ సామ్రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించారు. కానీ సామంతసేనానైన రేచర్ల రుద్రారెడ్డి(రుద్రసేనాని) మిగతా సేనానులు, సామంతులైన విరియాల, మాల్యాల సహాయంతో వీరిని ఓడించినట్లు పాలంపేట శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రసేనాని గణపతిదేవుడిని విడిపించి క్రీ.శ.1199లో కాకతీయ రాజ్య పట్టాభిషిక్తుడిని చేశాడు.

మాదిరి ప్రశ్నలు

1. కాకతీయ వంశానికి ఆద్యుడు?
   1) గణపతిదేవుడు 2) మొదటి గుండన
   3) వెన్నరాజు 4) మొదటి బేతరాజు
2. ఓరుగల్లు కోట నిర్మాణానికి పునాదులు వేసినవాడు?
   1) మొదటి ప్రోలరాజు
   2) రెండో ప్రోలరాజు
   3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
3. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ఎవరి భార్య?
   1) మొదటి ప్రోలరాజు
   2) గణపతిదేవుడు 3) మొదటి బేతరాజు
   4) రెండో ప్రోలరాజు
4. తొలి కాకతీయులు ఎవరికి సామంతులుగా ఉన్నారు?
   1) శాతవాహనులు 2) రాష్ట్రకూటులు
   3) బాదామి చాళుక్యులు 4) ఇక్ష్వాకులు
5. మలి కాకతీయులు ఎవరి సామంతులు?
   1) రాష్ట్రకూటులు
   2) కల్యాణి చాళుక్యులు
   3) బాదామి చాళుక్యులు
   4) కందూరి చాళుక్యులు
6. రుద్రదేవుడు ఏ కాలంనాటికి తీరాంధ్రను జయించాడు?
   1) క్రీ.శ. 1186 2) క్రీ.శ. 1180
   3) క్రీ.శ. 1176 4) క్రీ.శ. 1190
7. పల్నాటి యుద్ధంలో నలగామ రాజుకు సహాయపడ్డ కాకతీయ రాజు?
   1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు 4) రెండోబేతరాజు
8. రుద్రదేవుడు యుద్ధాల్లో తనకు సహాయం చేసిన ఏ రాజును ఆమనగల్లు సామంతునిగా నియమించాడు?
   1) రేచర్ల నామిరెడ్డి 2) రేచర్ల చెవిరెడ్డి
   3) రేచర్ల లోకిరెడ్డి 4) రేచర్ల బేతిరెడ్డి
9. వేయి స్తంభాల గుడి (రుద్రేశ్వరాలయం) ని కట్టించినవారు?
   1) రుద్రదేవుడు 2) గణపతిదేవుడు
   3) రుద్రమదేవి 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు

1) 3 2) 2 3) 4 4) 2 5) 2
6) 1 7) 3 8) 4 9) 1

కణజాలం అనే పదాన్ని మొదట వాడింది ఎవరు?

టెట్, డీఎస్సీ - ప్రత్యేకం

బయాలజీ

కణజాలాలు

జీవుల్లో నిర్మాణాత్మక, క్రియాత్మక ఆధార ప్రమాణం కణం. అనేక కణాల సముదాయాన్ని కణజాలం అంటారు. కణజాలాలు కలిసి వివిధ అవయవాలను, అవయవాలు కలిసి అవయవ వ్యవస్థలను ఏర్పరుస్తాయి. వివిధ వ్యవస్థల సముదాయమే జీవి. మొక్క లేదా జంతువు రూపొందేందుకు మొదట రెండు కణాల సంయోగం జరిగి సంయుక్త బీజకణం (జైగోట్) ఏర్పడుతుంది. అది అనేక మార్పులకు (విభజనలు) గురై మొక్క లేదా జంతువుగా మారుతుంది. ఈ క్రమంలో వివిధ రకాల కణాలు కలిసి వివిధ రకాలైన కణజాలాలను ఏర్పరుస్తాయి. కణజాలాలు మొక్కల్లో, జంతువుల్లో నిర్మాణాలు, వాటి పనితీరును బట్టి వివిధ రకాలుగా ఉన్నాయి. కణజాలాల అధ్యయనాన్ని హిస్టాలజీ అంటారు. కణజాలం (టిష్యూ) అనే పదాన్ని మొదటవాడింది బిచాట్.

మొక్కల్లో కణజాలం

మొక్కల్లో సాధారణంగా మూడు రకాల కణజాలాలు ఉంటాయి. అవి..

1. సరళ కణజాలం
2. సంక్లిష్ట కణజాలం
3. ప్రత్యేక కణజాలం

1. **సరళ కణజాలం:** నిర్మాణం, విధుల్లో ఒకే విధంగా ఉండే కణాల సముదాయాన్ని సరళ కణజాలం అంటారు. ఇది మొక్కల్లో ఎక్కువ శాతం ఉండే కణజాలం. దీనిలో

ఎ. మృదు కణజాలం
బి. స్థూలకోణ కణజాలం
సి) దృఢ కణజాలం అనే రకాలుంటాయి.

మృదు కణజాలం: మొక్కల్లోని లేత, మెత్తని భాగాల్లో, పత్రాలు, పుష్పాలు, ఫలాలు, విత్తనాల్లో ఎక్కువగా ఉంటుంది. మృదు కణజాలం గాయాలను మాన్పడానికి, అంట్లు కట్టినప్పుడు, పునరుద్భవం మొదలైన అంశాల్లో దోహదపడుతుంది. కణజాల వర్ధనంలో అసంఖ్యాకంగా మొక్కలు ఏర్పడటానికి ఇది తోడ్పడుతుంది.

స్థూల కోణ కణజాలం (కోలెన్‌కైమా): ఇది ఎక్కువగా లేత కాండాలు, పత్ర వృంతాలు, పుష్ప వృంతాలు, పత్రాల అంచులు, ఈనెలు మొదలైన భాగాల్లో ఉంటుంది. ఏక దళ బీజ మొక్కల కాండం , పత్రాల్లో ఉండదు. ఈ కణాలు వివిధ ఆకృతులతో ఉంటాయి. వీటి కణ కవచం ప్రత్యేకత ఏమిటంటే సెల్యూలోజ్, పెక్టిన్‌తో నిర్మితమై ఉంటుంది. కణ కవచంలో 60 శాతం నీరు ఉంటుంది. స్థూల కోణ కణజాలం మొక్కల భాగాలకు సమ్యత (Flexibility), స్థితిస్థాపకతను కలగజేయడం వల్ల వృంత భాగాలు సులువుగా వంగుతాయి. పత్ర, పుష్ప వృంతాలు వంటి సున్నిత భాగాలు ప్రతిబలాన్ని (Stress), ప్రయాస (Strain) ను ఎదుర్కొంటాయి. పత్రాల పై భాగాన ముదురు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం స్థూల కోణ కణజాలమే.

దృఢ కణజాలం: ఇది నిర్జీవ సరళ యాంత్రిక కణజాలం. ఇది మొక్కల భాగాలకు యాంత్రిక బలాన్ని, గట్టిదనాన్ని కలుగజేస్తుంది. ఇది ఎక్కువగా ఎడారి మొక్కల్లో అభివృద్ధి చెంది ఉంటుంది. వీటి కణ కవచాలు లిగ్నిన్‌తో నిర్మితమై ఉంటాయి. నారలు,శిలా కణాలు ఈ కణజాలానికి చెందినవే. అతి పొడవైన నారలు.. రామి నారలు (బొహెమిరియా నీవియా). నారల్లో సెల్యూలోజ్ ఉన్న వాటిని ఫ్లాక్స్ నారలు అంటారు. ఇవి వాణిజ్య పరంగా విలువైనవి. ఫ్లాక్స్ నారలు, హెంప్, రామినారల్లో లిగ్నిక్ ఉండదు.

కండ ఉన్న ఫలాలు, విత్తనాలు మొదలైన వాటిలో శిలా కణాలు ఎక్కువగా ఉంటాయి. **ఉదా:** కొబ్బరి, యాపిల్, పియర్.

2. **సంక్లిష్ట కణజాలం:** భిన్న రకాలైన కణాలు కలిసి ఒకే పనిని నిర్వర్తించేందుకు ఏర్పడే కణజాలం ఇది. ముఖ్యంగా మొక్కల్లో నీటిని, ఖనిజ మూలకాలను, ఆహార పదార్థాలను రవాణా చేసేందుకు ఉపయోగపడుతుంది. సంక్లిష్ట కణజాలంలో 1) దారువు (Xylem) 2) పోషక కణజాలం (Phloem) అనే రెండు రకాలుంటాయి. దారువును హైడ్రోమ్ అని కూడా అంటారు. ఇది నీటిని, ఖనిజ మూలకాలను మొక్కకు రవాణా చేస్తుంది. దీనిలో దారు కణాలు, దారు నారలు, దారు నాళాలు, దారు మృదు కణాలు మొదలైనవి ఉంటాయి. దారువులో ఉండే కణాలు లిగ్నిన్ కణ కవచాలను కలిగి, కేంద్రకం లేకుండా నిర్జీవంగా ఉంటాయి. ఇవి మొక్కకు భౌతిక ఆధారాన్ని, దృఢత్వాన్ని ఇస్తాయి. పరిణతి చెందిన వృక్షాల్లో దారు నాళాల్లోకి బెలూన్ల వంటి నిర్మాణాలు ఏర్పడతాయి. వీటిని పైలోసిస్‌లు అంటారు. ఇవి కాండందృఢత్వాన్ని పెంచుతాయి. కలప ఎక్కువ మన్నిక ఉంది అనడానికి కారణం టైలోసిస్‌లు ఏర్పడటమే.

పోషక కణజాలాన్ని లెప్టోమ్ అని కూడా అంటారు. ఇది ఆహార పదార్థాలను మొక్క అన్ని భాగాలకు సరఫరా చేస్తుంది. దీనిలో చాలనీ కణాలు, చాలనీ నాళాలు, సహకణాలు, నారలు, మృదు కణాలు మొదలైనవి ఉంటాయి. మొక్కల్లో కేంద్రక రహిత సజీవ కణాలు చాలనీ నాళాలు (ఆర్‌బీసీ మాదిరిగా). కణాల మధ్య కణ ద్రవ్య పోగులు (ప్లాస్మా డెస్మెటా) కన్వేయర్ బెల్టుల మాదిరిగా పనిచేస్తాయి.

3. **ప్రత్యేక కణజాలం:** విభిన్న కణాలు విభిన్న ప్రక్రియలను జరిపే కణజాలాన్ని ప్రత్యేక కణజాలం అంటారు. ఇది ముఖ్యంగా స్రావక క్రియలో తోడ్పడుతుంది. కీటకాహార మొక్కల్లో జీర్ణరసాలను స్రవించేందుకు జీర్ణగ్రంథులుంటాయి. ఇవి కీటకాలను జీర్ణం చేసేందుకు ప్రోటిమోలైటిక్ ఎంజైమ్‌లను ఉత్పత్తి చేస్తాయి. తేనెటీగలు గ్రహించే మకరందం పుష్పాల్లో ఉండే మకరంద గ్రంథుల నుంచి వస్తుంది.

కొన్ని మొక్కలు సుగంధ పరిమళాన్ని వెదజల్లుతాయి. దీనికి కారణం ఆస్మోఫోర్‌లు. పైనస్ వంటి మొక్కల్లో రెసిన్లను ఉత్పత్తి చేసేది స్రావక కుహరాలు. శీతాకాలంలో కొన్ని మొక్కలు **ఉదా:** గడ్డి, టమాటా వంటి మొక్కల పత్రాల చివరి భాగం నుంచి నీరు బిందువుల రూపంలో వెలువడుతుంది. దీన్నే బిందుస్రావం (Guttation) అంటారు. ఇది జరిగేందుకు హైడథోడ్స్ (జలగ్రంథులు) తోడ్పడతాయి. కొన్ని మొక్కల్లో వాటిని గిల్లినప్పుడు తెల్లని పాల వంటి పదార్థం వెలువడుతుంది. దీన్నే లేటెక్స్ అంటారు. దీన్ని ఉత్పత్తి చేసే కణజాలం లాటిసి ఫెరస్ కణజాలం. లేటెక్స్ నుంచి రబ్బర్‌ను తయారు చేస్తారు. హీవియా బ్రెజిలియన్సిస్ నుంచి పారా రబ్బర్, ఫైకస్ ఎలాస్టికా నుంచి ఇండియన్ రబ్బర్‌ను తయారు చేస్తారు.

కణజాల వ్యవస్థలు: మొక్క భాగాలను వేరు, కాండం, పత్రం వంటి వాటిని ఛేదించినప్పుడు వాటిలో వివిధ రకాల కణజాలాలు వివిధ రీతుల్లో కనిపిస్తాయి. సాధారణంగా వెలుపలి వరుసలో బాహ్య చర్మం, మధ్యలో వల్కలం, లోపలి తలంలో ప్రసరణ స్తంభం అనే భాగాలుంటాయి.

వేరు బాహ్య చర్మంలోని కేశాలు నీటిని శోషించేందుకు, కాండంలోని బాహ్య చర్మ కేశాలు రక్షణకు తోడ్పడతాయి. పత్రం బాహ్య చర్మంలో పత్ర రంధ్రాలుంటాయి. పత్ర రంధ్రాలుండే భాగంలో రక్షక కణాలుంటాయి. పత్ర రంధ్రాల ద్వారా నీరు ఆవిరి అవడాన్ని భాష్పోత్సేకం అంటారు. వేరు, కాండం వంటి భాగాల్లో వల్కలం అధికంగా ఉంటుంది.

ఇది ముఖ్యంగా పదార్థాల రవాణా నిల్వలో తోడ్పడుతుంది. ప్రసరణ స్తంభంలో దారువు, పోషక కణజాలం ఉంటాయి. సాధారణంగా వేరులో బాహ్య ప్రథమ దారుకం (Exarch), కాండంలో అంతర ప్రథమ దారుకం (Endwich) స్థితులు ఉంటాయి.

వృక్షాల కాండాలు బాగా వృద్ధి (లావెక్కడం) చెందడాన్ని ద్వితీయ వృద్ధి అంటారు. దీనిలో వార్షిక వలయాలు ఏర్పడతాయి. వీటి సంఖ్యను బట్టి వృక్షాల వయసును లెక్కిస్తారు. కాండం మధ్యలో ముదురు రంగులో ఉన్న భాగాన్ని డ్యూరామెన్ అని, లేత రంగులో ఉన్న భాగాన్ని అల్బర్నం అంటారు. వెలుపలి భాగాన పొలుసుల మాదిరిగా ఏర్పడిన దాన్ని బెరడు అంటారు. బాగా వృద్ధి చెందిన వృక్షాల పై భాగాన సూక్ష్మ రంధ్రాలు ఏర్పడతాయి. వీటినే వాయురంధ్రాలు అంటారు.

జంతువుల్లో

జంతువుల్లో కణజాలాలు పని చేసే విధానాన్ని బట్టి నాలుగు రకాలు.

1. **ఉపకళా కణజాలం**
2. **సంయోజక కణజాలం**
3. **కండర కణజాలం**
4. **నాడీ కణజాలం**

1. **ఉపకళా కణజాలం (ఎపిథీలియల్):** ఇది ముఖ్యంగా శరీర బాహ్య తలంలోనూ, శరీరంలోని వివిధ అంగాల బాహ్య, అంతర తలాల్లోనూ పొర మాదిరిగా ఉంటుంది. **ఉదా:** చర్మం.

వెంట్రుకలు, గోళ్లు, కొమ్ములు మొదలైనవి ఉపకళా కణజాలాలతో నిర్మితమైనవే. ఇవి బాహ్య ప్రేరణను కూడా కలుగజేస్తాయి. ఉప కళాకణజాలంలో కణాలు ఘనాకారంలో, స్తంభాకారంలో, మరికొన్ని శైలికలను కలిగి ఉంటాయి. **ఉదా:** జీర్ణాశయంలో శైలికల వంటి నిర్మాణాలు ఆహార పదార్థాలను కదిలించేందుకు తోడ్పడతాయి. వివిధ రకాలైన హార్మోన్‌లను, రసాయన పదార్థాలను స్రవించడంలో కూడా ఉపయోగపడతాయి.

2. **సంయోజక కణజాలం:** ఇది వివిధ కణజాలాలను, అంగాలను కలిపి ఉంచుతుంది. శరీర రక్షణ, శరీర భాగాలను బాగు చేయడంలో ఉపయోగపడుతుంది. కొవ్వులను నిల్వ చేయడం మొదలైన పనులను నిర్వర్తిస్తుంది. వివిధ కణజాలాలను కలిపే కణజాలం ఏరిమోలార్ కణజాలం. దెబ్బతిన్న భాగాలను బాగు చేసేది ఏరిమోలార్ కణజాలమే.

మృదులాస్థి అనేది మరొక సంయోజక కణజాలం. ఇది ఎముకల చివర చెవిదొప్ప, వాయునాళం, ముక్కు మొదలైన భాగాల్లో ఉంటుంది. పిండ దశలో ఎక్కువగా ఉండేవి మృదులాస్థులే. వీటిలోని కణాలను ఆస్టియోసైట్స్ అంటారు. ఎముక నిర్మాణానికి కాల్షియం ఫాస్ఫేట్, కాల్షియం కార్బొనేట్‌లు అవసరం. వీటిని అస్థిమజ్జలో ఉండే ఆస్టియోసైట్స్ స్రవిస్తాయి.

లిగమెంట్ అనేది ఎముకను మరొక ఎముకతో కలిపి ఉంచే ఒక సంయోజక కణజాలం. ఇది కొల్లాజెన్ అనే ప్రోటీన్‌తో తయారై ఉంటుంది. టిండాన్ (స్నాయుబంధనం) అనేది ఎముకను, కండరాన్ని కలిపి ఉంచే మరొక సంయోజక కణజాలం. ఎడిపోస్ కణజాలం అనేది కొవ్వును నిల్వ చేస్తుంది. ఇది ఉపవాసం సమయంలో శరీరానికి శక్తిని సమకూరుస్తుంది. అదే మాదిరిగా శరీరంలోని వేడిని బయటకు పోకుండా చేస్తుంది.

రక్తం కూడా ఒక సంయోజక కణజాలం. దీనిలో ప్లాస్మా అనే ద్రవ పదార్థ రక్త కణాలు ఉంటాయి. ప్లాస్మాలో అనేక రకాల ఆహార పదార్థాలు, లాక్టిక్ ఆమ్లం, యూరియా వంటి విసర్జక పదార్థాలు, హెపారిన్, ప్రోథ్రాంబిన్ వంటి ప్రోటీన్స్ మొదలైనవి ఉంటాయి. రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, థ్రాంబోసైట్స్ అనే మూడు రకాల కణాలుంటాయి. ఎర్ర రక్తకణాల్లో కేంద్రకం ఉండదు కానీ చేపలు, ఉభయ చరాలు, సరీసృపాలు, గుర్రం వంటి వాటిలో కేంద్రాన్ని కలిగిన ఎర్ర రక్త కణాలుంటాయి. ఇవి O_2, CO_2 రవాణాలో తోడ్పడతాయి.తెల్ల రక్తకణాలు కేంద్రకాన్ని కలిగి వివిధ రీతుల్లో ఉంటాయి. ఇవి శరీరంలో వ్యాధి నిరోధకతను పెంచుతాయి. రక్త ఫలకికలు (థ్రాంబోసైట్లు) కేంద్ర రహితం. ఇవి రక్తాన్ని గడ్డ కట్టించేందుకు తోడ్పడతాయి.

3. **కండర కణజాలం:** శరీరంలోని దాదాపు ఎక్కువ భాగాలు కండర కణజాలంతో నిర్మితమై ఉంటాయి. పూర్తిగా కండర కణజాలంతో నిర్మితమైంది గుండె, నాలుక మొదలైన కండరాలు వివిధ భాగాల చలనానికి తోడ్పడతాయి. కండరాలు ముఖ్యంగా మూడు రకాలు.

1. రేఖీత కండరాలు
2. అరేఖిత కండరాలు
3. హృదయ కండరాలు.

మాదిరి ప్రశ్నలు

1. **శరీరంలో వివిధ అవయవ వ్యవస్థలు ఏర్పడేందుకు అవసరమైనవి?**
   1) కణాలు 2) కణజాలం
   3) కేంద్రకం 4) కణాంగాలు
2. **నిరంతరం కణ విభజన జరపని కణజాలం?**
   1) హృదయ కండరం 2) అస్థి కణజాలం
   3) 1, 2 4) కండర కణజాలం
3. **అతి పొడవైన కణాలను కలిగిన కణజాలం?**
   1) కండర కణజాలం
   2) ఎడిపోజ్ కణజాలం
   3) నాడీ కణజాలం
   4) సంయోజక కణజాలం
4. **పేగు గోడలపై ఉండే కణజాలం?**
   1) సంయోజక కణజాలం
   2) ఉప కళా కణజాలం
   3) కండర కణజాలం 4) నాడీ కణజాలం
5. **అసంకల్పిత చర్యలను జరిపే కండరాలు?**
   1) హృదయ కండరాలు
   2) రేఖిత కండరాలు
   3) అరేఖిత కండరాలు 4) 1, 3
6. **మొక్కల్లో నీటిని, ఖనిజ మూలకాలను రవాణా చేసే కణజాలం?**
   1) సరళ కణజాలం 2) సంక్లిష్ట కణజాలం
   3) ప్రత్యేక కణజాలం 4) 1, 3
7. **వృక్షాల్లో వాటి వయసును కొలవడానికి ఉపయోగపడే వార్షిక వలయాల్లో ఉండే కణజాలం?**
   1) దారువు 2) పోషక కణజాలం
   3) దవ్వ 4) బాహ్య చర్మం

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 2;
5) 4; 6) 2; 7) 1.

How many such pairs of letters are there..

BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

Directions (Q.No.1-5): Read the following information carefully and answer the questions which follow:

» If 'A * Z' means 'A is the wife of Z'.
» If 'A × Z' means 'A is the husband of Z'.
» If 'A + Z' means 'A is the sister of Z'.
» If 'A - Z' means 'A is the brother of Z'.
» If 'A > Z' means 'A is the son of Z'.
» If 'A < Z' means 'A is the daughter of Z'.

1. Which of the following relations will not be true if the expression 'A < P × T + F > L × M' is definitely true?
   1) A is the daughter of T
   2) F is the son of M
   3) P is the son-in-law of L
   4) A is the cousin of F
   5) M is the grandmother of A
2. Which of the following means N is the daughter-in-law of A?
   1) M + N * P > A
   2) N < M + P + A
   3) M - N × P < A
   4) A < P + N × M
   5) A < N < P * M
3. How is P related to F if 'Q × P < B + F'?
   1) Daughter 2) Niece
   3) Daughter-in-law
   4) Grand daughter 5) Aunt
4. Which of the following means P is the father of R?
   1) R > S < P * J
   2) J + R - S < P
   3) R > S * P- J
   4) S + J × R < P
   5) None of these
5. How is M related to B if 'A * B > Z × S + M'?
   1) Aunt 2) Grand father
   3) Uncle 4) Cousin
   5) Can't be determined

Directions (Q.No.6-10): Answer the following questions based on the three digit numbers

612 589 743 468 297

6. If two is added to the first digit of each of the numbers, how many numbers thus formed will be completely divisible by three?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. If the positions of the second and the third digits of each of the numbers are interchanged, in how many numbers thus formed will the last digit be a perfect square? ('1' is also a perfect square?
   1) One 2) Two 3) Three
   4) Four 5) Five
8. What will be the resultant if the third digit of the second lowest number is divided by the second digit of the highest number?
   1) 4 2) 1 3) 6 4) 5 5) 2
9. If all the digits in each of the numbers are arranged in descending order within the number which of the following will form the highest number in the new arrangement?
   1) 612 2) 589 3) 743
   4) 468 5) 297
10. If all the numbers are arranged in ascending order from left to right, which of the following will be the sum of all the three digits of the number which is second from the right of the new arrangement thus formed?
    1) 14 2) 9 3) 18
    4) 16 5) 12



Directions(Q.No.11-15): Answer these questions referring the symbol-letter -number sequence given below:

L 2 M 3 S P @ = J 5 B $ R 7 N # T D 6 B K V 9 4 % A F 8

11. How many such symbols are there each of which is either immediately preceded by a number or immediately followed by a letter?
    1) One 2) Two 3) Three
    4) More than three 5) None
12. Four of the following five are alike in a certain way based on their position in the above arrangement and hence form a group. Which one does not belong to the group?
    1) 2 S 2) 9 K % 3) # R D
    4) $ 5 7 5) = P 5
13. How many such numbers are there each of which is either immediately preceded by a symbol or immediately followed by a letter?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
14. Which of the following is the seventh to the left of 15th from the right end of the above arrangement?
    1) @ 2) P 3) J 4) 5 5) B
15. If the positions of twenty four elements from the right end are reversed, which of the following will be the 15th element from the left end?
    1) B 2) 4 3) 6
    4) # 5) None of these

Directions (Q.No.16-17): Study the following information carefully and answer the questions given below :

F is the grandson of U. M is the mother of F. M is married to P. P is the son of G. G is married to K.

16. How is K related to M?
    1) Cannot be determined
    2) Daughter-in-law
    3) Father 4) Mother
    5) Daughter
17. If D is the father of M, then how is F related to D?
    1) Father 2) Grandson
    3) Son 4) Brother
    5) Grandfather
18. How many such pairs of letters are there in the word SHARED each of which has as many letters between them in the word (in both forward and backward directions) as they have between them in English alphabetical series?
    1) Three 2) None 3) One
    4) More than three 5) Two
19. All the letters of the word GLACIERS are arranged in alphabetical order from left to right. Then all the consonants are replaced with the next alphabet (as per the English alphabetical order), then which of the following will be the fourth letter from the left end?
    1) I 2) C 3) R
    4) M 5) H
20. In a straight line of twelve persons (all facing north), only five persons sit to the left of L. Only three persons between C and L. G sits second to the right of C. Only five persons sit between G and M. How many persons sit between M and L?
    1) Two 2) None
    3) Five 4) Three
    5) Cannot be determined

SOLUTIONS

1. A < P × T + F > L × M means



From the above it can be concluded that the relation "A is the cousin of F" is not true *Ans: 4*

2. In options (3) and (4) N is a male, hence these are eliminated in option (5) N and A have a direct relation. So this also can be eliminated. In option (2) N is the daughter of M and P, M are sisters of A. So N is the Niece of of A. So this option(2) can be eliminated. In option (1) N is wife of P and P is son of A. so N is daughter-in-law of A. *Ans: 1*

3.



P is F's sister's daughter
⇒ P is F's Niece *Ans: 2*

4. In option (1) P is A female and In option (2) and (4) P's gender is not known. Hence these options are ruled out.
Draw family tree for option (3)
S → P – J
|
R
∴ P is R's father *Ans: 3*

5. Here M is at the end of the relational string and M's gender is an unknown. Hence M's relation to B cannot be established. *Ans: 5*

6. Find the numbers whose sum of the digits is one more than 3 multiple (because after addition of 2 it will become a 3- multiple)
The only number satisfying the condition is 589 (5 + 8 + 9 = 22) *Ans: 2*

7. If the position of second and third are interchanged, then the second digit of the original number will become the last digit of the resultant number. So find out the original numbers whose second digits are perfect square. The numbers satisfying the conditions are 612 743 and 297 *Ans: 3*

8. Second lowest number is 468 and its third digit is 8. Highest number is 743 and its second digit is 4.
The Req. result = 8 ÷ 4 = 2 *Ans: 5*

9. If all the digits are arranged in descending order within the number the number 589 will become the highest number in new arrangement *Ans: 2*

10. If the numbers are arranged in ascending order the second highest number will be second from right in the new arrangement The second highest number is 612 and the sum of its digits
= 6 + 1 + 2 = 9 *Ans: 2*

11. The symbols satisfying the conditions are = J, $ R, # T, and % A. i.e. four symbols satisfy the condition *Ans: 4*

12. In each of the options second and third characters are second to the left of and second to the right of first character except in option (3)
Ans: 3

13. The numbers satisfying the conditions are
2M 3 5B 7N 6B *Ans: 5*

14. 7th to left of 15th from right ⇒ 7 + 15 = 22nd from right 22nd from right ⇒ 30 – 22 = 8th from left ⇒ @
Ans: 1

15. If the position of last 24 elements are reversed then 15th from left end in new arrangement will be 10th letter from right in original arrangement (∵ First 5 elements remain same)
The 10th element from right = 6 *Ans: 3*

(16-17)



16. K's gender is unknown. Hence K's relation to m cannot be established
Ans: 1

17. If D is father of M then E is Grandson of D *Ans: 2*

18. The pairs satisfying the condition are AD, DE, DH and EH *Ans: 4*

19. Fourth letter from left if the letters arranged in alphabetical order = G
Now G is replaced by next consonant H *Ans: 5*

20. _ C _ G _ L _ _ _ M _ _
Three persons sit between M and L *Ans: 4*

భవిత కోసం.. బయోటెక్!

కోర్సుల్లో చేరితే స్టైపెండ్ ✦ గాట్-బీ ప్రకటన

మేటి భవిష్యత్తును అందించే సైన్స్ కోర్సుల్లో బయోటెక్నాలజీ ముఖ్యమైంది. దీని ప్రాధాన్యం దృష్ట్యా కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ) ఎంపిక చేసిన సంస్థల్లో పీజీలో చేరే విద్యార్థుల కోసం స్టైపెండ్ అందిస్తోంది. దేశంలోని మేటి సంస్థల్లో బయోటెక్నాలజీ కోర్సులు చదవాలనుకునేవారూ, ఈ విభాగంలో భవిష్యత్తు ఆశిస్తున్నవారూ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ (గాట్-బీ) రాయొచ్చు. ఎన్‌టీఏ నిర్వహించే ఈ పరీక్ష ప్రకటన ఇటీవలే వెలువడింది.

దేశవ్యాప్తంగా వివిధ సంస్థల్లోని 79 కోర్సుల్లో ప్రవేశానికి గాట్-బీ స్కోరు తప్పనిసరి. వాటిలో 1331 సీట్లు ఉన్నాయి. ప్రవేశం కల్పించే సంస్థల్లో.. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ న్యూదిల్లీ, ఐఐటీ ఇండోర్, దిల్లీ యూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ, శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి, పలు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి.

ఈ సంస్థల్లోని బయోటెక్నాలజీ విభాగాలన్నీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఉండటం వల్ల బోధన, ల్యాబ్, లైబ్రరీ, ఇతర సౌకర్యాలు మెరుగ్గా ఉంటాయి. వీటిలో చదివినవారు మేటి అవకాశాలూ సొంతం చేసుకోగలరు. ఫార్మా సంస్థల్లో వీరికి అధిక ప్రాధాన్యం దక్కుతోంది. బోధన, పరిశోధన, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లోనూ వీరు రాణించగలరు. కొన్ని చోట్ల ప్రాంగణ నియామకాలూ జరుగుతున్నాయి.

స్టైపెండ్

ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, అనుబంధ కోర్సుల్లో చేరినవారికి రూ.5000, ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీకి రూ.7500, ఎంటెక్/ఎంవీఎస్సీ కోర్సులకు రూ.12,000 ప్రతి నెలా ఇస్తారు. కోర్సు వ్యవధి మొత్తం స్టైపెండ్ చెల్లిస్తారు. మొదటి ఏడాది ప్రతిభ చూపితేనే తర్వాతి సంవత్సరం ప్రోత్సాహం కొనసాగుతుంది.

ఏయే కోర్సులు?

ఎమ్మెస్సీ: బయోటెక్నాలజీ, మెడికల్ బయోటెక్నాలజీ, యానిమల్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్, బయో ఇన్ఫర్మాటిక్స్, కంప్యుటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీ.
అర్హత: సంస్థ ప్రకారం మారుతుంది. ఎక్కువ సంస్థలు బీఎస్సీ సైన్స్ కోర్సులు చదివినవారికి అవకాశమిస్తున్నాయి. బీఫార్మసీ, ఎంబీబీఎస్, వెటర్నరీ సైన్స్ ఇలా భిన్న విద్యార్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు. కొన్ని సంస్థలకు మాత్రం బీఎస్సీలో బయోటెక్నాలజీ లేదా అనుబంధ కోర్సులు చదివుండటం తప్పనిసరి.
ఎమ్మెస్సీ (అగ్రి): మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ.
అర్హత: బీఎస్సీ- అగ్రికల్చర్/హార్టికల్చర్/ఫారెస్ట్రీ/సెరి కల్చర్/అగ్రి బయోటెక్నాలజీ లేదా బీటెక్ బయోటెక్నాలజీ.
ఎంటెక్: మెరైన్ బయోటెక్నాలజీ, కంప్యుటేషనల్ బయాలజీ, బయో ప్రాసెస్ టెక్నాలజీ, ఫుడ్ బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ బయోటెక్నాలజీ, ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీ.
అర్హత: బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్/ఎమ్మెస్సీ. సంస్థ, కోర్సు ప్రకారం మార్పులుంటాయి.
ఎంవీఎస్సీ: వెటర్నరీ బయోటెక్నాలజీ.
అర్హత: బీవీఎస్సీ

> బయోటెక్నాలజీలో సేవలందించాలనుకునేవారు, పరిశోధనల దిశగా అడుగులేయాలనుకున్నవారు ఈ సంస్థల్లో చదువులకు ప్రాధాన్యమివ్వొచ్చు.

పరీక్ష ఎలా ఉంటుంది?

ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలోనే ఉంటాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు. రెండు సెక్షన్లలో ప్రశ్నలు వస్తాయి.

- సెక్షన్-ఏలో 60 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. తప్పు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు. ప్రశ్నలన్నీ ఇంటర్మీడియట్/10+2 ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ నుంచే వస్తాయి.
- సెక్షన్-బీలో వంద ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 60కి సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. ప్రతి ప్రశ్నకూ 3 మార్కులు. తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.
- ప్రశ్నలు గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఉంటాయి. ఆలోచన, విశ్లేషణతో సమాధానాలు గుర్తించేలా వీటిని అడుగుతారు. బేసిక్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ విభాగాల నుంచి ఈ ప్రశ్నలు వస్తాయి. సిలబస్ వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

ముఖ్య వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తులు: మార్చి 3 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు.
రిజిస్ట్రేషన్ ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.650. మిగిలిన అందరికీ రూ.1300.
పరీక్ష తేదీ: ఏప్రిల్ 20
పరీక్ష కేంద్రాలు: ఏపీలో.. గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం. తెలంగాణలో.. హైదరాబాద్/ సికింద్రాబాద్.
వెబ్‌సైట్: https://exams.nta.ac.in/DBT/

సన్నద్ధత

- ▲ ముందుగా ఇంటర్మీడియట్ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ పాఠ్యపుస్తకాల్లోని ప్రాథమికాంశాలు బాగా చదవాలి. ఆ తర్వాత డిగ్రీ బయోటెక్నాలజీ పాఠ్యపుస్తకాలు అధ్యయనం చేయాలి.
- ▲ గత గాట్-బీ ప్రశ్నపత్రాలను శ్రద్ధగా పరిశీలించాలి. ప్రశ్నలు అడిగే అంశాలు, వాటి స్థాయి తెలుసుకుని అందుకు సరిపోయేలా సన్నద్ధం కావాలి.
- ▲ సీయూఈటీ (పీజీ) బయోటెక్నాలజీ ప్రశ్నపత్రాలు సన్నద్ధతలో ఉపయోగపడతాయి. అలాగే ఐఐటీ జామ్ ప్రశ్నపత్రాలతోనూ ప్రయోజనమే.
- ▲ సన్నద్ధత పూర్తయిన తర్వాత చాప్టర్ల వారీ వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.
- ▲ కనీసం 10 మాక్ టెస్టులు రాసి, పరీక్షల వారీ ఫలితాలు సమీక్షించుకుని, మెరుగుపడాలి.
- ▲ రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేస్తేనే మేలు.

వైఫల్యాన్ని ఎదుర్కోవడం గురించి చాలాసార్లు చదివే ఉంటాం. కానీ విజయాన్ని ఎదుర్కొనేందుకూ, సరిగ్గా అర్థం చేసుకోవడానికీ సైతం సన్నద్ధత కావాలని తెలుసా?

విజయం తర్వాత..

కోరుకున్న కాలేజీలో సీటు, ఎంపిక చేసుకున్న దేశపు వీసా, తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం.. ఇలా విజయం ఏదైనా కానీ, ఆ తర్వాత వేసే అడుగులూ, చూపే ప్రవర్తనా జాగ్రత్తగా ఉండాలనేది నిపుణుల సూచన.

- తాత్కాలిక విజయాలను శాశ్వతమైన జీవన విధానంగా మార్చుకునే ప్రక్రియలో విద్యార్థులు తెలివిగా వ్యవహరించాలి. ఈ విజయం వారిని వ్యక్తులుగా సమాజంలో నిలబెట్టలేదు, పూర్తిస్థాయిలో ఇమేజ్ కల్పించలేదు. దాన్ని ఎంత మేరకు అవసరమో అంతవరకే ఆస్వాదించడం మంచిది. పాత విజయాల పట్ల అధికమైన ప్రేమ, గుర్తింపుతో ఉండటం భవిష్యత్తులో రావాల్సిన వాటిని దూరం చేసే ప్రమాదం ఉంది.

- గెలుపునకు సంబంధించిన సారాన్ని సరైన ధోరణిలో చూడాలి. నాణ్యమైన, స్థిరమైన కెరియర్‌ను ఏర్పాటు చేసుకోవడంలో ప్రతి అడుగూ ప్రభావం చూపుతుంది. చిన్న చిన్న విజయాలన్నీ కలిసి ఒక ప్రయాణంగా మనల్ని ముందుకు తీసుకువెళ్తాయి. అందుకే ప్రతి మెట్టు వద్దా జాగ్రత్తపడాలి.

వైఫల్యాల నుంచి..

అనుకున్న పనిలో విఫలం కావడం మనల్ని చాలా బాధకు గురిచేస్తుంది. కానీ.. దాన్ని సరైన విధంగా ఉపయోగించుకుంటే తగిన పాఠాలు నేర్చుకుని భవిష్యత్తులో కోరుకున్న గెలుపు తీరాలు చేరుకోవచ్చు.

- ఒక వైఫల్యం ఎదురైంది అంటే మనం ఓడిపోయాం అని కాదు, ఆ పద్ధతిలో పనిచేస్తే అనుకున్న విధంగా ఫలితాలు రావని! అలాగే ఒక విజయం సాధించాం అంటే అర్థం సంపూర్ణంగా గెలుపొందాం అనీ కాదు.. ఆ బాటలో ఒక అడుగు ముందుకేశాం అని.

- దీన్ని అర్థం చేసుకుని నిరంతరం శ్రమించడం, వ్యక్తిత్వంలో అనూహ్యమైన మార్పులు రాకుండా జాగ్రత్తపడటం ద్వారా ఆ విజయాన్ని మరింత పదిలం చేసుకోవచ్చు. చెక్కు చెదరని స్థిరమైన విజయాన్ని సొంతం చేసుకోవచ్చు!

సమ్మర్ ఫెలోషిప్‌కు ఐఐటీ ఆహ్వానం

వైవిధ్య కోర్సులతో విద్యార్థి లోకాన్ని ఆకట్టుకుంటున్న ఐఐటీ మద్రాస్.. మరో మేటి ఆఫర్‌తో ముందుకొచ్చింది. సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రాం-2025లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, హ్యుమానిటీస్ కోర్సులు చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైతే ఐఐటీ మద్రాస్‌లో రెండు నెలల పాటు స్టైపెండ్ అందుకుంటూ ప్రతిభను మెరుగుపరచుకోవచ్చు.

అకడమిక్స్‌లో నాణ్యమైన పరిశోధన దిశగా, నిర్దేశిత లక్ష్యాన్ని అందుకునేలా ఈ సమ్మర్ ఫెలోషిప్‌ను ఐఐటీ మద్రాస్ అందిస్తోంది. ఐఐటీ విద్యార్థులు తప్ప ఎవరైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: ప్రస్తుతం బీఈ/బీటెక్ తృతీయ సంవత్సరం లేదా ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ మాస్టర్ ప్రోగ్రాం(ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ) మూడు/నాలుగో సంవత్సరంలో ఉన్నవారు లేదా ఎమ్మెస్సీ/ఎంఏ/ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నవారు ఈ ఇంటర్న్‌షిప్ కోసం ప్రయత్నించవచ్చు.

ఏ విభాగాల వారు?

ఇంజినీరింగ్: ఏరో స్పేస్, అప్లయిడ్ మెకానిక్స్ అండ్ బయో మెడికల్, బయోటెక్నాలజీ, కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, డీఎస్ అండ్ ఏఐ, డిజైన్, ఎలక్ట్రికల్, మెకానికల్, మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మెటలర్జికల్ అండ్ మెటీరియల్, ఓషన్.
సైన్స్: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్
హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు: ఫిబ్రవరి 28 సాయంత్రం 5 గంటలు.
వెబ్‌సైట్: https://ssp.iitm.ac.in/summer-fellowship-registration
ఫెలోషిప్ వ్యవధి: మే 19 నుంచి జులై 18 వరకు.
స్టైపెండ్: నెలకు రూ.15,000
వసతి, భోజన సౌకర్యం ఉంటుంది. దీని కోసం కొంత మొత్తం చెల్లించాలి.

ఎవరికి ప్రాధాన్యం?

విశ్వవిద్యాలయ స్థాయిలో టాపర్స్‌గా నిలిచినవారు, అకడమిక్స్‌లో రాణిస్తున్నవారు, సెమినార్లలో పాల్గొని పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చినవారు, ప్రాజెక్టులు చేస్తున్నవారు, వివిధ పోటీల్లో పాల్గొంటున్నవారు, మ్యాథ్స్ ఒలంపియాడ్ లేదా ఇతర పోటీల్లో ర్యాంకు/ స్కోరు పొందినవారు.. ఇలాంటి వారికి ప్రాధాన్యం దక్కుతుంది. అభ్యర్థులు తమ ప్రతిభను తెలిపే వివరాలు పొందుపర్చాలి. విశ్వవిద్యాలయం/ విద్యాసంస్థ నుంచి ధ్రువీకరణ పత్రం అందించాలి. అన్ని సర్టిఫికెట్లూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది.

మేనేజ్‌మెంట్ ట్రెయినీగా చేరతారా?

కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో న్యూ దిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ... అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏఐసీ) 55 మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులను భర్తీ చేయనుంది.

మొత్తం ఉద్యోగాల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 16, ఈడబ్ల్యూఎస్‌లకు 6, ఎస్సీలకు 9, ఎస్టీలకు 5, ఓబీసీలకు 19 కేటాయించారు.

అర్హతలు:

జనరలిస్టుకు: ఏదైనా డిగ్రీ/ పీజీ.
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి: కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎంసీఏతో బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్/ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్/ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్/ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ నైపుణ్యం ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం.
యాక్చూరియల్‌కు: స్టాటిస్టిక్స్/ మ్యాథమెటిక్స్/ యాక్చూరియల్ సైన్సెస్/ ఎకనామిక్స్/ ఆపరేషన్స్ రిసెర్చ్ సబ్జెక్టులతో డిగ్రీ/ పీజీ.

అన్ని పోస్టులకూ.. డిగ్రీ/పీజీ 60 శాతం మార్కులతో, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 55 శాతం మార్కులతో పూర్తిచేయాలి.

వయసు: 01.12.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. సీబీటీ ఆబ్జెక్టివ్, సబ్జెక్టివ్ విధానంలో 150 మార్కులకు ఉంటుంది. వ్యవధి రెండున్నర గంటలు. దీంట్లో జనరల్ అభ్యర్థులు 60 శాతం, ప్రత్యేక వర్గాలు 55 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

పరీక్ష ఎలా ఉంటుంది?

ప్రశ్నపత్రంలో ఒక్కో విభాగంలో పోస్టును బట్టి ప్రశ్నల సంఖ్య మారుతుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు.

జనరలిస్టుకు: రీజనింగ్ - 40. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25. జనరల్, కరెంట్ అఫైర్స్ అండ్ ఇన్స్యూరెన్స్ అవేర్‌నెస్ 35, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ కంప్యూటర్ లిటరసీ 40.
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి: రీజనింగ్- 10, ఇంగ్లిష్ లాంగ్వేజ్- 10, జనరల్, కరెంట్ అఫైర్స్ అండ్ ఇన్స్యూరెన్స్ అవేర్‌నెస్- 10. ప్రొఫెషనల్ నాలెడ్జ్ 100.
యాక్చూరియల్‌కు: రీజనింగ్- 30, ఇంగ్లిష్ లాంగ్వేజ్- 10, జనరల్, కరెంట్ అఫైర్స్ అండ్ ఇన్స్యూరెన్స్ అవేర్‌నెస్- 30. ప్రొఫెషనల్ నాలెడ్జ్‌లో 40 ప్రశ్నలకు 60 మార్కులు.

ఈ మూడు రకాల పోస్టుల్లోనూ డిస్క్రిప్టివ్ ఇంగ్లిష్ టెస్ట్‌లో 2 ప్రశ్నలు - 10 మార్కులు.

రాత పరీక్షలో అర్హత సాధించినవారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. దీనికి 50 మార్కులు. దీంట్లో 25 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారికి ఏసీ త్రీటైర్ ట్రెయిన్ ఛార్జీలను చెల్లిస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: 20.02.2025
వెబ్‌సైట్: http://www.aicofindia.com/

అవకాశాల్లో ఉంటుందా తేడా?

నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం.. పాత పద్ధతిలో డిగ్రీ చేసినవాళ్లకు కొత్తవారితో సమానంగా ఉద్యోగావకాశాలుంటాయా? - పొద్దుటూరి జగదీశ్వర్



■ సాధారణంగా ఏదైనా ఉద్యోగ ప్రకటనలో ఆ ఉద్యోగానికి అవసరమైన విద్యార్హతలు మాత్రమే పేర్కొంటారు. ఉదాహరణకు- డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు, పీజీలో కనీసం 55 శాతం మార్కులు, ఎంబీఏలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలని మాత్రమే ఉంటుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం ఇంటర్మీడియట్లో మ్యాథ్స్, డిగ్రీలో బయాలజీ, ఎంబీఏలో మార్కెటింగ్.. ఈరకంగా చదివుండాలని అడగొచ్చు. అంతేకానీ డిగ్రీని నూతన జాతీయ విద్యావిధానం ద్వారా మాత్రమే పొందివుండాలని అడిగే అవకాశం లేదు.

అయితే నూతన విద్యావిధానంలో డిగ్రీ చదవడం వల్ల కొన్ని ప్రత్యేక లాభాలుండటం వల్ల ఉద్యోగ పోటీ పరీక్షల్లో వారికి కొంత అదనపు ప్రయోజనం లభించవచ్చు.

ముందుగా పాత పద్ధతిలో పొందిన డిగ్రీకీ, నూతన జాతీయ విద్యావిధానం ద్వారా పొందిన డిగ్రీకీ మధ్య మౌలిక భేదాలు తెలుసుకోవాలి.

- జాతీయ విద్యావిధానం- 2020కి ముందు జారీ చేసిన చాలా డిగ్రీలు సెమిస్టర్ పద్ధతిలో ఉండక పోవచ్చు. ఆ డిగ్రీల్లో క్రెడిట్ ప్రస్తావన లేకపోవచ్చు. సంప్రదాయ డిగ్రీల కాల వ్యవధి కచ్చితంగా మూడు సంవత్సరాలు, పీజీ వ్యవధి రెండు సంవత్సరాలు మాత్రమే ఉండి ఉండవచ్చు. పాత పద్ధతిలో చదివిన డిగ్రీలో క్రెడిట్ల బదలాయింపు, మల్టీ డిసిప్లినరీ విద్య, పరిశోధన, అంతర్జాతీయ ప్రమాణాలు, ద్విభాషల్లో బోధన, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం, సుస్థిర అభివృద్ధి, పర్యావరణ అంశాలు, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ఫలితాల ఆధారిత విద్య (అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్), సాంకేతిక నైపుణ్యాలకు తక్కువ ప్రాధాన్యం ఉండేది.
- కానీ జాతీయ విద్యావిధానం -2020 ప్రకారం పొందిన డిగ్రీల్లో ఈ ప్రయోజనాలన్నీ ఉన్నాయి. కాబట్టి, ఈ విధానం ద్వారా డిగ్రీలు పొందినవారు.. పాత విధానంలో డిగ్రీ పొందినవారికంటే, నైపుణ్యాల విషయంలో కొంత ముందుండే అవకాశం ఉంది.
- డిగ్రీలో చదివిన కోర్సులతో పాటు, మరికొన్ని కోర్సులను ఆన్‌లైన్ పద్ధతిలో చేయడం, నైపుణ్యాలు పెంపొందించుకోవడం కోసం ప్రత్యేక శిక్షణ, పరిశోధన సంబంధిత అంశాలపై అవగాహన.. మొదలైనవాటిపై దృష్టిపెట్టి, ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

> **పాత విధానంలో డిగ్రీలు పొందినవారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. నిర్దిష్ట అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టి, నూతన జాతీయ విద్యావిధానంలో చదివినవారితో సమానంగా పోటీ పడొచ్చు**

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

చదువు

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512
edc@eenadu.in

నో టీ స్ బో ర్డు

ఉద్యోగాలు

ఎన్ఐటీలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ).. ఒప్పంద ప్రాతిపదికన 5 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్- 04 ◗ రిసెర్చ్ అసోసియేట్- 01
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ప్రావీణ్యం, సంబంధిత పని అనుభవం. **వేతనం:** నెలకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌కు రూ.20,000; రిసెర్చ్ అసోసియేట్‌కు రూ.30,000. **దరఖాస్తు:** ఈమెయిల్ ద్వారా.
ఈమెయిల్: vrdevi@nitw.ac.in; rahult@nitw.ac.in **ఎంపిక:** దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూల ఆధారంగా. **దరఖాస్తుకు చివరి తేదీ:** 25-02-2025. **వెబ్‌సైట్:** https://nitw.ac.in/

ఎన్ఐఎఫ్‌టీఈఎంలో..

తమిళనాడులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్- తంజావూరు వివిధ విభాగాల్లో 21 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ రిసెర్చ్ అసోసియేట్: 02 ◗ సీనియర్ రిసెర్చ్ ఫెలో: 11 ◗ యంగ్ ప్రొఫెషనల్: 05
◗ కార్పొరేట్ రిలేషన్ మేనేజర్: 01 ◗ లేడీ మెడికల్ డాక్టర్: 01 ◗ ఫుడ్ అనలిస్ట్: 01
అర్హత: లేడి మెడికల్ డాక్టర్ పోస్టుకు ఎంబీబీఎస్. వయసు, వేతనం, మిగతా పోస్టుల అర్హతల వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ:** 12-02-2025.
దరఖాస్తుకు చివరి తేదీ: 05-03-2025. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా.
వెబ్‌సైట్: https://niftem-t.ac.in/careers.php

ఉడిపి షిప్‌యార్డ్‌లో మేనేజీరియల్ ఖాళీలు

కర్ణాటక రాష్ట్రం మాల్పేలోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. 3 పోస్టుల భర్తీకి భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ మేనేజర్ (ఫైనాన్స్)- 01
◗ డిప్యూటీ మేనేజర్ (ఫైనాన్స్/ ఎలక్ట్రికల్ డిజైన్)- 02
అర్హతలు: పోస్టును అనుసరించి సీఏ, సీఎంఏ, డిగ్రీ (ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్)తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఉద్యోగానుభవం.
వయసు: దరఖాస్తు చివరి తేదీ నాటికి డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు; మేనేజర్‌కు 40 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు మేనేజర్‌కు రూ.1,16,160; డిప్యూటీ మేనేజర్‌కు రూ.96,800.
ఎంపిక: పని అనుభవం, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, గ్రూపు డిస్కషన్, ఇంటర్వ్యూల ఆధారంగా.
దరఖాస్తు ఫీజు: రూ.1,000. ఎస్సీ/ ఎస్టీ పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 03-03-2025.
వెబ్‌సైట్: https://udupicsl.com/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఫైనాన్స్

సంస్థ: బీబీ అడ్వైజరీ
నైపుణ్యాలు: అకౌంటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఫైనాన్షియల్ మోడలింగ్, ఎంఎస్-ఎక్సెల్ స్టైపెండ్: రూ.2,000-8,000 ☛ internshala.com/i/59609e

సేల్స్ అండ్ మార్కెటింగ్

సంస్థ: ఇవాంజిలిస్ట్ సాఫ్ట్‌వేర్
నైపుణ్యాలు: లింక్డ్‌ఇన్ మార్కెటింగ్, మార్కెటింగ్, మార్కెట్ రిసెర్చ్, సేల్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.8,000
☛ internshala.com/i/a1044f

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: బృహత్ ఇన్ఫోటెక్
నైపుణ్యాలు: ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్, ఎంఎస్-ఎక్సెల్, నెగోషియేషన్ అండ్ ప్రాబ్లమ్-సాల్వింగ్, సేల్స్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/2fbaf6

స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్

సంస్థ: ఆల్ఫాబెట్ ఎడ్యుకేషన్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఆఫీస్ స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/c8488e

కంటెంట్ రైటింగ్

సంస్థ: హైపర్‌ప్రాస్పెక్ట్
నైపుణ్యాలు: బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఈమెయిల్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయటం, ఫేస్‌బుక్ యాడ్స్, గూగుల్ యాడ్‌వర్డ్స్, గూగుల్ అనలిటిక్స్, మార్కెటింగ్, ఎంఎస్-ఎక్సెల్, సేల్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.6,000
☛ internshala.com/i/537b4a

నెస్ట్‌జేఎస్ డెవలపర్

సంస్థ: ట్రీవీ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: అమెజాన్ వెబ్ సర్వర్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, పోస్ట్‌మ్యాన్, రెస్ట్‌ఏపీఐ స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/f069c0

అకడమిక్ రైటింగ్ (రిసెర్చ్ పేపర్)

సంస్థ: మై మెగామైండ్స్
నైపుణ్యం: ఇంగ్లిష్ రాయడం
స్టైపెండ్: రూ.7,500-10,000
☛ internshala.com/i/fa8062

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: మార్చి 9

ఇంగ్లిష్ నేర్చుకుందాం!
సరిగా చెప్పగలిగితే సక్సెస్ ఖాయం!
ఆంగ్లంలో సులువుగా అందరితో మాట్లాడేయండి!
Spoken English
Grammar Made Easy
Idioms & Phrases
ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net / eenadupratibha.net

(c) eenadu

ఈనాడు ప్రతిభ
సోమవారం, ఫిబ్రవరి 10, 2025
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



■ అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం (ఐసీఏడీ)ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('సేఫ్ స్కైస్, సస్టెయినబుల్ ఫ్యూచర్' అనే థీమ్‌తో 2024లో దీన్ని నిర్వహించారు.) **జ:** డిసెంబరు 7

■ 20వ ఆసియా మహిళల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ విజేతగా ఏ దేశ జట్టు నిలిచింది? (న్యూదిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో ఈ జట్టు 25-24తో దక్షిణకొరియాపై నెగ్గి రెండోసారి ఛాంపియన్‌గా నిలిచింది.) **జ:** జపాన్

మాదిరి ప్రశ్నలు

■ ఐక్యరాజ్యసమితి నార్కోటిక్ డ్రగ్స్ కమిషన్ ఎన్నో సెషన్‌కు ఇటీవల భారత్ అధ్యక్షత వహించింది? (వియన్నాలోని ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో భారత శాశ్వత ప్రతినిధి శంభు ఎస్ కుమారన్ ఈ సెషన్‌కు అధ్యక్షత వహించారు. ఈ సెషన్‌కు అధ్యక్షత వహించడం భారత్‌కు ఇదే తొలిసారి.) **జ:** 68వ

■ ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన భారతీయ వాయుయాన్ విధేయక్ (బీవీవీ) బిల్లు-2024 ఏ సంవత్సరం నాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో అమలులోకి వచ్చింది? **జ:** 1934 (1934 నాటి విమాన చట్టాన్ని మొత్తం మీద 21 సార్లు సవరించారు. చివరగా 2020లో సవరించారు.)

■ ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఏ (ఇంటర్నేషనల్ సోషల్ సెక్యూరిటీ అసోసియేషన్) గుడ్ ప్రాక్టీస్ అవార్డును ఆసియా, పసిఫిక్ విభాగంలో ఏ దేశం గెలుచుకుంది? **జ:** భారత్

మరింత సమాచారం

ఇంటర్మీడియట్-2025
మోడల్ పేపర్లు
నిపుణుల సమాధానాలతో..

ప్రిపరేషన్ టెక్నిక్

జనరల్ నాలెడ్జ్ విభాగంపై పట్టు పెరగాలంటే రోజూ వార్తాపత్రికలు, మ్యాగజీన్‌లు చదవాలి. ఇయర్ బుక్స్ కూడా అధ్యయనం చేయాలి. తాజా సంఘటనలను తెలుసుకోవడంతోపాటు, దాంతో సంబంధం ఉన్న పాత విషయాలపైనా అవగాహన పెంచుకోవాలి.

పదోతరగతి

ప్రశ్నలు జవాబులు

గణితం

స్పర్శరేఖలు సమాంతరాలు

వృత్తాలు

2 మార్కులు

1. O కేంద్రంగా ఉన్న వృత్తానికి PQ స్పర్శరేఖ వృత్తాన్ని బిందువు P వద్ద తాకుతోంది. వృత్త వ్యాసార్ధం 5 సెం.మీ. OQ = 12 సెం.మీ. అయితే PQ పొడవు ఎంత?



సాధన: వ్యాసార్ధం OP = 5, OQ = 12 సెం. మీ.
వృత్తానికి PQ ఒక స్పర్శరేఖ.
కాబట్టి, $\angle OPQ = 90^\circ$
లంబకోణ త్రిభుజం OPQ లో పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం,
$OQ^2 = PQ^2 + OP^2$
$PQ^2 = OQ^2 - OP^2$
$PQ^2 = 12^2 - 5^2$
$PQ^2 = 144 - 25$
$PQ^2 = 119$
$PQ = \sqrt{119}$ సెం. మీ.

2. ఒక వృత్తానికి వ్యాసం చివరి బిందువుల వద్ద గీసిన స్పర్శరేఖలు సమాంతరాలు అని నిరూపించండి.



సాధన: AB వృత్తానికి ఒక వ్యాసమనుకుంటే PQ, RS లు వరుసగా A, B బిందువుల వద్ద గీసిన రెండు స్పర్శరేఖలు.
స్పర్శరేఖలకు, స్పర్శబిందువు వద్ద గీసిన వ్యాసార్ధాలు లంబంగా ఉంటాయి.
$\therefore OA \perp PQ \Rightarrow AB \perp PQ$
$OB \perp RS \Rightarrow AB \perp RS$
ఒకే రేఖకు లంబంగా గీసిన రెండు రేఖలు ఒకదానికొకటి సమాంతరాలు. కాబట్టి $PQ \parallel RS$
$\therefore$ ఒక వృత్తానికి వ్యాసం చివరి బిందువుల వద్ద గీసిన స్పర్శరేఖలు సమాంతరాలు.

ముఖ్యమైనవి మరికొన్ని.. (4 మార్కులు)

జవాబుల కోసం

1. వృత్తానికి బాహ్య బిందువు ద్వారా గీసిన స్పర్శరేఖలు సమానమని నిరూపించండి.
2. ABCD చతుర్భుజంలో వృత్తాన్ని అంతర్లిఖించారు. అయితే AB + CD = AD + BC అని నిరూపించండి.

డాక్టర్. టీఎస్‌వీఎస్. సూర్యనారాయణ మూర్తి

SUBSCRIBE
CHANNEL

ఇంధన రంగంలో స్వయం సమృద్ధ సాధనం!

జనరల్ స్టడీస్
పర్యావరణ అంశాలు

దేశంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎంతో ముందు చూపుతో, నిర్మాణాత్మకంగా రూపొందించుకున్న వ్యవస్థల్లో అణుశక్తి విభాగం ఒకటి. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం అణుశక్తి టెక్నాలజీని అంచలంచెలుగా అభివృద్ధి చేసింది. అణుశక్తిని శక్తివనరుగా మార్చి పెరుగుతున్న విద్యుత్తు అవసరాలను భర్తీ చేస్తోంది. విస్తృత ప్రయోజనాలను అందిస్తూ, దేశ రక్షణలోనూ కీలకంగా నిలుస్తున్న ఈ సున్నిత సాంకేతికత విషయంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధించిన తీరుపై పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. దేశం అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకే వినియోగిస్తున్న విధానం, క్రమానుగతంగా అణువిద్యుత్తు ఉత్పత్తి పెరుగుతున్న తీరు, ఇందుకోసం యాభయ్యో దశకంలోనే రూపొందిన మూడంచెల కార్యక్రమం, వినియోగించే రియాక్టర్లు, అణు ఇంధనాలు, నేటివరకు సాధించిన ప్రగతి గురించి సమగ్రంగా తెలుసుకోవాలి.



భారత్‌లో అణుశక్తి అభివృద్ధి

భారత్‌లో 1945లో టాటా గ్రూపు సౌజన్యంతో ప్రముఖ అణుశాస్త్రవేత్త హోమీ జహంగీర్ బాబా ఆధ్వర్యంలో ముంబయిలో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ సెంటర్ (TIFR) ప్రారంభమైంది. ఈ సంస్థ ఏర్పాటుతో భారత్‌లో అణు పరిశోధనకు బీజం పడింది. స్వాతంత్ర్యానంతరం హోమీ బాబా అధ్యక్షతన అణుశక్తి సంఘం (AEC) ఏర్పాటైంది. అప్పటికే అణుశక్తి సాంకేతిక పరిజ్ఞానం సాధించిన దేశాలు ఆ సాంకేతికతను భారత్ లాంటి దేశాలకు అందించేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో భారత అణుశక్తి రంగం జహంగీర్ బాబా అధ్వర్యంలో స్వతంత్రంగానే ముందుకు సాగింది. ఈ క్రమంలోనే అణుశక్తి పరిశోధనలు వేగవంతం చేయడానికి 1954లో బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (BARC) స్థాపించారు. మరోవైపు అణుశక్తి సంఘం రూపొందించిన కార్యక్రమాల అమలు, రియాక్టర్ల నిర్మాణం కోసం 1956లో అణుశక్తి విభాగం (DAE) ఏర్పాటైంది. అణుశక్తి పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని దేశ భవిష్యత్తు విద్యుత్తు అవసరాలు తీర్చే విధంగా మూడంచెల అణువిద్యుత్తు కార్యక్రమానికి 50వ దశకంలోనే హోమీ బాబా రూపకల్పన చేశారు. మొదటి అంచెలో భాగంగా ప్రెషరైజ్డ్ హెవీవాటర్ రియాక్టర్ (పీహెచ్‌డబ్ల్యూఆర్)లను ఉపయోగించి విద్యుత్తు ఉత్పత్తికి కావాల్సిన భారజలం తయారీపై దృష్టిసారించారు. పంజాబ్‌లో నంగల్ వద్ద 1962లో మొదటి భారజల కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. 1966లో ప్రయోగాత్మక అణురియాక్టర్లను నెలకొల్పడమే కాకుండా యురేనియంను వెలికితీసి, శుద్ధి చేసి ఉపయోగించడం, శాంతియుత ప్రయోజనాల కోసం రేడియో ఐసోటోప్‌లను కూడా అభివృద్ధి చేసే స్థాయికి భారత్ చేరింది.

> 2050కి దేశంలో వినియోగమయ్యే విద్యుత్తులో 25 శాతాన్ని అణువిద్యుత్తు ద్వారా సమ కూర్చుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

✸ యురేనియంతో విద్యుత్తును ఉత్పత్తి చేసే ప్రెషరైజ్డ్ హెవీవాటర్ రియాక్టర్‌ను అమెరికా సహాయంతో 1969లో మహారాష్ట్రలోని తారాపూర్ వద్ద ప్రారంభించారు. తర్వాతి దశ అణువిద్యుత్తు కార్యక్రమంలో భాగంగా ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్ తయారీ, పరిశోధనలకు 1971లో తమిళనాడులోని కల్పకం వద్ద 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రిసెర్చ్'ను స్థాపించారు. ఈ సమయంలోనే భారత్ అప్పటికే జరిగిన చైనా, పాకిస్థాన్ యుద్ధాలను దృష్టిలో పెట్టుకుని 1974లో తొలి అణుపరీక్షలను నిర్వహించింది. దీంతో అమెరికా.. తారాపూర్ అణువిద్యుత్తు కేంద్రానికి యురేనియం సరఫరా నిలిపేయడంతోపాటు అనేక ఆంక్షలు విధించింది. ఆ సమయంలో కెనడా ముందుకొచ్చి భారత్‌కు యురేనియం సరఫరాతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందించింది.

✸ భారతదేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని వాణిజ్యస్థాయిలో అణువిద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంతో 1987లో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)ను స్థాపించారు. ఇది అణువిద్యుత్తు ప్లాంట్ల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. ఎన్‌పీసీఐఎల్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అణువిద్యుత్తు ప్లాంట్లు నిర్మించారు, మరెన్నో నిర్మాణంలో ఉన్నాయి. ✸ అణుశక్తి అభివృద్ధిలో స్వయంసమృద్ధి సాధించిన భారతదేశ నేడు ఈ సాంకేతికతను వ్యవసాయ, పారిశ్రామిక, వైద్య రంగాలతోపాటు ఆహారపదార్థాల నిల్వ లాంటి అనేక ప్రయోజనాలకు వినియోగిస్తోంది. 2024, డిసెంబరు నాటికి అణువిద్యుత్తు ఉత్పత్తి 8,180 మెగావాట్లకు చేరింది. అణు పరీక్షలు, అణ్వాయుధాల తయారీని నిరోధించే ఎన్‌పీటీ, సీటీబీటీ లాంటి ఒప్పందాలపై సంతకం చేయకుండానే అమెరికా, రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్, దక్షిణకొరియా, చైనా, అర్జెంటీనా, కజకిస్థాన్, మంగోలియా, నమీబియా తదితర దేశాలతో విడివిడిగా అణుఒప్పందాలు చేసుకుంది. ఈ క్రమంలోనే 2050 నాటికి దేశంలో వినియోగమయ్యే విద్యుత్తులో 25 శాతాన్ని అణువిద్యుత్తు ద్వారా సమకూర్చుకునే లక్ష్యంతో ప్రణాళికలను అమలు చేస్తోంది.

> 2024, డిసెంబరు నాటికి అణువిద్యుత్తు ఉత్పత్తి 8,180 మెగావాట్లకు చేరింది.

రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

మూడంచెల అణు విద్యుత్తు కార్యక్రమం

భారతదేశంలో మూడు అంచెల అణు విద్యుత్తు కార్యక్రమాన్ని హోమీ జహంగీర్ బాబా ప్రారంభించారు. దేశ భవిష్యత్తు ఇంధన అవసరాలు తీర్చి, స్వయంసమృద్ధిని సాధించడం, దేశీయంగా లభిస్తున్న యురేనియం, థోరియం నిల్వలను అణురియాక్టర్లలో పూర్తి స్థాయిలో ఇంధనంగా ఉపయోగించుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

మొదటి అంచె: సహజ యురేనియం (యురేనియం-235)ను ఇంధనంగా ఉపయోగించే ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్ (భారజల రియాక్టర్)లను ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ఈ రియాక్టర్‌లో ఉప ఉత్పతనంగా ప్లుటోనియం-239 ఉత్పత్తి జరుగుతుంది. యురేనియంను ఉపయోగించి విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి భారజల రియాక్టర్ అత్యంత సమర్థమైంది, వేగంగా విద్యుత్తు తయారీకి అనుకూలం. ఈ కారణంగానే మొదటి అంచెలో ఈ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. దేశంలో ప్రస్తుతం తారాపూర్‌లోని రెండు రియాక్టర్లను మినహాయించి, మిగతా అన్నిచోట్ల భారజల రియాక్టర్లే వాడుతున్నారు. 40ఏళ్ల జీవితకాలం మనగలిగే వీటిద్వారా ఒక్కో మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తికి రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు ఖర్చవుతుంది.


కామిని రియాక్టర్

రెండో అంచె: సహజ యురేనియం, ప్లుటోనియం-239 మిశ్రమ ఇంధనంతో పనిచేసే ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్‌ను ఉపయోగిస్తారు. ఈ విధానంలో ఉపయోగించిన ప్లుటోనియం కంటే అధికంగా ప్లుటోనియం ఉత్పత్తి జరుగుతుంది. ఈ విధంగా సమకూరే అధిక ప్లుటోనియం మరెన్నో కొత్త ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్ల నిర్మాణానికి పరోక్షంగా తోడ్పడుతుంది. ✦ ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్‌లను దేశీయంగా నిర్మించడానికి భారత ప్రభుత్వం తమిళనాడులోని కల్పకం వద్ద 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రిసెర్చ్'ను స్థాపించింది. ఇక్కడే 1977లో భారత మొదటి ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్ 'కామిని'ని నిర్మించారు. దీని సామర్థ్యం 40 మెగావాట్లు. కేంద్ర అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో పనిచేసే 'భారతీయ నభికియ విద్యుత్తు నిగమ్ లిమిటెడ్' అనే ప్రభుత్వ రంగ సంస్థ ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్ల నిర్మాణం బాధ్యతలు చూస్తుంది.

మూడో అంచె: అత్యాధునికమైన థోరియం-232, యురేనియం-233 ఇంధన రియాక్టర్లను ఉపయోగించి విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు. ఇది థోరియం-232ను ఇంధనంగా ఉపయోగించి, దాన్ని యురేనియం-233గా మార్చి ఆ తర్వాతే విద్యుత్తు ఉత్పత్తి చేయగలుగుతుంది. కామిని రియాక్టర్‌లో థోరియంను యురేనియం-233గా మార్చే ప్రక్రియ ఇప్పటికే విజయవంతంగా పూర్తయింది. ఈ అంచె అణువిద్యుత్తు కార్యక్రమం ద్వారా దేశంలో పుష్కలంగా లభించే థోరియంను అణు ఇంధనంగా వాడుకోవచ్చు. తద్వారా శక్తి కొరతను అధిగమించవచ్చు.

Design more effective curricula

In English pedagogy, 'Evaluation" refers to the systematic process of assessing and Judging students'. English Language proficiency by using various methods like, tests, observations, Assignments.... to determine their progress, identify areas of strength and weakness. Evaluation is a continuous process that involves both formative (ongoing feedback) and summative (final assessment) evaluations, allowing teachers to adapt their instruction based on student needs. Evaluation is an important aspect of the educational process as it helps teachers understand student learning and adjust their teaching practices accordingly.

Evaluation

1. The Test of 'International English Language Testing System (IELTS)' is an example of the following.
1) Proficiency Test 2) Achievement Test
3) Aptitude Test 4) Placement Test

2. Identify the factors that influence evaluation.
i) teaching-learning process
ii) the syllabus
iii) Teaching Learning Material
iv) Classroom procedures
1) i, ii only 2) i only
3) i, ii, iii 4) i, ii, iii, iv

3. Reliability refers to ......
1) the consistency of a measure.
2) how accurately a conclusion, measurement or concept corresponds to what is being tested.
3) whether a test measures what it aims to measure.
4) how a person's own uniqueness influences their perceptions.

4. The tests that aim at identifying learners' strengths and weaknesses.
1) Proficiency tests 2) Placement tests
3) Diagnostic tests 4) Aptitude tests

5. One of the following is not a characteristic of a good test.
1) reliability 2) subjectivity
3) validity 4) practicality

6. The process of quantifying the numerical expression of the characteristics of persons' performance according to explicit procedure and rules is called.
1) Test 2) Evaluation
3) Measurement 4) Assessment

7. Which type of evaluation is used to monitor the learning process?
1) Summative evaluation
2) Formative evaluation
3) Placement evaluation
4) Above all

8. What is a sum of questions is called?
1) test 2) examination
3) assessment 4) quiz

9. A test designed to measure learner's general abilities in language at a given level is called...
1) Placement Test 2) Diagnostic Test
3) Proficiency test 4) Aptitude Test

10. A test measures accurately what it is supposed to measure. This quality of testing is called...
1) Validity 2) Practicality
3) Reliability 4) Subjectivity

11. According to NCF-2005, Assessment should be...
1) continuous and convenient
2) conductive and comfortable
3) continuous and conductive
4) continuous and comprehensive

12. The ability to grasp the meaning of the text is called...
1) comprehension 2) evaluation
3) application 4) synthesis

13. What is the primary distinction between Formative and Summative assessment?
1) Formative Assessment focuses on individual student progress, while Summative Assessment focuses on group performance.
2) Formative Assessment is used for grading, while Summative Assessment is used for feedback.
3) Formative Assessment uses objective measures, while Summative Assessment relies on subjective measures.

DSC - English Methodology

4) Formative Assessment is conducted during instruction, while Summative Assessment occurs after instruction.

14. Match the following.

A	B
i) Test	p) is the process of interpreting the measured data to make the quantitative judge.
ii) measurement	q) refers to the tool used to collect data.
iii) evaluation	r) is the act of assigning numerical values.

1) i-r, ii-q, iii-p 2) i-q, ii-r, iii-p
3) i-p, ii-q, iii-r 4) i-r, ii-p, iii-q

15. 'What did Drona show to his disciples on the branch of the tree'?
The above question is an example of...
1) very short answers type of question
2) yes/no type question
3) essay type question
4) multiple choice question

16. If the test yields dependable scores which do not fluctuate very much. Then the test is ......
1) Valid 2) Reliable
3) Practicle 4) Scorable

17. "The children have to read one reading text (other than textbook) such as story, news report, article...., comprehend and express their opinion in oral and written".
Identify the formative tool linked to the above activity.
1) Project work 2) Slip test
3) Read and Reflect 4) Written work

18. Select the type of validity that involves determining the extent to which a test measures a specific characteristic.
1) Predictive validity
2) Content validity
3) Construct validity
4) Concurrent validity

19. Summative evaluation is ......
1) a process of identifying the problems of homework.
2) a process of identifying the areas of improvement.
3) a process of ongoing feedback on performance.
4) a process of obtaining performance ratings.

20. Sometimes, examiners are free to interpret and mark the questions in their own way, this leads to .....
1) reliability 2) unreliability
3) proficiency 4) validity

21. Which of the following is the first step in test construction?
1) Item analysis
2) defining the purpose and objectives of the test
3) writing test items
4) selecting a scoring system

22. The main objective of Continuous and Comprehensive Evaluation (CCE) is ......
1) to help the teacher complete the course
2) to lay emphasis on thought process and de-emphasise memorisation
3) to satisfy parents with children's progress
4) to help authorities monitor school functioning.

23. Which of the following is not the limitation of an achievement test?
1) It is good for critical examination of the content and the methods of teaching.
2) Achievement scores of students differ in similar types of achievement tests.
3) Factors like the standard of teaching completion of the curriculum may not be measured.
4) Scores in achievement tests may not be the exact measure of achievement.

24. Match the following.

A	B
i) Validity	p) The test eliminates personal bias in scoring.
ii) Reliability	q) Clear instructions are provided for answering questions.
iii) Objectivity	r) A test consistently yields the same results upon testing.
iv) Practicability	s) A test accurately measures what it's intended to measure.
v) Rubrics	t) The test is easy to administer, score and economically feasible

1) i-s, ii-p, iii-r, iv-t, v-q
2) i-p, ii-q, iii-r, iv-s, v-t
3) i-t, ii-s, iii-r, iv-q, v-p
4) i-s, ii-r, iii-p, iv-t, v-q

25. This is not an example of a proficiency test in English.
1) EAMCET
2) TOEFL
3) IELTS
4) The English Component in Civil Services Examinations

26. Evaluation includes........
A) Objectives
B) Teaching learning Strategies
C) Learning experiences
1) A only 2) B, C only
3) B only 4) A, B and C



Writer: Putnam Ravi Kumar

Answers

1-1; 2-4; 3-1; 4-3; 5-2; 6-3; 7-2; 8-1; 9-3; 10-1; 11-4; 12-1; 13-4; 14-2; 15-1; 16-2; 17-3; 18-3; 19-4; 20-2; 21-2; 22-2; 23-1; 24-4; 25-1; 26-4.

(c) eenadu

ఈనాడు ప్రతిభ
■ e-mail: pratibhadesk@eenadu.net
సోమవారం ఫిబ్రవరి 10, 2025

పేపర్ కటింగ్

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో పేపర్ కటింగ్ అనే అంశం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. దీనిలో X, Y, Z అనే మూడు పేపర్ కటింగ్ చిత్రాలు ఉంటాయి. ఇది కాగితాన్ని మడతపెట్టే క్రమాన్ని తెలుపుతుంది. చిత్రం Z అనేది పేపర్‌ను కత్తిరించిన విధానాన్ని చూపిస్తుంది. మడతను విప్పినప్పుడు వచ్చే చిత్రం ఏ విధంగా ఉంటుందనేది ఐచ్ఛికాల నుంచి అభ్యర్థి ఎంచుకోవాలి. పోటీపరీక్షార్థుల ఆలోచన సామర్థ్యాన్ని తెలుసుకునేందుకే ఈ రకమైన ప్రశ్నలు ఇస్తుంటారు. నిత్య సాధనతో ఈ విధమైన ప్రశ్నలకు సమాధానాలు సులువుగా కనిపెట్టొచ్చు.



ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

ఆలోచన సామర్థ్యంతో సరైన జవాబు తేలిక

సూచన (ప్రశ్న. 1 – 14): కింది ప్రశ్నలకు సరైన ఐచ్ఛికాలను ఎంచుకోండి.

1.



2.



3.



4.



5.



6.



7.



8.



9.



10.



11.



12.



13.



14.





రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

సమాధానాలు

1-3 2-2 3-3 4-3 5-1 6-1 7-3
8-2 9-4 10-4 11-1 12-2 13-4 14-3

లేటెస్ట్ నోటిఫికేషన్స్, కరెంట్ అఫైర్స్ మిస్ కాకుండా.. ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఈనాడు ఈప్రతిభ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి..

556 Word of the Day

Misdemeanour

Telugu meaning: అల్లరి, దుష్ప్రవర్తన

English meaning: The word misdemeanour (మిస్‌డిమీనర్) is a noun that describes a wrongdoing or a lesser criminal offence.

Synonyms: Misconduct, Violation

Antonyms: Obedience, Good Conduct

Usage: **1.** The teenager was fined for a misdemeanour after being caught vandalising public property.

2. Although it was just a minor misdemeanour, it affected his chances of getting a government job.

Latest Updates

HMFW, Tirupati

Andhra Pradesh, Department of Health, Medical and Family Welfare (HMFW), Tirupati invites vacant posts in various departments on a contract/ outsourcing basis. The total number of posts is 66. The application fee is Rs.300. Eligible candidates can apply online applications on 22 February 2025.

Project Associate Posts

Centre for Development of Advanced Computing (CDAC), Hyderabad invites applications for the Project Associate, Project Engineer, and Project Officer posts on a contract basis. The total no. of posts is 67. The last date for online applications is 20 February 2025.

SVNIRTAR, Odisha

Swami Vivekananda National Institute of Rehabilitation Training and Research (SVNIRTAR), Odisha invites applications for filling up the Prosthetist & Orthotist, Clinical Assistant, Work Supervisor, Clerk/Typist, etc posts in various departments on a contractual basis. The total number of posts is 12. Eligible candidates can apply offline before 27 February 2025.

Did You Apply..?

Today (February 10) is the last date for the following jobs/ Apprentice posts

☛ 39 Research Associate Posts in INCOIS. ***Qualification:*** PhD.

☛ Faculty Posts in NITC. ***Qualification:*** Degree/PG.

☛ Jobs in Shyamprasad Mukherjee Port. ***Qualification:*** Diploma.

☛ 120 Apprentice posts in MIDHANI.
Qualification: 10th class, ITI pass in relevant trade.

For more information and other notifications - scan QR code

THE CONSTITUTION OF INDIA PREAMBLE
EENADU
Epratibha

ఇండియన్ పాలిటీ
భారత న్యాయవ్యవస్థ - హైకోర్టు

ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానాలు ప్రధానమైనవి. మన దేశంలో ఏకీకృత న్యాయవ్యవస్థ అమల్లో ఉంది. రాష్ట్రస్థాయిలో అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు.

☛ ఈ వీడియోలో హైకోర్టు రాజ్యాంగ వివరణ, దేశంలో మొదట ఎప్పుడు - ఎవరి కాలంలో హైకోర్టులు ఏర్పాటు చేశారు, న్యాయమూర్తుల నియామకం - అర్హతలు - తొలగింపు మొదలైన అంశాలను సమగ్రంగా వివరించారు.

ఈ వీడియోను ఈనాడు ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్‌లో వీక్షించండి.. మరిన్ని వీడియోలు 'రైల్వే పరీక్షల ప్రత్యేకం' కోర్సులో అందుబాటులో ఉన్నాయి.

SSC Exams
English

Cloze Test

Directions (Q. 1 - 10): *In the following passage, some words have been deleted. Read the passage carefully and select the most appropriate option to fill in each blank.*

Inflation in India is a complex and persistent economic phenomenon that affects every segment of society, from policymakers and businesses to common citizens. As one of the fastest-growing economies in the world, India has experienced fluctuating inflation rates **......(1)......** by a mix of domestic and global factors. Inflation, in simple terms, refers to the sustained increase in the general price level of goods and services over a period of time, leading to a decrease in the purchasing power of money. In India, inflation is primarily **......(2)......** through the Consumer Price Index (CPI) and the Wholesale Price Index (WPI), with CPI inflation being the most relevant indicator as it directly impacts the cost of living. Several factors **......(3)......** to inflation in India, including supply-side constraints, demand-pull effects, government policies, international crude oil prices, and global economic trends. One of the major drivers of inflation in India is food price volatility. The country has a large agrarian economy, and any disruptions in agricultural production due to **......(4)......** monsoons, floods, droughts, or pest attacks can lead to sharp spikes in food prices. Additionally, inefficient supply chain mechanisms, high storage losses, and reliance on intermediaries further exacerbate price pressures. The rise in crude oil prices is another crucial factor influencing inflation in India, as the country imports more than 80% of its oil requirements. An increase in global crude oil prices leads to higher fuel costs, which not only raises transportation expenses but also **......(5)......** the prices of essential commodities. Moreover, fuel price hikes have a cascading effect on various sectors, from manufacturing to logistics, further intensifying inflationary pressures. The role of fiscal policies and government spending cannot be ignored when analyzing inflation in India. Expansionary fiscal policies, including higher government spending on subsidies, welfare programs, and infrastructure development, often lead to an increase in money supply, which, in turn, fuels inflation. On the other hand, excessive borrowing by the government to finance deficits can crowd out private investments and create additional inflationary pressures. The Reserve Bank of India (RBI), as the country's central bank, plays a crucial role in managing inflation through its monetary policy.

The RBI primarily uses tools like the repo rate, reverse repo rate, cash reserve ratio (CRR), and open market operations to control inflation. When inflation rises beyond acceptable levels, the RBI increases interest rates to **......(6)......** excessive money supply and reduce demand-driven inflation. However, tightening monetary policy can also slow down economic growth, making inflation control a delicate balancing act. The impact of inflation on the Indian economy is far-reaching, affecting various stakeholders in different ways. For households, high inflation erodes real income and reduces purchasing power, making essential goods and services more expensive. Low-income groups, who spend a significant portion of their earnings on food and basic necessities, are the worst affected by rising prices.



For businesses, inflation can increase input costs, leading to higher production expenses and reduced profitability. On the other hand, moderate inflation is sometimes considered beneficial for economic growth as it encourages spending and investment, preventing deflationary stagnation. India has **......(7)......** various inflationary trends in the past, from periods of hyperinflation to phases of moderate inflation and occasional deflationary pressures. The government has introduced several policy measures to tackle inflation, including minimum support prices (MSP) for farmers, buffer stock management of essential commodities, fuel price deregulation, and targeted subsidies. However, structural **......(8)......** in agriculture, infrastructure, and financial markets are necessary to ensure long-term price stability. In recent years, global factors such as the COVID-19 pandemic, supply chain disruptions, and geopolitical tensions have also influenced inflation in India. The pandemic led to supply-side shocks, labour shortages, and disruptions in production, which pushed up prices of essential goods. Similarly, the Russia-Ukraine conflict resulted in a **......(9)......** in global commodity prices, particularly crude oil and food grains, adding to inflationary concerns. Despite these challenges, India has shown resilience in managing inflation through a combination of monetary and fiscal measures. Going forward, a multi-pronged approach is required to control inflation effectively. Strengthening agricultural productivity, improving supply chain efficiencies, diversifying energy sources, enhancing financial inclusion, and maintaining fiscal discipline are crucial steps to keep inflation in check. While inflation remains an **......(10)......** aspect of economic growth, ensuring that it remains within manageable limits is essential for maintaining economic stability and improving the overall quality of life for Indian citizens.

1. A) driven B) shaken C) resisted D) unforced
2. A) excluded B) measured C) reduced D) dictated
3. A) desert B) abandon C) contribute D) lacking
4. A) predictable B) consistent C) steady D) erratic
5. A) predicts B) remains C) impacts D) stays
6. A) support B) curb C) increase D) foster
7. A) witnessed B) missed C) overlooked D) exempted
8. A) constructions B) explorations C) things D) reforms
9. A) halt B) surge C) reduction D) seize
10. A) avoidable B) preventable C) inevitable D) avertable

Scan the QR code for Key

Writer
P. Manoj Kumar, Subject Expert

(c) eenadu

ఇంజనీరింగ్ విద్యార్థులకు

ఇంటర్న్‌షిప్ అవకాశాలు

మార్కెట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో చాలా మంది ఇంజనీరింగ్ విద్యార్థులు వెనకబడుతుంటారు. ఇందుకు ప్రధాన కారణం ఉద్యోగానికి అవసరమైన స్కిల్స్‌ను నేర్చుకోకపోవడమే. అలాంటి వారికి ఇంటర్న్‌షిప్‌లు ఉపయోగపడుతుంటాయి. వీటి ద్వారా కాలేజీలో నేర్చుకున్న థియరిటికల్ నాలెడ్జిని రియల్ వరల్డ్ సిట్యువేషన్స్‌కు అప్లై చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన ఇన్‌సైట్స్ తెలుసుకోవడంలో ఇంటర్న్‌షిప్స్ ఉపయోగపడతాయి. అకడమిక్‌కి, ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన స్కిల్స్ తేడా వారికి అవగతమవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలు అందించే కొన్ని ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ ఇవి. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

నేషనల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్

కేంద్ర పునరుత్పాదన మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటర్న్‌షిప్ ఇది. ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, లా తదితర ప్రోగ్రామ్స్ చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మంత్రిత్వశాఖ అవసరాలను బట్టి సంవత్సరానికి రెండుసార్లు కూడా దీనిని ప్రకటిస్తారు. ఈ ఇంటర్న్‌షిప్ కాలపరిమితి రెండు నుంచి ఆరు నెలలు ఉంటుంది. నెలకు 15 వేల రూపాయలు ఉపకారవేతనం ఇస్తారు. https://mnre.gov.in/en/national-renewable-energy-internship-programme-2/

ఐఐటీ పాలక్కడ్ సమ్మర్ ఇంటర్న్‌షిప్

ఈ ఇంటర్న్‌షిప్ ఇంజనీరింగ్, సైన్స్, హ్యూమానిటీస్ విద్యార్థులకు ఉద్దేశించినది. మూడు లేదా నాలుగో సంవత్సరం చదువుతున్నవారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆరువారాల ఈ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన రీసెర్చ్ ట్రైనింగ్ ఉంటుంది. 12000/- స్టయిఫండ్ కూడా ఇస్తారు. 2025 మార్చి 15లోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://sun.iitpkd. ac.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

డిజిటల్ ఇండియా ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఈ ఇంటర్న్‌షిప్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందిస్తుంది. ఇంజనీరింగ్ యూజీ, పీజీ, లా చేస్తున్న విద్యార్థులు దీనికి అర్హులు. ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునే ముందు రాసిన పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. రెండు నెలల కాలవ్యవధి ఉంటుంది. నెలకు పదివేల రూపాయల స్టయిఫండ్ ఇస్తారు. www.meity.gov.in

వాద్వానీ, మద్రాస్ ఐఐటీ సమ్మర్ ఇంటర్న్‌షిప్స్

వాద్వానీ స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ అండ్ ఏఐ, మద్రాస్ ఐఐటీ కలిసి ఉమ్మడిగా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. ఇంజనీరింగ్ లేదా సైన్స్ బ్రాంచ్‌ల్లో యూజీ ప్రోగ్రామ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు, పీజీ అయితే మొదటి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధి మూడు నుంచి ఆరు నెలలు ఉంటుంది. వ్యక్తిగతంగా హాజరయి పూర్తి చేయాల్సిన ఇంటర్న్‌షిప్ ఇది. వీరికి స్టయిఫండ్ కూడా అందజేస్తారు. దరఖాస్తులు 2025 ఫిబ్రవరి 15లోపు పంపుకోవాలి.

https://wsai.iitm.ac.in/2025/01/05/wsai-summer-internships-2025/

టెక్ ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్‌కు చెందిన 'టెలికామ్ ఇంజనీరింగ్ సెంటర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోంది. ఆరు నెలలపాటు ఇది ఉంటుంది. అవసరమైన పక్షంలో దీనిని ఒక సంవత్సరం వరకు పొడిగించుకోవచ్చు. ఇంటర్న్‌షిప్‌లో మొత్తం రూ.15,000స్టయిఫండ్ ఇస్తారు. https://www.myscheme.gov.in/schemes/tecis#details

---

దిక్సూచి
DIKSUCHI

BITSAT 2025 నోటిఫికేషన్ విడుదల

దేశంలోని ఇంజనీరింగ్ విద్యను అందించే ప్రతిష్ఠాత్మక సంస్థలో 'బిర్లా ఇన్‌స్టిట్యూట్' (బిట్స్) ఒకటి. పిలానీ, గోవా, హైదరాబాద్‌ల్లో బిట్స్‌కు క్యాంపస్‌లు ఉన్నాయి. ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థులు జేఈఈ, తమ రాష్ట్రాల ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లతో పాటుగా దీనిని కూడా రాస్తుంటారు.

బిట్స్ ఎంట్రెన్స్ స్కోరుకు కూడా కొన్ని ఇతర సంస్థలు అడ్మిషన్ ఇస్తున్నాయి. ఇంటర్మీడియేట్ అర్హతతో బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరవచ్చు. ఇంటర్ సబ్జెక్టులతోపాటు ఈ ఎంట్రెన్స్‌లో ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్‌ల్లో కూడా ప్రశ్నలు అడుగుతారు. జేఈఈ స్థాయిలో అత్యుత్తమంగా స్కోరు సాధించిన విద్యార్థులకు ఇక్కడ సీటు లభిస్తుంది. 390కి కనీసం 240 మార్కులు సాధించిన వారికి సీటు దొరికే అవకాశం ఉంది. బీఫార్మసీకి అయితే ఇంకా తక్కువ స్కోరుకు కూడా దొరుకుతుంది.

బిట్స్ ఎంట్రెన్స్ 2025 పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుంది.

- సెషన్-1 ఎంట్రెన్స్ 2025 మే 26 తేదీ నుంచి 30వ తేదీ వరకు.
- సెషన్-2 ఎంట్రెన్స్ 2025 జూన్ 22 తేదీ నుంచి 26 తేదీ వరకు.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 ఏప్రిల్ 18

ఆసక్తి గల అభ్యర్థులు రెండు సెషన్లు లేదా ఒక్క సెషన్ అయినా రాయవచ్చు. రెండింటిలో అత్యుత్తమంగా సాధించిన మార్కులనే ఫైనల్ స్కోరుగా పరిగణనలోకి తీసుకుంటారు.

కోర్సులు:

బీఈ: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ సస్టయినబిలిటీ.

బీఫార్మసీ:

ఎమ్మెస్సీ: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయలాజికల్ సైన్సెస్, ఎకనామిక్స్, సెమీ కండక్టర్ అండ్ నానో సైన్స్, జనరల్ స్టడీస్.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం,

సబ్జెక్టులు: ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి.
పార్ట్-1: ఫిజిక్స్ 30,
పార్ట్-2: కెమిస్ట్రీ 30,
పార్ట్ 3
ఏ. ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ 10,
బి. లాజికల్ రీజనింగ్ 20.
పార్ట్-4: మేథ్స్/బయాలజీ(బీఫార్మసీ కోసం) 40 ప్రశ్నలు ఉంటాయి.



పరీక్ష విధానం: పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొత్తం 130 ప్రశ్నలను మూడు గంటల్లో పూర్తిచేయాలి. అయితే సమయానికి సంబంధించి సెక్షన్ల వారీ నిబంధనలు లేవు. కానీ నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతీ సరైన జవాబుకు మూడు మార్కులు, తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

SCHOLARSHIP ALERT

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less) ***Last Date:*** 15-02-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/TCPS27

JK Tyre Shiksha Sarthi

Description: JK Tyre & Industries Pri vate Limited invites applications from the daughters of heavy vehicle drivers who are pursuing technical or non-technical undergraduate or diploma courses and reside in select locations.
Eligibility: Female students who are daughters of heavy vehicle drivers and pursuing technical or non-technical undergraduate or diploma courses are eligible to apply. Students must have received a minimum of 55% marks in their previous academic year. The annual family income of applicants must be less than or equal to INR 5,00,000. Applicants must be residents of Rajasthan, Madhya Pradesh, Uttara khand, Karnataka, or Tamil Nadu.
Prizes & Rewards: One-time scholarship:
Technical Undergraduate Courses: INR 25,000
Non-Technical Undergraduate Courses: INR 15,000 ***Diploma Courses:*** INR 15,000
Last Date to Apply: 15-02-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/JKTS1

Charpak Bachelor's

Description: Charpak Bachelor's Scholarship 2025 is an opportunity offered by the French Government to Indian students who wish to pursue a full-time undergraduate degree in one of the institutions in France.
Eligibility: Open for Indian nationals or OCI card holders who are 23 years old or younger at the time of application. Applicants must have completed secondary school in India and have applied for a bachelor's degree program starting on 1st September 2025. Students must have never previously studied at an educational institution in France.
Prizes & Rewards: The scholarship offers a monthly living allowance of 860 euros and other benefits.
Last Date to Apply: 28-02-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/CBSS3

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విజయ్ సినిమాలో సంజయ్‌దత్?

విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారనే వార్త టాలీవుడ్‌లో ప్రచారమవుతోంది. అంతేకాదు 'ద మమ్మీ' యాక్టర్ అర్నాల్డ్ వోస్లూ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నాడనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలపై మేకర్స్ ఇప్పటివరకూ స్పందించలేదు. కాగా, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఓ సరికొత్త పాత్రలో కనిపించనున్నాడట. 1854-78 మధ్య కాలంలో జరిగే కథ కాబట్టి, సినిమాలో చాలా వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తోంది. చిత్ర షూటింగ్ ఈనెల మూడో వారంలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. మొదటి షెడ్యూల్‌లో విజయ్ దేవరకొండ ఎంట్రీ సీన్‌ను చిత్రీకరించనున్నట్లు టాక్. నాని హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో వచ్చిన 'శ్యామ్ సింగరాయ్' చిత్రం విజయవంతమైంది. దీంతో విజయ్ దేవరకొండ సినిమాపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విజయ్ తన తల్లితో కలసి హాజరయ్యారు. వారు త్రివేణి సంగమంలో ఆదివారం పుణ్యస్నానాలు చేసారు.

త్వరలో వీడీ12 టైటిల్ టీజర్

విజయ్ దేవరకొండ హీరోగా గౌతం తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న వీడీ12(వర్కింగ్ టైటిల్) టైటిల్ టీజర్ ఈనెలలోనే వెలువడనున్నట్లు వార్తలొస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా హిందీ టీజర్‌కు రణ్‌బీర్ కపూర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. అదేవిధంగా తెలుగుకు ఎన్టీఆర్, తమిళ్‌కు ధనుష్ వాయిస్ ఓవర్ ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

అజిత్ కారుకు మళ్లీ ప్రమాదం

పోర్చుగల్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతున్న హీరో అజిత్ కారు మరోమారు ప్రమాదానికి గురైంది. ఈ విషయాన్ని అజిత్ ఆదివారం వెల్లడించారు. 'నా అభిమానులు మాత్రమే కాకుండా, నేను ఏం చేయబోతున్నానో తెలుసుకునేందుకు అమితాసక్తితో ఎదురు చూస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ రోజు కూడా శిక్షణలో నా కారు స్వల్ప ప్రమాదానికి గురైంది. దాన్ని మెకానిక్ బృందం రిపేర్ చేసింది' అని ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కాగా, ఇటీవల దుబాయ్ వేదికగా జరిగిన 24హెచ్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతుండగా, అజిత్ కారు ప్రమాదానికి గురైన విషయం తెల్సిందే. దీంతో ఆ పోటీల నుంచి అజిత్ తప్పుకున్నారు. అయినప్పటికీ అజిత్ కుమార్ రేసింగ్ టీం ఆ పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. దీంతో అజిత్ కుమార్‌కు 'లిబర్టీ ఆఫ్ ది గేమ్' అనే అవార్డును కూడా ప్రదానం చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

నాటి ప్రజారాజ్యమే నేటి జనసేన

- తొలిసారి 'జై జనసేన' అంటూ నినదించిన చిరంజీవి
- ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు
- 'పుష్ప 2' ఘన విజయాన్ని స్వాగతిస్తున్నా
- ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్

"ప్రజారాజ్యం పార్టీ జనసేనగా రూపాంతరం చెందింది. అందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు అంతా జనసేనే. జై జనసేన' అంటూ నినదించి మెగా అభిమానులను ఉత్సాహపరిచారు చిరంజీవి. విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన 'లైలా' చిత్రం ఈనెల 14 న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపైన ఉన్న విష్వక్‌సేన్ తండ్రి కరాటే రాజుతో తన అనుబంధం గురించి ప్రస్తావిస్తూ చిరంజీవి పై వ్యాఖ్యలు చేశారు. 'మేం ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు రాజకీయంగా ఎదగాలనే తన కోరికను కరాటే రాజు నా దగ్గర ప్రస్తావించాడు. దాంతో ప్రజారాజ్యం తరపున అవకాశం ఇచ్చాం. కానీ అప్పట్లో పరిస్థితులు ఇంకోలా ఉన్నాయి' అని చిరంజీవి చెప్పారు. అలాగే మేనల్లుడు అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' విజయం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. "పుష్ప 2' పెద్ద హిట్టయింది. అందుకు నేను గర్విస్తున్నా. ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు. కానీ ఒక సినిమా బాగా ఆడితే దాన్ని ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరూ హర్షించాలి' అన్నారు.

విష్వక్‌ను బాలకృష్ణ మనిషి అన్నారు

"నా బాల్యంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ అభిమానులు రక్తం వచ్చేలా కొట్టుకోవడం చూశాను. ఆ సంఘటన ప్రభావంతో నేను సినిమాల్లోకి వచ్చాక మా హీరోల మధ్య సఖ్యత కోసం కృషి చేశాను. 'విష్వక్సేన్ ఫంక్షన్‌కు వెళ్తున్నావా? అతను మన మనిషి కాదు, బాలకృష్ణ మనిషి. అప్పుడప్పుడూ 'తారక్' అని కూడా అంటాడు. ఆ కార్యక్రమానికి వెళ్లొద్దు" అని కొందరు నాతో అన్నారు. మనుషులన్నాక వేరేవాళ్ల మీద ప్రేమ, అభిమానం ఉండకూడదా? అభిమానం పర్సనల్. జిహ్వకో రుచి అన్నట్లు యాక్టర్‌గా కొంతమంది కొందరికి కనెక్ట్ అవుతారు. దాన్ని మనమంతా అంగీకరించాలి. రామ్ చరణ్‌కు సూర్య అంటే చాలా ఇష్టం. అంతమాత్రాన వాడితో నేను కలసి ఉండకూడదా? ఇక నుంచైనా మా గురించి ఆ కాంపౌండ్, ఈ కాంపౌండ్ అంటూ మాట్లాడరనే అనుకుంటున్నాను. ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్' అని చెప్పారు. 'లైలా' సినిమాతో విష్వక్‌సేన్, దర్శకుడు రామ్ నారాయణ్, నిర్మాత సాహూ గారపాటి పెద్ద విజయాన్ని అందుకోవాలని చిరంజీవి ఆకాంక్షించారు. 'ఇది నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. జనాల్ని నవ్వించాలని డిసైడ్ అయ్యాను ' అని విష్వక్‌సేన్ అన్నారు. లైలా లాంటి పాత్ర చేయడానికి విష్వక్ తప్ప మరో హీరో ముందుకురాడు అని సాహూ గారపాటి అన్నారు. విష్వక్ ఈ సినిమాను అంగీకరించడమే నాకు పెద్ద బహుమతి అని . రామ్ నారాయణ్ చెప్పారు.

పుష్ప జీవితాంతం గుర్తుంటుంది

అల్లు అర్జున్

"పుష్ప' సినీ ప్రయాణంలో ఐదు నిమిషాల నుంచి ఐదేండ్ల వరకూ భాగమైన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు. ఈ సక్సెస్ క్రెడిట్ దర్శకుడు సుకుమార్‌తో పాటు సినిమా కోసం కష్టపడి పనిచేసిన టీమ్‌కు దక్కుతుంది. ఆయన సీన్ చెప్తుంటే పిచ్చెక్కిపోతుంది. ఈ సినిమా కోసం వెచ్చించిన ఐదేళ్లు నాకెంతో ప్రత్యేకం. ఈ సినిమా అందరికీ జీవితాంతం గుర్తుండిపోతుంది. 'పుష్ప 3' ఓ అద్భుతం" అని 'పుష్ప 2' థ్యాంక్స్ మీట్‌లో అల్లు అర్జున్ అన్నారు. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ "మైత్రీ మూవీస్ సీఈఓ చెర్రీ సలహాతోనే 'పుష్ప' మూడు భాగాలుగా తయారైంది. ఈ విజయం మైత్రీ మూవీ మేకర్స్‌కి అంకితం చేస్తున్నాను. ఈ ప్రపంచంలో నన్ను ఎక్కువగా నమ్మే వ్యక్తి అల్లు అర్జున్" అని చెప్పారు. "ఈ సినిమా విజయం ఎంతో మంది కష్టంతో వచ్చింది. ఈ విజయానికి కారణమైన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు" అని నిర్మాత యలమంచిలి రవిశంకర్ అన్నారు. "సినిమా అంచనాలను మించి కలెక్ట్ చేస్తుందని అనుకున్నాం కానీ.. ఇంత ఘనవిజయం సాధిస్తుందని అనుకోలేదు" అని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు.

'లూసిఫర్ 2'లో హాలీవుడ్ యాక్టర్లు

మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్ 2 ఈ ఎంపురాన్'. 'లూసిఫర్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. మార్చి 27న పాన్ ఇండియా స్థాయిలో మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఆశిర్వాద్ సినిమాస్, లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మంజు వారియర్, టొవినో థామస్, ఇంద్రజిత్ సుకుమారన్, జైస్ జోస్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ జైస్ జోస్ పోషించిన జేవియర్ పాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. జైస్ జోస్ ఈ మూవీ చిత్రీకరణ అనుభవాలను వీడియో ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. కాగా, ఈ చిత్రం గురించి ఓ ఆసక్తికర అప్డేట్ వైరల్ అవుతోంది. ఈ సినిమాలో కొందరు ఇంటర్నేషనల్ యాక్టర్స్ నటిస్తున్నట్టుగా గతంలో వార్తలు వెలువడ్డాయి. అయితే ఇప్పుడు యూకేకు చెందిన ఇద్దరు యాక్షన్ స్టార్స్ నటించారనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హాలీవుడ్‌కు చెందిన ఓ ఏజెన్సీ ఈ సమాచారాన్ని వెల్లడించింది. కొరియన్ అమెరికన్ నటులు రిక్ యూన్, ఆండ్రియా టి వాడర్ కూడా ఈ సినిమాలో నటించనున్నట్లు ఆ ఏజెన్సీ తొలుత సోషల్ మీడియాలో షేర్ చేసి ఆ తర్వాత డిలీట్ చేసినట్లు మాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

ఆ సినిమాను అంగీకరించారా?

హీరోయిన్ శ్రీలీల వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. ఇప్పటికే పవన్‌కల్యాణ్‌తో 'ఉస్తాద్ భగత్‌సింగ్', రవితేజతో 'మాస్ జాతర', నితిన్‌తో 'రాబిన్‌హుడ్', శివకార్తికేయన్‌తో 'పరాశక్తి' సినిమాల్లో నటిస్తున్నారీ బ్యూటీ. అయితే, ఆమెకు మరో అసక్తికరమైన ప్రాజెక్ట్‌లో నటించేందుకు ఆఫర్ వచ్చిందని సమాచారం. 2023లో విడుదలై విజయవంతమైన 'మంగళవారం' సినిమా సీక్వెల్‌లో ఆమె నటిస్తున్నట్లు టాక్. తొలి భాగంలో కథానాయికగా నటించిన పాయల్ రాజ్‌పుత్ ఈ చిత్రం సీక్వెల్‌లో నటించట్లేదని తెలుస్తోంది. ఆమె స్థానంలో నటించేందుకు శ్రీలీలకు ఆఫర్ వచ్చిందట. ఇందుకు ఆమె అంగీకరించారా లేదా తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకూ ఆగాల్సిందే. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు దర్శకుడు అజయ్ భూపతి. ఈ ఏడాదిలోనే సీక్వెల్‌ను పట్టాలెక్కించే ఆలోచనలో ఉన్నారు మేకర్స్.

నటుడిగా నా స్థాయిని పెంచుతుంది

- రాగ్ మయూర్

'సినిమా బండి, కీడా కోలా' తదితర చిత్రాలతో నటుడిగా రాగ్ మయూర్ చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవలే 'విడుదలైన గాంధీ తాత చెట్టు' చిత్రంలో విలన్‌గా తన నటనకు మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నారు. ప్రస్తుతం ఆయన 'గరివిడి లక్ష్మి' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా రాగ్ మయూర్ మాట్లాడుతూ 'ఫహద్ ఫాజిల్, రాజ్‌కుమార్ రావు లాంటి నటులు నాకు ఆదర్శం. వారిలా ముందు మంచి నటుడిగా నిరూపించుకొని ఆ తర్వాత హీరోగా ఎదగాలనేది నా ఆలోచన. అందుకే కెరీర్ ఆరంభం నుంచి ఎక్కువగా నటనకు ఆస్కారమున్న పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ వస్తున్నాను. నేను హీరోగా నటిస్తున్న 'గరివిడి లక్ష్మి' చిత్రం గ్రామీణ నేపథ్యమున్న ప్రేమకథతో తెరకెక్కుతోంది. నటుడిగా ఇది నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమవుతుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో జరిగే కథ ఇది. అక్కడి వేషభాషలను అవగాహన చేసుకునేందుకు కొన్నాళ్లు అక్కడే గడిపాను. 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నా పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి చక్కని ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది' అని చెప్పారు.

ముగిసిన యశోద హాస్పిటల్స్ బ్రాంకస్ 2025 సదస్సు

హైదరాబాద్, వెలుగు : ‘బ్రాంకస్ 2025’ పేరుతో అంతర్జాతీయ పల్మొనాలజీ సదస్సు, లైవ్ వర్క్ షాప్‌ను యశోద హాస్పిటల్స్ నిర్వహించింది. ఇందులో 60 మందికి పైగా అంతర్జాతీయ అధ్యాపకులు, 150మందికి పైగా జాతీయ అధ్యాపకులు, 3,000 కంటే ఎక్కువ మంది పల్మొనాలజీ వైద్యులు ఇంటర్వెన్షనల్ పల్మొనాలజీ సదస్సులో పాల్గొన్నారు. వరుసగా నాలుగోసారి యశోద గ్రూప్ ఈ సదస్సును సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించింది. రెండు రోజుల పాటు జరిగిన సదస్సు, లైవ్ వర్క్ షాప్‌లో రెండో రోజు ముఖ్య అతిథిగా యశోద గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ జీఎస్ రావు పాల్గొన్నారు. ఊపిరితిత్తుల వైద్య విభాగంలో, వైద్య విజ్ఞాన శాస్త్రంలో నెలకొన్న సరికొత్త ఆవిష్కరణలపై తాజా సదస్సులో చర్చించారు.

6 రెట్లు పెరిగిన ఓయో లాభం

న్యూఢిల్లీ: ఓయోకి కిందటేడాది డిసెంబర్‌తో ముగిసిన క్వార్టర్ (క్యూ3) లో రూ.166 కోట్ల నికర లాభం వచ్చింది. 2023 డిసెంబర్ క్వార్టర్‌లో వచ్చిన రూ.25 కోట్ల ప్రాఫిట్‌తో పోలిస్తే ఇది ఆరు రెట్ల కంటే ఎక్కువ. కంపెనీ రెవెన్యూ 31 శాతం వృద్ధి చెంది రూ.1,296 కోట్ల నుంచి రూ.1,695 కోట్లకు చేరుకుంది. క్యూ3లో రూ.3,341 కోట్ల హోటల్ బుకింగ్స్‌ను ఓయో సాధించింది. 2023 డిసెంబర్ క్వార్టర్‌లో రికార్డ్ అయిన రూ.2,510 కోట్ల బుకింగ్స్‌తో పోలిస్తే 33 శాతం వృద్ధి నమోదు చేసింది. తాజాగా కొనుగోలు చేసిన అమెరికన్ కంపెనీ జీ6 రిజల్ట్స్ , ఓయో ఫలితాల్లో కలిసి లేవు. కిందటేడాది ఏప్రిల్ - డిసెంబర్‌లో ఓయోకి రూ. 457 కోట్ల నికర లాభం వచ్చింది. అంతకు ముందు ఏడాది ఇదే టైమ్‌లో కంపెనీ రూ.111 కోట్లు నష్టపోయింది.

ఇండియాలో ఇండ్ల రేట్లు

ఇప్పట్లో తగ్గవు

- యూఎస్ కంటే మన జీడీపీ పెర్‌క్యాపిటా 40 రెట్లు తక్కువ..అయినా ఇండ్ల ధరల్లో పోటాపోటీ
- ధరలను కంట్రోల్ చేస్తున్న ప్రైవేట్ డెవలపర్లు..
- వీరు చౌకగా అమ్మే ఛాన్సే లేదు: విస్డమ్ హ్యాచ్ ఫౌండర్ అక్షత్ శ్రీవాస్తవ

న్యూఢిల్లీ

ఇండియాలో ఇండ్ల ధరలు ఇప్పటిలో తగ్గవని చెబుతూనే, ఎందుకు తగ్గవో విస్డమ్ హ్యాచ్ ఫౌండర్ అక్షత్ శ్రీవాస్తవ వివరించారు. చాలా ఇండ్లను ప్రైవేట్ డెవలపర్లు నిర్మిస్తున్నారని, ధరలు తగ్గకపోవడానికి ఇదొక కారణమని అన్నారు. ‘గతంలో అయితే ల్యాండ్ కొని, సొంతంగా ఇల్లు కట్టుకునేవారు. ఇప్పుడు రెడీ మేడ్ ఇల్లు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజల ఆలోచనా విధానాలు వేగంగా మారుతున్నాయి. సమస్యేంటంటే ప్రైవేట్ డెవలపర్లు ఇటువంటి ఇళ్లను చౌకగా అమ్మరు’ అని శ్రీవాస్తవ వివరించారు. గ్లోబల్ సంక్షోభాలు ఎదురైనప్పుడు కూడా ఇండ్ల ధరలు తగ్గకుండా ప్రైవేట్ డెవలపర్లు చూసుకోగలిగారని అన్నారు. ‘రేట్లు తగ్గుతాయని అనిపిస్తే వీళ్లు ఏళ్ల పాటు ఎదురు చూస్తారు. ప్రాజెక్ట్‌లను వాయిదా వేస్తారు. ఆలస్యంగా ఇండ్లను హ్యాండోవర్ చేస్తారు. అది కూడా కుదరకపోతే తమ ప్రాజెక్ట్‌లను పెద్ద ప్రైవేట్ ఈక్విటీ కంపెనీలకు షేర్లు+క్యాష్ డీల్స్‌లో అమ్మేస్తారు. అంతేకాని చౌకగా మాత్రం మీకు అమ్మరు’ అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇండియా జీడీపీ పెర్ క్యాపిటల్ 2,200 డాలర్ల దగ్గర ఉందని, యూఎస్‌తో పోలిస్తే 40 రెట్లు తక్కువని అన్నారు. కానీ, ఇండియాలో ఇండ్ల ధరలు యూఎస్‌లోని చాలా సిటీల్లో కంటే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగుతాయా? అనేది కాలమే తెల్చి చెప్పాలని పేర్కొన్నారు.

భారీగా పెరిగిన ఇండ్ల ధరలు..

ఇండియాలోని టాప్ సిటీలలో ఇండ్ల ధరలు చుక్కలనంటుతున్నాయి. ముంబైలో ఒక్కో చదరపు అడుగు ధర రూ.15 వేల నుంచి 25 వేల మధ్య ఉంది. అందుబాటులో ల్యాండ్ లేకపోవడం, ముంబై కోస్టల్ రోడ్డు వంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌లు, ధనవంతులు, బాలీవుడ్ స్టార్ల నుంచి డిమాండ్ ఉండడంతో ముంబైలో ధరలు భారీగా పెరుగుతున్నాయి. సిటీకి దగ్గరలోని పన్వెల్‌లో కూడా ఇండ్ల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రావడంతో పాటు లగ్జరీ ఇళ్లకు డిమాండ్ పెరగడంతో ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో రేట్లు కిందటి నెలలో 49 శాతం (ఏడాది ప్రాతిపదికన) పెరిగాయి. ఐటీ కంపెనీలు వస్తుండడంతో బెంగళూరు, హైదరాబాద్‌లలో కూడా ఇండ్ల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. చదరపు అడుగు ధర రూ.7 వేల నుంచి రూ.12 వేల మధ్య ఉంది. ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవే వలన ఎన్‌సీఆర్ శివార్లలోనూ ఇండ్ల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. డెవలప్‌మెంట్ వలన ఇళ్ల రేట్లు పెరుగుతున్నా, ప్రైవేట్ డెవలపర్లు ధరలను కంట్రోల్ చేస్తుండడంతో రేట్లు తగ్గే అవకాశాలు తక్కువగా ఉన్నాయని శ్రీవాస్తవ చెబుతున్నారు.

ఇన్‌ఫ్లేషన్ నెంబర్లపై ఈ వారం మార్కెట్ ఫోకస్



న్యూఢిల్లీ: ఈ వారం మార్కెట్ డైరెక్షన్‌ను ఇండియా, యూఎస్ ఇన్‌ఫ్లేషన్ నెంబర్లు నిర్ణయించనున్నాయి. దీంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల (ఎఫ్‌ఐఐల) కదలికలు, గ్లోబల్ ట్రెండ్స్‌పై ట్రేడర్లు ఫోకస్ పెట్టాలని ఎనలిస్టులు సలహా ఇస్తున్నారు. డాలర్ మారకంలో రూపాయి ట్రెండ్, కంపెనీల క్వార్టర్లీ రిజల్ట్స్ మార్కెట్‌పై ప్రభావం చూపనున్నాయి. ఈ నెల 12న యూఎస్ ఇన్‌ఫ్లేషన్ డేటా వెలువడనుండగా, అదే రోజు ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ స్పీచ్ కూడా ఉంది. ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై పావెల్ సంకేతాలు ఇవ్వొచ్చు. ఈ నెల 12న ఇండియా ఇన్‌ఫ్లేషన్ డేటా కూడా విడుదల కానుంది. 13న యూకే జీడీపీ డేటా, 14న యూఎస్ రిటైల్ సేల్స్ డేటా వెలువడనున్నాయి. మరోవైపు ఐషర్ మోటార్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, వొడాఫోన్ ఐడియా, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) తమ డిసెంబర్ క్వార్టర్ రిజల్ట్స్‌ను ఈ వారం ప్రకటించనున్నాయి. ఢిల్లీలో బీజేపీ గెలిచింది. ఈ ప్రభావం సోమవారం మార్కెట్‌లో కనిపించొచ్చని ఎనలిస్టులు చెబుతున్నారు. బడ్జెట్, ఆర్‌బీఐ రేట్ల కోత, ఢిల్లీలో బీజేపీ గెలుపుతో మార్కెట్ సెంటిమెంట్ నెమ్మదిగా మెరుగుపడుతుందని అంచనా వేశారు. కిందటి వారం సెన్సెక్స్ 354 పాయింట్లు(0.45 శాతం), నిఫ్టీ 78 పాయింట్లు పెరిగింది.

సోనమ్ కపూర్ బావ ఎన్‌జీఓకి

రూ.6.5 కోట్ల యూఎస్ సాయం

న్యూఢిల్లీ: సోనమ్ కపూర్ బావ అనంత్ అహుజాకి సంబంధం ఉన్న ఓ ఎన్‌జీఓ యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్‌ఏఐడీ) నుంచి రూ. 6.5 కోట్ల సాయం పొందింది. ఇండియాలోని వలస కూలీల ఒంటరితనాన్ని తగ్గించే ప్రాజెక్ట్ కోసం ఈ గ్రాంట్ అందుకుంది. యూఎస్‌ఏఐడీ ఈ ఎన్‌జీఓకి 7,50,000 డాలర్ల గ్రాంట్‌ను ఇచ్చిందని రిపబ్లికన్ ప్రతినిధి నాన్సీ మేస్ యూఎస్ పార్లమెంట్‌లో పేర్కొన్నారు. యూఎస్‌ఏఐడీ ప్రపంచంలోని అందరి బాధలను తీర్చడంలో బిజీగా ఉందని, వీటి వలన అమెరికాకు ఎటువంటి లాభం లేదని కామెంట్ చేశారు.

సౌదీ దిరియాహ్‌కు ఇండియన్

కంపెనీలు క్యూ

న్యూఢిల్లీ: సౌదీ అరేబియా చేపడుతున్న మెగా ప్రాజెక్ట్ దిరియాహ్ (సిటీ ఆఫ్ ఎర్త్) లో భాగస్వామ్యం అయ్యేందుకు ఇండియన్ కంపెనీలు క్యూ కడుతున్నాయి. సుమారు 63.2 బిలియన్ డాలర్ల (రూ.5.50 లక్షల కోట్ల) తో రియాద్‌కు దగ్గరలో ఈ ప్రాజెక్ట్‌ను కడుతున్నారు. ఇప్పటికే టాటా, ఓబ్రాయ్ హోటల్స్, తాజ్ హోటల్స్ ఆసక్తి చూపించాయని దిరియాహ్ ప్రాజెక్ట్ సీఈఓ జెర్రీ ఇంజెరిలో పేర్కొన్నారు. మరిన్ని కంపెనీలు ఇన్వెస్ట్ చేస్తాయని చెప్పారు. దిరియాహ్ ప్రాజెక్ట్‌లో భాగంగా లక్ష రెసిడెన్షియల్ యూనిట్లను, మరో లక్ష ఆఫీస్ స్పేస్‌లను నిర్మిస్తారు. అంతేకాకుండా 40 లగ్జరీ హోటల్స్, వెయ్యికి పైగా షాప్‌లు, 150 కి పైగా రెస్టారెంట్లు, కేఫ్‌లు, ఒక ఒపేరా హౌస్, మ్యూజియం, గోల్ఫ్ కోర్స్, 20 వేల మంది సిట్టింగ్ కెపాసిటీ ఉండే గ్రౌండ్ వంటివి దిరియాహ్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్ మధ్యలో యునెస్కో హెరిటేజ్ సైట్ ఎట్-టురైఫ్ (ఆధునిక సౌదీ కింగ్‌డమ్ పుట్టిన చోటు) ఉంటుంది. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 250వ హోటల్‌ను దిరియాహ్‌లో తాజ్ హోటల్ ఓపెన్ చేయనుందని, గుర్రపు స్వారీ నేర్పించే సెంటర్‌ను ఓబ్రాయ్ హోటల్ డెవలప్ చేయనుంది. ఇండియన్ టూరిస్ట్‌లను ఆకర్షించడానికి సౌదీ ఆరేబియా భారీగా ఇన్వెస్ట్ చేస్తోంది. కిందటేడాది 15 లక్షల మంది ఇండియన్లు సౌదీలో పర్యటించారని అంచనా.

బీఎస్ఎన్ఎల్‌కు మరో రూ.6 వేల కోట్లు!

న్యూఢిల్లీ: 4జీ సర్వీస్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వ రంగ కంపెనీ బీఎస్ఎన్ఎల్‌కు మరో రూ.6 వేల కోట్లు కేటాయించాలని కేంద్రం భావిస్తోంది. ముంబై, ఢిల్లీలో సర్వీస్‌లు అందిస్తున్న మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్) బీఎస్ఎన్ఎల్‌తో పదేళ్ల అగ్రిమెంట్ కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎంటీఎన్ఎల్ 4జీ సర్వీస్‌ల విస్తరణలో బీఎస్ఎన్ఎల్ సాయపడుతుంది. బీఎస్ఎన్ఎల్‌కు అదనంగా రూ.6 వేల కోట్లు కేటాయించడంపై కిందటి వారం జరిగిన కేబినెట్ మీటింగ్‌లో చర్చించారని, కానీ అధికారికంగా ప్రకటించలేదని సంబంధిత వ్యక్తులు వెల్లడించారు. ఈ టెలికం కంపెనీ లక్ష 4జీ సైట్లను డెవలప్ చేయాలని చూస్తోంది. ఇందుకు సుమారు రూ.19 వేల కోట్ల అవసరమని అంచనా. ఇప్పటివరకు రూ.13 వేల కోట్లను కంపెనీ ఖర్చు చేసింది. మిగిలిన రూ.6 వేల కోట్ల కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్ (డాట్) వద్ద కంపెనీ ప్రపోజల్ పెట్టిందని, ఈ ప్రపోజల్‌ను కేబినెట్‌కు డాట్ పంపిందని సంబంధిత వ్యక్తులు పేర్కొన్నారు. కాగా, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌ను డెవలప్ చేసేందుకు 2019 నుంచి ఇప్పటివరకు మూడు ప్యాకేజీల కింద రూ.3.22 లక్షల కోట్లను కేంద్రం కేటాయించింది.

విప్లవాత్మక ఉద్యమం

భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవ పార్టీలు, విప్లవకారులు కీలక పాత్ర పోషించారు. రహస్య సంఘాలను స్థాపించారు. వార్తా పత్రికలు, పుస్తకాలు, కరపత్రాలు ప్రచురించారు. కరువు, అంటువ్యాధుల సమయాల్లో సామాజిక సేవ చేశారు. నిరంకుశంగా వ్యవహరించే బ్రిటీష్ అధికారులను హతమార్చారు. ఆయుధ సమీకరణ చేసి, బలప్రయోగంతోనే బ్రిటీష్ వారిని ఎదుర్కొన్నారు. అలాంటి విప్లవ సంస్థలు, విప్లవకారుల గురించి తెలుసుకుందాం.

అనుశీలన్ సమితి

ఈ సంస్థ బెంగాల్‌లో మొదటి రహస్య సంఘం. 1902, మార్చి 24న కలకత్తా కేంద్రంగా బారిస్టర్‌గా పనిచేస్తున్న ప్రమోద మిట్టర్ సహకారంతో సతీష్ చంద్ర బసు అనే విద్యార్థి నాయకుడు స్థాపించాడు. విప్లవ కార్యక్రమాలను నిర్వహించి విప్లవ జాతీయవాదాన్ని ప్రచారం చేయడం దీని లక్ష్యంగా ఉండేది. భారతదేశంలో అఖాడాలతో అత్యధిక శాఖలు కలిగిన రహస్య సంఘంగా గుర్తింపు పొందింది. ఈ సంస్థ స్థాపనలో బరీంద్రనాథ్ ఘోష్, ప్రమోద మిట్టర్, భూపేంద్రనాథ్ దత్తా, సరళాదేవి ముఖ్య పాత్ర పోషించారు. ఈ సంస్థ ఉపాధ్యక్షులుగా అరబిందో ఘోష్, సి.ఆర్.దాస్ పనిచేశారు. అనుశీలన్ సమితి పుస్తకాలు భవాని మందిర్(1905), వర్తమాన్ రణనీతి(1907). వీటిల్లో వర్తమాన్ రణనీతి మిలటరీ శిక్షణ, గెరిల్లా యుద్ధ పోరాటాల గురించి వివరించింది. ఈ సంస్థ పత్రికలు సంధ్య, యుగాంతర్. యుగాంతర్ అనే పదానికి అర్థం మార్పు. ఇది వార పత్రిక. ఈ పత్రికలో బరీంద్రకుమార్ ఘోష్ నీ జీవితాన్ని ఇస్తూ మరో జీవితాన్ని ముందుకు తీసుకెళ్లు అని నినాదం ఇచ్చాడు. 1907లో తూర్పు బెంగాల్, అసోం మొదటి లెఫ్టినెంట్ గవర్నర్ అయిన ఫుల్లర్‌ను హత్య చేయడానికి ప్రఫుల్ల చాకీని ఉపయోగించి బరీంద్రకుమార్ ఘోష్, భూపేంద్రనాథ్ ఘోష్ విఫలమయ్యారు.

డక్కా అనుశీలన్ సమితి

1902లో అనుశీలన్ సమితికి అనుబంధంగా డక్కాలో ఈ సంస్థను పులిన్ బిహారిదాస్ స్థాపించాడు. ఈయనకు డక్కా కుట్ర కేసుతో సంబంధం ఉన్నది. 1929లో భంగీయ భ్యయం సమితిని స్థాపించి యువకులకు కర్రసాము, కుస్తీల్లో శిక్షణ ఇచ్చాడు.

యుగాంతర్ సమితి

ఈ సంస్థను కలకత్తా కేంద్రంగా 1906లో బరీంద్రకుమార్ ఘోష్ స్థాపించాడు. అరబిందో ఘోష్, రాజా సుభోద్ మాలిక్, భూపేంద్రనాథ్ దత్తాలు ఇతర నాయకులు. ఆలీపూర్ కుట్రకేసు తర్వాత 1910లో జతిన్ ముఖర్జీ యుగాంతర్ సమితికి నాయకత్వం వహించి 1914 నాటికి బలమైన సంస్థగా నిర్మించాడు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఈ పార్టీ జర్మనీ నుంచి ఆయుధాలను దిగుమతి చేసుకోవాలని ప్రణాళిక రచించింది. ఇందుకోసం జతిన్ రాస్ బిహారీ బోస్‌ను భారత్‌పై సరిహద్దుకు నాయకత్వం వహించాలని కోరగా ఆ ప్రణాళిక లీక్ అయింది. దీనినే జిమ్మర్‌మాన్ ప్రణాళిక లేదా జర్మన్ ప్లాట్ అంటారు. దీని ఫలితంగా జతిన్ మరణించాడు. 1938, సెప్టెంబర్ 9న యుగాంతర్ సమితి ఇండియన్ నేషనల్‌కాంగ్రెస్ లో విలీనమైంది.

భూపేంద్రనాథ్ దత్తా

ఈయన రచయిత, సామాజికవేత్త. భూపేంద్రనాథ్ దత్తా స్వామి వివేకానంద సోదరుడు. బ్రహ్మసమాజంలో సభ్యుడు. 1902లో అనుశీలన్ సమితిలో చేరాడు. యుగాంతర్ పత్రికకు 1906 నుంచి ఎడిటర్‌గా పనిచేశాడు. 1908లో అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో పి.జి. పూర్తిచేశాడు. కాలిఫోర్నియాలో గదర్ పార్టీలో చేరాడు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో బెర్లిన్(జర్మనీ)లో ఇండియన్ ఇండిపెండెన్స్ కమిటీ సెక్రటరీగా పనిచేశాడు. 1921లో మాస్కో వెళ్లి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో చేరాడు. ఈ సమావేశంలో బీరేంద్రనాథ్ దాస్ గుప్తా, ఎంఎన్ రాయ్‌తో కలిసి పాల్గొన్నాడు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో చేరాడు. ఈయన రచనలు స్వామి వివేకానంద, పాట్రియట్ - ప్రాఫెట్.

బరీంద్రకుమార్ ఘోష్

ఈయన అరబిందో ఘోష్ సోదరుడు. బరీంద్రకుమార్ ఘోష్ గురువు ఠాకూర్ అనుకుల్ చంద్ర. అలీపూర్ కేసులో శిక్ష అనుభవించి పాండిచ్చేరిలో అరబిందో ఘోష్‌తో హాస్టల్‌లో ఉన్నాడు. ఈయన యుగాంతర్(బెంగాలీ వార పత్రిక), ది డాన్ ఆఫ్ ఇండియా(1933, ఆంగ్ల వార పత్రిక), దైనిక్ బాసుమతి(1950, బెంగాలీ) దినపత్రికకు సంపాదకుడిగా పనిచేశాడు. ఈ పత్రికను ఉపేంద్రనాథ్ ముఖోపాధ్యాయ్ స్థాపించాడు. ఈయన రచనలు ది టేల్ ఆఫ్ మై ఎక్సైల్. శ్రీ అరబిందో.

జతీంద్రనాథ్ ముఖర్జీ

ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని కుష్టియా జిల్లాలో జన్మించాడు. ఇతనిని బాఘా జతిన్ లేదా టైగర్ జతిన్‌గా పిలుస్తారు. బాఘా జతిన్ అంటే ఏ డివైన్ పర్సనాలిటీ. దియోఘర్‌లో బాంబుల ఫ్యాక్టరీని స్థాపించాడు. హౌరా సిబ్‌పూర్ కుట్ర కేసుతో జతీంద్రనాథ్ ముఖర్జీకి సంబంధం ఉన్నది. 1915, సెప్టెంబర్ 10న ఒడిశాలోని బాలసోర్‌లో జన్మించాడు. వి షెల్ డై టు అవేకన్ ది నేషన్ అని గర్జించాడు. ఈ మాటను వివేకానందుడి నుంచి మార్గదర్శకంగా తీసుకున్నాడు.

హేమచంద్ర కానుంగో

అనుశీలన్ సమితి ఆధ్వర్యంలో కలకత్తాలోని మానిక్‌తొల్లలో బాంబుల ఫ్యాక్టరీని స్థాపించాడు. ఈయన బాంబుల తయారీలో సిద్ధహస్తుడు. ఆలీపూర్ బాంబు కేసులో నిందితుడు. 1907లో బరీంద్రకుమార్ ఘోష్ బాంబుల తయారీని నికోలస్ సఫ్రాన్‌స్కీ దగ్గర నేర్చుకోవడానికి హేమచంద్ర కానుంగోను ప్యారిస్‌కు పంపాడు.

సూర్యసేన్

ఈయన మాస్టర్ దా (దా అంటే బెంగాల్‌లో గౌరవించే పదం) అని పిలిపించుకున్నాడు. ఈయన ఒక టీచర్. బంగ్లాదేశ్ జాతీయ వీరుడిగా పిలిచేవాడు. అనుశీలన్ సమితిలో సభ్యుడు. సూర్యసేన్ నాయకత్వంలో చిట్టగాంగ్ రైల్వేస్టేషన్‌పై 1924లో దాడి జరిగింది. 1930లో చిట్టగాంగ్ ఆయుధగారంపై దాడి చేశాడు. ఇక్కడ జాతీయ జెండాను ఎగురవేశాడు. ఈయనతో పాటు కల్పనా దత్తా, ప్రీతిలతా వడ్డేకర్ ఈ దాడిలో పాల్గొన్నారు. నేత్రసేన్ చేసిన నమ్మకద్రోహం వల్ల 1932, ఫిబ్రవరి, 16న బ్రిటీష్ వారు ఈయన్ని పట్టుకున్నారు. సూర్యసేన్, తారకేశ్వర్ దస్తిదార్‌ను 1934, జనవరి 12న చిట్టగాంగ్ జైలులో ఉరితీశారు. వీరి శవాలను క్రూజియర్ నౌక అయిన దిరి మీద తీసుకెళ్లి బంగాళాఖాతంలో పడేశారు. బ్రిటీష్ అధికారులను చంపడం, బహిరంగ దోపిడీలు చేయడం వంటి విప్లవ కార్యక్రమాలకు సూర్యసేన్ నాయకత్వం వహించాడు.

ప్రీతిలత వడ్డేకర్

ఈమె మరో పేరు రాణి. ప్రీతిలత వడ్డేకర్ బెంగాల్ విప్లవ వనిత. సూర్యసేన్ ప్రధాన అనుచరురాలు. పహార్‌తలి యూరోపియన్ క్లబ్‌బోర్డుపై డాగ్స్ అండ్ ఇండియన్స్ ఆర్ నాట్ అలోవ్డ్ అనే మాటకు వ్యతిరేకంగా 1932, సెప్టెంబర్ 24న దాడి చేసింది. బ్రిటీష్ అధికారులకు పట్టుబడకుండా పొటాషియం సైనైడ్ మింగి ఆత్మహత్య చేసుకున్నది.

గోపీనాథ్ సాహా

ఈయన బెంగాల్ సమరయోధుడు. భారత విప్లవకారులను హతమార్చడానికి బ్రిటీష్ నియమించిన ఇన్‌స్పెక్టర్ జనరల్ చార్లెస్ టెగర్ట్‌ను అంతం చేయడానికి గోపీనాథ్ సాహాను చంద్రశేఖర్ ఆజాద్ నియమించాడు. టెగర్ట్‌పై సాహా కాల్పులు జరపగా అది గురితప్పి ఎర్నెస్ట్ డే అనే వ్యక్తి మరణించాడు. ఈ కేసులో బ్రిటీష్ ప్రభుత్వం సాహకు మరణదండన విధించింది. నా శరీరంలోని ఒక్కొక్క రక్తపు బొట్టు దేశ స్వాతంత్ర్యానికి బీజమై పెరగాలి అని సాహ నినదించాడు. ఈ మాటలే నేతాజీకి ప్రేరణ కలిగించాయి. సాహ తన మరణానికి ముందు జైలు గోడపై భారతీయ రాజకీయాల్లో అహింసకు తావు లేదు అని రాశాడు.

జతిన్‌దాస్

ఈయన్నే జతింద్రనాథ్ దాస్‌గా పిలుస్తారు. అనుశీలన్‌సమితిలో సభ్యుడు. 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. లాహోర్ కుట్ర కేసులో 1929, జూన్ 14న అరెస్టు అయ్యాడు. జైలులో తమను సాధారణ నేరస్తుడిలా కాకుండా రాజకీయ నేరస్తుల మాదిరిగా చూడాలని కోరుతూ నిరాహార దీక్ష చేశాడు. లాహోర్ జైలులో 64 రోజులపాటు నిరాహార దీక్ష తర్వాత జతిన్ దాస్ 1929, సెప్టెంబర్ 29న అమరుడయ్యాడు.

ప్రభాత వెలుగు సక్సెస్

ఆర్ఆర్‌బీలో మినిస్టీరియల్, ఐసోలేటెడ్ పోస్టులు

మినిస్టీరియల్, ఐసోలేటెడ్ కేటగిరీ పోస్టుల భర్తీ కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఆర్ఆర్‌బీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ విభాగాల్లో 1036 పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలి.

మొత్తం పోస్టులు(1036): పోస్టు గ్యాడ్యుయేట్ టీచర్స్ 187, సైంటిఫిక్ సూపర్‌వైజర్3, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేషన్ టీచర్లు 338, చీఫ్ లా అసిస్టెంట్ 54, పబ్లిక్ ప్రాసిక్యూటర్ 20, ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్ 18, సైంటిఫిక్‌అసిస్టెంట్/ట్రైనింగ్ 2, జూనియర్ ట్రాన్స్‌లేటర్ 130, సీనియర్ పబ్లిసిటీ ఇన్‌స్పెక్టర్ 03, స్టాఫ్ అండ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ 59, మ్యూజిక్ టీచర్ 10, ప్రైమరీ రైల్వే టీచర్ 3, లైబ్రేరియన్ 188, అసిస్టెంట్ టీచర్2, ల్యాబొరేటరీ అసిస్టెంట్/స్కూల్ 07, ల్యాబ్ అసిస్టెంట్ గ్రేడ్-3:12 పోస్టులు ఉన్నాయి.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, టెట్, డీఎడ్, బీఎడ్ ఉత్తీర్ణత కలిగి ఉండాలి.

సెలెక్షన్ ప్రాసెస్: ఆన్‌లైన్ టెస్ట్, టీచింగ్ స్కూల్ టెస్ట్, ట్రాన్స్‌లేషన్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా సెలెక్ట్ చేస్తారు.

అప్లికేషన్: 2025, జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండి ఉండాలి. అప్లికేషన్లు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తారు. జనరల్ అభ్యర్థులకు రూ.500, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, ఈబీసీ, మైనార్టీ అభ్యర్థులకు రూ.250 అప్లికేషన్ ఫీజు ఉంటుంది. ఈ నెల 16 దరఖాస్తులకు ఆఖరు తేదీ.

ఓడీఎఫ్‌లో టూల్ డిజైనర్ పోస్టులు

హైదరాబాద్ శంకర్ పల్లిలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్(ఓఎఫ్ఎంకె) టూల్ డిజైనర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతున్నది. ఈ ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ బేస్ మీద భర్తీ చేయనున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: టూల్ డిజైనర్02 పోస్టులను భర్తీ చేస్తున్నారు. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్ (మెకానిక్)లో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

సెలెక్షన్ ప్రాసెస్: ఇంటర్వ్యూ ఆధారంగా పోస్టులను భర్తీ చేయనున్నారు. 2025, జనవరి 27 నాటికి 63 ఏండ్లు మించకూడదు. నెలకు రూ.30,000 జీతం చెల్లిస్తారు.

అప్లికేషన్: ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. డిప్యూటీ జనరల్‌మేనేజర్/హెచ్ ఆర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్, ఎద్దు మైలారం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ 502205.

టీహెచ్ఎస్‌టీఐలో ఉద్యోగాలు

ప్రాజెక్ట్ మేనేజర్, టెక్నికల్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి బీఆర్ఐసీ ట్రాన్స్‌లేషన్‌హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (టీహెచ్ఎస్‌టీఐ) అప్లికేషన్స్ కోరుతున్నది. ఈ నెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పోస్టులు: ప్రాజెక్ట్ మేనేజర్ 01, టెక్నికల్ అసిస్టెంట్ 01, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ 01 పోస్టులను భర్తీ చేయనున్నారు. పోస్టును అనుసరించి ఫైనాన్స్ విభాగంలో డిగ్రీ, లైఫ్ సైన్స్, కంప్యూటర్‌సైన్స్, బయోఇన్‌ మ్యాటిక్స్‌లో బీఈ, బీటెక్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

సెలెక్షన్ ప్రాసెస్: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.

అప్లికేషన్: ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 16వ తేదీలోగా అప్లై చేసుకోవచ్చు. అప్లికేషన్ ఫీజు జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.236, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.118. ప్రాజెక్ట్ మేనేజర్‌కు 35 ఏండ్లు, టెక్నికల్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్‌కు 30 ఏండ్లు మించకూడదు.

కవిత్వాలు

కులం కత్తులు..

కులం కత్తులు గుండెల్లో దిగబడ్డాయి
ఎంత పీక ప్రయత్నించినా చేతుల్లోకి రాక,
గుండెల్లోనే గుదిబండలై,
పెను భారాన్ని మోస్తున్నాను
న్యాతిరికి కాళ్ళకు పోతే,
నా కాళ్లల్ల నాగులు తిరిగినయ్
నా మలద్వారం గుండా మలంకి బదులు,
మైల బయటికొచ్చింది
ముట్టుని నా ఎడమ చేత్తో కడిగి,
ఇంత సర్ఫేసి సల్లవడ్డ
ఎటు చూసినా
ముళ్ళ కంపలకేసి కుట్టిన
ముఖాలన్నీ
తేరగా నన్నే చూస్తున్నాయి
ఏం చేయాలో తోచక,
నా కళ్లు రెండూ పీకేసి,
అక్కడే పాతేసి వచ్చా

- బాలాజీ పోతుల, 8179283830

అంతరంగం..

అంతరంగంలో ఏదో అలజడి
ఆలోచనల ఒరవడి
నా మనసుతో సంభాషిస్తున్నా
సంతోషం ఎక్కడ దొరుకుతుంది
సుఖం చిరునామా ఎక్కడుంది
మనసు అర్థం చేసుకోలేకపోయింది
దుఃఖం బహుమతిగా తీసుకునివచ్చింది
మనసు పిచ్చిది
మాయమర్మం ఎరుగనిది
భాధనే కోరుకుంది
ప్రంచమంతా సంతోషం
నాలో అర్థం కాని అంతర్మధనం
ఒకవైపు ప్రేమ కాంతివంతం
ఇంకోవైపు మృత్యువు తెచ్చిన అంధకారం
మనసుకు అనేక రూపాలున్నాయి
నా రూపమేమిది
నా ఆకారమేది
నేను యోగినా
నేను దుష్టుడినా
ఏన్నో దారులు ఉన్నాయి
ఎన్నో మజిలీలు ఉన్నాయి
నేను ప్రయాణం మొదలు పెట్టాను
రహదారులు ముందుకు సాగిపోయాయి
నేను వెనుకబడిపోయాను
మనసు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాను
మనసును ప్రశ్నిస్తూనే ఉన్నాను
సుఖం ఎక్కడ
సంతోషం ఎక్కడ

- అరుణ డేనియల్, 9000606889

మా ఊరి తీరు

రామ సక్కని మా ఊరు
రాజు పేదలు కలిసుండే తీరు
తలాపున ఉంది నీటి కుంట
రైతులకు అందించు పంట
ఊరికి తూర్పున వాగు పారు
పంట పొలాలకు చేరు నీరు
పోచమ్మ తల్లి అండగా నిలుచు
జనావళి భక్తి శ్రద్ధ తో కొలుచు
ఉరి మధ్యన చదువుల బడి
రేపటి తరానికి విలువల గడి
ఆనవాలు లేని రాత్రి కబడ్డీలు
అలుపెరుగని కిరికెట్టు ఆటలు
మామా తాత వరుసల పిలుపులు
పల్లె సంస్కృతిని చెప్పే ప్రతీకలు
ఓట్లప్పుడు కొందరి జెండాలు వేరు
అపదొస్తే అందరి అజెండా సాయమే
ఏ గల్లీ చూసినా రయ్యుమనే బండ్లు
ఎంత వెతికినా కానరాని ఎడ్ల బండ్లు
పట్నం గాలి ఎంత వేగంగా వీచినా
పల్లె వెలుగుతుంది పచ్చని పంటలతో

- దుర్గమ్ భైతి, 9959007914

మనసాక తోట

మనసు మనిషికున్న
గొప్ప వరం మనసే ఒక పూలతోట
మనసే ఒక పూల బాట
ఆతోటలో ఆబాటలో
ఆలోచనల పంట పండేనులే
ప్రేమ ఆప్యాయతలు
వికసించేనులే మనప్రతికూల ఆలోచనలే
అందులోని కలుపు
మొక్కలు సానుకూల అలవాట్లే
మేలిమి విత్తనాలు
క్రమశిక్షణే నీరు మన జీవనశైలియే
ప్రధాన వనరు మన అవసరాలను
తీర్చుకోవడానికి ఏపంట సాగుచేస్తామన్నది
మన ఇష్టాన్నిబట్టి ఉంటుంది
సహనం ఓర్పు మార్పుతో
ఎదుగుదల. సాధ్యమౌతది
పట్టుదలే పెట్టుబడి అవుతే
సంకల్పం ఆయుధమైతె
ప్రగతి పురోగతి
ప్రవాహమై నిలకడ పట్టుదల
సానుకూల ఆలోచన ధోరిణి
జీవితానికి చుక్కాని
అవుతుంది అర్థవంతమైన
లక్ష్యాలను సాధించి
జీవిత సాఫల్యతను
సాధించాలి మంచిని పెంచి
మంచిని పంచి
మనసున్న మా రాజుగా నిలుధ్ధాం

- నేదునూరి కనకయ్య, 9440245771

గూట్లో చిక్కుకున్న ప్రేమ పక్షి!

ప్రేమగా ప్రేమించాను
ప్రేమే జీవితమనుకున్నాను
అందుకే ప్రేమించిన వాడినే పెళ్లాడాను
పెళ్లయ్యాకే తెలిసింది
అది ప్రేమ కాదని!
అది తెలిసొచ్చేనాటికి,
ఓ రెండేళ్ల పాప చేతికొచ్చింది
పొద్దు పొడవక ముందే సాన్పేసి,
పొద్దు పొయినాక గుల్లెడు రొట్టెలు గొట్టి,
రోజంతా గుండెల్లో గునపాలు దింపుకొని,
సాపైన పతంగికి మల్లె నా జీవితం,
దినదినం దిగులు దివిటీలార్పుకొని
దిగజారిపోయింది
చదువుకున్నది పదే అయినా,
ఏం చేయాలో తెలియని అయోమయం.
స్వేచ్ఛగా ఉండాల్సిన నా జీవితం,
ఓ రాక్షసుడి చేతిలో నలిగిన
చీమయిపోయింది
తండ్రిని - తల్లి వదిలేసి చాన్నాళ్లైంది,
తండ్రి ఇంకొకరిని పెళ్లాడీ చాన్నాళ్లైంది.
ఇలా నా జీవితం అగమ్యగోచరమైంది.
తాతయ్య నాయనమ్మలు ఉన్నా,
లేనట్టే తోచింది
ఎండిపోతున్న చెట్టుకి నీళ్లు పోసే వాడే
ప్రేమికుడని నమ్మాను,
ఫలాలు పండాకే తెలిసింది,
అంగట్లో నన్ను అమ్మే వ్యాపారస్తుడని
మోసపోయానని తెలిశాక,
ఈ గందరగోళ జీవితాన,
నాకు దిక్కేది, దారేది?
ఆడపిల్లగా పుట్టి పెద్ద పాపమే చేశాను,
అందునా అంటరాని అతివగా
విడాకుల చిట్టా విసిరి,
విడివడుటే మిగిలింది

- మౌనిక నీరుడి, 9059945330

సనాతన ధర్మం!

సకల మానవాళికి సనాతన సందేశం
మానవతా హృదయంతో
మసలుకోండి సనాతన ధర్మంతో
హిందూ సంస్కృతి కాపాడండి
శాంతి సమైక్యత నినాదం తో
సమతా మమతలతో సాగిపోండి
భారతీయ సంస్కృతి పరిరక్షణ కోసం
మన హిందూ ధర్మం కాపాడాలి
ఆధ్యాత్మిక భావంతో
అందరూ సనాతన ధర్మంతో
నడుచు కోవాలి సహృదయతతో మేలుకోవాలి
సకల భక్త జనావళికి
సనాతన ధర్మం సందేశం కావాలి
ధ్యానం యోగం పరమ ధర్మం
సనాతన ధర్మం సందేశం కావాలి !

- ఎల్.ప్రఫుల్ల చంద్ర, 6300546700

వారం లేని పనివారం!

ఒక్కొక్కరికి ఒక వారం కొందరికి ఆదివారం
సందడి కొందరికి వారం వారం అంగడి!
అందరికి సోమవారం హడావుడి
కొందరికి గుద్దెద్దు చేన్లో పడ్డట్టు
వారాలన్నీ ఒకటే పందేరం! మాది వారం
వర్జ్యం లేని పనివారం! వారాల సప్త హారం
మా చేతుల్లో జపమాలై విరామమెరుగక
తిరుగుతుంది! వినిమయ వస్తుసౌకర్యం అంతా
కనిపించని శ్రమచేతుల తపస్సే!
వారం లేని పని వారం మా జీవితాలు అనేక
అశ్వాలై జగతి రథ చక్రాలను విశ్రమించక
అలుపెరుగక లాగితేనే అందరికీ
నిత్య కొత్త ఉదయాలు!

- పి.బిక్కారెడ్డి, 9705315250

నకిలి -నకిలి -నకిలి

నూతన అధునాతన
తెలంగాణ రాష్ట్ర సచివాలయం
శోభాయమానమై తులతూగుతుండగా
జిలుగు వెలుగులతో తాండవమాడగా.....
రూపు మార్చుకొని ఆకుపచ్చగా అవతరించిన
తెలంగాణ తల్లి కనువిందు చేయగా
తన సమక్షములో సాదృష్యంగా
భయమెరుగని నకిలి సచివులు ప్రవేశం
దిన పత్రిక లలో ప్రకటన ప్రచారాలతో
కోలాహలం ఎందుకంటే? మనది ప్రజా
సామ్య దేశం స్వేచ్ఛా వాయువులను ఘనంగా
పీలుస్తూ ఉంటాం తందనాలాడడమే మనకున్న
హక్కుల పర్వం కావున ప్రాంతీయ పార్టీలకు
తిలోదకం జాతీయ పార్టీలకు సుస్వాగత
తోరణం మనమాశించిన ఎంతో గొప్పతు
భతరుణం ఇంత వరకు ప్రజలు బజారు
సరుకులే నకిలీవనుకున్నారు కానీ ప్రభుత్వ
కార్యాలయాల లోని ఉద్యోగులు
నకిలి వారేనని పాపం స్పృహలోకి వచ్చారు
జనులు అనారోగ్యాలతో, ఆందోళనలతో
అతలా కుతలా మవుతుండగా
నకిలీల బెడదల పురాణం మరో రసకం
దాయం మనుషులు నకిలి, మనసులు నకిలీ
మెతుకు నకిలీ, బతుకు నకిలీ వైద్యులు నకిలీ,
గులికలు నకిలి నవ్వులు నకిలీ పువ్వులు నకిలి
భంధువులు నకిలీ, బాంధవ్యాలు నకిలి
బాగోగులు నకిలీ, భాగ్యము నకిలి
పదార్థాలు నకిలీ, ప్రాణవాయువు నకిలి
పాలన వెకిలి, పనులు మకిలి
చరాచర విశ్వమే కడు వింతలతో నకిలి
కాదేది నకిలి కనర్హం ....
అంతా ! నకిలి, నకిలి, నకిలి...

- నమిలకొండ నాగేశ్వర్‌రావు 8688553470

రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాహిత్య అంశాలపై వ్యాసాలు, అభిప్రాయాలు, కవితలు ఈ-మెయిల్ ద్వారా మాకు పంపవచ్చు.

మా మెయిల్ ఐడి: aadabhydeditor@gmail.com
whatsup:8367301118, Ph : 040-48523454

- ఎడిటర్

పల్లెల్లో మొదలైన ‘స్థానిక’ సందడి...!

తెలంగాణలోని పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. స్థానిక ఎన్నికల కోసం ఇంకా నోటిఫికేషన్ విడుదల కాకపోయినా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లన్నీ రాష్ట్ర ప్రభుత్వం చకచకా చేస్తోంది. మరో పక్క రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల్లో సత్తా చాటేందుకు సమాయత్తం అవుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీలను స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసి సత్తా చాటాలని చూస్తోంది. టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఈ మేరకు దిశానిర్దేశం కూడా చేశారు. పీసీసీ చీఫ్ భాధ్యతల అనంతరం మొదటిసారి ఎన్నికలు కావడంతో స్థానిక ఎన్నికలను ఆయనతో పాటు సిఎం రేవంత్, తదితర మంత్రులు, ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు సవాల్‌గా స్వీకరిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు సైతం స్థానిక పోరులో ఎలాగైనా అధికార పార్టీని చిత్తు చేస్తూ, గ్రామాల్లో ఆయా పార్టీల జెండాలను ఎగిరేసేందుకు తగ్గట్టుగానే పన్నాగాలు పన్నుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని నాయకత్వంపై దృష్టి సారించారు.

అభ్యర్థుల కోసం అన్వేషణ.. గ్రామ స్థాయిలో ఆర్థికంగా, సామాజికంగా బలమైన నాయకుడు ఎవరనే విషయంలో సర్వే కూడా చేయిస్తున్నారు. బలమైన నాయకుడు, ప్రజాదరణతోపాటు ఆర్థికంగా బలమైన నేత ఏ పార్టీలో ఉన్నా ఫర్వాలేదనే ఉద్దేశంతో ముందుకెళ్తున్నారు. గెలుపు గుర్రమని భావిస్తే చాలు వారిని తమ వైపు లాక్కోవాలనే ఆలోచనతో పావులు కదుపుతున్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పరిస్థితి కొంత దయనీయంగా ఉన్న తమ పార్టీ నుంచి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్న వారిని అడ్డుకునే ప్రయత్నంలో విఫలమవుతోంది. పార్టీ మారకుండా అడ్డుకునే స్థోమత లేక చేతులెత్తేస్తోంది. అధికారంలో లేని పార్టీలో ఉంటే ఐదేళ్ల పాటు ఏం చేయలేమని, పదేళ్ల వెనకబడి పోతామనే భావనతో సాధారణ కార్యకర్త కూడా ఆలోచిస్తున్నాడు. ఇది బీఆర్ఎస్‌ను దారుణంగా దెబ్బతీస్తోంది.

అధికారంలో లేని పార్టీతో ఉంటే అధికారం దక్కదేమో..? రాష్ట్రంలో అధికారంలో లేని పార్టీతో ఇంకా కొనసాగితే స్థానిక ఎన్నికల అవకాశాన్ని చేజార్చుకున్నట్లే అవుతుందనే భావనతో ఆశావహులున్నారు. ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగితే గ్రామ స్థాయిలో అధికారం దక్కకుండా పోతుందనే భావనతో పార్టీలు మారేందుకు జంప్ జిలానీలు ఆలోచిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరితే అవకాశం దక్కితే పోటీ చేయవచ్చని, అదృష్టం బాగుంటే ఎన్నికల్లో గెలవొచ్చని, గెలిస్తే ఐదేళ్లపాటు అధికారానికి అధికారం, సంపాదనకు సంపాదన అనే తరహా ఆలోచనలు చేస్తున్నారు. ఒకవేళ పోటీ చేసే అవకాశం రాకపోయినా, పోటీ చేసి గెలవక పోయినా పార్టీలో అభివృద్ధి పనుల కాంట్రాక్టులు, అధికార పార్టీని అడ్డం పెట్టుకుని ఇసుక దందాలు, పోలీస్ పైరవీలు, సెటిల్మెంట్లు ఒకటేమిటి అన్నీ చేయవచ్చనే ఆలోచన చేస్తున్నారు. అందుకే చాలా మంది అధికార పార్టీ వైపే అడుగులేస్తున్నారు.

ఆచి..తూచి చేర్చుకోవాలని అధిష్టానానికి సూచనలు.. ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ముందు ఆచి తూచి చేర్చుకోవాలని ఉమ్మడి జిల్లా నాయకత్వం అధిష్టానానికి సూచిస్తోంది. స్థానిక ఎన్నికల సమయంలో కొత్తగా చేరిన వారితో అప్పటికే పార్టీలో ఉన్న పాత కేడర్‌తో పడక పోతే లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయాన్ని జిల్లా నాయకత్వం అధిష్టానానికి నివేదిస్తుంది. ఈ సమస్యలన్నీ అధిగమించి ముందుకెళ్లాలనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ దూకుడుగా ముందుకెళ్తోంది. గతంలో పోటీ ‘ద్విముఖం’గా ఉండేది.. స్థానిక ఎన్నికల్లో గతంలో పోటీ ద్విముఖం గా ఉండేది. కానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో మూడు పార్టీలు బలంగానే ఉన్నాయి. దీంతో పోటీ అన్ని చోట్లా త్రిము ఖంగా జరిగే అవకాశాలే ఉన్నాయని రాజకీయానుభవం ఉన్న సీని యర్లు చెబుతున్నారు. త్రిముఖంలో గెలుపు అవకాశాలు కూడా అధికార పార్టీకే ఉంటాయని చెబుతున్నారు. అందుకే ఆశా వహు లంతా కాంగ్రెస్ వైపే మొగ్గ చూపుతున్నారని తెలుస్తోంది. రాజ కీయ వలసలు ఎక్కువగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకే ఉంటా యని, హిందూ ధర్మం సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న బీజేపీ నుంచి వలసలు చాలా తక్కువగానే ఉంటాయని రాజకీయ పరిశీలకులు చెపుతున్నారు. ఎన్నికల్లో వ్యవస్థలు కూడా సహకరిస్తాయనే నమ్మకం.. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో స్థానికంలో పోటీ చేస్తే ప్రభుత్వ వ్యవస్థలన్నీ సహకరిస్తాయనే నమ్మకం కూడా ఆశావహులకు ఉంది. ఎం దుకంటే ఈ విషయాన్ని బీఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లపాటు ఆశావ హులు ప్రతిఎన్నికల్లో ప్రత్యక్షంగా చూసిన సందర్భాలు న్నాయి. ఆ అను భవాన్ని బట్టి వ్యవస్థల సహకారంపై కూడా నమ్మకం పెట్టుకుంటున్నారు.

- ఈదునూరి మహేష్, 9949134467

విద్యార్థుల హృదయాల్లో ప్రేరణకి పునాది “పదరా పదరా నాని”పాట

“గురువే జ్ఞానస్వరూపుడు, గురువే పరమేశ్వరుడు” అనే సనాతన సూక్తి ఉపాధ్యాయుని గొప్పదనాన్ని సార్థకం చేస్తుంది. ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాలను నేర్పేవాడు కాదు, జీవిత విద్యను బోధించే పండితుడు. ఈ కథనం, అటువంటి ఒక గురువు తన విద్యార్థుల భయాలు, సందేహాలను సంగీతం, పాట ద్వారా ద్వారా ఆత్మవిశ్వాసంగా మలచిన సృజనాత్మక యాత్రతో పాటను ప్రారంభించారు ప్రముఖ కవి రచయిత ఉపాధ్యాయులు సాదే సురేష్.

ఒక గ్రామీణ పాఠశాలలోని ఉపాధ్యాయుడు తన విద్యార్థులలో నిత్యం గమనించేది ఒకే సమస్యఆత్మవిశ్వాసం లేకపోవడం. పరీక్షల ఫలితాల భయం, సామాజిక ఒత్తిడి, భవిష్యత్తు పట్ల అపనమ్మకం భయము వారిని నిరుత్సాహపరుస్తున్నాయి. “సర్, మేం ఫెయిల్ అయితే?” అనే ప్రశ్నలు, తరగతిలో నిశ్శబ్దంగా కూర్చొయ్యే స్తబ్ధత అతని హృదయాన్ని కదిలించాయి. అప్పుడు, అతను ఒక నిర్ణయం తీసుకున్నాడు: “పుస్తకాలతో పాటు, హృదయాలతో మాట్లాడాలి”పాటతో సంగీత స్వరాలతో విద్యార్థుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. ఆ ఉపాధ్యాయుడు సంగీతాన్ని ఒక సాధనంగా ఎంచుకున్నాడు. రాత్రంతా కృషి చేసి, ఒక గీతాన్ని రచించాడు. దాని పాదాలు విద్యార్థుల మనస్సుల్లోకి ప్రవేశించేలా సాధారణ పదాలతో భావోద్వేగాలతో నిండి పాటను విద్యార్థుల హృదయాల్లోకి తీసుకెళ్లాడు.”తప్పులు చేస్తే ఏమి, నేర్చుకోవడమే జయం.జీవితమంటే రాసిన పాఠం కాదు, నడిచే ప్రయాణం! నీలాకాశం నీవే, ఎగిరి చూపు నీ శక్తి.నిరాశలు కరిగించే తేజస్సు నీలోనే ఉంది!” ఈ పాటలోని ప్రతి పంక్తి విద్యార్థులను ఉద్దేశించిన సందేశాలతో నిండి ఉంది. పరీక్షల ఫలితాలు కాదు, ప్రయత్నమే ముఖ్యమని, తప్పులను భయపడకుండా వాటి నుండి నేర్చుకోవాలని, ప్రతి ఒక్కరిలోనూ అనంతమైన సామర్థ్యం దాగిఉందని ఈ పాట వారికి నేర్పింది. మనస్సుల్లో మార్పు, జీవితాల్లో విప్లవం ఆ పాట తరగతిలో ధ్వనించిన రోజు నుంచి విద్యార్థుల్లో కన్పించిన మార్పు అద్భుతమైంది. పిల్లలు తమ భావాలను ధైర్యంగా వ్యక్తపరచడం ప్రారంభించారు. ఒక విద్యార్థిని అన్నది: “ఈ పాటలోని మాటలు నా చెవుల్లో నిత్యం మారుతూ ఉంటాయి. ఇప్పుడు నేను ప్రశ్నలు అడగడానికి భయపడను.”మరో విద్యార్థి తన డైరీలో రాసుకున్నాడు.”నేను ఆకాశం లాగా విశాలమైనవాడిని. ఇక ఎవరూ నన్ను తక్కువ చేయలేరు.”అని.జీవితాన్ని నేర్పే కళ.ఈ ఉపాధ్యాయుని ప్రయత్నం కేవలం ఒక పాటకు మించినది. అది ఒక జీవిత దృక్పథంఅతను నిరూపించినదేమిటంటే, విద్య అంటే పుస్తకాలు ముద్రించే యంత్రాలు కాదు, మనుషులను రూపొందించే శిల్పకళ. అతని పాటలోని మాటలు విద్యార్థులకు విద్యార్థులలో ఆత్మవిశ్వాసానికి ఆయువు పోశాయి. ఈ ఉపాధ్యాయుని కథ మనకు ఒక సందేశాన్నిస్తుంది.”బోధన అంటే చదువు చెప్పటమే కాదు, సృజనాత్మకత”. సంగీతం, కళలు, సాహిత్యం వంటి మాధ్యమాలు విద్యార్థుల హృదయాలను తాకగలవు. ఒక గీతం ఎలా జీవితాలను మార్చగలదో, ఒక గురువు ఎలా తన విద్యార్థులను జ్ఞానంతోపాటు జీవిత సాఫల్యానికి తయారుచేయగలడో ఇది నిరూపిస్తుంది. “జ్ఞానం యొక్క దీపాలను వెలిగించడమే కాదు, హృదయాల్లో నిప్పులను రగిలించడమే నిజమైన విద్య” అని ఈ ఉపాధ్యాయుడు తన పాట ద్వారా చాటిన సత్యం, ఎల్లప్పుడూ శాశ్వతంగా ఉండేది. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో అటువంటి గురువులే సమాజానికి అమూల్యమైన వారసత్వాన్ని అందిస్తారు. “పద పద రా నాని” అనే ఈ పాట ఒక ప్రేరణాత్మక సందేశాన్ని మూలంగా కలిగి ఉంది. జీవితంలోని సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం, ఆశ, మరియు నిరంతర పురోగతిని ప్రతిబింబించే ఈ పాటకు సాహిత్యపరమైన లక్షణాలు అనేకం ఉన్నాయి. ప్రకృతి, సామాజిక వ్యాఖ్యానం, మానవ మనస్తత్వం వంటి అంశాలు ఇందులో సునాయాసంగా అల్లికలై ఉన్నాయి. “ప్రేరణ మరియు పట్టుదల””పదరా పదరా నాని పరేషాను మాని” అనే పాదాలతో దృశ్యాలను చూపిస్తూ, జీవితంలో ముందుకు సాగాలనే సందేశాన్ని బలపరుస్తుంది. ఇది ఒక రణభేరి వలె కదలికకు ప్రేరేపిస్తుంది. “అడుగు కలిపితేనే మైలు దూరం వంగుతుంది” వంటి పంక్తులు చిన్న చిన్న ప్రయత్నాల సామర్థ్యాన్ని నొక్కిచెబుతాయి. చీకటిని చీల్చే కాంతి (“కుమ్మరించిన చీకటికి వెలుతురు సింహనాదం”) అనే రూపకం, ఆశ మరియు జ్ఞానం యొక్క విజయాన్ని సూచిస్తుంది. “రాతి కవచము కప్పుకున్న హృదయాలకి స్నేహ హస్తం” అనేది కఠిన హృదయాలను కరిగించే మానవత్వాన్ని ప్రతిబింబిస్తుంది. “డబ్బే ఒక జబ్బు రా” అనే పంక్తి డబ్బు మీద అతిగా ఆధారపడటం వల్ల కలిగే మానసిక/సామాజిక రుగ్మతలను విమర్శిస్తుంది. “సుడిగుండాలు ఎన్ని వచ్చిన ఆపవు బ్రతుకు పోరు” అంటే సామాజిక ఒత్తిళ్లు ఎదురైనా పోరాటం మానకూడదని తెలియజేస్తుంది. చిట్టి చీమ, చెట్టు నీడ, అగ్గి-బొగ్గు వంటి ప్రతీకలు సామాన్య జీవిత సత్యాలను చిత్రిస్తాయి. ఉదాహరణకు, “చిట్టి చీమను చూసినప్పుడు చిగురించద ఆశ” అంటే చిన్నవాటి నుంచే మహత్తు పుడుతుంది.అజ్ఞానం/నిరాశను ఛేదించే శక్తి. జీవితంలోని హెచ్చుతగ్గులను స్నేహంతో ఎదుర్కోవడం.

కష్టాలు వచ్చినప్పుడు మనసు గట్టిపడటం. “కుమ్మరించిన చీకటి”, “అగ్గి తలిగితేనే బొగ్గు” వంటి పదాలు తెలుగు సాహిత్యంలోని సాంప్రదాయిక ప్రతీకలను ఉపయోగించారు.ఈ పాట నేటి యువతకు ప్రత్యేకంగా సంబంధించింది. మెటీరియలిజం, మానసిక ఒత్తిళ్లు, అనిశ్చితి వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు ధైర్యాన్నిచ్చే సందేశాలు ఇందులో ఉన్నాయి. “జీవితమే ఓ పోరుబాట” అనే పంక్తి జీవితాన్ని ఒక సాగర్థకమైన యుద్ధంగా చిత్రిస్తుంది. ఇది ప్రతి ఒక్కరి అనుభవానికి అనుగుణంగా ఉంటుంది. “పద పద రా నాని” అనే పాట ఒక సాహసోపేతమైన జీవిత మ్యానిఫెస్టో. ఇది కవి యొక్క గాఢమైన మానవీయ దృక్పథాన్ని మరియు సామాజిక స్పృహను ప్రతిబింబిస్తుంది. ప్రతీకలు, ఛందస్సు, భావోద్వేగాల సమ్మేళనం ద్వారా ఈ పాట శ్రోతలను ఒక ప్రయాణంలోకి తీసుకువెళుతుందిఅది జీవితపు ప్రయాణం.ఈ పాటలోని ప్రతి పంక్తి ఒక సాహిత్య రత్నం. దీన్ని పాడేటప్పుడు లేదా వినేటప్పుడు, మన అంతరాత్మతో ఒప్పించుకునే సామర్థ్యం ఉంది! ఈ పాట రచయిత సాదే సురేష్ మరియు సంగీతని వినిపించిన కోదాడ కొండలు మాస్టర్, గానామృతాన్ని వినిపించిన మట్టపల్లి గురులింగం ఈ ముగ్గురు కూడా త్రిమూర్తుల్లాగా పాటకు ప్రాణం పోసి నేటి యువతకి భవిష్యత్తుకి బాటలువేశారు.

- పూసపాటి వేదాద్రి, 9912197694

కొత్త ఢిల్లీ నగరం అధికారికంగా ప్రారంభించబడిన దినం

అది భారత దేశపు రాజధాని. వివిధ పాలకుల ఎలుబడులలో మహోన్నత వైభవానికి ఉత్తుంగ శిఖరంలా నిలిచిన ఢిల్లీ నగరమది. భారతీయ ప్రాచీన సభ్యతా సంస్కృతులకు, సాంప్రదాయాలకు, వారసత్వాలకు, ఆచార వ్యవహారాలకు విభిన్న జాతులకు, మతాలకు, కులాలకు వేలాది సంవత్సరాల సాక్షీభూతంగా నిలిచి ఉంది. సహస్రాబ్దుల కాలగమనంలో ఎన్నో ఉత్థాన పతనాలను అనుభవించింది. 42.7 చదరపు కి.మీ. విస్తీర్ణం కలిగిన ప్రస్తుత క్రొత్త ఢిల్లీ, మెట్రోపాలిత ప్రాంతంలో, భారత ప్రభుత్వ కేంద్రపాలిత ప్రాంత పరిధిలో ఉంది. యునైటెడ్ కింగ్ డంకు చెందిన వాస్తు నిపుణులు తయారు చేసిన నిర్మాణ నమూనా అధారంగా రూపొందించిన కొత్త ఢిల్లీ 1931 ఫిబ్రవరి 10న ప్రారంభించారు. కొత్త ఢిల్లీ పూర్వాపరాలు ఒక్కసారి మననం చేసుకుంటే ఢిల్లీ కేంద్రంగా ఎన్నో వేల సంవత్సరాల చరిత్రలో ఎన్నో సామ్రాజ్యాలు వెలిశాయి, పతన మైనాయి. మహాభారతంలో పాండవుల రాజధాని ఇంద్రప్రస్థం అని ఈ నగరాన్ని ప్రస్తావించారు. 19వ శతాబ్దారంభం వరకు “ఇందర్‌పాత్” అనే గ్రామం ఇక్కడ ఉండేది. బ్రిటిష్‌వారి క్రొత్త రాజధాని నిర్మాణంలో ఆ గ్రామం కనుమరుగు అయింది. క్రీ.పూ. 1000 సంవత్సరాల నాటి రంగువేసిన కూజాలు త్రవ్వకాలలో వెలుగు చూశాయి. పురావస్తు పరిశోధనా సంస్థ (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) వారి అంచనాల ప్రకారం వేల సంవత్సరాలలో నిర్మించిన చారిత్రిక కట్టడాలు 60,000 పైగా ఢిల్లీలో ఉన్నాయి. ఇటీవలి చరిత్ర లోనే “ఏడు సామ్రాజ్యాల రాజధాని”గా ఢిల్లీని వర్ణిస్తారు. గంగా - యమునా మైదానానికి... ఆరావళీ - వింధ్య పర్వత శ్రేణులకు మధ్య ప్రాంతంలో క్రొత్త ఢిల్లీ, యమునా నదికి పశ్చిమ భాగాన ఉన్నందున పురాతన కాలం నుండి ఢిల్లీ ప్రధాన వర్తక మార్గాలకు కూడలిగా ఉంది. ఆ సౌకర్యాల కారణంగానే అక్కడ విద్య, సంస్కృతి, రాజ్యాధికారాలు, వర్ధిల్లాయి. మౌర్యసామ్రాజ్యం కాలం నాటి (క్రీ.పూ. 300) ఆధారాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. అప్పటి నుండి ఢిల్లీ అవిచ్ఛిన్నంగా జనావాసంగా వర్ధిల్లింది. శ్రీనివాసపురి ప్రాంతంలో అశోకుని కాలంనాటి శాసనం 1966లో కనుగొన్నారు. ఫిరోజ్‌షా తుగ్లక్ రెండు అశోకుని కాలం నాటి శాసన స్తంభాలను ఢిల్లీకి తెచ్చాడు. కుతుబ్ మినార్ వద్ద ప్రసిద్ధి చెందిన ఉక్కు స్తంభం గుప్త వంశజుడు కుమార గుప్తుడు క్రీ.శ. 320-540 మధ్యకాలంలో తయారు చేయించ బడింది. దానిని 10వ శతాబ్దంలో ఢిల్లీకి తెచ్చారు. 1857 నుండి, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తరువాత, ఢిల్లీ బ్రిటిష్‌వారి అధీనంలోకి వచ్చింది. అప్పుడు బ్రిటిషు వారు కలకత్తా నుండి రాజ్యం చేస్తున్నందు వలన ఢిల్లీ రాజధాని నగరం హోదాను కోల్పోయింది. మళ్ళీ 1911 లో కలకత్తా నుండి రాజధాని ఢిల్లీకి మార్చారు. ఎడ్విన్ లుట్యెన్స్ అనే భవన నిర్మాణ శిల్పి పాత నగరంలో కొంత భాగాన్ని పూర్తిగా కూలద్రోయించి క్రొత్త ఢిల్లీలోని ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని చేయించాడు. ఆంగ్లేయుల పాలనా కాలమందు డిసెంబరు 1911 వరకూ భారత రాజధాని కలకత్తా నగరం వుండేది. ఆ తరువాత రాజధాని ఢిల్లీకి మార్చ బడింది.

- రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494

ఛలో మహా కుంభమేళా

మన దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు కుల, ప్రాంత, వర్గ, వర్ణ, భాష బేధాలు లేకుండా అలహాబాద్ లోని ప్రయాగ త్రివేణి సంగమంలో ప్రతిరోజూ కోట్ల మంది పవిత్ర స్నానాలు (పుణ్య స్నానాలు) చేస్తున్నారు.గంగ,యమున, సరస్వతి త్రివేణి సంగమంలో జనవరి నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ప్రయోగరాజ్ లో అత్యంత వైభవంగా, అత్యంత పవిత్రంగా, మహోన్నత మైన కార్యక్రమం ప్రపంచం లోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక కుంభమేళ. కుంభమేళా ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి వస్తుంది. అసలు కుంభమేళా జరుపుకోవడానికి విశేషం ఏమిటంటే నాలుగు అమృత చినుకులు హరిద్వార్, నాసిక్ త్రయంబకం,ప్రయాగ, ఉజ్జయిని ప్రాంతాల్లో పడ్డాయని కుంభమేళా సందర్భంగా స్నానాలు చేస్తే అమృత స్నానం చేసినట్లు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని,కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్మకం. ఏమైనా రోగాలు ఉంటే క్షీణిస్తాయని భక్తుల విశ్వాసం.2025 లో 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా ఈ మహా కుంభమేళా లో పవిత్రమైన స్నానమచరణ మరో జన్మ లేకుండా స్వర్గానికి చేరుకుంటారని విశ్వాసం.ఈ కుంభమేళాలో పవిత్ర మైన స్నానమచరణ కోసం సాధువులు, సన్యాసులు, అఘోరాలు, పీఠాధిపతులు, పండితులు, పురోహితులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, గవర్నర్లు, ఉన్నతోన్నత ఉద్యోగస్తులు, వ్యాపార వేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని పవిత్రమైన కుంభమేళాలో పాల్గొని త్రివేణి సంగమంలో స్నానాలు చేస్తున్నారు. ప్రయాగే మాధవేశ్వరి అమ్మవారి ఆలయ విశిష్టత: ప్రయాగ లో మాధవేశ్వరి అమ్మవారు ఆరాధనలు జరుగుతాయి.స్థానికులు అలోపీదేవి అని పిలుస్తారు.ఈ ఆలయంలో యంత్రమే కానీ విగ్రహం లేదు.యంత్రంపై ఉన్న ఊయలకు భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు.కుంభమేళాలో స్నానం చేసి మాధవేశ్వరి దేవిని దర్శనం చేసుకున్నవారు సంపూర్ణ యాత్ర ఫలాన్ని పొందుతారని భక్తుల (ప్రజల) విశ్వాసం. పరమ శివుడికి జరిగిన అవమానానికి తట్టుకోలేక సతీదేవి...దక్ష యజ్ఞం లో ఆత్మహత్య చేసుకుంటుంది.శివుడు తన భుజాన సతీదేవి దేహాన్ని వేసుకొని చీకటి లోకి వేళ్తూ ఉండగా లోక క్షేమం కోసం ఆ దేహాన్ని తన సుదర్శన చక్రంతో మహావిష్ణువు ఛేదించారు.ఆ శరీర ఖండాలు భూమిపై పలు ప్రాంతాల్లో పడ్డాయని అవి అష్టాదశ శక్తి పీఠాలుగా ప్రసిద్ధి చెందాయి.వాటిలో శ్రీశైలం,పూరి జగన్నాథ్ దేవాలయం సమీపంలో అండాళమ్మ దేవాలయం జోగులాంబ, ప్రయాగ మొదలైనవి.సతీదేవి కుడిచేతి వేళ్ళు పడిన ప్రదేశం గా పురాణాలు చెబుతున్నాయి. ఈ మహా కుంభమేళా లో చిత్ర విచిత్రమైన సంఘటనలు జరగడం ప్రజలకు ఇంకా ఎక్కువగా ఆకర్షణీయంగా మారింది.పూసలు, రుద్రాక్ష మాలలు, గాజులు అమ్ముకునే “ మోనా “ అనే అమ్మాయి కళ్ళు ఆకర్షణీయముగా ఉన్నాయని ప్రపంచ మీడియా ప్రతినిధులు ఫోటోలు, వీడియోలు తీయడం సోషల్ మీడియా లో వైరల్ కావడంతో లక్షల్లో వ్యూలు,లైక్ లు సబ్స్క్రయిబ్‌లు రావడంతో మోనా కు లిసా తగిలించి “మోనాలిసా”గా పేరుగాంచి సెలబ్రిటీ చేశారు.సినిమా అవకాశాలు ఆమె తలుపు తట్టుకొని రావడం విశేషం. ప్రయాగ సమీపంలో ఇటీవల అయోధ్య రామ మందిర నిర్మాణం జరగడం వలన ప్రజలు అయోధ్య రామ మందిర దర్శనానికి బయలు దేరి వెళుతున్నారు. కాశీ నగరం ప్రయాగ కు దగ్గరగా ఉండడం వల్ల కాశీ యాత్ర కు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు.

ప్రయాగ మహా కుంభమేళా కు దగ్గరగా చిత్రకూట రాముని దేవాలయం, శ్రీకృష్ణ పరమాత్మ దేవాలయం, కౌసల్య దేవాలయం, లక్ష్మణుని హనుమంతుడు దేవాలయం,భరతుని, మహాపతివ్రత అనసూయ దేవాలయం,గుప్త గోదావరి,మహార్‌లో శారదా దేవి దేవాలయం భక్తులతో కిటకిటలాడుతున్నాయి. మహా కుంభమేళా కు వెళ్ళడానికి విమానాలు, రైళ్లు, బస్సులు, ప్రయివేటు ట్రావెల్స్ టూరిస్టులు, ప్రయివేటు కార్లు, బస్సులు,కార్ వాన్‌లు ఎన్నో ప్రయాణ సాధనాలు అందుబాటులో ఉన్నాయి.అలహాబాద్ ప్రయాగలో జరుగుతున్న మహా కుంభమేళా వెళ్ళడానికి హైదరాబాద్ నుంచి మొదలు పెడితే ప్రయాగ వరకు 20,25 టోల్ ప్లాజాలు ఉన్నాయి. మధ్యలో హోటల్ లలో సౌత్ ఇండియా, నార్త్ ఇండియా బోజనాలు అందుబాటులో ఉన్నాయి.

దొంగ సన్యాసులులు, దొంగ అఘోరాలతో తస్మాత్ జాగ్రత్త: సందట్లో సడేమియా అన్నట్లు ప్రజల మనోభావాలను ప్రజల విశ్వాసాలను డబ్బు రూపంలో మార్చుకోవడానికి కొంత మంది దొంగ సన్యాసులు, దొంగ అఘోరాల అవతారం ఎత్తి డబ్బు సంపాదించుకుంటున్నారు. 27 సంవత్సరాల క్రితం తప్పిపోయిన యువకుడు కుంభమేళాలో అఘోరాగా దొరకడం విచిత్రమైన వింతైన సంఘటనలు కోకొల్లలు. ప్రయాగలో జరుగుతున్న మహా కుంభమేళాకు నాలుగు దిక్కులా పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. ఉండడానికి గెస్ట్ హౌస్‌లు, గుడారాలు, ఇండ్లు, టెంట్ లు ఎన్నో రకాల సదుపాయాలు, సౌకర్యాలు ఉన్నాయి. మనదేశంలో దాదాపు సగం మంది వరకు మహా కుంభమేళా కు వెళ్ళి పవిత్రమైన స్నానమచరణ చేసి వెళ్తున్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు చేసిన దాదాపు 30 మందికి పైగా చనిపోయిన అనేక మందికి గాయాలయ్యాయి. మహా కుంభమేళా ప్రతి ఒక్కరు వెళ్లి పవిత్రమైన స్నానం చేయడం జన్మజన్మల పుణ్య ఫలం గా భావించడం ప్రజల విశ్వాసం. ప్రజల మనోభావాలకు అనుగుణంగా చక్కని ఏర్పాట్లు చేసి ఆధ్యాత్మిక భావనను పెంపొందించే విధంగా భక్తి గీతాలు, భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, గంగా హారతి జరుగుతుంది. తల్లి దండ్రులు, అన్న దమ్ములు, అక్క చెల్లెళ్ళు, స్నేహితులు, బంధుమిత్రులు అందరూ కలిసి కుంభమేళాకు వెళ్ళడం జాతీయ భావనను పెంపొంది స్తుంది. ఛలో హైదరాబాద్ అంటూ ఎంతో ఉత్సాహంగా, ఉత్తేజం గా తరలివెళ్తున్నారు.



- డాక్టర్. ఎస్. విజయ భాస్కర్., 9290826988

ఆదాబ్ హైదరాబాద్‌లో ప్రచురితమవుతున్న వ్యాసాలు, వార్తాకథనాలు, విశ్లేషణలు రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.. వాటితో పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.. - ఎడిటర్

అరేబియన్ తీరాన అక్షర కెరటాలు



జనవరి 22 నుంచి 26 వరకు కేరళ లిటరరీ ఫెస్టివల్ కోళికోడ్ (కాలికట్) నగరంలో సముద్రపు ఒడ్డున జరిగింది. ఈ ఉత్సవాన్ని ప్రముఖ మలయాళీ ప్రచురణకర్తలు డి.సి. బుక్స్ గత ఎనిమిదేళ్ళుగా నిర్వహిస్తున్నారు. ఈసారి అతిథి దేశంగా ఫ్రాన్స్‌ను ఆహ్వానించారు. సాహిత్యోత్సవంతో పాటుగా తొలిసారిగా ఈ ఏడాది ప్రచురణకర్తల సమావేశం (పబ్లిషర్ కాన్‌క్లేవ్) కూడా రెండు రోజుల పాటు ఏర్పాటు చేశారు. వారి ఆహ్వానం మేరకు, 'ఎలమి' ప్రచురణల నిర్వాహకురాలిగా నేను హాజరయ్యాను.

***

లిట్ ఫెస్ట్ అంటే– దేశీ విదేశీ రచయితలను, సాహిత్యకారులను, ప్రచురణకర్తలను, పాఠకులను కొన్ని రోజుల పాటు ఒక చోటకు తెచ్చే పుస్తకాల జాతర. పుస్తకాల అట్టల పైన పేరుగా మాత్రమే తెలిసిన రచయితలను పలకరించే అవకాశం ఇక్కడ కలుగుతుంది. ఎప్పటెప్పటి నుంచో తమ రచనల ద్వారా సోషల్ మీడియాలో 'ఫ్రెండ్స్'గా మారిన వారిని మొదటిసారి ఆలింగనం చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది. తాజాగా అచ్చైన పుస్తకాలను ప్రమోట్ చేసుకోడానికి ఇవి మంచి వేదికలు.

కోటలు, హోటళ్ళు, ఐటీ పార్కులు, బీచులు – ఇలా రకరకాల ప్రాంగణాల్లో జరుగుతూ వేలల్లో, లక్షల్లో వచ్చే సందర్శకులని ఆకర్షిస్తాయి ఈ లిటరరీ ఫెస్టివల్స్. పుస్తకాలంటే ప్రాణం పెట్టే వారి సంఖ్య మరీ తక్కువేమీ కాదన్న సంగతిని గుర్తు చేస్తాయి. అన్ని లిటరరీ ఫెస్ట్‌లూ ఒకేలా అనిపించినా, ఆ హంగూ హడావిడీ కాస్త ఇబ్బంది కలిగించినా, ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ప్రతి ఫెస్ట్‌కూ ఏదో ఒక ప్రత్యేకత ఉంది. 2012 నుంచి హైదరాబాద్, బెంగళూరు, జైపూర్ వంటి లిట్ ఫెస్టులకు వెళ్ళడం మామూలైపోయిన నన్ను ఈ కేరళ సాహిత్య ఉత్సవం కొన్ని విషయాల్లో అబ్బురపరిచింది.

"ఆసియాలో రెండో అతి పెద్ద లిటరరీ ఫెస్ట్" అన్న టాగ్‌లైన్‌కు తగినట్టే ఈ ఉత్సవానికి ఈ ఏడాది దాదాపు ఆరు లక్షల మంది సందర్శకులు వచ్చారు. అరేబియన్ సముద్రం ఒడ్డున ఇంతమంది సాహిత్యంలో పడిమునకలు వేయడాన్ని చూస్తే మనసు నిండిపోయింది. కేరళలో 1940లలో జరిగిన గ్రంథాలయోద్యమం వల్ల ఆ రాష్ట్రంలో పుస్తక పఠనం బలపడింది. ఇప్పుడు సామాన్యుల నుంచి సెలబ్రిటీల దాకా అందరూ పుస్తకాల పురుగులే. అందుకే అంతమంది జనం!

love
love
love
Kiss
Kiss
love
akbar
Kiss

నన్ను బాగా ఆశ్చర్యపరచిన, ఆకట్టుకున్న విషయం మాత్రం అత్యధిక సెషన్లు మలయాళ భాష లోనే ఉండడం. మలయాళీ రచయితలకూ, పాఠకులకే ఇక్కడ పెద్ద పీట వేశారు. బుక్ స్టాల్‌లో కూడా 70 శాతం వరకూ మలయాళీ పుస్తకాలే ఉన్నాయి. పోస్టర్లు, పాంపెట్లు, వేదికల పేర్లు... ఇలా అన్ని చోట్లా మలయాళానిదే హవా! ఆఖరుకి అతిథులుగా వెళ్ళిన మాకు ఇచ్చిన గిఫ్ట్ హాంపర్‌లో కూడా ఇతర గిఫ్టులతో పాటు ఒక మలయాళంలో ఉన్న కాలెండరు, వార పత్రిక ఇచ్చారు.

ఇలాంటి సాహిత్య ఉత్సవాలకు విదేశీ రచయితలు రావడం పరిపాటే! ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నవారిని పిలుస్తారు. కేరళ లిట్ ఫెస్ట్‌కు జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, బల్గేరియా దేశాల నుంచి రచయితలతోపాటు, వారిని ఆంగ్లంలోకి అనువదించిన వారూ వచ్చారు. అంతేగాక ఆ రచయితలు రాసిన పుస్తకాల మలయాళ అనువాదాలను ఈ సభల్లో వారి సమక్షంలోనే విడుదల చేయడం గొప్పగా అనిపించింది. భారతీయ భాషల్లోకి విదేశీ రచనలు అనువాదం అవ్వడమే అరుదు. అలాంటిది ఆ రచయిత సమక్షంలోనే అనువాదం ఆవిష్కరణ జరగటం ఇంకా అపురూపం.

> **"ఆసియాలో రెండో అతి పెద్ద లిటరరీ ఫెస్ట్" అన్న టాగ్‌లైన్‌కు తగినట్టే కేరళ లిటరరీ ఫెస్టివల్‌కు ఈ ఏడాది దాదాపు ఆరు లక్షల మంది సందర్శకులు వచ్చారు. అరేబియన్ సముద్రం ఒడ్డున ఇంతమంది సాహిత్యంలో పడిమునకలు వేయడాన్ని చూస్తే మనసు నిండిపోయింది. కేరళలో 1940లలో జరిగిన గ్రంథాలయోద్యమం వల్ల ఆ రాష్ట్రంలో పుస్తక పఠనం బలపడింది. ఇప్పుడు సామాన్యుల నుంచి సెలబ్రిటీల దాకా అందరూ పుస్తకాల పురుగులే. అందుకే అంతమంది జనం!**

***

ఈ ఫెస్టివల్లో భాగంగా 'ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ ఇండియా', 'ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫీసు' సంయుక్తంగా రెండు రోజులపాటు ప్రచురణకర్తల సమావేశాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఇండియాలో ఫ్రెంచ్ రాయబారి హెచ్.ఈ. థియరీ మథౌ; ప్రముఖ కవి, రచయిత కె. సచ్చిదానందన్; బుక్ బ్రహ్మ వ్యవస్థాపకులు సతీష్ చప్పరికె అతిథులుగా వచ్చారు. ఫ్రాన్స్ నుంచి గల్లీమార్డ్ వంటి పెద్ద సంస్థలు, లిటరరీ ఏజెంట్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, మరాఠీ, ఇంగ్లీష్ భాషల ప్రచురణకర్తలు కూడా పాల్గొన్నారు.

మన దేశంలో పుస్తకాలకు, అనువాదాలకు ఎలాంటి మార్కెట్ ఉందన్న దానిపై ఈ సమావేశాల్లో చర్చ జరిగింది. ఇతర దక్షిణాది భాషలతో పోల్చుకుంటే తెలుగులో అమ్మకాలు తక్కువ గానే ఉన్నాయి. పుస్తకాల డిస్ట్రిబ్యూషన్ సమస్యలను దాదాపు అందరూ ప్రస్తావించినా ఒక్కో భాషలో ఆ సమస్యల తీవ్రత ఒక్కోలా ఉన్నది అనిపించింది. ప్రచురితమైన పుస్తకాలకు ఐ.ఎస్.బీ.ఎన్ కోడ్ ఉపయోగించకపోవడం వల్ల అసలు ఎన్ని పుస్తకాలు వెలువడుతున్నాయి అన్నది లెక్కలకు అందడం లేదు. అలానే, రచయితలకు ప్రచురణకర్తలకు మధ్య సరైన రాతపూర్వక అగ్రిమెంట్లు లేకపోవడంవల్ల అనువాదాలు చేయించేటప్పుడు వచ్చే గందరగోళాలు ప్రస్తావనకు వచ్చాయి.

ఫ్రాన్స్ వారు తమ దేశంలో పుస్తకాలు, అనువాద రచనల పరిస్థితి ఎలా ఉందో చెప్పుకొచ్చారు. మనతో పోల్చుకుంటే వారిది ఎక్కువ ఆర్గనైజ్డ్ మార్కెట్ అనిపించింది. ఉదాహరణకి– అక్కడ సెకండ్ హాండ్ పుస్తకాల అమ్మకాలు ఎంత పెద్ద మార్కెట్టో లెక్కలతో సహా చూపించారు. (ఇండియాలో పాత పుస్తకాల షాపుల విషయంలో ఇలాంటి గణాంకాలు అసాధ్యం.) వాళ్ళ పుస్తకాల అమ్మకాల సంఖ్య కూడా ఆశాజనకంగా ఉంది. ముఖ్యంగా అనువాద పుస్తకాలకు కూడా మార్కెట్ బాగుందని చెప్పారు.

***

తెలుగు నుంచి ఫ్రెంచ్ లోకి అనువాదాలు వెళ్ళాలన్నా, అక్కడ నుంచి ఇక్కడకి అనువాదాలు రావాలన్నా మనం – వ్యక్తులుగా, సంస్థలుగా – చేయవలసిన పనులు, గమనించుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి.

రచయితలు తమ పుస్తకాలను ప్రచురణకు ఇచ్చేటప్పుడు రాతపూర్వక అగ్రిమెంట్లు ఉండేటట్టు చూసుకోవాలి. వాటిలో తమ రచనల అనువాద హక్కులకు ఆయా ప్రచురణకర్తలు ప్రాతినిధ్యం వహించేలా అనుమతి ఇస్తే తెలుగు రచనలను ఇలాంటి వేదికలపైకి తీసుకువెళ్ళి మాట్లాడ్డానికి వీలవుతుంది. లిటరరీ ఫిక్షన్ ప్రచురించే ఫ్రెంచ్ ప్రచురణకర్తలు తమ పాఠకులకు తెలియని కొత్త రచయితను ప్రచురణకు ఎంచుకునేటప్పుడు వారి కథలను కాకుండా నవలలనే ఎంచుకుంటామని చెప్పారు. నవలల తోపాటు మహిళల జీవితాలను ప్రతిబింబించే ఆత్మకథనాలపై కూడా ఆసక్తి చూపారు. బాల సాహిత్యం (ముఖ్యంగా బొమ్మల పుస్తకాలు), యంగ్ అడల్ట్ ఫిక్షన్ కూడా వారు తీసుకోడానికి ఇష్టపడుతున్నారు.

ఈ సమావేశానికి తెలుగు నుంచి ఎలమి ప్రచురణలు, ఛాయా బుక్స్ హాజరయ్యాయి. పోయిన ఏడాది జరిగిన బుక్ బ్రహ్మ లిటరరీ ఫెస్టివల్లో కేవలం భారతీయ ప్రచురణకర్తలం మాత్రమే సమావేశమయ్యాం. ఈసారి అంతర్జాతీయ ప్రచురణ సంస్థలతో కలిసి మాట్లాడే అవకాశం చిక్కింది. మన సాహిత్యం వైపు ఈ ప్రచురణకర్తలు ఆశగా చూస్తున్నారని అర్థమైంది. మన రాజకీయ సామాజిక పరిస్థితులు, అందులోంచి పుట్టుకొస్తున్న సాహిత్యం గురించి చక్కగా 'పిచ్' చేయగలిగితే మనకీ అవకాశాలు వస్తాయి. వాళ్ళ పుస్తకాలను మనం అనువాదం చేయాలంటే కాపీరైట్లు, రాయల్టీ ఖర్చులు చూసుకోవాలి. కొన్ని ప్రాజెక్టులకు గ్రాంట్స్ ఉన్నాయి. అవి మంజూరు అయితే ప్రచురణకర్తలపై భారం తగ్గుతుంది.

ఇక భాషలు నేర్చుకునే ఆసక్తి ఉన్నవారు ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్ లాంటి యూరోపియన్ భాషలు నేర్చుకోగలిగితే అనువాద అవకాశాల్ని చేజిక్కించుకోవచ్చు. ప్రచురణకర్తలకు ఇచ్చే గ్రాంట్స్ కన్నా అనువాదకులకు గ్రాంట్స్ కాస్త ఎక్కువగా ఉన్నట్టు అనిపించాయి. మూల భాష నుంచి నేరుగా అనువాదం చేయగలిగే వారికి ఎప్పుడూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. అయితే, తెలుగు–ఫ్రెంచ్ లేదా ఫ్రెంచ్–తెలుగు నుంచి చేయదగిన పుస్తకాల సంఖ్యతో పోల్చుకుంటే ఈ రెండు భాషల్లో ప్రావీణ్యత ఉన్న అనువాదకులు తక్కువ కాబట్టి, మధ్యే మార్గాన ఇంగ్లీషు నుంచి చేసే అనువాదాల పట్ల కూడా ఈ ప్రచురణకర్తలు సుముఖంగానే ఉన్నారు.

"దేశ విదేశ భాషల్లో మన సాహిత్యం ఎందుకు వెళ్ళడం లేదు?" అంటూ ఆవేశపూరితమైన ప్రశ్నల దగ్గర ఆగిపోకుండా, ఎలాంటి అవకాశాలు ఉన్నాయో తెలుసుకుని, వాటి కోసమై రచయితలు, అనువాదకులు, ప్రచురణకర్తలు కలిసి పని జేస్తే ఫలితాలు కనిపించవచ్చు.

■ **పూర్ణిమ తమ్మిరెడ్డి**
purnimat07@gmail.com

ముద్దులు

ఏటొడ్డున గులాబి వన్నెలో పూసే సముద్ర పాలాకు పూలు. ఒంకిని గుంటలో విరిసే తెల్ల తామరలు నీకు ముద్దు.

తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతరలో
తీసిచ్చిన బంగారు చుక్కల నీలపు మట్టి గాజులు. నాయుడుపేటలో కొన్న రవ్వలంత అద్దాలు కుట్టిన చిలకపచ్చ రంగు కెంజాయ అంచు చున్నీ. తూపిలిపాళెం కడలొడ్డున అలలు మనల్ని దొర్లిస్తుండగా దొరికిన పాల తెలుపు చిన్న శంకు నీకు ముద్దు.

నా చేతిపైన మనిద్దరి పేర్ల తొలి అక్షరాల పచ్చబొట్టు. నా ఎడమ చెవికి పెట్టుకున్న తెల్లరాయి పుడక. జడల్లి పూలు పెట్టేదా అంటూ మెడదాకా పెంచుకున్న నా జుట్టులో వేళ్ల జొనిపి సుకుమారంగా గుంజడము. గూడూరు సుందరమహల్లో కలిసి చూసిన చంటి సినిమా ఇలా అప్పట్లో నీకు మన కలయికలోని ప్రతి ఒకటీ ముద్దు.

ఒక నా పుట్టినరోజు సాయంత్రం నుదుటన నువ్విచ్చిన చిన్నప్పటి మా అమ్మ ముద్దు. ఆ రాత్రి చీకటిలో ఏటి ఇసుకపైన నీ నిలువు పెదాలను నా పెదాలకు అప్పగించిన ముద్దు.

రేపట్నుంచి నీకు కనబడనంటూ వెక్కిళ్లతో – గుండెలు పగిలిన కట్టెకు నువ్విచ్చిన చితి కౌగిలి ముద్దు.

కలలన్నీ బూడిదై చివరికి మిగిలిన ఒంటూపిరి బతుక్కి. నీ తలపోతల తపనలే కన్నీటి జడిలో విరిసి మెరిసే వానవిల్లు ముద్దు.

■ **ఫిరోజ్ చిగురుపాటి**

సోమవారం 10 ఫిబ్రవరి 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

స్త్రీని మించిన ఇతివృత్తం లేదు

తెలుగులో ఉత్తరాంధ్ర సాహిత్యానికి ప్రత్యేకమైన విభిన్నత ఉంటుంది. ఈ ప్రాంత భౌగోళికతకు, జీవన విధానానికి కొంత సంఘర్షణ ఎక్కువ. ఆ సంఘర్షణను, ఆర్తిని కవితా వాహికగా నిబద్ధతతో వెల్లడిస్తున్న రచయితల్లో **సాంబమూర్తి లండ** ఒకరు. కవిత్వం పట్ల ఆయన దృక్పథాన్ని, జీవితాన్ని యుద్ధానికి ఉపమానంగా వాడడం వెనుక ఉన్న భావనని ఆయన మాటల్లోనే తెలుసుకొందాం.

మీ కుటుంబ నేపథ్యం గురించి, సాహిత్య ప్రేరణల గురించి చెప్పండి?

నిజానికి మేం సముద్రం పిల్లలం (మత్స్యకార సామాజిక వర్గం). కానీ, నాన్నకు ముందు మూడు తరాలుగా మట్టితో అనుబంధం పెంచుకున్న దిగువ మధ్యతరగతి కుటుంబం. మార్క్స్‌ను చదివిన పోతన నాన్న. అప్పట్లో మాది రెండున్నర ఎకరాల జీడిమామిడి, కొబ్బరి, పనస, మునగ తోటల ఉద్యానవనం. టీచర్‌గా ఉద్యోగం వచ్చినా ఎమ్మెస్సీ చదువుకుంటానంటే కాదనలేనంత ఇష్టం నాన్నకు చదువు మీద.

బాల్యంలో లాంతరు వెలుగుల మధ్య నాన్న చదివి వినిపించిన కాల్పనిక సాహిత్యం నాలో అక్షరాల్ని విత్తాయి. ఆ విత్తనాలు ఉత్తరాంధ్ర బతుకు విధ్వంస ప్రతిఘటనకు దారి చూపాయి. అమ్మ మిగిల్చిపోయిన ఖాళీ తక్షణం నన్ను అక్షరంగా మలిచింది. 'గాజు రెక్కల తూనీగ', 'నాలుగు రెక్కల పిట్ట', 'ఆమెకు మిగలని ఆమె' కవితా సంపుటాలుగా ఇప్పటికి మూడు ఆకులు తొడిగాను. పగళ్లు స్కూల్లో పిల్లలకు పాఠాలు చెబుతూ... రాత్రులు కళ్ళల్లో దివిటీలు వెలిగించుకుని నన్ను నేను వాక్యాలుగా అనువదించుకోవడం మొదలై ఎనిమిదేళ్ళు.

కవిత్వాన్ని మీరు ఎలా నిర్వచించుకుంటారు?

నది ఇంకిన చోట ఒక తడి మేఘపు వాగ్దానం కవిత్వం. జడత్వం నిండిన కాలం ముఖం మీద నీళ్ళు కుమ్మరించి మేల్కొలిపే బాధ్యత. భయంతో నాలుకలన్నీ పిడచగట్టుకు పోయినపుడు నిశ్శబ్దాన్ని చీల్చుకుని మొలకెత్తే చైతన్యపు విత్తు. కవిత్వమంటే అదృశ్య సముద్రం మీద వేట. కనబడని అరణ్యంలో కావాలనే తప్పిపోయి, భుజానికి ఒక వాక్యాన్ని తగిలించుకుని ఇల్లు చేరడం.

.మీ కవిత్వ శీర్షికలలో ఎక్కువగా 'రెక్కల' ప్రస్తావన ఎక్కువ ఉంటుంది, ఎందుకు?

బాల్యంలో ఇంటికీ బడికీ ఇంచుమించు కిలోమీటర్ దూరం. పదోతరగతి వరకూ కాళ్ళు దిగబడే ఇసుకదారిలో రోజుకు నాలుగుసార్లు నడవాల్సి వచ్చేది. అప్పుడంతా చేతుల్ని రెక్కల్లా ఊపుకుంటూ ఎగురుతున్నట్టు కలలొచ్చేవి. రెక్కలమీద ప్రేమ అలా మొదలైందేమో. రెక్కలు అన్నవి నా బాల్యం నాకిచ్చిన శైలీ ముద్ర అనుకోవచ్చేమో మరి.

మీ రచనల్లో జీవితం మీద యుద్ధం చెయ్యాలనే స్ఫూర్తి ఎక్కువగా కనపడటానికి కారణం మీరు టీచర్ కావటం అనుకోవచ్చా?

ఇప్పుడున్నదంతా సంక్షుభిత కాలం. వచ్చేది ఎడతెగని విధ్వంస రుతువు. మనుషుల మధ్య అనుబంధాలను చంపేస్తున్న గ్లోబలైజేషన్, వ్యక్తిగత జీవితాల్లోకి చొచ్చుకు వచ్చిన సోషల్ మీడియా, అన్నింటా పెరిగిన వేగం... వంటి అనూహ్యతల వల్ల మనిషి సహజ సున్నితత్వాన్ని కోల్పోయి అతి సున్నితత్వానికి చేరుకొంటున్నాడు. ఇది సున్నితత్వం లేకపోవడం కంటే ప్రమాదం. అటువంటప్పుడు ఎవరైనా యుద్ధాన్నే బోధించాలి. తెలంగాణాలో ఇంటర్ పిల్లల ఆత్మహత్యల నేపథ్యంలో 'ఇంకొంచెం యుద్ధాన్ని ప్రేమించు', చిన్నవిషయాలకే కలత చెందే నేటి అమ్మాయిలకు 'యుద్ధం నాకు కొత్తకాదు' వంటి కవితలు రాశాను. దీని వెనుక నాలోని టీచర్ కంటే మానసిక సన్నద్ధత కోసం అక్షరాల్ని వాడే రచయిత ప్రభావమే ఎక్కువ ఉందనుకొంటాను.

> **పొద్దున లేచిన్నుంచీ తిరిగి కళ్ళు మూతలు పడే దాకా ఎందరో స్త్రీలు కనుపాపల మీదుగా నడిచిపోతుంటారు. ఊరికే నడిచిపోరు. కనుపాపల మీద లోతైన గాయాలను మిగిల్చిపోతారు. అనేకానేక స్త్రీల ఒకానొక ప్రతిఫలనం 'ఆమెకు మిగలని ఆమె'. జీవితంలో ఇప్పటివరకూ నాకు తారసపడిన ప్రతి నీడకూ అక్షరాలతో బొమ్మ కట్టాలని చూసాను.**



మీ మూడో కవితా సంపుటిగా వెలువరించిన 'ఆమెకు మిగలని ఆమె' గురించి చెప్పండి?

పొద్దున లేచిన్నుంచీ తిరిగి కళ్ళు మూతలు పడే దాకా ఎందరో స్త్రీలు కనుపాపల మీదుగా నడిచిపోతుంటారు. ఊరికే నడిచిపోరు. కనుపాపల మీద లోతైన గాయాలను మిగిల్చిపోతారు. అనేకానేక స్త్రీల ఒకానొక ప్రతిఫలనం 'ఆమెకు మిగలని ఆమె'. జీవితంలో ఇప్పటివరకూ నాకు తారసపడిన ప్రతి నీడకూ అక్షరాలతో బొమ్మ కట్టాలని చూసాను.

ఈ కవితా సంపుటి మొత్తం స్త్రీ కేంద్రంగా రాయడానికి కారణం?

ఏ స్థల కాలమాన పరిస్థితుల్లోనైనా ఆమె బాధిత. గాయాలతో అవమానాలతో అనుమానాలతో సంకెళ్ళతో వున్న ఆమె రూపం ప్రతిసారీ గుండెను ఛిద్రం చేస్తూనే వుంటుంది. ఎప్పుడూ ఆమెను ఓడించాలని చూసే ప్రపంచాన్ని ఎలా ఇష్టపడతాను? వాక్యాల్ని పట్టుకుని ఎదురు నిలబడ్డాను. ఆమె విషయంలో జరుగుతున్నదంతా అన్యాయమేనని చేస్తున్నదంతా నమ్మకద్రోహమేనని చెప్పాలనుకున్నాను.

జీవితంలో తారసపడ్డ స్త్రీలు నన్ను మరింత సున్నితంగా మార్చకపోతే బహుశా ఈ ప్రత్యేక సంపుటి లేదు. సమాజంలో ఇప్పటికీ ఆమె ద్వితీయ శ్రేణి పౌరురాలిగానే పరిగణించబడడాన్ని జీర్ణించుకోలేను. మొగ్గల నుండి రేపో మాపో రాలిపోయే పువ్వుల దాకా జరుగుతున్న లైంగికదాడులు, అత్యాచార పర్వాలు, నగ్న ఊరేగింపులు సిగ్గుతో తలదించుకునేలా చేస్తాయి. సమాజంలో ఉన్న ద్వంద్వ ప్రమాణాలు నిర్ఘాంతపరుస్తాయి. స్త్రీని దేవతను చేసి కూర్చోబెట్టి రాజ్యాలను ఏలుకునే కుట్రలను బద్దలు కొట్టాలనిపిస్తుంది. కవిత్వంలో ఓల్గా, కొండేపూడి నిర్మల, మహెజబీన్‌ల నుండి అందుకున్న ప్రేరణ వుంది. స్త్రీకి మించిన విశాల ఇతివృత్తం లేదు.

ఉత్తరాంధ్ర కవిత్వ నేపథ్యంలో మీ కవిత్వాన్ని ఎలా చూస్తారు?

నా ముందూ నా తర్వాతా సాగే యుద్ధానికి మధ్యలో కొనసాగింపు కావాలి నేను. పదే పదే కట్లు తెంపుకుని చేను మీద పడుతున్న పశువుల మందతో ప్రమాదం ఎప్పుడూ పొంచే ఉంటుంది. బతుకుల్ని చెరిపేయడానికి ఒక తుఫాను ఎప్పుడూ ప్రణాళికలు రచిస్తూనే వుంటుంది. తీరంలో ప్రమాద హెచ్చరికలా నిలబడాలి. ఆ దిశగానే సాగుతున్నాను. ఈ ప్రయాణంలో ఒంటరిని కాదు. మా ముందుతరం దీపధారై నడుస్తోంది. ప్రతిభ, అధ్యయనం, సొంత గొంతూ వున్న వర్తమానతరం వారసత్వాన్ని రెండు చేతులతో అందుకుంది. ఉత్తరాంధ్ర కథకులు, కవులలో ప్రక్రియ, శైలీ, శిల్పం వేరు వేరు కావచ్చు. కానీ వారు చిత్రించే కళింగాంధ్ర సాహితీ ఆత్మ మాత్రం ఒక్కటే. ఈ నేలలో పుట్టిన ఏ కవీ కథకుడూ నిద్రపోవడానికి లేదు. నిరంతరం మెలకువగానే ఉండాలి.

ఇంటర్వ్యూ ■ **సారిపల్లి నాగరాజు, బి. మదన మోహన్ రెడ్డి**
✆ 80083 70326

ముగ్గురు కవుల సప్తతి సభలు

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో ఫిబ్రవరి 16 ఉదయం 10గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో కందుకూరి శ్రీరాములు, నందిని సిధ్ధారెడ్డి, నాళేశ్వరం శంకరం... ఈ ముగ్గురు కవుల సప్తతి సభ జరుగుతుంది. ముఖ్య అతిథి దేశపతి శ్రీనివాస్. సభలో కొండపల్లి నీహారిణి, బైస దేవదాస్, మామిడి హరికృష్ణ, దేవి ప్రసాద్ నరేష్ చారి తదితరులు పాల్గొంటారు.

బెల్లంకొండ సంపత్ కుమార్.

భూతపురి సాహిత్య పురస్కారం

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 88వ జయంతి సందర్భంగా 23వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఫిబ్రవరి 16 ఉదయం 10 గంటలకు సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడపలో జరుగుతుంది. పురస్కార గ్రహీత పుత్తా పుల్లారెడ్డి రూ.10,116 నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను స్వీకరిస్తారు. సభకు అధ్యక్షుడు జి. విశ్వనాథ కుమార్, ముఖ్య అతిథి కె. కృష్ణారెడ్డి, ప్రధానవక్త శలాక రఘునాథ శర్మ

భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి

కళింగాంధ్ర కవితలకు ఆహ్వానం

కళింగాంధ్ర కవుల కవిత్వంతో సిక్కోలు బుక్ ట్రస్ట్ తెస్తున్న వార్షిక సంచిక కోసం ప్రింట్ లేదా ఆన్‌లైన్ పత్రికలలో 2024లో ప్రచురితమైన తమ కవితలలో నచ్చిన రెండు కవితలను ఈమెయిల్: sikkolu books@gmail.com లేదా వాట్సాప్: 99892 65444కు ఫిబ్రవరి 20 లోగా పంపాలి. వార్షిక కవితా సంకలనంతో పాటు కళింగాంధ్ర కవుల డైరక్టరీని కూడా ప్రచురిస్తున్నందున వర్తమాన కళింగాంధ్ర కవులు పేరు, ఫోన్ నెంబర్లను నమోదు చేసుకోవలసిందిగా విజ్ఞప్తి.

సిక్కోలు బుక్ ట్రస్ట్

కథలకు ఆహ్వానం

నవమల్లెతీగ సాహిత్య మాసపత్రిక 18వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా తెస్తున్న కథల ప్రత్యేక సంచిక కోసం ఎ4 సైజులో 3–4 పేజీల కథలను ఫిబ్రవరి 27లోపు యూనికోడ్ లేదా డీటీపీతో పంపాలి. ఈమెయిల్: malleteega@gmail.com; చిరునామా: నవమల్లెతీగ మాసపత్రిక, 6164, టి.ఎఫ్–1, శుభశ్రీ టవర్స్, ఉయ్యూరు జమీందారు స్ట్రీట్, గాంధీనగర్, విజయవాడ–520003. ఫోన్: 92464 15150.

కలిమిశ్రీ

ఇవి హృదయం లెక్కలు

తాటిశెట్టి రాజు గారి 'ఏకాంతం' కవితను ఇటీవలి నా ప్రియపద్యంగా విశ్లేషణకు ఎంచుకున్నాను. ప్రేమలో ఉండే స్వచ్ఛత, నిజాయితీతో కూడిన కవి భావ ప్రకటన... అదే ఈ కవిత ఆకట్టుకోడానికి ముఖ్య కారణం. ఈ కవితలో మొదటి మూడు స్టాంజాలు మూడ్‌ని రిఫ్లెక్ట్ చేసే వాతావరణాన్ని వర్ణిస్తే, తర్వాతి పేరాలు కవి భావనని తెలియ జేస్తాయి. మన మనసుని బట్టే చుట్టూ వాతావరణం కనిపిస్తుంది. నిజానికి ఏది చీకటి? ఏది వెలుగు? ప్రతీదీ మన భాష్యమే! ప్రతీదీ మన అన్వయమే! మన అనుభూతులు మనతో ఆడుకునే ఆటల దృశ్యాలే అన్నీ!

ప్రేమ ఒక వరము, ఒక శాపము. ఆశించడం, ఆక్రోశించడం జీవితంలో భాగాలు. ప్రేమతో నిండిన హృదయానికి, బండబారినపోయిన లోకం తీరు, దాని లెక్కలు ఒక మింగుడుపడని విషయం. అందుకే ప్రేమలో ఓడిపోయినా సరే, హృదయానికే పెద్ద స్థానమిచ్చి, ఓడినా ప్రేమదే గెలుపని చెప్పాడు కవి. ప్రేమ కలిగిన మనసు స్వచ్ఛమైనది. ఆ మనసు నుండీ పుట్టే దుఃఖాలు, వ్యథలు, కన్నీళ్ళు, కవిత్వాలు ఏవైనా సరే స్వచ్ఛమైనవీ, అర్థవంతమైనవీ, విలువైనవి!

బంధం రెండు హృదయాలను కలిపే వంతెన. అది విఫలమై, ఒంటరైన హృదయంలో ప్రేమ అనాథ, బిచ్చగత్తె! లేదా లాభనష్టాల బేరీజు లోకంలో ప్రేమ దిక్కులేని అనాథ! రెండు హృదయాల మధ్య తాళ గతులు తప్పితే పొసగని బంధాలలో ప్రేమ అనాథ! మనిషి చుట్టూ ఉండే రకరకాల పరిస్థితులతో, ప్రేమకివ్వలేని విలువతో ప్రేమ అనాథ!

ప్రేమను కోల్పోయాక మళ్ళీ ప్రేమ కోసమే పరితపిస్తాడు మనిషి. అలా ప్రేమ వెతుకులాటలో మనుషుల స్వభావాల గురించి గమనింపులేనితనంలోనో, లేదా రెండు మనసుల మధ్య సామరస్యం కుదరకో పొలమారటం, పోగొట్టుకోవటం జరిగిపోతాయి. తిరిగి మరో ప్రేమ కోసమో, భరోసా కోసమో వెతుకులాట మొదలవుతుంది.

అంతులేనంత ప్రేమతో ఈ ప్రపంచం నిండి ఉంది. ఎన్నో బంధాలు మనిషిని పెనవేసుకునే ఉన్నాయి. అయినప్పటికీ తనకి తాను మాత్రమే మిగిలే ఒంటరితనం మనిషిని వెంటాడుతూనే ఉంటుంది, చివరికి ఆ ఒంటరితనమే మిగులుతుంది చాలాసార్లు. ఇదే తాత్వికతతో ఈ కవిత ముగుస్తుంది.

■ **రాళ్ళబండి శశిశ్రీ**
✆ 74163 99396

ప్రియ పద్యం

ఏకాంతం

కిటికీ లోంచి వచ్చి పడుతున్న చీకటితో
గదిలో గుడ్డిదీపం తగాదా పడుతోంది

దూరంగా ఎక్కడో కురుస్తున్న వర్షాన్ని
వెక్కిరింతగా మా ఊరికి ఉరుమి చెప్తోంది నింగి
పగటిపోరాటంలో గెలవలేని ఓ బక్కకుక్క
రాత్రి చీకట్లో పౌరుషంగా రంకెలేస్తోంది
వీధిలో ఒంటరిగా

లాభనష్టాలు లోకం లెక్కలు
ప్రేమ – విరహం హృదయానివి

ప్రేమలో ఓడిపోనీ
అది లోకంలో విజయాలన్నిటి కంటే విలువైనది

ఒట్టి వ్యథ, దుఃఖం, కన్నీళ్ళు, కవిత్వం
ప్రేమ వల్ల అర్థవంతమయ్యాయి

ప్రేమకోసం లోకంలో వెతుకుతున్నావా?
పాపం అది ప్రేమలో అనాథ బిచ్చగత్తె

పొలమారి గొంతు అడ్డం పడ్డప్పుడు
అన్నీ నీళ్ళ కుండలుగానే తోస్తాయి
లోపల ప్రేమ పొలమారినప్పుడే
మనసు మరో మనసు కోసం తడుముకుంటుంది

వచ్చిపోయే వలసపక్షుల గుడారం–చెట్టుకి
దాని నీడ మాత్రమే తన శాశ్వత తోడని
ఎవరూ చెప్పనక్కర్లేదు

■ **తాటిశెట్టి రాజు**

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

ఐకమత్యం సాధ్యమా?

నదుల అనుసంధానంతోనే కరువు దూరమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాజాగా ప్రస్తావించారు. తమ ప్రభుత్వం దానికి కట్టుబడి వుందని ప్రకటించారు. నదుల అనుసంధానం గురించి ఆ మధ్య కేంద్ర ప్రభుత్వం కూడా ప్రకటించింది.నిజంగా ఆచరణలో జరిగితే మంచిదే.ఈ ప్రయాణంలో రాజకీయాలు అడ్డుగోడలుగా నిలుస్తాయన్నది నిక్కం.మహానది, గోదావరి, కృష్ణ, పెన్నా,కావేరి నదులను కేంద్రం ఆ జాబితాలో చేర్చింది.ఈ దిశగా అడుగులు వేయడం కూడా ఆరంభించింది.అందులో భాగంగా గత ఫిబ్రవరిలో ఢిల్లీలోని శ్రమశక్తి భవన్ లో కేంద్ర జలశక్తి శాఖ ప్రత్యేక సమావేశం కూడా ఏర్పాటు చేసింది.జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్ డబ్ల్యూ డి ఏ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.రెండు తెలుగు రాష్ట్రాలు,కర్ణాటక,తమిళనాడు, పుదుచ్చేరి అధికారులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. మొదటగా ప్రకటించినప్పుడు పై ఐదు నదులను ప్రస్తావించింది. కానీ ఆ సమావేశంలో గోదావరి – కావేరి నదుల అనుసంధానం మాత్రమే చర్చలోకి వచ్చింది.దానిని ప్రాధమిక సమావేశంగానే అప్పుడు అందరూ చూశారు.సంబంధిత రాష్ట్రాల అభిప్రాయాలను తెలుసుకోవడమే ప్రధానంగా ఆ సమావేశం ముగిసింది.నదుల అనుసంధానం పట్ల అన్ని రాష్ట్రాలు సుముఖంగానే ఉన్నప్పటికీ, ఆలోచనలు వేరు వేరుగా ఉన్నాయి. కేంద్రం – రాష్ట్రాల మధ్య నిధుల కేటాయింపు,అనుసంధానానికి అవసరమైన భూసేకరణ,ఏ ప్రాజెక్టు నుంచి ఏ ప్రాజెక్టుకు అనుసంధానం చేయవచ్చు,ఇంకేమైనా ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయా? అనే వాటిపై చర్చ ఇప్పటికే జరిగింది.బహుశా! తదుపరి సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉందని తెలుస్తోంది.ముందుగా, రాష్ట్రాల మధ్య ఐకమత్యం కుదరడం,కేంద్ర– రాష్ట్రాల మధ్య సమతుల్యతను సాధించడం కీలకం.ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన అంశాలు ఒక కొలిక్కి రాలేదు. ‘నీరు –నిధులు –నియామకాలు’ ఆశించిన మేరకు, రావాల్సిన మేరకు ఆచరణకు నోచుకోలేదు.గోదావరిలో నీటి లభ్యత ఎంత మేరకు ఉంటుంది, ట్రిబ్యునల్స్ కేటాయించిన నీరు కాకుండా అదనపు జలాలు ఎంత మేరకు ఉంటాయి,వాటిని ఏ మేరకు ఉపయోగించుకోవచ్చనే వాటిపై కేంద్ర ప్రభుత్వ వైఖరిలో స్పష్టత రావాల్సివుంది.గోదావరి మిగులు జలాలను తరలించడం పట్ల తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలంగాణ అధికారులు చెప్పినట్లు సమాచారం.పోలవరం ప్రాజెక్టును ప్రాతిపదికగా తీసుకొని అక్కడ నుంచే గోదావరి– కావేరి అనుసంధానం ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల శాఖ అధికారులు తెలిపినట్లు తెలుస్తోంది. గోదావరి మిగుల జలాలను తరలించడం విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదని ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసినట్లు సమాచారం.తమకు నేరుగా జరిగే లబ్ధి ఎంతవరకూ ఉంటుంది, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలకు ఎలాంటి ఉపయోగం ఉంటుందనే వాటిపై కర్ణాటక స్పష్టతను కోరుకుంటోంది. ఐదు రాష్ట్రాలు వెల్లడించిన అభిప్రాయాలను క్రోడీకరించి, తదుపరి చేపట్టే సమావేశంలో గోదావరి –కావేరి అనుసంధానంపై డిపిఆర్ లో మార్పులు, కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంది. నదుల అనుసంధానం అనేది గొప్ప ప్రాజెక్టు. పాత వివాదాలకు ముగింపు పలుకుతూ, కొత్త వివాదాలను సృష్టించుకోకుండా,రాజకీయాలకు అతీతంగా, సర్వప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని,అన్ని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి ముందుకు వెళితే? దేశ సౌభాగ్యం మరింత పెరుగుతుంది.దక్షిణాదిలో గోదావరి, కావేరి చాలా ముఖ్యమైన నదులు. అనుసంధానం అంతే కీలకమైంది. నీటి లభ్యత మొదలు వినియోగం వరకూ రాష్ట్రాలు ఎటువంటి సందేహాలు,అభ్యంతరాలను వ్యక్తం చేస్తాయో? అనే భయాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు.గతంలో చెలరేగిన వివాదాలు,యుద్ధాలే ఈ భయాలకు తార్కాణంగా వారు చెబుతున్నారు.జాతీయ ప్రాజెక్టులు చేపట్టడానికి సంబంధించిన విషయంలో కేంద్రం తాజాగా కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. నిర్మాణ వ్యయంలో కేవలం 60శాతం మాత్రమే కేంద్రం ఇవ్వనుంది.40 శాతం రాష్ట్రాలు భరించాల్సి వస్తోంది.గతంలో ఈ నిష్పత్తి 90%–10% గా ఉండేది. ఇటువంటి పరిస్థితుల్లో అనుసంధానం ప్రాజెక్టులు ముందుకు వెళ్ళాలంటే ఎన్ని దశాబ్దాలు పడుతుందో? అనే సందేహాలను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రాలకు,అందునా ఆంధ్రప్రదేశ్ కు ఉన్న ఆర్థిక పరిపుష్టి చాలా తక్కువ.కేంద్రం పెద్ద స్థాయిలో సహకరిస్తే తప్ప ఏ నీటి ప్రాజెక్టు ముందుకు వెళ్ళలేదు. ఇటువంటి అనేక ఇబ్బందులకు,సమస్యలకు ముందుగా పరిష్కారం లభించాలి. ఆ దిశగా కేంద్రం–రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సాగాలి.నదుల అనుసంధానం అనే బృహత్ సంకల్పం సత్వరమే ఆచారణాత్మకం కావాలని ఆకాంక్షిద్దాం.

ట్రంప్ అమానుషం

తిక్కోడికి పెత్తనమిస్తే ఉన్న ఇంటి మొత్తాన్ని ఊడబెరికాడట! రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహార తీరు ఆ రీతిన సాగుతోంది. ఎడతెరిపి లేని ఏకపక్ష నిర్ణయాలతో స్వదేశంలోనూ, ప్రపంచ దేశాల్లోనూ ట్రంప్ సృష్టిస్తున్న ప్రకంపనలు చివరికి ఏ దరికి చేరతాయో, ఏ దారుణాలకు దారి తీస్తాయో చూడాలి! ‘అమెరికా ఫస్ట్’, ‘అమెరికాకు పూర్వ వైభవం’ వంటి వీరావేశ ప్రసంగాలతో గెలుపొందిన ట్రంప్ ఇతర దేశాలతో పేచీలకు దిగటమే పెద్ద అభివృద్ధి మార్గంగా ఎంచుకోవటం అహంభావపూరితమే కాదుబీ అర్థరహితం కూడా! ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధాలకు ఢంకా మోగించటం, దిగుమతి సుంకాల పెంపు పేరుతో బెదిరింపులకు దిగటం దిగుజారుడు చర్య తప్ప మరొకటి కాదు.తగిన పత్రాలు లేని వలసదారుల గెంటివేత ద్వారా తాజాగా అమెరికా చేపట్టిన బహిష్కరణ పర్వం ఆ దేశ చరిత్రలోనే అతి పెద్దది. ఈ తంతుకు బలయ్యేవారిలో 7.25 లక్షల మంది భారతీయులు ఉండగా, ప్రస్తుతానికి 17,940 మందిని ఇండియాకు పంపటానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో 104 మందిని బేడీలు వేసి, అమెరికా సైనిక విమానం బుధవారం నాడు అమృతసర్‌లో దించిపోయింది! తమ పౌరులను సైనిక విమానంలో పంపటం భావ్యం కాదని కొలంబియా లాంటి చిన్న దేశం అభ్యంతరం చెప్పినా కానీ, మేరా భారత్ మహాన్ అని ఉపన్యాసాలు దంచే మోడీ గొంతు మాత్రం కనీసంగా కూడా పెగల్లేదు. పైగా, అక్రమ వలసలు కాబట్టి ఈ గెంటివేతను సగౌరవంగా స్వాగతిస్తున్నట్టు విదేశాంగ మంత్రి జైశంకర్ ఘనంగా ప్రకటించారు. అమెరికా అమానవీయ వైఖరికి నిరసనగా ప్రతిపక్షాలు పార్లమెంటును స్తంభింపచేయడం భారత ప్రజల మనోభావాల వ్యక్తీకరణే! అమెరికా అదనపు సుంకాల విధింపుపై చైనా దీటుగా స్పందించింది. మెక్సికో మాట్లాడింది. ఇతర దేశాలూ నోరు విప్పాయి. ట్రంప్ తన తలతిక్క నిర్ణయాలతో మన దేశ ప్రయోజనాలకు చిల్లు పెడుతున్నా సరే, చిన్నపాటి స్పందన కూడా చూపనిది మన ప్రధాని మోడీనే.ప్రపంచంలోని అత్యధిక సంపద అతికొద్దిమంది దగ్గరకి చేరిపోయి, అత్యధికులు రోజువారీ జీవనానికే నానా తంటాలు పడుతున్న సంక్షుభిత కాలం ఇది. అత్యధిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంపద పున:పంపిణీ విధానాలు చేపడితేనే ఆర్థిక సంక్షోభం నుంచి విముక్తి. కానీ, కార్పొరేట్ సంపన్నులు మరింత లాభపడే అపసవ్య విధానాలతోనే పెట్టుబడిదారీ పాలక వ్యవస్థ నడుస్తోంది. ఆ ఇనుప కాళ్ల కర్కశ నడకలో నలిగిపోయే అత్యధిక ప్రజల అసంతృప్తిని, ఆవేదననీ పక్కదోవ పట్టించటానికి పాలకపక్షాలు ఇతర దేశాలను, మతాలను బూచిగా చూపించే బూటకపు వైఖరిని అవలంబిస్తున్నాయి. ఇప్పుడు అమెరికా పనిగట్టుకొని చేస్తున్న ప్రయత్నం ఇదే! దీని అమల్లో విద్వేషం, విపరీత ప్రవర్తన పొటమరించిన ట్రంప్ దూకుడు మరింత ఎక్కువగా కనిపిస్తోంది. గాజాను స్వాధీనం చేసుకుంటామని, దానిని పునర్మిస్తామని ట్రంప్ చేసిన ప్రకటన అమెరికా ఆధిపత్య ధోరణికి ఆనవాలు. సాయం పేరుతో చొరబడి, సర్వ పెత్తనం చేస్తామన్న అహంకారం ఆ మాటల్లో ధ్వనించింది. దీనిపై గాజా, హమాస్ అభ్యంతరం వ్యక్తం చేయగా, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్వాగతగీతం పాడడం దురాక్రమణ బుద్ధికి నిదర్శనం. పాలస్తీనా విధ్వంసానికి కారకుడైన నెతన్యాహు ముక్కు పిండి, మూల్యాన్ని రాబట్టి గాజాను పునర్నిర్మించాలి. అలా కాక జోడు తోడేళ్లు మాదిరి కూడబలుక్కొని ట్రంప్, నెతన్యాహు ఒకరి ఉద్దేశాలకు ఒకరు వంత పాడడంలోనే వారి దుర్బుద్ధి బయటపడుతోంది. ఇలాంటి ఆధిపత్య అంగలకు కొద్ది మాత్రంగానైనా అడ్డు పడుతున్నాయనే ఐక్య రాజ్య సమితి అన్నా, ఇతర ప్రపంచ వేదికలన్నా యుద్ధోన్మాద ట్రంప్‌కి గుర్రు. బ్రిక్స్ దేశాలపైనా, ఐరోపా సమాఖ్య పైనా దిగుమతి సుంకాలు విధిస్తామన్న బెదిరింపు, కొన్ని దేశాలపై ఇప్పటికే విధించిన వైనమూ తన పీఠం కదిలిపోతుందన్న అమెరికా భయానికి నిదర్శనం. వాస్తవానికి ఏ దేశమైనా తనకు కావాల్సిన వస్తువులనే దిగుమతి చేసుకుంటుంది. వాటిపై విధించే సుంకాల వల్ల ధరలు పెరిగి ఆ భారం ఆ దేశ పౌరులపైనే పడుతుంది. సుంకాల పెంపు ఘట్టం తాత్కాలికంగా ఎగుమతి దేశాలకు కొంత నష్టం కలిగించినా– ఆ వాణిజ్య యుద్ధం కొనసాగింపులో అమెరికా శాశ్వత మూల్యం చెల్లించక తప్పదు! బ్రిక్స్, ఇయూ వంటి కూటములు బలపడడం ద్వారా అమెరికా దూకుడుకు, దుర్మార్గ బుద్ధికి కళ్లెం వేయటం ఇప్పటి చారిత్రిక అవసరం.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం

భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఎన్నికల వ్యవస్థ. భారత రాజ్యాంగం 326 ఆర్టికల్ ద్వారా కుల ‘మత’ ప్రాంత ‘లింగ ‘జాతి బాషా ‘అనే భేదం లేకుండా అక్షరాస్యులకు’ నిరక్షరాస్యులకు 18 సంవత్సరాల వయస్సు నిండిన భారత జాతీయ పౌరులకు వయోజన ఓటు హక్కును కల్పించింది .ప్రపంచ రాజకీయ చరిత్రలో గొప్ప విప్లవాత్మకమైన మార్పు ఓటుహక్కు ప్రపంచ రాజకీయ చరిత్రలో ఓటు హక్కు గొప్ప విప్లవాత్మకమైన మార్పు. అభివృధి చెందిన దేశాల కంటే ముందే మన దేశంలో వయోజన ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసింది.ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసే అవకాశం పౌరులందరికీ కల్పించింది . ఐదేళ్లకు ఒక సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వియోగించుకోవడం తో పాటు తాము కోరుకున్న పాలనను ప్రజలే తెచ్చుకోవచ్చు. మన భవిష్యత్తు మన చేతిలోనే ఉంది అన్న విషయాన్ని ఓటు చాటుతుంది . ఓటు రూపములో భవిష్యత్తుకు మనమే బాట వేసుకునే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది.ఓటు అనే రెండు అక్షరాలు దేశ చరిత్రను మార్చి వేస్తుంది. ప్రభుత్వాలను కూలదొస్తుంది. ఓటు తూటా కంటే గొప్పది .ఓటు హక్కు వజ్రాయుధం .ఓటు హక్కును వినయోగించు కోవడం ప్రజల ప్రధాన కర్తవ్యం.ఓటు హక్కుపై విస్తృత ప్రచారంచెయ్యాలి. కుల మతాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటుహక్కు వినియోగం సార్వత్రిక ఎన్నికలుభారత దేశములో 2023 జనవరి 1 నాటికి నమోదైన మొత్తం ఓటర్ల సంఖ్య 95 ‘50 ‘25’694 చేరింది.దేశంలో జనభాతో పాటు ఓటర్ల సంఖ్య పెరుగుతుంది. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచటానికి ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యలు పోలింగ్ శాతం పెంచడంలో విఫలమైనాయి. .ఓటర్లలో 3 వ వంతు పోలింగ్ కు దూరంగా ఉంటున్న స్థితి కొనసాగుతుంది. దేశంలో 1951 నాటికి నమోదైన ఓటర్ల సంఖ్య 68 కోట్లు’ 2023 నాటికి 94.50 కోట్లకు పెరిగింది .యువకులు’ పట్టణ నగర ప్రాంతాలలో ఓటర్లు పోలింగులో పాల్గొనడం లేదు. గత లోకసభ సార్వత్రిక ఎన్నికల్లో 3 వవంతు ఓటర్లు పోలింగుకు దూరంగా ఉన్నారని ఎన్నికల కమిషన్ పేర్కోవడం గమనార్హం దేశములో 1951 లో నమోదైన ఓటర్లు 17.32 కోట్లు వుండగా 45.57 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. దశాబ్దాలుగా దేశంలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిన ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల సంఖ్య పెరుగుక పోవడం శోచనీయం.1957 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య19.37 కోట్లు ఉండగా అందులో 47.74 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నరు.ఓటర్ల పోలింగ్ శాతాన్ని 75 శాతానికి పెంచటానికి ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తుంది.2014 లో దేశంలో నమోదైన ఓటర్ల సంఖ్య 83.4 కోట్లు పోలింగ్ శాతం 66.44 వుంది.2019 లో లోకసభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన మొత్తం ఓటర్ల సంఖ్య 91.2 కోట్లు పోలింగ్ శాతం 67.4.శాతం మించలేదు. 2019 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 30 కోట్ల మంది పోలింగ్ బూతుకు వెళ్లలేదని ఓటు హక్కు వినియోగించుకోలేదని ఎన్నికల కమిషన్ నిర్ధారించింది.పట్టణ నగర ప్రజలు యువకులు విద్యావంతులు వలస కార్మికులు ఓటువేయని వారిలో ఉన్నారని తేలింది.ఇటీవల హిమాచల్ ప్రదేశ్ గుజరాత్ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో పట్టణ ప్రజలు పోలింగ్ లో పాల్గొనకుండా వున్న ఉదాసీన వైఖరిని ఎన్నికల కమిషన్ గుర్తించింది.ఉన్న చోటే ఓటు హక్కు వినియోగం రిమోట్ ఓటింగ్ విధానం ,స్వరాష్ట్రములో ఓటరుగా నమోదైన వారు వివిధ కారణాల వల్ల వేరువేరు చోట్లకు వలస వెళ్లిన క్రమములో ఓటు హక్కు వినియోగించుకునే స్థితిలో లేరువారి కొరకు రిమోట్ ఓటింగ్ విధానం నూతన సాంకేతికతను ఎన్నికల కమిషన్ ప్రతిపాదించింది. వినూతనమైన కమ్యూనికేషన్ వ్యూహాల మీద ఎన్నికల కమిషన్ దృష్టిపెట్టింది.రాజకీయ ఏకాభిప్రాయం రిమోట్ ఓటింగ్ విధానం మీద దేశములో వున్న జాతీయ ప్రాంతీయ పార్టీలు ‘ఉప ప్రాంతీయ పార్టీల ఏకాభిప్రాయం కావాలి. ఎన్నికల కమిషన్ ప్రతిపాదించిన సంస్కరణలకు ఇచ్చిన సూచనలకు రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసిన సంఘటనలు చాలా తక్కువగా ఉన్నాయి. 1962 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 55.42 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు 2009 లో జరిగిన ఎన్నికల్లో 71.70 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 91.20 కోట్లు ఉండగా 67.40 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల వివరాలుపురుషులు 15048250 స్త్రీలు ... 14924718 థర్డ్ జెండర్.1951ఎన్ ఆర్ ఐ 2740 రక్షణ రంగములో పనిచేసే సేవారంగం 15282మొత్తం 2 99 92941 వున్నారు. ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగం మీద పోలింగ్ బూతుల వారిగా అవగాహన చైతన్యం కలిగించాలి. ఎన్నారై ఓటర్లు ఆన్లైన్ ఓటింగ్ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో 2.2 కోట్ల మందికి పైగా ఎన్ ‘ర్ ‘ ఐ ఓటర్లు ఉన్నట్లు అంచనా వీరికి త్వరలో ఒక చట్టం తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఆన్లైన్ ఓటింగ్ విధానం రిమోట్ ఓటింగ్ విధానం అమల్లోకి వస్తే ఎన్ ‘ఆర్ ‘ఐ లు తమ వోటు హక్కును వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.ఓటింగ్ శాతం పెంచడానికి తీసుకోవలసిన చర్యలు ఎన్నికల కమిషన్ నిరంతరం ఓటర్ల నమోదు కొత్తవోటర్ల చేరికలు డూప్లికేటే ఓటర్ల ను దొంగ ‘ఓటర్లను ఓతర్ల జాబితా నుండి తొలగించే కార్యక్రమాన్ని సమర్ధవంతంగా చేపట్టాలి.కళాశాల స్థాయిలో ఓటర్ల నమోదు కేంద్రాలను ఏర్పాటు చెయ్యాలిఎలక్షన్ లిట్రసీ క్లబ్ లను నిర్వహించాలి.ఎన్నికల అక్షరాస్యత బలమైన ప్రజాస్వామ్యం కొసం ఎన్నికల అక్షరాస్యత పరివ్యాప్తిలోయువజన ‘మహిళా ‘స్వశక్తి సంఘాలు’ పౌర సమాజం స్వచ్ఛంధ ‘ సామాజిక సేవా సంస్థలు క్రియాశీలక పాత్ర పోషించాలి.నిర్బంధ ఓటింగ్ విధానం సంస్కరణలు చట్టాలు ప్రభుత్వం నిర్బంధ ఓటింగ్ విధానం అమల్లోకి తేవాలి.అందుకు అవసరమగు బిల్లు లోకసభలో ప్రవేశ పెట్టి సమగ్ర ఎన్నికల చట్టాలను రూపొందించాలి.భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేర్కొన్నట్లు మొత్తం ఓటర్లలో 90శాతంఓటింగ్ జరిగితే దేశం అభివృధి పథంలో ముందుకు సాగుతుంది అన్న వాక్య యువతకు పట్టణ ఓటర్లకు కనువిప్పు కావాలి. .యువత ఓటువే యడం మీద ఆసక్తి చూపడం లేదు. ఓటు విలువ మీద విస్తృత స్థాయిలో ప్రచారం చెయ్యాలి. ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం. గ్రామ సభ’ పురపాలక ‘నగర పాలక సంస్థలు ప్రతి 3.నెలలకు ఒక సారి ఓటు హక్కు వినియోగం ఓటు నమోదు దొంగ ఓటర్ల గుర్తింపు తొలగింపు మీద సమావేశాలు నిర్వహించి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగం పై అవగాహన చైతన్యం కలిగించాలి.ఓటు హక్కు వినియోగం మీడియా మీడియా టివి సినిమా ప్రచార ప్రసార సాధనాలు మాధ్యమాలు ఓటు హక్కు వినియోగం ఓటు విలువ ఓటింగ్ విధానం పట్ల ప్రచారం చెయ్యాలి.ఓటరుగా వున్నందుకు గర్వపడుతున్నాను ఓటు వేయడానికి సిద్ధంగా వున్న అనేది నినాదం కాకుండా ఓటర్ల విధానం కావాలి. లోకసభ’ శాసన సభ ‘స్థానిక సంస్థల ఎన్నికల్లో విధిగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి.ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా సమర్థులైన అభ్యర్థులకు ఓటువేసి ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకుంటామని ప్రతిజ్ఞ చెయ్యాలిఅప్పుడే ప్రజలచేత ప్రజల కొరకు ప్రజలు ఏర్పరుచుకున్న ప్రభుత్వం ఏర్పడుతుంది. ఫలమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రగతి పురోగతి’ సంక్షేమం సిద్ధించి దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుంది. **నేదునూరి కనకయ్య**

అష్టోత్తర శతం



108. ఏమిటి ఈ సంఖ్య? ఏదైనా మంత్రం చదివితే, 108 సార్లు అంటారు. ప్రదక్షిణాలు చేసినా, 108 సార్లు చేస్తే మంచిదంటారు. ఇది చాదస్తమా? సాంప్రదాయమా? లేక, ఈ అంకె వెనక ఏదైనా మిస్టరీ ఉందా? భారతీయుల అద్భుత గణిత పరిజ్ఞానానికి బ్రాండ్ నెంబర్ 108. అవును. దిమ్మతిరిగే పరిశోధనలను భారతీయులు వేల ఏళ్ళ క్రితమే ఎలా చేశారు? అని చెప్పడానికి ప్రపంచానికి ఇచ్చిన ఎన్క్రిప్టెడ్ కోడ్ 108. ఆలయంలో ప్రదక్షిణలు ఎన్ని చేయాలి? అంటే, చదువు రానివారు కూడా 108 చేస్తే మంచిది అంటారు. రుద్రాక్ష, తులసి, ఇలా ఏ మాల తీసుకున్నా,, 108 పూసలు ఉన్నాయా? అని గుచ్చి గుచ్చి మరీ అడుగుతాం. “ఈ మంత్రాన్ని 108 సార్లు జపించండి, మంచిది” అంటాడు పురోహితుడు. ఏమిటి ఈ 108 కొందరు దేవుడిని నమ్ముతారు. కొందరు నమ్మరు కూడా. కానీ, అందరూ నమ్మేది సైన్స్. కనుకే, అందరూ నమ్మే పరిశోధనలు చేశారు భారతీయ ఋషులు. అవి అలాంటి ఇలాంటి పరిశోధనలు కాదు, అందుకు సరైన ఉదాహరణ ఈ 108. ఈ 108 వెనుక అంతరిక్ష శాస్త్రమే దాగుంది. ఈ భూమి ఎక్కడిది? ఎక్కడి నుంచి వచ్చింది? ఖగోళం అనే వృత్తంలో సూర్యుడు, సూర్యుడు చుట్టూ ఎంత దూరంలో తిరుగుతున్నాడు? వీటన్నిటికీ సమాధానం 108.వేదకాలంలో ఎన్నో అద్భుత పరిశోధనలు జరిగాయి వాటిలో అంతరిక్ష శాస్త్రం కూడా ఒకటి. సూర్యుడికి భూమికి, చంద్రుడికి భూమికి మధ్య దూరాలు ఓ రెండు మూడు వందల ఏళ్ళ క్రితమే కనుక్కున్నారని పుస్తకాల్లో చదివాం. కానీ, వేదాల్లో ఈ డిస్టెన్స్ లు ఎప్పుడో చెప్పేసారు. ఎలా అంటే, 108 తో.. భూమికి, చంద్రుడికి మధ్య దూరం చంద్రుని వ్యాసానికి 108 రెట్లు. భూమికి సూర్యునికి మధ్య దూరం సూర్యుని వ్యాసానికి 108 రెట్లు. సూర్యుడి వ్యాసం భూమి వ్యాసానికి 108 రెట్లు. ఏంటి? ఆశ్చర్యంగా ఉందా? అవును. మనం నివసించే భూమి, మన భూమికి ప్రాణాన్నిచ్చే సూర్యుడు, భూమి ఆకర్షణను బ్యాలెన్స్ చేసే చంద్రుడు, అన్నిటి లెక్కలు, అన్నిటి దూరాలు ఈ 108తో లింకప్ అయి ఉన్నాయి. ప్యూర్ ఎస్ట్రనామికల్ సైన్స్. ఊహించారా? 108 వెనక ఇంతకథ ఉందని.. ఇవన్నీ కాకి లెక్కలు కావు. ఆధునిక సైన్స్ పెద్దపెద్ద కంప్యూటర్లతో, మిషన్లతో, శాటిలైట్లతో కనిపెట్టిన గ్రహాల దూరాలకి వేద కాలంలో భారతీయ ఋషులు 108 కోడ్ తో చెప్పిన ఈ డిస్టెన్స్ కి కరెక్ట్ గా సరిపోయాయి. మరి ఎవరు గొప్ప? ఇక్కడితో ఆగిపోతే మనం భారతీయులం ఎలా అవుతాం? మన జీన్స్ లోనే ఫిలాసఫీ ఉంది. సైన్స్ ఉంది. లిఆయుర్వేదం అందరికీ తెలిసిన వైద్యగ్రంథం. ఆయుర్వేదం ప్రకారం మనిషి శరీరంలో 1071 మర్మ స్థానాలు ఉంటాయి. ఈ మర్మస్థానాలే మన శరీరంలో అన్ని భాగాలకు ప్రాణాన్ని సరఫరా చేస్తే శక్తి ఉత్పత్తి కేంద్రాలు. మర్మకళ అని ప్రాచీన కేరళ వద్ద కళ ఒకటి ఉంది. వాళ్లు మన మర్మాల మీద దాడి చేసి ఆ పార్టులు పనిచేయకుండా చేయగలరు.శ్రీ చక్రం వినడం వినడమే కానీ, శ్రీ చక్రం అంతరార్థం ఏంటో చాలామందికి తెలియదు. సృష్టి రహస్యానికి బ్లూ ప్రింట్ అది., శ్రీ చక్రంలో 54 స్త్రీ, 54 పురుష అంతర్భాగాలు ఉంటాయి. మొత్తం 108. పాజిటివ్ నెగిటివ్ కలిస్తే ఎనర్జీ. శక్తిని ఉత్పత్తి చేసే ప్రాచీన యంత్రం అది. శ్రీ చక్రం ఇంట్లో ఉంటే నెగిటివ్ ఎనర్జీలను పాజిటివ్ ఎనర్జీగా మారుస్తుందని విశ్వాసం. జ్యోతిష్య శాస్త్రం కొంతమందివల్ల అది మూఢనమ్మకమనే మచ్చ పడింది. కానీ, జ్యోతిష్యం అంటే కంప్లీట్ సైన్స్. కంప్లీట్ మ్యాథమెటికల్ ఈక్వేషన్స్. దీనికి 108కి సంబంధమేంటి? అంటే, మనిషిలోని బిహేవియర్లకు సూచికలు. ప్రతి మనిషిలోనూ వారి వారి ప్రవర్తనలకు సూచికలు 27 నక్షత్రాలు. మనం పుట్టినప్పుడు ఏ నక్షత్రం, ఏ గ్రహం, ఈ భూమి మీద ప్రభావం చూపిస్తాయో, వాటి ప్రవర్తనలే మన జాతకాల మీద, మన జీవితం మీద ప్రభావం చూపిస్తాయి. అశ్విని, భరణి 27 నక్షత్రా లు. ఒక్కో నక్షత్రానికి నాలుగు పాదాలు 27 నక్షత్రాన్ని ఈ నాలు గు పాదాలతో గుణిస్తే, అక్కడ 108 వస్తుంది. ఇందులో 9 పాదాలు ఒక్కొక్క రాశిలో ఉంటాయి. అలా రాశులు మళ్ళీ 12 ఉంటాయి.ఆధునిక మానసిక తత్వశాస్త్రం కూడా మనిషిలో ముఖ్యమైన బిహేవియర్లు 108 ఉంటాయని చెబుతోంది.మన ప్రాచీన ఆయుర్వేద శాస్త్రం ప్రకారం మనిషి సగటున ప్రతి రోజు 21,600 సార్లు శ్వాస తీస్తాడు. అందులో పదివేల ఎనిమిది వందల సూర్యాంశ, అంటే ప్రాణశక్తి. పదివేల ఎనిమిది వందల సార్లు చంద్రాంశ. అంటే, మనం వదిలే కార్బన్ డయాక్సైడ్ అనుకోవచ్చు. ఆక్సిజన్ పీల్చుకొని, కార్బన్ డయాక్సైడ్ ని వదల డం అన్నమాట. పదివేల ఎనిమిది వందలని అంటే 108 వందలే కదా.భరతుని నాట్య శాస్త్రంలో చేతులు, కాళ్లు కలిపి చేసే నాట్య భంగిమలు 108 ఉంటాయి. ఈ ఒక్కో భంగిమ ఒక్కో సంకేతాన్ని చెప్తూ ఉంటుంది. నటరాజస్వామి చేసే నాట్య భంగిమలు కూడా 108.మన ఉపనిషత్తుల సంఖ్య 1080. మన ఇంట్లో, ఆలయాల్లో అష్టోత్తర శతనామావళి అంటాం. అంటే, 108 నామాలను జపించాలని. ఇలా, మన శాస్త్రాలన్నీ మొత్తం 108తో ముడిపడి ఉన్నాయి. అందుకే, ఆ నెంబర్ కి మన ప్రాచీన ఋషులు అంత ప్రాధాన్యతనిచ్చారు.మరి, ఈ సైన్సు సామాన్యులకు చేరేదెలా? విద్యార్థి లేని విద్యకు విలువలేదు. తాము కనుక్కున్న ఈ అంశాలు నిత్యం ప్రజల మధ్య నలగాలి. మనం ఉంటున్న భూమికి, అంతరిక్షానికి ,సృష్టికి, సృష్టికర్తకు ఉన్న ఈ 108 సంబంధం తరతరాల విద్యగా మారాలి. అందుకే వైదిక విధానంలో 108 కి ప్రాధాన్యత ఇచ్చారు .పూజ చేస్తే 108 పూలు, జపం చేస్తే 108 పూసల మాల, ప్రదక్షిణలు చేస్తే 108. ఇలా ప్రతి దైవికాంశలో 108 అనే సంఖ్య నలిగేలా చేశారు. అప్పట్లో ఈ 108 గురించి పెద్దలు చెప్పేవారు. ఇప్పుడు ఈ సైన్సు వండర్ ను చెప్పేవారు కరువయ్యారు. ఈ 108 సంఖ్యను బౌద్ధులు, జైనులు, సిక్కులు, వీరు కూడా దైవికంగానే భావిస్తారు. తపస్సులో 108 మానసిక స్థాయిలు ఉంటాయి. మనలోనే ఉన్న దేవుడిని గుర్తించడానికి మనలో ఉన్న ఆత్మ 108 మెట్లు దాటాలని బౌద్ధుల నమ్మకం. అది మన లోకా సమస్తా సుఖినోభవన్తు! **సేనాధిపత్యం రమేష్**

పూజా విధానంతోనూ యోగ

పూజ అనేది కూడా ఒక యోగ పక్రియ. మనసుతో చేసే వ్యాయామం. మన తెలివితేటలు, జ్ఞానం పెరగడానికి ....మన మెదడుని మనమే ట్యూన్ చేసుకునే పక్రియ.దీప ప్రజ్వలనం అనేది..... త్రాటకం అనే యోగ పక్రియ.రోజూ ఓ మూడు నిమిషాలు నూనె దీపాన్ని తదేకంగా చూస్తే.... కంటి జబ్బులను అరికట్టవచ్చు అని పెద్దలు చెప్పిన మాట. ఏదైనా కష్టమైన మంత్రాన్ని ఓ 11 సార్లు జపిస్తే.. నాలిక మొద్దుబారదు.అది నాలికకు ఎక్సర్‌సైజ్. అందువల్ల ఎటువంటి కష్టమైన పదాలనైనా పలకగలిగే శక్తి వస్తుంది ధారణ శక్తి పెరుగుతుంది. భాష మీద పట్టు పెరిగితే...స్టేజ్ ఫియర్ కూడా పోతుంది. పూజ అంటే చాదస్తం కాదు .మన ఆరోగ్యం, మన జ్ఞానానికి సంబంధించిన విషయమని చెప్పండి. మన హిందూ ధర్మాన్ని ప్రోత్సహించండి.అదే సమయంలొ మూడ విశ్వాసాలకు దూరంగా ఉండే విధంగా పిల్లలను తయారు చేయాల్సిన భాద్యత కూడా పెద్దవారిపై ఉంది.....దేవుడంటే ఏంటి? పూజ చేయకపోతే ఏమవుతుంది? అని...చిన్నపిల్లలే కాదు ..నేడు చదువుకున్న పెద్దవాళ్ళు కూడా అడిగే ప్రశ్న ఇది. మన వాళ్లు వెంటనే చెప్పే సమాధానం.. ’ అలా మాట్లాడితే కళ్లుపోతాయి’ అని .మనకు భవవంతుని గురించి అవగాహన లేనప్పుడు... చెప్పడం చేతగానప్పుడు ... మనం వాడే మాట అదే!. కళ్ల పోగొట్టడానికి దేవుడేం శాడిస్ట్ కాదు గదా !. మనం చెప్పాల్సిన సమాధానం అది కాదు. తెలియని వారికి అలా చెప్పడం వల్ల ...వారికి దేవునిపై మనసు విరిగే ప్రమాదం ఉందని గ్రహించాలి.

భయం

నది సముద్రంలో
ప్రవేశించే ముందు
భయంతో కంపిస్తుంది

పర్వత శిఖరాల నుండి
మెలికలు తిరిగిన
పొడవైన రోడ్లను, అడవులను,
గ్రామాలను దాటిన..నది
తన ప్రయాణ మార్గాన్ని
వెనక్కి తిరిగి చూస్తోంది .

ప్రవేశించి... ఎప్పటికైనా
అదృశ్యం కాక తప్పని
తన ముందున్న విశాల
సముద్రాన్ని నది వీక్షిస్తోంది.

వేరే మార్గం లేదు..
నది వెనక్కి వెళ్ళలేదు..

ఎవరూ వెనక్కి వెళ్ళలేరు
జీవన స్రవంతిలో
వెనుతిరగడం అసాధ్యం.

నది... సాగరంతో
సంగమించే సాహసం
చెయ్యాలి
ఎందుకంటే.. అపుడే నది
భయం
అదృశ్యమవుతుంది.

ఎందుకంటే...
సాగరంలో కలవటం
అదృశ్యమవటం కాదు.
తానే సముద్రమవుతానని
నదికి అర్థమవుతుంది కనుక.

మూలం
'Fear' -Kahlil Gibran

- అనువాదం
డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి
63027 38678

రైతే రాజు - రేడియమ్

పనికి రానీ విలువ లేనివి
ఎన్ని ఉన్నా గులక రాళ్లే
మంచి మాటలు మనసు దోచ
ముత్యమంతయు
చాలు చూడగ

నేతమాటలు తేనె చినుకులు
వేదిక మీద వెర్రి వేషాలు
కంటికి ఇంపు చెవికి కంపు
కోటి మాటలు గాలి వాటము

బుద్ధి పెరగదు బతుకు మారదు
చిత్తె మందున అగ్నీ ధారలు

క్రాంతి కాలము కదులు
ముందుకు
మంచి రోజులు రానున్నవీ

మనిషి మనిషిగ మసలు
కాలము
కనుల ముందున కదులు
చున్నది
మట్టి మనిషికి మంచి రోజులు
రైతు రాజ్యం రైతె రాజులె

- రేడియమ్
92915 27757

చాయ్ కహీ కం నహీ

గురజాడ పొరపడ్డాడు
ఆకాశతోటల్లో
అమృతభాండమొలికి
నేలరాలిన చుక్క
పొగాకై మొలిచిందన్నాడు
కాదు.. అది తేనీరై పారింది

చైనా కొండ వాలుల్లో పుట్టింది
వలసవాదుల కండ్లల్లో పడింది
దేశ దేశాలకు పాకింది
మదగజాన్ని మచ్చిక
చేసుకున్నట్లు
మహా జగాన్ని దాసోహం
చేసుకుంది

చాయ్ -టీ -తేనీరు
అది ఒక వలపుల తాజమహల్
అల్లంతో ఒయ్యారం
బెల్లంతో నయగారం
ఇలాచి వేస్తే భళా
కడక్ కడక్ మసాలా చాయ్

సిప్ వెనుక సిప్
స్టిములేటింగ్ నర్వేస్
జవ్వుమన్న నరాలు
ఉరకలెత్తే జవనాశ్వాలు

నలుగురున్నచోట
నారాయణుడేమో కానీ
చాయి ఉంటుంది
న్యాయమున్నట్లు కల్లోలపడ్డ
ఎవ్వారలకైనా కప్పు టీ చాలు
కుదుటపడుతుంది మనసు
ధీ శక్తిని పెంచే రసనిధి

పథ్యం -పైత్యమని
ప్రేమ లాగే చాయ్‌నీ నిషేధిస్తారు
ప్రేమించడం మానుకుంటామా
చాయ్‌ని కూడా...

- హెచ్.రవీందర్
99122 33533

అసలు ఎవరే నువ్వు..?

చారడేసి కళ్లలో అపురూప
చిత్రాలెన్నో చూస్తున్నా..
బారడేసి సొగసుల్లో పురివిప్పిన
పరువాలనెన్నో లెక్కిస్తున్నా..
మూరడేసి నడుములో
సొంపుల వంపులనెన్నో కొలుస్తున్నా ...

ముద్దబంతే చీర కటినా,
పెరటి తులసి మొక్కే
గాజులు తొడిగెనా,
చామంతి వచ్చి ఇంటిముందు
రంగవల్లులు వెదజల్లెనా,
మల్లెపూల గుబాళింపు
గుప్పున నడిసొచ్చేనా....

ఎవరో.. మరెవరో.. ఇంకెవరో..
అని ప్రశ్నల బాణాన్ని సంధిస్తుంటే...
నేనే..నేనేనని పక్కనే చేరి
విరజాజి పువ్వయి
గుండెలో గుచ్చుతున్నావు..
అసలు ఎవరే నువ్వు..

- ప్రవీణ్ శ్రీ
90100 29002

చర్యకు ప్రతిచర్య

మాట్లాడ్డం
అంటే వినడం కూడా
రాయడం
అంటే చదవడం కూడా

చూడడం
అంటే కనిపించడం కూడా
నడవడం
అంటే నిలబడడం కూడా

బతకడం
అంటే చనిపోవడం కూడా
చర్యకు ప్రతిచర్య
రెండూ సమానమూ
వ్యతిరేకమూ కూడా

అయినా
బతుకుతూ చావడంకన్నా
చచ్చి బతకడం నయం కదా

వారాల ఆనంద్
94405 01281

కామ్రేడ్ ఆలోచించు

చనిపోవడమే
కమ్యూనిస్టు కొలమానంగా
కొనసాగడం న్యాయమా
ఆలోచించు కామ్రేడ్ ఆలోచించు?

చనిపోని వాళ్ళనందరిని
ఇది ఆత్మన్యూనతకు
గురిచేయడం లేదా
ఆవతలికి నెట్టడం లేదా
ఆలోచించు కామ్రేడ్ ఆలోచించు?

కమ్యూనిస్టంటే
'ఇలాగే చనిపోవాలేమో' నని
నూతన తరాన్ని భయపెట్టడం లేదా
దూరంగా ఉంచడం లేదా
ఆలోచించు కామ్రేడ్ ఆలోచించు?

భావం మొదటి స్థానంలో ఉండాలి
బలిదానం ఒకానొక అవసరం కావాలి
మరణం రోజువారీ
అవసరం కాకూడదు
త్యాగం వృథా కారాదు
అవునో కాదో ఆలోచించు
కామ్రేడ్ ఆలోచించు?

ఈ సత్యం మనకు తెలిసేది
ఎప్పటికి మిత్రమా
ఇప్పటికే పుణ్య(విప్లవ) కాలం
చాలా చాలా గడిచి పోయింది
ఆలోచించు కామ్రేడ్ ఆలోచించు?

కడుపు చించుకుంటే
కాళ్ళమీద పడుతోంది గానీ
దారి కానరావడం లేదు
నేను మాత్రమే నిఖార్సనే అహం
నీలో పెంచడం లేదా ఇది
ఆలోచించు కామ్రేడ్ ఆలోచించు

ఇప్పటికే చాలా ఆలస్యమైంది
శత్రువునే నిందిస్తూ కూర్చోలేను
ఎర్రజెండా చేతపట్టి వందేళ్ళయింది
వేరుదారిపట్టి యాభదేళ్ళు దాటింది
ఆలోచించు కామ్రేడ్ ఆలోచించు?

(ఛత్తీస్‌గఢ్ వరస ఎన్‌కౌంటర్ల ఖేదంలో)

రత్నారావు
88010 91664

నిశ్శబ్ద రణన్నినాదం

డాక్టర్ రాషీదా జహాన్ మత ఛాందసవాదులను ఎదిరించి, కమ్యూనిస్టుగా బ్రిటిష్ పాలననూ ధిక్కరించారు. మతోన్మాదులు చంపేస్తామని బెదిరించినా లెక్క చేయలేదు. ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్‌ను 1936లో ఏర్పాటు చేసినప్పుడు ప్రేమ్‌చంద్‌ను అధ్యక్షులుగా ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషించారు. కరుడు గట్టిన సంప్రదాయాలకు, అంధ విశ్వాసాలకు, స్త్రీల అణచివేతకు వ్యతిరేకంగా ఆమె రాసిన కథలు ఈ అసమ సమాజంపైన చేసిన నిశ్శబ్ద రణ నినాదాలుగా మిగిలిపోయాయి. కేవలం 47 ఏళ్ల వయసులో, 1952లో కేన్సర్‌తో రాషీదా జహాన్ కన్నుమూశారు. ఆమె రాసిన కథలను 'ఆమె కాలిపోయింది'పేరుతో అనుసృజన చేయడం ద్వారా డాక్టర్ గీతాంజలి మళ్లీ రాషీదా జహాన్‌ను తెలుగు పాఠకుల ముందు సజీవంగా నిలబెట్టారు.



ఆసిఫ్ జహాన్ కోడలు

కుబరా బేగంకి పాతికేళ్ళు వచ్చేసరికి ఐదుగురు మగపిల్లలు. మళ్ళీ పురిటి నొప్పులతో అవస్థ పడుతోంది. 'ఇంకొంచెం బలంగా... ఆ.. అయిపోయింది.. ఒక్కసారి ఇంకా జోరుగా తొయ్యి..'అని చుట్టూ ఆడవాళ్ళ అరుపులు.. కుబరా బేగం ఉన్నట్టుండి పెద్ద కేకవేసింది. వెంటనే పసిపాప ఏడుపు వినిపించింది. మాయ పడక కుబరా బేగం ప్రాణాపాయంలో పడిపోతే, మహిళలంతా తమ ప్రసవ అనుభవాలను ముచ్చటించుకుంటున్నారు. కుబరా బేగం పొట్టమీద ఒత్తు తుంటే'చచ్చిపోతున్నా వదలండి'అంటూ అరుస్తోంది. మాయ పడిపోయి, శిశువు భూమిపైకి వచ్చేసింది, సందడి, సంరంభం, ఉద్వేగం అన్నిటినీ దృశ్యమానం చేసిన కథ ఆసిఫ్ జహాన్ కోడలు..

చిద్దా వాళ్ళమ్మ

చిద్దా వాళ్ళమ్మ వందసార్లైనా కొడుకు చేత కోడల్ని కొట్టించి ఉంటుంది. 'ఇంట్లో ఇట్లా కాలు పెట్టిందో లేదో చిద్దా వాళ్ళ నాన్నను గుటుక్కున మింగేసింది' అంది చిద్దా వాళ్ళమ్మ. అంతే.. కోడల్ని చంపేసింది. చిద్దాకు కొత్త భార్య వచ్చేసింది. చిద్దా ఇంట్లోకి రాగానే 'ఈ దరిద్రపుది పక్కింటి ఈడుగాడితో కలిసి కులుకుతోంది'అంటూ కోడల్ని పట్టుకుని కొట్ట సాగింది. దీంతో చిద్దా ఆమెను కూడా వదిలేశాడు. ఇప్పుడొచ్చిన మూడవ కోడలు పాత కోడళ్ళందరి తరఫునా వకాలతు పుచ్చుకుంది. 'ఈ ఇంట్లో ఉండాలంటే బుద్ధిగా ఉండు. లేకపోతే నీ దారిన నీవు వెళ్లిపో'అంది అత్తను. ఇక చిద్దాగాడైతే పిల్లి అయిపోయాడు. కోడళ్ళను హింసించే అత్తలకు 'చిద్దా వాళ్ళమ్మ'చక్కని చిహ్నం.

సిద్దిఖా బేగం కన్నీళ్లు చెప్పే విషాదం

చూడచక్కగా ఉన్న సిద్దిఖా బేగంకు ముప్పై ఏళ్ళు వచ్చాయి. పెళ్ళి కాకపోయినా పరవాలేదు కానీ, నిఖాకి ముందే అబ్బాయికి అమ్మాయిని చూపించకూడదనేది తల్లి మొండితనం. కూతుర్ని పూర్తిగా పరదాల్లో పెంచింది. 'ముప్పై ఏళ్ళు వచ్చినా ఇప్పట్లో తనకు నిఖా చేయదు. తనకా చేయమని చెప్పే ధైర్యం లేదు. మంచంపైన ఒరిగిపోయి కుళ్ళి కుళ్ళి ఏడవ సాగింది 'నోరు లేని సిద్దికా బేగం'.

ఆమె కాలిపోయింది

ఆమె పెదవుల మీద లిప్ స్టిక్ అలానే ఉంది. బట్టలు కాలిపోయి దేహం నగ్నంగా కనిపిస్తోంది. ఛాతీ మొత్తం కాలిపోయి నల్లగా తయారైంది. ఒక కాలు కాలిపోయి బిగుసుకుపోయి పైకి లేచి భీకరంగా కనిపిస్తోంది. గదిలో మంచంపైన కాలిన విమల మృత దేహం. ఆ మహల్లో విమలకు పదహారేళ్ళ వయసులో ఒక రాజాతో పెళ్ళైంది. పెళ్ళైన పదిరోజుల కల్లా విమల అత్తారింటి నుంచి తిరిగి వచ్చేసింది. స్వేచ్ఛగా ఒకసారి ఆఫీసర్‌తో, మరొక సారి మిలటరీ ఆఫీసర్ కొడుకుతో కనిపిస్తుంది. 'ఆ దరిద్రుడు బ్రిగేడియర్ ఎన్ని మందు బాటిళ్ళ మందు తెచ్చాడో.. బిడ్డ సిగరెట్టు వెలిగించి తాగుతూనే నిద్రపోయి నిప్పంటుకుని చనిపోయి ఉంటుంది.'ముసలామె ఆయాసపడుతూ చెప్పిం ది. వ్యసనాలకు బానిసైన 'ఆమె కాలిపోయింది'.

గుడ్డివాని చేతి కర్ర

'నా కూతుళ్ళిద్దరిని అవివాహితలుగానైనా ఉంచుతా. ఇద్దరికీ విషం పెట్టి అయినా చంపేస్తా. కానీ, అస్గర్ పిల్లలతో తన పిల్లలకు నిఖా మాత్రం చేయను' అంటుంది ఇక్బాల్ భార్య. కవలపిల్లలైన అహ్మదీ ఖాదరీలకు బైట సంబంధాలు కుదరడం లేదు. అస్గర్, ఇక్బాల్ అన్నదమ్ములు. హిందువుల్లో అక్క కూతురిని పెళ్ళి చేసుకున్నట్టు, ముస్లిం కుటుంబాల్లో అన్నదమ్ముల పిల్లల్ని చేసుకుంటారు. వేరే సంబంధం చేస్తే తమ్ముడి ఆస్తి కాస్తా పోతుందని, తమ్ముడి కూతుళ్ళను తన కోడళ్ళుగా చేసుకోవాలని అస్గర్ భార్య భావిస్తుంది. ఇక్బాల్ ఇద్దరు కవల పిల్లలకు పెళ్లి జరుగుతుంది. అంతా కవల పిల్లలవడం వల్ల పడకగదిలో పెళ్లి కూతుళ్ళు తారుమారవుతారు. తోడికోడళ్ల ద్వేషం 'గుడ్డివాని చేతికర్ర'లా తయారవుతుంది.

షీలా

నలభై ఏళ్ళ వయసుండే షీలా, పద్దెనిమిదేళ్ల వయసున్నప్పటి నుంచి హరీష్ చంద్ర అనే వివాహితుడి ప్రేమలో పడిపోయింది. 'ఈ లోకంలో పురుషులంతా ఒక్కలాగే ఉంటారు. కానీ నువ్వు చాలా మోసగాడివి. కుట్రదారుడివి. పంతొమ్మిదేళ్ళ వయసులో నీతో నాకు పరిచయం అయ్యింది. నిన్ను చూసిన తరువాత నీ ఉచ్చులో పడిపోయి నిన్ను ప్రేమించసాగాను. వయస్సులో నీవు నాకంటే పెద్దవాడివి. పెళ్లై ఇద్దరు పిల్లలున్న తండ్రివి కూడా. నాకు 'నువ్వంటే చచ్చేంత ప్రేమ'అని చెప్పించుకున్నావ్. తర్వాత నన్నసలు గుర్తుపట్టనట్టు అపరిచితుడిలా ప్రవర్తించడం మొదలు పెట్టావ్. నాలో పుట్టే ఏ కొద్దిపాటి కోరికల్ని కూడా నేను గొంతు నులిమేశాను. వెళ్లు.. వెంటనే వెళ్లిపో..'' అంటూ ఆగ్రహంతో వెళ్లిపోయింది. నవ యవ్వనుడైన ఒక మిలటరీ ఆఫీసర్, షీలా ప్రేమించుకుంటారు. ప్రకృతికున్న శక్తి అది. షీలా జీవితాన్ని ఒక అందమైన విషాద కావ్యంగా 'షీలా' లోచూపించారు. 'పరదా వెనుక' నాటకంలో ఇద్దరు స్త్రీల మధ్య జరిగే సంభాషణలో మొహమ్మదీ బేగం చెప్పే మాటలు ఆనాటి ముస్లిం స్త్రీల స్థితి గతులకు అద్దం పడతాయి. అలాగే మరో నాటిక 'స్త్రీ పురుషుడు'లో కూడా సంభాషణ ఇలాగే సాగుతుంది. రాషీదా జహాన్ ఈ కథలు రాసి వందేళ్లు అయినప్పటికీ, హైదరాబాద్ పాత బస్తీలో ముస్లిం సమాజంలోని స్థితి గతులు ఇప్పటికీ సజీవంగా అలాగే ఉన్నాయి.

పుస్తకం పేరు : ఆమె కాలిపోయింది.
రచయిత్రి : డాక్టర్ రాషీదా జహాన్
అనువాదం : డాక్టర్ గీతాంజలి
పుస్తక పరిచయం : రాఘవ
పేజీలు : 142, వెల : 150
కాపీలకు : పుస్తకం.ఇన్ 7989546568
డాక్టర్ గీతాంజలి, 8897791964

పరిచయం
రాఘవ
94932 26180

సాహిత్య, సినీ ఆకాశంలో చెరగని ముద్ర

ప్రపంచం పిడికిలిలో ఒదిగిపోతున్న క్రమంలో ప్రపంచీకరణ మన ఇళ్ళల్లోకి శరవేగంగా చొచ్చింది. సమాజంలో అనివార్యంగా సంభవించే సామాజిక ఆర్థిక పరిస్థితులను వాటి ప్రభావాలను సాహిత్య చలనచిత్ర మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చిన అంతర్జాతీయ స్థాయి మళయాళీ రచయిత కవి దర్శకుడు ఎమ్.టి.వాసుదేవన్ నాయర్. ప్రజల కోసం జీవించిన గొప్ప ప్రగతిశీల అభ్యుదయవాది. మలయాళ సాహిత్య సీమలో స్వయం కృషితో ఎదిగిన ఎమ్.టి.వాసుదేవన్ నాయర్ విద్యార్థి దశనుండి రచనా వ్యాసంగంలో జీవించారు. మాదత్ తెక్కేపాట్ వాసుదేవన్ నాయర్ పేరు. పాపులరైన పేరు మాత్రం ఎమ్.టి . సామాజిక ఆర్థిక పరిస్థితులను లోతుగా అర్థం చేసుకున్నగొప్ప రచయిత ఆయన ఎమ్.టి. మలయాళ సాహిత్య సినీ ప్రపంచంలో చెరుగని తనముద్ర వేశాడు.



ఎమ్.టి. 15 జూలై 1933 న కుడల్లూర్ గ్రామంలో పుట్టారు. చిన్నప్పుడు ఎమ్.టి.వాసుదేవన్ కుటుంబంలో ఎలాం టి సాహిత్యాంశగానీ, పఠనంపై ఆసక్తి గానీ, ఆ నేపథ్యం గానీ లేదు. కానీ ఎమ్.టి. చిన్ననాటనే రచనా వ్యాసంగం చేసినారు. తన 20యేళ్ళ కే కెమిస్ట్రీ విద్యార్థిగా రాసిన చిన్నకథ 'వాలారుత్ మృగంగల్'బహుమతి నిచ్చింది. అనేక రచనలు పలు మాగ జైన్స్‌లో అచ్చైనవి. రచనా వ్యాసంగంలో వాసుదేవన్ నాయర్‌కు స్ఫూర్తి తన అన్నయ్యలే. కాగా సీనియర్ కవి అక్కితమ్ అచ్యుతన్ నంబూద్రి తనకు ప్రేరణ. ఫ్రీ టైమ్‌లో ఆయన ఇంటికెళ్ళి పుస్తకాలు చదువడం కూడా గొప్ప చోదకశక్తిగా ఉండేది. మొదట కవిత లు రాసేది. వెంటనే గద్యంవైపు దృష్టి మరలింది. 'ప్రాచీన భారతత్తిలేవైర వ్యవసాయం' వ్యాసం కేరళ క్షేత్రం పత్రికలో అచ్చైంది.

ఇక 1958లో వాసుదేవన్ రాసిన తొలి నవల'నలుకెట్టు'. ఇది మలయాళ సాహిత్యంలో లబ్ధ ప్రతిష్ఠులైన కురూ ప్, తగజి శివ శంకరపిల్లైల ఒరవడిలో సాగింది. మలయాళీ వచన సాహి త్యంలో ఎమ్.టి అగ్రస్థానంలో నిలువడమే కాకుండా మలయాళ జీవితాలను ఆవిష్కరించిన గొప్ప భావుకుడు కూడా. వాసుదేవన్ నాయర్ ఊరు జ మీందారీ పెత్తందారీ వ్యవస్థలకు పుట్టినిల్లు. అక్కడ జరిగిన సంఘటనల విలయతాండవ బింబ ప్రతిబింబాలే తన రచనలకు వస్తువుగా దొరికింది. కొన్ని సందర్భాల్లో దుఃఖం నిరాశానిస్పృహలు నాయర్ రచనల్లో ప్రధానంగా తొంగిచూసినవి.

వాసుదేవన్ రచనల్లో 1984లో వచ్చిన రాండమూజమ్ (రెండవ సారి)తన లోని విలక్షణ విభిన్నతలకు తార్కా ణం. ఇందులో మహాభారతంలో భీముని పాత్రను కొత్తకోణంలో మానవీయంగా చూపించడం, భీముని గొ ప్పతనాన్ని కీర్తిస్తూ, గొప్పవాడని చెప్ప దం మలయాళ సాహిత్య చరిత్రలో గొప్ప కుదుపే మరి. ఆయన రచనల్లో నినలుకెట్టు, సర్పబిందుల్లో ప్రధానం గా అనాదిగా ఉన్న ఉమ్మడి కుటుం బాల్లో కేరళ సామాజిక వ్యవస్థలోనే కాకుండా మొత్తంగా దక్షిణ భారతం లో మోడర్న్ కల్చర్ తీసుకొచ్చిన మార్పులు వాటి పర్యవసానాల గు రించి వాసుదేవన్ నాయర్ ప్రస్తావించడం ఆయనలోని గొప్ప సామాజికతకు అద్దంపట్టేవే. అలా నాయర్ మల యాళీ సృజనకారుడుగా చేసిన ప్రయాణం ప్రపంచ సృజనకారుల జాబితాలోకి చేరింది. ఆయన రచ నలు ఆంగ్లంలోకి కూడా అనువాదమయ్యాయి.

వాసుదేవన్ నాయర్ మరోవైపు సినిమాల్లో స్క్రిప్ట్ రచయితగా, స్క్రీన్ ప్లే, చిత్ర దర్శక, నిర్మాతగానూ పనిచేసినారు. సృజన, కళా రంగాలు ఎమ్.టి.కి రెండు కళ్ళు. ఆయనలోని సృజనతృష్ణ ఈరెండు రంగాల్లోనూ విరాట్ రూపాన్ని అందుకున్నదే. ఆయన రాసిన చిన్నకథలే అనేక స్క్రీన్ ప్లేలుగా రూపాంతరం చెందాయి. 1973లో నాయర్ 'నిర్మాల్యం' చిత్రం రూపొందించారు. దీనికి జాతీయ ఉత్తమచిత్ర అవార్డు గెలుచుకున్నది. నాయర్ తన మొదటి సినిమా 'నిర్మాల్యం' 1973లో ఆరంభించాడు. 1965లో రామూ కారియర్ 'చెమ్మీన్', 1972 లో ఆదూరి గోపాలకృష్ణ స్వయంవ రం వచ్చింది. ఇవి రాష్ట్రపతి గోల్డ్ మెడల్ గెలుచుకున్నవి. ఆ తర్వాతే నిర్మాలం అంతటి ఘనతను పొందిం ది. ఎమ్.టి. రెండవ చిత్రం డాక్యుమెంటరీ మోహినీ ఆట్టమ్ వచ్చింది. 1978లో బంధనం తీస్తే కేరళ ఉత్తమ చిత్ర బహుమతి గెలిచింది. అలా సాహిత్యంలోని ఆయన ప్రత్యేక శైలీవిన్యాసం, సినిమాల్లోని కొత్త టెక్నిక్ విశేష ప్రజాదరణ ప్రశంశలనూ అందుకోవడం చరిత్రలో గొప్ప సందర్భం.

వాసుదేవన్ నాయర్ ఎన్నో కేరళ రాష్ట్ర, భారతీయ అవార్డులను అందుకున్నారు. అందులో 1958లో కేరళ సాహిత్య అకాడమీ అవార్డు 'నాలుకెట్టు' నవలకు, 1970లో 'కాలం' నవలకు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు,1982లో కేరళ సాహిత్య అకాడమీ అవార్డు 'గోపుర నాదయల్ 'నాటకానికి, 1986లో కేరళ సాహిత్య అకాడమీ అవార్డు 'స్వర్గం తురక్కున్న సమయం' కథకు,1995లో జ్ఞానపీఠ్ మలయాళ సాహిత్యంలో విశిష్ట సేవలకు అవార్డు అందుకున్నారు. నాయర్ 25.12.2024 న తన 91వ యేట కోజికోడ్‌లో శ్వాస, హృదయ సంబంధ సమస్యలతో మరణించారు. భారత ప్రభుత్వం 2025లో ఎమ్.టి.వాసుదేవన్ నాయర్‌కు పద్మవిభూషన్ సివిలియన్ అవార్డు(మరణానంతరం) ఇటీవలే ప్రకటించింది. ఎమ్.టి. వాసుదేవన్ నాయర్ కలంనుండి తర్వాతి నవల ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూసే సాహిత్యాభిమానులను సంపాదించుకున్నారు. ఇకపై వారు నాయర్ రచనలు సినిమాలను లోతుగా విస్తృతంగా అధ్యయనం చేసి వాటిలోని కొత్త కోణాలను పరిశోధించి ఆవిష్కరించడమే ఎమ్.టి.కి ఇచ్చే ఘన నివాళి.

డా.టి.
రాధాకృష్ణమాచార్యులు
98493 05871



ఆల్కహాలిక్‌ల

కుటుంబాలపై నిశిత పరిశీలన

'ఆల్కహాలిక్‌ల పిల్లలు ఒక అవగాహన' అనే పేరిట 2021లో ఎం.ఎస్ మణి చారిటబుల్ తరుపున శ్రీదేవీ మురళీధర్ గారు వెలువరించిన ఆవిష్కరణ అనే పుస్తకం ఈ సంవత్సరం నా దృష్టిలోకి వచ్చింది. టైటిల్‌కి తగ్గట్టుగానే ఈ రచన ఆల్కహాలిక్‌ల కుటుంబాలనూ, జీవితాలనూ అత్యంత ప్రతిభావంతంగా ఆవిష్కరించింది. తాగుబోతు అని సునాయాసంగా కొట్టి పారేసే సామాజిక నేపథ్యం ఉన్న ఈ వ్యక్తులు, వారి కుటుంబాలు ఎంతగా శిథిలం అవుతాయో, నలిగిపోతాయో, భార్యా పిల్లలు ఎంతగా ఆవేదనకు గురవుతారో వివరించే ఇంతకంటే ఉన్నతమైన రచన బహుశా తెలుగు పుస్తక రంగంలో రాకపోయి ఉండొచ్చు. ఏదైనా ఒక రచన లేవనెత్తిన అంశాలు సామాజిక జీవితంలో నేటికీ కొన సాగుతున్నప్పుడు, అసంఖ్యాకమైన జీవితాలను ప్రభావితం చేస్తున్నప్పుడు ఆ రచన ప్రాసంగికత ఉండనే ఉంటుంది.

పెచ్చులూడిపోతున్న కుటుంబ సంబంధాలను, ఓదార్చలేనంత, భయంకరమైన విషాదాన్ని అనుభవిస్తున్న భార్యా పిల్లల నిస్సహాయ స్థితిని రచయిత్రి చక్కగా, విజయవంతంగా, ప్రతిభావంతంగా ఆవిష్కరించగలిగారు. తాగుబోతు అని చెప్పి ఎంతో సునాయాసంగా కొట్టిపారేసే పాఠకుడు పుస్తకం చదువుతున్న ప్రతిసారి ఆగి ఆలోచిస్తాడు. అత్యంత వేదనాభరితమైన జీవితాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నం అక్కడే ఆరంభం అవుతుంది.

డీ-ఎడిక్షన్ రంగంలో ప్రత్యక్షంగా కూడా అనుభవం ఉన్న రచయిత్రి అసంఖ్యాకమైన పుస్తకాలను చదివి, ఈ అంశం మీద పరిశోధిస్తూ కొత్త కొత్త అంశాలనూ, కోణాలనూ తాకుతూ సభ్య సమాజానికి బాధ్యతలను గుర్తు చేస్తారు. అక్కడక్కడ కథల్లా రాస్తూ ఆయా కుటుంబాలను మరింత సహజంగా, ప్రతిభావంతంగా ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. ఆల్కహాలిక్‌ల బిడ్డల్లో సగం మంది అత్యంత దురదృష్టకరంగా తాము కూడా తాగుడు వైపుకి మొగ్గుతారని, విచ్ఛిన్నం కాబోతున్న మరో సమాజాన్ని కూడా ఆమె ఆవిష్కరించారు.

కుటుంబంపై తాగుడు ప్రభావం..

తాగుడుకు బలైన కుటుంబాల స్త్రీల గురించి కూడా రాస్తూ, వీరు కూడా వివిధ రకాల పాత్రల్లో అసహజమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తారని రచయిత్రి అంటారు.. కొందరు ఎంతగా నలిగిపోయినా, కుటుంబం పరువు ప్రతిష్టలు సురక్షితంగా ఉండడానికి రక్షకులుగా కనిపిస్తారు. మరికొందరు పిల్లల్ని రెచ్చగొట్టే స్త్రీలుగా కనిపిస్తారు. మరికొందరు బలి పశువులవుతారని భార్యల గురించి ప్రస్తావిస్తారు. మరో దగ్గర ఈ కుటుంబాలలో నలిగిపోతున్న పిల్లల గురించి కూడా వేదనాభరితంగా రాస్తారు. పిల్లలు బాల్యాన్ని అనుభవించడం మాట పక్కన పెట్టి సర్దుబాటుదారుడిగా, హాస్యగాడుగా, పాపాల భైరవుడుగా, ఒంటరిగా మారతారు. వివిధ రకాల పాత్రలను ఇలా పోషిస్తారు. ఆల్కహాలిక్‌ల కుటుంబాల్లో పిల్లలు ఎన్నో రకాల మానసిక సమస్యలు ఎదుర్కొంటారు. అవి వారిని వెంటాడుతూనే ఉంటాయి. వీరిలో అనూహ్యమైన ప్రవర్తన కనిపిస్తుంది. ఒత్తిడి, ఉద్రిక్తత కనిపిస్తాయి. ఎంతో సున్నితంగా, సుకుమారంగా జీవితాలు అనుభవిస్తూ ముందుకు సాగాల్సిన జీవితం పక్కకు జరిగి బాల్యం నుండే మానసిక సమస్యలతో పిల్లలు నలిగిపోతారు. తాగుడు సమస్యను ఆవిష్కరిస్తూ, పరిష్కార మార్గాలు కూడా రచయిత్రి సూచించారు. ఇందులో డీ ఎడిక్షన్ సెంటర్ల వివరాలు సైతం ఇస్తారు. తాగుడుని ఇంటి సమస్యగా చూసే సమాజం ఈ రచన ద్వారా జాగృతమవుతుంది. ఇది ఒక పెద్ద సామాజిక, మానసిక సమస్యగా భావించి పరిష్కారం చేయాల్సిన అవసరం ఉంది.

పిల్లలకు ఏది నిజమో, అబద్ధమో అర్థం కాక..

తాగుడు వ్యక్తిగతం కాదు. వ్యవస్థాగతం. మొత్తం జీవితాలను మార్కెటీకరణ వైపుకు తోసేసే పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రతి ఒక్కటి వ్యాపారమే. అలానే తాగుడు కూడా అటు కార్పొరేట్లకు, ప్రభుత్వానికి కూడా లాభాల సంచుల్ని మోసుకొచ్చే వ్యాపారం. చిన్న వినోదంగా ప్రారంభమైన ఆల్కహాల్ సేవనం శరీరాన్నీ, మెదడునీ నిష్క్రియగా మార్చేస్తుంది. కుటుంబాలు వేదనాభరితంగా జీవితాన్ని ఈడ్చుకుంటూ వస్తాయి. సంసారాలను విడిచిపెట్టలేక, ఉండలేక మధ్యే మార్గంలో స్త్రీలు కొట్టుకుపోతూ ఉంటారు. లేని కుటుంబ మర్యాదలను అసహజంగా నిలుపుకొనే ప్రయత్నంలో బిజీగా ఉంటారు. ఇలాంటి సందిగ్ధ వాతావరణంలో పిల్లలు ఏది నిజమో, ఏది అబద్ధమో అర్థం కాక మానసికంగా మరింతగా నలిగిపోతూ ఉంటారు. ఏది జరిగినా స్త్రీలను మాత్రమే తప్పుపట్టే ఈ సమాజంలో స్త్రీలు పరిష్కార మార్గాలను వెతుక్కోలేక ఆదాయ మార్గాలను సమకూర్చుకోలేక ఆందోళనలో ఉంటారు. విద్యాలయాల్లో ఈ పిల్లలు చదువులో కూడా చాలా వెనుకబడి ఉంటారు. విద్యాలయాలకు సరిగా హాజరు కారు. క్లాసులో సరైన ధ్యానాన్ని నిలిపి దేన్నీ వినలేరు. తమకు అనుకూలమైన వ్యక్తులూ, ఆదర్శంగా కనిపించే ఉపాధ్యాయులూ కనిపించక పోయినప్పుడు ఈ చిన్నారుల మనసు ఎంతగా కలత చెందుతుందో మనం ఊహించలేం. తాగుబోతుల ఇళ్లల్లో నుంచి వచ్చిన పిల్లల్లో హింసాత్మక ప్రవర్తన కూడా విద్యాలయాల్లో మనం చూస్తాం. వీరు వాడే భాష కూడా చాలాసార్లు సభ్య సమాజం ఆమోదించని విధంగా ఉంటుంది. అది తప్పు అని వారికి ఎక్కడా అనిపించదు.

ఆల్కహాలిక్‌ల పిల్లలు
ఒక అవగాహన
శ్రీదేవి మురళీధర్

యువత ఫ్యాషన్ కోసం తాగుతూ..

ఆల్కహాలిక్‌ల కుటుంబాలలో ఆదర్శవంతంగా ఉండే తండ్రి కనిపించడు. తల్లి కూడా వివిధ రకాల సంఘర్షణల మధ్య నలిగిపోతూ ఉండటంతో పిల్లలు నష్టపోతారు. ఆల్కహాలిక్‌ల కుటుంబాల పిల్లలు అన్ని రకాలుగా నలిగిపోతారు. అత్యంత బాధాకరంగా వీరి జీవితాలు ఉంటాయి. మౌనంగా ఉంటారు. తమ సమస్యలు ఎవరూ అర్థం చేసుకోలేరని బాధలో ఉంటారు. ఏది ఏమైనా, రచయిత్రి రాసిన 'ఆవిష్కరణ' పుస్తకం ఆల్కహాలిక్ కుటుంబాల జీవితాల మీద ఒక ప్రత్యేక అవగాహన కలిగించడంలో విజయవంతం అయిందని చెప్పగలం. ఆల్కహాల్ లేని ఒక ఆరోగ్యకరమైన కొత్త ప్రపంచం మనకు కావాలి. ఆల్కహాలిక్ కుటుంబాల జీవితాలు బాగుపడే న్యాయమైన వ్యవస్థ కోసం మనం ప్రయత్నించాలి. ఆల్కహాలిక్ షాప్స్ విపరీతంగా పెరిగిపోతూ యువత కూడా ఫ్యాషన్ కోసం ఆల్కహాల్ సేవించే వింత పరిస్థితి ప్రపంచీకరణ మోసుకొచ్చింది. ఆల్కహాల్ సేవించే నాయక పాత్రలు అదే సరయినది అని ఒప్పించే సినిమాలు, ఆ సినిమాల కోసం కొనసాగే ప్రాపగాండా యువత ఆలోచనలను మరింత ప్రమాదకరంగా మార్చేస్తున్నాయి. ఆల్కహాల్ మొదటా ఉంది. నేడు కూడా ఉంది. కానీ, ప్రపంచీకరణ, మార్కెటీకరణ అన్ని రంగాల్లో లాగానే సారాయి విషాన్ని కూడా సామాజికం చేసేసి వేల కోట్ల లాభాల సంచుల్ని నింపుకుని కుటుంబాలకు మాత్రం విషాదం మిగిల్చింది.

పుస్తకం ఆవిష్కరణ :
ఆల్కహాలిక్ పిల్లలు - ఒక అవగాహన
రచయిత్రి: శ్రీదేవి మురళీధర్
పేజీలు: 68
వెల: నాట్ ఫర్ సేల్
(అవసరమైన కమ్యూనిటీలకు మాత్రమే)
ప్రతులకు: ఎస్.ఎస్. మణి చారిటబుల్ ట్రస్ట్
Secunderabad- 5000003
Email: mpathize@gmail.com

సమీక్షకులు
కేశవ్,
ఆర్థిక,
సామాజిక
విశ్లేషకులు
98313 14213



పబ్లిక్ పల్స్ పేజీకి, సాహితీ సౌరభం పేజీకి రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్, మెయిల్ ఐడీ **79958 66672** dishaopinion@gmail.com

ఈనాడు

అనుచిత జోక్యం తగదు!

ఇండియా అంటే రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగం ఉద్ఘాటించింది. సమాఖ్య వ్యవస్థను మన సంవిధాన అంతస్సూత్రంగా న్యాయపాలిక అభివర్ణించింది. కాబట్టి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్పష్టీకరించినట్లు- తమవైన విధులను నిర్వర్తించడంలో కేంద్రం, రాష్ట్రాలకు సమాన, స్వతంత్ర అధికారాలుంటాయి. అయితే, రాష్ట్రాల హక్కులూ అధికారాలకు భంగకరమైన విధానాలను కేంద్రం అనుసరిస్తోందనే విమర్శలు కొన్ని దశాబ్దాలుగా వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో బోధన సిబ్బంది నియామకం, పదోన్నతులు తదితరాలపై యూజీసీ విడుదల చేసిన ముసాయిదా అంశాలూ అలాగే వివాదాస్పదమవుతున్నాయి. వాటిని వ్యతిరేకిస్తూ తమిళనాడు, కేరళ అసెంబ్లీలు ప్రత్యేక తీర్మానాలు చేశాయి. యూజీసీ మార్గదర్శకాలు ఉన్నత విద్యారంగంలో తమ కార్యనిర్వాహక అధికారాలను హరిస్తాయని ఆయా రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. బెంగళూరులో జరిగిన ఆరు రాష్ట్రాల విద్యామంత్రుల భేటీలోనూ ఇలాంటి అభిప్రాయాలే గట్టిగా వినపడ్డాయి. ముఖ్యంగా ఉపకులపతుల నియామకాలకు సంబంధించి యూజీసీ సూచనలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి!

ప్రస్తుతం వైస్‌ఛాన్సలర్ల నియామకాలు రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు జరుగుతున్నాయి. యూజీసీ ముసాయిదా ప్రకారం వీసీల ఎంపిక కమిటీలో ఇకపై ఛాన్స్‌లర్(గవర్నర్) నామినితో పాటు యూజీసీ, విశ్వవిద్యాలయ ప్రతినిధులుంటారు. దీనివల్ల వీసీల నియామక ప్రక్రియ పూర్తిగా తమ పరిధిలోంచి దాటిపోతుందని రాష్ట్రాలు కలవరపడుతున్నాయి. స్థానిక విశ్వవిద్యాలయాల భవనాల నిర్మాణం, అధ్యాపకులూ ఇతర సిబ్బంది జీతభత్యాలు, పెన్షన్లు, ఇతర నిర్వహణ భారాన్నంతా రాష్ట్రాలే మోస్తున్నాయి. ఆయా వర్సిటీలకు యూజీసీ నిధులు ఇవ్వడం లేదని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యూజీసీ మార్గదర్శకాలు సహేతుకమైనవి కావని వారు స్పష్టీకరిస్తున్నారు. వీసీలుగా విద్యావేత్తలనే కాకుండా భిన్న రంగాల్లో అనుభవజ్ఞులకు అవకాశం కల్పించడం, చదివిన సబ్జెక్టుతో సంబంధం లేకుండా పాఠాల బోధనకు వీలు కల్పించడం వంటి వాటినీ రాష్ట్రాలు ఆక్షేపిస్తున్నాయి. వర్సిటీల్లో ప్రమాణాల పెంపు, సమన్వయం యూజీసీ బాధ్యతలు. ఆ మేరకు అది నియమావళి రూపొందించవచ్చు. అలాగని చట్టబద్ధంగా తన పరిధిలోకి రాని అంశాల్లో జోక్యం చేసుకోవడం తగదు.

ఉన్నత విద్యావ్యాప్తిలో విశ్వవిద్యాలయాలదే కీలక పాత్ర. అలాంటి వాటికి సారథ్యం వహించే ఉపకులపతులకు సామాజిక విలువలు ఉండాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ నైతిక ప్రమాణాలకు వీసీ అద్దంపట్టాలన్న కొఠారీ కమిషన్- అందరి మర్యాదా మన్ననలు పొందేవారిని ఆ పదవికి ఎంపిక చేయాలని సూచించింది. కానీ, వర్సిటీల్లో రాజకీయ జోక్యం రానురానూ పెరిగిపోతోంది. చాలా చోట్ల వీసీల నియామకంలో అర్హతల కన్నా విధేయతకే పెద్దపీట వేస్తున్న అధికార పక్షాలు- విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠను దిగలాగుతున్నాయి. ఉపకులపతుల పోస్టులను సకాలంలో భర్తీ చేయకుండా ఉన్నత విద్యను మసకబారుస్తున్నాయి. అత్యుత్తమ వ్యక్తిత్వంతోపాటు సమర్థత, దార్శనికత, నాయకత్వ లక్షణాలు ఉన్నవారిని వీసీలుగా నియమించాలి. విశ్వవిద్యాలయాల్లో పూర్తిస్థాయిలో అధ్యాపకుల భర్తీ, మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన మౌలిక వసతుల కల్పనపైనా దృష్టి సారించాలి. కొలువులు అందిపుచ్చుకునేలా యువతకు మేలిమి నైపుణ్యాలను అలవర్చాలి. భావిభారతానికి దన్నుగా అప్పుడే మన ఉన్నత విద్యారంగం వెలుగులీనుతుంది.

> మేము మహిళా విముక్తి ఉద్యమాన్ని మొదలెట్టినప్పుడు రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. వాళ్ల దృష్టిలో మహిళల సమస్యలంటూ ప్రత్యేకంగా లేవు, అన్నీ సామాజిక సమస్యలే. వాటిని పరిష్కరించడానికి తమ మహిళా విభాగాలు చాలని ఆ పార్టీల ఉద్దేశం!
>
> – సారా జోసెఫ్, రచయిత్రి

సేవాభాగ్యం

సేవ... రెండక్షరాల పదమే కానీ భావం లోతైంది. ఉన్నత వ్యక్తిత్వం ఉన్నవాళ్లే ఎవరికైనా సాయపడటానికి ముందుకొస్తారు. సేవ, సాయం చేయడం వల్ల పొందే తృప్తి, సంతోషాలకు కొలబద్ద లేదు. వాటికి వెలకట్టలేం. పైగా సమాజం ఆదర్శవంతులని కితాబిస్తుంది. అదొక అదనపు ప్రయోజనం.

సేవాతత్వం ఉన్నవాళ్లు పురాణకాలం నుంచీ ఉన్నారు. జీవితమంతా సోదర సేవకి అంకితమయ్యాడు లక్ష్మణుడు. భార్యకు, రాజభోగాలకు దూరంగా అన్నావదినల సేవలోనే బతికాడు. అతనికన్నా గొప్పది సుమిత్ర. కొడుకులిద్దర్నీ వారి సోదరుల సేవకు పంపింది తప్ప సింహాసనం కోరలేదు. నిస్వార్థ సేవకు నిదర్శనాలుగా నిలిచిన వారు- అనుబంధాలెలా ఉండాలో లోకానికి చాటారు. వానప్రస్థాశ్రమానికి ధృతరాష్ట్ర గాంధారులు కదులుతుంటే వారి వెనువెంటే అడుగులేసింది కుంతీదేవి. వారించిన కుమారులతో అత్తమామల్లాంటి వారిద్దరినీ కనిపెట్టుకుని ఉంటూ శేషజీవితాన్ని గడిపేస్తానంది. తన కొడుకులకు కౌరవులు కలిగించిన కష్టాల్ని, నష్టాల్ని ఆమె మరచిపోయింది. పెద్దలకు సేవ చేయడం పిల్లల ధర్మమనే విషయాన్ని ఆచరించి చూపింది. తల్లిదండ్రులకు ప్రేమతో సేవలందించిన వాళ్లలో ధర్మవ్యాధుడు ఒకడు. కౌశికుడికి పలు ధార్మిక విషయాలను బోధించాడు. తల్లిదండ్రులకు చేసే సేవలే మోక్ష మార్గంలో నడిపిస్తాయని నమ్మి చేసి చూపించాడు ధర్మవ్యాధుడు.

అంతర్యామి

'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న' అని నమ్మి ఎందరో అభాగ్యులను కన్నతల్లిలా ఆదరించారు మదర్ థెరిస్సా. 'మానవ సేవే మాధవ సేవ' అన్న హితోక్తికి సార్థకత చేకూర్చారు. 'నీ పద సేవ భవసాగర తరణం' అంటూ భగవంతుణ్ని కీర్తిస్తూ భజనలు చేస్తే దైవానుగ్రహం కలుగుతుందని నమ్మిన భక్తులెందరో ఉన్నారు. అలాగే, తోటివారికి నిస్వార్థంగా సాయం చేస్తే భగవంతుడు అనుగ్రహిస్తాడని నమ్మిన సేవాతత్పరులూ ఉన్నారు.

ఒక ప్రముఖ వ్యక్తిని రైల్వే స్టేషన్‌లో చూసి చుట్టుముట్టారు విలేకరులు. వాళ్ల ప్రశ్నలకు సమాధానాలిస్తున్న ఆయన దృష్టి దూరంగా సామాన్లు మోయలేక అవస్థ పడుతున్న వృద్ధురాలి మీద పడింది. గబగబా వెళ్లి ఆమెకు సాయం చేశాడాయన. ఆశ్చర్యంగా చూస్తున్న విలేకరులతో 'నేను ఇప్పుడు ప్రముఖ వ్యక్తిని అయ్యానని ఆమెకు సాయం చేయలేదు. ఎవరికైనా సాయం చేయడమే ఆశయంగా జీవిస్తున్నాను కాబట్టే ప్రముఖుడినయ్యాను. అవసరంలో ఉన్నవారికి సేవచేయడం మనిషి కనీస ధర్మం' అని చెప్పారాయన. జర్మనీలో పుట్టిపెరిగి ఆఫ్రికా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందించిన ఆ మానవతావాది పేరు ఆల్బర్ట్ ష్వైజర్. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత.

'సేవలోనే జీవితం ఉంది. ఇతరులకు సాయం చేసేవాళ్లు నిజమైన మహాత్ములు' అనేవారు స్వామి వివేకానంద. అయితే, ఉత్తమ భావంతో చేసే సేవలే ముక్తిని ప్రసాదిస్తాయి.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

విద్యార్థులే వికాసరథ సారథులు

ధర్మేంద్ర ప్రధాన్
కేంద్ర విద్యాశాఖ మంత్రి

> వైవిధ్యభరితమైన ప్రతిభను, విభిన్న నైపుణ్యాలను ప్రోత్సహించే విద్యా విధానం మన సమాజాన్ని పరిపుష్టం చేస్తుంది. అన్ని రంగాల్లో జాతి ప్రజ్ఞాపాటవాలను ఇనుమడింపజేస్తుంది. ఆ మేరకు వికసిత భారత సాధనకు విద్యావ్యవస్థ పునాది కావాలి.

ప్రకృతి ప్రతి మనిషికీ విలక్షణతను సమకూర్చింది. వేలి ముద్ర, కనుపాప వంటి శారీరక లక్షణాలు మొదలుకొని ఆలోచనలు, ప్రతిభ, సాధించే విజయాలలో మనిషి మనిషికీ తేడాలు ఉంటాయి. ఎవరి గొప్పతనం వారిదే. మన సమాజం, మన విద్యావ్యవస్థ ఈ ప్రత్యేకతను ప్రతిబింబించాలి. ప్రతి బాలుడు, బాలికలో స్వతస్సిద్ధ ప్రతిభ ఉంటుంది. కొంతమంది విద్యలో వికసిస్తారు, మరికొందరు క్రీడల్లో రాణిస్తారు. సృజనాత్మక శక్తితో రచయితలు, శాస్త్రవేత్తలుగా రూపాంతరం చెందేవారు కొందరైతే, వైద్యులుగా, న్యాయాధికారులుగా, ఇతర వృత్తినిపుణులుగా విజయాలు సాధించేవారు మరికొందరు. అందుకే మనిషిలో నిబిడీకృతమైన పరిపూర్ణతకు ప్రతిఫలనమే విద్య అని స్వామీ వివేకానంద ఉద్ఘాటించారు.

అదే సవాలు!

బాలబాలికల్లోని సహజ ప్రతిభ విద్యాపరంగా, ఇతర విధాలుగా గుబాళించేలా చేయడం విద్యా సంస్థల ముందున్న సవాలు. విద్యార్థులు ఎంచుకున్న మార్గంలో ఉన్నత స్థితిని అందుకునేలా చేయూత ఇవ్వడం అధ్యాపకుల, విధానకర్తల కర్తవ్యం. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికే 2020 జాతీయ విద్యా విధానాన్ని తెచ్చాం. మన బాలబాలికల ప్రతిభావ్యుత్పత్తులను దేశాభివృద్ధికి ఉపయోగించడానికి ఈ విధానం గొప్ప సాధనం. ప్రతి బాలుడు, ప్రతి బాలికలోని అద్వితీయతకు అభివ్యక్తినివ్వడం ఈ విధాన పరమార్థం.

పిల్లల చదువులు ఉత్తేజకరంగా సాగాలి. విద్యాభ్యాస కాలంలో కానీ, పరీక్షల సమయంలో కానీ వారు ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకారాదు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య, పరిశోధన వరకు విద్యార్థులు ఆసక్తి, అనురక్తితో ముందుకు సాగాలన్న లక్ష్యంతోనే ప్రధాని మోదీ నాయకత్వంలో విద్యావిధానంలో పరిపూర్ణ సంస్కరణలు తీసుకొస్తున్నాం. బొమ్మల సాయంతో విద్యాభ్యాసం చేయడానికి బాలవాటిక విధానాన్ని చేపట్టాం. జాతీయ విద్యా విధానం ఇలాంటి నవకల్పనలతో ముందుకు సాగుతోంది. ప్రాథమిక విద్యను విప్లవీకరిస్తోంది. చదువుకోవడమనేది మొక్కుబడిగానో, ఒత్తిళ్లమయంగానో సాగకూడదని లక్షిస్తోంది. ప్రతి బాలుడు, బాలిక అంతర్గత ప్రతిభతో వికసించడానికి చేయూతనిస్తోంది.

దానికి స్వస్తి చెప్పాల్సిందే

ఎకడెమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ విద్యారంగంలో ఓ నవీకరణ సాధనం. విద్యాభ్యాసం అన్ని పరిస్థితుల్లో ఒకే తీరున సాగదనీ, కొన్ని సార్లు వేగంగా, కొన్నిసార్లు మందకొడిగా సాగుతుందనీ నూతన జాతీయ విద్యావిధానం గుర్తిస్తోంది. విద్యాభ్యాసాన్ని కొంతకాలం నిలిపేసి తనకిష్టమైన నైపుణ్యాన్ని సముపార్జించడానికీ, ఆచరణలో అనుభవం సంపాదించడానికీ, కుటుంబానికి అండగా నిలవడానికీ అవకాశం ఉండాలి. చదువుకు తిరిగివచ్చినప్పుడు ఈ అనుభవ నైపుణ్యాలకు క్రెడిట్లు ఇవ్వాలి. వారికిది జీవితంలో పైకెదగడానికి సోపానమవుతుంది.

నిర్ణీత కాలంపాటు చదువుకుని సంపాదనలో పడిపోవడమనే పాత పంథాకు స్వస్తి చెప్పాల్సిన సమయమిది. విద్య అనేది నిరంతరం కొనసాగాలి. కొంతకాలం చదువు, కొంతకాలం ఆచరణ, తద్వారా నేర్చిన నైపుణ్యాలతో మళ్లీ విద్యాభ్యాసాన్ని కొనసాగించడం విద్యార్థికీ, సమాజానికీ గొప్ప ఫలితాలను ఇస్తుంది. విద్యాభ్యాసానికి తలుపులు సదా తెరిచే ఉండాలి. వ్యక్తులు తమ జీవితంలో ఏ దశలోనైనా మళ్లీ చదువుకునే అవకాశం ఉండాలి.

రాచిరంపాన పెట్టే సంస్కృతి పోవాలని...

విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించడం మాత్రమే సరిపోదు, అంతకుమించి వారి వ్యక్తిత్వాలు పరిపూర్ణంగా వికసించాలి. అలాంటి మనస్తత్వాన్ని సమాజంలో పాదుగొల్పాలని ప్రభుత్వం ఆశిస్తోంది. పరీక్షల్లో అత్యధిక మార్కులు సంపాదించాలంటూ విద్యార్థులను రాచిరంపాన పెట్టే సంస్కృతి పోవాలని భావిస్తోంది. దీనికే జాతీయ స్థాయిలో ప్రాధాన్యమిస్తోంది. తదనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏటా పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దిల్లీలోని భారత్ మండపంలో ఇవాళ ఈ కార్యక్రమం జరుగుతుంది.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడటం కోసమే ప్రధాని మోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, సంరక్షకులతో మాట్లాడతారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిస్తారు. గడచిన నాలుగేళ్లుగా ఈ కార్యక్రమాల్లో పరీక్షలు, మార్కుల పట్ల ఆదుర్దా వద్దనీ, సానుకూల దృక్పథంతో మెలగాలనీ విద్యార్థులకు ప్రధాని బోధిస్తున్నారు. తన అనుభవాల నుంచి నేర్చిన పాఠాలను తెలుపుతూ, వారికి ఆచరణీయ సలహాలు ఇస్తున్నారు. నిజమైన నాయకత్వం, దార్శనికతలతో దేశ ప్రగతి రథాన్ని పరుగులు తీయించే సారథులుగా విద్యార్థులను మలుస్తున్నారు.

ఒత్తిడిని ఓడించేందుకు...

విద్యార్థుల మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం విద్యాభ్యాస వాతావరణం ఆసక్తికరంగా ఉండాలి. అన్ని తరగతులు, అన్ని వయోవర్గాల విద్యార్థులకూ ఆ సానుకూలత ఉండాలని పరీక్షా పే చర్చ లక్షిస్తోంది. 'మీరు నేర్చినదానికే మీ బిడ్డను పరిమితం చేయవద్దు. అతడు మీకన్నా భిన్నమైన కాలంలో పుట్టాడని గ్రహించండి' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ వివేక వచనాలు విద్యారంగ రూపాంతరానికి దారిదీపాలుగా నిలుస్తున్నాయి. చదువులో ఒత్తిడి తప్పనిసరి అనే భావన తొలగాలి. ప్రోత్సాహకర, ఆసక్తికర వాతావరణంలోనే నిజమైన విద్యాభ్యాసం సాధ్యమని తెలుసుకోవాలి. సమాజం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇటువంటి వాతావరణం కల్పిస్తే విద్యార్థులు ఖాయంగా విజయసాధకులవుతారు.

తరగతి గదుల నుంచి క్రీడా మైదానాల వరకు, వృత్తివిద్యా సంస్థల నుంచి పరిశోధనాలయాల వరకు వైవిధ్యభరిత ప్రతిభాసంపత్తి వికసించే వాతావరణాన్ని సృష్టించాలి. అందరికీ గంపగుత్తగా ఒకే విధంగా విద్యాబోధన సాగించడంకన్నా వ్యక్తిగత విలక్షణత, ప్రతిభలను గుర్తించి బోధించాలి. విద్యా రంగ రూపాంతరీకరణ కేవలం ప్రభుత్వ బాధ్యత కాదనీ, అది సమష్టి కార్యాచరణ అని ప్రతి తల్లీ, తండ్రీ, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి పౌరుడు గుర్తించాలి. ప్రభుత్వం, పౌర సమాజం కలిసి మనం ఆశిస్తున్న గమ్యాన్ని చేరుకోవాలి.

★

అమ్మ కనిపించింది!

కమలమ్మ ఆ ఆరుగురికీ అమ్మ కాదు... ఆమెలో వారికి ఏనాడూ అమ్మ కనిపించలేదు. వాళ్లు అద్దెకుండే పోర్షన్‌లో ఆమె పనిమనిషి.. అంతే. అరవైకి చేరువైన వయసులో... ఎముకల గూడుకు అంటుకుపోయిన చర్మం ముడతలతో పోటీ పడేవి కమలమ్మ కట్టే చీరల మడతలు. నాలుగు ఇళ్లలో పని చేస్తూ ఆ డబ్బుతో కొడుకు కుటుంబానికి చేదోడుగా ఉండేదామె.

కమలమ్మతో పని చేయించుకునే ఆరుగురూ డిగ్రీలు పూర్తి చేశారు. ఇద్దరు సీఏ చదవాలని, మరో ఇద్దరు సివిల్స్ కొట్టాలని, మిగిలిన ఇద్దరేమో సాఫ్ట్‌వేర్ కొలువుల్లో చేరాలని సొంతూళ్ల నుంచి కోచింగ్‌ల కోసం నగరానికి వచ్చారు. ఒకరికొకరు పరిచయమై అందరూ కలిసి ఆ పోర్షన్‌లో అద్దెకు దిగారు. ఊళ్ల నుంచి అమ్మానాన్నలు బియ్యం, పచ్చళ్లు, పప్పులతోపాటు ఖర్చులకు డబ్బులు పంపేవారు. వీళ్లేమో ఇక్కడ ఇష్టమైనవన్నీ వండుకుని తింటూ సినిమాలకు షికార్లకూ తిరిగేవారు. ఖర్చుల్లో దుబారా... చదువుల్లో పొదుపును పక్కాగా పాటించేవారు.

కమలమ్మ రెండుపూటలా వచ్చేది. పాత్రల్ని తళతళలాడేలా తోమేది. గదంతా శుభ్రంగా ఊడ్చేది. శక్తినంతా కూడగట్టుకుని వాళ్ల బట్టలన్నీ ఉతికేది. బాత్‌రూము కడిగేది. అందుకోసం ఆమెకు అదనంగా డబ్బులిచ్చేవారు కాదు. పని చేయడం ఆమె అవసరం- అన్నట్లుగా ఉండేవారు. మొదట్లో పనంతా అయ్యాక.. మిగిలిన అన్నం కూరల్ని తీసుకెళ్లేది కమలమ్మ. కొన్నాళ్లకు అలా మిగిలిపోయిన వాటినీ తామే తినేసేవారు ఆ కుర్రాళ్లు. అయినా కమలమ్మ బాధపడలేదు. ఒకసారి వాళ్లకు ఊళ్ల నుంచి సరకులు, డబ్బు రావడం ఆలస్యమైంది. దాంతో వారం రోజులు గదిలో పొయ్యి వెలగలేదు. వేళకు తినడం అలవాటు పడిన ప్రాణాలు కదా... ఆకలికి నకనకలాడాయి. ఆరుగురూ పొద్దుటే లేచి.. ఫ్రెండ్స్ రూములకు వెళ్లి.. ఏదో ఒకటి తిని.. కాలక్షేపం చేసి రాత్రి పొద్దుపోయాక గదికి వచ్చేవారు. పాత్రలు కడిగే పని తప్పిందని కమలమ్మ సంతోషించలేదు, పాపం పిల్లలకు కష్టం వచ్చిందే అని బాధపడింది.

ఒకరోజు పొద్దున్నే.. తలమీద పది కిలోల బియ్యం మూట, చేతిలో 500 నోటుతో కమలమ్మ రూముకు వచ్చింది. 'అయ్యా మీరు తినడానికి ఏమీ లేక ఇబ్బంది పడుతున్నారు కదా, అందుకే బియ్యం తెచ్చా. ఈ డబ్బులతో కూరగాయలు తెచ్చుకోండి..' అని వారికిచ్చింది. 'నాలుగు రోజుల క్రితమే తెద్దామనుకున్నా.. కానీ మా ఇంట్లోవి రేషన్ బియ్యం. వాటిని మీరు తినలేరు. అందుకని నేను పనిచేసే ఇళ్ల వాళ్ల దగ్గర జీతం నుంచి అడ్వాన్సు తీసుకుని మీకోసం సన్నబియ్యం కొని తెచ్చా' అని చెబుతున్న కమలమ్మలో ఆరోజు ఆ ఆరుగురికీ అమ్మ కనిపించింది. హైదరాబాద్‌లో కొన్నేళ్ల క్రితం నిజంగా జరిగిన ఈ సంఘటన ఆ కుర్రాళ్ల జీవన దృక్పథాన్నే మార్చేసింది.

– అమరబాబు

కల్లోల సాగరం

శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం వల్ల భూతాపం కట్టుతప్పుతోంది. దాంతో ధ్రువ ప్రాంతాల్లో మంచు కరిగి సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. తత్ఫలితంగా భవిష్యత్తులో చాలా తీర ప్రాంత నగరాలు కనుమరుగవుతాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనాభాలో మార్పులు, ఆర్థిక ప్రగతి, విద్య పట్టణీకరణ, సాంకేతికత వృద్ధి తదితరాలు కర్బన ఉద్గారాలను ప్రభావితం చేస్తాయి. దీన్ని షేర్డ్ సోషియో ఎకనామిక్ పాత్‌వేగా పేర్కొంటారు. కర్బన ఉద్గారాలు తీవ్రస్థాయిలో వెలువడితే 2100 నాటికి మన దేశంలో కొన్ని ద్వితీయ శ్రేణి నగరాల తీరాల్లో సముద్ర మట్టాలు ఎన్ని సెంటీ మీటర్ల మేర పెరిగే ప్రమాదం ఉంది... ఎన్ని చదరపు కిలోమీటర్ల మేర భూభాగం ప్రభావితం కావచ్చంటే...

నగరం	సముద్ర మట్టాల పెరుగుదల	ప్రభావిత ప్రాంతం
హల్దియా	90.9	27.86
విశాఖపట్నం	91.3	61.58
తిరువనంతపురం	99.4	5.95
కోజికోడ్	99.9	13.89
కొచ్చి	100	15.61
మంగళూరు	100.1	44.18

(ఆధారం: సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ నివేదిక)

ఖర్చు వైపా... మదుపు వైపా?

> ఓ వైపు అంతర్జాతీయంగా అనిశ్చితి.. మరోవైపు ఆర్థిక వ్యవస్థ వృద్ధి నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోవచ్చని అంచనాలు.. ఇలాంటి తరుణంలో లక్ష కోట్ల రూపాయల వరకు పన్ను ఆదాయాన్ని కోల్పోయే నిర్ణయాన్ని కేంద్రం తీసుకుంది. పన్ను చెల్లింపుదార్లకు మిగిలే ఈ డబ్బులు ఖర్చు వైపు వెళ్తాయా? మదుపు వైపు ప్రవహిస్తాయా? ఆర్థిక వ్యవస్థకు కలిగే ప్రయోజనమేంటి?

ఇటీవలి కేంద్ర బడ్జెట్లో రూ.12 లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదంటూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం వేతన జీవులను సంభ్రమాశ్చర్యానికి గురిచేసింది. మధ్యతరగతి కళ్లలో సంతోషాన్ని చూసేందుకే ఆ నిర్ణయం తీసుకున్నామని నిర్మల వెల్లడించారు. ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగేందుకు, డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా పథకాల్లోకి మరిన్ని నిధులు ప్రవహించేందుకు ఈ నిర్ణయం తోడ్పడవచ్చు. అంతేకాకుండా కొత్త పన్ను విధానంలోకి మారే సంఖ్యా పెరుగుతుంది. వివిధ సెక్షన్ల కింద మినహాయింపులు క్లెయిమ్ చేసుకోవాల్సిన అవసరం లేకపోవడంతో బోగస్ వివరాల సమర్పణ కూడా మున్ముందు తగ్గిపోవచ్చు.

వినియోగంతో వృద్ధికి బాసట

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25)లో ఇండియా వృద్ధిరేటు 6.4శాతంగా నమోదు కావచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇది నాలుగేళ్ల కనిష్ఠం. తయారీ రంగ పేలవ ప్రదర్శనే దీనికి కారణమన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఆ రంగానికి ప్రోత్సాహకరంగా కేంద్రం పలు చర్యలు చేపట్టింది. అయినప్పటికీ దేశీయంగా, అంతర్జాతీయంగా గిరాకీ మందగించడంతో పరిమిత ప్రయోజనమే కనిపిస్తోంది. ఈ క్రమంలో దేశీయంగా గిరాకీకి ఊతమిచ్చేందుకు వినియోగాన్ని పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

వినియోగం పెరగాలంటే మధ్యతరగతి వర్గాలే కీలకం. వాళ్ల చేతిలో మిగులు డబ్బు ఎంత ఎక్కువగా ఉంటే అంతే స్థాయిలో ఖర్చుపెడతారనే అభిప్రాయం ఉంది. అలా ఆ డబ్బు మళ్లీ ఆర్థిక వ్యవస్థలోకే వచ్చి జీడీపీ వృద్ధికీ ప్రయోజనం కలుగుతుంది. కరోనా సమయంలో ఇలాంటి చర్యలు చేపట్టడం వల్ల ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకోగలిగింది. పైగా మిగులు డబ్బుతో జనం వస్తువులు కొనుగోలు చేస్తే- ఆదాయ పన్ను కింద కోల్పోయిన దానిలో కొంత భాగం జీఎస్టీ రూపేణా ప్రభుత్వానికి తిరిగి అందుతుంది. అంతేకాకుండా వస్తువులను తయారుచేసిన, విక్రయించిన కంపెనీల ద్వారానూ ప్రభుత్వానికి పన్నుల ఆదాయం సమకూరుతుంది. ఆయా సంస్థలకూ ప్రయోజనం కలుగుతుంది. గిరాకీ పెరిగితే దానికి తగ్గట్లుగా ఉత్పత్తిని పెంచాల్సి ఉంటుంది. అప్పుడు దేశీయ తయారీ రంగం మరింత వృద్ధిచెందే వీలుంటుంది.

సున్నా పన్ను ప్రయోజనం ఉండటం, మినహాయింపులు క్లెయిమ్ చేసుకోవాల్సిన అవసరం లేకపోవడం, రిటర్న్‌ల దాఖలు ప్రక్రియ సులభమవడంతో రూ.12.75 లక్షల వరకు (ప్రామాణిక మినహాయింపుతో కలిపి) స్థూల వార్షిక ఆదాయమున్నవారిలో చాలా మంది కొత్త పన్ను విధానానికి మారవచ్చు. ప్రస్తుతం కొత్త విధానంలో 74-75శాతం పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. ఇది 90 శాతానికి చేరవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు పాత పన్ను విధానం కింద కొందరు నకిలీ పత్రాలు, తప్పుడు వివరాలు సమర్పించి మినహాయింపులు పొందుతున్నారు. ఎక్కువ మందిని కొత్త పన్ను విధానానికి మార్చడం ద్వారా ఈ బోగస్ రిటర్న్‌ల దాఖలు సమస్యనూ అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

బ్యాంకులకు నిధుల లభ్యత

వివిధ సెక్షన్ల కింద మినహాయింపులు పొందే అవసరం లేనందువల్ల ఇంటి రుణాలు, బీమా పాలసీలు తీసుకోవడం, డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్ పథకాల్లో మదుపు లాంటివి తగ్గుతాయా అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. కానీ, కొవిడ్ తరవాత పొదుపు, ఆరోగ్య, జీవిత బీమా పాలసీలు ముఖ్యమనే అవగాహన ప్రజల్లో పెరిగింది. అందువల్ల పన్ను మినహాయింపుతో లభించే మిగులు నిధుల్లో కొంత మొత్తాన్ని వాటికీ కేటాయిస్తారు. వాస్తవానికి, మినహాయింపులు క్లెయిమ్ చేసుకోవాల్సిన అవసరం లేనంత మాత్రాన మదుపును, బీమాను విస్మరిస్తారని అనుకోవడానికి వీల్లేదు. అయితే అవసరానికి అనుగుణంగానే మదుపు నిర్ణయాలు ఉండవచ్చు. ప్రత్యేకించి మినహాయింపుల కోసమే బీమా వంటివి తీసుకోవడం ఇకపై ఉండకపోవచ్చు. మరోవైపు మిగులు ధనంలో డిపాజిట్లలోకి కొంత భాగం వచ్చినా బ్యాంకులకు నిధుల లభ్యత పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన రంగాల రుణ అవసరాలకు ఆ నిధులు ఉపయోగపడతాయి. మొత్తానికి మిగులు నిధులను ఖర్చుపెట్టినా, మదుపు పథకాలకు మళ్లించినా అంతిమంగా ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరే అవకాశాలే ఎక్కువ.

– నాసు నరేశ్

హాయ్! బుజ్జీ!!

చిన్ని ఫ్యాషన్ డిజైనర్!

ఆదివారం వచ్చిందంటే.. మనం ఏం చేస్తాం.. 'ఏముంది! అమ్మ పెట్టిన స్నాక్స్ తినేసి, స్కూల్లో ఇచ్చిన హోంవర్క్ గబగబా పూర్తి చేసుకుంటాం. తరవాత ఎంచక్కా గేమ్స్ ఆడుకుంటాం'.. అంతే కదా! అది నిజమే కానీ.. ఈ చిన్ని నేస్తం మాత్రం.. అవేవీ కాకుండా కొత్తగా ప్రయత్నిస్తోంది. అదేంటో చూద్దామా!

ముంబయికి చెందిన నిత్య రాథోడ్‌కి పది సంవత్సరాలు. తను ఫ్యాషన్ డిజైనర్. ఈ వయసు పిల్లలు వాళ్ల పనులు వాళ్లే.. సరిగ్గా చేసుకోలేరు. అలాంటిది దుస్తులు కుట్టడం అంటే.. చిన్న విషయం కాదు కదా! మన నిత్య ఏడేళ్ల వయసున్నప్పుడే తన చిన్ని బార్బీడాల్‌కు డ్రెస్ కుట్టేసిందట. ఇప్పుడు.. రకరకాల డిజైన్ల దుస్తులు కుడుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. 'మా అమ్మ ఫ్యాషన్ డిజైనర్. చిన్నప్పటి నుంచి ఆమె చేస్తున్న పని చూడటం, ఆ రంగురంగుల దుస్తుల మధ్యే ఉండటంతో నాకూ కుట్టాలనిపించేది. మొదట్లో చిన్న చిన్న సాయాలు చేసేదాన్ని. ఇంకా ఆసక్తిగా అనిపించడంతో తక్కువ రోజుల్లోనే పనంతా నేర్చుకున్నాను. ఆదివారాల్లో, ఇంకా ఎప్పుడైనా కాస్త ఖాళీ సమయం దొరికినా.. దుస్తులకు సంబంధించిన డిజైన్లను ఇంటర్నెట్‌లో చూసి.. వాటిని కుట్టేస్తాను. మా అమ్మలా మంచి డిజైనర్ అవ్వడమే నా లక్ష్యం' అంటోంది నిత్య. సూరత్‌లో నిర్వహించిన ఓ ఫ్యాషన్ షోలో బెస్ట్ డిజైనర్ అవార్డు అందుకుందీ నేస్తం. మరో విషయం ఏంటంటే.. తను కటింగ్, స్టిచింగ్ చేసే వీడియోలను యూట్యూబ్, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంటుంది. వాటన్నింటికీ లక్షల్లో వ్యూస్ ఉంటాయట.

Raja Rani
FASHION SHOW-2024
MISS NITYA RATHOD

★

బొమ్మల్లో ఏముందో?

బొమ్మల ఆధారంగా వాటి పేర్లను ఇక్కడి ఖాళీ గడుల్లో నింపగలరా?



[illegible]



ఎన్నికలు మ్యూజికల్ చైర్ అయ్యాయి!

భారత దేశంలోలో ఎన్నికలు మ్యూజికల్ చైర్ అయ్యాయి. సామ, దాన,దండోపాయలు అంటే మొత్తంగా ఓటర్లను మభ్యపెట్టడం, అంగ బలం, ఆర్థిక బలం, సామాజిక అంశాల సమాహారం, అంతా ఇప్పుడు ఎన్నికల్లో పని చేస్తున్నాయి. ఎన్నికల్లో గెలువాలంటే ఏమైనా చేయాలి. కులం, మతం, మందిర్, మస్జిద్, చర్చ్ గురుద్వారా, ఎలా అన్నింటి సపోర్ట్ తీసుకోవాలి. ఎలా విద్వేషాలను రెచ్చగొట్టాలి! అందుకు సంబంధించిన విద్వేషపు స్క్రిప్టెడ్ స్పీచ్ ప్రచారం టూల్ కిట్ ను చేర్చడం, మొత్తం పార్టీ, పార్టీ సపోర్ట్ సంస్థలను, యూట్యూబ్ లను ఇతర మాధ్యమాలను అలర్ట్ చేయడం, మూఢ, అమాయక జనం నమ్మే, విశ్వసించే, భారీగా దొంగ బాబాల మద్దతు తీసుకోవడం, చేస్తారు.

జైలు నుంచి ఎన్నికల రంగంలోకి.. వారు ఎక్కడున్నా రప్పిస్తారు!యువతుల రేప్ కేసులో, ఒక జర్నలిస్టు హత్య కేసులో జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న, గుర్మిత్ అలియాస్ రామ్ రహీం అలియాస్ డెరబాబా లాంటి వారిని జైలు నుంచి పెరోల్ మీద తీసుకుని వచ్చి, అతని భక్తుల ద్వారా ఓట్లు వేయించే పరిస్థితి కూడా ఉన్నది. హర్యానా, పంజాబ్, మొన్న డిల్లీ ఎన్నికల అప్పుడు, మధ్యప్రదేశ్ ఎన్నికల సందర్భంగా ఈ బాబా బయటికి వచ్చి బీజేపీకి మద్దతు పలికాడు. గుజరాత్ లో బీజేపీ బిల్కిస్ బాను కేసులోని 11మంది శిక్ష అనుభవిస్తున్న వారిని జైలు నుంచి క్షమాభిక్ష ఇచ్చి విడుదల చేయించిన తర్వాత, మళ్ళీ కోర్టు ఆదేశాల అనంతరం జైలు కు పంపారు. వీళ్ళను కూడా ఎన్నికల్లో బీజేపీ వాడుకున్నది. తమ వేదికలు ఎక్కించింది. ఉపన్యాసాలు ఇప్పించింది. వారు జైలు నుంచి విడుదల అయినపుడు వారికి హారతులు పట్టారు.

ఏటా రెండు కోట్ల ఉద్యోగాల పేరిట అధికారంలోకి!

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి గడచిన 11 ఏండ్ల లో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి, కానీ ఈ 11 ఏండ్ల లో కనీసం కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. పకోడీలు అమ్మడం కూడా ఉపాధి కదా అంటారు నరేంద్ర మోడీ! దేశంలో అసలు సమస్యగా ఉన్న నిరుద్యోగం కు సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వాలు (విపక్ష ప్రభుత్వాలు) ఒకరి మీద ఒకరు ఉద్యోగాలకు సంబంధించి ఆరోపణలు చేసుకోవడం తప్ప ఆచరణలో చిత్తశుద్ధి లేదు! రెండు లక్షల ఉద్యోగాలు ఏవి అని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి నీ కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నిస్తారు!ధరలు భారీగా పెరుగుతున్నప్పటికి పట్టింపు లేదు!

రూపాయి విలువపై మాట్లాడని మోడీ!

రూపాయి విలువ పడిపోతున్నప్పటికి ఒకప్పుడు రూపాయి విలువ మీద రాద్ధాంతం చేసిన పీఎం మోడీ ఆ వైపు కూడా చూడనట్లు చేస్తున్నారు.మన వాళ్ళను అక్రమంగా చొరబడి ఉద్యోగాలు చేస్తున్నారని, చేతులకు గొలుసులు, కాళ్ళకు బేడీలు వేసి మన ఇండియాకు అమెరికా తరలించినప్పటికి నోరుమెదుపని పీఎం ఈనెల 13 న అమెరికా అధ్యక్షులు ట్రంప్ తో భేటీ కానున్నారు.డిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన జోష్‌లో విదేశీ పర్యటనకు పీఎం మోడీ వెళుతున్నారు. ఇటీవల మధ్యతరగతి కుటుంబాలకు 12 లక్షల ఆదాయం కు సంబంధించి ఐటి మినహాయింపు ఇచ్చారు. మరి జిఎస్టి సంగతి ఏమైందీ? ఈ మోత ఇంకా ఎన్నాళ్ళు?

రైతుల బతుకుల్లో మార్పు ఏది?

రైతుల బతుకుల్లో మార్పు లేదు, వారి ఆదాయం డబుల్ చేస్తామని చెప్పిన హామీ అమలు ఏది? మోడీజీ? కార్పొరేట్లకు 16 లక్షల కోట్ల రుణ మాఫీ ఇస్తారు. రైతులకు అప్పు మాఫీ, పంటకు గిట్టుబాటు ధరలు లేవు! సామాన్యు నికి విద్య, వైద్యం అందించడం లో మీద శ్రద్ధ లేదు! కేవలం ఎన్నికలు, వాటిని గెలువడం, అనంతరం దోచుకో వడం, షరా మామూలు అయిపోయింది. ప్రజలు అటు రాష్ట్రాల్లో అయిన, కేంద్రం లో అయినా తమ పాలనలో సంతృప్తి గా ఉన్నారా, లేదా అని పరిశీలించేది లేదు! జనం ను కలిసేది లేదు. వారి సమస్యలు పరిష్కరించేది లేదు! ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు, గ్యారంటీ లు అమలు చేసేది లేదు! ఇదీ పార్టీల వ్యవహరం, అధికారం మీద వ్యామోహం! ఎంత కాలం ఇలా? నైతికత లేని, ఒక నీతి నియమం లేని, మభ్య పడి పోయి, లొంగిపోయి, డబ్బు, ఉచితాలకు లొంగి పోయే ఓటరు తీర్పులను అక్కడక్కడ చూసి ఓటు సిగ్గుపడు తున్నది! అవినీతి గెలుస్తున్నదని, మ్యూజికల్ ఛైర్ ఆందోళన పడుతున్నది. అన్ని ఆటలు బేఇమాన్ అయిపోయాయి అంటూ కుర్చీ ఆవేశంతో ఊగిపోతూ ఉన్నది ! ఇంతకన్నా నేను ఏమి చేయగలను అంటున్నది!

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

గూట్లో చిక్కుకున్న ప్రేమ పక్షి!

ప్రేమగా ప్రేమించాను
ప్రేమే జీవితమనుకున్నాను
అందుకే ప్రేమించిన వాడినే పెళ్లాడాను

పెళ్లయ్యాకే తెలిసింది,
అది ప్రేమ కాదని!
అది తెలిసొచ్చేనాటికి,
ఓ రెండేళ్ల పాప చేతికొచ్చింది

పొద్దు పొడవక ముందే సాన్పేసి,
పొద్దు పొయినాక గుల్లెడు రొట్టెలు గొట్టి,
రోజంతా గుండెల్లో గునపాలు దింపుకొని,
సాపైన పతంగికి మల్లె నా జీవితం,
దినదినం దిగులు దివిటీలార్పుకొని
దిగజారిపోయింది

చదువుకున్నది పదే అయినా,
ఏం చేయాలో తెలియని అయోమయం
స్వేచ్ఛగా ఉండాల్సిన నా జీవితం,
ఓ రాక్షసుడి చేతిలో నలిగిన చీమయిపోయింది

తండ్రిని - తల్లి వదిలేసి చాన్నాళ్లైంది,
తండ్రి ఇంకొకరిని పెళ్లాడీ చాన్నాళ్లైంది
ఇలా నా జీవితం అగమ్యగోచరమైంది

తాతయ్య నాయనమ్మలు ఉన్నా,
లేనట్టే తోచింది
ఎండిపోతున్న చెట్టుకి నీళ్లు పోసే వాడే
ప్రేమికుడని నమ్మాను,
ఫలాలు పండాకే తెలిసింది,
అంగట్లో నన్ను అమ్మే వ్యాపారస్తుడని
మోసపోయానని తెలిశాక,
ఈ గందరగోళ జీవితాన,
నాకు దిక్కేది, దారేది?
ఆడపిల్లగా పుట్టి పెద్ద పాపమే
చేశాను,
అందునా అంటరాని అతివగా
విడాకుల చిట్టా విసిరి,
విడివడుటే మిగిలింది

మౌనిక నీరుడి
9059945330

అమెరికాలో ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌తో స్వేచ్ఛా భావవ్యక్తీకరణకు ముప్పు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హమాస్ మద్దతుదారులను దేశం నుండి బహిష్కరించేందుకు ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్)ను జారీ చేశారు. యూద్ వ్యతిరేకతను (యాంటీ సెమిటిజమ్) అరికట్టేందుకు తీసుకున్న ఈ నిర్ణయం విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసి, పాలస్తీకు మద్దతుగల నిరసనల్లో పాల్గొన్న వారిని పంపించివేయాలనే నిబంధనలను కలిగి ఉంది. ఈ ఉత్తర్వు అమెరికాలోని పౌర హక్కుల సంఘాలు, న్యాయ నిపుణుల, అంతర్జాతీయ విశ్లేషకుల తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. హమాస్ మద్దతుదారులుగా గుర్తించిన వారిని అమెరికా నుండి బహిష్కరించే అధికారాన్ని ఫెడరల్ ఏజెన్సీలకు ఇచ్చారు. విదేశీ విద్యార్థులు, వీసాలపై ఉన్న ఇతర వ్యక్తులు పాలస్తీనాకు మద్దతుగల నిరసన ప్రదర్శనలలో పాల్గొంటే, వారి వీసాలను రద్దు చేసి బహిష్కరించనున్నారు.

పౌరహక్కుల సంఘాల తీవ్ర వ్యతిరేకత:

ఈ ఉత్తర్వుపై పౌర హక్కుల సంఘాలు తీవ్రంగా స్పందించాయి. అమెరికాలోని ప్రముఖ ముస్లిం హక్కుల సంస్థ "కౌన్సిల్ ఆన్ అమెరికన్-ఇస్లామిక్ రిలేషన్స్" (సీఏఐఆర్) ఈ ఉత్తర్వును ప్రజాస్వామ్య విరుద్ధమని, ఇది రాజకీయ వ్యతిరేకులను అణచివేయడానికి ఉపయోగపడుతుందని విమర్శించింది. విద్యార్థుల వీసాలను రద్దు చేయడం ప్రభుత్వానికి నచ్చని భావజాలాన్ని అణిచివేసేందుకు మార్గం చేస్తుందని ఫౌండేషన్ ఫర్ ఇండివిడ్యువల్ రైట్స్ ఇన్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఐఆర్) సంస్థ హెచ్చరించింది. అమెరికా విశ్వవిద్యాలయాలలో స్వేచ్ఛాయుత భావవ్యక్తీకరణను నిలువరించేందుకు ఈ నిర్ణయం దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చట్టపరమైన నిపుణుల అభిప్రాయాలు: కొలంబియా యూనివర్సిటీకి చెందిన నైట్ ఫస్ట్ అమెండ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎఫ్ఏఐ) న్యాయవాది కెరీ డెసెల్ ఈ ఉత్తర్వును రాజ్యాంగ విరుద్ధమని అభివర్ణించారు. విదేశీయులను వారి రాజకీయ అభిప్రాయాల కారణంగా బహిష్కరించడాన్ని సుముఖంగా చూస్తే, అది అమెరికా రాజ్యాంగంలోని మొదటి సవరణ హక్కులను ఉల్లంఘించడం అవుతుందని న్యాయ నిపుణులు అంటున్నారు.

అంతర్జాతీయ మీడియా స్పందన: ఈ ఉత్తర్వుపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు వచ్చాయి. "ది గార్డియన్"పత్రిక : ఈ వార్తాపత్రిక ప్రకారం, ఈ ఉత్తర్వు విశ్వ విద్యాలయాలలో రాజకీయ స్వేచ్ఛను కోల్పోయేలా చేస్తుందని తెలిపింది. **"టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్" పత్రిక:** ఈ నిర్ణయం పర్యవసానంగా విదేశీ విద్యార్థులు తమ వీసాలను కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. "అల్-జజీరా" నివేదిక: దీని ప్రకారం, అమెరికా రాజ్యాంగం మానవ హక్కుల పరిరక్షణను ప్రోత్సహిస్తుంది కానీ, ఈ ఎక్జిక్యూటివ్ ఆర్డర్ మానవ హక్కులకు వ్యతిరేకంగా పనిచేస్తుందనే విమర్శలు వచ్చాయి. ఈ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు విద్యాసంస్థలలో స్వేచ్ఛాయుత, భావవ్యక్తీకరణను అణిచివేయడానికి దారి తీస్తుందని విశ్వవిద్యాలయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. విద్యార్థులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించడానికి భయపడే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. విశ్వవిద్యాల యాలు స్వేచ్ఛగా వివిధ భావజాలాల ను చర్చించే వేదికలుగా ఉండాలి. కానీ, ఈ నిర్ణయం వల్ల ఆ స్వేచ్ఛ కోల్పోతుందని విశ్లేషకులు హెచ్చరిస్తు న్నారు. విదేశీ విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిస్తే,లేదా ప్రదర్శిస్తే, వీసా రద్దు, బహిష్కరణ వంటి బెదిరింపులు తలెత్తే అవకాశముందని విశ్వవిద్యాలయ నిపుణులు పేర్కొన్నారు. ట్రంప్ తీసుకున్న ఈ ఉత్తర్వు అమెరికాలో భావప్రకటనా స్వేచ్ఛకు, విద్యాసంస్థల స్వేచ్ఛా స్వాతంత్ర్యానికి భయానక ముప్పుగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూద్ వ్యతిరేకతను అరికట్టాల్సిన అవసరం ఉన్నా, అది స్వేచ్ఛా భావవ్యక్తీకరణను అణచివేసే విధంగా మారడం ప్రమాదకరం. ఈ ఉత్తర్వు ద్వారా అమెరికా తన ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా వెళ్తుందని విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఇప్పటికైనా భావస్వేచ్ఛను పరిరక్షించే దిశగా ఈ ఉత్తర్వును సమీక్షించాలని పౌర హక్కుల సంఘాలు, న్యాయ నిపుణులు అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ను డిమాండ్ చేస్తున్నారు.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్,
9849328496.

ఆదర్శ జీవులు!

ఆలోక్ సాగర్
రిటైర్డ్ ప్రొఫెసర్
అమెరికా హుస్టన్
యూనివార్సిటీ
పి హెచ్ డి గ్రహీత!
రఘురామ్ రాజన్
రిజర్వు బ్యాంక్
మాజీ గవర్నర్!
ప్రొఫెసర్ ఆలోక్ వద్దే
చదువుకున్నాడు!
ఆలోక్-భారత్ ఇచ్చే
పద్మశ్రీ తిరస్కరణ!
మధ్య ప్రదేశ్ లోని
ఆదివాసీల సేవకే
జీవితం సమర్పణ!
అది ఆయన ఆదర్శం
పద్మశ్రీ కంటే ముందు
ప్రజలకు'సేవ'చేయటం
ముఖ్యమనుకున్నాడు!
కొనసాగిస్తున్నాడు!
అవార్డులు రివార్డులు
వేదికలు కండువాలు
మురిపించలేదు!
లక్ష్య సాధనకు అవి
ఆటంకమనుకున్నాడు!
మణిపూరే కాదు
దేశమంతా నేడు
ఆదివాసీ సమస్య
అగ్నిహోత్రమై
మండుతోంది!
భౌగోళికంగా
నా దేశం గొప్పది!
కవులు పొగిడారు
కవిత్వమల్లారు!
సంతోషించాము!
ఆర్థిక రాజకీయ
సామాజిక సాంస్కృతిక
రంగాలలో మాత్రం
భారత దేశాన్ని
ఎవ్వరు పొగడలేదు!
అడవులు మైదానాలు
భూములు సంపదలు
దోచుకు తినేవాళ్ళు!
పోరాడే వాళ్ళను
మట్టుబెట్టే 'కగార్ '!
అదే 'ఆలోక్' బాధ
దోపిడి రాజకీయం!
ఆర్థిక దోపిడి!
నిచ్చెనమెట్ల
కుల వ్యవస్థ!

-తమ్మనేని అక్కిరాజు

భాస్కర కిరణాలు

తెలుగు పద్యానికి 1000 ఏళ్లకు పైబడిన చరిత్ర ఉంది. పద్యం తెలుగు వాడి సంపద,సంతకం అంటారు. అది పేదవాడి సంగీతం అని కూడా అంటారు. ఇలా తెలుగు పద్యాన్ని గురించి ఎన్నో విషయాలు చెప్పుకోవచ్చు. పిల్లల్లో మన భాషా సంస్కృతుల పట్ల, నాగరికత పట్ల అవగాహనను, నైతిక విలువలను పెంపొందించడానికి చిన్నతనంలో శతక పద్యాలను నేర్పేవారు. తద్వారా పిల్లలు చిన్నప్పటి నుండే నేర్చుకున్న పద్యాల స్ఫూర్తి ద్వారా కాలక్రమేణ ఉత్తమ పౌరులుగా రాణించేవారు. కనుక వ్యక్తిత్వ వికాసంలో పద్యం చూపిన పాత్ర గణనీయమైనది.



ఈ నేపథ్యంలో నేటికీ ఎన్నో పద్య కావ్యాలు, శతకాలు వెలువడుతూనే ఉన్నాయి. ఆధునిక భావజాలానికి పద్యం వాహిక కాలేదని కొందరు అభిప్రా యపడినా పద్య కావ్యాలు మాత్రం వస్తూనే ఉన్నాయి. త్రిలింగ దేశం గా పేరొందిన తెలుగునాట తెలంగాణలోని కాళశ్వరానికి చెందిన మిత్రులు, విశారదులు డాక్టర్ మాడుగుల భాస్కర శర్మ గారు ఇప్పటికే 2007లో శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర శతకాన్ని రచించి, కిరణశ్రీ అనే ఖండకావ్యాన్ని వెలువరించారు. అవి భాస్కర కిరణాలై పాఠకులను ప్రభావితం చేస్తున్నాయి. భాస్కర శర్మ గారి నివాసమైన కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదుల త్రివేణి సంగమం లాగా వారి కిరణశ్రీ దైవప్రీతి, దేశభక్తి,సామాజిక అనురక్తి సంగమంగా సాగుతోంది. 101 పుటలతో కూడిన ఈ కావ్యం లో షోడశోపచారాల లాగా 16 ఖండికలు ఉన్నాయి. శర్మగారు పద్య రచనల్లో చేయితిరిగిన కవి కావడం వల్ల పద్యాలు అలవోకగా సాగాయి. తెలుగు, హిందీ, సంస్కృత భాషలు ముప్పేటగా ఆయనలో ముడి వేసుకున్నాయి. వృత్తిరిత్యా నవోదయలో హిందీ భాష ఉపాధ్యాయులుగా పనిచేసి జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాన్ని పొందారు. ఆకాశవాణి వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్ కేంద్రాల ద్వారా వారి కవితలు ప్రసారం అయ్యాయి, తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన కవి సమ్మేళనాలలో వారు పాల్గొని తమ కవితల్ని వినిపించి సన్మాన సత్కారాలు పొందారు. హిందీ- తెలుగు కవిత్వాన్ని తులనాత్మకంగా పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రి అందుకున్నారు. ఈ కావ్యం ఆరంభంలోనే అటు ఇష్టదేవతారాధన, ఇటు వస్తు సూచన చేయటం గమనార్హం. మలిన హరము, ధర్మయుతము, అజ్ఞానహరము అయిన కిరణశ్రీ ప్రాతఃస్మరణం అయింది. గణపతి, సరస్వతి దేవి స్తుతులను చేసిన కవి భరత మాతను స్తుతిస్తూ, అమ్మ నీ ప్రేమ వాత్సల్య మందచేసి, కన్న బిడ్డలను ఎప్పుడు కలిసి ఎప్పుడ, సిరులు కీర్తియు నందనాశీస్సు లిచ్చి చల్లగా చూసి రక్షించు తల్లి మమ్ము. అని సమాజ ప్రతినిధిగా వేడుకుంటాడు. కలిసిమెలిసి ఉన్నప్పుడే కదా కలిమి బలిమి. కవి జాతీయ సమైక్యత భావానికి ఇదొక ఉదాహరణ. మానవుడు శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన ప్రగతి వల్ల చంద్రమండల యాత్రనే కాదు చివరకు మన దేశం నుండి చంద్రయాన్ వరకు ప్రయోగాలు సాగాయి అయితే ఈనాడు మనిషి సాధించిన పురోగతి వల్ల సముద్రంలో చేపలా ఈదినా, ఆకాశంలో పక్షుల ఎగిరినా, మనిషి నేలపై మనిషిగా మనుగడ సాగించలేకపోతున్నాడని ఆవేదన పడుతూ, నేల మీద చాలా నేరములను చేసి, చంద్ర తలము వరకు సాగి వచ్చి, చెడును గగన సీమ చేర్చి నా మేనును కలుషితంబు చేయు తలపుతోడ అని జాబిల్లి ఆత్మకథలో భావుకంగా వినిపించారు. పర్యావరణ స్పృహను పంచిన పద్య ఖండిక ఇది. నాలుక నానారకాల సమస్యలు సృష్టిస్తుంది. జిహ్వాచాపల్యం అనారోగ్య కారణము అవుతుంది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అని సామెత. పరులను తిట్టకుండా పరపక్షము చేరకుండా వాక్కును అదుపులో పెట్టుకుంటే విజయేందిర వాని వరించు నాలుక అన్నాడు. అలాగే నాలుగు గొప్పతనాన్ని గురించి వర్ణిస్తూ మానవుల కోవెలలో వసించు దేవత అని స్తుతించాడు. తేదీ 20-10-2000 న బమ్మెర గ్రామంలో నిర్వహించిన పోతన జయంతి ఉత్సవాలలో పాల్గొన్న భాస్కర శర్మ ఆ కవిని స్తుతిస్తూ పోతనను మించు కవి ఇక పుట్టగలడె పుట్టినంతట భావన పొందగలడె. అని ప్రశంసించారు.ఈ పద్యాలలో పోతన కావ్యాలను, ఆయన వ్యక్తిత్వాన్ని, అక్కడి ప్రత్యేకతను ప్రశంసించారు. పోతన చరిత్రను కావ్యంగా మలచి అభినవ పోతనగా పేరొందిన వానమామలై వరదాచార్యులను స్తుతించారు. ఆయన కావ్యం లోని పల్లె జీవితాన్ని రైతు కష్టాలను వివరించారు. ముఖ్యంగా గుజరాత్ రాష్ట్రంలో, భుజ్ ప్రాంతంలో వచ్చిన భూకంపం పట్ల శర్మగారు మానవీయ కవిగా స్పందించి భూప్రకంపనం శీర్షికన 16 పద్యాలు రాశారు. ఉన్నట్టుండి పైకప్పులు కూలటం,పూరి గుడిసెలు ఇండ్లు నేలమట్టం అవడం చిన్న పెద్ద, ఆడ మగ తేడా లేకుండా శిధిలాల కింద సమాధి అయిన వారిని తలచుకుం టూ భూప్రకంపనరక్కసి భోక్తయయ్యే, కన్న బిడ్డల నెత్తురు కళ్ళజూసే అని విలపించారు. అంతేకాదు ఆపన్న హస్తాన్ని అందించడానికి ప్రపంచ దేశాలన్నీ మంచు గుండెలతో ప్రవహించరండి అని పిలుపునిచ్చారు. ఋతు వర్ణన అనేది మన కావ్య సంప్రదాయం. నాటి కాళిదాసు నుండి నేటి కవుల వరకు ప్రకృతికి సంబంధించి ఋతు వర్ణన చేస్తూనే ఉన్నారు.ఆధునిక కవులైన సినారె ఋతుచక్రం శేషేంద్ర ఋతుఘోష వంటి కావ్యాలు రాశారు. వర్ణనా నిపుణులైన శర్మగారు, ఈ కావ్యం లో ఆరు ఋతువులను అందంగా వర్ణించారు. భారతదేశానికి పెట్టని కోటగా ఉన్న హిమాలయాలను చూసి ఉత్తర ప్రాంత మందునొక.. విశ్వమందునన్ అన్న పద్యం, అలనాటి అల్లసాని పెద్దన రాసిన మను చరిత్రలోని అటజనిగాంచె.. అనే పద్యాన్ని స్ఫురింపచేస్తుంది. నేర చరితులంత నేతలై సాగటం, భూకబ్జాల వల్ల కడుపేద భూమికి గండమయ్యే, నిలువ నీడయు లేక వలస పొయె. మొదలైన పద్య పాదాలన్నీ అతని సామాజిక స్పృహకు అద్దం పడుతున్నాయి. విరులశరుడు, స్మిత వస్త్ర ప్రశస్తి లాంటి మంచి పద బంధాలు కూడా ఇందులో ఉన్నాయి. ఇలా తెలుగు పద్యానికి నేటి కాలంలో సొగసును, సొబగును అద్దుతున్న మాడుగుల భాస్కర శర్మ గారి కలం నుండి మరెన్నో కావ్యాలు వెలువడాలని ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ అభినందిస్తు న్నాను.

డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

(10 ఫిబ్రవరి 2025 , జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం)

పిల్లలు తరచుగా కడుపునొప్పితో గానీ, కాళ్ళు ముఖం ఉబ్బటం గానీ, ఆకలి మందగించడం, నీరసంగా, మందకొడిగా, బరువు తగ్గడం, రక్తహీనత, మలద్వారం చుట్టూ దురద మొదలగు ఏదైనా ఒక లక్షణంతో శారీరకంగా లేదా మానసికంగా అనారోగ్యంతో బాధపడుతుంటే కడుపులో నట్టలు ఉన్నట్టు అనుమానించవచ్చు. కడుపులో క్రిములతో (పొట్టలో నట్టలు) కలిగే అనారోగ్యం వల్ల పిల్లలు సక్రమంగా పాఠశాలకు హాజరు కాకపోవడానికి ఒక కారణమని తెలుసుకుని భారత ప్రభుత్వం 2015 సం. నుండి "జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్.డి.డి.)" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆనాటి నుంచి ప్రతి ఏటా రెండు సార్లు ఫిబ్రవరి, ఆగస్టు మాసాలలో ఆరు నెలలకో సారి ఎన్.డి.డి.రోజున అన్ని రాష్ట్రాలలో డీవార్మింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తూ పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు (ఆల్బెండజోల్ టాబ్లెట్స్) నమిలి మింగించడం జరుగుతుంది. బడిలోపలి పిల్లలతో ప్రారంభించిన ఎన్.డి.డి. కార్యక్రమం ఆ తర్వాత బడిబయట పిల్లలకు మరియు 1సం.చిన్నారుల నుండి 19 సం.ల వయసు పిల్లలందరికీ డీవార్మింగ్ టాబ్లెట్స్ వేయడం జరుగుతుంది. వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) శాఖల సమన్వ యం, సహకారం, సౌజన్యంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఎన్.డి.డి. రోజు,10 ఫిబ్రవరి 2025న 1 నుంచి19 సం.ల పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎం.జి. మాత్రలను నమిలి మింగించడం జరుగుతుంది.

1. ఏలిక పాములు (రౌండ్‌వార్మ్):
వీటి శాస్త్రీయ నామం: అస్కారిస్ లంబ్రి కాయిడ్స్ (ఙూంఘుతీఱం శ్రీబఎఎతీఱఅశీఱఎవం). ఇవి 10నుంచి 20సెం.మీ. పొడవుంటా యి. రోజుకు రెండు లక్షలకు పైగా గుడ్లు పెడతాయి. ఎక్కువ సంఖ్యలో ఏలిక పాములు ఉండటం వల్ల ప్రేవులలో అడ్డు గోడలుగా నిలుస్తాయి. వీటివల్ల అజీర్తి, కడుపు నొప్పి, నీరసం, పోషకాహార లోపం ఏర్పడుతుంది.
2. నులి పురుగులు (పిన్‌వార్మ్ /థ్రెడ్ వార్మ్):
ఈ పురుగులు తెల్లని రంగులో సన్నగా దారం పోగులాగా అర అంగుళం పొడవుంటాయి. వీటి శాస్త్రీయ నామం: ఎంటరోబియస్ వెర్మికులారిస్. ఈ వ్యాధి సంక్రమించిన వ్యక్తి బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేయడం వల్ల మట్టి కలుషితమై ఆ గుడ్లు చేతుల ద్వారా నీరు, ఆహారం ద్వారా ఇతరులకు వ్యాపించును. వీటివల్ల మలద్వారం చుట్టూ దురద, రాత్రిపూట ఎక్కువగా మూత్ర విసర్జన జరుగుతుంది.
3. కొంకి పురుగులు(హుక్ వార్మ్):
వీటి శాస్త్రీయ నామం: ఎన్సైలో స్టొమ డ్యుయోడినాల్. ఇవి నోటి ద్వారా కాకుండా పాదచర్మం ద్వారా సంక్రమిస్తా యి. కొంకి పురుగులు తమ నోటి దంతాల ద్వారా పేగులకు రంధ్రాలు చేసి రక్తాన్ని పీలుస్తాయి. వీటి గుడ్లు మట్టిలో చేరి ఎనిమిది రోజుల్లో లార్వాగా సన్నని దారం వలె రూపొందుతాయి.

నులిపురుగులు అంటే ఏమిటి? నులి పురుగులనేవి మానవుని ప్రేగులోంచి పోషకాలను,రక్తాన్ని గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు (parasites). మనిషి అతిదేహి అనగా ఆతిథ్యం ఇచ్చేవాడు. నులి పురుగు అతిథి. నులి పురుగులు మూడు రకాలు. ఏలిక పాములు (రౌండ్ వార్మ్), నులి పురుగులు (పిన్ వార్మ్), కొంకి పురుగులు (హుక్ వార్మ్).

ఈ దశలో పాదాల చర్మం ద్వారా శరీరంలోకి వెళ్తాయి. వీటివల్ల రక్తహీనత, నీరసం, ఇస్నోఫీలియా ఎక్కువగుట, పిల్లలలో శారీరక, మానసిక పెరుగుదల లోపం, కాళ్లవాపులు, ముఖం ఉబ్బడం జరుగుతుంది. నులిపురుగుల సంక్రమణ వేటి ద్వారా వ్యాపిస్తుంది? పరిసరాలు పరిశుభ్రంగా లేని ప్రాంతాలలో మానవ మలంలో ఉన్న హెల్మిన్తీస్ పరాన్నజీవుల గుడ్ల ద్వారా మట్టి కలుషితం అయి 'మట్టి ద్వారా సంక్రమించే హెల్మిన్తీస్' వ్యాప్తి చెందుతాయి. ఆరుబయట చెప్పులు లేకుండా వట్టి కాళ్ళతో మట్టిలో ఆడుకోవడం. అపరిశుభ్రమైన సురక్షితం కాని నీరు, ఆహారం తీసుకోవడం. భోజనం చేసే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు నీటితో కడుక్కోపోవుట. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయుట. పెరిగిన గోళ్లను కత్తిరించక పోవడం. వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పారిశుధ్యం లోపించడం. అపరిశుభ్రమైన ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా నులి పురుగులు నోటిద్వారా లేదా అరికాళ్ళ చర్మం ద్వారా సంక్రమిస్తాయి.

ఎవరెవరికి ఎక్కడ మాత్రలు వేస్తారు? జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం అనగా 10 ఫిబ్రవరి 2025 రోజున అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేయబడిన ఒకటి నుంచి ఐదు సం.ల వయస్సు గల చిన్నారులకు మరియు 6 నుంచి 19 సం.ల వయస్సు గల బడి బయట పిల్లలకు అంగన్వాడీ/ఆషా కార్యకర్తలు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు.

ప్రభుత్వ మరియు ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కాలేజీలలో నమోదు చేయబడిన 6 నుంచి 19 యేళ్ళ పిల్లలందరికీ ఎన్.డి.డి. రోజు ఏ.ఎన్.ఎం.లు, ఉపాధ్యాయులు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు. ఆ రోజు పాఠశాలకు వెళ్లని మిస్ అయిన పిల్లలకు 17 ఫిబ్రవరి 2025 (మాప్ అప్ డే) రోజున తిరిగి మాత్రలు వేస్తారు. యింకా అనాధ ఆశ్రమాలు, చైల్డ్ కేర్ సెంటర్లు మరియు చదువుకునే, ఆటలాడుకునే, పనిచేసే అన్ని ప్రదేశాలలో 1 నుంచి 19 సం. వయసున్న పిల్లలకు ఆరోగ్య సిబ్బంది మాత్రలు వేస్తారు. నులిపురుగుల ప్రభావం ఎక్కువగా ఉన్న పిల్లలలో ఈ మాత్ర వేసుకున్న తర్వాత కొందరికి వికారం, స్వల్ప కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు కలుగవచ్చు. కంగారుపడాల్సిన పనిలేదు. వెంటనే స్థానిక వైద్యారోగ్య సిబ్బందికి తెలియజేయాలి. పిల్లలు ఈ మాత్రను డైరెక్ట్ మింగకుండా బాగా నమిలి మింగే విదంగా చూడాలి. నమలకుండా మింగితే నిర్మూలనా ప్రభావం తగ్గే అవకాశం ఉంది.

ఆల్బెండజోల్ మాత్రల మోతాదు: 1 నుంచి 2 సం.ల చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర (200mg) రెండు స్పూన్ల మధ్య నలిపి, నీటితో కలిపి మింగిస్తారు. 2 నుంచి 3 సం.ల పిల్లలకు పొడి చేసిన ఒక పూర్తి మాత్ర (400 ఎమ్.జి.) మరియు 3 నుంచి 19 సం.ల వయసు పిల్లలు ఆల్బెండజోల్ మాత్ర (400 ఎమ్.జి.) భోజనం చేసిన తర్వాత నమిలి నీటితో మింగాలి. యన్.డి.డి. నిర్వహణ సమయంలో అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీల్లో శుభ్రమైన త్రాగు నీరు, గ్లాసులు ఏర్పాటు చేసుకొని కార్యక్రమం విజయవంతం చేయాలి. ప్రార్థన సమయంలో విద్యార్థులకు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం మరియు చేతులను సబ్బు నీటితో కడుక్కునే పద్ధతులను (హ్యాండ్ వాషింగ్ టెక్నిక్స్) నేర్పిస్తారు.

ఆల్బెండజోల్ మాత్రలు ఎవరు వేసుకోకూడదు? జబ్బులున్న వారు, దీర్ఘకాలికంగా మందులు వాడుతున్న పిల్లలు ఈ మాత్రలు వేసుకోరాదు. ఖాళీ కడుపుతో మాత్రలు వేసుకోరాదు. ఎట్టి పరిస్థితుల్లో టాబ్లెట్ పిల్లవానికి యింటికి యివ్వకూడదు. ఆల్బెండజోల్ మాత్ర పిల్లలకు, పెద్దలకు కూడా సురక్షితమైనది.

నులి పురుగులు రాకుండా నివారణ చర్యలు: బయటకు వెళ్లినప్పుడు చెప్పులు ధరించాలి. సురక్షితమైన నీరు, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు తీసుకోవాలి. భోజనం,ఇతర ఆహార పదార్థాలు తినే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు నీటితో కడుక్కోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా, మరుగు దొడ్లని వాడాలి. పెరిగిన గోళ్లను కత్తిరించి, శుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రంగా కడిగిన ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవాలి. పరిసరాల పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా నులి పురుగులు రాకుండా నివారించవచ్చు.

ఆరోగ్యవంతమైన సమాజం, ఆనందకర బాల్యం కోసం ఒక్క మాత్రతో వేలాది నులిపురుగులను నలిపేసి, పిల్లల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడే ఈ కార్యక్రమం వంద శాతం కవరేజ్ అయ్యేలా, విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. (10 ఫిబ్రవరి 2025 జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా)

బి నాశబోయిన నరసింహ (నాని),
కవి, రచయిత, ఆరోగ్య విస్తరణ అధికారి,
8555010108

తెలిసే భ్రమల్లో సాగే బతుకుల చిత్రణ

ఆల్ వియ్ ఇమేజిన్ యాజ్ లైట్

ALL WE IMAGINE AS LIGHT
A FILM BY PAYAL KAPADIA

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాకరమైనది కేన్ ఫిలిం ఫెస్టివల్. ఇటీవల మన భారతీయ సినిమా అక్కడ గ్రాండ్ ప్రి (Grand Prix) అవార్డు పొందింది. 'ఆల్ వియ్ ఇమేజిన్ యాజ్ లైట్' దర్శకురాలు పాయల్ కపాడియా ఈ అవార్డును పొందింది. ఇది ఓ అద్భుతం. దాదాపు మూడు దశాబ్దాల క్రితం నా మిత్రుడు షాజీ ఎన్ కరుణ్ ' పిరవి ' (1989) తర్వాత ఈ చిత్రానికి ఈ బహుమతి అందింది. అయితే ఈ రెండు చిత్రాలు కూడా మలయాళీ చిత్రాలే! అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో అవార్డులు పొందిన ఈ చిత్ర దర్శకురాలు పాయల్ కపాడియా అంతకుముందు తీసిన డాక్యుమెంటరీ 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్'కి 2021లో 'గోల్డెన్ ఐ'బహుమతి కేన్ ఫిలిం ఫెస్టివల్‌లో పొందింది. పాయల్ కపాడియా పూనా ఫిలిం ఇన్స్టిట్యూట్ స్టూడెంట్. దానికి 2015లో బిజెపి సభ్యుడు గజేంద్ర చౌహాన్‌ని కొత్త ఛైర్మెన్‌గా ప్రభుత్వం నియమించింది. అంతకు ముందు ఆదూర్ గోపాలకృష్ణన్, గిరీష్ కర్నాడ్, శ్యామ్ బెనెగల్ లాంటి ఉద్దండులు ఉన్న స్థానంలో ఇలాంటి వ్యక్తిని నియమించటాన్ని నిరసిస్తూ ఎఫ్.టి.ఐ.ఐ. విద్యార్థులు 139 రోజులు సమ్మె చేశారు. దానిలో క్రియాశీలకంగా పాల్గొన్న పాయల్ కపాడియా మీద కేసు నమోదు చేయడమే కాక, ఆమె స్కాలర్షిప్ ను రద్దు చేయడం లాంటివి చర్యలకు సైతం పాల్పడ్డారు. అయితే ఆమె తన ప్రతిభతో అంతర్జాతీయంగా పేరు తెచ్చుకున్నప్పుడు ఆమెపై పెట్టిన కేసులు ఎత్తివేయడం పొగడ్తలు చేయడం మామూలే. 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్' (మనం ఊహించే వెలుగు) అనే పేరు ఆమె తల్లి నళిని మాలిని వేసిన అబ్స్ట్రాక్ట్ పెయింటింగ్ శీర్షిక. ఆ పేరునేతన చిత్రానికి పెట్టానని పాయల్ కపాడియా చెప్పింది.

అయితే ఈ చిత్రం ఏ మాత్రం అమూర్తం కాదు. చెప్పబడుతున్న అభివృద్ధి, కొనసాగించబడుతున్న మనిషి జీవనం మధ్య ఘర్షణను ఈ చిత్రం చెప్పింది. ఈ చిత్రంలో వస్తువు చాలా సున్నితమైనది. మనం మోసానికి గురవుతామా? ఆ విషయం మనకు తెలియదా? మన ఇన్నాళ్లు సంపాదించిన, అనుభవంలోకి తెచ్చుకున్నవి, మన బుర్రలలో కుక్కుకున్నది జ్ఞానం కాదా? అది నిజానికి, అబద్ధానికీ మధ్య ఉన్న తేడా గుర్తించలేదా? అబద్ధం రంగరించిన భ్రమ మనల్ని వాస్తవికతని మరిచేటట్టు చేస్తుందా? లేదు. మనకి అది అబద్ధమని తెలుసు. భ్రమని గుర్తించగలం. అయినా తెలిసిన భ్రమ' (పర్సెప్టివ్ ఇల్యూజన్)లో మనం బతుకుతాం. మనకి తెలిసీ, ఆ భ్రమల్లోనే బతకడానికి కారణం 'యథాస్థితి మొగ్గు' (స్టేటస్ కో బయాస్) మార్పు అంటే భయం. చీకట్లో ఉన్న మనకి వెలుగు (మార్పు) గురించి సరైన అవగాహన ఉండదు. మిరమిట్లు కొలిపే, మనకందని అభివృద్ధి స్కై స్క్రేపర్లు, కార్లు, విమానాలు, ఫ్లైవోవర్లు, మాల్స్, మన కంటిన (మెటీరియల్ ఫిటిషిజం) వస్తు వ్యామోహం మనకు భ్రమాత్మక వెలుగునిస్తాయి. ఈ సినిమా మూడు పాత్రలతో పాటు ఇంకొక పాత్ర ముంబై నగరంది. కథలో కేంద్ర బిందువు ప్రభ. కేరళ నుండి వచ్చింది. ముంబైలోని ఓ హాస్పటల్లో నర్సుగా ఉద్యోగం. అంకిత భావం, నిజాయితీ ఆమె లక్షణాలు. ముఖాన నవ్వు ఉండదు. అలసట. చాలాసేపు ఇంటికి లోకల్ ట్రైన్‌లో ప్రయాణం. ఆమెకు పెళ్లయింది. భర్త పెళ్లయిన వెంటనే పని చేయడానికి జర్మనీ వెళ్ళాడు. అతను వెళ్లి సంవత్సరం పైబడింది. భర్త నుండి ఏ కబురు లేదు. అయినా ఏదో ఆశ అతను వస్తాడని.

తనలాగే కేరళ నుంచి వచ్చి, అదే హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తూ వుంటుంది అను. యవ్వన తొలిదశలో ఉంది. అనుకి తన ఇంటిని ఆమె షేర్ చేస్తుంది. అను ఒక ముస్లిం కుర్రాడు షియా జ్ని ప్రేమిస్తుంది. అది తన తల్లిదండ్రులకి ఇష్టం ఉండదని ఆమెకు తెలుసు. ముంబై నగరంలో స్వేచ్ఛగా ఉన్నట్లు పైకి కనిపించినా, శారీరకంగా కలవలేని స్థితి. చోటు లేదు. వీరిలాగే అదే హాస్పిటల్లో పార్వతి వంట చేస్తుంది. కొంకణి ప్రాంతం నుంచి వచ్చినామె. కాటన్ మిల్లు మూత పడగానే ఆమె భర్తకు ఒక క్వార్టర్ ఇచ్చారు. ఆమె భర్త చనిపోయాడు. ముంబైలో ఉండడానికి కనీసం ఆ ఇల్లయినా ఉండదేమో అన్న బాధపడుతున్న పార్వతిని ఒక హక్కుల లాయర్ దగ్గరికి తీసుకెళ్తుంది ప్రభ. అతను పేపర్లు లేని కారణంగా ఆ కేస్ నిలవలేదని చప్పరించేస్తాడు. ఎన్నో ఏళ్ల నుంచి ఉంటున్నా ముంబాయిలో ఇక ఉండగలమా అనే సంశయంలోనే అందరి బతుకులు వుంటాయి. ట్రాఫిక్, వర్షం, చాలీచాలని ఇల్లు, పెద్ద హోటళ్ళు, రుచికరమైన తిండి పదార్థాలు, వాటిలోకి అడుగు పెట్టలేని జీవితాలు. గణేష్ ఉత్సవాలు వస్తే, ఉద్రేకంతో డాన్సులు చేస్తూ తమని తాము మరిచిపోతారు. వీరందరూ మురికివాడల నుంచి వచ్చిన వాళ్లే. తాము ఉండేది ఒక ఇల్లు అని కూడా అనుకోలేని వాళ్లు వీళ్ళంతా. అయినా ముంబాయిని 'స్వప్నాల నగరం' అంటారు. కానీ నిజంగా అది 'భ్రమల నగరం'. 'నువ్వు మురికి కూపంలో ఉంటే నీకు కోపం రావడానికి వీల్లేదు. పైగా దాన్ని 'ముంబాయి స్పిరిట్' (భావోద్వేగం) అంటారు. దీనిని జనం నమ్ముతారు. నమ్మకపోతే చచ్చిపోతారు. 'హృద్యమైన డాక్యుమెంటేషన్‌తో ఈ సినిమాలో చెప్తుంది దర్శకురాలు. ప్రభతో పాటు అదే హాస్పిటల్లో పనిచేసే డాక్టర్‌కి ఆమె అంటే ఇష్టం. మలయాళంలో కవిత్వం రాసి ఆమెకి ఇస్తాడు. ఆమె తనకి పెళ్లయిందని అతనికి దూరంగా ఉంటుంది. పార్వతికి ఇల్లు దక్కలేదు. అయితే తన సొంత ఊరు రత్నగిరిలో హాస్టల్ ఉద్యోగం దొరికింది. ఆమెకు తోడుగా ప్రభా, అను ఇద్దరూ బయలుదేరుతారు. సముద్రతీరం. ప్రశాంతత. ఎప్పుడూఅలజడిని గుండెల్లో అదిమి పెట్టుకునే ప్రభకు ఊరట. అయినా అను ఆమె ప్రవర్తనని అనుమానిస్తుంది. ఇకవెళ్ళిపోతానని ప్రభ అంటే ఆమెను అడ్డుకుంటుంది పార్వతి. ఇక్కడ మళ్లీ దర్శకురాలు ఫలితాంశ ప్రకటనలో తన ప్రతిభ కనపరుస్తుంది. సముద్రంలో మునిగిన వ్యక్తిని అక్కడి మనుషులు ఒడ్డుకు తెస్తారు. నర్స్ అయిన ప్రభ సి.పి.ఆర్. ఇచ్చి అతడిని రక్షిస్తుంది. అది చూస్తున్న ఒక ఆమె ప్రభని అతని భార్య అనుకుంటుంది. ఇక్కడ సినిమాటిక్ ఇల్యూజన్అండ్ రియాల్టీ ప్రదర్శించబడుతుంది. అతను ఆమె భర్త అయి క్షమాపణ కోరితే ఆమె నిరాకరిస్తుంది. ప్రభలో భ్రమల తెరలు తొలగాయి. శారీరక కలయికలో అను, షియాజ్ పొందే ఆనందాన్ని చూస్తుంది. తరువాత ప్రభ, అనుతో సియాజ్‌ను తీసుకొని రమ్మంటుంది. ఇద్దరు అక్వకడికి వస్తారు. పార్వతి, ప్రభ, అను, షియాజ్‌లు ఎదురుగా ఉన్న సముద్రపు ఓపెన్నెస్‌ను ఆస్వాదిస్తుంటారు. ఇందులో ప్రభగా కని కస్రుటి నటన అద్భుతం. ఆ కళ్ళల్లో ఆశల్ని అణిచి వేసుకుంటూ, ఉదాసీనత ప్రకటించబడడం అపూర్వం. ఆమె అంతకుముందు నటించిన కేరళ కఫేలో ఉత్తమ నటిగా స్టేట్ అవార్డు, అలానే 'బిర్యాని' చిత్రంలో మాస్కో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ఉత్తమ నటిగా అవార్డులు పొందింది. 2019 లో ఆమె ఒక నిర్ణయం తీసుకుంది. లైంగిక వేధింపులకు నిరసనగా సినిమాల్లో నటించనంది. భ్రమాత్మక చిత్రాల మత్తులో ఊగే ప్రేక్షకుల్లా కాకుండా ప్రతిబింబాత్మక జీవన దృశ్యాలు చూసేవారికి ఈ చిత్రం ఒక విందు. అందుకు పాయల్ కపాడియా అభినందనీయురాలు.

సి.ఉమామహేశ్వరరావు
(సినీ దర్శకులు)

గుల్జార్‌కి గలియోమె

సొంచేతా దర్ద్ కీ దౌలత్ సే
ఏక్ మై హీ మాలా మాల్ హు
దేఖా జో గౌర్ సే తో
హర్ కోయీా రయీస్ నికలా

అనుకునేవాణ్ణి
బాధల సంపదతో
నేనొక్కణ్ణే కుబేరుణ్ణని
తీరా పరికించి చూస్తే
చుట్టూతా అంతా
కుబేరులే

సహర్ భి రాత్ భి
దుపహర్ భి మిలీ లేకిన్
హమ్ హీ నే షామ్ చునీ హై

దొరికాయి రాత్రీ, పగలూ,
కానీ, సాయంత్రాన్నే
ఎంచుకున్నా నేను

కభీ కభీ కిసీ సే
ఐసా రిశ్తా బన్ జాతా హై
కి హర్ చీస్ సే పహేలే
ఉసీ కా ఖయాల్ ఆతా హై

అప్పుడప్పుడు
కొందరితో
ఎలాంటి బంధం
ఏర్పడుతుందంటే
గుర్తొస్తుంటారు
ప్రతిసారీ వాళ్ళే
అన్నింటికన్నా
ముందుగా

గమ్ బోహోత్ హై మగర్
ఖులాసా కౌన్ కరే
ముస్కురా దేతా హు యు హీ
అబ్ తమాషా కౌన్ కరే

దుఃఖం చాలానే
ఉంది కానీ
బహిరంగంగా
ఏమి చెప్పనూ
అందుకే నవ్వే
స్తుంటానలా
దీన్నో తమాషా
ఏం చెయ్యనూ?

అనువాదం: దేవులపల్లి అమర్

బొమ్మలు: దేవులపల్లి శృతి

తెలంగాణ కథా ప్రస్థానం ఎటు నుంచి ఎటు

ఏ ఆధునిక యక్ష ప్రశ్నలకైనా సమాధానాలు ఠకీమని చెప్పగల చాట్ జిపిటి, డీప్ సీక్, ఏఐ యుగంలో కొంతమంది ప్రేక్షకుల ఎదుట ఓ నలుగురు కూచుని ఒక విషయం పై తీవ్రంగా చర్చించి తర్జన భర్జన పడి కుస్తీలు పట్టి ఆ విషయం అంతు చూసి ఈ వర్చువల్ ధర్మరాజులకన్నా లోతైన ప్రతిపాదనలను సాధించగలరా, ఏఐ ని మించిన విస్తారమైన విశ్లేషణ చేయగలరా, కృత్రిమ మేథ అందుబాటులో ఉన్న కాలంలో సభికులకు ఈ చర్చ ఏదో కొత్త విషయం అందించగలదని అనుకోవడం సమంజసమేనా, ఫోన్ తెరిచి తెలంగాణ కథ విశ్లేషణ అని సెర్చ్ చేస్తే బోలెడు సమాచారం వచ్చి పడుతుంది కదా, దానికోసం ఒక సభలో మూడు గంటలు కూచోవడం అవసరమా.. ఇవీ ఖమ్మంలో ఇటీవల జరిగిన కథానిలయం 28వ వార్షికోత్సవ వేడుకలో ని పానల్ డిస్కషన్ కు ముందు నాలాంటి వాళ్లను తొలచిన సందేహాలు. పానల్ డిస్కషన్ మొదలైంది కూడా ఈ ప్రశ్నతోనే. కథా నిలయం శ్రీకాకుళం వారు ప్రతి ఏటా జరిపే వార్షికోత్సవంలో ఒక పానల్ డిస్కషన్ కచ్చితంగా ఉండడం ఆనవాయితీ. ఈ ఏడు తెలంగాణ కథ, సమాజ కేంద్రకం, వ్యక్తి కేంద్రకం అనే అంశాన్ని నిర్ధారించి అందుకు మోడరేటర్‌గా నన్ను, పానలిస్టులుగా సంగి శెట్టి శ్రీనివాస్, కెపి అశోక్ కుమార్, దేవకీ దేవి లను ఎంచుకున్నారు. ముగ్గురు పానలిస్టులు తెలంగాణ పట్ల ప్రేమ, అవగాహన తెలంగాణ కథ పట్ల సాధికారత ఉన్నవాళ్లు కావడం ఈ ఎంపికకు కారణం. ఏ కథా రాయని నన్ను మోడరేటర్ గా ఎందుకు ఎంచుకున్నారో కారణం నాకైతే తెలియదు. తెలంగాణ, తె లంగాణ కథ అనేవి నాకు ఇష్టమైన అంశాలు కా వడం వల్ల అంగీకరించాను, నా ఎంపికకు న్యాయంకూడా చేసానని నాకైతే తెలియదు కానీ అం దరూ అంటుంటే ఆ తరవాత తెలిసింది. కృత్రిమ మేథ కంటే పానలిస్టులు అదనంగా ఏం చెప్పగలరు అనే ప్రశ్నతో మొదలైన చర్చ తెలంగాణ కథకు సంబంధించిన అనేక అంశాలను స్పృశించింది. ఎంత చాట్ జిపిటి అయినా ఎంత డీప్ సీక్ అయినా అంతిమంగా మానవ మేథ ఇచ్చిన ఇన్ పుట్ తోనే కొత్త నిర్ధారణలు చేయాలి కనుక నలుగురు ఒక చోట కూచుని జరిపే మేథోమథనం కచ్చితంగా గొప్ప ప్రతిపాదనలను చేయగలుగుతుందని పానలిస్టులు స్థిరంగా అభిప్రాయపడ్డారు. అసలు సామాజిక కేంద్రకం.. వ్యక్తి కేంద్రకం అంటే ఏమిటి, సృజనకారులు వ్యక్తి కేంద్రకంగా రచన చేస్తారా, నిజానికి తెలంగాణ కథ అంటే ఏమిటి, తెలంగాణ కథ ప్రస్థానం ఎక్కడ నుంచి ఎక్కడకు చేరుకుంది. నడిచొచ్చిన దారి ముఖ్యమా చేరాల్సిన గమ్యం ముఖ్యమా, తెలంగాణలో రావల్సినంత ఎక్కువగా మాండలికంలో కథలు ఎందుకు రావడం లేదు, తెలంగాణ కథలో నిర్మాణ పరమైన ప్రయోగాలు ఎందుకు తక్కువగా జరుగుతున్నాయి , తెలంగాణ కథకులకు జీవితాన్ని ఆదర్శంతో గార్నిష్ చేయడం ఎందుకు రావడం లేదు, తెలంగాణ కథలలో వైయక్తిక సంఘర్షణలకంటే సమాజానికి ఏదో ఒకసందేశం ఇవ్వాలన్న తాపత్రయం ఎందుకు ఎక్కువగా కనపడుతోంది, ఇతర ప్రాంతాల కథకులకు తెలంగాణ కథకులు నేర్పే మంచి గుణం ఏమిటి, తెలంగాణ కథకులు ఇతర ప్రాంతాల కథకుల నుంచి నేర్చుకోవల్సిన అంశాలు ఏమిటి అనే సందేహాల చుట్టూ చర్చ జరిగింది. ఏ రచనైనా నూటికి నూరు శాతం వ్యక్తి కేంద్రకంగా ఉండదనీ అది కచ్చితంగా ఎంతో కొంత సామాజిక కేంద్రకమై పాఠకులకు ఉద్దీపననిస్తుందనీ పానలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రాంతానికి చెందినవారు తెలంగాణ గురించి రాసే కథలన్నీ తెలంగాణ కథలేనన్న అభిప్రాయాన్ని పానలిస్టులు వ్యక్తం చేయడంతోపాటు ఇతర ప్రాంతాల వారు ఒక వేళ తెలంగాణ వేదన గురించి నటించి రాసినా దానిలో ఆత్మ ఉండదనీ, అందులో నిజాయితీ ఉండదని కూడా పానలిస్టులు అభిప్రాయపడ్డారు. అవి తెలంగాణ కథలు కావని కూడా తేల్చి చెప్పారు. తెలంగాణ మాండలికంలో కథలు తక్కువగా వస్తున్నాయన్న వాదనను పానలిస్టులు అంగీకరించలేదు. సంగిశెట్టి శ్రీనివాస్ మాత్రం అసలు తెలంగాణ ఒక భాష అనీ దాన్ని మాండలికం అనకూడదని బలంగా వాదించారు. తెలంగాణ కథలో నిర్మాణ పరమైన ప్రయోగాలు చాలా తక్కువగా జరుగుతున్న మాట నిజమేననీ, అందుకు అధ్యయనలోపమే కారణమనీ దానివల్లనే జీవితాన్ని ఆదర్శంతో గార్నిష్ చేయడంలో తెలంగాణ కథకులు విఫలమవుతున్నారనీ అభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఒక జీవన వాస్తవాన్ని చెప్పదలుచుకున్నపుడు, నిర్మాణ వ్యూహాలు, గార్నిషింగ్ లాంటి అదనపు అలంకారాలూ అవసరం లేదని కూడా ఏకాభిప్రాయం వ్యక్తమైంది. దళిత మైనారిటీ కథలు బలంగా ఉధృతంగా వస్తున్నాయని కూడా పానలిస్టులు అభిప్రాయపడ్డారు. దళిత కథలు తెలంగాణ నుంచి వచ్చినంత బలంగా ఏ ఇతర భాషలో కూడా రావడం లేదన్నది పానలిస్టుల భావన. కొత్త కథకులు తెలంగాణ నుంచి రావడం లేదన్న విషయంలో చిన్న చిన్న అభిప్రాయభేదాలతో అందరూ ఏకగ్రీవమయారు. కొత్త కథకులు రావడం లేదు అనేకంటే రావల్సినంత రావడం లేదని, కొత్త కథకులను తయారు చేసుకోవల్సిన బాధ్యత కూడా తెలంగాణ సాంస్కృతిక సమాజంపై ఉందనీ పానలిస్టులు సూచించారు. తెలంగాణలో కథకు అవసరమైన ముడి సరుకు లెక్కలేనంత ఉందనీ ఇప్పటికీ దుఃఖం, ఇప్పటికీ వేదన, ఇప్పటికీ రైతు జీవన విధానంలోని ఎగుడు దిగుళ్లు, నీళ్లు దొరకని కన్నీళ్లు, కడుపు మండుతున్న యువతరం విషాదాలకు ప్రతీకలుగా ఉన్నాయనీ వాటిని కథలు చేయడం అవసరమనీ పానలిస్టులు సూచించారు. మొత్తంగా చూస్తే రూపపరమైన అవగాహనను తెలంగాణ కథకులు పెంచుకోవాలనీ, కొత్త కొత్త ఇతివృత్తాల అన్వేషణలో నిత్యం మునగాలనీ, కథకు సంబంధించి అధ్యయనం కథకులకు అవసరమనీ చర్చ తేల్చింది. తెలంగాణ కథకులకు అధ్యయనం చాలా అవసరం అన్న అంశాన్ని కెపి అశోక్ కుమార్ బలంగా వినిపించారు. ఈ చర్చ తెలంగాణ కథకులకు పాఠకులకు తెలియని అనేక విషయాలను చెప్పగలిగిందని సంగిశెట్టి శ్రీనివాస్ అంటే తెలంగాణ కథకు సంబంధించిన ఏ అంశాన్నీ వదలకుండా అన్ని కోణాలనూ ఈ చర్చ విశ్లేషించిందని కెపి అశోక్ కుమార్ అన్నారు. చర్చలో పాల్గొనడానికి వచ్చిన తాను విద్యార్థిగా మారి అనేక విషయాలు కొత్తగా తెలుసుకున్నానని దేవకీ దేవి అన్నారు. ఈ చర్చ జరగడానికి కారణమైన కథానిలయం వారిని ఖమ్మం ఈస్థటిక్స్ వారిని ముగ్గురు పానలిస్టులూ అభినందించారు. ముగ్గురు పానలిస్టుల మధ్య అభిప్రాయ భేదాలు లేవని కాదుకానీ వాటి గురించి కూడా సామరస్యం గానే ప్రస్తావించుకోవడం, చర్చను విస్తృతం చేయడానికి దోహదపడేట్టుగా మాత్రమే ప్రతిపాదనలు చేయడం చర్చకు ఒక నిండుదనాన్నిచ్చింది. ఉప్పునిప్పుగా ఉన్న కెపి అశోక్ కుమార్, సంగిశెట్టి శ్రీనివాస్ లను ఒకే వేదిక మీద మూడుగంటల పాటు కూచోపెట్టి బోలెడంత ప్రశాంతంగా ముగించడం నా విజయంగా కనిపిస్తున్నాఅది కేవలం వాళ్లిద్దరి సంస్కారం, సంయమనం వల్ల మాత్రమే సాధ్యం అయిందని నాకు తెలుసు. వాళ్లిద్దరికీ నా కృతజ్ఞతలు. చివరగా ఓ మాట.. ఈ చర్చకు మోడరేటర్‌గా నన్ను నేను సిద్ధం చేసుకుంటున్న సమయంలో ఒక చిలిపి పని చేయాలనిపించి డీప్ సీక్‌కు ఈ అంశాన్ని ఇచ్చి సంబంధిత ప్రశ్నలు కావాలని అడిగాను. డీప్ సీక్ ఓ ఇరవై ప్రశ్నలు ఇచ్చింది. అవి మరీ నాసిరకం. ఆ ప్రశ్నలనే మళ్లీ డీప్ సీక్ కు ఇచ్చి సమాధానాలు చెప్పమని అడిగాను. ఆ సమాధానాలు కూడా నాసిరకమే. చివర్లో చర్చకు ముందురోజు నేను సిద్ధం చేసుకున్న ప్రశ్నలను కూడా డీప్ సీక్‌కు ఇచ్చి సమాధానాలు తీసుకున్నాను. అవి కూడా పరమ నాసిరకంగా ఉన్నాయి. చివరకు చర్చ ముగిసిన తరువాత మాత్రం డీప్ సీక్ కంటే సంగిశెట్టి, అశోక్ కుమార్, దేవకీ దేవి వందలవేల రెట్లు సమర్థులైన విశ్లేషకులని నాకు అర్థమైంది. వాళ్ల సమాధానాలు, వాళ్ల అవగాహన, వాళ్ల వివరణలు ఎంత భిన్నంగా ఉన్నాయో ఎంత ఆధునికంగా ఉన్నాయో ఎన్ని కొత్త కోణాలను చూపగలిగాయో అర్థమైంది. ఎంత కృత్రిమ మేథ అని మనం అబ్బురపడుతున్నా, లేదూ భయపడుతున్నా మానవ మేథకు, మనిషి ఆలోచనా సరళి లోతులకు అది ఏమాత్రం సరితూగదన్నది అక్షరాలా నిజం. మనిషి మెదడును నకలు చేసే మెదడింకా పుట్టలేద న్నది వాస్తవం. రాయగలిగితే ఇదొక కథాంశం.

ప్రసేన్

మెహఫిల్

సాహిత్యకారులు, కవులు, కళాకారుల కూడలి

మీ రచనలను పంపవలసిన ఇమెయిల్:
mehfil.manatelangana@gmail.com
'మెహఫిల్' గెస్ట్ ఎడిటర్: విమల

ఆ పిలుపు

ఆ పిలుపు
కాకి రెక్కలను విరిచింది
రింగన్న పురుగును
ఖాళీ అగ్గిపెట్టెకు కుదించింది
కబడ్డీల కాలును మడతేసింది
నాలుకకు దుశేర్ తీగల బుట్టి

మద్యంలో తప్ప నాలుక పలుకదు.
పద్యం పలుకదు మైకు పలుకదు
మద్యం లాంటి మత్తు ఏదో
ఆవహిస్తే తప్ప. పలుకు లేక
పదిమందిల మాట కాలేను
నలుగురితో నడక కాలేను
'నలుగురు కూర్చుని నవ్వే వేళల'
నవ్వు కాలేను నరనరాల్లో
శ్వాసిస్తుంటది ఆ పిలుపు

నేనెప్పుడూ రోడ్డు అంచులెమ్మడే
వంగి వంగి నడుస్తుంట
వాక్యనదికి జహ్నువు అడ్డుపడ్డట్టు
పదాలు గడ్డకట్టినట్టు...
కట్టడి చేస్తుంటది ఆపిలుపు

అందరికీ పిలిచి పీటేస్తరు
నా రంగు తీరేందో
నా ముఖం తీరేందో
నన్ను జూడంగనే
ముఖం దిప్పుకుంటరు

అమ్మగాళ్లాడినపుడు
గొంగళి పురుగు పొరాడినట్టు
నడిచినప్పుడు జెర్రి లేచి నడిచినట్టు
పొరకతో అవతలికి ఊకేసినట్టు

సంకలకెత్తుకునే ప్రేమలుండవు
ఎగరేసి హత్తుకునే గుండెలుండవు
బుగ్గలను ముద్దాడే పెదిమలుండవు
చుబుకాన్ని నొక్కే మునివేళ్లుండవు

నాయిన నాగలై ఎల్తె
అమ్మ యిత్తనాల కుండై
యెంట యెల్తే పీతి ఈగనై
చీమల్ల చీమనై...

అ అంటే అ రాక
ఒకటంటే ఒకటి రాక
గులామలీ సార్ బెత్తం దెబ్బలకు
కొంకిల్ల ఏరుగుడు బడి
తెల్దక్కోన్నని పేరుబడి

నన్ను పురుగులా చూసిన చూపు
పసి మనసున వైరస్
రోజులు నెలలు ఏండ్లు దశాబ్దాలు

నోరు పెగలదు
మాటలు చీదరించి
చూపులు పక్కకు పారేసి
క్షణ క్షణం అస్తిత్వ హననం

ఏ గుంపుల కలిసినా నన్ను కుదిస్తున్నట్టే
ఎవరితో మాట కలిపినా
మాట నన్ను ముట్టడిస్తున్నట్టే
ఎవరి పక్కకు చేరినా నన్ను దహిస్తున్నట్టే

పక్కన నడుస్తున్నవాడు
మింగుతాడేమోనన్న భయం
నడువలేను ఎదురుగ
మనిషంటే భయం పలుకలేను
నాలుక పిడుచగడుతది

తెలుపు నలుపు
ఏది నగం ఏది లోయ
ఏది శిఖరం ఏది అగాథం
ఏది గెలుపు ఏది ఓటమి
ఏది అల్పం ఏది అనల్పం

కనురెప్పల్ని నేనుకాని
ఎవరో కదిలిస్తున్నట్టుంటది
నడిచే కాళ్ళు నావి కావనిపిస్తుంటది
అనుభూతిలో ఎవరో చొరబడినట్టుంటది
కౌగిలి మధ్య చుంబనం మధ్య
ఏదో ఏలియెన్ జిగట పాదాల
బల్లి ఆవరించినట్టు

నలుపు ప్రకృతి శాపమా
దేవుడి శాపమా
మనిషి శాపమా

'రాముడు నలుపు కృష్ణుడు
నలుపు అర్జునుడు నలుపు'
'ద్రౌపది నలుపు'
'అబ్దుల్ కలాం నలుపు'
ఏవీ శాంతినివ్వవు

హనన కాండల మిగిలిందొకటే
నేను పట్టుకున్న పుస్తకం.
పుస్తకం ఓదార్చింది
సీతాకోకచిలుకయి రెక్కలనిచ్చింది.



తాత్వికుడెవడో కవచకుండలాలనిచ్చిండు.
దు:ఖ మంచుఖండాల్ని
రక్త కణాల కణితుల్ని
శ్వాసల చొరబడిన ఇనుపతెరల్ని
కరిగించి కాగితాలకెక్కించింది
కవిత్వం. కవిత నౌక అయి
సప్తసముద్రాల్ని చూపించింది
కవిత్వ గండభేరుండం మీద
ఎగిరిన సమస్త భూమండలం

రేగుముండ్ల శ్వాసల్ని దాటి
నిర్గమ అరణ్యాలు దాటి
నల్లసముద్రాల్ని దాటి
నువ్వుగా నిలబడమన్నయి
పసితనంల ఆవహించిన భీతి వైదొలగి
మద్య మాధ్యమంగానయినా
మద్యం లాంటి ట్రాన్స్‌లోనయినా
కలం కవాతు చేసింది
నలుపే సిరా అయింది

ఉత్తర దక్షిణల సరిహద్దు
తూర్పు పడమరల సరిహద్దు
అధీన ఆధిపత్యాల హద్దు
హద్దులు తరిమిన కొద్దీ
హననాలు మింగిన కొద్దీ
వలయాలు కుదించిన కొద్దీ
ఒంటరి వలయం
వెన్నెల కురియని వలయం
నా రూపులాంటి నల్లని చీకటి వలయం

అసంబద్ధతే కవిత్వం
నిజం చెప్పడానికి ఎన్నో చానళ్లు
మతాలు, మతాలు అవన్నీ
అబద్ధం అనడమే కవిత్వం

చూపు నలుపో, చూసే కనుపాప నలుపో
నలుపు తెలుపుల మధ్య
మెక్‌మోహన్‌రేఖ ఎప్పుడు మొలిచిందో
నది ఎప్పుడు రెండుగ చీలిందో

తెల్లని రుక్మిణి కృష్ణుడిని వలచింది
సుభద్ర అర్జునుడిని వలచింది
శూర్పణఖ రాముడిని వలచడం
నేరమెందుకయ్యిందో?

తెల్ల అమెరికాకు నల్ల అధ్యక్షుడొచ్చిండు
తెల్ల నాగలి నల్ల రేగడి ముచ్చట్లు విన్న నేను.
లోకంతో నాకు ముచ్చటెందుకు లేదో?

ఆ పిలుపు ఆఫ్రికాకు అనుసంధానం చేసింది
ద్రవిడ లిపి నన్ను పలుకరించింది

'కర్రోడా' ఆ పిలుపు ముళ్లపంది
చీమిడిలాంటి తెలుపు పిలుపు
మలంలో చీములాంటి తెలుపు పిలుపు

సుంకిరెడ్డి నారాయణరెడ్డి

కొన్ని జీవ వాక్యాలు

అర్థం అయ్యి కానీ అసురసంధ్య
వార్ధక్య నడక వాక్యంలా జీవితం
మంచినీళ్ల పెద్ద ఊట చెలిమె
ఇప్పుడు ఎండిపోయింది
బతుకు గానుగ ఎద్దై
చుట్టు చుట్టూ తిరుగుతుంది
చీకటిలో గుసగుసల కాపురం చేయక
కలవర పెడుతున్న తొణకని బెణకని
ఒంటరి కల కుంటుతుంది
తడి ఆరిన ఎడారి జీవితం
ఒయాసిస్ మీంచి వీచిన
సమీరంలా మా మరమరాండ్ల
చిన్న చిన్న మాటల మూటలు
మా జీవితకాలాన్ని పొడిగించే
జీవవాక్యాలు రోజూ కొన్ని కొన్నిగా..

జూకంటి జగన్నాథం

అన్ని క్షణాలు

అన్నిక్షణాలు
అపురూపమైనవి అమూల్యమైనవి
జీవితం నిండా పరుచుకున్న అన్నిక్షణాలు
బాధలెరుగని బాల్యాన తొలకరి జల్లులో
తడిసిన తలపుల క్షణాలు
వయసు పాడిన మోహావేశపు పూలజల్లులో
పులకిత పునీత క్షణాలు
అనుభవాల జీవనజాతరల్లో కురిసిన
ఆశలజల్లులో ఆరిన వినోద విషాదక్షణాలు
అన్నిక్షణాలు
అత్యంత రమణీయమైనవి మహాసౌందర్యమైనవి
గత మృత క్షణం గూర్చి తపింతువేల
ఆ గత క్షణం గూర్చి జాగృతి చెందువేళ
తిరిగిరానివి రెండే
చేజారిన క్షణం, చేతలుడిగిన ప్రాణం

కోటం చంద్రశేఖర్

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

చూపు

చాలా ఏండ్ల తర్వాత
మా వూరికెళ్లాను
మా యిల్లు చిన్నగా కనిపిస్తున్నది
మూడు గదుల ఇల్లే అయినా
ముల్లోకాలంత పెద్దగా వుండేది.

మా బల్ల మీద వొరిగి పడుకొని
మూడు వేల పుస్తకాలు చదివాను
బల్ల వైశాల్యం ఎకరాలుగా విస్తరించేది

ఇంటి ముందు చెట్టు
ఇప్పటికీ వుంది
దాని పైకెక్కి
చింతచిగురు తెంపేవాణ్ని
ఇప్పుడా ప్రాంగణమంతా
ఇరుకిరుగ్గా అనిపిస్తున్నది.

మా గోడల
జాజుపూతలు
సహజ చిత్రకారుని
కుంచె నుంచి జాలువారినట్టుగా ఉండేవి
ఇప్పుడవి మోటుగా ఉన్నాయి.

నగరంలో ఇల్లు కట్టినప్పుడు
పాత జ్ఞాపకాల ఇటుకల్తోనే కట్టించాను
ఈ మధ్య అది కూడా
చిన్నగా కనిపిస్తుంది.

ఎవరైనా కలిస్తే
మీ ఇల్లు ఎంత పెద్దది అని అడుగుతున్నాను
సైజు రోగం పట్టుకుంది నాకు
నాలో ఏదో మానసిక రుగ్మత ఆవరించింది.

అయితే
ఎంతో ప్రపంచం తిరిగొచ్చిన తర్వాత
ఇంట్లో అమ్మను చూస్తే మాత్రం
ఏ ప్రమేయమూ లేని
ఉజ్వల కాంతి వెలుగుతుంది
ఆమె ఒడిని మించిన
విస్తీర్ణం ఎక్కడా లేదని తెలుసుకున్నాను.

డాక్టర్ ఎన్.గోపి



భారత ఉపఖండంలోని ఎక్కువ భూభాగాన్ని పరిపాలించిన మొదటి రాజవంశం మౌర్యవంశం (క్రీ.పూ.322-185). ఈ వంశ తొలి రాజైన చంద్రగుప్త మౌర్యుడిని మహా పరాక్రమవంతుడైన రాజుగా తీర్చిదిద్దినవాడు చాణక్యుడు (క్రీ.పూ.350-275). చాణక్యుడనగానే చాలామందికి వెంటనే అర్థశాస్త్రం గుర్తొస్తుంది. కానీ, రాజ్య పాలన ఎలా ఉండాలో చెప్తూ రాజనీతి సూత్రాలను కూడా ఆయన రచించాడు.

చాణక్యుని రాజనీతి సూత్రాలు

ఈ చాణక్యుడు తన శిష్యుడైన చంద్రగుప్త మౌర్యుడి కోసం రాజ్యాన్ని ఎట్లా పరిపాలించాలో, ఎట్లా కాపాడుకోవాలో తెలియజెప్పడానికి ఆరు వేల శ్లోకాలతో 'అర్థశాస్త్రమ్' (రాజకీయ దండనీతి) అనే ఉద్గ్రంథాన్ని రచించాడు. ఆనాటి రాచరిక వ్యవస్థ, సమాజం కోసం వివిధ శాస్త్రాల నుంచి సేకరించిన 332 శ్లోకాలతో ఒక సంకలనం గ్రంథం వెలువరించాడు. అది 'చాణక్యుని నీతిశాస్త్రమ్'గా ప్రసిద్ధి పొందింది.

'ఏకాకి నా తపో ద్వాభ్యాం పఠనం..'/ ఒంటరిగా తపస్సు, చదువు ఇద్దరు కలిసి, గానం ముగ్గురు కలిసి, ప్రయాణం నలుగురు కలిసి చేయాలి అనీ 'అత్యాసన్నా వినాశాయ... రాజా వహ్ని ర్గురుః స్త్రియః'/ రాజుఅధికారికీ, నిప్పుకూ, స్త్రీకి దగ్గరగా ఉండకూడదు. అట్లాగని మరీ దూరంగా ఉండకూడదు. మధ్యస్థంగా ఉండి వారిని సేవించాలి. లేకుంటే నష్టపోతాము. అంటూ హితనీతి బోధలూ, జాగ్రత్తలూ అనేకం చెప్పినాడు.

> చాణక్య విరచితాలుగా 'అర్థశాస్త్రమ్' చాణక్యుని నీతిశాస్త్రంతో పాటుగా 'చాణక్య రాజనీతి సూత్రాణి' (చాణక్య రాజనీతి సూత్రాలు) అనే గ్రంథమూ ఉంది. 'ఈ చాణక్య రాజనీతి సూత్రాలు' అనే చిరు గ్రంథంలో ఎనిమిది అధ్యాయాలూ, 562 సూత్రాలూ కనిపిస్తున్నాయి.

'సుఖస్య మూలం ధర్మః'/ ధర్మమే సుఖానికి మూలం అంటూ ప్రారంభమయ్యే ఈ చాణక్య గ్రంథంలోని ప్రథమాధ్యాయంలో 'అర్థ సంపత్ ప్రకృతి సంపదం కరోతి' అర్థ సంపదే ప్రకృతి సంపదను ఇస్తుందంటూ– అమాత్యులు, మిత్రులు, కోశాగారం, రాష్ట్రం, దుర్గం, సైన్యం ఈ ఆరింటినీ రాజ్య ప్రకృతులని పేర్కొన్నాడు. అమ్యాతులను, మిత్రులనూ పరీక్షించి చేరదీసుకోవాలనీ, రాజు దుర్వ్యసనాలకు లొంగకూడదనీ, దండనాన్ని వివేకంగా ప్రయోగించాలని చెప్తాడు.

రెండవ అధ్యాయంలో 'అర్థమూలం సర్వకార్యం'/అన్ని పనులూ కావాలంటే ధనమే మూలమంటూ, అది ఉంటే స్వల్ప ప్రయత్నంతోనే పనులు జరిగిపోతాయంటాడు. రాజైనవాడు మంచి నడవడికను ఏనాడూ విడవవద్దని 'ప్రాణాదపి ప్రత్యయో రక్షితవ్యః' రాజు తన ప్రాణాల కన్న మిన్నగా ప్రజా విశ్వాసాన్ని రక్షించుకోవాలని హితవు చెప్తాడు.

మూడవ అధ్యాయంలో 'బాలాదపి యుక్త మార్గం శృణుయాత్'/ అర్థవంతమైన మాటను బాలుడు చెప్పినా వినాలి అంటాడు. సత్పురుషుల అభిప్రాయాన్ని దాటకూడదనీ, రాజులకు పరాక్రమమే ధనమనీ, శత్రువు చేతికి చిక్కినా అతడిని నమ్మకూడదనీ, ధన సేకరణలో శత్రు ప్రమేయమం ఉండొద్దనీ, ఎవరినీ, ఎప్పుడూ... అవమానించకూడదంటాడు. చాలా పనులున్నప్పుడు ఎక్కువ ఫలాన్నిచ్చే పనినీ, భవిష్యత్తులో లాభించే పనిని చేయమని చెప్తాడు.

నాలుగవ అధ్యాయంలో 'ధర్మేణ కార్యతే లోకః'/ధర్మమే లోకాన్ని నిలబెడుతుందనీ, పరుల సంపద మీద ఆసక్తి చూపవద్దనీ, పరద్రవ్యమైన గింజలేని పొట్టును కూడా హర్షించవద్దనీ, ధాన్యమే ధనమనీ, ఆకలి వంటి శత్రువు లేదంటూ 'సంసది శత్రుం న పరిక్రోశేత్'/ శత్రువుని సభలో గానీ, పది మందిలో గానీ, నిందిస్తూ అవమానించకూడదని నీతి బోధ చేస్తాడు.

ఐదవ అధ్యాయంలో 'విద్యా ధన మధనానామ్' నిర్ధనులకు విద్యయే ధనమనీ 'ఇంద్రియాణాం ప్రశమం శాస్త్రమ్'/ ఇంద్రియాలకు శాంతిని ప్రసాదించేది శాస్త్రమనీ, ఇతరులలోని సద్గుణాలకు అసూయ చెందకూడదనీ, 'శత్రోరపి సుగుణోగ్రాహ్యః'/ శత్రువు నుంచి కూడా మంచి గుణం గ్రహింపతగినదంటాడు. జ్యోతిష్య శాస్త్రం కంటే శకునశాస్త్రం నమ్మతగినదనీ, పూజనీయుల్లో తల్లియే గొప్పదని చెప్తాడు.

ఆరవ అధ్యాయంలో 'అనుపద్రవం దేశమావసేత్ ఏ ఉపద్రవం లేని దేశంలో నివసించాలని, ఎప్పుడూ ప్రజలు రాజుకు భయపడాలనీ, రాజును మించి దేవుడు లేడనీ, 'రాజదాసీ నసేవితవ్య' రాజ్యాంతఃపురంలోని దాసితో సంబంధం పెట్టుకోకూడదనీ హెచ్చరిస్తాడు. 'కథంచి దపి ధర్మం నిసేవేత్' ఎంత కష్టమైనా ధర్మబద్ధంగా బ్రతకాలని చెప్తాడు. 'నాస్తి సత్యాత్ పరం తపః' సత్యం కన్నా మించిన తపస్సు లేదంటాడు.

ఏడవ అధ్యాయంలో.. 'తపస్సార ఇంద్రియ నిగ్రహః'/ అని తపస్సుల్లో శ్రేష్ఠమైనది ఇంద్రియ నిగ్రహమనీ, చేయవలసిన పనులను తెల్లవారు జామున ఆలోచించాలని సూచిస్తాడు. 'ఆత్మాన స్తోతవ్యః' / తమకు తామే ఎప్పుడూ పొగుడుకోకూడదని అంటూ, పగలు నిద్రపోకూడదనీ హితవు చెబుతాడు. ఎండమావులు నీరు వలె కనబడినట్లుగా 'శత్రుర్మిత్ర వద్భాతి' / శత్రువు కూడా మిత్రుడి వలె కనబడతాడు సుమా అని హెచ్చరిస్తాడు.

ఇక చివరిదైన 8వ అధ్యాయంలో 'ధుర్మేధసో సచ్ఛాస్త్రం మోహయతి' మంచి శాస్త్రం చెడు మేధస్సు కలవాళ్లకు భ్రాంతి కలిగిస్తుందంటాడు. సత్పురుషులతో చేసే స్నేహం స్వర్గవాసం అనీ, దైవాధీనంగా ఉన్నదాని గురించి చింతించకూడదనీ, 'పుత్రో న స్తోతద్య' పుత్రుడిని స్తుతించకూడదనీ, 'ఆత్మచ్ఛిద్రం న ప్రకాశయేత్' తన లోపాన్ని లోకానికి తెలియనీయవద్దనీ చెప్తాడు 'వ్యవహారానులోమో ధర్మః' లోక వ్యవహారానికి అనుకూలంగా ఉండేదే ధర్మం అని సెలవిస్తాడు. యధార్థ స్థితిని తెలుసుకోవడమే శాస్త్రానికి ప్రయోజనమని అంటాడు. రహస్యంగా పాపాలు చేసేవాళ్లకు పంచభూతాలే సాక్షులు అనీ, సృష్టిలో ప్రతిదీ అనిత్యమైనదనీ, 'జన్మ మరణాదిషు తు దుఃఖమేవ'/ జనన మరణాలతో దుఃఖమే గానీ సుఖం లేదనే చేదు నిజాన్ని గుర్తుచేస్తాడు. ఈ విధంగా చాణక్యుడి ఈ 'రాజనీతి సూత్రాలు'లో రాచరికానికి పనికి వచ్చే సూత్రాలతో పాటు, సామాన్య ప్రజలకు ఉపయోగపడే నీతిసూత్రాలూ ఉన్నాయి. 'అహింసా లక్షణో ధర్మః' (మనో వాక్కాయకర్మలతో ఇతరులెవరినీ హింసించకుండా ఉండటమే ధర్మానికి లక్షణం) అనే చాణక్యుని నీతి సూత్రంలో ఈ పరిచయ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

రఘువర్మ
(టీయల్యన్)
92900 93933

ఈ శిక్ష మాకొద్దు

సామాజిక, రాజకీయ, ఆర్థికాంశాలపై పలు పత్రికలకు వ్యాసాలు, కవితలు, పుస్తక సమీక్షలు రాసే రచయిత బద్రి నర్సన్‌లో కథలు రాసే కోణం కూడా ఉన్నదని నాకు మెల్లిగా తెలిసింది. తెలిసిన వెంటనే ఆయన రాసిన తొలి కథల పుస్తకం 'దారి తెలిసిన మేఘం' చదివాను. అందులో ఉన్న కథలు చదివాక రచయితతో ముచ్చట్లు పెట్టాలనిపించింది. అందులో భాగంగానే ఈ ఇంటర్వ్యూ. నేనేం అడిగానో, రచయిత బద్రి నర్సన్ ఏం చెప్పారో కింద ఉన్న ప్రశ్న, జవాబుల్లో తెలుసుకుందాం.

ప్రశ్న: పలు పత్రికల్లో వివిధ అంశాలపై మీ వ్యాసాలు వస్తుంటాయి. మీరు కథలు కూడా రాస్తారా?

జవాబు: ఇది సాధారణంగా నేను ఎదుర్కొనే ప్రశ్ననే. గత పదేండ్లుగా పత్రికలకు వ్యాసాలు రాస్తున్నప్పుడు వాటిలో కొన్ని సంఘటనలు, సందర్భాలు కథలకు సరిగ్గా సరిపోతాయనిపిస్తుంటుంది. పుస్తక సమీక్షలు, సామాజిక, రాజకీయ అంశాలపై వ్యాసాలు రాస్తున్నా... కథగా మలచాలనిపించే సందర్భాలు నన్ను వెంటాడుతాయి. ఇంతకాలంగా ఎడిట్ పేజీలకు తోడు ఆదివారం పత్రికలకు కూడా ఎన్నో వ్యాసాలు రాశాను. మరి కథలు రాస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందా? రాశాక ఎవరూ వేసుకోకపోతే వాటిని ఏం చేసుకోవాలనే సందిగ్ధం కొంత వెనక్కి లాగేది.

ప్ర: ఈ సందిగ్ధంలో మీ కథా ప్రయాణం ఎలా మొదలైంది?

జ: కవిత్వంలో శ్రీశ్రీని, వచనంలో చలంను ఇష్టపడే మధ్య తరానికి చెందినవాడిని. కథ రాస్తే కొత్తగా, భిన్నంగా ఏదైనా రాయాలనిపించేది. ధైర్యం చేసి మొదటి కథ 2016లో రాశాను. అదే ఈ సంపుటిలో ఉన్న 'ఎంగిలి' అనే కథ. ఈ కథను ఒక పత్రికకు పంపితే మూణ్నెళ్ల తర్వాత ఫోన్ చేసి ఓ మాట చెప్పారు. 'దీన్ని వేస్తే ఇన్నాళ్ల నీ పరువుతో పాటు మా పత్రిక పరువు కూడా పోతుంది' అని. షాక్ తిన్నాను. అంత ఘోరంగా రాశానా అని తికమక పడ్డాను. అయినా ఎందుకో ఆ కథ మాయలో పడిపోయాను. సెకండ్ ఒపీనియన్‌గా మరో పత్రికకు పంపాను. కథ అచ్చయింది. ఉదయం నుంచే ఫోన్‌కాల్స్ మొదలయ్యాయి. అందరూ కథ కొత్తగా, గమ్మత్తుగా ఉన్నదన్నవారే కానీ, ఎవరూ తప్పుబట్టలేదు. ఒకరు నాటికగా మలుచుకుంటామన్నారు.

ప్ర: కథగా రావలసిందే అని వెంటాడిన అంశాలు ఏమైనా ఉన్నాయా?

జ: చాలా ఉన్నాయి. 2017లో ఢిల్లీలో నిఖిత ఆజాద్ అనే యువతి 'హ్యాపీ టు బ్లీడ్ అనే యాప్ తెరిచిన వార్త వింతగా, సాహసంగా తోచింది. స్త్రీల పీరియడ్స్‌కు సంబంధించిన విషయమది. చూడగానే దీనిపై కథ రాయాల్సిందే అనిపించింది. ఆ అంశంపై 'మరక మంచిదే' అని తెగించి రాశాను. ఆ కథ వచ్చాక 'ఏంటయ్యా.. మరీ ఇలా రాస్తారా!' అని మెచ్చుకోలుగా మాట్లాడిన మహిళలే అధికం. ఇలాంటి కథ ఓ మగాడు రాయడం చిత్రంగా ఉందన్నారు. ఈ కథ ఓ మహిళా మ్యాగజైన్‌లో వేసుకున్నారు. కన్నడంలోకి తర్జుమా అయింది.

అలాంటిదే మరో సంఘటన. మీరట్‌కు చెందిన ఒక తలారి కుటుంబం మూడు తరాలుగా ఖైదీలకు మరణశిక్ష అమలు చేస్తున్నదని ఓ ఇంగ్లీష్ పత్రికలో చదివాను. తమ చేతులతో ఉరితాడు ఖైదీ మెడకు బిగించి మీట నొక్కుతారు. విలవిలా తన్నుకొని ప్రాణాలు విడిచినవారి ముఖాలు, చూపులు వెంటాడుతాయట. సమాజం కిరాతకుడిగా చూసే ఈ కర్కశ వృత్తి తనతోనే ఆగిపోవాలని ఆయన వేదనతో అన్నారు. జైలు ఉద్యోగులే ఈ పనెందుకు చేయరనే కోణంలో 'ఈ శిక్ష మాకొద్దు' అనే కథ రాశాను. ఈ కథకు 'తెల్సా' అనే అమెరికా సంఘం కథల పోటీలో బహుమతి వచ్చింది.

ప్ర: 'దారి తెలిసిన మేఘం' శీర్షిక ఆసక్తిగా ఉన్నది. ఆ కథలో అంత విశేషం ఏమున్నది?

జ: 'దారి తెలిసిన మేఘం' కథ అంతా కల్పనే. ఢిల్లీ యూనివర్సిటీలో రీసెర్చ్ చేయడానికి వెళ్లిన హైదరాబాద్ అమ్మాయి సుజన. అక్కడ పరిచయమైన సలీమ్ కేంద్ర బిందువుగా సాగే కథ ఇది. మతం కన్నా జీవితం గొప్పదని చెప్పాలని రాసిన ఈ కథ నేటి అవసరం. అందుకే, ఈ కథ పేరే సంపుటికి శీర్షికగా తీసుకున్నాను. ఇలా కదిలించిన విషయాలతో అడపా దడపా కథలు రాయడం. ఏడాదికి ఒకటి, రెండు పత్రికల్లో రావడం కొనసాగుతున్నది. వీటిలో కొన్ని కథల పోటీల్లో గెలిచాయి. మూడు కథలకు ముల్కనూర్ గ్రంథాలయం వాళ్లు బహుమతులిచ్చారు.

ప్ర: నేడు వస్తున్న కథలపై మీ అభిప్రాయం?

జ: నేడు రచయితలకు అందుబాటులో ఉన్న భిన్న సాహిత్య ప్రక్రియల్లో కథ, నవలల్లోనే సమాజాన్ని లోతుగా, వివరంగా విశ్లేషించడానికి వీలవుతుంది. కథల్లో చర్చించే అంశాలు మనిషి చుట్టే తిరుగుతాయి. కథారచన పేలవంగా ఉంటే ఎంత మంచి విషయమైనా తేలిపోతుంది. ఎంత గొప్పగా రాయగలిగినా ఎంచుకున్న కథా వస్తువు మనిషికి దూరంగా ఉంటే ప్రయోజనం శూన్యం. కొత్తగా కథలు రాస్తున్నవాళ్లలో అన్ని రకాలున్నారు. కథలు చదవడం వల్ల ఎవరికివారు తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం వెతుక్కోవచ్చని నా అభిప్రాయం.



దాసరి నాగభూషణం

చెట్లకే మాటలు వస్తే
ట్రీ టూన్స్!

భారత స్వాతంత్రోద్యమ సమయంలోనూ, తర్వాతా ఇంగ్లిషు జర్నలిజంలో ఎంతోమంది తెలుగు వాళ్లు ఎడిటర్లుగా ప్రకాశిస్తే; మరో దశలో మరెంతోమంది మలయాళీలు జాతీయ స్థాయిలో కార్టూనిస్టులుగా భాసించారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తొలి దశలో ఖాసా సుబ్బారావు ఎడిటర్‌గా పనిచేసిన తెలుగు వ్యక్తి కాగా, తర్వాత ఇటీవల తెలంగాణ జర్నలిస్టు జీఎస్ వాసు మాత్రమే ఆ పత్రికకు ఎడిటర్ అయ్యారు. వీరిద్దరి మధ్య ఆరేడు దశాబ్దాల ఎడమ ఉంది. ఈ విషయం ఎంత ప్రత్యేకమైందో, కడప ప్రాంతానికి చెందిన సురేంద్ర 'ది హిందూ' ఆంగ్ల దిన పత్రికకు పాతికేళ్లు కార్టూనిస్టుగా సాగడం కూడా అంతే విశేషం.

ఆంగ్ల దినపత్రికలలో కార్టూనిస్టులుగా రాణించిన తెలుగు వారు ఇదివరకు పెద్దగా లేరు. ఈ మధ్యనే సుభాని, సురేంద్ర చెప్పుకోదగిన రాజకీయ వ్యంగ్య చిత్రకారులు. 2021లో పదవీ విరమణ చేసిన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడిన సురేంద్ర ఇటీవల 'ట్రీ టూన్స్' అనే పుస్తకాన్ని వెలువరించారు. ఇంగ్లీషు చెట్టుకు కార్టూన్‌లోని 'టూన్'కు పెళ్లి చేస్తే 'ట్రీ టూన్స్' అనే మాట తయారవుతుంది. ఈ పుస్తకం చెట్లకు సంబంధించిన 54 కార్టూన్ల సమాహారం.



వీరు స్థూలంగా వీరి 'ది హిందూ' పత్రికలోని పొలిటికల్ కార్టూన్లకు సంబంధించి ప్రత్యేకత ఏమిటంటే వ్యాఖ్య చాలా చిన్నగానో లేక దాదాపు లేకుండానో ఉండేది. పొలిటికల్ కార్టూన్లు ఆ ప్రాంతానికి, ఆ దేశానికి, ఆ సమయానికి మాత్రమే సంబంధించినవి కాగా; ప్రస్తుతం సంకలనం చేసిన ఈ పర్యావరణం సంబంధించిన కార్టూన్లు వస్తుపరంగా, విలువపరంగా సార్వత్రికమైనవి. పొలిటికల్ కార్టూన్లు రాజకీయ చరిత్రను వ్యాఖ్యానిస్తే ఇటువంటి చెట్లకు సంబంధించిన కార్టూన్లు మనిషి చెట్టును ఎలా డీల్ చేస్తాడని చెప్తాయి.

చెట్లకు మాటలు వస్తే, మనసుంటే, ఆలోచనలుంటే.. అవి మనలాగే మసులుతాయా? కుర్చీగా మారిపోయిన తన మిత్రుడిని మరో చెట్టు పలకరిస్తే ఎలా ఉంటుంది? తన మిత్రుడైన సూర్యుడితో ఒక చెట్టు సెల్ఫీ తీసుకుంటే? తమ చెంత కూర్చుని ప్రేమ ఊసులు చెప్పుకొన్న జంటలు, తర్వాతి కాలంలో పెళ్లి చేసుకోవడంలో ఎంతవరకు విజయం సాధించారని ఆ చెట్లే పరస్పరం కబుర్లు చెప్పుకొంటే ఎలా ఉంటుంది?

పొలిటికల్ కార్టూన్లు ఐదారు వేస్తే ఎడిటర్లు వాటిలో ఏదో ఒకటి ఎంపిక చేసి దినపత్రికలో అలంకరించేలా దారివేస్తారు. అయితే మిగతా ఐడియాలకు కూడా అంతే స్థాయిలో కార్టూనిస్టు కష్టపడాల్సి ఉంటుంది. కనుక కార్టూనిస్టుకు పని తక్కువ ఉందని మిగతా వాళ్లు అనుకున్నా, ఆయన బుర్ర గీక్కుకుంటూ చాలా గింజుకోవాల్సి ఉంటుంది. అలాంటి జుట్టు పీకుడు సమయంలో తటాలున మెరిసి, చటుక్కున ఉబికి వచ్చిన ఓ కార్టూను ఈ కార్టూన్లన్నింటికీ కారణమని సురేంద్ర చెప్తున్నారు. దానికి సాక్ష్యంగా ఫేస్‌బుక్ ఉన్నది.

సురేంద్ర కార్టూన్లలో వ్యాఖ్య తక్కువ కనుక భాషతో సంబంధం లేకుండా ఎవరైనా ఎంజాయ్ చేయవచ్చు. ఈ 54 కార్టూన్లలో ఎక్కువ భాగం ఇంగ్లీష్‌వే అయినా, కొన్ని తెలుగు కార్టూన్లు కూడా ఉన్నాయి. అందుకే కావచ్చు పుస్తకం లోపల రచయిత అదే కార్టూనిస్టు మాట ఇంగ్లీషులో ఉండగా, వెనకట్ట మీద వివరణ క్లుప్తంగా తెలుగులో కనబడుతుంది. అయితే, ఈ కార్టూన్లన్నీ చూసిన తర్వాత చెట్లన్నీ మనుషుల్లాగానే ఎందుకు ఆలోచన చేస్తాయనే సందేహం నాకు మొదలైంది? దానికి ఈ కార్టూనిస్ట్ మాత్రం ఏం సమాధానం చెప్పగలరు? అయితే మొత్తానికి ఈ కార్టూన్లన్నీ ప్రకృతి పట్ల, పర్యావరణం పట్ల మన అవగాహనను కచ్చితంగా పెంచుతాయి.

డాక్టర్ నాగసూరి వేణుగోపాల్
94407 32392



గుండె కింద...

ఏండ్ల తరబడి
ఎదురుసూపుల దర్వాజకు
యాలాడిన దోర్నపాలకుల
ఆకుపచ్చని ఆశ
ఆవిరయి ఎండిపోయింది
మనసును విడిచిపోని
పేగుబంధాన్ని
దగ్గరగా చూసుకొని చూసుకొని
కనిపెంచిన కండ్ల
దూరపు చూపు మందగించింది

ఎప్పుడన్నా ఒక్కసారి
చెవ్వొనించి విన్నవో లేదో గానీ
ఇప్పటికీ ఊరి పిలుపు
గుండె కింద వినిపిస్తది

ఇయ్యాల నీకు గుర్తున్నదో లేదో
ఊరంటే
నా బంగారు కొండ అని
గుండెలకత్తుకొని
ఊపిన ఉయ్యాల
నీ చినిగిపోయిన నెక్కరు
వయసు ఆటల్లో
అరిగిపోయిన జారుడు బండ

ఎల్లిపాయకారం తిన్నా
కన్న కడుపు
ఎంత తీపి ప్రేమతోని పెంచిందో
మమకారం కరువైన రోజుల్లో
మాటిమాటికి యాదికొచ్చేది
నిజం కాదా?

పై చదువుల కోసం
పైసా పైసా కూడబెట్టిన
తండ్రి కాళ్ళు
భరించిన ముండ్లెన్నో
నీ సుకుమారపు
సాఫ్ట్‌వేర్ బుర్రకు
ఎప్పటికీ అంతుచిక్కని
లెక్క కాదా?

లగ్జరీ బస్సెక్కేదాకా
నాయిన భుజాల మీదనే లగేజీ
నీ బరువు నువ్వు
మొయ్యడానికి
పరువు అడ్డమొచ్చిందా
సోమరి తండ్రీ!
చదివిన సదువు
శరీరాన్ని బలహీనం
చేసిందా సుకుమారుడా!

నగరపు రోడ్డు దాకా
నిన్ను మోసిన బాధ్యత
గతుకుల బతుకు దారిలో
నడిచీ నడిచీ
అలిసిన పాదాల పగుళ్లకు
మెత్తని చెప్పులు కొనియ్యని
ఉన్నత ఉద్యోగం
నాన్న గొప్ప పేరును మాత్రం
ఊరిజెండాపై
ఎగరేసిందా!?

నీ వైట్ కాలర్ ఉద్యోగానికి
ఖరీదైన బట్టల కింద
దాచినా దాగని
గర్వపు మురికి!

ఇంకా ఇంకా
బండబారిపోక ముందే
గుండె లోతుల్ల ఎక్కడన్నా
కొంచెం తడి
తగులుతుందేమో
తడుముకొని చూడు
నిన్ను నువ్వు ఉతుక్కోవడానికి!



రహీమొద్దీన్
90108 51085

సునిశిత విమర్శకు పేరున్న వంశీకృష్ణ వర్తమాన విమర్శ చుట్టూ వ్యాసాన్ని నడిపి సినిమా హీరోలకి మల్లే కవులకి ఇమేజి సమస్యలున్నాయేమో అని వాపోవడం (చెలిమె 20.01.25) ఆశ్చర్యం వేసింది. ఆ పోలికే అసమంజసంగా ఉంది. ఇమేజులు అభూత కల్పన కాదా ? పైగా అతనెవరో (?) వర్ధమాన విమర్శకురాలు నీలిమ సదరు విమర్శను కూడా దూకుడు తగ్గించమన్నందుకు ఏకంగా తెలుగు సాహిత్య ప్రతిబింబంలా కనిపించాడన్నారు. ఇది మరీ దారుణమైన మాట. ఏ రకమైన చూపు ఇది ? విమర్శ మీద ప్రేమకొద్దీ ఆ అనామక మిత్రుడలాంటి మాట అని ఉండడు.

సాహిత్యాభిలాషను విమర్శ
బ్రతికించాలి



ముందుమాటలు, బ్లర్బులు ఇలానే ఉండాలని ఏ సూత్రీకరణ లేదని చెప్తూనే వంశీ ఒక చోట పరిమితులుంటాయంటారు, మరొక చోట విమర్శ చేయకూడదని ఎక్కడా లేదు అంటారు. కొంతమంది కొత్త తరం రచయితల్ని ఉటంకిస్తూ వాళ్ళందరూ ఏ నెగెటివ్ విమర్శ (?) చేయడం లేదంటారు. వంశీకృష్ణ మాత్రం ఏ నెగెటివ్ విమర్శ చేసినట్టు భావించాలి? 'తెలుగు సాహిత్యం ఏమి కోరుకుంటున్నదో అదే నేను ఇస్తున్నాను' అన్న ప్రసేన్ వైపు సానుకూల ధోరణినే ఆయనా ప్రదర్శించాడు. పైగా వర్తమాన విమర్శకులు సేఫ్ గేమ్ ఆడుతున్నారంటాడు. ఆ ఆటకారితనం మనకి కొత్తదేం కాదు. ఎప్పుడూ ఉన్నది. దాన్ని పరిహరించాకే ఇన్నేళ్ళూ తెలుగు సాహిత్యం అసలు విమర్శ సామర్థ్యాన్ని అంచనా వేస్తూ వస్తున్నది. లేకపోతే రారాలు, చేరాలని ఒకే గాటన కట్టేసినా తేడా తెలియకుండా పోను.

ఆ శేషం లక్ష్మీపతిరావు గారెవరో గానీ, ఆయన ప్రతిపాదించిన సాహిత్యంలో రిజర్వేషన్ తోడ్పాటు ఇప్పటికే కాదు, ఎప్పటికీ అవసరమే. అసమానతలు కొనసాగిన ప్రతి సమాజానికీ ఆ కాస్త సహేతుకత్వం ఉండతగినది. అదేమీ సానుభూతి కాదే? అయితే ఏదీ మరీ కళ్ళు మూసుకుపోయేట్టు ఉండకూడదు. గుంటూరు లక్ష్మీనరసయ్య గారు అణగారిన వర్గాల సాహిత్యం పట్ల ఎంతో ఔదార్యం చూపిస్తాడు. అతని సమర్థింపు ఒక తరం దళిత బహుజన రచయితలకు ఎనలేని ధైర్యాన్ని ఆత్మ విశ్వాసాన్నిచ్చిందనడంలో అతిశయోక్తి లేదు. ప్రాంతీయ విబేధాలు వచ్చినప్పుడు కూడా ఆయన మార్జినలైజ్డ్ ప్రజల పక్షాన్నే మాట్లాడాడు. కానీ ఆయన దళిత బహుజనేతరుల్ని ట్రీట్ చేసే పద్ధతిని మాత్రం సమర్థించకూడదు. పక్షపాతానికీ ఒక న్యాయం ముఖ్యం. విమర్శలోనూ అంతర్గత సమతుల్యత ఉంటుంది. వంశీకృష్ణ బహుజన, స్త్రీవాద, దళిత, ముస్లిం మైనారిటీ, ఆదివాసీ కవిత్వంపై ఇప్పటిదాకా వచ్చిన విమర్శని సరి అయిన విమర్శ కాదని భావిస్తున్నట్టు తోస్తున్నది.

వంశీకృష్ణ నీలిమను సమర్థించడానికే ఈ వ్యాసం రాసుకుంటే ఇబ్బంది లేదు. ఆ క్రమంలో అనిల్ డ్యానీ, లండ సాంబమూర్తి, నాంపల్లి సుజాత వంటి వారిని పరోక్షంగా తక్కువచేసి మాట్లాడారు. ఇప్పుడు వస్తున్న సాహిత్యంలో ప్రగతి కాముక రచనలతో బాటు నీతి ప్రవచనాలు, మితిమీరిన ఆధ్యాత్మిక భావజాలము, ఆచరణ లేని ఆదర్శ ప్రభోదాలు, హేతుబద్ధతలేని ప్రణయ ప్రస్తావనల వెల్లువ మనం అందరమూ గమనిస్తూనే ఉన్నాము. ఎవరి విమర్శ ఎలా ఉందో ఏ ఒక్కరి వకాల్తా అన్నింటినీ తేల్చేయదు. మిగతా ప్రక్రియలకున్నట్టే సద్విమర్శకీ విలువ ఉంది. తిట్టడమే విమర్శ అన్నట్టు తయారైన పరిస్థితిని వంశీకృష్ణ వంటివారు తులనాత్మక వివేచన చేయాలి. ఆయన ఈ వ్యాసం రాశాక సామాజిక మాధ్యమాల్లో ఒకరెవరో కొత్తగా రాస్తున్న వాళ్ళని గాయపరిచేట్టు 'చెత్తని చెత్త అంటే చిన్న బుచ్చుకుంటే ఎలా' అని వ్యాఖ్యానించడం బాధాకరం. నీలిమ తన విమర్శను సరైన అర్థంలోనే చేసినట్టు యావత్ తెలుగు సాహిత్య సమాజం గుర్తించాలని వంశీకృష్ణ తాపత్రయపడుతున్నారు. అందుకు తన అనుభవజ్ఞ సమ్మోహ వాక్యం గట్టి ప్రయత్నమే చేసింది. తప్పు లేనే లేదు. ఆ మాత్రానికి విమర్శా రంగాన్ని శుభ్రపరుస్తున్న వ్యాఖ్యలు చేయనక్కర్లేదు. ఇమేజీ చట్రంలో చిక్కుకున్నారని కవుల్ని నిందించనక్కర్లేదు.



శ్రీరామ్ పుప్పాల
9963482597

నవతెలంగాణ
దర్వాజ
సోమవారం 10-2-2025 ॥ హైదరాబాద్

హంగ్రీ ఫైటర్

కాలమేదైనా కావొచ్చు
కారణమేదైనా అవ్వొచ్చు
ఈ దేశం అభాగ్యులకు పురిటిశాల
పసిబాలలకు ఆకలి జ్వాల ,
బొడ్డు తాళ్లని దారపు ఉండలా తెంపి
గాలిపటంలా పసికందులను వదిలేసే
కొందరు తల్లులకసలు తెలిసుండదేమో
ఆ పసి పతంగులు ఆకలి ముళ్ల కిందనో
లోకపు నోళ్ల కిందనో ఇరుక్కుపోతారని
దుఃఖపు చెట్టు పై వాలిపోతారని.

వానకు తడిసి, ఎండకు ఎండి
ఆకలికి మండే ఆ పెదవులపై
ఎప్పుడైనా తడి ఆరిపోతే,
ప్రాణం ఆవిరై, మోడుబారినట్టు
డొక్కల్లోనో, పక్క బొక్కల్లోనో
చేయి పెట్టి తడిమి చూస్తే
బొమ్మా బొరుసుల్ల
రెండు దిక్కులా ఆకలి చిత్రమే
వారి దేహ కాన్వాసు పై కనిపిస్తుంది.

ఏ తల్లి వదిలిపోతేనేమీ
ఎప్పుడో శోక దేవత పాలు తాగిన
శ్రావణ కుమారిడిలా
కళ్ళను కన్నీటి కావడిగా చేసి
చెత్త సంచులని
అట్లాసులా భుజాన మోసి
తరలిపోతారు స్ట్రీట్ చిల్డ్రన్లై
మారిపోతారు హంగ్రీ ఫైటర్లై.

- ఏ సందీప్ వొటారికారి
9390280093

సాహితీ వార్తలు

16న ముగ్గురు కవుల సప్తతి సభలు

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు హైదరాబాదులోని రవీంద్ర భారతి సమావేశ మందిరంలో 'కందుకూరి శ్రీరాములు, డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, డాక్టర్ నాళేశ్వరం శంకరం' ముగ్గురు కవుల సప్తతి సభ నిర్వహిస్తున్నారు. డా. కొండపల్లి నీహారిణి ఆహ్వానంలో బైస దేవదాసు సభాధ్యక్షన దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా, మామిడి హరికృష్ణ, దేవీ ప్రసాద్, విరాహత్ అలీ విశిష్ట అతిథులుగా ప్రారంభ సమావేశం ఉంటుంది. అనంతరం ముగ్గురు కవుల సభలు ఉంటాయి.

23న దాశరథి - ఆరుద్ర సాహిత్య సమాలోచన

దాశరథి కృష్ణమాచార్య - ఆరుద్ర శతజయంతి సందర్భంగా తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఈ నెల 23 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు దాశరథి కృష్ణమాచార్య - ఆరుద్ర సాహిత్య సమాలోచన సదస్సు ఉంటుంది. ప్రముఖుల ప్రసంగాలు, పరిశోధకుల పత్ర సమర్పణలు ఉంటాయి. వివరాలకు 8897765417, 6304078905 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

- తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ

విశిష్టాద్వైత సాహిత్య గ్రంథాలకు ఆహ్వానం

శ్రీలేఖ సాహితి ఆధ్వర్యంలో విశిష్టాద్వైత సాహిత్య గ్రంథాలకు 'చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక సాహిత్య పురస్కారం' అందివ్వనున్నారు. ఎంపికైన సంకలనానికి రూ.5000/- బహుమతి అందిస్తారు. ఇందుకు పద్య కావ్యాలు, వ్యాస సంపుటాలు పంపవచ్చును. ఆసక్తి కలిగిన వారు 2020 - 24 మధ్య కాలంలో ప్రచురితమైన సంకలనాలను మార్చి 31 లోగా డాక్టర్ టి. శ్రీరంగస్వామి, అధ్యక్షులు, శ్రీలేఖ సాహితి, ఇం.నం. 27-14-53, లిటిల్ సోల్జర్స్ స్కూల్ లేన్, మండల కార్యాలయం ఎదురుగా, హసన్‌పర్తి 506371, హన్మకొండ, వరంగల్ చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 99498 57955 నందు సంప్రదించవచ్చు.

కథా సంపుటాల కు ఆహ్వానం..

వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో కథా సంపుటాలకు పురస్కారాలను అందివ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు 2023, 2024 లో ప్రచురించిన కథా సంపుటాలను నాలుగు ప్రతుల చొప్పున మార్చి 31లోగా పి.యాదగిరి, ఇం.నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్-2, మయూరి బార్ అండ్ రెస్టారెంట్ ఎదురు వీధి, రంగధాంపల్లి చౌరస్తా దగ్గర, సిద్ధిపేట - 502103 చిరునామాకు పంపవచ్చు. ఎంపికైన వాటికి సిద్ధిపేటలో నిర్వహించే సాహిత్య కార్యక్రమంలో పురస్కారం అందజేస్తారు. వివరాలకు 9299909516, 9848261284 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

సంక్షుభిత వ్యవస్థకు సజీవ సాక్ష్యాలు

డా॥ ఎ. రవీంద్రబాబు
8008636981

కథను సూత్రాల్లో బంధించలేం. నేపథ్యం, ఇతివృత్తం, వస్తువు, రచయిత దృష్టి వల్ల కథ చెప్పే తీరు మారిపోతుంది. కథా వస్తువు ఎంపికలో రచయిత ఇష్టాయిష్టాలు ఉన్నా, చుట్టూ ఉన్న సమాజమే అతని చేత కథను రాయిస్తుంది. ఒకానొక చారిత్రక సందర్భం కథను నిర్దేశిస్తుంది అన్నది వాస్తవం. ఆ సందర్భాన్ని సరిగ్గా పట్టుకోకపోతే కథే కాదు ఏ సాహిత్య ప్రక్రియ అయినా కాలానికి ఎదురొడ్డి నిలబడదు. ఆ రచయితా సాహిత్య కారుడిగా గుర్తింపు పొందడు.

రచయిత సమాజ మార్పును ఎప్పటికప్పుడు ఒడిసి పట్టుకోవాలి, సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలించాలి. తనదైన దృక్పథాన్ని ఏర్పరచుకోవాలి. ఆ దృక్పథం ప్రగతి శీలమైనదై ఉండాలి. వస్తు, శిల్పాల మధ్య సమన్వయ ధోరణితో కథ రాసే సత్తా ఉండాలి. నిజానికి కథే కథకుడి స్థానాన్ని నిర్ణయిస్తుంది. అతడి నిజాయి తీని బయటపెడుతుంది. నిర్దయగా కథను విమర్శకు పెడుతుంది. అంతే నిర్దయగా వదిలేస్తుంది కూడా. అందుకే కథకుడు కథా నిర్మాణం, నేపథ్యం, వస్తువులపై ఎప్పటికప్పుడు జాగురూకతతో వ్యవహరిస్తూ నవ్యత వైపు అడుగులేయాలి. ఈ దృష్టితో చూసినప్పుడు దేశ రాజు కథా సంపుటి "రొమాంటిక్ డాగ్" పాత, కొత్తల మేలు కలయిక. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబం ధాలే అన్న సత్యాన్ని మరోసారి గుర్తు చేసే కాంతివీచిక. గ్లోబలైజేషన్ పీరియడ్‌లో బంధాల కొలతలను మానవీయ దృష్టితో తూచే సాహిత్యపు త్రాసు.

దేశరాజుకున్న బహుళత్వం ఈ పుస్తకంలోని పన్నెండు కథల్లో సుస్పష్టంగా కనిపిస్తుంది. వస్తువు ఎంపిక, శిల్పాలను బట్టి కథల మధ్య అంతస్సూత్రత లేకపోయినా, కథకుడికి సమాజంపై ప్రేమపూర్వక స్పందన ఉందనిపిస్తుంది. రాతి హృదయాలను తట్టి లేపి, ప్రేమగా బతకడం ఎలాగో నేర్పాలన్న తపన ఉంది. కోల్పోతున్న సామూహిక వ్యవస్థలోని బంధాలను పొదివి పట్టుకుని వైక్తిక పోకడలతో వెళ్తున్న అత్యాధునిక యువతకు అందించాలన్న స్పృహ ఉంది.

ఆధునికత తెచ్చిన అభివృద్ధి మంత్రంలో దాగిన గుట్టు రట్టు చేసి, మనిషి తన సహజత్వాన్ని కోల్పోతున్న తీరును బలంగా చెప్పాలన్న ఆశా ఉంది. బల్లపరుపుగా జీవించడం సౌఖ్యం కాదు, గుండ్రంగా తిరగడంలోనే మార్మిక సౌందర్యం ఉందని, దాన్ని మనుషులకు చూపించాలన్న కోరికా ఉంది. తన కథల ద్వారా భూత, వర్తమాన బతుకుచిత్రాన్ని తవ్వి, భవిష్యత్తుకు సుందర వనాన్ని నిర్మించి ఇవ్వాలనుకుంటున్నాడు. ఆ క్రమంలో అక్కడక్కడా శిల్పాన్ని వస్తువు డామినేట్ చేయొచ్చు, శిల్పం సాగి వస్తువును కప్పేయవచ్చు. ఏది ఏమైనా ఒక కథకుడిగా తన ప్రయాణాన్ని సాగిస్తున్నాడీ రచయిత. ఇంకా సాగించే ధైర్యం అతని కథలకూ ఉంది. వస్తు విస్తృతి, సారంలో సాంద్రత ఉన్న కొన్ని కథల్లో వర్తమాన ప్రపంచ వైవిధ్యంతో పాటు, భిన్నత్వమూ కనిపిస్తుంది. ఏకథకాకథ స్వయం సంవేదనతో ప్రకాశిస్తుంది.

కూతురిపైనే అఘాయిత్యం చేసిన భర్తపై కోర్టుకెక్కినా, న్యాయం జరగని ఒక స్త్రీ తీసుకునే తీర్పు ఎంత భయంకరంగా ఉంటుందో చెప్తుంది "ఓ తల్లి తీర్పు" కథ. "దణ్ణాలు పెట్టినా, అదేంటో.. ఆ మాయదారి దేవుడు మగాడివైపే నిలబడుతూ వున్నాడు. అవున్లే ఎంతైనా ఆయనా మగాడు కదా" అని మగ దేవుళ్ళపై వేసే సెటైర్, మహిళా న్యాయవాదు ల్లోనూ కనిపించే పురుష స్వభావం, "ఆడు అదురుష్టవంతుడ్రా.. తల్లీ కూతురు- ఇద్దరినీ" అని కథలో సందర్భానుసారంగా పురుషుల మనస్తత్వాలను నిప్పుల కాల్వలా కవాటాలు పగులగొట్టి మరీ గుండెల్లోకి ప్రవహింపజేస్తాడు రచయిత.

మనుషులకంటే కుక్కే మేలని, గొప్పదని నిరూపించే కథ "రొమాంటిక్ డాగ్". కామవాంఛను తీర్చుకునేందుకు మగ కుక్క, ఆడకుక్క కోసం వెతకడం, ఆ వెదకడంలో జరిగే సంఘటనలు, సంఘర్షణలు ఇందులో ప్రధాన వస్తువు. అయితే కథకుడు ఆ సంఘటనల్లో హిందూ - ముస్లీం గొడవ, ముస్లీం - క్రిస్టియన్ల తగాదా, భక్తి పేరుతో జరిగే డబ్బు, హోదా, అలంకరణల ప్రదర్శన, పేదలు, ఖరీదైన భక్తుల మధ్య ఆంతర్యాలను ఘాటైన రియలిస్టిగ్గా కూర్చాడు. గొడవల్లో మతాలు కాదు, మనుషులే మరణిస్తారన్న వాస్తవాన్ని ధృవీకరించాడు. "ఇండియా దటీజ్ భారత్ అని రాజ్యాంగంలోనే వుందని" తాగి తూలే మనిషి కుక్కను బెదిరిస్తే, అది మొరిగితేనే అతను భయపడి పారిపోయాడని కథను ముగిస్తాడు. వ్యంగ్యాన్ని అస్త్రంలా సంధించిన ఈ కథలో "ఆవులా కుక్క పవిత్రమైన జంతువు కాకపోవడంతో, అది పేపర్లు తినదు. దాంతో దానికి తాజా వార్తలేమీ తెలియవు. లేకపోతే చిన్నచిన్న సంఘటన లకే మనుషులు నిట్టనిలువునా ప్రాణాలెందుకు తీసుకుంటున్నారో అని విచారం వ్యక్తం చేసేది" అంటాడు. కథలో రచయిత ప్రవేశం ఏమేరకు? అనే ప్రశ్నను పక్కన పెడితే, రచయిత దృష్టికోణాన్ని, కథ అంతరంగాన్ని ఆవిష్కరించే ఈ వాక్యాలు మనలోని చీకటి గోడల్ని బద్దలు కొడతాయి. కొంత భావాత్మక శైలిలో నడిచినా కథ ఆసాంతం చిక్కని కాఫీలా లోపలకెళ్లి, కాషాయంలా మనసుల్లో కెక్కిన మత పిచ్చి రోగాన్ని నయం చేస్తుంది.

సమాజ పరిణామంలో మంచిచెడు బేరీజు వెయ్యా లంటే మార్పు వెనకున్న గుణాత్మకతను పసిగట్టాలి. అలా పసిగట్టి ప్రేమ, పెళ్లిళ్లలో వచ్చిన అత్యాధునిక ధోరణిని వివరించే కథే "తలుపులు". మూడు తరాల స్త్రీల ద్వారా వివాహ వ్యవస్థలో వచ్చిన మార్పును వివరించాడు. "తలుపులు"ని పాత్రల ఆలోచనలు, సంఘర్షణలు, సన్నివేశాలు, హృదయాలకు ప్రతీక చేయడం ఈ కథలో దేశరాజు చేసిన గొప్ప ప్రయోగ మనే చెప్పాలి.

మరో అరుదైన కథ "రేటింగ్". వర్తమాన విపణిలో కార్పొరేట్ ఉద్యోగుల నుంచి స్విగ్గీ జొమాటోల వరకు, అధికారుల పనితీరు నుంచి ఆటో డ్రైవర్ల బతుకు వరకు నిర్ణయించేది రేటింగే. ఆ రేటింగ్‌లోని భిన్నకోణాలను, మనుషుల ఆర్థిక, హార్దిక స్థాయిలను చర్చకు పెట్టి, తీర్పు చెప్పుందీ కథ. యాప్స్ యాంత్రికమైన మనిషి జీవిత చట్రాన్ని ఎలా నిర్ణయిస్తున్నాయో నగ్నంగా నిలబెట్టి చూపుతుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీతాల వెనుక, సంచార జాతికి చెందిన బాత్ రూమ్స్ క్లీన్ చేసే కూలీల బతుకుల వెనుక ఉన్నది డబ్బే అంటుంది. భార్యల ప్రవర్తనకు భర్తలు కూడా అంగీకార యోగ్యులుగా మారారన్న గ్లోబలైజేషన్ ఆర్థికసత్యాన్నీ వెల్లడిస్తుంది. "ఆత్మాభిమానాలు చంపేసుకోవాలి. అంగాంగాలను కోసి కాకులకు గద్దలకు వేసినట్టు.. మనలాంటి మనుషుల ముందే వెదజల్లాలి. అప్పుడే పైసలు వస్తాయ్. రేటింగ్స్ వస్తాయ్" కథలోని ఈ ఒక్క విశ్లేషణ చాలు కథకుడికి నేటి సంక్షుభిత సమాజంపై ఉన్న తీవ్ర నిరసన అర్థం చేసుకోడానికి.

ప్రకృతిలో భాగమైన మనిషి ప్రకృతినే ధ్వంసం చేస్తున్న సమకాలీనతలోంచి పుట్టిన కథే "అడవంటుకున్నాది". అందమైన అడవుల్ని మైనింగ్ మాఫియా దోచుకుంటోంది. ప్రభు త్వాలు, పెద్ద దేశాలతో కలిసి కపట నాటకాలాడు తున్నాయి. అడవే సర్వస్వంగా బతికే అడవిబిడ్డల ప్రాణాలు తీస్తున్నాయి. ప్రకృతితో కలిసి జీవించాల్సిన మనిషి, నాగరికత, అభివృద్ధి అంటూ ప్రకృతినే నాశనం చేస్తూ వికటాట్టహాసం చేస్తున్నాడు. కవితాత్మకభాషలో సాగే ఈ కథ నిండా ప్రతీకలు, భావచిత్రాలు, రూపకాలు స్వభావసిద్ధంగా ఆకట్టుకుంటాయి.

హంగులు, ఆర్భాటాల కన్నా కథకు స్పష్టత ముఖ్య మని చాటే వీటిలోని "సాఫ్ట్ టార్గెట్" మొబైల్ టెక్నాలజీ, సమాచారవ్యవస్థ మాస్టారు, విద్యార్థుల రిలేషన్ ను ఎలా దెబ్బతీసిందో వివరిస్తుంది. "వేషం" నానమ్మ, అమ్మమ్మలను నేటితరం ఎలా పాతచింతకాయ పచ్చడిలా భావిస్తుందో, ఎప్పటికప్పుడు అప్ డేట్ కాకపోతే వచ్చే కష్టాలేంటో కుటుంబ వాతావరణం లోంచి విశ్లేషిస్తుంది. ముసలివాళ్లైన తల్లిదండ్రులను పిల్లలు వదిలేసినా, ఫ్రెండ్స్ వదలరంటుంది "సిగ్నల్స్" కథ. ప్రపంచీకరణ వలలో చిక్కుకున్న మనిషి ఆశ నుంచి సంపాదననే దురాశవైపు పరుగులు పెడితే జీవితం ఎలా దుర్భరమైపోతుందో కళ్ల ముందు నిలబెడుతుంది "బుద్ధుడి నవ్వు".

కథనపరంగా వీటిలో ఎక్కువ భాగం "పాత్రకేంద్ర" కథలు. అంటే సంఘటన, సన్నివేశం, భాషలవంటి వాటికన్నా పాత్రలేప్రధానంగా సాగుతాయి. "ఓ తల్లి తీర్పు"లో అమ్మ, "సాఫ్ట్ టార్గెట్"లో మాస్టారు, "వేషం" లో బామ్మ, "రొమాంటిక్ డాగ్"లో కుక్క, "లోగుట్టు"లో తల్లి, "రెక్కలు"లో అమ్మ.. ఇలా పాత్రలే కథను నడుపు తాయి. ప్రధాన పాత్ర స్వభావం, ఆలోచనాధోరణి, లక్ష్యం, ప్రవర్తన, సంఘర్షణలే ఇతర పాత్రలతో, వాతావరణంతో కలిసి కథకు పరిపూర్ణత తెస్తాయి. రచయిత దృష్టికోణంలో సాగే కథల్లో రచయిత చొరవే కథను చెప్తుంది లేదా చూపిస్తుంది. అలాగే కథలో రచయిత ప్రవేశించి తను అనుకున్న సందేశాన్నో, కథా ర్థాన్నో, పాత్ర ప్రవర్తన వెనకున్న అంతరార్థాన్నో చెప్తుంటాడు. పాఠకులకు రచయిత కథోద్దేశ్యం అందుతుందో లేదో అన్న మీమాంసతోనో, కథను రక్తికట్టించడంలోని రసైక్యతను పంచడం కోసమో కథ మధ్యలో పాఠకులతో సంభాషిస్తాడీ కథకుడు.

"అడవంటుకున్నాది" కథ ఓపెన్ ఎండింగ్‌తో ముగిస్తే, "కొత్త రెక్కలు" చెమటతో తడిసిన వాళ్ల చరిత్ర ను మారుస్తారు అని పాత్ర నిర్ణయంతో క్లోజ్డ్ ఎండింగ్ తో ముగుస్తుంది. అలాగే "రేటింగ్" పాత్ర ఆలోచనలో వచ్చిన మార్పుతో క్లోజ్ అవుతుంది. దేశరాజులో రాయా లనే తపనతో పాటు ఇతివృత్తాల ఎంపిక, వైవిధ్యంగా పాత్రలను తీర్చిదిద్దేవిధానం, భాషలో వ్యవహారిక, పాత్రోచిత ఔచిత్యం గొప్పగా అనిపిస్తుంది. అదే సమయంలో కొన్ని కథలు చదువుతుంటే నేటితరం కథకుల సరసన నిలబడాలంటే పాతపోకడలు వదిలేసి, ఇతివృత్తాల ఎంపిక, కథన పద్ధతుల్లో కొత్తదనం కోసం ఇంకా కొంత సాధన అవసరమనిస్తుంది. ఏది ఏమైనా నేటి సమాజ తీరుకు ప్రత్యక్షసాక్ష్యాలు ఈ కథలు.

కథనపరంగా వీటిలో ఎక్కువ భాగం "పాత్రకేంద్ర" కథలు. అంటే సంఘటన, సన్నివేశం, భాషలవంటి వాటికన్నా పాత్రలేప్రధానంగా సాగుతాయి. "ఓ తల్లి తీర్పు"లో అమ్మ, "సాఫ్ట్ టార్గెట్" లో మాస్టారు, "వేషం"లో బామ్మ, "రొమాంటిక్ డాగ్"లో కుక్క, "లోగుట్టు"లో తల్లి, "రెక్కలు"లో అమ్మ.. ఇలా పాత్రలే కథను నడుపుతాయి. ప్రధాన పాత్ర స్వభావం, ఆలోచనాధోరణి, లక్ష్యం, ప్రవర్తన, సంఘర్షణలే ఇతర పాత్రలతో, వాతావరణంతో కలిసి కథకు పరిపూర్ణత తెస్తాయి.

హృదయాన్ని ద్రవింపజేసే ఎరుకల కథలు

తన ఊరి పేరును ఇంటి పేరుగా చేసుకుని 1991 నుంచి సాహిత్య సృజన చేస్తున్న రచయిత పలమనేరు బాలాజి. కవిత్వం, కథ, నవల, వ్యాసం ఇలా భిన్నమైన ప్రక్రియల్లో తనదైన శైలిలో సాహిత్యాన్ని అందిస్తున్నారు. "మాటల్లేనివేళ, ఇద్దరి మధ్య లోపలేదో కదులుతున్నట్టు" వీరి కవితా సంపుటాలు. "గదిలోపలి గోడ, చిగురించే మనుషులు, ఒక సాయంత్రం త్వరగా ఇల్లు చేరినప్పుడు" ఇప్పటివరకు మూడు కథా సంపుటాలు వెలువరించారు. వీరి రచనలు ఇప్పటికే సాహిత్యంలో సుపరిచితం. తాజాగా 18 కథలతో "ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు" అనే పేరుతో తెలుగు సాహిత్యంలో తొలి ఎరుకల కథా సంపుటిని వెలువరించారు. ఈ కథల నిండా ఎరుకల వారి జీవన విధానం, కష్టాలు, బాధలు, ఆరాటాలు, పోరాటాలు, ఆత్మగౌరవ కోసం పోరాడిన పాత్రలు కండ్లకు కట్టినట్టుగా చిత్రీకరించారు.

ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో ఎరుకల జీవితాన్ని నేపథ్యంగా చేసుకొని వెలువడిన రచనలు చాలా తక్కువ. ఇదే విషయాన్ని ముందుమాటలో డా. ఎ.కె. ప్రభాకర్ స్పష్టం చేశారు. "ఎరుకుల కుటుంబాల్లో సాంస్కృతిక జీవన వైవిధ్యాన్ని స్త్రీ పురుష సంబంధాలను ఆవిష్కరించిన అరుణ "ఎల్లి", "నీలి" నవలలు, ఆర్థికంగా ఎదిగి తద్వారా సామా జికంగా సైతం upward mobility సాధించడానికి ఒక కుటుంబం చేసిన జీవన సమరాన్ని చిత్రించిన శిరంశెట్టి కాంతారావు "వాళ్ల గెలవాలి" నవల, సెటిల్మెంట్ నుంచి చెర నుంచి నేరస్థ ముద్ర నుంచి బయటపడి గౌరవప్రదమైన జీవితం కోసం తపించే అభద్ర జీవుల బతుకు ఆరాటాన్ని అక్షరీకరించిన సలీం "లోహముద్ర" ఇలా తెలుగులో పరిమితమైన ఎరుకుల సాహిత్యం వెలువడింది.

ఈ క్రమంలో ఎరుకల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కథలు "ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు" ను చెప్పుకోవచ్చు. రచయిత తన కండ్ల ముందు నిరంతరం జరిగిన సంఘటనలను, సన్నివేశాలను ఎప్పటి కప్పుడు నిక్షిప్తం చేసుకుంటూ రాసిన కథలు ఇవి. నేటికీ ఒక స్థిరమైన నివాసం, ఉపాధి, సామాజిక భద్రత వంటి వాటి కోసం పాలకులతో పోరాటం చేస్తున్నవారు ఎరుకల వారు. వారి ఎస్టీ కాలనీ కాస్తా ఏకలవ్య కాలనీగా మారడంలో ఉన్న కష్టాలు అక్కడ శాశ్వత నివాసాలు ఏర్పరచడంలో వారు ఎదుర్కొన్న సమస్యలు ఈ కథల నిండా కనిపిస్తాయి. వీరు ప్రధానంగా ఊరూరు తిరుగుతూ గాడిదల మీద ఉప్పు అమ్మేవాళ్ళు, పచ్చబొట్లు పొడిచే వాళ్ళు, వెదురు దబ్బలతో బుట్టలు అల్లేవాళ్ళు, సోది చెప్పే వాళ్ళు, పందులు పెంచే వాళ్ళు రకరకాల జీవనోపాధులు చేసుకునే జీవితాలు ఈ కథల నిండా కనిపిస్తాయి.

తల్లిదండ్రులు బిడ్డలపై చూపించే అవ్యాజమైన ప్రేమకు ప్రతీకగా 'ఎర్రమన్ను, ముగ్గు పిండి' కథ నిలుస్తుంది. ఈ కథలో పిల్లలు తల్లిదండ్రులను తక్కువ చేసి చూడడం, తమ కులం బయట ప్రపంచానికి తెలిసిపోతుందేమోనని తల్లి దండ్రులను తమ ఇంటికి రావద్దని చెబుతారు. నిజానికి నేటి సమాజంలో కూడా ఇలాంటి వాళ్ళు నిరంతరం కనిపిస్తూనే ఉన్నారు. తమ కులం, మతం, ప్రాంతం చెప్పుకోవడానికి చిన్నతనంగా భావించేవాళ్ళు ఎక్కడకక్కడ ఉండనే ఉన్నారు. అలాంటి వారి మానసిక స్థితిని రచయిత కండ్లకు కట్టినట్లుగా చిత్రించారు. **'మగపిల్లల్ని సాకే బదులు గమ్మున నాలుగు పందుల్ని పెంచి ఉంటే బాగుండేది'** ఈ ఒక్క వాక్యం కథ సారాన్నంతా లోకానికి తెలియజేస్తుంది.

ప్రకృతితో మనిషి జీవన ప్రభావాన్ని చిత్రించడంలో బాలాజి కలం ప్రత్యేక మైంది. చిత్తూరు జిల్లాలో కౌండిన్య అభయారణ్యం ప్రాంతంలో ఏనుగుల దాడుల గురించి ఇప్పటికే, చాలా కథలు రాసిన పలమనేరు బాలాజి ఏనుగుల నేపథ్యంలోని ఒక ఎరుకల స్త్రీ రైతు పడే బాధ గురించి రాసిన కథ ప్రత్యేకమైనది. 'ఏనుగుల రాజ్యంలో...' కథలో కట్టెలమా కథ చివర్లో చెప్పే మాటలు ఎరుకల జీవితాల్లోని దైన్యాన్ని, ధైర్యాన్ని చెబు తాయి. ఊర్లో ఉండకూడదు అంటారు. పొలాల్లోకి దిగకూడదు అంటారు. చనిపోతే ఊర్లో పూడ్చ డానికీ కుదరదు అంటారు. అలాంట పుడు ఎరుకల వాళ్లు ఎక్కడ బతకాలి, ఎక్కడ చావాలి? అని ఆమె ప్రశ్నిస్తుంది. **'ఈ భూమ్మీద బతికేదానికీ మా కులం అడ్డమే. సస్తే భూమి లోపల మన్నులో మన్నుగా కలిపేదానికీ మా కులం అడ్డ మేనా? అలా బతక్కుండా ఇలా సావకుండా ఎరిక లోల్లం ఇంక ఏం కావల్లంటారు సామీ? ఏం చేయమంటారు దొరా?'** అని వారి దయనీయ స్థితి కథ ఎరుక పరుస్తుంది.

పెత్తందారి కులాల ఆర్థిక లైంగిక దౌర్జ న్యానికి ఎదురు నిలిచిన పాత్ర నీలమ్మ. "వెదుర్లు" కథలో నీలమ్మ తన పొలానికి సాగునీరు అరువు తెచ్చుకొని నాయుడు ఊడిగం నుంచి తప్పించుకొని వడ్డీకి దుడ్లు తెచ్చి పొలంలో సేద్యం చేసుకుంటూ గౌరవంగా బతకాలనుకుంటుంది. తమ పొలంలో టమోటా పంట చేతికి అందే సమయంలో ఏనుగులు వచ్చి తొక్కేస్తాయి. **'ఇదంతా మా ఖర్మ. ఆ దేవుడికే మా మీద దయలేదు. వడ్డీకి దుడ్లు తెచ్చి సేద్యంచేస్తాండా. బిడ్డల్ని సాగినట్లు సాకినాం. ఈ దినంతో మాకూ భూమి తల్లికీ రుణం తగ్గి పోయింది. కన్నగసాట్లు పడి పంట చేసినాం. మా కడుపులో బాధ ఎవరికని చెప్పుకునేది తల్లో. మా బాధలెప్పుడు తీరుతాయి తండ్రో..'** అంటూ నీలమ్మ శోకాలు పెడుతుంది. అక్కడ యుద్ధం జరిగినట్లు ఉంది. మృత కళేబరాల్లా పడి ఉన్నాయి మొక్కలు. సైనికుల దండయాత్ర జరిగినట్టు పొలమంతా నానా బీభత్సంగా కనిపిస్తుంది. టమోటా మొక్కలు చితికిపోయి, నలిగిపోయి ఉన్నాయి. ఎకరా పొలంలో ఎక్కడా ఒక్క మొక్క బతకలేదు. ఒక్క టమోటా కూడా మిగల్లేదు. ఇదంతా గమనించిన నీలమ్మ చుట్టుపక్కల పొలాలన్నీ బాగానే ఉన్నాయి కానీ, ఒక్క తమ పొలం లోనే ఎందుకు ఇలా అయ్యింది అని ఆలోచిస్తుంది. ఇది ఏనుగుల దాడి కాదు దానికి కారణం నాయుడు అని ఇట్టే పసిగడు తుంది. నాయుడికి ఎదురుతిరిగి నీలమ్మ వ్యవసాయం చేసినందుకు పర్యవ సానంగా పంటనంతటినీ కోల్పోతుంది.

"కబాబ్ కపాలి" కథలో వంట మాస్టర్ కపాలి అస్తిత్వానికి, ఆత్మ గౌరవానికి ప్రతీకగా కనిపిస్తాడు. నేటి సమాజంలో కులం పేరు చెప్పుకోవడా నికి సిగ్గుపడే వారికి కపాలి ఒక ఆత్మగౌరవం కలిగిన వ్యక్తిగా కనిపి స్తాడు. తన కులం పేరు చెప్పుకోవడా నికి ఏమాత్రం సంకోచించకుండా తాను ఎరుకల వాడినని ధైర్యంగా ప్రకటి స్తాడు. కపాలి తాతది బాతులు వ్యాపారం. తండ్రిది పందుల వ్యాపారం. కబాలి ఆ రెండు వృత్తులు చెయ్యకుండా వంట మాస్టర్‌గా మంచి గుర్తింపు పొందుతాడు. ఏ కార్యక్రమం జరిగినా కపాలి వంట ఉండవలసిందే అన్నంతగా పేరు సంపాదిస్తాడు. **'నేనూ ఖాయంగా నిజమే చెప్తా. ఎరికిలోడనే చెప్తా. చెప్తే ఏమి పోతాది అన్నా'** అని ఆత్మగౌరవానికి ప్రతీకగా కపాలి ఈ కథలో కనిపిస్తాడు.

"గురి" కథలో మంజుల, మునిరాజు భార్య భర్తలు. వీరికి రెండు ఎకరాల పొలం ఉంది. తమ పొలం చుట్టూ బోర్లు ఎక్కువై గుండుబావిలో నీళ్ల అడుగంటి పోతాయి. చెరుకు తోట మొత్తం కండ్ల ముందరే ఎండిపోయింది. ఈ విధంగా జరగడంతో మునిరాజు ఎప్పుడూ అలవాటు లేని తాగుడుకు బానిసగా మారిపోతాడు. గుండుబావి ఎండిపోయాక సేద్యం కుంటుపడుతుంది. ఒకప్పుడు రెండు ఎకరాల పొలం లో బంగారం పండినచోట ఇప్పుడు పిచ్చి మొక్కలు పెరుగు తున్నాయి. బావిలో నీళ్ల అడిగంటి పోయేదాకా ఎరుకల మునిరాజు అంటే ఎస్టీ కాలనీలో పెద్ద మనిషి. ఇప్పుడు బావిలో నీళ్ళు లేకపోవడంతో చేతిలో పనిలేక సేద్యం లేక దిక్కుతోచని పరిస్థితికి చేరింది. జీవ నోపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితి మునిరాజుది. కానీ మంజుల ధైర్యంగా కోళ్లను పెంచసాగింది.

ఇంకా ఈ వ్యాసంలో ప్రస్తావించని కథలెన్నో ఏకలవ్య కాలనీ కథా సంపుటిలో ఉన్నాయి. ఆసక్తిగా చదివించే ఈ పుస్తకం అన్ని ప్రధాన కేంద్రాల్లో లభ్యమవుతుంది. గిరిజన కులాలకు చెందిన వారి నుంచి వచ్చిన సాహిత్యం చాలా తక్కువ. అయితే ఎరుకల కులానికి చెందిన రచయిత నుండి వచ్చిన తొలి కథా సంపుటిగా ఏకలవ్య కాలనీ తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుంది.

ఒక తరం మరొక తరాన్ని తయారు చేసుకునే క్రమం గురించి, పదిమంది కలిసి కాలనీని అభివృద్ధి చేసుకునే క్రమం గురించి, వ్యక్తి సామాజిక కార్యకర్తగా మారే సందర్భం గురించి, ఇప్పటికీ ఎదుర్కొంటున్న వివక్షతల నుండి బయట పడే మానసిక యుద్ధాల గురించి, సాటి మనుషుల గురిం చిన మనుషుల బాధ్యతల గురించి, ఆత్మగౌరవ పోరాటం గురించి ఈ కథలు సున్నితంగా ఎన్నో విషయాలను చెబుతాయి. అసమానత, వివక్షతల పట్ల రచయిత వ్యక్తపరిచిన ధర్మాగ్రహం, హెచ్చరికలు ఎరుకల తెగలో ఇంకా రావాల్సిన అస్తిత్వ చైతన్యం ఆవశ్యకతను చెబుతాయి.

ఇరగ రెడ్డిశేఖర్
8142591227



ఒక తరం మరొక తరాన్ని తయారు చేసుకునే క్రమం గురించి, పదిమంది కలిసి కాలనీని అభివృద్ధి చేసుకునే క్రమం గురించి, వ్యక్తి సామాజిక కార్యకర్తగా మారే సందర్భం గురించి, ఇప్పటికీ ఎదుర్కొంటున్న వివక్షతల నుండి బయటపడే మానసిక యుద్ధాల గురించి, సాటి మనుషుల గురించిన మనుషుల బాధ్యతల గురించి, ఆత్మగౌరవ పోరాటం గురించి ఈ కథలు సున్నితంగా ఎన్నో విషయాలను చెబుతాయి.

ఆటలే దాడి చేస్తే !?

చిన్నప్పుడు తుపాకీ, యుద్ధ విమానాలు,
బాంబులంటూ ఆటలాడుకున్నాను
పోలీసు, మిలట్రీ వాడిలా నటిస్తూ నాన్నను
ఏమార్చి గోడ చాటు దాగి భయపెట్టేవాణ్ణి
భయాన్ని నటిస్తూ నాన్న, ధైర్యాన్ని ప్రకటిస్తూ నేను
మా ఇద్దరి మధ్య యుద్ధం ఆటకు అమాయకమైన
అమ్మ ముసిముసి నవ్వులే ప్రేక్షకులయ్యేవి
ఇప్పుడు -
కళ్లెదుటే నిజమైన యుద్ధవిమానాలు
గగన విహారం చేస్తూ దాడులు చేస్తున్నాయి
శత్రు సైనికుల చేతుల్లోని తుపాకులు బెదిరిస్తున్నాయి
నాన్న నిజమైన బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయాడు
ఆటలో నాన్నను భయపెట్టడానికి నాన్న లేడు
చాటు వెళ్ళడానికి ఇంటి గోడలు కూలిపోయాయి
అమ్మ నవ్వులు మాయమయ్యి
కన్నీళ్లు ప్రేక్షకులుగా మిగిలిపోయాయి
ఆకాశమంత ధైర్యాన్నిచ్చే నాన్న
చిటికెన వేలును యుద్ధం మింగేసింది
కొండంత మనిషి తెల్లటి కఫన్ గుడ్డలో మూటలా పడి వుంటే
కూలిన కప్పులకింద, గుట్టలుగా పడివున్న శిథిలాల మధ్య
ఇక ఏ జ్ఞాపకాలను వెతుక్కోను!
దాగుడుమూతలాటలో శాశ్వతంగా కనబడని
నాన్నను ఎక్కడని వెతకను !
జీవం లేని కళ్ళతో, కూలిన ఇంటిగోడల శిథిలాల్లో
నాన్నను, చెల్లిని వెతుక్కుంటూ..
అమ్మ!
'గాజా' నేలపై రేపటి భవిష్యత్తు మాంసపు ముద్దలుగా
రక్తపు మడుగులో కాగితపడవలై తేలుతూ వుంటే..
ఇక ఆటలంటే సరదాలకు మారుగా భయం మేఘాలు కమ్మేసాయి
పాలస్తీనా, పాలస్తీనా.. ఇంతవరకు నీ మట్టిలో ఎదిగిన
చెట్లగాలి పీల్చి ఆటలాడుకున్నాను
ఇక నీ మట్టి పొరలను కఫన్‌గా కప్పుకొని సేద తీరుతాను
ఆట పూర్తి కాకుండానే, నేను అలసిపోక ముందే
ఆట బొమ్మలు లేని నా ఖాళీ పిడికిలితో సమాధిలోకి వెళ్ళిపోతాను
ఇప్పుడు గోడచాటు అక్కర లేదు, నటనలు అక్కరలేదు
కడుపులో దాచుకునే అమ్మ కడుపుకోతలతో కూలిపోయింది
అమ్మ లెక్కకందని గాయాలతో ఏ ఆస్పత్రిలోనో..
అమ్మ కళ్ళలో అన్ని లోకాలు నా కోసం తహతహలాడేవి
ఇప్పుడు ఏ ఒక్కరూ నా వైపు కన్నెత్తి చూడటంలేదు
అనాథగా... ఒంటరిగా మిగిలాను...
పాలస్తీనా -
ఆటలోని కుట్రలు తెలియని పసి కూనలం
నీ మట్టిలో చిన్నప్పుడు పూల మొక్కల విత్తనాలను నాటాను
ఇప్పుడు నా చిట్టి చెల్లిని నాటుతున్నాను
రేపటి కాలంలో ఈ మట్టిలోనే
అందమైన పూల మొక్కలా ఎదగాలని..
ఈ నేలను పరిమళింపజేయాలని ...

- డా. రూప్ కుమార్ డబ్బీకార్, 9177857389

సంపాదకీయం

ఆరంభంలోనే అక్రమాన్ని నిర్మూలించాలి

ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘానిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదు. ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని ప్రస్తావించాలి. 2019లో సంభవించిన సంఘటన ఇది. కొత్తగా పెళ్ళయిన ఒక జంటను, వధువు మేనత్త స్వయంగా తన ఖర్చుపై హానీమూన్ నిమిత్తం ఖతర్‌కు పంపింది. ఆ వధూవరుల బ్యాగులో వారికి తెలియకుండా మాదక ద్రవ్యాలను పంపించగా ఖతర్ విమానాశ్రయంలో బ్యాగేజి పరిశీలన అనంతరం ఆ జంటను అరెస్ట్ చేశారు. ఖతర్ న్యాయస్థానం ఆ అమాయక జంటకు సమారు కోటిన్నర రూపాయల జరిమానా, పది సంవత్సరాల జైలు శిక్ష విధించింది. హానీమూన్ నుంచి వారు ఎన్నాళ్ళకూ తిరిగిరాకపోవడంతో స్వదేశంలో తల్లిదండ్రులు, అత్తమామలు తీవ్రంగా కలవరపడసాగారు. ఒక రోజు ఖతర్ నుంచి ఒక మహిళ ముంబైలోని వధువు తండ్రికి ఫోన్ చేసి మీ కూతురు, అల్లుడు డ్రగ్స్ కేసులో పట్టుబడి జైళ్ళో ఉన్నారని చెప్పింది. హతాశుడైన ఆ తండ్రి ఖతర్‌కు వచ్చి ఏడాదిన్నర పాటు ఒక హోటల్‌లో బస చేసి జరిగిన ఘోరం వివరాలు తెలుసుకున్నాడు. ముంబైలో తన కుమార్తె, అల్లుడి చేతికి బ్యాగేజి ఇచ్చిన వ్యక్తులపై కేసు నమోదయి, సరైన దిశగా విచారణ జరిగినట్లుగా ఖతర్ న్యాయస్థానం భావిస్తే మాత్రమే జంట విడుదలకు అవకాశం ఉన్నట్లుగా ఆ దేశ అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఆ తండ్రి భారత్‌కు తిరిగి వచ్చి పోలీస్ స్టేషన్ మొదలు ప్రపధానమంత్రి కార్యాలయం దాకా 17 ప్రభుత్వ శాఖల చుట్టూ తిరిగాడు. మరాఠీ నుంచి ఆంగ్లంలోకి, ఆంగ్లం నుంచి అరబ్బి భాషలోకి మహారాష్ట్ర పోలీసుల ఎఫ్.ఐ.ఆర్., పంచనామాలను అనువాదం చేయించేందుకు లక్షలాది రూపాయలను ఆ కుటుంబం ఖర్చు చేసింది. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్.సి.బి. విచారణ చేసి బ్యాగేజి ఇచ్చిన మేనత్తతో సహా ఆరుగురిని సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేసినట్లుగా ఇచ్చిన నివేదికను దౌత్యవర్గాల ద్వారా ఖతర్‌కు సమర్పించిన అనంతరం అతి అరుదైన కేసుగా ఖతర్ సుప్రీంకోర్టు కేసును పునఃసమీక్షించి జంటను నిర్దోషులుగా ప్రకటించింది. ఈ రకమైన ప్రయత్నం అందరికి సాధ్యం కాదు కదా. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ (యన్.సి.బి) అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాలకు, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది.

కాలికి నల్లదారం ఎందుకు కట్టుకుంటారో తెల్సా..?

చాలామంది కాళ్లకు నల్లదారం కట్టుకోవడం చూసే ఉంటారు. ఇవి ఒకప్పటి ఆచారాలు కాగా.. ఇప్పుడు వీటిని కొందరు స్టైల్ కోసం ధరిస్తుంటారు. కొందరు మాత్రం జ్యోతిష్య కారణాల వల్ల కాలికి నల్లదారం కట్టుకుంటారు. అయితే మన ఆచారం ప్రకారం చాలామంది నల్లదుస్తులను ధరించడానికి ఇష్టపడరు. అలా నల్లదుస్తులు ధరించడం వల్ల చెడు జరుగుతుందని భావిస్తారు. ఇక కాళ్లకి నల్లదారం కట్టుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం నల్లదారం అందరికీ సెట్ కాదట. దాన్ని అందరూ వాడకూడదట. నల్లదారం వాడేందుకు కొన్ని రూల్స్ ఉన్నాయి. ఆ నిబంధనలను పట్టించుకోకపోతే జీవితంలో అభివృద్ధి సంగతి అటుంచితే.. అన్నింటా నెగటివ్ ఎనర్జీ తప్పదట.

ఇంతకీ అసలు నల్లదారం ఎందుకు కట్టుకుంటారు?

సాధారణంగా నలుపు రంగు శనిశ్వరునికి ప్రతీక. నలుపు దారాన్ని ధరించే ముందుగా శనిదేవునికి నమస్కరించి ఏదైనా ప్రత్యేక రోజుల్లో వాటిని కట్టుకుంటారు. ఈ దారాన్ని ధరించడం ద్వారా ఆ శనిశ్వరుని అనుగ్రహం కలిగి శని నుంచి విముక్తి లభిస్తుందని నమ్ముతారు. ఈ నల్లదారాన్ని ధరించిన తర్వాత గాయత్రి మంత్రాన్ని పఠించాలని పెద్దలు అంటారు. ఈ నల్లటి దారాలను స్త్రీలు ఎడమకాళ్లకి, పురుషులు కుడికాళ్లకి ధరిస్తుంటారు. ఇలా ధరించడం వల్ల కొన్ని దుష్టశక్తుల నుంచి మనల్ని దూరంగా ఉంచడానికి ఉపయోగపడుతుందట. ఎవరైతే చేతి మణికట్టుకు పసుపు, ఎరుపు, నారింజ రంగులతో కలిసి ఉన్న దారాలను కట్టుకొని ఉంటారో.. వారు తమ మణికట్టుకు నల్లదారాన్ని ధరించకూడదని జ్యోతిష్య నిపుణులు చెబుతున్నారు.

వైవిధ్యభరిత వ్యవసాయ

ఉత్పత్తులను సాధించలేమా !

పప్పుధాన్యాల ప్రాధాన్యం:

పప్పు ధాన్యాల పలు ముఖ్యమైన ప్రయోజనాలను బట్టి వాటి ఉత్పత్తులను వంటల్లో వాడడం, ప్రోటీన్లకు మూల పోషకాలుగా భుజించడం, కొవ్వులు తక్కువగా ఉండడం, కరిగే స్వభావం కలిగిన పీచు పదార్థాలు ఉండడంకొలెస్టరాల్‌తో పాటు బ్లడ్ షుగర్స్‌ను తగ్గించగల ఉత్తమ పోషకాహారంగా గుర్తిస్తూ, అన్ని వర్గాల కుటుంబాలు వాటి వాడకాన్ని పెంచడానికి ప్రయత్నాలు చేస్తే ఆరోగ్యకరమైన పౌర సమాజం నిర్మితం అవుతుంది. హృదయనాళ సంబంధ, మధుమేహం, స్థూలకాయ అనారోగ్యాలు రాకుండా పప్పులను మన భోజనంలో ఇమడ్చుకోవాలి. పప్పు ధాన్యాల వాడకంతో అందులోని ఆంటీ-ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్, లాంటి ముఖ్యమైన పోషకాలు శరీరానికి అందించబడతాయి. పప్పులు ఉత్తమ ఆహార పదార్థాలు కాకుండా ఆహార పదార్థాల నష్టాలను, ఆహార వ్యర్థాలను తగ్గిస్తాయి.

వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థలో పప్పుధాన్యాల వైవిధ్యత:

పప్పుధాన్యాల పలు ప్రయోజనాలను గుర్తించిన ఐరాస వాటి వాడకం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 10 ఫిబ్రవరి రోజున "ప్రపంచ పప్పుధాన్యాల దినం (వరల్డ్ పల్సెస్ డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ పప్పుల దినం-2025 నినాదంగా "పప్పుధాన్యాలు : వ్యవసాయ ఉత్పత్తుల వ్యవస్థలో వైవిధ్యత" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పప్పు ధాన్యాలు నేల లోపల, మానవ కుటుంబాల్లో ఎనలేని సేవలు అందించడంతో బడుగు బలహీన వర్గఆల ప్రజలకు సహితం తినడానికి పోషక విలువలు కలిగిన పప్పులను ఆశ్రయించడం జరుగుతున్నది. సుస్థిర సాగు, నేల నాణ్యతను పెంచడం, ఉత్పత్తులు పెరగడం, నేల జీవవైవిధ్యత కాపాడబడటం, వాతావరణ మార్పులను తట్టుకోగలగడం, పంట మార్పిడికి ఉపయోగపడడం, గ్రామీణ మహిళలు/యువతకు పని కల్పించబడడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన పప్పులు భవిష్యత్తులో కూడా ఆహార పదార్థాల జాబితాలో ముందు వరుసలో ఉంటాయి.

ఆహార భద్రత - నేల నాణ్యత పెంపు:

పప్పులను పండించే రైతులు వాచిని తమ ఆహార పదార్థాలుగా తినడమే కాకుండా ఆర్థిక రాబడికి మార్కెటింగ్ కూడా చేస్తూ కుటుంబాల ఆహార భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వానికి కూడా దోహదపడుతున్నాయి. నేలలో నత్రజని నిల్వలు పెంచగల పప్పులు నేల నాణ్యతను సహితం పెంచుతాయి. పంట మార్పిడి, సాగు పద్ధతుల్లో వైవిధ్యత సాధించడంతో పాటు తెగుళ్ల నివారణ, పురుగులను దూరంగా ఉంచడం కూడా సుసాధ్యం అవుతున్నది. ఇతర ఆహార ధాన్యాలతో పోల్చితే పప్పులను పండించుటకు తక్కువ నీరు అవసరం అవుతున్నది. ఒక కిలోగ్రామ్ పప్పును పండించడానికి దాదాపు 1250 లీటర్ల నీరు అవసరం కాగా ఒక కేజీ పంది మాంసానికి 13,000 లీటర్ల నీరు వినియేగించబడుతున్నది. ఉత్తమ ఉత్పత్తులు, ఉత్తమ పోషక విలువలు, ఉత్తమ వినియోగం, ఉత్తమ పర్యావరణం, ఉత్తమ ఆరోగ్య జీవనం, ఉత్తమ జీవన విధానాలకు పప్పుధాన్యాలు అనాదిగా దోహదపడుతున్నాయి. అన్ని వర్గాల ప్రజలకు కావలసిన పప్పుధాన్యాలతో సమ్మిళిత, సుస్థిర, వినియోగాలతో పేదవాడి కండల్లో శక్తి ఊరుతుంది, ఆరోగ్యం పటిష్టమవుతుంది. ఇలాంటి పప్పుధాన్యాల పట్ల సామాన్య జనాల్లో అవగాహన కలిపించడం మనందరి సకనీస కర్తవ్యం అని నమ్మాలి.

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి. 9949700037

> అనాదిగా మన సుస్థిర వ్యవసాయ రంగం పప్పుధాన్యాలతో (పల్సెస్) అవినాభావ సంబంధాలను కలిగి ఉంది. చూడడానికి చిన్న సైజులో కనిపించినప్పటికీ పప్పుల్లో విలువైన పోషకాలు, పేదల పల్లెంల్లో చోటు, రుచిరమైన ఆహార పదార్థాలుగా ప్రాధాన్యతతో పాటు నేల సత్తువ పెంచడానికి ఇవి దోహదపడుతున్నాయి. కొంత మేరకు ఖరీదు తక్కువగా ఉంటూ సంపన్నుల నుంచి కడు పేదవాడి వరకు అందరూ పప్పును దాదాపు నిత్యం వాడడం జరుగుతున్నది. లెగ్యూమ్స్‌గా పిలువబడే పప్పుల్లో ముఖ్యమైనవిగా పెసర, కంది, శనగ, మినుములు, బొబ్బర్లు, సోయా బీన్స్, మినుములు లాంటి పలు రకాలు ఉంటాయి.

ఎక్స్ కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్

9 వ శతాబ్దం సంచలనాత్మక శాస్త్రీయ ఆవిష్కరణలకు స్వర్ణ యుగం. అలాంటి యుగంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ ఒక వింతను కనుగొన్నాడు, దానిని చాలా మంది నమ్మలేదు. రాంట్జెన్ యొక్క ఆవిష్కరణ వార్తలు జనవరి 1896 ప్రారంభం నుండి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయి. శాస్త్రవేత్తలు సైతం నివేదికలను ప్రాక్టికల్ జోకర్ ఉపాయం అని కొట్టి పారేశారు. రోగ నిర్ధారణకు కొత్త ఒరవడిని సృష్టించి, ప్రపంచంలో వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరఫీ) కొరకు ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్. ఆయన కనుగొన్న ఎక్స్ కిరణాలు వైద్యరంగం లోనె కాక భద్రతా రంగంలో ఉపయోగ పడుతున్నాయి. విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మర్చి 27,1845 – 1923 ఫిబ్రవరి 10) జర్మన్ దేశ భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త. 1895 నవంబరు 8 న విద్యుదయస్కాంత తరంగాలలో వివిధ తరంగ దైర్ఘ్యులుల అవధులలో గల ఎక్స్– కిరణాలను కనుగొన్నాడు. ఈ పరిశోధన వల్ల 1991 లో భౌతిక శాస్త్రంలో మొదటి సారి నోబెల్ బహుమతి పొందాడు. ఆయన చేసిన కృషికి గాను ఆవర్తన పట్టిక లో 111 పరమాణు సంఖ్య గల మూలకానికి రాంట్ జీనియమ్ అనిపేరు పెట్టి గౌరవించారు. రాంట్జన్ 1845 మార్చి 27 న జర్మనీలోని లెన్నెస్ లో జన్మించాడు. ఈయన తండ్రి ఒక రైతు. తల్లి ఒక డచ్ మహిళ. హాలెండ్ లో విద్యాభ్యాసం జరిగింది. 1865 లో యుట్రెచ్ యూనివర్సిటీ లో చేరుటకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని జూరిచ్ లో గల ఫెడెరల్ పాలిటెక్నిక్ సంస్థ లో చేరి పరీక్షలను ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడ మెకానికల్ ఇంజనీరుగా చేరాడు. 1869 లో తత్వ శాస్త్రములో జూరిచ్ విశ్వ విద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను పొందాడు. ఆ విశ్వ విద్యాలయంలో ప్రముఖ ప్రొపెసర్ అయిన ఆగస్టు కుండ్ట్ కు ప్రియమైన శిష్యుడయ్యాడు. 1874 లో స్ట్రాస్ ఫర్డు విశ్వ విద్యాలయంలో అద్యాపకునిగా నియమించ బడ్డాడు. 1875 లో హోహెనీం విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా, తర్వాత 1876 లో స్ట్రాస్ ఫర్డు విశ్వ విద్యాలయంలో మరల అద్యాపకునిగా, 1888 లో గీసన్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యునిగా, తర్వాత వుర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో విధులు నిర్వర్తించాడు. 1900 లో ప్రభుత్వ అభ్యర్థనపై మంచ్ యూనివర్సిటీలో చేరాడు. ఆయన కుటుంబం యు.ఎస్.ఎకు వలస వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. న్యూయార్క్ లో కొలంబియా యూనివర్సిటీ వారు అవకాశం యిచ్చినప్పటికీ మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా తన శేష జీవితాన్ని మునిచ్ నందే గడిపాడు. 1895 వరకు ఉత్సర్గనాళ ప్రయోగాలలో హెర్ట్జ్, జాన్ హిటార్ఫ్, విలియం క్రూక్స్, టెస్లా,లీనార్డో లతో పని చేశాడు. ఎక్స్ కిరణాలను రాయింట్ జన్ కిరణాలని అంటారు. కాని రాంట్జెన్ స్వయంగా వాటిని ఎక్స్ కిరణాలని పిలిచాడు. ఈ కిరణాలను కనుగొని లోకానికి పరోపకారం చేసినందుకు కృతజ్ఞతగా ఆయనకు 1901 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభ్యమయింది. ఈ ఎక్స్ రే వెనుక ఎంతో ఆసక్తి కరమైన కథ ఉంది. రాయింట్ జన్ కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం) తో పరిశోధనలు చేసేవాడు. గది అంతా చీకటిగా ఉన్నప్పుడు యీ ట్యూబ్ గుండా కాంతి కిరణాలను పంపడం జరిగింది. పైగా ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కాంతి కిరణాలు ఏ కొంచెం కూడా వెలువడ కుండా కప్పి ఉంచాడు. ఇలా చేసినప్పటికి కాథోడ్ ట్యూబ్ కు సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించ సాగింది. నల్లటి కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ కాథోడ్ ట్యూబ్ నుంచి ఏవో అజ్ఞాత కిరణాలు వెలువడి బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం మీద పడి అది మెరిసేటట్లు చేసిందని ఆయన ఊహించ గలిగాడు. ఈ కిరణాలను కాగితం గుండా, చెక్క గుండా, లోహపు పలకల గుండా ప్రయాణం చేయగలవని యీయన కనుగొన్నాడు. ఈ కిరణాలు కూడా ఓ రకమైన కాంతి కిరణాలే అని అయితే వీటి తరంగ దైర్ఘ్యం చాలా తక్కువ కావటం వల్ల మనుషుల కళ్ళకు కనిపించవని రాయింట్జన్ వెల్లడించాడు. మామూలు కాంతి కిరణాలే ఫోటోగ్రాఫిక్ ప్లేట్ల మీద ప్రభావం చూపుతూ ఉండగా, యీ కిరణాలు మాత్రం చూపకుండా ఉంటాయా అనే ఆలోచన రాయింట్ జెన్ కి రావటం – శాస్త్ర ప్రపంలో ఒక సరికొత్త అధ్యాయానికే కారణ భూతమైనది. ప్రయోగం చేయటం కోసం రాంట్జెన్ ఫోటో గ్రాఫిక్ ప్లేటు మీద తన భార్య చేతిని ఉంచి యీ కిరణాలను ప్రసారం చేసి ఫోటోను డెవలప్ చేసి చూసి ఆశ్చర్య పోయాడు. చేతి ఎముకలు ఉంగరంతో సహా ఆ ఫోటో లో వచ్చింది. చుట్టూ మాంసం ఉన్నట్లు మసక మసకగా ఉంది. అంటే సజీవంగా ఉన్న మనిషి కంకాళాన్ని ఈ కిరణాల ద్వారా ఫోటో తీయవచ్చని స్పష్టంగా తేలింది. దురదృష్టవశాత్తు రాంట్జెన్, ఆయనతో కలిసి పనిచేసిన మరో ఇద్దరు పరిశోధకులు యీ ఎక్స్ కిరణాల తాకిడికే క్రమ క్రమంగా మరణించాడు. ఈ ఎక్స్–కిరణాల వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతున్నప్పటికీ వాటిని మితిమీరి వాడితే మాత్రం ప్రమాదం తప్పదని,యీ కారణంగానే ఎక్స్–కిరణాలను నిరంతరం గురి కాబట్టే రాంట్జెన్ ఆ కిరణాల ప్రభావంగానే చని పోయాడని రుజువైంది. ఆయన చేసిన ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు కూడా తీసుకోలేదు. నోబెల్ బహుమతిగా వచ్చిన ధనమును వర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయమునకు విరాళంగా యిచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల యేర్పడే ద్రవ్యోల్బణం వల్ల రాంట్జెన్ చాలా పేదరికంలో మగ్గాడు. తన శేష జీవితాన్ని మునిచ్కి సమీపంలో గల విల్ హెల్మ్ లో గల యింటిలో గడిపాడు. ఆయన కోరిక ప్రకారం ఆయన వ్యక్తిగత, శాస్త్రమునకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయన మరణం తర్వాత నాశనం చేయటం జరిగింది. 1901 లో రాంట్జెన్ కు మొదటి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. ఈ బహుమతి ఆయన ఎక్స్ కిరణాలు కనుగొని విశేష సేవలందించినందుకు గాను యివ్వ బడింది. కాని రాంట్ జెన్ ఆ బహుమతికి వచ్చిన ఆర్థిక ప్రతిఫలాన్ని తన విశ్వ విద్యాలయమునకు దానమిచ్చాడు. పియరీ క్యూరీ వలే రాంట్జెన్ తన పరిశోధనకు పేటెంట్ హక్కులను తిరస్కరించాడు. మానవాళికి తన పరిశోధన యొక్క ఫలితాలు ఉపయోగకరంగా ఉండాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నాడు. రమ్ ఫోర్డ్ మెడల్ (1896), మాటెక్కీ మెడల్ (1896), ఎలియట్ క్రెస్సన్ మెడల్ (1897), భౌతిక శాస్త్రం లో నోబెల్ బహుమతి (1901) పొందాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494...

నులిపురుగుల నిర్మూలనే మన లక్ష్యం కావాలి

దేశంలోని ప్రతి బిడ్డను నులిపురుగుల నుండి విముక్తి చేయడానికి జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10 నాడు భారతదేశంలోని 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం జరుపుకుంటారు. భారత ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ చేపట్టిన చొరవ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం. ఈ కార్యక్రమాన్ని 2015లో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో రెండు రౌండ్లలో నిర్వహిస్తారు. మొదటి రౌండ్ ఫిబ్రవరి 10న, రెండవ రౌండ్ ప్రతి సంవత్సరం ఆగస్టు 10న నిర్వహిస్తారు.

ప్రపంచంలోనే అతిపెద్ద డీవార్మింగ్ ప్రోగ్రామ్గా గుర్తించబడే ఈ ఉద్యమం ప్రతి సంవత్సరం 24 కోట్ల పిల్లలను లక్ష్యంగా చేసుకుంటుంది. తక్కువ వ్యవధిలో ఎక్కువ మంది పిల్లలను చేరుకునే అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమాలలో ఇది ఒకటి. 2025 సంవత్సర థీమ్ "సురక్షిత సుస్థిర భవిష్యత్తు

నులి పురుగులు అంటే ?.. మట్టి ద్వారా సంక్రమించే హెల్మిన్త్స్ భారతదేశానికి ఒక ముఖ్యమైన ప్రజారోగ్య సమస్య. మల పదార్థంతో కలుషితమైన నేల ద్వారా వ్యాపించే హెల్మిన్త్‌లను (పురుగులు) మట్టి వ్యాప్తి చెందుతున్న హెల్మిన్త్‌లు (పేగు పరాన్నజీవి పురుగులు) అంటారు.

కార్యక్రమం లక్ష్యాలు: 1 నుండి19 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రీస్కూల్, పాఠశాల వయస్సు గల పిల్లలందరికీ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వేదిక ద్వారా వారి మొత్తం ఆరోగ్యం, పోషక స్థితి, విద్యకు ప్రాప్యత, జీవన నాణ్యతను మెరుగుపరచడం ద్వారా నులి పురుగులను తొలగించడం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ లక్ష్యం. ఇంకా పరిసర పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం గురించి తల్లిదండ్రులు, సమాజాన్ని అవగాహన పరచడం ఈ రోజు ప్రధాన లక్ష్యం.

శరీరంలోనికి ఎలా వెళ్తాయి ? రౌండ్ వార్మ్, టేప్ వార్మ్, హుక్ వార్మ్, విప్ వార్మ్ లాంటివి సాధారణ రకాలు. ఇవి కలుషిత మట్టి, నీరు, ఆహారం లేదా అపరిశుభ్రమైన చేతులు ద్వారా శరీరంలోనికి ప్రవేశిస్తాయి. పండ్లు సరిగ్గా కడగకుండా తినడం వల్ల రౌండ్ వార్మ్, టేప్ వార్మ్ గుడ్లు శరీరంలోకి చేరతాయి. క్రిమి సంక్రమిత నీటిని తాగడం లేదా ఆ నీటితో వంట చేయడం ద్వారానూ, ఆహారంలోని క్రిమి కంటేకాలు ఈగలు లేదా ఇతర కీటకాలు ఆహారంపై కూర్చొని దానిని కలుషితం చేయడం వలన మన శరీరంలోనికి వెళ్తాయి. మాంసం సరిగ్గా ఉడికించకుండా తినడం వల్ల టేప్ వార్మ్ శరీరంలో అభివృద్ధి చెందుతాయి.

సంక్రమిత వ్యక్తుల నుండి

సంక్రమిత వ్యక్తి యొక్క మలం ద్వారా క్రిమి గుడ్లు వెలుపలికి వస్తాయి. ఈ గుడ్లు మట్టి, నీరు, లేదా ఆహారాన్ని కలుషితం చేసి, ఇతరులకు వ్యాపిస్తాయి.

ప్రత్యేక కార్యక్రమాలు: ఈ సంవత్సరం ఫిబ్రవరి 10న జిల్లా స్థాయిలో శిక్షణా శిబిరాలు, పోస్టర్ విడుదలలు, మ్యాపింగ్ డ్రైవ్లు నిర్వహిస్తున్నారు.

ఆరోగ్య ప్రభావాలు: పిల్లలలోని నులిపురుగులు పోషకాలను తీసుకోవడంలో ఆటంకం కలిగిస్తాయి. రక్తహీనత, శారీరక మానసిక అభివృద్ధి మందగింపుకు కారణమవుతాయి. ఇది పాఠశాల హాజరు, విద్యా ఫలితాలను ప్రభావితం చేస్తుంది.

సామాజిక ఆర్థిక ప్రయోజనాలు: ఆరోగ్యంగా ఉన్న పిల్లలు విద్యలో మెరుగైన ప్రదర్శన చూపుతారు. ఇది దీర్ఘకాలికంగా దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది .

ఔషధ పంపిణీ:

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన ఆల్బెండజోల్ మాత్రలను పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సముదాయాల్లో ఉచితంగా పంపిణీ చేస్తారు. ఫిబ్రవరి 10 తర్వాత ఆగస్టులో రెండవ రౌండ్ నిర్వహిస్తారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని పిల్లలను ప్రత్యేకంగా లక్ష్యంగా చేస్తారు .

నివారణ: చేతులు తరచుగా కడుక్కోవాలి. బయటకు వెళ్ళేటప్పుడు చెప్పులు ధరించాలి. పరిశుభ్రమైన నీటిని మాత్రమే త్రాగాలి. కూరగాయలు, పండ్లను బాగా కడిగి తినాలి. నివారణ చర్యగా వెల్లుల్లి, లవంగాలు వంటి సహజ ఔషధాలను ఉపయోగించవచ్చు.

తల్లిదండ్రులకు సూచనలు: పిల్లలు మాత్రలను సకాలంలో తీసుకోవడానికి పాఠశాలలు, అంగన్వాడీలతో సంప్రదించాలి. మాత్రలు తీసుకున్న తర్వాత కడుపు నొప్పి లేదా వాంతులు వంటి సైడ్ ఎఫెక్ట్స్ కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. ఈ కార్యక్రమం ద్వారా, పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు ప్రగతికి భారత ప్రభుత్వం సమాజం ఒకే వరుసలో నిలుస్తున్నాయి.

జనక మోహన రావు దుంగ, ఫోన్: 8247045230

సాహితీ విహారి

సామాన్యుడి హృదయస్పందన ‘బ్రెచ్’



జర్మనీకి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి బెర్టోల్ట్ బ్రెచ్ (పూర్తిపేరు యూజెన్ బెర్తోల్డ్ ఫ్రెడరిక్ బ్రెచ్) ప్రతి అక్షరం సామాన్యుడి హృదయస్పందనను వినిపిస్తుంది. 1898 ఫిబ్రవరి 10వ తేదీన జన్మించిన బ్రెచ్ ఒక థియేటర్ ప్రాక్టీషనర్. నాటక రచయిత. కవి. దర్శకుడు. మార్క్సిజం పట్ల ఆకర్షితుడయ్యాడు కాబట్టే నిశ్శబ్ద అరుపులు వినగలిగాడు. నిద్రలేని రాత్రిళ్లను ఊహించగలిగాడు. నీడలు కూడా కనిపించని చిమ్మచీకట్లలో వెలుగును చూసేందుకు, భవిష్యత్తును చూపేందుకు పరితపించాడు. బ్రెచ్ రచయితగా, నాటకకర్తగా ఎదిగే కాలంలో, జర్మనీ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా సామ్రాజ్యవాద పదఘట్టాల కింద నలిగిపోయే జీవితాలే.. మోసపోతున్న హృదయాలే.. రక్షించాల్సిన చేతులే ఆశల కంఠం నులిమి ప్రాణం తీస్తుంటే, భయంతో వణికిపోయే ప్రజలే.. ఎక్కడ చూసినా హింస... దోపిడీ.. అణచివేత.. అకృత్యాలు.. అరాచకాలు. ఈ సామాజిక ముఖచిత్రం బ్రెచ్‌ను కదిలించింది. సామాన్యుడు ఎదుర్కొంటున్న సమస్యలను తనవిగా చేసుకొని అతను రచనలు కొనసాగించాడు. ఆ రచనలకు దృశ్య రూపాన్ని కూడా ఇస్తూ, నాటక ప్రదర్శనలు కొనసాగించాడు. వీమర్ రిపబ్లిక్ సమయంలో, టీనేజర్ బ్రెచ్ నాటక రచయితగా మ్యూనిచ్‌లో తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు. 1924లో బెర్లిన్ చేరాడు. ఎలిసబెత్ హాఫ్ట్‌మన్, కర్ట్ వీల్‌తో కలిసి ‘ది త్రీపెన్నీ ఒపెరా’ రాశాడు. మార్క్సిస్ట్ ఆలోచనలో మునిగిపోయిన బ్రెచ్, కొద్ది కాలంలోనే బోధనాత్మక ‘లెహర్‌స్టక్’ను రాశాడు. అందులో అతను పేదల బతుకులను కళ్లకు కట్టాడు. బ్రెచ్ రచనల్లోని పాత్రలు ఏ ఊహ నుంచో ఊడిపడినవి కావు. నిత్యం మనచుట్టూ కనిపించేవే. వీరంతా తాడితులు... పీడితులు.. వీరు రాత్రిళ్లు వీధుల్లో ఒంటరిగా తిరుగుతారు. ఆకలితో అల్లాడుతుంటారు. వారి కళ్లు చెత్తకుప్పల్లో దొరబాబులు పారేసిన ఆహార అవశేషాల కోసం ఆశగా ఎదురుచూస్తుంటాయి. ఒకప్పుడు ప్రకాశవంతంగా ఉండే వారి జీవితాలు క్రమంగా నిరాశతో మసకబారుతాయి. ఫుట్‌పాత్‌లే వారి ఇళ్లు. గుడిసెలే రాజమహళ్లు. మనుగడ కోసం నిరంతర పోరాటం. హక్కుల కోసం ప్రశ్నించలేని దైన్యం. వారి బాధలు తీరాలన్నా, మెరుగైన జీవితం దక్కాలన్నా మార్క్స్ సిద్ధాంతాన్ని అమలు చేయడం ఒక్కటే మార్గమని నమ్మాడు బ్రెచ్. అదే అభిప్రాయం అతని రచనల్లో కదలాడుతుంటుంది. అసమానతలపై ఆయుధం ఎక్కుపెడుతుంది. బడుగువర్గాలు చెప్పని కథలు.. కన్నీటి గాథలు వామపక్ష సాహిత్యంలో మాత్రమే కనిపిస్తాయని రుజువు చేసిన రచయితల్లో బ్రెచ్ ఒకడు. అందుకే, అతని రచనల్లో, ప్రత్యేకించి నాటకాల రూపంలో సామ్యవాద భావనలు కళ్ల ముందు కదలాడుతుంటాయి. 1933లో నాజీలు జర్మనీలో అధికారంలోకి వచ్చినప్పుడు, బ్రెచ్‌తన స్వదేశాన్ని విడిచిపెట్టి, తొలుత స్కాండినేవియాకు పారిపోయాడు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అతను దక్షిణ కాలిఫోర్నియా చేరుకున్నాడు. అక్కడ స్క్రీన్ రైటర్‌గా స్థిరపడ్డాడు. జర్మనీ నుంచి వచ్చిన కారణంగా అమెరికా నిఘా విభాగం ఎఫ్‌బిఐ అతనిని ఓ కంట కనిపెడుతూ వచ్చింది. కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలున్నాయన్న కారణంగా, 1947లో ‘హౌస్ ఆన్ అమెరికన్ యాక్టివిటీస్ కమిటీ’ బ్రెచ్‌కు సమన్లు జారీ చేసింది. తన వాంగ్మూలాన్ని వినిపించిన తర్వాత, అతను అక్కడి నుంచి తిరిగి ఐరోపా చేరుకొని, నాటి తూర్పు బెర్లిన్‌లో స్థిరపడ్డాడు. అక్కడే తన భార్య, నటి హెలీన్ వీగెల్‌తో కలిసి ‘బెర్లినర్ ఎన్సెంబుల్’ అనే థియేటర్ కంపెనీ నెలకొల్పాడు. తన 16వ ఏట మొదటి ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు, ఆరంభంలో ఉత్సాహపడిన బ్రెచ్, తన స్నేహితులను, తోటి విద్యార్థులను సైన్యం కాల్చిచంపడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. దీనితో యుద్ధం పట్ల అతని వైఖరి మారింది. జీవితాలు బలికావడంపై ఆందోళన పెరిగింది. ఆయా కుటుంబాల దయనీయ పరిస్థితులు అతనిని క్రమంగా మార్క్సిజంవైపు అడుగులు వేయించాయి. ఆ సిద్ధాంతాలనే అతను చివరి వరకూ నమ్మాడు. ఆచరించాడు. ప్రచారం చేశాడు. అతని సృజనాత్మక ధోరణి ప్రజలను విశేషంగా ఆకర్షించింది. ప్రేక్షకుల నుంచి వస్తున్న ప్రతిస్పందనతో ఉత్సాహం పెంచుకున్న బ్రెచ్ తన రెండో అత్యంత ప్రధాన నాటకం ‘డ్రమ్స్ ఇన్ ది నైట్’ రచించాడు. 1923లో ‘మిస్టరీస్ ఆఫ్ ఎ బార్బర్‌షాప్’ అనే రూపకాన్ని రాశాడు. దీనికి ఎరిచ్ ఎంగెల్ దర్శకత్వం వహించాడు. అనంతరం కార్ల్ వాలెంటైన్ నటించిన ఈ రూపకం జర్మనీ నాటకరంగంలో కొత్త ఒరవడికి బీజం వేసింది. 24 సంవత్సరాల వయసులో అతను రాసిన ‘డ్రమ్స్ ఇన్ ది నైట్’ సృష్టించిన అలజడి అంతాఇంతా కాదు. అతనికి జర్మనీలో అత్యంత ప్రతిష్టాత్మక సాహితీ పురస్కారం ‘క్లైస్ట్’ను సంపాదించిపెట్టింది. జర్మనీ ప్రభుత్వం 1932లో ఈ పురస్కారాన్ని రద్దు చేసింది. ఆ సమయంలో రచనలపై నిషేధం కత్తి వేలాడుతూ ఉండేది. ప్రజా గొంతుకలు వినిపించే సాహితీవేత్తలు దాదాపుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు. అలాంటి సమయంలోనే, ‘ఇన్ ది జంగిల్’ నాటకాన్ని రాసిన బ్రెచ్, దానిని మ్యూనిచ్‌లో ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసుకున్నాడు. ప్రీమియర్ షోలోనే నాజీ అనుకూలవాదులు వేదికపై ఉన్న నటులను హేళన చేసి, వారిపై రాళ్లు, గుడ్లు, దుర్వాసనతో కూడిన బాంబులు విసిరారు. ఆ తర్వాత మ్యూనిచ్‌లో ప్రదర్శనలు రద్దయ్యాయి. అయితే, నాజీల నుంచి ఎంత ఒత్తిడి వచ్చినప్పటికీ, బ్రెచ్ తన వైఖరి మార్చుకోలేదు. కమ్యూనిజాన్ని వీడలేదు. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ప్రబోధించడం మానలేదు. 1925లో మాన్‌హీమ్ వేదికగా జరిగిన న్యూ సచ్లిచ్‌కీట్ (కొత్త లక్ష్యం) అనే కళాత్మక ప్రదర్శన జర్మన్ కళలలో కొత్త పోస్ట్ ఎక్స్‌ప్రెషనిస్ట్ ఉద్యమానికి కారణమైంది. ఈ ఉద్యమానికి సచ్లిచ్‌కీట్ అనే పేరు స్థిరపడింది. బ్రెచ్ పేరు జర్మనీతోపాటు ప్రపంచమంతటా మారుమోగింది. నాటక రంగంలో ఒక విప్లవాత్మక మలుపుగా దీనిని పేర్కొంటారు. బ్రెచ్ చిన్న కథలను రాయడం మొదలుపెట్టినప్పుడు, ఎలిసబెత్ హాఫ్ట్‌మన్ సహకారం తీసుకున్నాడు. ఆ సమయంలోనే మార్క్సిజం, సోషలిజంపై అధ్యయనం ముమ్మరం చేశాడు. ‘నేను మార్క్స్ రాసిన క్యాపిటల్ చదివినప్పుడు వినూత్న అనుభవాన్ని పొందాను. నా నాటకాలను నేరు అర్థం చేసుకున్నాను’ అంటాడు బ్రెచ్. సగటు జీవిపై తనకు ఉన్న అభిప్రాయాలు, వారి పక్షాల నిలబడి పోరాడాలన్న ఆలోచనలకు మార్క్స్ సిద్ధాంతాలతో దగ్గరి పోలికలు ఉన్నాయని గుర్తించాడు. నాటి సోవియట్ యూనియన్‌లో జరిగిన పరిణామాల నుంచి ప్రేరణ పొందిన బ్రెచ్, ‘బోల్షివిక్ కమ్యూనిజం’, ‘రెండ్ టెర్రర్’ (ది డెసిషన్) అనే ఉత్తేజకరమైన నాటకాలు రాశాడు. తన అభిప్రాయాలు, ఆశయాలకు అనుగుణంగా ఎర్విన్ పిస్కేటర్ మొదటి కంపెనీ ‘ డ్రామాటర్జికల్ కలెక్టివ్’లో బ్రెచ్ భాగమయ్యాడు. రాజకీయ ఘర్షణను దృశ్యరూపంలో చూపేందుకు వీలుగా కొత్త నాటకాలను ప్రదర్శించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. హేతుబద్ధత, బోధనావాదానికి ప్రాధాన్యతనిస్తూ, నాటక రంగం ఎప్పుడూ కొత్తదనాన్ని కోరుకుంటుందని అంటాడు బ్రెచ్. టీనేజ్‌లోనే అంకురించిన సామాజిక విశ్లేషణ అతనికి చివరి వరకూ తోడై నిలిచింది. జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిస్టుల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, అణచివేతలు, ఊచకోతలు సాధారణమయ్యాయి. దీనితో అతను జర్మనీని విడిచిపెట్టి, ప్రేగ జ్యూరిచ్, పారిస్ తదితర ప్రాంతాల్లో కొంతకాలం గడిపాడు. జర్నలిస్టు, రచయిత కరిన్ మిచాలిస్ ఆహ్వానాన్ని అంగీకరించి డెన్మార్క్ వెళ్లాడు. వివిధ ప్రాజెక్టుల నిమిత్తం కోపెన్‌హెగెన్, పారిస్, మాస్కో, న్యూయార్క్, లండన్ తదితర నగరాలను సందర్శించేవాడు. 1939 ఏప్రిల్‌లో యుద్ధం ఆసన్నమయ్యే లక్షణాలను గమనించి, స్టాక్‌హోమ్ వెళ్లిన బ్రెచ్ అక్కడే ఏడాది కాలం ఉన్నాడు. అతను ఊహించిన విధంగానే 1939 సెప్టెంబర్ ఒకటని రెండో ప్రపంచ యుద్ధం మొదలైంది. ఆరు సంవత్సరాలు కొనసాగిన యుద్ధం 1945 సెప్టెంబర్ 2న ముగిసింది. ఆ కాలంలో బ్రెచ్ స్కాట్‌లాండ్ నుంచి స్వీడన్ వెళ్లాడు. అనంతరం ఫిన్లాండ్‌లోని హెల్సింకికి మకాం మార్చాడు. అమెరికా వెళ్లడానికి దరఖాస్తు చేసుకున్న అతను వీసా కోసం ఎదురుచూస్తున్న సమయంలోనే హెల్లా పులిజోకితో కలిసి ‘మిస్టర్ పుంటిలా అండ్ హిజ్ మ్యాచ్ మాటి’ నాటకాన్ని రాశాడు. 1941 మే మాసంలో యుఎస్ వీసా లభించిన తర్వాత కుటుంబంతోసహా దక్షిణ కాలిఫోర్నియాకు మకాం మార్చాడు. లాస్‌ఏంజిలిస్ బీచ్ శివారు శాంటా మోనికాలో రెండు అంతస్థుల చెక్క భవనాన్ని అద్దెకు తీసుకున్నాడు. ఈ ప్రాంతం తర్వాతి కాలంలో యూరోపియన్ మేధావులు, కళాకారుల కేంద్రంగా మారింది. ఈ కాలనీలో జర్మన్ మాట్లాడే దేశాల నుండి చాలా మంది రచయితలు, దర్శకులు, నటులు, స్వరకర్తలు ఉన్నందున, దీనిని ‘పసిఫిక్‌లోని వీమర్‘ అని పిలిచేవారు. కొంతకాలం తర్వాత, బ్రెచ్ హాలీవుడ్‌పై దృష్టి సారించాడు. స్క్రీన్ రైటర్‌గా గుర్తింపు సంపాదించుకోడానికి చాలా కష్టపడ్డాడు. ఫ్రిట్జ్ లాంగ్ దర్శకత్వం వహించిన ‘హ్యాంగ్‌మెన్ ఆల్సో డై’ చిత్రానికి స్క్రీన్‌ప్లే విభాగంలో సహ రచయితగా పని చేశాడు. ఆ తర్వాత క్రమంగా నిలదొక్కుకున్నప్పటికీ, 1947లో మరో 40మందితోపాటు అతనిపైన కూడా హాలీవుడ్ రచయితల సంఘం నిషేధం విధించింది. ఈ చర్యను వ్యతిరేకించిన బ్రెచ్ తన వాంగ్మూలాన్ని వినిపించి మరీ బ్రెజ్ అమెరికాను విడిచిపెట్టాడు. 1954లో అతనికి స్టాలిన్ శాంతి బహుమతి లభించింది. బ్రెచ్‌రచనలను మరియు ప్రచురించని వైద్య రికార్డులను సమీక్షించిన స్టీఫెన్ పార్కర్ ప్రకారం, బ్రెచ్‌చిన్నతనంలో రుమాటిక్ జ్వరం బారిన పడ్డాడు, ఇది గుండె విస్తరించడానికి దారి తీసింది , తరువాత జీవితాంతం దీర్ఘకాలిక గుండె వైఫల్యం మరియు సిడెన్‌హామ్ కొరియా వచ్చింది. 1951లో బ్రెచ్‌తీసిన రేడియోగ్రాఫ్ నివేదిక తీవ్రంగా వ్యాధిగ్రస్తుడైన గుండెను వివరిస్తుంది, ఎడమ భాగానికి విస్తరించింది. ఇది బ్రెచ్ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపింది. 1956 ఆగస్టు 14న బ్రెచ్ తన 58వ ఏట తుది శ్వాస విడిచాడు. భౌతికంగా దూరమైనప్పటికీ, నాటక రంగంపై అతని ప్రభావం ఇప్పటికీ కనిపిస్తునే ఉంటుంది.

– సత్యశ్రీ

ఈ రాతల మర్మం ఏమిటో?



చరిత్రను తెలుసుకునే ఆధారాలు కొన్ని పురావస్తు తవ్వకాల్లో బయటపడినప్పటికీ, వాటిలో అక్షరాలు లేదా బొమ్మల మర్మం ఏమిటనేది తెలియడం లేదు. సింధు నాగరికతకు సంబంధించిన లిపి ఏమిటో ఇప్పటికీ కనిపెట్టలేకపోయారు. ఈ రహస్యాన్ని ఛేదించిన వారికి భారీ బహుమతి ఇస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించినప్పటికీ, ఆశాజనకమైన పురోగతి కనిపించడం లేదు. ఇటలీలో బయటపడిన ‘పాపిరస్ స్క్రోల్స్’ కూడా ఇదే కోవకు చెందుతాయి. 1750 దశకాల్లో రోమన్ ప్రధాన పట్టణాల్లో ఒకటిగా విరాజిల్లిన హెర్క్యులేనియంలోని ఒక విలాసవంతమైన విల్లా అవశేషాల్లో వందలాది పాపిరస్ స్క్రోల్స్‌ను కనుగొన్నారు. క్రీస్తు శకం 79 సంవత్సరంలో చోటు చేసుకున్న వెసువియస్ అగ్నిపర్వతం విస్ఫోటనం వల్ల సమీపంలోని పాంపీ కూడా ధ్వంసమైంది. ఆ సమయంలోనే పాపిరస్ స్క్రోల్స్ కూడా దెబ్బతిన్నాయి. కొన్ని ఫలకాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఒకప్పుడు చెట్టు బెరడు లేదా జంతు చర్మంతో తయారు చేసిన దీర్ఘ చతురస్రాకార అట్టలను నేటి కాగితాల స్థానంలో వాడేవారు. వాటినే పాపిరస్‌గా పేర్కొంటారు. వాటిపై పదునైన ఘంటం లేదా ఇరత పరికరంతో అక్షరాలను చెక్కుతారు. అవే పాపిరస్ స్క్రోల్స్‌గా ప్రసిద్ధి చెందాయి. కాగా, ఇటలీలో బయటపడిన ఈ పాపిరస్ స్క్రోల్స్ అగ్నిపర్వత విస్ఫోటనం కారణంగా స్పష్టతను కోల్పోయాయి. కొంత భాగం కాలిపోగా, అక్షరాలు లేదా గుర్తులు చెరిగిపోయాయి. అరకొరగా ఉన్న ఆధారాలతో అందులో రాసింది ఏమిటో తెలుసుకోవడానికి గత 250 సంవత్సరాలుగా శాస్త్రవేత్తలు నానా తంటాలు పడుతున్నారు. వీటి మర్మం ఏమిటో తెలుసుకోవాలంటూ అధికారులు ‘వెసువియస్ చాలెంజ్’ ప్రకటించారు. దీనితో, వందలాది పాపిరస్ స్క్రోల్స్‌లో దాగివున్న సమాచారాన్ని కనుక్కోవడానికి ఎంతో మంది ప్రయత్నిస్తునే ఉన్నారు. తాజాగా కృత్రిమ మేధ (ఎఐ) సహకారంతో కొంత మంది టెక్ నిపుణులు ఈ స్క్రోల్స్‌కు పూర్వరూపాన్ని తెచ్చేందుకు కృషి చేశారు. కెంటుకీ విశ్వవిద్యాలయ కంప్యూటర్ శాస్త్రవేత్త బ్రెంట్ సీల్స్ కొంత పురోగతిని సాధించినట్టు ప్రకటించాడు. హెర్క్యులేనియం స్క్రోల్స్‌లో ప్రస్తుతం మన చూస్తున్నదానికంటే ఎక్కువ సమాచారం నిక్షిప్తమై ఉండవచ్చని అంచనా వేశాడు. ఆక్స్‌ఫర్డ్ సమీపంలోని హార్వెల్‌లో, డైమండ్ లైట్ సోర్స్ అనే ప్రయోగశాలలో ఈ స్క్రోల్స్‌ను ‘పార్టికల్ యాక్సిలరేటర్’ సాంకేత సాయంతో స్క్రోల్స్ పరిశీలన జరిగింది. అత్యంత శక్తివంతమైన ఎక్స్‌రేను సృష్టించిన శాస్త్రవేత్తలు, వాస్తవ అక్షరాలు లేదా గుర్తుల వివరాలు తెలుసుకునేందుకు పరిశోధనలు ముమ్మరం చేశారు. ఈ గుట్టు వీడితే, సుమారు రెండు వేల సంవత్సరాల క్రితం నాటి చరిత్రకు సంబంధించిన వివరాలు తెలుస్తాయి. ఈ స్క్రోల్స్ మర్మం త్వరలోనే తేలుతుందని ఆశిద్దాం.

వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంపై పుస్తకం





‘భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం’ ఒక పుస్తకం కాదు.. సాధికార పరిశోధనా వ్యాసంగా గోచరిస్తుంది. అసలు సిసలైన కమ్యూనిస్టు, తొమ్మిది దశాబ్దాల జీవితంలో పార్టీ సిద్ధాంతాలను నరనరాన జీర్ణించుకున్న మేధావి కాబట్టే కందిమళ్ల ప్రతాపరెడ్డి ఈ వందేళ్ల ప్రస్థానాన్ని సంక్షిప్తంగా చెప్పే సాహసం చేయగలిగారు. దీనితోపాటు, ఆయన రాసిన ‘విప్లవాల విప్లవం’ గేయ వాహిని కూడా ఇటీవల విడుదలైంది. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి ముందు ఉన్న పరిస్థితుల నుంచి నేటి వరకూ చోటు కేసుకున్న కీలక ఘట్టాలను సిపిఐ వందేళ్ల ఉద్యమంపై రాసిన పుస్తకం అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. ‘ఇది వందేళ్ళ భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ ప్రస్థానం. కమ్యూనిస్టు ఉద్యమ సంక్షిప్త చరిత్ర. వందేళ్ళ సుదీర్ఘ పోరాటంలో వొరిగిన వీరుల రుధిరంతో ఎరుపెక్కిన చరిత్ర. మరవరాని చరిత్ర’ అంటూ ఈ పుస్తకాన్ని ప్రారంభించారు రచయిత కందిమళ్ల. నేడు వివిధ పార్టీలుగా, గ్రూపులుగా ఉన్న కమ్యూనిస్టులందరూ ఈ చరిత్రకు వారసులేనని ప్రకటించారు. మార్గాలు వేరైనా, ఆశయం మాత్రం మార్క్సిజం లెనినిజం సిద్ధాంతం ఒక్కటేనని ఉద్యమ వారసులకు స్పష్టం చేశారు. ‘నేను భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యుణి.. కానీ అంతకు మించి కమ్యూనిస్టుని. అందరూ నా వాళ్ళే. తొంభై సంవత్సరాల నా జీవితం 75 సంవత్సరాలుగా ఎర్రజెండా నీడన నా జీవనం సాగుతున్నది. మాతరం అంతరించిపోతున్నది’ అంటూ, దేశ పరిస్థితులు గమనించాలని, ప్రగతిశీలులందరూ కోరుకునే ‘కమ్యూనిస్టుల ఐక్యత’ ఒక్కటే ప్రస్తుత పరిస్థితుల్లో ఏకైక ప్రత్యామ్నాయ మార్గమని తేల్చి చెప్పారు. దేశంలో ఏర్పడిన మొదటి రాజకీయ పార్టీగా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి ముందు రాజకీయ ఉద్యమాలు ఉన్నాయేగానీ పార్టీ లేదు. అందుకే పార్టీ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులను ఈ పుస్తకంలో ప్రస్తావించారు. కమ్యూనిస్టు ప్రణాళికను పరిచయం చేశారు. లెనిన్ సిద్ధాంతాన్ని వివరించారు. మహాసభలో లెనిన్ ప్రసంగ ముఖ్యాంశాలు, గదర్ విప్లవం, అక్టోబర్ విప్లవం గురించి సమాచారాన్ని అందించారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) నిర్మాణాన్ని పరిచయం చేశారు. పెషావర్ కుట్రకేసు, కాన్పూర్ కుట్రకేసుల గుట్టువిప్పారు. నాటి అణచివేతల కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావక్రమాన్ని తెలియచేశారు కందిమళ్ల. భగత్ సింగ్ త్యాగాన్ని, ప్రజాయుద్ధ తీరును, కమ్యూనిస్టు తొలి మహాసభ వివరాలను క్లుప్తంగా, ఆకట్టుకునే విధంగా వివరించారు. నేటి భారత దేశ పరిస్థితిని ప్రస్తావించిన ఆయన, కమ్యూనిస్టు పార్టీ ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించారు. ఈ పుస్తకంలోని అంశాలు ఎంతగా ఆకట్టుకుంటాయో, ఎంతో ప్రయాసతో సేకరించి మరీ ప్రచురించిన చిత్రాలు అంతే ఉద్విగ్నతకు లోనుచేస్తాయి. ఇక, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ముందుమాటతో వచ్చిన ‘విప్లవాల విప్లవం’ గేయ వాహిని ఆసాంతం చదివిస్తుంది. ఇందులోని 30 కవితలు, వేటికవే ప్రత్యేకతను చాటుకుంటాయి.

‘భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం’
(వెల రూ. 80)
‘విప్లవాల విప్లవం’
(వెల రూ. 50)
రచయిత కందిమళ్ల ప్రతాపరెడ్డి
ప్రతులకు..
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బంగ్లగూడ (నాగోల్),
జిఎస్ఐ పోస్ట్,
హైదరాబాద్ 500068, ఫోన్ 040
29884453/54

స్వీకారం

కవితా స్రవంతి
రేవతీదేవి కవితలు

జాయ సేనాపతి
చారిత్రక కాల్పనిక నవల మొదటి భాగం
రచయిత మత్తి భానుమూర్తి

ఉనిక
చెన్నమనేని విద్యాసాగర్ రావు స్వీయచరిత్ర

సమాజాన్ని ఆవిష్కరించిన ‘సాక్షి’ ఉపన్యాసాలు



ప్రముఖ కవి, రచయిత, సాహితీవేత్త పానుగంటి లక్ష్మీ నరసింహారావు (ఫిబ్రవరి 11,1865–అక్టోబర్ 7, 1940) పేరు వినగానే తొలుగ గుర్తుకొచ్చేవి ‘సాక్షి’ ఉపన్యాసాలు. సమకాలీన సమాజాన్ని అవి ఆవిష్కరిస్తాయి. రుగ్మతలపై చురకలు వేస్తాయి. వేంకటరమణయ్య, రత్నమాంబ దంపతులకు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి తాలూకా సీతానగరంలో జన్మించిన పానుగంటిని అలనాటి ‘కవిసార్వభౌముడు’ శ్రీనాథునితో పోల్చవచ్చు. ఆయన మాదిరిగానే పానుగంటి కూడా తాను చేసి న ఉద్యోగాలు... రచనలతో విశేషంగా సంపాదించాడు. దర్జాగా బతికా డు. సంపదను కాపాడుకోలేక, చివరి దశలో అత్యంత పేదరికాన్ని అనుభవించాడు. సంస్థానాధీశుల ప్రాపకంపోయింది. యాచించడానికి ఆత్మాభిమానం అడ్డువచ్చేది. తన పుస్తకాలను కొనడమే తనకు చేసే సా యమని ఆయన తుది రోజుల్లో వాపోయేవాడు. మానసికంగా, శారీరకంగా కుంగిపోయాడు. చివరికి చిల్లిగవ్వ లేని స్థితిలో తుది శ్వాస విడిచాడు. ఆయన పడిన కష్టాలు.. ఎదుర్కొన్న సమస్యలు స్వయంకృతాలు. ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే జీవితాలు ఎలా తారుమారవుతాయో చెప్పడానికి పానుగంటిని మించిన ఉదాహరణ మరొకటి ఉండదు. అయితే, ఆ యనన కేవలం ఈ కోణంలో చూడడం తగదు. ఎన్నో రచనలు.. ఎంతో కీర్తిప్రతిష్టలు ఆర్జించిన పానుగంటి తన ‘సాక్షి’ వ్యాసాలతో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాడు. ఈనెల 11న జయంతి సందర్భంగా ఆయనను గుర్తుచేసుకోవడం సాహితీప్రియుల విధి.

కొత్త చరిత్ర లిఖిస్తాయ్ !

ఒక్క నిప్పు రవ్వ ...
దావానళంలా వ్యాపించి
కీకారణ్యాన్ని కాల్చేస్తుంది
ఒక్క గునపం పోటు ...
బిర్రుగా తలెత్తుకు నిలబడ్డ
కోట గోడలను కూల్చేస్తుంది

ఒక్క బాణం మొన ...
విర్రవీగిన కొదమ సింహాన్ని
పిడాత ప్రాణాల్ని తొడేస్తుంది
ఒక్క గడ్డిపరక జతకట్టి
గర్జించి వీరవిహారం చేసే
మదపుగజాన్ని బందిస్తుంది

ఒక్క చీమ దండు గట్టి
పడగ విప్పి బుసలగొట్టే
కాలనాగును కట్టిపడేస్తుంది
ఒక్క పసి పిట్ట పాటై మ్రోగి&
జన ప్రబంజనం సృష్టిస్తుంది

ఒక్క నోటిమాట తూటై పేలి
అధికార పీఠాలు కదిలిస్తుంది
చేవచచ్చినవేవి లేవిక్కడ
అవసరమైన సమయంలో
తమ ప్రతాపం చూపిస్తాయి

ఓయ్ నియంత పాలకా!
అధికార బలం బలగంతో
బడుగు బలహీనుల మీద
పెత్తనం చెలాయిస్తానంటే
ఏదో ఒకానొక రోజు&

తాడిత పీడిత వర్గాలేకమై
తిరుగుబాటుకి తొడగొడ్తాయ్
నీ సామ్రాజ్యాన్ని పాతరేసి
సరికొత్త చరిత్ర లిఖిస్తాయ్

కోడిగూటి తిరుపతి ,
9573929493

ఈ వారం కవితలు

నా ఊరు పిలుస్తుంది

నా ఊరు పిలుస్తుంది..!
నేను నడియాడిన నేలను
ఒక సారి సూసి పొమ్మని
నా ఊరు పిలుస్తుంది
నాకు పురుడు పోసిన
పెంకుటిల్లును తిలకించిపొమ్మని

నా ఊరు పిలుస్తుంది
అక్షరం నేర్పిన పాఠశాల
మదిలో నెమరేస్కోమని
నా ఊరి వాడ పిలుస్తుంది
పండు వెన్నెల్లో ఆడిన కబడ్డీ చౌరస్తా
ఎట్లుందో వచ్చి సూడమని

నా ఊరు పిలుస్తుంది
నేను పండిపొర్లిన వాకిలి పొక్కిలైందని
తెలుసుకొని తెలుసుకొన పిలుస్తుంది
నా ఊరు పిలుస్తుంది
నే నెక్కి తిరిగిన మద్ది గుట్ట
మాయమై మధనపడుతోందని

నా ఊరు పిలుస్తుంది
నేనీదులాడిన మోట బావి
కలువరిస్తుంది కలిసి పొమ్మని

నా ఊరు పిలుస్తుంది
చింతచెట్టు కింద నా సోపతిగాళ్ళతో
గిల్లిదాండులాడిన
ఆ చెట్టు కనిపిస్తలేదు సూసిపోమని

నా ఊరు పిలుస్తుంది
పుట్టిపెరిగిన ఊరినే మర్చావని
ఒక్క మారొచ్చిపొమ్మని..
ఊరి మీద ప్రేమతో వెళ్ళి చూశాను..!
అంతా మారిపోయింది నా ఊరి ముఖచిత్రం
నాన కట్టిన ఇల్లు కూలిపోయి
అమ్మ అలికిన నేల పేలిపోయి

నా ఊరు మారిపోయింది
నన్నెవరూ గుర్తుపట్టి పలకరించే వాళ్ళు లేరు
అంతా నన్ను వింతగా చూస్తున్నారు
అయినా నేను చింత చెందలేదు ...
చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకుంటూ
ఊరెనుక చెరువు కట్టమీద కానుగు చెట్టుకింద
స్వేద తీర్చుకొని తిరుగు ప్రయాణం
అయ్యాను

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

వారం లేని పనివారం!

ఒక్కొక్కరికి ఒక వారం
కొందరికి ఆదివారం సందడి
కొందరికి వారం వారం అంగడి !
అందరికి సోమవారం హడావుడి
కొందరికి గుడ్డెద్దు చేన్లో పడ్డట్టు
వారాలన్నీ ఒకటే పందేరం!

మాది వారం వర్జ్యం లేని పనివారం!
వారాల సప్త హారం
మా చేతుల్లో జపమాలై
విరామమెరుగక తిరుగుతుంది!
వినిమయ వస్తు సౌకర్యం అంతా
కనిపించని శ్రమచేతుల తపస్సే!

వారం లేని పని వారం
మా జీవితాలు అనేక అశ్వాలై
జగతి రథ చక్రాలను విశ్రమించక
అలుపెరుగక లాగితేనే అందరికీ
నిత్య కొత్త ఉదయాలు !

పి.బక్కారెడ్డి, 9705315250

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

> "ఈనాటి భారతీయ రచయితల కర్తవ్యం ఏమిటంటే- సమాజంలో చోటు చేసుకుంటున్న మార్పులను తమ రచనల్లో చిత్రించటం; ప్రగతిశీల శక్తులకు తోడ్పాటునందిస్తూ; సమాజంలో శాస్త్రీయ, తార్కిక దృష్టిని పెంచటం.
>
> – అభ్యుదయ రచయితల మేనిఫేస్టో, 1934



ఊరవతల ఒంటరి గోడ

ఊరవతల ఒంటరి గోడ
నవ్వు ముఖాలతోనే కనిపిస్తుందెప్పుడూను
గోడవెనక చీకటిలా నవ్వు వెనక కల్మషం ఎవరికీ కనబడదు
.ఆ ముఖం ఎప్పుడూ ఒకటే అయ్యుండదు
ఎప్పుడేముఖంతో నవ్వుతుందో దానికీ తెలీదు,
నవ్వే ముఖాల్ని ఆకలిదొక్కల పశువులు
పీక్కుతింటున్నప్పుడల్లా ఎంత సంతోషిస్తుందో..

మరో నవ్వు ముఖం వచ్చి వాలుతుంది
దాని సంతోషాన్ని చెరిపేస్తూ
ఏ ముఖాన్ని ఎందుకు అతికించుకోవాలో
దానికి తెలీదు
ఏ ముఖం ఎప్పుడు జారిపోతుందో అదీ తెలీదు
నవ్వే ముఖాల వెనక ఎన్ని చీకటి కోరలున్నాయో
తెలిసినా
ఏమీ చేయలేని అశక్తత దానిది!

ఇప్పటికెన్ని ముఖాల్ని తగిలించుకుందో
ఆ ముఖాల్ని తగిలించుకున్నందుకు ఎంత
కృంగిపోయిందో
గోడ జన్మ ఎత్తినందుకు
లోలోన కుమిలిపోతుందే గానీ బయటపడదు

ఆ నవ్వుల్లో ఎన్నెన్ని బుసలుకొట్టే నాగులో
ఆ చూపుల్లో ఎన్నెన్ని విషపు బాణాలో
ఎన్ని నవ్వు ముఖాల్ని తగిలించుకున్నా
నవ్వు రాదు బండ బారిపోయిన మొండిగోడకి
దాని పెదాల మీంచి నవ్వెప్పుడో రాలిపోయింది
రేకుతో గీకేసిన సున్నం పొడిలా ...
చీకటికి వెల్లవేసి వెన్నెలని భ్రమింపజేసే
ఐంద్ర జాలికులకు గోడ ఒక ప్రచార సాధనం!
ఇంద్ర ధనుస్సుల్ని గోడ మీద అతికించి
దానినొక వెలియాలిలా నిలబెడతారు నవ్వుల
సొంతదారులు
పాపం గోడ !
తెల్లగా వెన్నెల్లా నవ్వాలనే దాని కోరిక ఎప్పటికీ
నెరవేరదు
ఏదోవొక ముఖం ఎప్పుడూ వెంటాడుతూనే
ఉంటుంది
మరకమరకల విషహాసాలతో ...

తనను కూల్చివేసే ఒక పెను తుపాను కోసం
నిలువెత్తు మౌన విషాదంలా
ఎదురుచూస్తుందిప్పుడు
విషపు నవ్వుల ముఖాల్ని మోస్తూ ....

– లాంగుల్యా

చరమాంకం

అనుకున్న దేది జరగలేదు
అన్నం ముద్ద ఇంకా దూరంగానే ఉంది
పాల ప్యాకెట్ ఆకాశం నుంచి కిందికి రానంది
'పించను' పదం చుట్టూ
కమలం ఎన్ని కలల్ని చుడుతుందో!

బడ్జెట్ ప్రవేశించింది
ఆదాయపు పన్ను తగ్గింది
ఆదాయం లేని అర్భకుల సంగతి ఏమిటో?
గాయాల్ని మోసే కాయానికి అరవై వచ్చి
అన్ని భ్రమల నుంచి దూరమై,
వెయ్యి నుంచి ఏటో వెళ్ళిపోతుందనుకున్న బతుకు
ఎక్కడ వేసిన గొంగళి చందాన ఉన్నది!

ప్రతిసారీ అదే నాటకం
నేపథ్యం మారుతోంది
అంకెల రంకెలయ్యాక అచ్చేదిన్ వచ్చేసాక
వాళ్ళు వెళ్ళిపోయారు
మళ్ళీ మళ్ళీ మోసపోయాక
చిరుగుల తెరతో చరమాంకం ప్రారంభమైంది!

– వీరేశ్వరరావు మూల

చరిత్రలో
సాన పెట్టి ఉంచండి

చరిత్రలో పేజీలంటూ మిగులుంటే
మావంటూ రెండు అక్షరాలు రాసి ఉంచండి
భూమి పుట్టుక గురించి కాకపోయినా
భూమిని కాపాడుకునే పోరాటాల గురించి
మళ్ళీ మళ్ళీ వెదికే అవకాశం రాక మానదు!

స్వేచ్ఛా వాయువుల కోసం పోరాడి, నేలకొరిగిన
నాలుగు రక్తపు గుర్తులు చరిత్రలో అతికించండి
ఉక్కు సంకెళ్ళ ఉక్కిరి బిక్కిరిలో
ఊపిరి కోసం రానున్న కాలం చూడకపోదు!
బతుకు పోరాట ఆనవాళ్ళ
చరిత్ర పుస్తకంలో నిక్షిప్తం చేసి ఉంచండి
అన్నీ పోగొట్టుకున్నాక.. కూడు, గూడు కోసం
ఉత్తి చేతులలో మళ్ళీ మార్గాలు అన్వేషించకపోరు!

అడవిని అట్టి పెట్టుకుని ఉన్న
అస్తిత్వ పోరాటాన్ని అక్షర రూపంలో దాచండి
దోపిడీ పన్నాగానికి అడవి అడుగంటుకుపోయాక
చరిత్ర సాక్ష్యంగా విల్లంబులు ఎక్కుపెట్టరావొచ్చు!

బతుకు పోరాటానికి దారులు
చరిత్రలో సాన పెట్టి ఉంచండి
ఆయుధాలైతే తుప్పు పట్టుకు పోతాయేమో
ఆచరణ మార్గాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి!

దోపిడీ దారులు విసిరిన నూకలకు మోసపోయి
వర్తమానం అంతా బాగుందనిపించినపుడల్లా
ప్రజా చైతన్యం స్తబ్దతకు మాత్రమే లోనవుతుంది
అదే కబంధ హస్తాల్లో పెనుగులాడినపుడు
పరిస్థితి మళ్ళీ మొదటకు రాక తప్పదు!

– వినోద్ కుత్తుం
96343 14502

కమనీయ కవనగాన ప్రవాహం

కవిత్వంలోని అనేక ప్రక్రియల్లో దీర్ఘకవిత ప్రత్యేకమైంది. దీర్ఘ కావ్య నిర్వహణ క్లిష్టతరమైంది కూడా. కవి ఎదకనుమలో చిన్న పాయగా పుట్టి ఉపకథల వాగుల్ని కలుపుకుని నదిగా మారి ఉరుకులతో పరుగులతో తరగలెత్తి ప్రవహించి చివరికి పాఠకహృదయసంద్రంలో సంగమించాలి.

గుమ్మ, శ్రీకాకుళం, (ఛాయరాజ్) నాగలి, నాగేటిచాలుకు నమస్కారం (గంటేడ) మగ్గం బతుకు (రాధేయ), నాగేటిగోడు (కొండ్రెడ్డి వెంకటరెడ్డి), పునర్యానం (వాడ్రేవు చిన వీరభద్రుడు), పాలి (రాచపాళెం), మహాశూన్యం (దీర్ఘాశి విజయ భాస్కర్) ... ఇలా చాలా దీర్ఘ కావ్యాలు వచ్చేయి. ఈ కోవలో వొచ్చిన మరో దీర్ఘకావ్యం శ్రీ శూద్రగంగ. ప్రముఖ సినీ గీతరచయిత సుద్దాల అశోక్ తేజ హృదయగిరి శిఖరాన ఉద్భవించి సహృదయ కేదారాలలో హరితరాగాలాలపిస్తూ హృద్యంగా సాగి సాహితీ సాగరంలో సంగమించే ఈ 'శ్రీశూద్రగంగ' వస్తువు విలక్షణమైనది. ఆలోచనాత్మకమైనది. నిర్వహణలో విశిష్టమైనది.

దేశమంటే మట్టి కాదు, దేశమంటే మనుషులు అని, మరీ ముఖ్యంగా పాడిపంటలు పొంగిపొర్లే దారిలో పాటుపడే కష్టజీవులే అని మహాకవి గురజాడ వారు చెవినిల్లుగట్టుకొని చెప్పేరు గదా.. అదుగో ఆ కష్ట జీవుల కోసమే, ఆ మట్టి మనుషుల కోసమే ఆవిర్భవించిందీ శూద్రగంగ. 'హరిపాదాల నుంచి పుట్టింది గంగమ్మ' అని, పాదాల నుంచి పుట్టిన వారు శూద్రులైతే గంగమ్మ పుట్టుక కూడా శూద్రపు పుటకే అని బల్లగుద్ది మరీ చెప్తున్నాడు కవి సుద్దాల అశోకతేజ. కవి చూపంటే ఇదీ. పావనగంగ, సురగంగ, భాగీరథి, జాహ్నవి మొదలైన పేర్లతో పిలిచి గంగమ్మ ఎవరిదో.. తాను ఇలకు అవతరించింది దేనికోసమో, ఎవరి కోసమో ఆ అసలు విషయాన్ని దాచి పెట్టినవారి గుట్టు బయట పెట్టి, మర్మాన్ని విప్పి చెప్పి 'సహస్ర వృత్తుల సమస్త శ్రామికులదీ శూద్రగంగ" అని ఎలుగెత్తి చాటుతున్నాడు కవి అశోక్ తేజ.

'పాదాలు నేలకు తాకని వారింట, చెమట పట్టని దేహాల వెంట, రెప్పపడని వారికంట నేనుండ నొల్లనని, మట్టి మనుషులతో మమేకమై నేలమ్మకు ఆకుపచ్చ కోకలు నేయడానికొచ్చిన సాలెల ఆడపడుచట ఈ శ్రీశూద్ర గంగ.. సమస్త వృత్తుల, సకల కులాల వారికీ సమన్యాయం చెయ్యడానికి ఇలకవతరించిందీ శ్రీ శూద్రగంగ' అంటాడు కవి. ఎంత గొప్ప ఊహ!

నిజానికి కవి వచన కవిత అన్నాడే గానీ చదువుతుంటే ఒక లయతో, ఒక తూగుతో ఒక గొప్ప సంగీతంలా మనకు తెలియకుండానే ప్రవాహంలా సాగిపోతుందీ కావ్యం. సహజంగా ఈ కవి గాయకుడు కూడా కావడం వల్ల కావ్యాన్ని చదువుతుంటే అదొక మధురగీతంగానే సాగిపోతుంది. అలల ఉయ్యాలలో ఊగుతూ, మెలికలు తిరుగుతూ శూద్రగంగ చెప్పే సంగతులు వినడమొక అనుభవం. ఆరంభించడమే మనకు తెలుస్తుంది.. చివరి వాక్యం చదివి 'మరి చదవడానికి లేదా? పాడుకోడానికి మరేమీ లేదా? అప్పుడే అయిపోయిందా? అని అనిపించి ఆ కావ్యగాన లహరుల్లోంచి బయటకు రాడానికి మనసుకు కొంత సమయం పడుతుంది.

వాక్యాల్ని వాడుపుగా మలిచి, ఎక్కడ తుంచి ఎక్కడ కలపాలో తెలిసిన గానభాష రహస్యం తెలిసిన కవి కలం వెంట ప్రవాహవేగంతో పదం వెంట పదంగా పరుగులు తీసి, అలలు అలలుగా అలరిస్తాయి వాక్యాలు. ఆ ఉరవడిలో, ఆ సంగీతఝరిలో మనల్ని మనం మరిచిపోతామని ఈ 'శ్రీ శూద్రగంగ' మరో మారు గుర్తుచేసింది.

అద్భుతమైన పదచిత్రాలు, మన ఊహలకందని కల్పనలు, మన పూర్వుల మార్గం నుంచి కొసింత పక్కకి వొసిలించి కొత్త దారుల్లోకి పాఠకుల్ని లాక్కు పోతాయి.

'భారతీయ ప్రాంతానికి,
పేదప్రజల గ్రామానికి,
చమట స్వర్గధామానికి వచ్చే బడుగు గంగ
ఎందుకు మరి భగీరథి అయినది?
ఎవరు ఇలా తన పేరును మార్చినది?
....
వక్రించిన పౌరాణిక శిక్షకు గురి అయినదా?
పక్షపాత కవుల కట్టుకథలకు ఎర అయినదా?' అని కవి

డా॥ సుద్దాల అశోక్ తేజ
శ్రీ శూద్రగంగ
వచన రూప కావ్యం

ప్రశ్నిస్తాడు.

'ద్రావిడులను దావులుగా
నిర్ధారించినది
ఇటు గంగను భగీరథిగా
పిలిచినది
జాహ్నవిగా మలచినది
ఈ కపట నాటక సంగ
పరివారమే' అని
నిక్కచ్చిగా ప్రకటిస్తాడు
'అసలు నీవు వస్తున్నది
కాయకష్ట కృషీవలుల
తిప్పలు పోగొడదామని,
ఇంటింటికి నవధాన్యపు
కుప్పలు రాబడుదామని'
శ్రమజీవుల కోసమే గంగ
భువికి దిగినందునే అది
శూద్రగంగ అనడమే
సరైనదని గంగ తరుపున
వకాల్తా పుచ్చుకుంటాడు.

'చమట జలాలతో మెరిసే చేతులంటే ఇష్టం
వాళ్ళ ధాతులంటే ఇష్టం
మడి అంటే ఇష్టం, మట్టితో ముడియంటే ఇష్టం
వరి మడులను తడిపే నీటి తడులంటే ఇష్టం'
....
'మట్టి అంటని పాదములు గల వీళ్ళా సుందరులు?
బురద గంధమలదుకునే భూజనులే సౌందర్యులు' అంటూ

తానెవరి తరుపున నిలబడి మాట్లాడుతున్నాడో స్పష్టం చేస్తాడు. శ్రమని, చమటని ఎంత గౌరవించకపోతే ఈ మాటలనగలుగుతాడు కవి. శివుని గురించి వెబుతూ సబ్బండ జాతికి బండ గుర్తుగా సాంబడే అని.. శూద్రజాతి పౌరుషుడు ఈశ్వరుడు అని నిర్ధారిస్తాడు. దివిజ గంగ భువికి దూకిన వైనాన్ని వర్ణిస్తూ,

'ఒక్కసారిగ దూకె గంగ ఆబోతై,
ముక్కుతాడును వేసె శివుడు ఒక రైతై' అని ఒక్క రైతుతో

ఆగకుండా సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలలోనూ గంగను ఊహిస్తాడు.

'శ్రీశ్రీశ్రీ శూద్రగంగ శూద్రావనికొస్తున్నది
......
పరమాత్ముని కాళ్ళు శూద్ర గర్భసంచులైతే
పరమాత్ముని చరణాలలో పురుడు పోసుకున్న
శుద్ధమైన అసలు సిసలు శూద్రగంగనంటున్నది' అంటూ

సన్నని వాగులా మొదలైన కావ్యం మెలికల మెలికలుగా ఉరుకులు పరుగులతో అలలు అలలుగా వరదై ఉప్పొంగి,

'ఏదేశంలో శూద్రులు నివశిస్తారో ఆ దేశంలో
గంగ ప్రవహిస్తుంది' అంటూ

ముగిసి పాఠకుని ఎడదకడలిలో కలిసి ఒక గొప్ప అనుభవాన్నిస్తుంది. ఎన్నో సొగసులు, ఇంకెన్నో చమత్కారాలు, మరెన్నో చమక్కులు నింపి శూద్రగంగను మన దోసిళ్లలో నింపుతాడు. అవన్నీ ఎవరికి వారు స్వయంగా ఆస్వాదిస్తేనే అందమూ ఆనందమూనూ. ఈ కావ్యానికి ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, అట్టాడ అప్పలనాయుడు, ప్రొఫెసర్ మాదాసు వినోదిని గార్ల మూడు ముందుమాటలున్నాయి. (అవింకా నేను చదవలేదు) అత్యంత హృద్యమైన ఈ కావ్యం ముద్రణ మరింత అందంగా ఆకర్షణీయంగా చూడగానే చదవాలనిపిస్తుంది. అశోక్ తేజ గతంలో 'శ్రమ కావ్యం,' 'నేను అడవిని మాట్లాడుతున్నాను' అనే దీర్ఘ కావ్యాలు వెలువరించేరు.. ఇప్పుడీ శ్రీశూద్రగంగ.

ఇది విశ్లేషణా కాదు, సమీక్ష కాదు, విమర్శ అంతకంటే కాదు, కేవలం కావ్యం చదివిన తక్షణ స్పందన మాత్రమే! ఇంత మంచి పుస్తకాన్ని ప్రేమతో ఇచ్చిన నా సోదరుడు అట్టాడ అప్పల్నాయుడుకి కృతజ్ఞతలు. ఇంత అందమైన కావ్యాన్ని పాఠకులకు కేవలం వంద రూపాయల వెలకే) కానుక చేసిన డా:సుద్దాల అశోక్ తేజ గారికి హృదయ పూర్వక అభినందనలు.

– గంటేడ గౌరునాయుడు

వేదిక, యడ్లపాడు
Symposium on
Telugu Drama and Femini

సాహిత్య అకాడమీ, 'వేదిక' (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం) సంయుక్త నిర్వహణలో జనవరి 26వ తేదీ ఆదివారం ఉదయం 'తెలుగు నాటకం– స్త్రీవాదం'పై సదస్సు పల్నాడు జిల్లా యడ్లపాడులో జరిగింది. ప్రారంభ సభ సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం సభ్యుడు వల్లూరు శివప్రసాద్ స్వాగతం ఉపన్యాసంతో మొదలైంది. సభ వేదిక అధ్యక్షులు ముత్తవరపు సురేష్ బాబు అధ్యక్షతన జరిగింది.

తెలుగు నాటకంలో మహిళా దృక్పథం

స్త్రీవాద రచయిత్రి వోల్గా కీలకోపన్యాసం చేస్తూ ... స్త్రీ చైతన్యాన్ని ఆశిస్తూ వారి సమస్యలపై వారి జీవితాలనే కేంద్రంగా చేసుకొని రచనలు జరిగాయని, గురజాడ తన కన్యాశుల్కం నాటకంలో స్త్రీల మనోభావాలకు రూపం ఇస్తూ, ప్రశ్నిస్తూ స్త్రీల గురించి అప్పటికీ సంఘంలో ఉన్న తేలిక మాటలకు భిన్నంగా పాత్రలను తీర్చిదిద్దారని వివరించారు. మధురవాణి పాత్ర ద్వారా స్త్రీ సాధికారతకు రూపం ఇచ్చారనీ, ఆ పాత్రతో పోల్చదగిన పాత్ర సృష్టి మళ్ళీ ఇంతవరకు జరగలేదని అన్నారు. ఆనాటి నాటకాల్లో స్త్రీల మధ్య సహకార భావన ఎంత అవసరమో చెప్పారని అన్నారు. సౌజన్య రావు పంతులు మధురవాణికి భగవద్గీతను ఇవ్వడం ద్వారా 'స్వపక్షం వారైనా– అధర్మపరులైతే వారికి వ్యతిరేకంగా యుద్ధం చేయమన్న సందేశాన్ని గురజాడ ఇచ్చారన్నారు. హిందూ కోడ్ బిల్ తయారవుతున్న నేపథ్యంలో చలం 'విడాకులు' నాటకం రాశారని; ఆధిపత్య భావజాలం, నాది అనే పొసెసివ్‌నెస్ నుంచి దూరంగా ఉండాలని 'ఊర్వశి' నాటకం ద్వారా చెప్పారని తెలిపారు. ఆత్రేయ నుంచి ఆకెళ్ల వరకు స్త్రీలలో వస్తున్న చైతన్య క్రమాన్ని రాస్తూ వచ్చారని అన్నారు. సాంకేతికతను, నూతన భావాలను కలిపి రాసి ప్రదర్శించగలిగేవాటికి మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు. సామాజిక మార్పుకు కీలకమైన పాత్రలను రూపొందించి రాయాలంటే బాగా అధ్యయనం చేసి రాయాలని అన్నారు. ముత్తవరపు సురేష్ కుమార్ ప్రారంభ సదస్సును ముగిస్తూ మాట్లాడారు.

మొదటి సదస్సుకు అంబటి మురళీకృష్ణ అధ్యక్షత వహిస్తూ .. పురుష జననాలకు స్త్రీలే కారకులన్న ప్రాథమిక సత్యాన్ని గుర్తించి స్త్రీలను గౌరవించాలి అన్నారు. ఆహారయోగ్యమైన వాటిని గుర్తించడంలో నాగరికతారంభంలో, వేలాదిమంది స్త్రీలు మరణించారన్న సత్యాన్ని మరిచిపోరాదని అన్నారు. స్త్రీలను గౌరవించడం, సమానత్వం పాటించటం పురుషుల కనీస కర్తవ్యం అన్నారు. 'నాటకం– స్త్రీవాదం' అన్న అంశంపై పత్ర సమర్పణ చేస్తూ డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు... 'ప్రపంచ నాటక చరిత్రలో ఎక్కడ స్త్రీ చైతన్యం కన్నువిప్పిందో చెబుతూ, నార్వేలో హెన్రిక్ ఇబ్సన్ చేసిన 'ఏ డాల్స్ హౌస్' నాటకం గురించి ప్రస్తావించారు. షేక్స్పియర్ తర్వాత అత్యంత ప్రజాదరణ పొందినవి ఇబ్సన్ నాటకాలే అన్నారు. కె.వి. గోపాలస్వామి, బళ్ళారి రాఘవ, పివి రాజమన్నార్ ... ఈ ముగ్గురు ఇబ్సన్‌ని బాగా చదివిన వారే అని అన్నారు. తప్పెవరిది?, ఏమి మగవాళ్ళు?, నిష్ఫలం నాటికల గురించి విశ్లేషించారు. స్త్రీ పాత్రను స్త్రీలే ధరించాలన్న నియమం పెట్టి బళ్ళారి రాఘవ కెవి పద్మావతితో నటింపచేశారని అన్నారు. హేతువాదం, స్త్రీవాద దృక్పథంతో నార్ల వారు 'సీత జోస్యం', చలం 'సీత అగ్ని ప్రవేశం' నాటకాలను రాశారని చెప్పారు. 1970 నుంచి ఇప్పటివరకు వచ్చిన నాటకాల్లో ... మాతృస్వామ్యం, లింగ వివక్ష, ఆర్థిక అసమానతల గురించి రాసిన నాటకాల గురించి ప్రస్తావించారు. ఎన్.తారక రామారావు క్షమయా ధరిత్రి, ఎం.వి.ఎఎస్ హరనాథరావు లేడి పంజా, మార్గశీర్ష శ్వేతపత్రం, మాంగల్యానికి మరో ముడి, విజయ భాస్కర్ రాసిన మబ్బుల్లో బొమ్మ మొదలైన నాటకాల్లో స్త్రీల చైతన్యం వెల్లివిరిసిన పాత్రలు ఉన్నాయన్నారు. మహా శ్వేతాదేవి రాసిన ద్రౌపది నాటక దర్శకుడు కన్హయలాల్ ద్రౌపది పాత్రను తన భార్య చేత వేయించి పతాక సన్నివేశంలో ఆ పాత్ర నగ్నంగా నిలబడి పురుషాధిక్యతను ప్రశ్నించడంలో చరిత్ర సృష్టించింది అన్నారు. మణిపూర్‌లో అత్యాచారానికి వ్యతిరేకంగా 12 మంది స్త్రీలు నగ్న ప్రదర్శన చేసిన ఘటనను ప్రస్తావిస్తూ మహిళా చైతన్యం స్త్రీని గతంలో లాగా మౌనంగా హింసను సహిస్తూ భరిస్తూ రోదిస్తూ ఉండే పాత్రలుగా కాక తీవ్ర స్వరంలో ప్రతిఘటించే క్రియాశీలక పాత్రలను రచయితలు రాశారని చెప్పారు.

తర్వాత 'పద్య నాటకం– స్త్రీ అభ్యుదయం' అన్న అంశంపై పత్ర సమర్పణ చేశారు డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు. స్త్రీ పాత్రలు లేని సాంఘిక నాటకాలు ఉన్నాయి కానీ, స్త్రీ పాత్రలేని పద్య నాటకాలు లేవన్నారు. వందేళ్ళ క్రితం వచ్చిన చింతామణి నాటకం నిషేధించబడటం గురించి ప్రస్తావిస్తూ, పద్య నాటకాల్లో స్త్రీ అభ్యుదయం ఇంకా చీకట్లోనే ఉందని అన్నారు. 'సంస్కరణోద్యమ నాటకాలు– స్త్రీ పాత్రలు' అన్న అంశంపై డాక్టర్ సిహెచ్.సుశీలమ్మ చాట్లాడుతూ, కన్యాశుల్కం, వరవిక్రయం, చింతామణి నాటకాల్లోని స్త్రీ పాత్రలను విశ్లేషించారు. బాల్య వివాహం, వితంతు సమస్యలు, సతీసహగమనం వంటి ఆనాటి సమస్యలను ఎత్తిచూపిన నాటకాల గురించి చెబుతూ ఆ నాటకాలను, రచన, శిల్పం, పాత్రల స్వభావాలను అర్థం చేసుకోవడానికి తప్పక చదవాలని అన్నారు.

రెండవ సదస్సుకు పిన్నమనేని మృత్యుంజయ రావు అధ్యక్షత వహిస్తూ... స్త్రీల సమస్యలన్నిటికీ మూలం సమానత్వం లేకపోవడం అని అన్నారు. 'ఆధునిక వీధి నాటకం– స్త్రీ వికాసం' అన్న అంశంపై దేవి పత్ర సమర్పణ చేస్తూ.. వీధి నాటకం అంటేనే సామాజిక నాటకమని పేర్కొన్నారు. ఇంతవరకు సమాజం గుర్తించని విషయాలను గుర్తింపచేయడంలో వీధి నాటకం ముందుంది అన్నారు. 'నాటకం పురుషాధిక్యత– స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం' అన్న అంశంపై నల్లూరి రుక్మిణి; 'నాటకం– స్త్రీ వైవాహిక సమస్యల చిత్రణ' అన్న అంశంపై జె. కనకదుర్గ పత్ర సమర్పణలు చేశారు.

సాహిత్య అకాడమీ నగరాలు పట్టణాల్లో సదస్సులు నిర్వహించే ఆనవాయితీకి భిన్నంగా పూర్తిగా గ్రామీణ వాతావరణం కలిగి ఉద్యమాలకు, నాటకాలకు పేరుపడ్డ యడ్లపాడులో నిర్వహించటం అభినందనీయం. సదస్సుకు పలనాడు ప్రాంతాల్లోని మహిళా ఉపాధ్యాయులు, కార్యకర్తలు, వ్యవసాయ రంగ మహిళలు ఎక్కువగా హాజరు కావడం; పత్ర సమర్పకులు విశేష అధ్యయనం, ఆలోచనాత్మక ధోరణిలో ప్రసంగించడం స్ఫూర్తిదాయకంగా ఉంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల, పాత ఒంగోలు జిల్లాలకు చెందిన తొమ్మిది నాటక పరిషత్తుల వారు ఒకే గొడుగు కింద 'వేదిక' పేరుతో ఐక్యంగా నిలబడి ఈ సదస్సును నిర్వహించడం అభినందనీయం.

– మల్లేశ్వరరావు ఆకుల
94400 07374

రంగురంగుల మాతృత్వం యోధ

'మాతృత్వం ఒక అందమైన వరం', 'అమ్మంటే దేవుడితో సమానం' ... ఇలా తల్లి గురించి, మాతృత్వం గురించి జీవితంలో ఒకసారైనా రాయని రచయితలు, కవులు లేరు, మాట్లాడని వారూ లేరు. అమ్మతనం అనే మధురమైన భావన వెనుక ఎన్నో కోణాలుంటాయి. ఎంత తల్లైనా ఆమెకూ కొన్ని పరిమితులు, ఆలోచనలు ఉంటాయి. అలాగే ఆమె పిల్లల పట్ల కోపంగానో, మరో విధంగానో ప్రవర్తిస్తే 'ఆమె అసలు తల్లేనా?' అంటూ రకరకాలుగా మాట్లాడేవాళ్ళూ ఉంటారు. అమ్మ కావడం ఆడదాని జీవితంలో ఒక భాగమై పోతుంది. పెళ్ళైన స్త్రీ అమ్మ కాలేకపోతే సమాజం బతకనివ్వదు, గొడ్రాలంటూ దుయ్యపడుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చర్చించవచ్చు. తల్లులకూ భావోద్వేగాలుంటాయి. తమదైన కొన్ని ఆశలు, కోరికలు ఉంటాయి. అమ్మలకూ జీవితముంటుంది కానీ అమ్మతనం కొన్ని చట్రాల్లో బంధింపబడుతుంది. అమ్మంటే ఒక నిర్వచనం ఉంటుంది. అమ్మ ఇలాగే ఉండాలి కానీ మరోలా ఉండకూడదనే పరిమితులను సమాజం బలవంతంగా రుద్దుతుంది.

భండారు విజయ మాతృత్వం అనే సబ్జెక్ట్‌పై ఎంతో మందితో చర్చించి, 'మాతృత్వం : భిన్న వ్యక్తీకరణలు' అనే విషయంపై 53 కథలతో ఒక సంకలనం తీసుకొచ్చారు. ఆ పుస్తకానికి 'యోధ' అని నామకరణం చేసి హైదరాబాద్‌లో ఆవిష్కరణ సభ చేశారు. ఈ సంకలనంలోని ప్రతి కథా అమ్మ చుట్టూ, అమ్మతనం చుట్టూ తిరుగుతుంటాయి. రత్నసుమతి గారి 'తిరిగి రాని వసంతం' కథలో ... భర్త పెట్టే బాధలు భరించలేక అతడి నుంచి విడిపోయిన కవిత, ఇద్దరు పిల్లలను పెంచడంలో అలసిపోతుంటుంది. ఆ ఒత్తిడి వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటుంది. స్నేహితురాలి సలహాతో మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని ఉన్నా అమ్మతనం వల్ల, పిల్లల పట్ల ఉన్న ప్రేమ బాధ్యతల వల్ల ముందుకు అడుగు వేయలేకపోతుంది. చిన్న కథలో చెప్పాల్సిన విషయాన్ని చక్కగా చెప్పారు రచయిత్రి. కె.వరలక్ష్మి 'శత్రువు' కథలో ఒక తల్లి కోడలు తనను ఎంత ఇబ్బంది పెడుతున్నా, ఒక రకంగా మానసికంగా హింసిస్తున్నా కొడుకుపై ప్రేమను చంపుకోలేక అక్కడే ఉండడానికి ప్రయత్నం చేస్తుంది. కథ చివరలో 'నాకేం భయం? నేను

కథలు
యోధ
మాతృత్వం : భిన్న వ్యక్తీకరణలు
సంపాదకులు
విజయ భండారు

ఆడపిల్లల తల్లిని' అని కోడలు అనుకోవడం చదవగానే ఒళ్ళు ఝల్లుమంటుంది. ఎండపల్లి భారతి 'తలపండిన గొడ్రాలు'లో పిల్లలు పుట్టని ఒక స్త్రీని అందరూ గొడ్రాలు అంటూ ఎలా నోటికి వచ్చినట్టు మాట్లాడతారో తనదైన శైలిలో కథగా చెబుతారు. ఎవరైనా బయటకు వెడుతుంటే 'గొడ్డుది ఎదురైంది' అంటూ చులకన చేస్తారు అని కథలోని పాత్ర వాపోతుంది. గిరిజ పైడిమర్రి ... బిడ్డల పెంపకంలో తల్లి మాత్రమే కాదు; తండ్రి కూడా బాధ్యత వహించాలని 'ఫాదర్ హుడ్' కథలో చెబుతారు. పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న స్త్రీలు సంసారం, పిల్లల బాధ్యత అనే చట్రంలో ఇరుక్కుని దానికే పరిమితమై, బయటపడాలన్నా పడలేక, తమ వంతు బాధ్యతగా ఏదైనా చెయ్యాలన్నా చెయ్యలేక కనబడని ఉక్కుకౌగిలిలో ఎలా నలిగిపోతారో చెప్పే కథ పద్మకుమారి 'పొద్దు వాలని మనుషులు'. సులోచన, ప్రమీల చిన్నప్పటి నుంచీ స్నేహితులు. ప్రమీల పోరాటబాట పట్టి ముందుకు వెడితే, సులోచన పెళ్ళి చేసుకుని ప్రమీలను అనుసరించాలన్నా అనుసరించలేని పరిస్థితిలోకి వెళ్ళిపోతుంది. చివరకు స్నేహితురాలికి ఆరోగ్యం బాగాలేదని తెలిసి తన దగ్గరకు బయలుదేరుతుంది. కథ మొత్తం చక్కగా నడిపించారు రచయిత్రి. కల్పన రెంటాల 'నో రిగ్రెట్స్' కథ ఇప్పటి సమాజంలోని యువత మనస్తత్వాలను అద్దం పడుతుంది. పిల్లలు వద్దనుకున్న శ్రీజను తల్లిదండ్రులు, అత్తమామలు వత్తిడి చేస్తారు. దానికి ఆమె చెప్పిన సమాధానం 'వీశోష్ట్రవతీష్ట్రశీసీ ఔం అశీ ఎఎ ఖబజూ శీట్ ము. భర్త కూడా ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తాడు. పెళ్ళై కొన్నాళ్ళు కాగానే వారిపై పిల్లలను కనడం గురించి ప్రశ్నల వర్షం కురవడం మొదలవుతుంది. ముందు ఇంట్లో వాళ్ళే అడగడం మొదలుపెడతారు. ఇది నిత్యం మన చుట్టూ జరిగే తంతు. ఇక నల్లూరి రుక్మిణి 'అజమాయిషీ' కథలోకి వెడితే ఆశ్చర్యమనిపిస్తుంది. అమ్మలు ఇలా కూడా ఉంటారా? అని ఆలోచించి మనకు మింగుడుపడదు. తల్లి అంటే ఇలాగే ఉండాలని మన బుర్రలలో ఎన్నో ఏళ్ళుగా ఒక విషయం నాటుకుపోయి ఉంటుంది. ఈ కథలో తల్లి పుట్టింటి సంబంధం కోసం చదువు మానిపించి మరీ పెళ్ళి చేస్తుంది. పెళ్ళైన కొన్నేళ్ళకే కూతురి భర్త చనిపోతే ఇంకా ముప్పైల వయసులో ఉన్న కూతురిపై ఆజమాయిషీ చేస్తుంది కానీ ఆమెకు మళ్ళీ పెళ్ళి చేద్దామని ఆలోచించదు సరి కదా, కనీసం కూతురి మనసులో ఏముందో తెలుసుకోవడానికి సైతం ప్రయత్నించదు.

ఇలా ఈ 53 కథల్లో మనకు తల్లులు రకరకాల రంగులలో కనబడతారు. శారీరక శ్రమ చేసే తల్లులు, మనసును జోకొట్టుకుంటూ ముందుకు సాగే తల్లులు ... ఇలా పలు రకాల అమ్మలను మనం చూస్తాం అయితే తల్లులను, మదర్ హుడ్‌ను గ్లోరిఫై చెయ్యకుండా వారి జీవితాల్లోని సమస్త వెలుగు చీకట్లను ఈ కథల ద్వారా ప్రపంచానికి తెలియజేయడానికి విజయ ఎత్తుకున్న బాధ్యతే ఈ 'యోధ'. 'యోధ'ను చదవాలనుకుంటే 88019 10908 నంబరులో సంప్రదించండి

– పద్మావతి రాంభక్త
99663 07777

కథా సంపుటాలకు ఆహ్వానం

'వెన్నెల సాహితీ పురస్కారం–2024' కోసం 2023 – 24లో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు (4) ప్రతులను ఈ కింది చిరునామాకు 31 మార్చి 2025లోపు పంపాల్సిందిగా రచయితలను కోరుతున్నాం. సిద్ధిపేటలో జరిగే సాహిత్య కార్యక్రమంలో విజేతకు నగదు పురస్కారం అందజేస్తాం. చిరునామా : పి.యాదగిరి, ఇం.నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్డు –2, రంగధాంపల్లి చౌరస్తా దగ్గర సిద్ధిపేట – 502103. మొబైల్ : 92999 09516, 98482 61284.

– పర్కపెల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శి, వెన్నెల సాహితీ సంగమం

రంగనాయకమ్మ స్మారక సాహిత్య పురస్కారం కోసం ...

శ్రీలేఖ సాహితి, వరంగల్లు వారు 2024 సంవత్సరానికి విశిష్టాద్వైత సాహిత్యమునకు చెన్నమనేని రంగనాయకమ్మ గారి స్మారక సాహిత్య పురస్కారం ఇవ్వడానికి నిర్ణయించింది. ఈ పురస్కారం విశిష్టాద్వైత సాహిత్య గ్రంథాలకు మాత్రమే! అనువాదాలు పరిశీలించబడవు. పద్యకావ్యాలు, వ్యాస సంపుటాలు పంపవచ్చు. పుస్తకం 2020 – 2024 సంవత్సరాల్లో ప్రచురించబడి ఉండాలి. పరిశీలన నిమిత్తం నాలుగు ప్రతులు 31 మార్చి 2025 లోగా పంపాలి. ఏప్రిల్ లో (ఉగాదికి) పురస్కారం కింద రూ.5000 నగదు, శాలువా, మెమొంటోతో సత్కరించబడుతుంది. పుస్తకాలు పంపవలసిన చిరునామా : డాక్టర్ టి. శ్రీరంగస్వామి అధ్యక్షులు, శ్రీలేఖసాహితి ఇం.నం. 27-14-53, లిటిల్ సోల్జర్స్ స్కూల్ లేన్, హసన్ పర్తి – 506371, హన్మకొండ. ఫోన్ నెం. 99498 57955.

– డా. టి.శ్రీరంగస్వామి అధ్యక్షులు, శ్రీలేఖ సాహితి

16న ముగ్గురు కవుల సప్తతి

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో 16 – 2- 2025 ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి సమావేశ మందిరంలో కందుకూరి శ్రీరాములు, డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, డాక్టర్ నాళేశ్వరం శంకరం ముగ్గురు కవుల సప్తతి సభ జరుగుతుంది. దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కొండపల్లి నీహారిణి, బైస దేవదాస్, డాక్టర్ మామిడి హరికృష్ణ, దేవి ప్రసాద్ నరేష్ చారి, డాక్టర్ బెల్లంకొండ సంపత్ కుమార్, డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, కందాళై రాఘవాచార్య, డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గుండెల్లి ఇస్తారి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, డాక్టర్ వి శంకర్, గడ్డం సులోచన తదితరులు పాల్గొంటారు.

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా.. prajasavvadi@gmail.com

ఒక మనిషి చదివే పుస్తకాలను బట్టి అతడు ఏమిటో తెలుస్తుంది.

– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి

సోమవారం, 10 ఫిబ్రవరి 2025

‘తెలివి’ తెల్లారకూడదు!

‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్’– పొడి అక్షరాలలో ‘ఏఐ’ – ఇంతింతై వటుడింతయై అన్నట్టుగా రోజు రోజుకూ విశ్వరూపాన్ని సంతరించుకుంటోంది. ‘కృత్రిమ మేధ’గా మనం అనువదించుకుంటున్న ఆ మాట చూస్తుండగానే మన నిత్య వ్యవహారంలో భాగమైపోతోంది. అమెరికా అభివృద్ధి చేసిన ‘చాట్ జీపీటీ’ అనే ఏఐ లాంగ్వేజ్ నమూనాకు పోటీగా చైనా అభివృద్ధి చేసిన ‘డీప్ సీక్’ కొన్ని రోజులుగా చర్చనీయమవుతోంది. చాట్ జీపీటీ కన్నా ఇది మెరుగైన సాంకేతికత అనీ, ఏఐ రంగంలో చైనా పురోగమనాన్ని ఇది చాటి చెబుతోందనీ అంటున్నారు. ఇప్పటికే ఏఐ రంగంలో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా; చైనా, బ్రిటన్ రెండు, మూడు స్థానాలలో ఉన్నాయని సమాచారం. కృత్రిమమేధా రంగంలో ముందున్నవారే ప్రపంచాన్ని ఏలగలరని ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేసిన వ్యాఖ్య, ఈ సాంకేతికాద్భుతం ప్రపంచాన్ని ఏ స్థాయిలో ప్రభావితం చేయబోతోందో స్పష్టం చేస్తోంది.

ఇంతటి కీలకరంగంలో మనదేశం ఏ స్థానంలో ఉందన్న ప్రశ్న తలెత్తడం సహజమే. మరీ వెనకబడి లేము కానీ, చైనా మొదలైన దేశాలతో పోల్చితే వెళ్లవలసినంత ముందుకూ వెళ్లలేదనే మాట వినిపిస్తోంది. ఇప్పటికైనా వేగాన్ని పెంచుకుని పోటాపోటీగా మన ఉనికిని స్థాపించుకోగల సత్తా మనకుందన్న భావన వ్యక్తమవుతోంది.

అదలా ఉంచితే, ఏఐ సాంకేతికత సృష్టించే అద్భుతాలను సామాజిక మాధ్యమాల తెరపై ఇప్పటికే చూస్తున్నాం. ఇటీవలి కుంభమేళాలో కొందరు విదేశీ ప్రముఖులు కాషాయవస్త్రాలు ధరించి పవిత్ర స్నానాలు చేసినట్టు చూపే చిత్రాలు సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్షమయ్యాయి. అవి ఏఐ సాంకేతికతతో సృష్టించినవని చెప్పకపోతే నిజమని నమ్మేసే ప్రమాదం ఉండనే ఉంటుంది. ఇలాగే, తను కుంభమేళాలో స్నానం చేస్తున్నట్టు చూపించే ఏఐ చిత్రం ఒకటి చక్కర్లు కొడుతుండటం గమనించి ప్రముఖ సినీనటుడు ప్రకాశ్ రాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే రకరకాల మాధ్యమాలలో హోరెత్తుతున్న నకిలీ సమాచారానికి తోడు ఇప్పుడు నకిలీ చిత్రాలు కూడా అడుగు పెట్టాయనీ, వీటికి వ్యతిరేకంగా తన వంతు పోరాటంగా పోలీసులకు ఫిర్యాదు చేశాననీ ఆయన చెప్పుకొచ్చారు. నిక్కమైన సమాచారానికి నకిలీ వార్తల బెడద విడుపులేని రాహుగ్రహణంగా మారిన మాట నిజం. మంచి, చెడులు రెంటికీ పనికొచ్చే రెండంచుల కత్తి లాంటి సాంకేతిక సాధనాల జాబితాలో ఏఐ కూడా ఇలా చేరిపోతోంది. ఈ ప్రమాదానికి అడ్డుకట్ట వేయడం, ఏఐలో పురోగతిని సాధించడాన్ని మించిన సవాలు కాబోతోంది.

ఇంకోవైపు, ఆకాశమే హద్దుగా ఏఐ సాంకేతికత సాధించగల అద్భుతాలను ఊహించుకున్న కొద్దీ, అది అచ్చంగా మాయల ఫకీరు చేతిలోని మంత్రదండాన్ని గుర్తుచేస్తుంది. తలకాయలను, వేషభాషలను మార్చడమే కాదు; స్త్రీ, పురుషుల రూపాలను కూడా అది తారుమారు చేయగలదు. ఆ విధంగా మంత్రాలూ, మహిమలతో నిండిన పౌరాణిక మాయాప్రపంచాన్ని కొత్తరూపంలో కళ్ళముందు ఆవిష్కరించగలదు. ఉదాహరణకు రామాయణంలోనే చూడండి, యుద్ధరంగంలో రాముని ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి ఇంద్రజిత్తు ఒక మాయాసీతను సృష్టించి తన రథం మీద యుద్ధభూమికి తీసుకొచ్చి అందరూ చూస్తుండగా ఆమెను నరికి చంపుతాడు. రాముడంతటివాడు కూడా ఆమెను నిజ సీత అనుకుని దుఃఖంతో మూర్ఛపోతాడు. వినాయకుడికి ఏనుగు తలను, మరో పౌరాణిక పాత్రకు గుర్రం తలను అతికించడమూ పురాణాలలో కనిపిస్తాయి. ఒక రాకుమారుడు వేటకెళ్లి ఓ వనంలోకి ప్రవేశించగానే స్త్రీగా మారిపోయినట్టు చెప్పే కథ ఒకటి మహాభారతంలో ఉంది. అభిమన్యుని వధకు కారణమైన సైంధవుని సూర్యాస్తమయంలోగా చంపి తీరుతానన్న అర్జునుని ప్రతిజ్ఞను నిజం చేయడానికి కృష్ణుడు కృత్రిమ సూర్యాస్తమయాన్ని సృష్టిస్తాడు. ఏఐ సాంకేతికత ఇటువంటి అనేకానేక ఉదంతాలను తలపించి మరిపించే ఒక సరికొత్త మాంత్రిక ప్రపంచాన్ని సృష్టించి ఏది నిజమో, ఏది అబద్ధమో పోల్చుకోలేని ద్వైదీస్థితిలో మనిషిని నిలబెట్టే అవకాశం పుష్కలంగా ఉంది.

మనిషి సృష్టించిన సాంకేతికత తిరిగి ఆ మనిషినే పునఃసృష్టి చేయడం మానవ చరిత్ర పొడవునా జరుగుతూ వచ్చింది. రాతియుగంలో మనిషి కనిపెట్టిన శిలాసాధనాలే అన్నసంపాదనలో కొత్త మార్గాలు తెరచి భద్రమైన మనుగడ దిశగా అతణ్ణి ముందడుగు వేయించాయి. అతను కనిపెట్టిన ధనుర్బాణాలే ఆ అడుగుకు మరో పదడుగులు జమచేశాయి. ఆ తర్వాత అతనే కనిపెట్టి విడిచిపెట్టిన చక్రం వందల వేల సంవత్సరాలలో వేనవేల రూపాల్లోకి మారి, అతణ్ణి కూడా మార్చి ప్రపంచ యాత్ర చేయిస్తూ అప్రతిహతంగా తిరుగుతూనే ఉంది. ఆహార సేకరణ, పెరటి సాగు దశలను దాటి మనిషి సృష్టించిన వ్యవసాయ సాంకేతిక జ్ఞానమే, తిరిగి అతడికి నాగరికుడిగా కొత్త అవతారాన్ని సంతరించి సరికొత్త యుగావిష్కరణ వైపు నడిపించింది. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, మనిషి తను సృష్టించిన సాంకేతికతను తన అదుపులో ఉంచుకున్నప్పుడే అది ఉపయుక్తంగా మారి అతని మనుగడను ఎవరెస్టు ఎత్తుకు తీసుకెడుతుంది; కళ్లేలు వదిలేస్తే సమస్యలు, సంక్షోభాల లోయల్లోకి పడదోస్తుంది. ఏఐ లాంటి ఎంతటి అత్యాధునిక సాంకేతికత అయినా ఇందుకు మినహాయింపు కాదు. మనిషి సృష్టించిన కృత్రిమ మేధ మనిషి మేధనే కృత్రిమంగా మార్చివేయకుండా చూసుకోవాలి; ప్రపంచాన్నే మయసభగా మార్చి మాయావుల పరం చేయకుండా జాగ్రత్తపడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.7.20 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పునర్వసు సా.6.40 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.6.49 నుండి 8.21 వరకు, తదుపరి రా.2.46 నుండి 4.22 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.40 నుండి 1.28 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** సా.4.20 నుండి 5.55 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం: 5.55
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

నిక్కచ్చిగా తొలి పాతికేళ్ల ‘సోర్స్ కోడ్’!

విశ్లేషణ

తెంపల్లె వేణుగోపాలరావు

మహాకవి పోతన రచించిన ఒక పద్యం ‘ఒక సూర్యుండు సమస్త జీవులకు దానొక్కక్కడై తోచు’ అని మొదలవుతుంది. శత కోటీశ్వరుడు, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాకుడు బిల్ గేట్స్‌ను ప్రపంచంలో ఒక్కొక్కరు ఒక్కోలా చూస్తారు. కొందరికి ఆయన తిరుగులేని విజయం సాధించిన కార్పొరేట్ దిగ్గజం. రాగల దశాబ్దాల్లో ప్రపంచాన్ని శాసించే సాంకేతికతను ముందే పసిగట్టి, అందుకోసం యాభైయ్యేళ్ల నాడే ఒక సంస్థను స్థాపించిన దార్శనికుడు. మరికొందరికి ఆయన దాతృత్వశీలి. తన స్వచ్ఛంద సంస్థ మెలిందా–గేట్స్ ఫౌండేషన్ ద్వారా వెనకబడిన దేశాల్లో ఎన్నో సేవా కార్యక్రమాల్లో, ఆరోగ్య పరిరక్షణలో పాటుపడుతున్న మహనీయుడు. కానీ అనేకులకు ఆయన అనుమానాస్పదుడు. ఆయన సేవా కార్యకలాపాల వెనక స్వప్రయోజనాలున్నాయని వారు సంశయిస్తారు. బిల్ గేట్స్ గురించి చాలా పుస్తకాలొచ్చాయి. అందులో ఆయన్ను కీర్తించినవీ ఉన్నాయి, తూర్పారబట్టినవీ ఉన్నాయి. కానీ ఇంతకూ బిల్ గేట్స్ ఎవరు? తన గురించి తాను చెప్పుకోవాల్సి వస్తే ఏం చెబుతారు? వీటన్నిటికీ జవాబుగా ఫిబ్రవరి 4న తన స్వీయచరిత్ర ‘సోర్స్ కోడ్–మై బిగినింగ్స్’ పుస్తకం వెలువరించారు. మొత్తం మూడు భాగాలుగా వచ్చే స్వీయచరిత్రలో ఇది తొలి భాగం. ఇందులో బాల్యం నుంచి తొలి పాతికేళ్ల ప్రస్థానం ఉంది. బిల్ గేట్స్ వరకూ పుస్తకం వచ్చిన సందర్భం అనేక విధాల ముఖ్యమైనది. ఆయనకు ఈ సంవత్సరంతో 70 ఏళ్లు వస్తాయి. మైక్రోసాఫ్ట్ కంపెనీ స్థాపించి 50 ఏళ్లవుతుంది. దివంగతుడైన ఆయన తండ్రికి ఇది శతజయంతి సంవత్సరం. ఏడాదిన్నర క్రితం తన గురించి తాను రాసుకోవాలనిపించిందని, ఇందులో తన ఎదుగుదలకు కారకులైన తల్లితండ్రుల గురించీ, కుటుంబం గురించీ, ఇద్దరు బాల్యస్నేహితుల గురించీ చెప్పాలనిపించిందని ఆయనే ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. తన సమకాలీకులతో పోలిస్తే ఆయనెప్పుడూ కొన్ని దశాబ్దాల ముందు ఆలోచించేవారని బిల్ గేట్స్ గురించి ఇప్పటికే చాలామంది చెప్పారు. కానీ ఈ పుస్తకం కోసం ఆయన కొన్ని దశాబ్దాల వెనక్కి వెళ్లారు. ఒక మనిషి ఎదుగుదలకైనా, పతనానికైనా కుటుంబ ప్రభావం, పెంపకం ఎలా దోహదపడతాయో ఈ పుస్తకంలో వివరించారు.

తండ్రికి కోపం తెప్పించిన సందర్భం

స్వీయచరిత్ర రాయదల్చుకున్నవారికి నిజాయితీ ముఖ్యం. తన తప్పొప్పులన్నిటినీ నిర్భయంగా చెప్పగలిగినప్పుడే ఆత్మకథకు పూనుకోవాలి. తాను మానవాతీతుడినన్న అహం ఉండకూడదు. తన ఎదుగుదల ఎలా సాధ్యమైందో, జీవితం ఏయే మలుపులు తిరిగిందో, తన ప్రతి అడుగులోనూ ఎవరెవరు అండదండలు అందించారో, ఎవరిపట్ల తాను నిర్దయగా వ్యవహరించాడో, ఆ తప్పును ఏ దశలో గుర్తించాడో, ఎలా సరిదిద్దుకున్నాడో చెప్పగలగాలి. ఈ చట్రంలో ఇమిడే స్వీయచరిత్రలు మనదగ్గరే కాదు, ప్రపంచవ్యాప్తంగా కూడా చాలా తక్కువ. బిల్‌గేట్స్ తన గురించి తాను ఏం చెప్పుకుంటారన్న ఆసక్తి అందరిలో ఉంటుంది. తొలి భాగం ‘సోర్స్ కోడ్’ ఆ విషయంలో అందరి మన్ననలూ పొందే అవకాశం ఉంది. ఇది బాల్యం గురించే కనుక, ఆ దశలో ఆయన్ను వివాదాలు చుట్టుముట్టే అవకాశం లేదని అనుకుంటారు. కానీ బాల్య జీవితంలోని కొన్ని అంశాలను నిస్సంశయంగా చెప్పటం ద్వారా బిల్ ఫుల్‌మార్క్‌లు కొట్టేశారు.

అది అమెరికా కనుక 1970ల నాటికే అందరికీ కంప్యూటర్ గురించి తెలిసిపోయింది. పర్సనల్ కంప్యూటర్ల వాడకమూ మొదలైంది. కాకపోతే ఇప్పటిలా నిత్యావసర వస్తువు కాదు. బాగా ధనవంతులకు మాత్రమే సాధ్యపడే విలాసవంతమైన ఉపకరణం. అలాగని బిల్ గేట్స్ తల్లిదండ్రులు నిరుపేదలు కాదు. వారి కుటుంబం ఇతరులతో పోలిస్తే సుఖంగానే జీవనం సాగించేది. తండ్రి గేట్స్ సీనియర్ సమాజం పట్లా, కుటుంబం పట్లా ఎంతో నిబద్ధతతో ఉండేవాడని బిల్ గుర్తు చేసుకున్నారు. ఆచితూచి వ్యవహరించేవాడని, పిల్లల పట్ల దయతో, శ్రద్ధాసక్తులతో ఉండేవాడని రాశారు. ఆయన ఒకే ఒకసారి ఉగ్రుడయ్యాడట. అది కూడా తన లోపమేనని ఆయనంటారు. డైనింగ్ టేబుల్ దగ్గర ఏదో విషయమై మూర్ఖంగా వాదించేసరికి ఉండబట్టలేక ఆయన గ్లాసులో ఉన్న నీటిని బిల్ గేట్స్ ముఖంపై చిమ్మారట. ‘థాంక్స్ ఫర్ ద షవర్’ అంటూ అక్కడి నుంచి బిల్ నిష్క్రమించారు. ‘ఎప్పుడూ ఎంతో శాంతంగా, ప్రేమగా ఉండే తండ్రిని నా ప్రవర్తన ద్వారా సహనం కోల్పోయేలా చేశాను’ అని బిల్ రాశారు. ‘చిన్నప్పుడంతా ‘జటిలమైన కొడుకు’గానే ఉండేవాడిని’ అంటారు. ‘ఇప్పుడైతే ఆ ప్రవర్తన చూసి కచ్చితంగా ఆటిజంతో బాధపడేవాడిగా పరిగణించివుండేవారు’ అని చెబుతారు.

చిన్ననాడే మద్యపానం, గంజాయి, ఎల్ఎస్‌డీ వంటివి అలవాటైన సంగతి, వాటికి దూరమైన సంగతి కూడా బిల్ దాచుకోలేదు. కొన్ని విషయాల్లో తమ పిల్లాడు ఎందుకంత ఆలోచిస్తాడో, ప్రవర్తిస్తాడో తెలుసుకోవటానికి అవసరమైన పుస్తకాలు, ఇతరేతర సమాచారం తల్లితండ్రులకు ఉండేది కాదంటాడు. ‘పెద్దవాళ్లను కలవటం, వారితో చర్చించటం, వారి సలహాలు, సూచనలు పాటించడం అనే సంస్కృతిని అమ్మానాన్న, అమ్మమ్మ అలవాటు చేశారు. అందుకే ఎక్కడికి తీసుకెళ్లినా పెద్దవాళ్లతో చొరవగా మాట్లాడటం, వారిని ప్రశ్నలతో వేధించటం, సంతృప్తికరమైన జవాబు వచ్చేవరకూ ఆ ప్రశ్నల పరంపరను కొనసాగించటం అలవాటైంది. అది జీవితంలో ఎదగటానికి తోడ్పడింది’ అని బిల్ గేట్స్ అభిప్రాయపడతారు. ముఖ్యంగా అమ్మ, అమ్మమ్మ తనలో పోటీతత్వాన్ని ఎంతగానో పెంచారంటారు. తన జీవితంలో చోటుచేసుకున్న ఈ అంశాలను చెప్పటం అవి అందరికీ ఉపయోగపడతాయన్న ఉద్దేశమేనని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. తన పుట్టుకే అయాచితంగా అదనపు హక్కు (ప్రివిలేజ్)ను ఇచ్చిందని నిజాయితీగా ఒప్పుకోవటం ప్రశంసించదగ్గది. అప్పటికే జాతిపరమైన విభేదాలతో నిలువునా చీలివున్న సియాటెల్ సమాజంలో తాను శ్వేతజాతిలో పుట్టడం, అందులోనూ మగవాడిని కావటం ఎంతో కలిసొచ్చిందని బిల్ స్వీయాభిప్రాయం. పుట్టుకతోనే ప్రతిభావంతులమని స్వోత్కర్షకు పోయేవారికి ఇదొక కనువిప్పు.

మేము లేకుండా కంప్యూటర్ విప్లవమా?

హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి మధ్యలోనే చదువుకు స్వస్తి చెప్పేనాటికి బిల్ గేట్స్‌కూ, ఆయన బాల్యస్నేహితుడు, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు పాల్ అలెన్‌కూ, 17 యేళ్లవయసులోనే మృత్యువాత పడిన మరో స్నేహితుడు కెంట్ ఇవాన్స్‌కూ పర్సనల్ కంప్యూటర్‌పై అవగాహన ఉంది. ఎయిత్ గ్రేడ్‌లో ఉన్నప్పుడు పాఠశాల కొచ్చిన కంప్యూటర్‌తో ఎక్కువ సమయం గడిపేందుకు కంప్యూటర్‌లో బగ్స్ సృష్టించామని, అది కనిపెట్టి తననూ, ఇవాన్స్‌నూ వెళ్లగొట్టారని బిల్ గేట్స్ చెప్పారు. తర్వాత కాలంలో కంప్యూటర్లలో బగ్స్ గుర్తించి తొలగించే పనికి కుదిరి కొంత డబ్బు సంపాదించిన ఉదంతాలూ ఉన్నాయి. కంప్యూటర్‌ను నిర్వహించే సీసీసీ కంపెనీ మూతపడటంతో దాని నిర్వహణ భారాన్ని స్కూల్‌లో తనకు అప్పగిస్తే, మిత్రుడు అలెన్ సాయంతో దాన్ని పూర్తిచేశారు. తన తొలి వ్యాపార భాగస్వామిగా ఇవాన్స్ తనతో జతకట్టి ఆత్మవిశ్వాసాన్ని పెంచాడని, అతని మరణం ఒక్కటే తన బాల్యంలో చోటుచేసుకున్న విషాదకర సంఘటనని ఆయన వివరిస్తారు. తమ ప్రమేయం లేకుండానే కంప్యూటర్ విప్లవం వెల్లువెత్తుతుందేమోనన్న ఆత్రుత గేట్స్‌కూ, అలెన్‌కూ ఉండేదంటే... తాము అందులో పాలుపంచుకుని ప్రముఖంగా ఎదగాలనుకున్నారంటే వారి తపన ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవచ్చు. అప్పుడే ఈ ఇద్దరు మిత్రులూ ఎంఎస్–డాస్ ఆపరేటింగ్ సిస్టమ్, బేసిక్ వంటి సాఫ్ట్‌వేర్ రూపకల్పనలు చేయగలిగారు.

ఇవ్వాల్టిరోజున మైక్రోసాఫ్ట్‌లో బిల్ గేట్స్ వాటాల విలువ 10,780 కోట్ల డాలర్లు. ప్రపంచంలో ఆయన 13వ అతి పెద్ద ఐశ్వర్యవంతుడు. 2021లో ఆయనతో విడిపోయిన మాజీ భార్య మెలిందా ఫ్రెంచ్ గేట్స్ వాటాలు 3,040 కోట్ల డాలర్ల పైమాటే. అన్నట్టు, దీని అనంతరం రాబోయే పుస్తకాల్లో చాలా వివాదాస్పద విషయాలుంటాయి. ‘సోర్స్ కోడ్’ విడుదల సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలు గమనిస్తే ఆయన దేన్నీ దాచదల్చలేదని స్పష్టమవుతుంది. మిత్రుడు అలెన్‌ను దూరం చేసుకోవటం తప్పేనని అంగీకరించారు.

మైక్రోసాఫ్ట్‌లో కొందరు మహిళా ఉద్యోగినులతో తన వివాహేతర సంబంధాలు, లైంగిక నేరాలకు పాల్పడ్డాడని ఆరోపణలొచ్చిన ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తనకున్న అనుబంధం, 27 ఏళ్ల వివాహబంధం అనంతరం భార్యతో విడాకులు, స్టీవ్ జాబ్స్‌తో పరిచయం, గొడవలు వంటి వ్యవహారాలపై బిల్ గేట్స్ అరమరికలు లేకుండా మాట్లాడారు. ఇంకా పర్యావరణం, ఏఐ వరకూ అభివృద్ధిపరిచిన సాంకేతికత, కరోనా మహమ్మారి, డోనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్‌ల తీరుతెన్నులు వగైరాలు ఈ ఇంటర్వ్యూల్లో ప్రస్తావనకొచ్చాయి. కనుక రాబోయే రెండు భాగాల్లో వీటికి సంబంధించి మరిన్ని వివరాలందిస్తారని తెలుస్తూనే ఉంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు
venujourno@gmail.com



> పెద్దవాళ్ళను కలవడం, వారితో చర్చించడం, వారి సలహాలు, సూచనలను పాటించడం అమ్మానాన్న, అమ్మమ్మ అలవాటు చేశారు. చొరవగా మాట్లాడటం, ప్రశ్నలతో వేధించటం, సంతృప్తికరమైన జవాబు వచ్చేదాకా కొనసాగించటం అలవాటైంది. అది జీవితంలో ఎదగటానికి తోడ్పడింది.

> ఎయిత్ గ్రేడ్‌లో ఉన్నప్పుడు పాఠశాల కొచ్చిన కంప్యూటర్‌తో ఎక్కువ సమయం గడిపేందుకు కంప్యూటర్‌లో బగ్స్ సృష్టించాం. అది కనిపెట్టి నన్నూ, ఇవాన్స్‌నూ వెళ్లగొట్టారు.

> నేను నా జీవితంలో అత్యధిక భాగం... భవిష్యత్తులో వచ్చే మార్పులపైనే దృష్టి కేంద్రీకరించాను. జరుగుతాయో జరగవో తెలియనప్పటికీ, ఒకవేళ జరిగినా అనేక సంవత్సరాలు పట్టే అవకాశాలున్నప్పటికీ... అలాంటి భవిష్యత్ ఆలోచనలపై ఇవాళ్టికీ నేను ఎక్కువగా శ్రమిస్తుంటాను. వయసు పెరుగుతున్న కొద్దీ... వెనక్కి తిరిగి, గతంలో జరిగినది మరింతగా సింహావలోకనం చేసుకుంటాను. జ్ఞాపకాలను ప్రోది చేసుకోవడం వల్ల నన్ను నేను మరింత బాగా అర్థం చేసుకోగలుగుతున్నాను.

సోషల్ మీడియా

రెండు విషయాలు

హిందుత్వ విషయంలో బీజేపీని అనుకరించే ఏ పార్టీ అయినా అసలు పార్టీ చేతిలో ఓడిపోతుందని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమి తెలియజేస్తోంది. అలాగే ‘ఇండియా’ కూటమి అనేది ఏ భావజాలమూ, సమగ్రతా లేని స్వార్థ, అవకాశవాదుల సమూహమని అర్థమవుతోంది.

– అనుభవ్ సింగ్, మార్క్సిస్ట్

ఇదే నయం

భారీ జరిమానాలు విధించకుండా, జైళ్లలో వేయకుండా అక్రమ వలసదారులను తమ స్వదేశానికి పంపడం అనేది ఉన్నంతలో వారికి అత్యుత్తమం దక్కినట్టు! వాళ్లలో కొందరికి కదిలించే మానవీయ కథనం ఉండొచ్చు! అయినా వాళ్లను హీరోలుగానో, బాధితులుగానో చూడకూడదు.

– జకర్ డాక్టర్, ఫిజీషియన్

సమయం లేదు!

ఉత్త మాటలతో సమయం వృథా చేయొద్దు. చేయవలసింది ఎంతోవుంది, కానీ సమయం తక్కువగా ఉంది. రేపు అనేది ఎవరికీ వాగ్దానం కాదని గుర్తుంచుకోండి. ఉన్నది ఈ రోజే! ఏ పనులు ముఖ్యమో ఆలోచించండి. మీ మార్కును చూపండి. వృథా చేయడానికి జీవితం అంత పెద్దదేం కాదు.

– ముఫ్తి మెంక్, ఆధ్యాత్మిక బోధకుడు

ట్రాఫిక్ పెరగకుండా...

వీఐపీలు కుంభమేళాలో స్నానం చేయడానికి రాత్రిపూట వచ్చే మార్గమే లేదా? వాళ్లు రావడం వల్ల ట్రాఫిక్ అంతా గందరగోళం అవుతోంది.

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

అది సులభం

నిర్మించడం కష్టం. నాశనం చేయడం సులభం. విధ్వంసకారులకు ఈ అడ్వాంటేజ్ ఎప్పుడూ ఉంటుంది.

– ఎమీ దార్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

అరణ్య ఘోష

రాముడి నాటి దండకారణ్య దురాక్రమణ
ప్రజాస్వామ్యంలోనూ కొనసాగిస్తావా!
తిరిగి మొలకెత్తే గుణమున్న జాతిని
అంతమొందిస్తాననడం హాస్యాస్పదం!
అరణ్యాన్ని కాస్తున్నదెవరు
అడవిని అమ్ముకుంటున్నదెవరు!
చంపుకు పోవడం రాజ్యం ఉద్దేశమైతే
ఎదురు తిరగడం పౌరుడి హక్కు!

ఇరుపక్ష పార్థివ దేహాలూ పేదవే
ఆడిస్తున్నావన్న సత్యం ఆ వర్గానికి
అందించగలిగితే ఆట ముగిసినట్టే!
నీకేసే ఓటు సిరా ఆరకముందే
కాటేయడం ప్రజాస్వామ్యమా!
రక్షించమని కత్తి నీకందిస్తే
ఇచ్చిన వాడినే చంపడం
ఎంత దుర్మార్గం!
సమాధితో సహజీవనం చేసిన వేళైనా
అలెగ్జాండర్ చేతుల సత్యం అర్థమౌతుందా?

– గార రంగనాథం । 98857 58123

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com

హిట్లర్‌ను మానవుడన్న మహాత్ముడు!

కామెంట్

కరణ్ థాపర్

ఇప్పుడు రాస్తున్న దానిని గతవారమే నేను ఈ కాలమ్‌లో రాసి ఉంటే, అప్పుడది మహాత్మాగాంధీ వర్ధంతి రోజుకు మరింత సందర్భోచితంగా ఉండి ఉండేదని అనిపించవచ్చు. అదే కారణంతో అలా నేను రాసి ఉంటే సమయం, సందర్భం చూసి, రెచ్చకొట్టడానికి నేను రాసినట్లుగా ఉండేది. లేదంటే, మనోభావాలను దెబ్బతీసినట్లయ్యేది. కాబట్టి, ఈరోజు నేను లేవనెత్తుతున్న విషయాలపై మీ ప్రతిస్పందన భావావేశాలకు లోను కాని విధంగా ఉంటుందని ఆశిస్తాను.

గాంధీ మరణించిన డెబ్బై ఐదు సంవత్సరాల తర్వాత ఇప్పుడైనా – ఆయనకున్నటువంటి కొన్ని వివాదాస్పద, లేదా విరుద్ధమైన, అదీ కాకుంటే ఆమోదయోగ్యం కానివైన అభిప్రాయాలను మనం ఎలా పరిగణించాలన్న దానిని పరిశీలించవలసిన అవసరం ఉంది. 2024లో అవి మనకు దిగ్భ్రాంతిని గొల్పవచ్చు. 1940ల లోనైనా వాటికి ఇప్పటి కన్నా ఎక్కువగానే సమ్మతి లభించి ఉంటుందని నాకైతే నమ్మకం లేదు.

భారత స్వాతంత్ర్యం, దేశ విభజనలపై అలెక్స్ వాన్ తంజల్‌మాన్ (బ్రిటిష్ చరిత్రకారిణి) పుస్తకం ‘ఇండియన్ సమ్మర్’ (2007)ను జాగ్రత్తగా చదివినప్పుడు–రెండో ప్రపంచ యుద్ధం, హిట్లర్, ఆనాటి మారణహోమం పైన గాంధీజీ దృష్టికోణం ఏమిటో తెలిసి నిర్ఘాంతపోయాను.

గాంధీ శాంతి కాముకులని, అహింస పట్ల ఆయన నిబద్ధత తిరుగులేనిది, కొదవలేనిదని మనకు తెలిసిందే. ఆ నిబద్ధతే ఆయనను... హిట్లర్, ముస్సోలినీల దురాక్రమణ ప్రయత్నాలను అడ్డుకోవద్దని బ్రిటన్‌కు సలహా ఇచ్చేంతవరకు తీసుకెళ్లిందా! ‘‘వారిని మీ అందమైన దీవిని జయించనివ్వండి. పురుషుల్ని, స్త్రీలను, పిల్లల్ని చంపేయటానికి మీకై మీరు వారిని అనుమతించండి. అయితే వారికి విధేయంగా ఉండటానికి మాత్రం నిరాకరించండి’’ అని చెప్పారాయన.

జర్మన్ నియంత హిట్లర్

> ఏమైనా మహాత్ముడు భీతికొల్పేంత స్థిర చిత్తుడు అయుండాలి. అంతేకానీ కపటి మాత్రం కాదు.

1962లో ఇండియాపై చైనా దాడి, లేదా ఇండియాపై పాకిస్తాన్ పదే పదే చేస్తుండే దాడుల విషయంలో కూడా గాంధీ అలాగే స్పందించేవారా? ఏమైనా మహాత్ముడు భీతికొల్పేంత స్థిర చిత్తుడు అయుండాలి కానీ కపటి మాత్రం కాదు.

మరీ అధ్వాన్నం... హిట్లర్ దుష్టుడు అంటే గాంధీకి నమ్మబుద్ధి కాకపోవటం! ‘‘గౌరవనీయులైన హిట్లర్‌ను – ఆయన్ని చిత్రీకరించినంత – చెడ్డవారిగా నేను పరిగణించను’’ అని 1940లో గాంధీ రాశారు. ‘‘ఎక్కువ రక్తపాతం లేకుండా విజయాలు సాధించే అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా ఆయన నాకు కనిపిస్తారు’’ అన్నారు. ‘‘భవిష్యత్ జర్మన్లు శ్రీ హిట్లర్‌ను మేధావిగా, ధీశాలిగా, సాటిలేని కార్యాచరణశీలిగా, మరెన్నో విధాలుగా గౌరవిస్తారు’’ అని గాంధీ భావించారు.

దీనికన్నా కూడా, మాటల్లో వివరించలేనిది ఏమిటంటే – యూదుల పట్ల నాజీల అమానవీయ ప్రవర్తనపై గాంధీ ప్రతిస్పందన. లూయీ ఫిషర్ (అమెరికన్ జర్నలిస్ట్) రాసిన మహాత్ముడి జీవిత కథను ఉటంకిస్తూ, వాన్ తంజల్ మాన్... యూదులు సానుకూలమైన ప్రతిఘటనను మాత్రమే నాజీలకు అందించాలనీ, అవసరం అయితే తమ జీవితాలను సైతం త్యాగం చేయాలనీ గాంధీ సలహా ఇచ్చారని వెల్లడించారు. అడాల్ఫ్ హిట్లర్ కోసం ప్రార్థించమని కూడా ఆయన వారిని కోరారట. ‘‘కనీసం ఒక యూదుడు ఇలా చేసినా అతడు తన ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నట్లేనని, అందువల్ల ఒక మంచి ఉదాహరణగా నిలుస్తాడని, ఆ మంచితనం అంటువ్యాధిలా విస్తరించి మొత్తం యూదు జాతినే కాపాడుతుందని, మానవాళికి సుసంపన్నమైన ఒక గొప్ప వారసత్వాన్ని వదిలివెళుతుందని గాంధీ అన్నారు’’ అని లూయీ ఫిషర్ రాసినట్లు వాన్ పేర్కొన్నారు.

యూదుల నిర్బంధ శిబిరాలను కనుగొన్నాక కూడా, వాటిల్లో జరుగుతున్న అతి భయానక దారుణాలు ప్రపంచం దృష్టికి వచ్చాక కూడా లూయీ ఫిషర్‌తో గాంధీ ఇలా అన్నారు: ‘‘హిట్లర్ 50 లక్షల మంది యూదులను చంపాడు. ఇది మనకాలపు అతి పెద్ద నేరం. కానీ యూదులు తమకై తాము కసాయి కత్తికి తమను సమర్పించుకుని ఉండాల్సింది. తమను తాము శిఖరం అంచులపై నుండి సముద్రంలోకి తోసుకుని ఉండాల్సింది...’’

హింసపై పూర్తి వ్యతిరేకత, అహింస పట్ల అచంచలమైన నిబద్ధత కలిగి ఉన్న కారణంగానే గాంధీ అలా అని ఉంటారనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే అంతవరకే అది ఏకైక ఆమోదయోగ్యమైన ప్రతిస్పందన. హిట్లర్‌ను ఎదిరించవద్దని, హిట్లర్ కోసం ప్రార్థించమని, తమకు తాము ఆత్మార్పణం చేసుకోవాలని ఆయన యూదులకు చెప్పటం మాత్రం విడ్డూరం. కనికరం లేకపోవటం, కించపరచటం, క్రూరత్వం.

1984లో సిక్కులకు, 2002లో ముస్లింలకు, నేటి ఆదివాసీలకు గాంధీ ఇచ్చే సలహా కూడా అదే విధంగా ఉండేదా? బహుశా... ఉండేది! మళ్లీ అడిగినా ఇదే సమాధానం.

బ్రహ్మచర్యంతో గాంధీ చేసిన ప్రయోగాల మాదిరిగా కాకుండా... యుద్ధం మీద, హిట్లర్ మీద, మారణహోమం మీద ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు వ్యక్తిగత వ్యామోహాలు, బలహీనతల స్థాయికి మించినవి. ఆయన ఒకవేళ దేశాన్ని పరిపాలించి ఉంటే అవి విధానాలుగా మారి ఉండేవి. అందుకే వాటిని చర్చించి, పరిష్కరించాల్సి ఉంది. అంతిమంగా, వాటికి ఆమోదయోగ్యమైన వివరణ లభించకపోతే వాటిని విమర్శించాలి. తిప్పికొట్టాలి. ఇలా అంటున్నందుకు నేను చిక్కుల్లో పడతాననే మాటనైతే నేను కాదనను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మెచ్చుకోలు!

ప్రత్యక్షే గురవః స్తుత్యాః, పరోక్షే మిత్ర బాంధవాః!
కర్మాంతే దాస భృత్యాశ్చ, న కదాచన పుత్రకాః!!

గురువులను వారి సమక్షంలో ప్రస్తుతించాలి. మిత్రులనూ, బంధువులనూ వారి పరోక్షంలో ప్రశంసించాలి. మిత్రులు, బంధువులు మనతో లేనపుడు ఏమి అనుకుంటామో అదే మన నిజమైన అభిప్రాయం అవుతుంది. దాసులను, సేవకులను వారికి అప్పగించిన పని పూర్తి చేసిన వెంటనే ప్రస్తుతించాలి. సంతానాన్ని మాత్రం ఎప్పుడూ పొగడకూడదు. వారిని తగు విధంగా ప్రోత్సహించటం మాత్రమే చేయాలి.

భారవి రాస్తున్న కవిత్వాన్ని ఊళ్ళో పండితులందరూ మెచ్చుకుంటారు. తండ్రి మాత్రం ఒక్కమాటా అనడు. ఇది భారవికి కోపంగా అన్పిస్తుంది. అది తారస్థాయికి చేరుకొని, ఒకరోజు అటకపైనుండి, తండ్రి భోజనం చేస్తున్నపుడు తలపై బండరాయి వేయాలనుకుంటాడు. భారవి తల్లి ఇది గ్రహించి, భర్త భోజనానికి కూర్చున్నప్పుడు, కొడుకు కవిత్వాన్ని ఎందుకు మెచ్చుకోరని అడుగుతుంది. కొడుకు కవిత్వానికి మనసులో ఎంతో సంతోషిస్తున్నాననీ, సంతానాన్ని పొగిడితే వారికి ఆయుక్షీణమనీ అంటాడాయన. తండ్రిని అపార్థం చేసుకున్నందుకు క్షమించమని ప్రార్థిస్తాడు భారవి.

బాల్యం నుంచి ప్రశంసలకు అలవాటు పడితే పిల్లలకు అహం వస్తుంది. తమంత వారు లేరనే గర్వం అతిశయిస్తుంది. ప్రవర్తనలో మార్పు వస్తుంది. అందుకే అతిగా పొగడకూడదు. వారి అభివృద్ధికి మనసులోనే సంతోషించాలి. ప్రశంసను పన్నీటిలా చిలకరించాలి. లేకపోతే విలువుండదు, ఎదుటివారిలో ఎదుగుదలా ఉండదు.

– డా।। చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

10 ఫిబ్రవరి 2025
suryaeditpage@gmail.com

ఉడకని బియ్యం

గ్యాస్ కట్టేసింది
కట్టె కనుమరుగైంది
కరెంటును రెంటుకు తీసుకున్నా
కుక్కర్ కు వైరు తగిలించినా
అదిగో బల్బు వెలిగించి
నా మొహంలో ఆనందం
వెయ్యి ఓల్ట్ ల విద్యుత్ దీపమై
ప్రకాశించింది
కుక్కర్ లో ఎసరు మరుగుతోంది
కడుపులో ఆకలి గోల ఎక్కువైంది
కరెంటు ఉన్నపళంగా పోయింది
నిరాశ నాలో కమ్ముకుపోయింది
కరెంటు
మళ్లీ వచ్చింది
మళ్ళీ ఆనందం
మళ్లీ పోయింది
మళ్లీ నిరాశ
అన్నం ఉడకలేక ఉడుకుతోంది
ఎసురు మరగలేక మరుగుతోంది
మళ్లీ కరెంట్ కట్
ఆకలి పేగు తెగినంత బాధైంది
పొంగుకొచ్చిన ఎసరు
సద్దుమనిగి కూర్చునేసింది
చూపులన్నీ కరెంటు బల్బుపైనే
చివరికి అన్నం ఉడకలేదు
కరెంటు సమయానికి రాలేదు
మాడిన కడుపుతో
నానిపోయిన బీము
దొడ్లో చాప పైన ఆరబోసుకున్నాను
చేతిలో
చిల్లిగవ్వ లేదు
అన్నం మెతుకులు ఉడకనేలేదు
కరెంటు బిల్లు
గద్దలా వాలిపోయింది ముంగిట్లో
బిల్లు వైపు
ఉడకని అన్నం వైపు
కామ్ గా వేలాడుతున్న బల్బు వైపు
ఖాళీగున్న నా పొట్ట వైపు
ఒకసారి తేరిపార చూసుకున్నాను
గట్టిగా పగలబడి నవ్వేసి
వంద రూపాయల నోటు వైపు చూసి
బిగ్గరగా ఏడ్చేసాను
వెంటనే కరెంటు వచ్చింది
ఆ వెల్తురులో
ఉడకని బియ్యం మెరిసిపోతోంది
నిండని కడుపులో చీకటి పడింది
సగటు జీవితమంటే అంతేమరి

– నరెద్దుల రాజారెడ్డి

పాకులాటల రాజకీయం



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు
అధికారం కోసం పోరాటాలు
అధికారంలోకి రాగానే
పదవుల కోసం ఆరాటాలు
రాగానే
ఉన్నత పదవుల కోసం పాకులాటలు
ఆ పదవులు రాగానే
వాటిని కాపాడుకోవడానికి
కుట్రలు ఎన్ని పన్నాలో%ొ
కుయుక్తులు ఎన్ని వేయాలో%ొ
ఎత్తుకు పైఎత్తులు వేసే
జిత్తులమారి నక్క ఆలోచనలు
ఎన్ని చేయాలో
క్షణానికొక రంగులు మార్చే ఊసరవెల్లిలా
పదవుల కోసం పార్టీలెన్ని మారాలో
కేవలం అలంకార ప్రదమైన
ఆ పదవులని చూసి
మురిసిపోతున్న నాయకులారా
సామాన్యుడి ఘోష వినపడుతోందా?
కర్షకుల కన్నీరు కనపడుతోందా?
మీరు
చేసే ఈ కంపు రాజకీయం కన్నా
మురికి కాల్వ పక్కన కంపులో
బ్రతుకుతున్న వారే నయం
మనుషులు మురికిగా ఉన్నా
వాళ్ళ మనసులు స్వచ్ఛం
తుమ్మితే ఊడిపోయే పదవులపై
మీకు ఎందుకంత వ్యామోహం?

–కోనేటి నరేష్
8499847863

చలిమంట లేచింది . . .



మంచి
తత్త్వమే మానవత్వం
మనిషిలోని మంచి
తత్త్వమే మానవత్వం
మంచికి మానవత్వానికి
డబ్బుతో పనిలేదు
ఆర్ద్రత ఆదరణ కలిగిన
మనసు ఉంటే చాలు
జనహితమే మన
అభిమతమైతే
అలకల్లోలాలు
అలజడులు
అంతమవుతాయి
మానవత్వం లేని
మేధస్సుకంటే
మేధస్సు లేని
మానవత్వం
మంచిది
నిజమైన మిత్రులకు
మించిన ఆస్తి లేదు
స్నేహానికి కులం మతం
ప్రాంతం భాషా రంగు
ఎల్లలు అక్కర్లేదు
ఇరువురి మనసులోని
భావనలు కలిస్తే చాలు
ఒక చిరునవ్వుతో స్నేహం
మొదలౌతుంది
భరోసా భద్రతనిస్తుంది
షేరింగ్ కేరింగ్ కు
కేరాఫ్ గానిలుస్తుంది
స్నేహం దీపం లాంటిది
చీకట్లో గమ్యాన్ని
చూపిస్తుంది
మన
మంచి మాట
మనపైన వున్న కోపాన్ని
అంతం చేస్తుంది
మంచి మాటల
పూతోటలో మానవత్వం
పరిమళిస్తుంది
ఆనందం ఆత్మతృప్తి
చేకూరుతుంది
ఒక మంచి చూపు
అనుబంధాలను
ఆత్మీయతను
రక్షిస్తుంది
మన వ్యక్తిత్వమే
మన జీవితాన్ని
మార్చేస్తుంది
సముద్రంలో అలలు
ఎన్ని వున్న అందులో
తీరాన్ని చేరేవి కొన్నే
జీవితంలో ఎందరు
బంధువులు
స్నేహితులుజి
ఉన్న మనసులో
వుండేది కొందరే
వారే నిజమైన
స్నేహితులుజి
ఆత్మీయులు
తనకు ఎప్పుడు
కష్టాలు రావద్దు
అనుకోవడం
మనిషి తత్వం
తనకు వచ్చిన
కష్టం ఎవ్వరికీ
రావద్దు
అనుకోవడం
మానవత్వం
ఆరోగ్యాన్ని మించిన
ఆస్తిలేదు
నమ్మకాన్ని మించిన
తృప్తి లేదు
జీవితాన్ని మించిన
పుస్తకం లేదు
అంతరాత్మను
మించిన గురువులేదు
అనుభవాన్ని
మించిన పాఠం లేదు
మమత మానవీయత
పునాదులపైజి
మానవ సేవచేద్దాం
మర్యాద మన్నన
సంతృప్తిని సంపదగా
పొందుదాం
మనిషి ఆశావాదంతో
జీవించాలి
చీకటిని నిందిస్తూ
కూర్చునే కంటే
ఓ కొవ్వొత్తిని
వెలిగించండి
చీకటిని తొలగించి
వెలుగును ఇచ్చే
దివ్వెల మైదాం
హింసా రహిత
సమాజ స్థాపనకు
ఉద్యమిద్దాం.

నేదునూరి కనకయ్య
9440245771

ప్రపంచోత్పత్తి, సృష్టి వివరణ ఆరంభం

శ్రీ మహాభాగవత కథ-22

వనం జ్వాలా నరసింహారావు
80081 37012

కం॥ చదివెడిది భాగవతమిది,
చదివించును కృష్ణు, దమృతఝరి
పోతనయున్
చదివినను ముక్తి కలుగును,
చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాలా' మతినై

పరీక్షిన్మహారాజుకు శుక మహర్షి చెప్పిన అంశాలలో భాగంగా, పరీక్షిత్తు వేసిన ఒక ప్రశ్న, సమస్త ప్రాణికోటి తోడి-పొందిక ఏవిధంగా ఏర్పడింది? దానికి కారణం ఏమిటి? అలా ఏర్పడడం వ్యక్తి పూర్వం చేసిన కర్మల వల్లనా? అని. ఆవివరాలన్నీ తనకు విడమర్చి చెప్పమని అడిగాడు శుకుడిని పరీక్షిత్తు. అలా మొదలైంది ప్రపంచోత్పత్తి, సృష్టి వివరణ.

'పరమాత్మ నాభి కేంద్రంగా, పద్నాలుగు భువనాలకు కారణమైన ఒక పద్మం పుట్టింది. అందులో నుండి బ్రహ్మ పుట్టాడు. ఆ బ్రహ్మ పూనుకుని జీవులను సృష్టించాడని చెప్పుకున్నాం కదా! అలాంటి బ్రహ్మ ఏవిధంగా పరాత్పరుడి రూపాన్ని కళ్లారా చూడగలిగాడు? విష్ణువుకు, బ్రహ్మకు, అవయవాల రూపులో కాని, వాటి కూర్పులో కాని, భావంలో కాని, జాడల్లో కాని ఏమైనా తేడా వుందా? ఆ సర్వాత్ముడు మాయా నిర్దేశకుడై ఏవిధంగా, ఎక్కడ పవళించాడు? ఆ మహాపురుషుడి అంగాల నుండి లోకాలు ఎలా కల్పించబడ్డాయి? కాలాల స్వభావం ఎలా ఉంటుంది? దేవతల, పితృదేవతల, మానవ మాత్రుల ఆయుః పరిమితి ఎంత? కాల ప్రవృత్తి ఏమిటి? ప్రాణులు వారి కర్మానుసారం ఏఏ లోకాలకు వెళ్తారు? ఎలాంటి కర్మలు చేస్తే దేవతలుగా అవతరించవచ్చు?'

'ఈ నేల అట్టడుగున ఉండే పాతాళలోకం, దిక్కులు, నింగి, గ్రహాలూ, చుక్కలు, కొండలు, నదులు, సముద్రాలు, దీవులు.....ఇవన్నీ ఏవిధంగా పుట్టాయి? వీటిలోని ప్రాణికోటి జననాలు ఎలా ఉంటాయి? ఆకాశం లోపలి, బ్రహ్మాండం వెలుపలి కొలమానం ఎంత? విష్ణువు అవతార చరిత్రలు, యుగాలు, యుగాల కొలమానాలు, యుగధర్మాలు, ఒక్కో యుగంలో మానవులు పాటించాల్సిన సామాన్య-విశేష ధర్మాలు, ఆయాజాతుల ప్రత్యేక ధర్మాలు, రాజర్షి ధర్మాలు, ఆపద్ధర్మాలు, బతుకు తెరువుకు ఉపకరించే ధర్మాలు ఎలా ఉంటాయి? దేవుడిని పూజించే పద్ధతి ఏమిటి? యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి అనే ఎనిమిది యోగాలు ఎలా ఉంటాయి? అణిమ, మహిమ, లఘిమ, గరిమ, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశిత్వ, వశిత్వ, అనే ఎనిమిది సిద్ధుల విధానం ఎలా ఉంటుంది? వాళ్ల "అర్చిరాది" మార్గాలు ఏమిటి?'

'ఋగ్యజుస్సామాథర్వాది నాలుగు వేదాలు, ధనుర్వేదం, ఆయుర్వేదం, గాంధర్వవేదం, అథర్వవేదం అనే నాలుగు ఉపవేదాలు, పద్దెనిమిది స్మృతులు, ఇతిహాసాలు, పురాణాలు పుట్టిన తీరుతెన్నులు ఎలాంటివి? కల్పాల నడుమ సంభవించే ప్రళయం, దాని రూపు, కల్పాంతంలో సంభవించే పెద్ద ముప్పు ఎలా ఉంటుంది? యాగాది సంబంధిత కర్మలు, నూతులు, కొలనులు, చెరువులు, గుళ్లు లాంటి వాటి నిర్మాణం, అన్నదానం, ఉపవనాల ఏర్పాటు, ధర్మశాస్త్రాలు వచించిన పనులు ఎలా చేయాలి? హోమాదుల ఆచరణ పద్ధతులు, ప్రాణుల పుట్టుక, ధర్మార్థకామాలనే మూడు పురుషార్థాలను అమలుపరిచే తీరు, దైవాన్ని, వేదధర్మాలను విశ్వసించనివారి జన్మలు, జీవాత్ముడిని కట్టి వుంచే విధం, ముక్తిని సాధించే తీరు, తన ఇచ్ఛానుసారం సంచరించే ఈశ్వరుడి విషయం, సర్వాధిపతిగా భగవానుడు జీవులతో వినోదించే విధానం.'

భాగవత పురాణం చెప్తానన్న శుకుడు

ఈ విషయాలన్నీ చెప్పమని అడిగాడు శుకమునిని పరీక్షిత్తు. జవాబుగా శుకుడు, 'భాగవత పురాణాన్ని చెప్తుతాను విన' మని అన్నాడు. వాస్తవానికి ఆ పురాణాన్ని బ్రహ్మ-నారద సంవాదం రూపంలో ఆవిర్భవించింది మొదలు. అది వేదంతో సమానమైనది. దాన్ని మొదలు సర్వేశ్వరుడు బ్రహ్మకల్పంలో బ్రహ్మకు బోధించాడు. ఇదే విదుర మైత్రేయ సంవాదంగా భాగవతంలో చెప్పడం జరిగింది. దాన్నే సూతుడు శౌనకాది మహాయోగులకు చెప్పాడని శుకుడు పరీక్షిత్తుతో అని, ఆ విషయాలను ఆయనకు తెలియచేశాడు సవివరంగా. అవి:

జీవికి శరీరంతో సంబంధం కలిగే అవకాశం ఎలా ఏర్పడుతుందనేది చాలా ముఖ్యంగా అవగాహన చేసుకోవాల్సిన అంశం. పరమేశ్వరుడి మాయ లేకపోతే ఆ బంధం ఏర్పడదు. జీవి విష్ణుమాయా మహిమవల్ల పంచ భూతాలతో కూడిన దేహసంబంధం కలవాడు అవుతాడు. ఆ మాయ వల్లే జీవి బాల్యం, కౌమారం, యవ్వనం అనే వయో వ్యవస్థలను పొందుతాడు. విష్ణుమాయా ప్రభావం వల్లే జీవి మానవుడిగానో, దేవతగానో ఆకారం పొందుతాడు. "నేను", "ఇది నాది" అనే భావనలతో సంసార మాయకు కట్టుపడి పోతాడు. పరమాత్ముడి మాయే అన్నిటికీ మూలకారణం. ఇలా బందితుడైన ప్రాణికి భగవంతుడి మీద భక్తి కలగడం వల్ల మోక్షం ఏవిధంగా కలుగుతుందనేది ప్రశ్నార్థకం. అదెలా అంటే, ఎప్పుడూ జీవిలో ప్రకృతినీ, పురుషుడినీ అధిగమించే "బ్రహ్మతత్త్వం" ఉంటుంది. బ్రహ్మ ధ్యానంలో జీవి శ్రద్ధ చూపినప్పుడు మోహం వీడిపోతుంది. "నేను", "నాది" అనే సంసార బంధం వదిలిపోతుంది. దాంతో మోక్షాన్ని పొందుతాడు.

జీవుడికీ, పరమాత్ముడికీ శారీరక సంబంధాలు కన్పిస్తుంటాయి. అలాంటి శరీరాన్ని ధరించిన భగవంతుడి పట్ల భక్తి కలిగి ఉండడం వల్ల జీవుడికి మోక్షం ఎలా కలుగుతుందనే ప్రశ్న రావచ్చు. జీవుడు అవిద్యాప్రభావం కలవాడు. దానివల్ల, కర్మానుసారంగా శరీర బంధం ఏర్పడుతుంది. ఆ సంబంధం మిథ్యా రోపమైనది. పరమేశ్వరుడు తన యోగ మాయా ప్రభావం వల్ల విలాసవంతమైన శరీరాలలో ప్రకాశిస్తుంటాడు. అందువల్ల జీవుడికి భగవద్భక్తి మోక్షాన్ని తప్పక ప్రసాదిస్తుంది.

బ్రహ్మ తన పుట్టుకకు చోటైన పద్మం గురించి తెల్సుకోవాలనుకున్నాడు. చుట్టూ ఉన్న నీళ్లలో వెతికాడు కాని, పద్మం మూలం కనుక్కోలేక విసిగిపోయాడు. వెనక్కు వచ్చి, మళ్లీ ఆ కమలంలోనే కూర్చున్న అతడికి లోకాలను సృష్టించాలనే కోరిక కలిగింది. ఎలా చేయాలో అర్థం కాలేదు. ఇంతలో నీళ్ల మధ్య నుండి ఒక ధ్వని వినపడింది. "తప" అనే పదం విన్నాడు ఆ ధ్వనిలో నుండి. ఆ పలికింది ఎవరో అతడు తెలుసుకోలేక పోయాడు. ఆ శబ్దం తనను తపస్సు చేయమని ఆదేశించినట్లు భావించాడు. వేయి దివ్య సంవత్సరాలు తపస్సు చేశాడు బ్రహ్మ. ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. పరమపదాన్ని తన ఎదుట చూశాడు. అక్కడ అంతా "విష్ణుమయం" గా కనిపించింది. వేదమంత్రాలు వినపడ్డాయి. వైకుంఠ భవనం మహిమతో వెలిగిపోతూ ఉన్నది. అక్కడ లక్ష్మీదేవి సరసన అన్ని ఐశ్వర్యాలతో, అతిశయించినవాడు, సర్వేశ్వరుడు, పరమపురుషుడు, పద్మాక్షుడు అయిన శ్రీమన్నారాయణుడు బ్రహ్మకు దర్శనమిచ్చాడు.

బ్రహ్మ తపస్సుకు మెచ్చాననే, ఏమి కావాలనో కోరుకోమనీ అన్నాడు విష్ణుమూర్తి. ఆ మహాత్ముడి మహాత్మ్యాన్ని గ్రహించుకునే తెలివిని ప్రసాదించమని కోరాడు బ్రహ్మ. లోక సృష్టి నిర్మాణంలోని మాయావిధానం గురించి కూడా అడిగాడు. దాన్ని తెలియపరుస్తానని అన్నాడు విష్ణువు ఈ విధంగా: 'లేని పదార్థం నా ప్రభావంతో ఉన్నట్లుగా, తిరిగి చూస్తే లేనట్లుగా తోచడమే నాదైన మాయా ప్రత్యేకం. పంచమహా భూతాలు, భౌతిక వస్తువులలో ఏవిధంగా ప్రవేశించి ఉంటానో ఆ విధంగానే నేను ఈ భూత-భౌతికాలైన సమస్త కార్యాలలో సత్త్వాది రూపాలలో చొచ్చి ఉంటాను. భూత-భౌతికాలు కారణదశను పొంది, నాలో వ్యక్తరూపాన్ని పొంది, స్ఫుటంగా ఉండవు. అన్ని ప్రదేశాలలో, అన్ని వేళలా, ఏది ఆకళింపుకు వస్తుందో అదే పరబ్రహ్మ స్వరూపం. నా తత్త్వస్వరూపకమైన అర్థమే పరబ్రహ్మ స్వరూపం అని తెలుసుకోవాలి. దీన్ని నీ మనసులో నిలుపుకుని సృష్టి సాగిస్తే ఎలాంటి మోహమూ నీ దగ్గరకు రాదు' అని భగవానుడు బోధించాడు.

(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం,
రామకృష్ణ మఠంప్రచురణ ఆధారంగా)

ఏకనాథ్ ఈశ్వరన్ రాసిన భగవద్గీత



భగవద్గీత అత్యంత గౌరవనీయమైన ఆధ్యాత్మిక గ్రంథాలలో ఒకటి, ఇది సమయం, సంస్కృతి మరియు వ్యక్తిగత నమ్మకాలను అధిగమించే జ్ఞానాన్ని అందిస్తుంది. ఏకనాథ్ ఈశ్వరన్ ఈ పవిత్ర గ్రంథం యొక్క అనువాదం మరియు పరిచయం దాని బోధనలను ఆధునిక ప్రేక్షకులకు స్పష్టత మరియు లోతుతో తీసుకువస్తుంది. 1961లో ఈశ్వరన్ స్థాపించిన లాభాపేక్షలేని సంస్థ అయిన బ్లూ మౌంటైన్ సెంటర్ ఆఫ్ మెడిటేషన్ యొక్క ప్రచురణ విభాగం అయిన నీలగిరి ప్రెస్ ప్రచురించిన ఈ ఎడిషన్ ఒక తాత్విక గ్రంథంగా మరియు జీవిత సవాళ్లకు ఆచరణాత్మక మార్గదర్శిగా పనిచేస్తుంది.

ఈశ్వరన్ అనువదించిన భగవద్గీత దాని బోధనలకు సమగ్రమైన మరియు సులభంగా అర్థమయ్యే విధానాన్ని అందిస్తుంది. జీవితపు ˇవాళ్లను ఎదుర్కోవటానికి మార్గసూచిగా,మార్గదర్శిగా ఈ గ్రంథాన్ని ఆయన అందిస్తారు. ఆత్మాన్వేషణ మరియు జ్ఞానోదయానికి వివిధ మార్గాలను సూచిస్తూ, ఈ గ్రంథం మనకు సహాయపడుతుంది . ఆయన వ్యాఖ్యానం కేవలం సిద్ధాంతపరమైన తత్వశాస్త్రాన్ని మాత్రమే కాకుండా, ఆచరణాత్మకమైన అనుభవాన్ని కూడా ప్రధానంగా చేస్తుంది. దైనందిన జీవితంలో జ్ఞానాన్ని అన్వయించుకునే వారికీ ఇది వ్యక్తిగత మార్గదర్శకంగా మారుతుంది. ఈ విధంగా గీతా ప్రత్యేకతను పొందుతుంది, ఎందుకంటే ఇది మన జీవన ఉద్దేశ్యం, అస్తిత్వం, మరియు జీవన కళ గురించి మనం కలిగే ప్రశ్నలను అడిగి, వాటికి సమాధానాలు అందిస్తుంది.

ఉపనిషత్తులు మరియు ధమ్మపదం తో సహా గొప్ప ఆధ్యాత్మిక గ్రంథాలలో, భగవద్గీత- జ్ఞానం, ధ్యానం, చర్య మరియు భక్తి యొక్క సమగ్ర సంశ్లేషణగా నిలుస్తుంది. ఇది స్వీయ-సాక్షాత్కారానికి వివిధ మార్గాల యొక్క క్రమబద్ధమైన వివరణను అందిస్తుంది, వ్యక్తులు వారి స్వంత ఆసక్తులు, అభిరుచులు మరియు సామర్థ్యాలతో వారి అభ్యాసాలను సమలేఖనం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ పుస్తకం యొక్క అత్యంత అద్భుతమైన అంశాలలో, ఈశ్వరన్ విధానం ఈ అనుకూలతను హైలైట్ చేస్తుందిబీ గీతను సమకాలీన అన్వేషకులు మరియు అనుభవజ్ఞులైన అభ్యాసకులు ఇద్దరికీ సంబంధితంగా చేస్తుంది.

ఇది వివిధ యుగాలు మరియు సంస్కృతులలో ఎలా ప్రతిధ్వనిస్తుందంటే, మహాత్మా గాంధీ తన వ్యక్తిగత మరియు రాజకీయ పోరాటాలలో మార్గదర్శక శక్తిగా ఉన్నట్లే, ఇది ప్రపంచవ్యాప్తంగా పాఠకులను ప్రేరేపిస్తూనే ఉంది. ఈశ్వరన్ అనువాదం ఈ సార్వత్రిక ఆకర్షణ యొక్క సారాన్ని సంగ్రహిస్తుంది. ఇది జ్ఞానం, సమగ్రత మరియు ఉద్దేశ్యంతో జీవించాలనుకునే ఎవరికైనా ఆధ్యాత్మిక పోషణకు మూలంగా మారుతుంది.

జీవిత రహస్యాలపై అంతర్దృష్టులను అందించే అనేక జ్ఞానోదయ పుస్తకాలు ఉన్నప్పటికీ, కొన్ని మాత్రమే శ్రీమద్ భగవద్గీతతో పోల్చగలవు. ఈశ్వరన్ యొక్క అనువాదం ఈ పవిత్ర గ్రంథాన్ని దాని లోతైన సందేశాన్ని తగ్గించకుండా అందుబాటులోకి తెస్తుంది. ఆధ్యాత్మిక ప్రయాణంలో ఉన్న ఎవరికైనా, వారు జ్ఞానం, ధ్యానం, క్రియ లేదా భక్తిని కోరుకునే వారైనా, ఆయన అనువాదం మరియు వ్యాఖ్యానం అమూల్యమైన వనరును అందిస్తాయి. స్థిరమైన మార్పు మరియు అనిశ్చితి ప్రపంచంలో, ఏకనాథ్ ఈశ్వరన్ సమర్పించిన భగవద్గీత, అర్థవంతమైన జీవనానికి కాలాతీతమైన మరియు అనివార్యమైన మార్గదర్శిగా మిగిలిపోయింది.

సమీక్షులుః- మండా వెంకట అప్పారావు
(9347589272)

పుస్తకాల తోటలో..27

డా:అమ్మిన@77298 83223

పిల్లల స్వర్గం
డి.కె. చదువులబాబు

సహృదయ బాల సాహితీసేనాని, బాలసాహిత్యంలో కేంద్ర సాహిత్య పురస్కారం పొందిన వినమ్ర శీలి, డి .కె.చదువుల బాబు గారు నేటితరం బాలసాహితీమూర్తుల్లో మేలి వరుసలో నిలుస్తారు, వీరు రాసిన పిల్లల కథా సంపుటి "పిల్లల స్వర్గం" లోని 26 కథలు నిత్యం మనం చూసే బాలల జీవితాలకు అద్దం పడతాయి. ఈ కథల్లోని సారం అటు పిల్లలే కాక, ఇటు తల్లిదండ్రులు జీర్ణం చేసుకోవాల్సిన అవసరం గురించి ఈ పుస్తకం గుర్తుచేస్తుంది.

నిత్యం పిల్లలతో మమేకమయ్యే చదువుల బాబు గారికి వారి మనస్తత్వం పూర్తిగా తెలుసు, అందుకే వారి మనసెరిగి వారికి అవసరమైన కథలను అందించారు ఆయన.

ఈ కథల్లో చక్కని సందేశాలతో పాటు మంచి నీతి విలువైన యుక్తి మనం గమనించవచ్చు, కేవలం సాధారణ కథలేగాక గౌతమ బుద్ధుడు, రామకృష్ణ పరమహంస, వివేకానంద, వంటి మహనీయుల జీవితాల్లోని ఆదర్శనీయ సంఘటనలు చిన్న చిన్న కథలుగా ఇందులో పొందుపరిచారు, అలాగే కరోలిన్ హెర్షల్" వంటి సాధారణ వంటలక్క తనదైన ఆత్మవిశ్వాసంతో సాధన చేసి ప్రసిద్ధ మహిళా ఖగోళ శాస్త్రవేత్తగా ఎదిగి, మూడు నక్షత్ర మండలాలు, 8తోకచుక్కలు, కనుగొన్న స్ఫూర్తి కథ మనం ఇందులో చదవచ్చును.

ఇక కథల యొక్క గొప్పతనం వివరిస్తూ నేటి తరం పిల్లలకు వాటి అవసరం ఎంతవరకు ఉందో కళ్ళకు కట్టిన కథ "పిల్లల స్వర్గం", పిల్లలు అంటే కేవలం చదువులు మార్కులకు మాత్రమే పరిమితం అన్న ఆలోచన సరైంది కాదు అనే విషయాన్ని ఈ కథలో వాస్తవ చిత్రణ చేసారు రచయిత చదువుల బాబు.

మనిషి యొక్క లోపాలు అన్నిటికన్నా పెద్ద లోపం కోపం అనే విషయాన్ని చక్కని హాస్యం కలగలిపి అందించిన కథ శనగ బుడ్డోడు ఐక్యతలోని ఆనందాన్ని ఆవిష్కరిస్తూ... మనిషికి శత్రు శేషం పనికిరాదనే మంచి విషయాన్ని ఆసక్తికరంగా చెప్పిన కథ "అనుభవసారం"

కనిపించని దేవుళ్ళ గురించి కన్నా..,.. కనిపించే దైవాలైన తల్లిదండ్రులను గౌరవించి ఆదరించడం ప్రతి మనిషి కర్తవ్యం, అంటూ అందరి ప్రధాన పనిని గుర్తుచేసిన మంచి కథ "ప్రత్యక్ష దైవాలు", అందరూ ఒకసారి చదివి తీరాలి.

ఏ ఆవిష్కరణ అయినా దాని ఫలితాలు ప్రయోజనాలు అందరికీ అందిన నాడే దాని విలువ పెరుగుతుంది లక్ష్యం నెరవేరుతుంది అనే మంచి నీతిని పంచిన చక్కని కథ "అర్హత" అదేవిధంగా నిజం నిప్పులాంటిది అనే సత్యం చాటిన చక్కని కథ "నిజం" అక్క తమ్ముడు తాము చెప్పిన అబద్ధాన్ని వాళ్ళ హెడ్మాస్టర్ ఎలా కనిపెట్టారో తెలుసుకోవాలంటే ఈ కథ చదవాల్సిందే!!

పోటీలలో పాల్గొనే విద్యార్థుల్లో ఉండే సాధారణ బిడియం పోగొట్టడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయరామయ్య గారు చెప్పిన నోబెల్ బహుమతి నేపథ్య కథ విద్యార్థుల్లో ఎలా ప్రేరణ కలిగించిందో తెలియాలి అంటే "అవకాశం" కథ చదవాలి, కథల్లో ఎంతో ఆసక్తి చదివించే గుణం ఉన్నట్టే కథల పేర్లు కూడా అంతే ఆసక్తి దయకంగా ఉన్నాయి, "అభిరుచులు ఆలోచనలు" "గెలుపు ఓటమి" "ఆచారాలు ఆంతర్యాలు" మొదలైన కథలు ఈ వరుసలో ఉన్నాయి ఈ చక్కని కథల పుస్తకం ప్రతి ఒక్కరు తప్పక చదివి తీరాలి.

పిల్లల స్వర్గం (కథా సంపుటి) రచన: డి . కె.చదువుల బాబు, పేజీలు: 80, వెల: 40/- రూ, ప్రతులకు: రచయిత సెల్: 94407 03716.

నువ్వే నా విశ్వం



అడుగు తడబడి పడిపోతుంటే
గట్టిగా నా చెయ్యి పట్టుకున్నావు
అనుక్షణం నా ప్రాణంలా
నా ప్రక్కనే వుంటూ!
అమ్మ అనుకున్నా..!
తప్పటడుగుతో తల్లడిల్లుతుంటే
ఓదార్చి పోరాటాన్ని ప్రేమించేలా
ధైర్యం సంతకం నేర్పావు!
నాలోని గుండెకు ప్రతిరూపంలా!
నాన్న అనుకున్నా..!
నలుగురి నమ్మకాల నీడలో
ఓడిపోయి
వైరాగ్యంతో ఆత్మహత్యను
ఆశ్రయించి
ఇక ఈ తనువు చాలించాలనుకుంటే
అమృత జ్ఞానంతో నా చుట్టూ
వున్న అంధకారాన్ని మాయం
చేసావు!
గురువనుకున్నా..!
నేనెంటో నాకే సందేహం
వచ్చినప్పుడు
నన్ను ఓ పట్టుదలపు శిఖరంలా
మార్చి
పగలబడి నవ్విన నాటి
పరిస్థితులే ప్రశంసించేలా
అద్భుతాల తారలే తారసపడేలా
చేసావు!
దైవమను కున్నా..!
కాలం నాకు కలిపిన
కన్నప్రేగు బంధం నువ్వు..!
అహం లేని మానవత
దేహపు అవతారం నువ్వు..!
నా తొలి ముద్దు..
నా జీవిత అర్థపు తొలి పొద్దు
నువ్వే..!
"నువ్వే నా విశ్వం..
నేనే నీ శిల్పం..!
అన్నీ కలిపితే నువ్వే
నేనైనా నా స్నేహం..!
నా అర్ధాంగి రూపం..!!"

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

నీ చిరునవ్వుల చెరసాలలో

చిరకాలపు ఖైదీ ని
ముంగురుల సంకెళ్ళకు
ముందుగానే చిక్కుకొంటిని
ఆ కనురెప్పల ఊచల వెనుక
కదలని స్వచ్ఛంద బందీ ని
నీ ఊపిరి ఊసులు వింటూ
ముక్కెర కొక్కేనికి వేలాడుతుంటాను
ఆ చక్కెర గీతాల జలపాతాలలో
తడిసి ముద్దయినా
తచ్చాడుతుంటాను
పొమ్మనకు ప్రియా,
శిక్షను రద్దు చేసి, స్వేచ్ఛను
ప్రసాదించి
అందమైన ఈ బందిఖానా విడిచి
పొమ్మని
నన్నాదేశించకు ప్రియా!

డా.డి.వి.జి.శంకరరావు,మాజీ ఎంపీ.
9440836931.

వృద్ధాప్య విలాపం



కొన ఊపిరితో కొట్టుమిట్టాడు
ప్రాప్తం
దీనత్వపు దీప విలాప తాపం
ఆందరిచూపుల్ని చిలుకొయ్యలకి
తగిలించారు
ఊపిరి ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో ఉ
డుకుతోంది
కాలం చావుకి కాలు
దుయ్యమంటోంది
నోరు పిడచగట్టుకు పోయింది
కాళ్ళ కీళ్ళన్నీ కొయ్యబారిపోయాయి
దేహమంతా స్వేదంలో నానుతోంది
రేపా? మాపా? అన్నట్టే ఉంది
పానం!
పాలు పోసి పోసి గొంతునంతా
ట్రాఫిక్ జామ్ చేశారు
నిస్సహాయ స్థితిలో నిర్మానుష
నేత్రాన,
నిండా మునిగిన రాత్రులు
దర్శనమిచ్చాయి
విషాదాల తిమ్మిరి బుసలుకొట్టింది
హృదయం ఎన్నడూ చూడని
బాధని నింపుకొంది
ఓ జీవి కుప్పకూలిన కేక విని,
కుక్క అప్పుడే వింతగా
విలపించింది
చెట్టుపైన పక్షి తన పిల్లల్ని
రొమ్ముల్లో దాచుకొంది
ఊర్లోని జనాలంతా వారి
శయనమందిరాల్లో సుప్తుగా
నిద్రిస్తున్నారు
ఆ ఆత్మఘోష మాత్రం మేఘాలకు
విన్పించింది
ఆ రోజంతా భోరున వర్షం
కురిసింది
వృద్ధాప్యం సుఖాల కంటే బాధల్ని
నింపుతుంది.
అందరి వృద్ధాప్యాలు సుఖాలయితే
ఎంత బాగుండునో?

–బాలాజీ పోతుల
8179283830

నేస్తమా!

వెనకుండి,వెన్ను తట్టి
గమ్యాన్ని గుర్తుచేసి
కలతలను,కన్నీటి సుడులను
కౌగిలితో తుడిచేసి
వైఫల్యాల,వైకల్యాల
వెన్ను విరిచి, జతగా అడుగేసి
స్వార్థపు మోసాల
కుటిలత్వాన్ని జయించేసి
చెంతచేరి, చేయిపట్టి
సాహసించి బాసచేసి
ఆకలిదప్పులను,
ఆటంకాలను అధిగమించేసి
అమావాస్య చీకట్లను,
గ్రహణాలను విడిచేసి
అసాధ్యావరోధాలకు
విజయసాధన వారధి వేసిన
నీవుజి
నా నీడవా?అడుగు జాడవా?
నేస్తానివా? స్నేహ హస్తానివా?
మదిలో మెదిలే మాధవునివా?

ధూళిపాళ్ళ మాధవికిషోర్
9949735253

మార్పు సహజం



నీ అడుగుల ముద్రలు
గతపు జాడలవుతాయి
అవగతమైన గతం
భవితకు పాటమవుతుంది!
నేడు అనేది
రేపటికి నిన్ననే కదా
తెలిసి కూడా
రేపటి గురించి బెంగ వద్దు!
తడబడని అడుగులు నీవైతే
ఆగిపోని పోరాటం నీదైతే
నేటి ఎదురుచూపు
రేపు గెలుపై
ఎదురుపడుతుంది!
గాయాలుకాని
యుద్ధముంటుందా
యుద్ధం లేని
జీవితముంటుందా
పోరాడితేనే కదా
ఓటమైనా, గెలుపైనా!
గాయమైన వేణువు
గేయాలు పలుకదా
చీకటి చివరనే కదా
వెలుగు చిరునామా!
మార్పు అన్నది సహజం!
అన్నిటికీ సాక్ష్యం కాలమే!!

జగ్గయ్య.జి
9849525802

కేజ్రీవాల్ భవిష్యత్తు ప్రశ్నార్థకమా?

కేజ్రీవాల్ ఇతర రాజకీయ నాయకులందరిలాగే అహంకార పూరితంగా వ్యవహరించడంతోపాటు అవినీతి ఆరోపణలను కూడా ఎదుర్కొన్నాడు. వరుస విజయాలతో సుపరిపాలనపై ఆసక్తిని కోల్పోయాడు. 2013 నుంచి 2020 వరకు కేజ్రీవాల్ సుపరిపాలనపైనే ప్రధానంగా దృష్టి సారించాడు. కానీ, 2020 తర్వాత, కేజ్రీవాల్ ప్రజలు ఆశించిన పరిపాలనను అందించలేదు. లిక్కర్ స్కామ్ వంటి భారీ అవినీతి ఆరోపణలను ఎదుర్కోవలసి వచ్చింది. అవినీతి ఆరోపణల కారణంగా కేజ్రీవాల్ కూడా ఐదు నెలలు జైలుకు వెళ్లాడు. ఈ చర్యలు అతనికి ఉన్న ప్రజాకర్షణను తగ్గించాయి. అతని ఓటమికి కారణమయ్యాయి. కేజ్రీవాల్ తన ఎదుగుదల రాజకీయాలకు చేసిన కృషి అసాధారణమైనప్పటికీ, ఆయన ఓటమి ఇతర రాజకీయ నాయకులందరిలాగే ఉందని చెప్పవచ్చు. సంక్షిప్తంగా చెప్పాలంటే, కేజ్రీవాల్ ఇతర రాజకీయ నాయకుల మాదిరిగానే ప్రవర్తించడం వల్లే ఓడిపోయాడు.

- పెంటపాటి పుల్లారావు,
పొలిటికల్ ఎనలిస్ట్

అర్వింద్ కేజ్రీవాల్ డిసెంబర్ 2013లో అకస్మాత్తుగా భారత రాజకీయ రంగంలోకి ప్రవేశించి సంచలనాత్మకంగా ఢిల్లీ ముఖ్యమంత్రి పదవిని అధిష్టించారు. కేజ్రీవాల్ 2013కి ముందు రాజకీయాల్లో లేడు. అనంతరం రాజకీయ రంగంలోకి ప్రవేశించిన ఆయన సొంతంగా పార్టీని స్థాపించారు. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం ఒక్క ఎమ్మెల్యే అయినా ఆయన పార్టీ తరఫున గెలుస్తారా అని రాజకీయ నిపుణులు సందేహాలు వ్యక్తం చేశారు. కొంతమంది రాజకీయ నేతలు ఆయన ధైర్యం చూసి మూర్ఖత్వంగా భావించి నవ్వుకున్నారు. కానీ, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 2013లో 15 ఏళ్ల పాటు ఢిల్లీ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్న షీలా దీక్షిత్‌ను కేజ్రీవాల్ ఓడించారు. కేజ్రీవాల్ సంప్రదాయకంగా రాజకీయాల్లోకి రాకపోవడంతో ప్రజలు కూడా తొలుత ఆయన సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేశారు. ఎందుకంటే, కేజ్రీవాల్ ఒక రాజకీయ వంశపారంపర్యం నుంచి వచ్చిన నాయకుడు కాదు. అదేవిధంగా ధనవంతుడు కాదు. ఒక కుల సమూహానికి నాయకత్వం వహించలేదు. పెద్ద సినిమా నటుడికి ఉన్న ప్రజాకర్షణ కూడా లేని సామాన్య నాయకుడు. కాగా, భారతదేశంలోని చాలా మంది రాజకీయ నాయకులు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మమతా బెనర్జీ, మహారాష్ట్ర రాజకీయ దిగ్గజం శరద్ పవార్, ఉత్తరప్రదేశ్ రాజకీయాలను తనచుట్టూ తిప్పుకున్న ములాయం సింగ్ యాదవ్, బిహార్ రాష్ట్రాన్ని సొంత ఇలాకాగా ఏలిన లాలూ ప్రసాద్ యాదవ్, అదేవిధంగా ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్ వంటి నేతలు ప్రాంతీయ పార్టీలను స్థాపించి విజయవంతమయ్యారు. ఆయా రాష్ట్రాలలో ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. అయితే, వారు పెద్ద జాతీయ పార్టీల నుంచి విడిపోయి ప్రాంతీయ పార్టీలను ఏర్పాటు చేసినవారు. వీరందరికీ భిన్నమైన రాజకీయ నాయకుడు కేజ్రీవాల్. ఏ రాజకీయ ప్రోద్బలం లేకపోయినప్పటికీ 2013 నుంచి 2020 వరకు జరిగిన మూడు ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కేజ్రీవాల్ వరుసగా గెలిచి ఢిల్లీ పీఠాన్ని సొంతం చేసుకున్నారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన అనంతరం కేజ్రీవాల్ భారతదేశం అంతటా తను స్థాపించిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ను విస్తరించారు. ప్రాంతీయ పార్టీగా మొదలైన ఆప్ ఆ తర్వాత ఎన్నికల కమిషన్ నుంచి జాతీయ పార్టీ హోదాను సాధించింది. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీగా ఎదగటం చాలా తక్కువ పార్టీలకు మాత్రమే సాధ్యమైంది. కానీ, జాతీయ రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా ఎదిగిన కేజ్రీవాల్ 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. కేజ్రీవాల్ వైఫల్యాలు ఏమిటి, ఆయన భవిష్యత్తు ఏమిటి తదితర ప్రశ్నలతోపాటు రాజకీయ వర్గాలు, ప్రజల్లోనూ కేజ్రీవాల్ గురించి సర్వత్రా చర్చ జరుగుతోంది.

భారత రాజకీయాల్లో కేజ్రీవాల్ మార్క్

ఒక సాధారణ వ్యక్తిగా రాజకీయాల్లోకి ప్రవేశించి.. ప్రముఖ జాతీయ పార్టీలను సైతం ఓడించి, ఒక సామాన్యుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చని కేజ్రీవాల్ నిరూపించారు. ఇతర రాజకీయ నాయకులతో ప్రజలు విసుగు చెందినప్పుడు 'మార్పు'కు సంకేతంగా ఒక సామాన్య నాయకుడు విశ్వాసం కల్పిస్తే ప్రజలు అతడిని ఆదరిస్తారు. 2013లో కేజ్రీవాల్ తన మొదటి ఢిల్లీ ఎన్నికల్లో గెలిచినప్పుడు, ఆయన అత్యంత సాధారణ వ్యక్తులను ఎమ్మెల్యేలుగా, మంత్రులను చేశారు. ఢిల్లీ ప్రజలు వారిని విశ్వసించారు. ఉపాధ్యాయులు, చిన్న వ్యాపారవేత్తలు, పదవీ విరమణ చేసిన నిపుణులు, నిరుద్యోగ విద్యావంతులైన యువత కూడా ప్రజాప్రతినిధులుగా మారారు. 2025లో ఓడిపోయే వరకు కేజ్రీవాల్ ఈ ధోరణిని కొనసాగించాడు. విద్యుత్, నీరు వంటి ప్రాథమిక అంశాలను ప్రజలకు ఉచితంగా ఇవ్వవచ్చని కూడా కేజ్రీవాల్ ప్రజలకు చూపించాడు.

రెండు జాతీయ పార్టీలను ఎదుర్కొన్న చరిత్ర

కేజ్రీవాల్ భారతదేశ రాజకీయాల్లో కులరహిత రాజకీయాలను కూడా పరిచయం చేశాడు. బీజేపీ, కాంగ్రెస్ ఢిల్లీలో ఆధిపత్య రాజకీయ పార్టీలు. అయినప్పటికీ, ఈ రెండు దిగ్గజాలను పూర్తిగా తరిమికొట్టవచ్చని కేజ్రీవాల్ భారతదేశానికి చూపించాడు. ఈ జాతీయ పార్టీలు కేజ్రీవాల్‌ను ఓడించడానికి అన్ని ఉపాయాలు, వ్యూహాలు ప్రయత్నించాయి. కానీ, వారు 2025 వరకు కేజ్రీవాల్‌ను ఓడించలేకపోయారు. కేజ్రీవాల్ అర్హత కలిగిన పేద ప్రజలకు కూడా ఆప్ టిక్కెట్లు ఇచ్చారు. ఆ వ్యక్తులు ధనవంతులైన రాజకీయ దిగ్గజాలను ఓడించారు. ఢిల్లీ, పంజాబ్ అనే రెండు రాష్ట్ర ప్రభుత్వాలను స్వాధీనం చేసుకున్న మొదటి ప్రాంతీయ పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ఆ పార్టీని స్థాపించిన నాయకుడు కేజ్రీవాల్. మరే ఇతర ప్రాంతీయ అధినేత కూడా 2 రాష్ట్రాల్లో తన పార్టీని గెలిపించలేకపోయారు. ఢిల్లీలో ఓటమిపాలైనా కేజ్రీవాల్ జాతీయ స్థాయిలో ఒక కీలక నాయకుడుగానే ఉంటారనేది వాస్తవం.

కేజ్రీవాల్‌ను కేజ్రీవాలే ఓడించాడు

కేజ్రీవాల్ చేసిన అతిపెద్ద పాపం ఏమిటంటే అతను మధ్యతరగతి ప్రజలను నిరాశపరిచాడు. భారతీయ మధ్యతరగతి ప్రజలు రాజకీయ నాయకుల నుంచి ఏమీ కోరుకోరు. కానీ, రాజకీయ నాయకులకు కొంత మర్యాద, కొంత నిజాయితీ, దేశభక్తి ఉండాలని వారు ఆశిస్తారు. ఇక్కడ, కేజ్రీవాల్ పూర్తిగా విఫలమయ్యారు. తనను అధికారంలోకి తెచ్చిన మధ్యతరగతిని ఆయన మరచిపోయారు. చాలామంది రాజకీయ నాయకులు మధ్యతరగతి వర్గాలను కోపగించుకోవడం వల్ల విఫలమవుతారు. కేజ్రీవాల్ కూడా అలానే చేశారు. 2024 జూన్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నరేంద్ర మోదీకి మధ్యతరగతి వారి నుంచి షాక్ వచ్చింది. ఇప్పుడు, కేజ్రీవాల్‌కు 'మధ్యతరగతి' షాక్ వచ్చింది. ఏ రాజకీయ పార్టీ కూడా కేజ్రీవాల్‌ను ఓడించలేదు. కేజ్రీవాల్‌ను...కేజ్రీవాలే ఓడించాడు.

కేజ్రీవాల్ భవిష్యత్తు

కేజ్రీవాల్ ముందున్న మొదటి సవాలు తన పార్టీని నిలబెట్టుకోవడం, తన నాయకులు పార్టీ మారకుండా చూసుకోవడం. ఆయనకు ఇది చాలా కష్టమైన పని అవుతుంది. మరో తక్షణ సవాలు తన పంజాబ్ పార్టీని విభజించి పంజాబ్ ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రయత్నాలను ఆయన అడ్డుకోవాలి. ఆయనపై నమోదైన కేసులు, చట్టపరమైన చర్యలను ఎదుర్కోవడం కూడా సవాలుగా ఉంటుంది. దీనికి చాలా ఓపిక, అసామాన్య ధైర్యం అవసరం. కేజ్రీవాల్ తిరిగి రాజకీయంగా పుంజుకోగలరా అంటే.. దిద్దుబాటు చర్యలతో సాధ్యమే. కేజ్రీవాల్ తన తప్పులను అంగీకరించి తన దిశను మార్చుకోవాలి. ఒకవేళ కేజ్రీవాల్ తన తప్పులను గుర్తించకపోతే, రాజకీయ పునరాగమనం కష్టం. కేజ్రీవాల్ వయసు 56 సంవత్సరాలు మాత్రమే. చాలా మంది భారతీయ రాజకీయ నాయకులు 80 సంవత్సరాల వరకు చురుకుగా ఉంటారు. కేజ్రీవాల్ భవిష్యత్తు కూడా ఆయన ప్రత్యర్థులు తప్పులు చేస్తారా లేదా అనే దానిపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తును అంచనా వేయడం కష్టం. కానీ, కేజ్రీవాల్ గతం స్పష్టంగా ఉంది. కేజ్రీవాల్ రాజకీయాల్లో చిన్న వయసులోనే అద్భుతమైన విజయాన్ని, సాటిలేని విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించాడు.



బిహార్ లో బుద్ధ గయలోని మహాబోధి టెంపుల్ వద్ద టిబెటన్ బౌద్ధ సాధువులు ఆదివారం ఇలా కంజ్యూర్ యాత్రలో పాల్గొన్నారు. బుద్ధుడి బోధనలతో కూడిన పవిత్ర గ్రంథాలను టిబెటన్ భాషలో కంజ్యూర్ అంటారు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేతలంతా ఓడిపోతే సీఎం ఆతిశి తన గెలుపును డ్యాన్స్ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఆప్ అధికారాన్ని కోల్పోయి, ఆ పార్టీ చీఫ్ కేజ్రీవాల్ బాధలో మునిగిపోయి ఉంటే.. పార్టీ భవిష్యత్తు గురించి ఆమెకు ఎలాంటి బాధా లేకపోవడం సిగ్గుచేటు.

- స్వాతి మలివాల్, ఆప్ నేత, రాజ్యసభ ఎంపీ

పశ్చిమ బెంగాల్‌లో సీఎం మమతా బెనర్జీ ఒకవైపు కేంద్ర ప్రభుత్వ పథకాలకు మోకాలడ్డుతున్నారు. మరోవైపు రాష్ట్రాన్ని కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్ లో బీజేపీ అధికారంలోకి వస్తుంది. 2019 నుంచి జరుగుతున్న ఎన్నికల్లో బెంగాల్ లో బీజేపీకి 30 నుంచి 40 శాతం ఓట్లు వస్తున్నాయి. మరో10 శాతం ఓట్లు సాధిస్తే మమతా సర్కారును సాగనంపొచ్చు.

- ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర మంత్రి



దేశంలో పారదర్శక, ప్రజాస్వామ్య విలువలతో కూడిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఏర్పాటైంది. కానీ ఆ పార్టీ స్వభావాన్ని అర్వింద్ కేజ్రీవాల్ క్రమంగా మార్చేశారు. ఆప్ నియంతృత్వ, అవినీతి పార్టీగా మారిపోయింది. ఈ ఓటమికి పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ దే పూర్తి బాధ్యత. ఇది ఆప్ అంతానికి ప్రారంభమే.

- ప్రశాంత్ భూషణ్, ఆప్ మాజీ నేత

ఓపెన్ పేజీకి వ్యాసాలు, లెటర్లు పంపాల్సిన మెయిల్ ఐడీ
openpage@v6velugu.com

రచయితలు స్వీయ రచన అని 'వెలుగు' కు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జతచేస్తేనే వ్యాసం పరిశీలిస్తాం. రచన 700 పదాలకు మించరాదు.

డీవార్మింగ్‌తో పొట్టలోని నట్టల కట్టడి

National
Deworming
Day
February
10 - 2025

పిల్లల కడుపులో క్రిముల వల్ల (పొట్టలో నట్టలు) కలిగే అనారోగ్య సమస్యలను అంతం చేయడానికి.. భారత ప్రభుత్వం 2015 నుంచి 'జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్.డి.డి.)' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆనాటి నుంచి ప్రతి ఏటా రెండు సార్లు ఫిబ్రవరి, ఆగస్టు మాసాలలో ఆరు నెలల కోసారి ఎన్.డి.డి.రోజున అన్ని రాష్ట్రాలలో డివార్మింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తూ పిల్లలకు నులి పురుగుల నిర్మూలన మాత్రలు (ఆల్బెండజోల్ టాబ్లెట్స్) మింగించడం జరుగుతోంది. పిల్లలు తరచుగా కడుపునొప్పితోగానీ, కాళ్ళు, ముఖం ఉబ్బటంగానీ, ఆకలి మందగించడం, నీరసంగా, మందకొడిగా, బరువు తగ్గడం, రక్తహీనత, మలద్వారం చుట్టూ దురద మొదలగు ఏదైనా ఒక లక్షణంతో శారీరకంగా లేదా మానసికంగా అనారోగ్యంతో బాధపడుతుంటే కడుపులో నట్టలు ఉన్నట్టు అనుమానించవచ్చు. బడిలోపలి పిల్లలతో ప్రారంభించిన ఎన్.డి.డి. కార్యక్రమం ఆ తర్వాత బడిబయట పిల్లలకు, 1సం.చిన్నారుల నుంచి 19సం.ల వయసు పిల్లలందరికీ డీవార్మింగ్ టాబ్లెట్స్ వేయడం జరుగుతుంది. వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) శాఖల సమన్వయం, సహకారం, సౌజన్యంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఎన్.డి.డి.రోజు, 10 ఫిబ్రవరి 2025న 1 నుంచి19 సం.ల పిల్లలకు ఆల్బెండజోల్ 400ఎం.జి. మాత్రలను మింగించడం జరుగుతుంది.

నులిపురుగుల సంక్రమణ
వేటి ద్వారా వ్యాపిస్తుంది?

పరిసరాలు పరిశుభ్రంగా లేని ప్రాంతాలలో మానవ మలంలో ఉన్న హెల్మిన్టీస్ పరాన్నజీవుల గుడ్ల ద్వారా మట్టి కలుషితం అయి 'మట్టి ద్వారా సంక్రమించే హెల్మిన్టీస్' వ్యాప్తి చెందుతాయి. ఆరుబయట చెప్పులు లేకుండా వట్టి కాళ్ళతో మట్టిలో ఆడుకోవడం. అపరిశుభ్రమైన సురక్షితం కాని నీరు, ఆహారం తీసుకోవడం. భోజనం చేసే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు నీటితో కడుక్కోపోవుట. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయుట. పెరిగిన గోళ్లను కత్తిరించక పోవడం. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పారిశుద్ధ్యం లోపించడం. అపరిశుభ్రమైన ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా నులి పురుగులు నోటిద్వారా లేదా అరికాళ్ళ చర్మం ద్వారా సంక్రమిస్తాయి.

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం.. 10 ఫిబ్రవరి 2025 రోజున అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేసిన ఒకటి నుంచి ఐదు సం.ల వయస్సు గల చిన్నారులకు మరియు 6 నుంచి 19 సం.ల వయస్సుగల బడి బయట పిల్లలకు అంగన్వాడీ/ఆశా కార్యకర్తలు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కాలేజీలలో నమోదు చేసిన 6 నుంచి 19 ఏళ్ళ పిల్లలందరికీ ఎన్.డి.డి. రోజు ఏ.ఎన్.ఎం.లు, ఉపాధ్యాయులు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు.

ఆల్బెండజోల్ మాత్రల మోతాదు

1 నుంచి 2 సం.ల చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర (200 mg) రెండు స్పూన్ల మధ్య నలిపి, నీటితో కలిపి మింగిస్తారు. 2 నుంచి 3 సం.ల పిల్లలకు పొడి చేసిన ఒక పూర్తి మాత్ర (400 ఎమ్.జి.) 3 నుంచి 19 సం.ల వయసు పిల్లలు ఆల్బెండజోల్ మాత్ర (400 ఎమ్.జి.) భోజనం చేసిన తర్వాత నమిలి నీటితో మింగాలి. జబ్బులున్నవారు, దీర్ఘకాలికంగా మందులు వాడుతున్న పిల్లలు ఈ మాత్రలు వేసుకోరాదు. ఖాళీ కడుపుతో మాత్రలు వేసుకోరాదు. ఎట్టి పరిస్థితుల్లో టాబ్లెట్ పిల్లవానికి ఇంటికి ఇవ్వకూడదు. ఆల్బెండజోల్ మాత్ర పిల్లలకు, పెద్దలకు కూడా సురక్షితమైనది.

- నాశబోయిన నరసింహా,
ఆరోగ్య విస్తరణ అధికారి

లెటర్ టు ఎడిటర్

డీఈఓ పోస్టులను గ్రూప్1లో కలపొద్దు

విద్య నాణ్యతా ప్రమాణాలు పెంచడానికి రాష్ట్రం నుంచి మండలస్థాయి వరకు పర్యవేక్షణ అవసరం. ఇందులో భాగంగా స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఎడ్యుకేషన్ సెక్రటరీ రాష్ట్రస్థాయిలో విద్యావ్యవస్థను పర్యవేక్షణ చేయగా... జిల్లా స్థాయిలో జిల్లా విద్యాధికారుల ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ నిర్వహణ జరుగుతుంది. వీరి కింద డివిజన్ స్థాయిలో జిల్లా ఉప విద్యాధికారి ఉంటాడు. ఇతన్నే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్(Dy.E.O) అంటారు. తదుపరి మండల స్థాయిలో మండల విద్యాధికారి ఉంటాడు. డివిజన్ స్థాయిలో ఉప విద్యాధికారి పోస్టు అనేది చాలా ముఖ్యమైనది. జిల్లా విద్యాధికారికి సహాయంగా ఉంటూ డివిజన్ స్థాయిలో పాఠశాల విద్యా వ్యవస్థను పర్యవేక్షిస్తాడు. పాఠశాల విద్యా వ్యవస్థలో ఎగ్జామ్ ద్వారా డైరెక్టుగా రిక్రూట్‌మెంట్ చేసే ఉన్నతమైన పోస్ట్ ఇది. గతంలో డిప్యూటీ ఈ.ఓ పోస్టులను పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేశారు. కానీ, ఇటీవల ప్రభుత్వం వీటిని గ్రూప్1లో కలిపి నింపాలని యోచిస్తుంది. పీజీ డిగ్రీతోపాటు, బీఈడీ అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అదేవిధంగా పరీక్ష విధానంలో కూడా వైవిధ్యం ఉంటుంది. ఇప్పుడు ప్రభుత్వం డిప్యూటీ ఈ.ఓ పోస్ట్ ను గ్రూప్1తో కలిపి నింపడం వలన అభ్యర్థులకు నష్టం జరుగుతుంది. అంతేకాకుండా న్యాయపరమైన సమస్య తలెత్తే అవకాశం ఉంది. గ్రూప్ 1 నియామకం, ఎంపిక విధానం వేరు. గతంలో ఈ పోస్ట్ నియామకానికి ఆబ్జెక్టివ్ విధానంలో మూడు పేపర్లు ఉండేవి. ఒక పేపర్ జనరల్ స్టడీ కాగా...మరో రెండు పేపర్లు విద్యకు సంబంధించిన సైకాలజీ, తత్వశాస్త్రం, సమకాలీన విద్యా విధానాలతో కూడిన సిలబస్ ఉండేది. కానీ, ఇప్పుడు డిప్యూటీ ఈ.ఓ పోస్టులను గ్రూప్ 1తో కలపడం వలన మొత్తం పరీక్షా విధానం, ఎంపిక ప్రక్రియ మారిపోతుంది. గ్రూప్ 1లో కలపడం వలన పాఠశాల విద్యా వ్యవస్థకు నష్టం. కావున, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను విడిగానే పరీక్ష పెట్టి ఎంపిక చేయాలి. డిప్యూటీ ఈ.ఓ పోస్టులను విడిగానే నియామకం చేయాలి.

- సంపతి రమేష్ మహరాజ్

రైల్వే విద్యుత్ ఇంజిన్లకు నూరేండ్లు

భారతీయ రైల్వేలో విద్యుత్తు ఇంజిన్ల శకం ప్రారంభమై నూరేళ్లు నిండాయి. 1925 ఫిబ్రవరిలో తొలి విద్యుత్తు ఇంజిన్ రైలు బొంబాయి వీటీ స్టేషన్ నుంచి కుర్లా హార్బర్ (16 కి.మీ.) వరకు ప్రయాణించింది. ఇది దేశంలో విద్యుత్తు రైళ్లు నడపడానికి పడిన తొలి అడుగు. అయితే, ఆనాటి నుంచి నేటివరకు రైల్వే విద్యుద్దీకరణ బాగా ఆలస్యంగా జరిగిందనడంలో ఎలాంటి సందేహంలేదు. ఒకప్పుడు బొగ్గు(స్టీమ్)తో నడిచే ఇంజిన్లవల్ల భారీగా నల్లటి పొగ వాతావరణంలో ప్రవేశించేది. రైల్వేలైను పరిసర ప్రాంతాలలో బొగ్గు కాలిన వాసన వచ్చేది. కాలుష్య తీవ్రత కూడా ఎక్కువగా ఉండేది. పైగా ఈ ఇంజిన్లను నడిపే డ్రైవర్లకు పని కత్తిమీద సాములా ఉండేది. ఇంజిన్‌లో భాగంగా ఒక చిన్నపాటి వ్యాగన్ బొగ్గుతో నిండి ఉండేది. దానిలోంచి బొగ్గును తోడి కుంపటి (బర్నర్)ను తెరిచి అందులో వేసేవారు. ఈ బొగ్గు కుంపటిలో వచ్చే వేడితో పక్కనే ఉండే నీరు ఆవిరిగా మారి ఇంజిన్ నడిచేందుకు దోహదపడేది. ఆ భగభగ మండే కుంపటి తెరిచినప్పుడు డ్రైవర్లకు తీవ్రమైన వేడి తగిలేది. దీనివల్ల ఇంజిన్ మొత్తం భరించలేని వేడిగా ఉండేది. ఎండాకాలంలో డ్రైవర్ల అవస్థ చెప్పనలవికాదు. 1853 నుంచి నిరంతరాయంగా 140 ఏళ్లు నడిచిన స్టీమ్ ఇంజిన్లు 1993లో పూర్తిగా సేవల నుంచి నిష్క్రమించాయి. ఇక రైల్వేలో 1954లో ప్రవేశించిన డీజిల్ ఇంజిన్లు 70 ఏళ్లపాటు సేవలందించి ఈ ఏడాదిలో సెలవు తీసుకోనున్నాయి.

ఇప్పటికే భారతీయ రైల్వే విద్యుదీకరణ దేశంలోని అన్ని మార్గాల్లో 97 శాతం పూర్తయినట్లు అధికారికంగా ప్రకటించింది. మరో మూడు శాతం ఇంకొన్ని నెలల్లో పూర్తి కావచ్చని తెలుస్తున్నది. ఇలా వందేళ్లకయినా దేశంలో నూరుశాతం విద్యుద్దీకరణ పూర్తవుతుండడం హర్షణీయం. సంపూర్ణ విద్యుద్దీకరణ జరిగినా.. అత్యవసర పరిస్థితుల్లో, ప్రత్యామ్నాయ అవసరాల కోసం మరికొన్నేళ్లపాటు చాలా తక్కువ సంఖ్యలో డీజిల్ ఇంజిన్లు కొనసాగుతాయని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. కొన్నేళ్లుగా డీజిల్ ఇంజిన్లు రైల్వేలో ఎక్కువ శాతం మార్గాల్లో సేవలందిస్తూ వచ్చాయి.

ప్రధాని ఇందిర ఆదేశంతో..

1980లో నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కార్యాలయం నుంచి విద్యుద్దీకరణ వేగం పెంచాలని ఆదేశాలు అందడంతో కొంత కదలిక పెరిగింది. అయినప్పటికీ 44 ఏళ్లు గడచినా సంపూర్ణ విద్యుద్దీకరణ లక్ష్యం నెరవేరలేదు. దీనికి కారణాలు అనేకం కావచ్చు. ప్రభుత్వాలు మారడం, రాజకీయ ప్రాధాన్యాలు కొత్తగా చేరడం రైల్వేశాఖలో పరిపాటిగా మారింది. అయితే, 2030 నాటికి రైల్వేలో జీరో కార్బన్ ఎమిషన్ అంటే ఎలాంటి కాలుష్యం రాని విధంగా రైళ్లు నడపాలన్నది లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగింది. దీంతోపాటే విద్యుత్తు రైలు ప్రారంభమై వందేళ్లు పూర్తయ్యే నాటికి నూరు శాతం విద్యుద్దీకరణ పూర్తి చేయాలని కూడా ఒక సంకల్పం పెట్టుకొని ఆ దిశగా ప్రభుత్వరంగ సంస్థలకే విద్యుద్దీకరణ కాంట్రాక్టులు ఇచ్చింది. దేశంలో ప్రస్తుతం బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్ 66,724 కి.మీ. రూట్ సంపూర్ణంగా విద్యుద్దీకరణ లక్ష్యానికి చేరువవుతున్నది.

విద్యుదీకరణ వల్ల లాభాలు

రైల్వే లైన్ల విద్యుద్దీకరణ వల్ల ఇంజిన్ల నుంచి కాలుష్యం వెలువడదు. డీజిల్ ఇంజిన్ల నుంచి ఎక్కువగా కర్బన ఉద్గారాలు విడుదలవుతాయి. కానీ, విద్యుత్తు ఇంజిన్ల వల్ల ఎలాంటి కాలుష్యం లేనందున పర్యావరణానికి మేలు జరుగుతుంది. డీజిల్ ఇంజిన్ల నుంచి వచ్చే శబ్దంకన్నా విద్యుత్తు ఇంజిన్ల శబ్దం చాలా తక్కువగా ఉంటుంది. ప్రయాణ సమయంలో ప్రయాణికుల బోగీ ఎక్కువగా ఊగదు. ఇక నిర్వహణపరమైన వ్యయం కూడా బాగా తగ్గుతుంది. భారీ సరకు రవాణా రైళ్లు, దూరప్రాంత ప్రయాణికుల రైళ్లకు చేరవేతలో ఇబ్బందులు దూరమవుతాయి. డీజిల్ ఇంజిన్ల కోసం విదేశాల నుంచి చమురు దిగుమతి తగ్గి విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. ఇలా ఏటా రూ.15 వేల కోట్లకు పైగానే విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని అంచనా. పదేళ్లలో లక్షన్నర కోట్లు ప్రభుత్వ ఖజానాకు పొదుపు చేయవచ్చు. రైల్వేలో విద్యుద్దీకరణ సంపూర్ణమవడంతో ఇన్నాళ్లపాటు పర్యవేక్షణ ఏర్పాట్లు చూసిన కోర్ సంస్థ రద్దు కానున్నది. దేశవ్యాప్తంగా వేల కిలోమీటర్ల రైలు మార్గాలను దశలవారీగా విద్యుద్దీకరించేందుకు ప్రత్యేకంగా 1979లో ఏర్పాటు చేసిన సెంట్రల్ ఆర్గనైజేషన్ ఫర్ రైల్వే ఎలక్ట్రిఫికేషన్ కోర్ సంస్థకు ఇక విద్యుద్దీకరణను చేసేందుకు పని లేకుండా పోయింది. దీంతో ఈ సంస్థ రద్దు చేసి, ఉద్యోగులను రైల్వేలోనే విద్యుద్దీకరణ విభాగంగా సర్దుబాటు చేయనున్నారు. కొత్తగా నిర్మించే రైల్వే లైన్ల నిర్మాణం పూర్తయిన తరువాత ఈవిభాగం ఉద్యోగులు అక్కడ విద్యుద్దీకరణ కోసం విద్యుత్తు లైన్లు నిర్మించే బాధ్యతను నిర్వర్తించనున్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్నవిద్యుత్తు లైన్ల పర్యవేక్షణ, మరమ్మతులు, అత్యవసర పనులువంటి బాధ్యతలు వీరికి అప్పగించనున్నారు.

డీజిల్ ఇంజిన్ల విక్రయం

ఇక ఇన్నాళ్లూ సేవలందించి విద్యుద్దీకరణ కారణంగా నిష్క్రమించనున్న 4,543 డీజిల్ ఇంజిన్లను మన రైల్వేశాఖ ఆఫ్రికా దేశాలకు విక్రయించనున్నది. ఆయా దేశాల్లో ఉన్న గేజ్‌కు అనుగుణంగా (అక్కడ ఉన్న కేప్ గేజ్‌కు మార్చి) వీటిని విక్రయించాలని ప్రయత్నాలు చేస్తున్నది. ఇప్పటికే ఒక దానికి రూ.35 కోట్లు, మరో దానికి రూ.50 కోట్లకు ఆర్డర్ వచ్చినట్లు రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. వీటి జీవితకాలం ఇంకా 10 నుంచి 15 ఏండ్లు ఉన్నందున విక్రయించడం మినహా గత్యంతరం లేదు. ఇలాంటి వాటిని ఆఫ్రికా దేశాలు కోరుతుండడం కూడా రైల్వేకు కలిసివచ్చే అంశం.

- కె. బాలకిషన్ రావు,
సీనియర్ జర్నలిస్ట్

వార్త

తక్షణ కర్తవ్యం నెరవేరిస్తే,
తదుపరి కర్తవ్యం ఏమిటో సులువుగా తెలుస్తుంది.

న-బైరన్

ఊహించిన విజయమే..

అన్నివర్గాలు ఊహించినట్లుగానే దేశరాజధానిలో కమలం వికసించింది. సుమారు రెండు దశాబ్దాల తర్వాత భారీ ఆధిక్యంతో భారతీయ జనతాపార్టీ మళ్లీ ఢిల్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. మొత్తం 70 స్థానాల్లో 48 స్థానాలను కైవసం చేసుకుని జయకేతనం ఎగురవేసింది. డబుల్ ఇంజన్ సర్కారు హామీలను ప్రజలు విశ్వసించారనే చెప్పాలి. నిత్యం కేంద్రంతో వాగ్వాదం లెఫ్టినెంట్ గవర్నర్‌తో వివాదాలతోపాటు మద్యం కుంభకోణం, జల్‌బోర్డు అవకతవకలు, యమునా వివాదం, శీష్‌మహల్ ఆరోపణలతో ఆమ్‌ఆద్మీ ప్రతిష్ట పూర్తిగా దెబ్బతిన్నదనే చెప్పాలి. ఎన్నికల్లో కేజ్రీవాల్ ఇచ్చిన హామీలపై నగర ప్రజలు అంతగా ఆకర్షితులు కాలేదనే చెప్పాలి. ఆప్‌కు చెందిన మహామహులు సైతం ఓటమి పాలయ్యారు. మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సిఎం మనిశ్ సిసోడియాతోపాటు మద్యం కుంభకోణంలో ప్రమేయం ఉందని చెప్పిన అందరూ కూడా పరాజయం పాలయ్యారు. అలాగే సుదీర్ఘకాలంపాటు జైలులో ఉన్న నేతలందరినీ ప్రజలు ఈ ఎన్నికల్లో విశ్వసించలేదనే చెప్పాలి. మరో విషయం ఏమిటంటే హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆమ్ ఆద్మీపార్టీ బోర్లాపడితే హ్యాట్రిక్ ఓటమిని సాధించి కాంగ్రెస్ పార్టీ యధాతథస్థితిని కొనసాగించింది. ఒక్క స్థానాన్ని కూడా గెలవలేక పోయింది. ఢిల్లీలో అప్పటి సీఎం షీలాదీక్షిత్ తర్వాత మరోసారి కాంగ్రెస్ పార్టీ గెలిచిన సందర్భంలేదు. అలాగే భారతీయ జనతాపార్టీ కూడా సుష్మస్వరాజ్ ముఖ్య మంత్రిగా ఉన్న కాలం తప్ప మరోసారి ఢిల్లీ పీఠం సాధించలేకపోయింది. 27 ఏళ్లుగా పార్టీ గెలుపు అవకాశాల కోసం ఎదురుచూస్తేనే ఉంది. ఈసారి కట్టు దిట్టమైన వ్యూహాలతో ప్రజల్లోకి వచ్చిన కమలనాథులు కేజ్రీవాల్ పాలనా వైఫల్యాలను ఎత్తి చూపించి స్థానిక సమస్యల పరిష్కారం, ఉచితాల వ్యూహాలతోపాటు ఒక్కఛాన్స్ ఇవ్వండి అంటూ సాగించిన ప్రచారం ఢిల్లీ ఓటర్ల గుండెల్లో నిలిచిపోయింది. దీనికి తోడు సీఎం అభ్యర్థి ఎవరు అన్న స్పష్టత లేకుండానే ఎన్నికలకు వెళ్లింది. బిజెపికి స్థానికంగా బలమైన నాయకుడు లేకపోవడాన్ని ప్రధాన అస్త్రంగా తీసుకున్న ఆప్ సీఎం అభ్యర్థిని ప్రకటించడంలో బిజెపి విఫలం అయిందని ప్రచారం చేసింది. అలాగే బిజెపి వస్తే మురికి వాడల న్నింటినీ నిర్మూలిస్తుందన్న ప్రచారంతో కూడా ముందుకు వెళ్లింది. కానీ అవేమీ కూడా ఫలించలేదని ఎన్నికల ఫలితాలు రుజువు చేసాయి. ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను లక్ష్యంగా పెట్టుకుని బిజెపి ప్రచారంలో దూసుకు పోయింది. అద్దాలమేడ వివాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసారని, ఆప్‌నేతలందరూ అవినీతిలో కూరుకుపోయారన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగల గడంలో విజయం సాధించిందనే చెప్పాలి. అలాగే తరచూ కేంద్రంతో కొనసాగుతున్న వివాదాలకు తోడు లెఫ్టి నెంట్ గవర్నర్‌తో వివాదాలను తారస్థాయికి తీసుకెళ్లడం కూడా ప్రజలకు ఎంతమాత్రం రుచించలేదు. కేంద్రంతో సఖ్యతగా ఉంటూ దేశరాజధాని ప్రాదేశిక ప్రాంతాన్ని అభివృద్ధిచేయాల్సిందిపోయి తరచూ వివాదాలకు దిగడం కూడా ఓటర్లు ఎంతమాత్రం ఇష్టప డలేదని ఫలితాలు రుజువు చేసాయి. వీటికితోడు స్థానిక సమస్యలపైనే ఎక్కువ దృష్టిపెట్టి కమలం ముందుకు సాగింది. రోడ్ల నిర్వహణ,మంచినీటి కొరత, నగర కాలుష్యం మౌలిక సదుపాయాల కల్పనలో ఆప్ ప్రభుత్వం విఫలం అయిందన్న వాదనను బలంగా ప్రచారం చేసింది. సమస్యలన్నింటికీ మోడీ ప్రభుత్వమే కారణమని ఆప్ ప్రచారం చేసినా ప్రజల్లోకి మాత్రం ఆ వాదన వెళ్లలేదు. అవినీతి ఆరోపణలు, అగ్రనేతల అరెస్టులు వంటివి ఆప్‌పై బలంగా ప్రభావం చూపించాయి. ఢిల్లీ జనాభాలో 40శాతంవరకూ ఉన్న మధ్యతరగతి ప్రజానీ కాన్ని తీవ్ర అసంతృప్తికి గురిచేసాయి. ఇతర రాష్ట్రాల తరహాలోనే మహిళలకు నెలనెలా ఆర్థికసాయం బలంగా పని చేసింది. గర్భిణీలకు రూ.21వేల సాయం కూడా బిజెపికి ఓట్లను కురిపించిందనే చెప్పాలి. పూర్వాంచల్ ప్రభావం కూడా బిజెపి విజయానికి దోహదం చేసింది. దేశ రాజధానిలో సుమారు 20 నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఉంది. సుమారు 40లక్షలమంది ఈ ఓటర్లు ఉన్నారు. వీరికోసమే యుపి, బీహార్‌లనుంచి అగ్రనేతలందరినీ రంగంలోకి దించి ఆవర్గం ఓట్లు చీలకుండా జాగ్రత్తలు తీసుకుంది. దీనికితోడు ఆప్, కాంగ్రెస్ వేరువేరుగా పోటీచేయడం కూడా బిజెపికి కలిసొచ్చింది. అలాగే బీఎస్పీ, వామపక్షాలు, మజ్లిస్, ఆజాద్ సమాజ్ పార్టీ, ఎన్సీపీలు కూడా ఎన్నికల్లో వేరువేరుగా తలపడటం ఆమ్ ఆద్మీకి తీవ్రనష్టం కలిగించింది. ప్రత్యేకించి 60 లక్షలకు పైగా ఉన్న మహిళా ఓటర్లు ఈసారి బిజెపికి తమ మద్దతును తెలియజేసారన్నది ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేసాయి. దీనికితోడు మధ్యతరగతి వర్గానికి ఊరట నిచ్చేవిధంగా ఆదాయపు పన్ను పరిమితిని రూ.12లక్షలకు పెంచడం ఈ ఎన్నికల్లో ప్రభావం చూపించింది. దేశ రాజధానిలో మధ్యతరగతి జనాభాయే ఎక్కువ. ఈ ప్రభావం కూడా బిజెపికి కలిసొచ్చిందనే చెప్పాలి. అంతేకాకుండా వేతన జీవులకోసం ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం ఉద్యోగుల, పింఛన్‌దారుల జీతాలు, పింఛన్లు పెరుగుతుందన్న ఆశలు వేతన జీవుల్లో పెరిగాయి. అలాగే తాము అధికారంలోకి వస్తే పాతపథకాలేమీ రద్దు చేయబోమని వాటిని కొనసాగిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. సీనియర్ సిటిజన్లకు ఇచ్చిన రాయితీలు, ఆరోగ్యరంగంలో వారికిచ్చిన హామీలు కూడా పనిచేసాయి. మొత్తంగా చూస్తే హ్యాట్రిక్ కొట్టాలని భావించిన ఆమ్ ఆద్మీకి ఈ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు గుణపాఠమే చెప్పారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

> చదరంగంలో మాదిరిగానే
> జీవితంలో కూడా ముందుచూపు
> ఎంతో అవసరం.

ఐ. జాన్సన్

> చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే,
> చేయాలనే కోరిక ఉన్నవాడు
> ఎక్కువ చేయగలుగుతాడు.

జి.ముర్రే

ప్రజావాక్కు

గిరిజనుల్లో పోషకాహార లోపం

గత ఏడేళ్లుగా, గిరిజనులు ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల కారణంగాతీవ్రమైనపోషకాహారలోపసమస్యను ఎదుర్కొంటున్నారు.భారతదేశంలోని 47లక్షలమందిగిరిజన పిల్లలు తీవ్రమైనపోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఐక్య రాజ్య సమితి తాజా నివేదిక తెలియజేస్తోంది. ఇది వారి మనుగడ, అభివృద్ధి, అభ్యాసం, ఉత్పాదకతను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. జనజీవన స్రవంతికి దూరంగా నివసించే గిరిజనులలోవివక్ష,భౌగోళిక వేర్పాటువాదం, ప్రజా సేవలకు పరిమిత ప్రాప్యత, సాంస్కృతిక వ్యత్యాసాలు వంటిఇతరకారణాల వలనవారుఅవసరమైన సేవల కోసం ప్రభుత్వంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. కాబట్టి, పోషకాహారం ఆరోగ్య సంబంధిత సేవలకోసం వారి పట్ల ప్రభుత్వబాధ్యత రెట్టింపుగావుంది.

-సి.సాయిరుత్విక్, నల్గొండ

అమలు కాని విద్యా హక్కు చట్టం

సమాజంలో కొంతమంది పిల్లలు బడి బయట ఉండిపోవడం, బాలకార్మికులుగా పనుల్లో కార్ఖానాల్లో, గనుల్లో పని చేయడం, వారిప్రవేశానికి పాఠశాల నియమ నిబంధనలు అడ్డంకి రావడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రాథమికహక్కుగా మారిన విద్యను పిల్లలందరూ పొందడానికిగాను ఉచిత నిర్బంధవిద్యకు 'బాలల విద్యా హక్కు చట్టం2009'దేశవ్యాప్తంగా2010ఏప్రిల్ 1నుండి అమలులోకి వచ్చింది.విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చి 16 సంవత్సరాలు అయినా ఇప్పటికీ 10 శాతం కూడా అమలుకావడంలేదన్న నేషనల్ సెంటర్ ఫర్ ప్రైమరీ స్టడీస్ వారి అధ్యయన నివేదిక ఆందోళన కలిగిస్తోంది.

-సి.హెచ్.ప్రతాప్. శ్రీకాకుళంజిల్లా

వేతన జీవులకు ఊరట

వేతన జీవులకు ఉరటనిస్తూ పన్నెండు లక్షలవరకు టాక్స్ తీసివేస్తూ కేంద్రంమధ్యతరగతి జీవులకు ఊరటనిచ్చింది. ఇది శుభ పరిణామం. అంటే దేశంలో సగటు సంపద పెరిగిందన్నమాట.ఇక రెండోవిషయంఏమిటంటే జాతీయ పత్తి మిషన్‌ను ప్రారంభించడం నది తీరా రాష్ట్రాలకు ఉరటనిచ్చేదే. ముఖ్యంగా ఛాంబల్, గోదావరి కృష్ణ తీరా ప్రాంత రాష్ట్రాలు మరింత సంపద సృష్టించబోతున్నాయి. కొన్నిరాష్ట్రాలు పత్తిని పండించడంలో పేరెన్నిక కలిగినవి.

- భారత అవినాష్, జనగామ

వాట్సప్ ద్వారా సమస్యల పరిష్కారం

ఆంధ్రప్రదేశ్ విద్య,ఐ.టి. శాఖల మంత్రి నారా లోకేష్ ఈ మధ్య వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర అనే నూతన పద్ధతిని ప్రవేశపెట్టారు. దీనిద్వారా ప్రజలు తమకు ప్రభుత్వ కార్యాలయాలలో పరిష్కారం కాని అనేక సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ఈవాట్సప్ పద్ధతిని అమలు పరచడం జరిగిందని ప్రకటించారు.ఇచ్చిన నంబరుకు వాట్సప్ చేయాలని పేపరులో ప్రకటన విడుదల చేసారు.సమస్య పరిష్కారం అయినదీ లేనిది తిరిగి వాట్సాప్ కాల్‌లో తెలియ జేస్తారట. ఈ పద్ధతి విజయవంతమైతే ప్రజలకు శ్రమ, లంచాలు ఇచ్చి పనిచేయించుకునే పనితగ్గుతుంది.ఇతర రాష్ట్రాలవారు కూడా ఈవినూత్న ప్రయోగాన్ని ఉపయోగించుకోవచ్చును.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

అమెరికా...అనాగరికా!

అమెరికా అధ్యక్షుడి ఆలోచనలు, నిర్ణయాలు,చర్యలు అనాగరికంగా తయారవుతున్నాయి. అవి ఆదేశాన్ని గొప్పగా మారుస్తాయో లేదో గానీ ఇతర దేశాలకు తలనొప్పిని తెస్తున్నాయి. రాజకీయ,ఆర్థిక,భౌగోళిక స్థితుల్ని తలక్రిందులు చేసేవిగా ఉన్నాయి. ఆదేశంఎదుర్కొంటున్న సమస్యపై అధ్యక్షుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపడం అంత వరకూ అభినందనీయమే.ఒకప్పుడు వలసల్ని ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ ఆర్థికశక్తిగా మారిన దేశం వలసల్ని నేడు అరికట్టాలని అనుకోవడం వారి అవసరం.అయినా అక్రమంగా వచ్చిన వాళ్లని ఆపడం, వెనక్కి పంపించడంలో ఎవరికీ ఆక్షేపణ, అభ్యంతరంఉండనక్కరలేదు.కానీవారినిగొలుసులతో బంధించి, అమానవీయంగా సైనిక విమానాల్లో తరలించడం ఒకింత అతి.

-డా.డి.వి.జి. శంకరరావు, హైదరాబాద్

వ్యక్తిగత క్రమశిక్షణే సరైన చదువు

కళాశాలల్లో ర్యాగింగ్ పేరుతో జరుగుతున్న అమానుష ప్రవర్తనను అరికట్టేందుకు యూజీసి డిక్లరేషన్ వసూలు చేయని వైద్య కళాశాలల సంజాయిషీ కోరి తిరిగి కౌన్సెలింగ్ ద్వారా సీటు ఖాయం జరిగేటప్పుడే పేరెంట్ సమక్షంలో విషయం చెప్పి వసూలు చేయడంలో బాధ్యత, భయం ఉంటాయి. కారణం డబ్బుతో పాటు క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. దీనితో పాటు కళాశాలలో అడుగుపెట్టిన రోజునుండే వారికి, పేరెంట్‌కి కౌన్సెలింగ్ అవసరం. ఇక సీనియర్స్‌కి కూడా ర్యాగింగ్ విషయం లో స్పష్టంగా ఉన్నతాధికారుల ఉత్తర్వులు చెప్పాలి.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

ఆకలి మరణాలకు ఏదీ పరిష్కారం!

దేశంలో ఆకలి,పోషక ఆహార లోపంవల్ల ప్రతిరోజు 4,500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఆకలితో ప్రతిసంవత్సరం 3లక్షలకుపైగా ప్రజలు మరణిస్తున్నారు. ప్రపంచ దేశాల్లోని పేద, సామాన్య ప్రజలు దేశసంపదలకు దక్కకపోవటం, భూములు, ఫ్యాక్టరీలపై హక్కులు లేకపోవటం, పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు, సంపదకేంద్రీకరణ, వెనుకబడ్డ దేశాల్లో సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్య విధానాలు, యుద్ధఘర్షణలు, పర్యావరణ కాలుష్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పేదరికం, ఆకలి మరణాలకు కారణం. పాలకుల విధానాలకు, యుద్ధ ఘర్షణలకు వ్యతిరేకంగా ఆయాదేశాల ప్రజలు ఉద్యమించాలి.

బొల్లిముంతసాంబ శివరావు

ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన కొత్త నివేదిక ప్రకారం ప్రపంచదేశాల్లో కరవు, ఆహార కొరత, యుద్ధఘరణల వల్ల సంభవించిన ఆకలిమరణాల గురించిన వివరాలు తెలియచేసింది. దాని నివేదిక ప్రకారం వెనకబడిన దేశాల్లో ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఆకలి మరణాలు ఎక్కువగా ఉన్నాయి. ఈదేశాల సహజ సంపదలను సామ్రాజ్యవాదులు, బహుళజాతి సంస్థలు దోచుకుపోవటమే అందుకు కారణంగా ఉంది. 2024-25లో ప్రపంచంలో ఆకలి వివరాలు ప్రకారం ప్రతిరోజు 73కోట్ల, 30లక్షల మంది ఆకలితో అలమటిస్తున్నారు. 280 కోట్లమంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం పొందలేకపోతున్నారు. వీరు ప్రపంచ జనాభాలో 35శాతంగా ఉన్నారు. తక్కువ ఆదాయ దేశాల్లో 71.5శాతం మంది ప్రజలకు పుష్టికరమైన ఆహారంఅందటం లేదు.అధిక ఆదాయదేశాల్లో వీరి సంఖ్య 6.3శాతం మాత్రమే. 2024లో గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం 36 దేశాల్లో ఆకలిరేటు తీవ్రస్థాయిలోఉంది. పిల్లల మరణాలలో సగం పోషకాహార లోపంకారణంగా ఉంది. ప్రతిసంవత్సరం 90 లక్షలమంది పిల్లలు ఆకలి సంబంధిత కారణాలతో మరణిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది 5 సంవత్సరాల లోపు పిల్లలే. అనేక దేశాల్లో ఆకలి మరణాలు పెరుగుతూ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నాలుగు సెకన్లకు ఒకరు ఆకలితో మరణిస్తున్నారు. 2021లో ఆహార సంక్షోభంలో 15.5 కోట్ల మంది చిక్కుకున్నారు. తినటానికి తిండిలేక, ఆకలికి తట్టుకోలేక ప్రతినిమిషం 11మంది చనిపోయారు. కరోనా వైరస్ కంటే అత్యంత ప్రమాదకరంగా ఆకలి బాధ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్నది. 2020లో కరవు పరిస్థితులు ఎదుర్కొన్న వారి సంఖ్య కంటే నేడు ఆరురెట్లు పెరిగిందని ఆక్సాఫామ్ నివేదిక వెల్లడించింది. కరోనా సంక్షోభం, ఆర్థిక పతనం, ప్రకృతివైపరీత్యాలు కలిపి 5లక్షల 20 వేలమందికి పైగాప్రజల ఆకలి చావులకు కారణమైందని ఆక్స్‌ఫామ్ నివేదిక తెలిపింది. ప్రజలు ఆకలి చావుల బారినపడుతున్నా, ఇదే సమయంలో ప్రపంచ సైనిక వ్యయం 51బిలియన్ డ్డాలర్లకు పెరిగిందని పేర్కొంది. కోవిడ్ వల్ల పెరుగుతున్న ప్రపంచ అసమానతల కారణంగా 50 లక్షలమందికిపైగా ప్రజలు తీవ్ర పేదరికంలో కూరుకుపోయారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆహార ధరలు పెరిగాయి. ఇదిప్రజలపై తీవ్రప్రభావం చూపింది. ఇదే సమయంలో 2019 నుండి ప్రపంచంలోని 12వందల అతి పెద్దకంపెనీల ఆస్తులు 56 శాతం పెరిగాయి. ఆఫ్రికాలో కరువు ఆకలిఆఫ్రికాలోని కొన్ని దేశాలు, ప్రాంతాలు తీవ్రమైన కరవు, ఆకలి సమస్యను ఎదుర్కొంటున్నాయి. కెన్యా, నైజీరియా, ఇథియోపియా, సోమాలియా తదితర ఆఫ్రికా దేశాల అంతటా 40 ఏళ్లలో చూడని అత్యంత ఘోరమైన ఆహారసంక్షోభంలో ఉన్నాయి. కుటుంబాలు ఆహారం కోసం వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రు వదలలేక వదలివలసపోతున్నారు. పిల్లలను పాఠశాలకు పంపకుండా కుటుంబ అవసరాల రీత్యా పనులకు పంపుతున్నారు, లేదా భిక్షాటన చేయిస్తున్నారు.పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వలన సంపద కొద్ది మంది వద్ద పోగుపడటం,పేదరికం పెరగటం, సంవత్సరాల తరబడి వర్షాభావ పరిస్థితులు, పంటలు విఫలం కావటం, పశువులు చనిపోవటం ఆఫ్రికాలో కరవు ఆహార సమస్యకు, ఆకలి మరణాలకు కారణం అయ్యాయి. ఆఫ్రికాలో1.4 (100కోట్ల,40 లక్షలు)బిలియన్లకుపైగా ప్రజలు ఉన్నారు. వీరిలో22కోట్ల,60 లక్షలమంది ఆకలితో అలమటిస్తున్నారు. ప్రపంచంలోని 30 పేదదేశాల్లో 27దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. ఆఫ్రికాలో అత్యంత పేదరికం, ఆకలితో ప్రభావితమైన దేశాలు సహారాకు దక్షిణాన ఉన్నాయి. ఇక్కడ ప్రతినలుగురిలో ఒకరు ఆకలితో అలమటిస్తున్నారు. ప్రపంచ ఆహార కార్యక్రమం గుర్తించిన 10దేశాల్లో అత్యధికసంఖ్యలో ప్రజలు ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. ఇందులో 5 దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. 2022 గ్లోబల్హ్యాంగర్ ఇండెక్స్ ప్రకారం తీవ్రమైన కరవు ఉన్న 54 దేశాల్లో 37 దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. మధ్య దక్షిణాఫ్రికాలోని 12 దేశాల్లో 45.5 మిలియన్ల ప్రజలు, తూర్పుఆఫ్రికాలోని 9 దేశాల్లో 43.6 మిలియన్ల ప్రజలు, పశ్చిమ ఆఫ్రికా సాహెల్లోని 16 దేశాల్లో 30.4 మిలియన్ల ప్రజలు కరవు పరిస్థితుల్లో ఉన్నారు. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, చాడ్, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్కాంగో,మడగాస్కర్ దేశాలు ప్రపంచ ఆరోగ్య సర్వేప్రకారం ఆందోళనకరమైన ఆకలిస్థాయిలో ఉన్నాయి. నైజీరియాలో 24.5 మిలియన్ల మందికి తినటానికి సరిపడా ఆహారంలేదు. కెన్యాలో 5లక్షల, 20 వేల మంది కరవు వాతపడ్డారు. డిసెంబర్ 2023 నాటికి సోమాలియా కరవు అంచున ఉంది. 80లక్షల, 30వేల మంది ఆహార అభద్రత అధ్వాన స్థాయికిచేరింది.పేదరికం, కరువు, ఆహార కొరత వల్ల పోషకాహారం లభించక పిల్లలకు అనేక సమస్యలు ఎదురౌతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన కనీస అవసరమైన ఆహారం కూడా ఆఫ్రికాలోని 10మంది పిల్లల్లో 9 మందికి అందటంలేదు. రోజుఐదుగురిలో ఇద్దరు భోజనానికి దూరంగా ఉన్నారు. వయస్సుకు అనుగుణంగా ఎదుగుదల లేకపోవటంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులవల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ఆహారలేమి కారణంగా ప్రతి 3 సెకన్లకు ఒక పిల్లవాడు, రోజుకి10 వేల మంది చనిపోతున్నారు. ఆఫ్రికా దేశాలు కరవుకి, ఆకలికి నిలయంగా ఉన్నా, ఆసియాలోనే ఎక్కువమంది ఆకలితో, పోషకాహార లోపంతోఉన్నారు. ప్రపంచంలో పోషకాహార లోపం ఉన్న పిల్లల్లో 64శాతం మంది ఆసియాలోనే ఉన్నారు. ఆసియాలోని 519.6మిలియన్ల పెద్దలు, పిల్లలు చాలా తక్కువ ఖర్చుతో జీవిస్తున్నారు. వీరు ఆసియా మొత్తం జనాభాలో 12 శాతం. దక్షిణాసియాలో పోషక ఆహార లోపంలో గ్లోబల్ హంగర్ ఇండెక్స్ స్కోరు ప్రకారం 30.9 శాతం ఉంది. ఇది తీవ్రమైన ఆకలిని సూచిస్తుంది. అత్యధిక మంది పోషకాహార లోపం, ఆకలితో ఉన్నారు. ప్రపంచంలో 15కోట్ల, 80లక్షల మంది కుంగిపోయిన పిల్లలు ఉంటే, వీరిలో 8,30,60,000 (55శాతం) మంది ఆసియాలోనే ఉన్నారు. (యూనిసెఫ్,వరల్డ్ బ్యాంకుగ్రూపు 2018). దక్షిణ ఆసియా అంతట తీవ్రమైన రక్తహీనత కారణంగా ప్రసవ సమయంలో ప్రతిరోజు 25 వేలమంది మహిళలు చనిపోతున్నారు. ఆఫ్ఘనిస్తాన్, గాజాలో(పాలిస్తీనియా) దురాక్రమణ యుద్ధాలకు,ఘర్షణలకు ఆహార కొరతకు లక్షలాది మంది ప్రజలు చనిపోయారు. ఆకలిసూచిలో భారతదేశం పరిస్థితి దారుణంగా ఉంది. 2022లో 121 దేశాల్లో భారత్ 107 స్థానంలో ఉంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్లు భారతదేశం కన్నా ముందు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో కుంగిపోయిన పిల్లలున్న దేశం భారత్. దేశంలోని మొత్తంపిల్లల్లో 46.8 మిలియన్లు కుంగుబాటుతో బాధపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కుంగిపోయిన పిల్లల్లో వీరుమూడవ వంతుగా ఉన్నారు. దేశంలో కౌమార దశలో(15-19 సంవత్సరాల వయస్సు) బాలికలలో రక్తహీనత 56శాతం ఉంది. భారత్లో చైల్డ్ విస్టింగ్రేటు 19.3 శాతంతో ప్రపంచంలోనే అత్యంత తీవ్ర సమస్యగా ఉంది. దేశంలో ఆకలి,పోషక ఆహార లోపంవల్ల ప్రతిరోజు 4,500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఆకలితో ప్రతిసంవత్సరం 3లక్షలకుపైగా ప్రజలు మరణిస్తున్నారు. ప్రపంచ దేశాల్లోని పేద, సామాన్య ప్రజలు దేశసంపదలకు దక్కకపోవటం, భూములు, ఫ్యాక్టరీలపై హక్కులు లేకపోవటం, పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు,సంపదకేంద్రీకరణ, వెనుకబడ్డ దేశాల్లో సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్య విధానాలు, యుద్ధఘర్షణలు, పర్యావరణ కాలుష్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పేదరికం, ఆకలి మరణాలకు కారణం. పాలకుల విధానాలకు, యుద్ధఘర్షణలకు వ్యతిరేకంగా ఆయాదేశాల ప్రజలు ఉద్యమించాలి. ●

వన్యప్రాణుల రక్షణ ఎవరి బాధ్యత?

డాక్టర్ మోటె చిరంజీవి

వన్యప్రాణుల సంరక్షణ అనేది వృక్ష జంతు జాతులను వాటి ఆవాసాలను రక్షించే పద్ధతి. వన్యప్రాణులు ప్రపంచ పర్యావరణ వ్యవస్థలకు అంతర్భాగం. ప్రకృతి ప్రక్రియలకు సమతుల్యత స్థిరత్వాన్ని అందిస్తాయి. వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యం ఈ జాతుల మనుగడను నిర్ధారించడం, ఇతర జాతులతో స్థిరంగా జీవించడంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సాధ్యమవుతుంది. వన్యప్రాణులకు రక్షణ కరవైంది. ఫలితంగా రోజురోజుకూ అవి కనుమరుగవుతున్నాయి.ధనార్జనే ధ్యేయంగా ఏజెన్సీ గ్రామాల్లో వేటగాళ్లు ఉచ్చులు, విద్యుత్‌తీగలు అమర్చి అడవిజంతువులను వధిస్తున్నారు. అనంతరం గుట్టుచప్పుడు కాకుండా వాటి చర్మం, మాంసాన్ని పట్టణ ప్రాంతాలు, శివారుల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరైనా సమాచారం ఇస్తేనే పట్టుకుంటున్నారని, మరి కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. వన్యప్రాణుల సంరక్షణకు కఠిన చట్టాలున్నా అవి అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి. వేటగాళ్లఉచ్చులో పడి వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. పంటల కోసం అవి వస్తుండడంతో వేటగాళ్ల ఉచ్చులు, విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొండగొర్రె, అడవి పందులు, దుప్పులు, కుందేళ్లు, కొండముచ్చులు వంటి అడవి జంతువులు మృత్యువాత పడడంతో గుట్టు చప్పుడు కాకుండా మాంసాన్ని మైదానప్రాంతాల్లోని రహస్య ప్రదేశాలకు తీసుకొచ్చి కిలో రూ. 500 నుంచి రూ. వేయివరకు విక్రయిస్తున్నారు. వన్యప్రాణుల వేట యధేచ్ఛగా కొనసాగుతోంది. బయటి ప్రాంతాల నుంచి కొందరు వేటగాళ్లు తుపాకులు వేసుకుని అడవిలో సంచిరిస్తూ, వన్యప్రాణుల పాలిట యమకింకరులు అవుతున్నారు. వన్యప్రాణులను సంరక్షించడానికి అనేక చట్టాలున్నాయి. వన్యప్రాణులను రక్షించడానికి భారత పార్లమెంటు 1972లో వన్యప్రాణుల (రక్షణ)చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం వన్యప్రాణుల రక్షణ, సంరక్షణ, నిర్వహణకు సంబంధించిన నిబంధనలను కలిగిఉంది. అందులో ముఖ్యంగా అడవి జంతువులు, పక్షులు మొక్కలకు రక్షణ కల్పించడం ఈ చట్టం ప్రధానలక్ష్యం. కొన్ని ప్రాంతాలను అభయారణ్యాలు లేదా జాతీయ ఉద్యానవనాలుగా ప్రకటించాలి. అడవి జంతువుల వేటను చట్టం నిషేధిస్తుంది. కొన్ని చట్టాలను చూసినట్లయితే భారతదేశ వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972, అటవీ, పక్షుల, జంతువుల భద్రతా చట్టం- 1912, భారతీయ ఏనుగుల భద్రతచట్టం-1879, బెంగాల్ ఖడ్గమృగ చట్టం 1932,మద్రాసు అటవీ ఏనుగుల చట్టం 1873, అసోం ఖడ్గమృగ భద్రత చట్టం 1954, ఇవేకాక ఆదేశిక సూత్రాల్లోని 48వ ప్రకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వన్య ప్రాణులను సంరక్షించాలని పేర్కొంది. అదే విధంగా 51బి ప్రకారం వన్యప్రాణుల సంరక్షణపౌరుల ప్రాథమిక విధిగా పేర్కొంది. 42వ సవరణ ద్వారా వన్య ప్రాణుల సంరక్షణ రాష్ట్రజాబితా నుంచి ఉమ్మడి జాబితా లోకి మార్చారు. జంతువుల,పశువుల ఆవాసాలను సంరక్షించడం, అంతరించిపోతున్న జాతులను సంరక్షించడం, అక్రమ వేటను నివారించడం, జంతువులే మన దేశ భవిష్యత్తు అని భావించడం. జంతువులు మన జీవితంలో ఒక భాగం. ప్రజలు వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాటికి హాని కల్పిస్తున్నారు. దీని నివారించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. కానీ ప్రతి పౌరుడిగా మనం ముందడుగు వేసి మన కర్తవ్యాన్ని నెరవేర్చినప్పుడే వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమవుతుంది. అందుకే వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతగా భావించినప్పుడే వాటిని సంరక్షించగలం. ●

సంపద అశాశ్వతం.. జ్ఞానం శాశ్వతం

మేకిరి దామోదర్

ప్రతి బిడ్డ పుట్టినప్పుడు విశ్వ మానవుడే. మనమే జాతి, మతం, ప్రాంతం, కులం, తక్కువ, ఎక్కువ లాంటి సంకుచిత పరిధుల్లోకి కుదించి చిన్నవాడిని చేస్తాం. మంచి విద్య వారిని మళ్లీ విశ్వమానవుల్ని చేస్తుంది. భారతదేశ వ్యాప్తంగా సుమారు 26కోట్లకు పైగా పాఠశాల విద్యార్థులున్నారు. వారిలో60 శాతం సర్కారీబడుల్లోనే చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన విద్య అందకపోతే మన దేశ భవిష్యత్తు ఏంకావాలి?. ఈ ఆలోచన పాలకుల్లో ఉన్నట్లైతే సర్కారీ విద్యను గాడిన పెట్టవచ్చు. దానికి కావల్సిందల్లా ప్రభుత్వాలు ప్రతి ఆర్థికసంవత్సరంలో విద్యారంగం మీద సరైన శ్రద్ధవహించడం, నిధులు వెచ్చించడంతో నిపుణత, సృజనాత్మకత, ఉత్పాదకతల్లో సాటిలేని మేటి మానవ వనరులు సిద్ధమవుతాయి. వాటి ద్వారా దేశ ఆర్థిక పురోగమనం వేగవంతమవుతుంది. ప్రగతిశీల ఫలాలపంపిణీ సమంగా జరిగి జనజీవన ప్రమాణాల మెరుగుదల సాధ్యపడుతుంది. కానీ ఇందుకు భిన్నంగా మన దేశంలో చదువులు భావితరాల సహజనైపుణ్యాన్ని హరిస్తున్నాయి. సంవత్సరం తిరిగే సరికే విద్యార్థుల పై తరగతులకు వెళ్తున్నప్పటికీ, అత్యధిక అభ్యసన సామర్థ్యాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడిఅక్కడే అన్నట్లుగా అఘోరిస్తున్నాయి. పునాది డొల్లైతే ఎంతపెద్ద భవనమైనా పేక మేడలా కూలిపోతుంది. ప్రాథమిక విద్యలో పిల్లలు వెనుకబడితే వారి ఎదుగుదలకు అదే ప్రధాన అవరోధమవుతుంది. మరోవైపు తల్లిదండ్రులు, సమాజం పిల్లల చదువుల పేరిట వారిని ప్రైవేట్, కార్పొరేట్ పంజరాల్లోకి నెట్టేస్తున్నారు. పిల్లలు ప్రయోజకులుకావాలని, జీవితాలు వెలిగిపోవాలని తల్లిదండ్రులు కోరుకోవడం సహజమే. కానీ ఆ యావలో ప్రాధాన్యాలు మర్చిపోతున్నారు. మార్కులు, ర్యాంకులు, కెరీర్ అంటూ పిల్లలను ఒత్తిడికి గురి చేస్తున్నారు. తాము సాధించలేని లక్ష్యాలన్నింటిని వారిపై రుద్దేస్తున్నారు. పిల్లలందరి శక్తి సామర్థ్యాలు ఒకేలా ఉండవు. ముఖ్యమైన ఈ విషయాన్ని మరిచిపోయి ఇతరులతో పోలుస్తూ, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు. పిల్లలు ఆడుతూ పాడుతూ చదువుకోవాలి. స్వేచ్ఛగా స్వతంత్రంగా ఎదగాలి. చదువునైనా, కళనైనా, ఆటనైనా వారి ఇష్టాఇష్టాలను బట్టి నేర్పించాలి. తల్లిదండ్రులు ముఖ్యంగా గమనించాల్సిన అంశం ఏమిటంటే పిల్లల్ని పెంచే అవకాశం ఎవరికైనా ఒక్కసారే వస్తుంది. అక్కడ పొరపాటు జరిగితే సరిదిద్దుకునే ఛాన్స్ ఉండదు. అందుకని ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత నేటి సమాజం, తల్లిదండ్రులపై ఎంతో ఉంది. ఇక్కడ అజ్ఞానాన్ని పారద్రోలి ప్రగతిశీల ఆలోచనలకు పాదుగొల్పడం, నవతరానికి నవీన నైపుణ్యాలను అలవర్చడం చదువు లక్ష్యం. అంతేకాదు జీవితం పట్ల ఆశావహ దృక్పథాన్ని, జీవన గమనాన్ని నిర్దేశించుకునే తెలివిని, దానిని చేరుకునే దృఢచిత్తాన్ని భావితరానికి అందించడం విద్య పరమార్థం. కానీ దేశీయంగా జరుగుతున్నది ఏమిటి? మూస పాఠాలు, బండ బోధనా పద్ధతులకు తోడు ర్యాంకుల ఉన్మాద రేసులో విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. పిల్లల సహజ ప్రతిభను గాలికొదిలి, మార్కులు, గ్రేడుల రేసులో ఒత్తిడికి గురి చేయడం వల్ల నిస్సహాయ స్థితికిలోనై మరణాలకు పాల్పడుతున్నారు. ఇలా జాతీయ నేర గణాంక సంస్థల లెక్కల ప్రకారం 2013లో దేశవ్యాప్తంగా ఆరున్నర వేల మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పదేళ్ల వ్యవధిలో అటువంటి అభాగ్యుల సంఖ్య అంతకంతకు రెట్టింపు కావడం మన విద్యా వ్యవస్థ వైఫల్యాన్ని కళ్లకు కడుతుంది. వాస్తవంగా మానవ వికాస పరిణామక్రమంలో మనిషి ఆలోచనా విధానం అనేకమార్పులు చెందుతూ వచ్చింది. ఆదిలో ఆకలి తీరితే చాలనుకున్నాడు. తర్వాత ఉండడానికి గూడు, ఒంటిమీద బట్టను కోరుకున్నాడు. ఆ కోరికల చిట్టా నెమ్మదిగా ఆస్తులు కూడపెట్టడం వరకు చేరింది. చివరికి జీవితమంటే ధనం సంపాదించడం కోసం అన్నట్లయింది. ఏ జ్ఞానంతో అయితే మానవ జీవితం వికాస పరిణామం చెందిందో ఆ జ్ఞానం మరుగున పడిపోయింది. జ్ఞానమే అసలు సంపదనే వాస్తవ ఉనికిని కోల్పోయింది. పౌరులందరూ నాణ్యమైన జీవితాలు గడపగలడమే దేశ ప్రగతికి నిజమైన కొలమానం. ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా, గౌరవప్రదంగా జీవించాలంటే తలసరి ఆదాయాల్లో అసమానతలు సమసిపోవాలన్నది నిర్వివాదాంశం. అలాంటి వాస్తవిక సమ్మిళిత, సుస్థిరాభివృద్ధికి భరత జాతి ఎప్పుడు నోచుకుంటుంది?. విద్యారంగం మీద ప్రభుత్వాలు సరైన బడ్జెట్ కేటాయించి, శ్రద్ధవహిస్తూ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నాణ్యమైన ఉచిత విద్యను అందించినప్పుడే అది సాధ్యపడుతుంది. మన దేశంలో 75ఏళ్ల ప్రజాపాలనలో విద్యపై చేసే ఖర్చు నానాటికి తెగ్గోసుకుపోతుంది. అంతేకాదు నాణ్యమైన ఉచిత విద్యను పొందడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కు. విద్యను అంగడి సరుకుగా చేశాక విలువలు, జ్ఞానసంపద అర్థమే మారిపోతోంది.సర్కారీ విద్యపై పాలకుల మాటలు నీటిపై రాతలుగా మారుతున్నాయి. ఈ తీరు మారాలి. ఈ దేశం బాగుపడాలంటే విద్యాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారకుండా విజ్ఞాన కేంద్రాలుగా బాసిల్లాలి. అప్పుడే విలువ ఆధారిత బోధన సాధ్యమవుతుంది. ఇలా విలువ ఆధారిత విద్యతోనే మంచి సమాజం నిర్మాణం అవుతుంది. ఈ రోజుల్లో మంచి వ్యక్తుల అవసరం ఎంతో ఉంది. మంచి వ్యక్తులను నిర్మించే కర్మాగారాలైన విద్యాలయాల వల్లనే సాధ్యం. "ప్రపంచాన్ని మార్చగల గొప్ప ఆయుధం విద్య ఒక్కటే."విద్యను నిర్లక్ష్యం చేస్తే, దేశం నిర్లక్ష్యానికి గురవుతుంది. విద్య జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందిస్తుంది. నాణ్యమైన జీవితాన్ని గడపడానికి ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ●

అక్షర

విజయక్రాంతి
హైదరాబాద్, సోమవారం, 10 ఫిబ్రవరి 2025
www.vijayakranthinews.com

కాలమే అంత

కోట్ల వెంకటేశ్వరరెడ్డి
9440233261

లోన ఆకులు రాలుతుంటే
అనుభవాలు పచ్చనవుతాయి
మిడిసి పడిన భవనం
కాలం గడుస్తుంటే
పెచ్చులూడదీసుకుంటది!
పైపై అందాలు మసక బారుతుంటే
లోలోన అంతర్ దృష్టి విరాజిల్లుతది
గాలిలో ఎగిరే పతంగిని
ఎవరు ఎంత కాలం ఎగుర వేస్తారు
తాడు తెగిందా
ఆట ముగిసి పోతది!
ఇంతకాలం కలిసి ఆడిన వారు
కలిసి భోజనం చేసిన వారు
అంతా కనుమరుగై పోతారు
దీపం కొండెక్కినప్పుడు
దిగులు మేఘాలన్నీ
ఒక్కసారిగా దుఃఖ సముద్రాలైతవి!
పోయే మర్మం ఎవరూ చెప్పరు
అద్దం జారి ముక్కలైనప్పుడు
జ్ఞాపకాలన్నీ చెల్లాచెదరై పోతవి
ఈ గాయం మానదేమో అనుకుంటాం
పది రోజులకు మానుబడతది
ఆ ఇల్లంతా తెప్పరిల్లడానికి
కాలం కొంత కాలానికి
మంత్రమేదో వేస్తది
పెత్తరమాస నాటికి
ఇష్టమైన భోజనం సిద్ధం చేస్తది!!

మన మాణిక్యాలు

భాగవత రచనా భాగస్వామి
వెలిగందల నారయ

"ఏనుమృతుండ నౌదునని
యింతభయంబు మనంబులోవలన్
మానుము, సంభవంబుగల
మానవకోట్లకు జావు నిత్యమౌ
గాన హరిందలంపుమిక గల్గదు
జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ! పొందెదవు
మాధవలోక నివాస సౌఖ్యముల్"

అంటూ భాగవత ప్రాధాన్యాన్ని, మాధవ స్మరణ ప్రాముఖ్యాన్ని చెబుతూనే మానవునికి పథ నిర్దేశం చేసిన ఈ పద్యం భాగవతంలోని 12వ స్కంధం లోనిది. మహాభాగవతాన్ని తెలుగులోకి అనువదించి అమృత తుల్యమైన పద్యాలను అందించిన బమ్మెర పోతన్నకు శిష్యుడైన వెలిగందల నారయ కూడా ఈ భాగవత రచనలో భాగస్వామియై, అందులోని 11, 12 స్కంధాలను అనువదించి తరించాడు. ఈ పద్యాన్ని కూడా నారయ రచించడం ద్వారా 'మానవుడు మరణభయాన్ని వదలిపెట్టి ఆ శ్రీమన్నారాయణుని స్మరణతో జీవితాన్ని తరింపజేసుకోవాలి' అన్న గొప్ప సందేశాన్ని అందించాడు.



నలుగురు కవుల కృతి

మహాకవి బమ్మెర పోతన జీవితంలోని ప్రతి ఘట్టమూ ఆచరణీయం. మానవునికి వినయశీలతకు మార్గం చూపిన కవి పోతన్నే. భాగవతంలోని అవతారికే దానికి ప్రత్యక్ష సాక్ష్యం. ఆయనకు శిష్య వాత్సల్యం మెండు కనుకే, భాగవత రచనవల్ల తానొక్కడే తరించాలనుకోకుండా మరో ముగ్గురికి భాగస్వామ్యం కలిగించాడు. ఏర్చూరి సింగన, బొప్పరాజు గంగన, వెలిగందల నారయలతో భాగవతం నలుగురు కవుల కృతిగా నిలిచింది. అందులోనూ వెలిగందల నారయ పోతనకు తాను శిష్యుణ్ణన్న విషయాన్ని గ్రంథాంతంలోని గద్యలోనే చెప్పుకొని గురుస్మరణ చేశాడు. భాగవత రచనలోని భాగస్వాముల రచన పోతన్న రచనకు సరితూగక పోవచ్చు. కాని, వాళ్లకున్న ప్రత్యేకతలు వాళ్లకున్నాయి. ఇదొక ప్రజాస్వామిక ధోరణి. మహాభారత రచనలోకూడా ముగ్గురే కవులైనా పూర్వపు కవులు వదిలిపెట్టిన భాగాలను వారు రచించి కవిత్రయ భారతముగా దానికి పేరు తెచ్చి పెట్టారు. భాగవతము నలుగురు కవుల రచనయైనా అది పోతన భాగవతంగానే ప్రసిద్ధి కెక్కింది. ఇందులో వారి కోసమే పోతన్న ఆ భాగాలను నిర్దేశించడం ద్వారా వారికి భాగస్వామ్యం కలిగించాడు. అంతేగాక, మిగిలిన ముగ్గురు కవుల రచనలు పోతన రచనకు దీటైనవి కాకపోవడం కూడా ఒకటి కావచ్చు.

సంగ్రహానువాదం

"ఇది శ్రీపరమేశ్వర కరుణా కలిత కవితా విచిత్ర కేసన మంత్రిపుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రియశిష్య వెలిగందల నారయ నామధేయ ప్రణీతంబైన శ్రీమహాభాగవతంబను మహా పురాణంబునందు.." అంటూ చెప్పుకున్న గద్యను బట్టి నారయ పోతన్న శిష్యుడేగాక దాదాపుగా పోతన గద్యవంటి గద్యనే రచించాడు. అలా, తాను పోతన ప్రభావంతోనే ఈ రెండు పర్వాల అనువాదానికి పూనుకున్నాడనిపిస్తుంది. అయితే, పోతన శైలీ మధురిమ, పద్యమాధుర్యం వంటి గుణాలేవీ ఈ శిష్యునిలో లేవని కీ.శే. చాగంటి శేషయ్య, కీ.శే. ఆరుద్ర వంటి సాహిత్య శాస్త్రవేత్తలు భావించారు. వెలిగందల నారయ అనువాదం సంగ్రహానువాదంగా ఉన్నట్టు ఆచార్య ఎస్.వి.రామారావు అభిప్రాయపడ్డారు. అయితే, పోతన్న రచించిన కొన్ని స్కంధాల్లోకూడా గద్యలో పోతన గద్యయే ఉన్నా కొన్నికొన్ని స్కంధాల్లో వెలిగందల నారయ పద్యాల వంటి పద్యాలున్నాయని, అవి నారయ పద్యాలే అయి ఉంటాయని కూడా సాహితీవేత్తలు భావించారు. ముఖ్యంగా 3వ స్కంధంలోని 289 పద్యాల్లో 97 పద్యగద్యాల వరకే పోతన్నవని, మిగిలినవన్నీ నారయ పద్యాలేనని ఆరుద్ర పేర్కొన్నారు. అంతేకాదు, దశమ స్కంధంలోని ఉత్తరభాగంలో కనిపించే 1,337 గద్యపద్యాల్లో ఎక్కువ భాగం వెలిగందల నారయవే ఉన్నాయని కూడా పేర్కొన్నారు. శైలినిబట్టే ఈ విధంగా భావిస్తున్నట్టు కూడా చెప్పారు. చాగంటి శేషయ్య తమ 'ఆంధ్రకవి తరంగిణి'లో నారయ రచించిన 11, 12 స్కంధాల్లో 'హరిభట్టు' రచించిన పద్యాలుకూడా చేరయని గుర్తించారు. బహుశా తరువాతి కాలంలో లేఖకులు వీటిని ఇందులో చేర్చి ఉండవచ్చునని అనుమానించారు. ప్రముఖ సాహితీవేత్తలు కీ.శే. నిడుదవోలు వెంకటరావు 'పోతన్న అద్వైతి, నారయ విశిష్టాద్వైతి' అని పేర్కొంటూ, నారయ రచనా భాగంలో చాలాచోట్ల విశిష్టాద్వైత సంప్రదాయాలు కనిపిస్తున్నాయని అన్నారు.

గన్నమరాజు గిరిజా మనోహరబాబు
9949013448

పోతన ప్రభావం

వెలిగందల నారయ పోతన్న శిష్యులు కావడం కారణంగా చాలా సందర్భాల్లో పోతన ప్రభావం కనిపిస్తుంది. పోతన పేరు స్మరించుకోగానే స్ఫురించేది ఆయన పద్యాల్లోని శబ్దాలంకార వైచిత్రి.

"అడిగెదనని కడువడి జను
అడిగిన దను నుడువదని నడయుడుగున్
వెడవెడ నిడిముడి దడబడ
నడుగిడు నడుగిడదు జడిమన డుగిడు నెడలన్"

అన్న సర్వలఘు కందం వంటి ఎన్నో పద్యాలు పోతన్న ప్రతిభకు సాక్ష్యాలుగా నిలిచాయి. ఈ రచనా శైలికి అబ్బురపడ్డ వెలిగందల నారయ కూడా అనేక సర్వలఘు పద్యాలు రచించాడు. ఆయన రచించిన 11 స్కంధంలో–

"నవ చరణ సరసిరుహ నయనయుగ నిజచరణ
గగన చరనది నిఖిల నిగమ వినుత
జలధిసుత కుచకలశ లలిత మృగమద రుచిర పరి
మిళత నిజహృదయ ధరణి భరణ
ద్రుహిణ ముఖసుర నికరవిహిత నుతికలిత గుణ
కటి ఘటిత రుచిరతర కనక వసన
భుజగరిపు వరగమన రజతగిరిపతి వినుత సతత
వృత జపనియమ సరణి చరిత
తిమికమఠ కిటినృహరి ముదిత బలి నిహి
తపద పరశుధర దశవదన విదళన
మురమథన కలికలుష సుముదప హరణ
కరివరద మునివర సురగడరుడ వినుత"

అన్న ఈ పద్యంలో తన గురువైన బమ్మెర పోతన్నకు ప్రీతికరమైన శబ్దాలంకార ధోరణిని అనుసరించి శ్రీమన్నారాయణుని దశావతార స్ఫురణను ప్రస్తావిస్తూ, ఏకంగా సీసపద్యాన్ని రచించాడు. అలా పోతన్నను స్ఫురింపజేశాడు.

'సదానంద యోగి' శతక రచన

వెలిగందల నారయ విశిష్టాద్వైత సంప్రదాయాన్ని అనుసరించేవాడు గనుక తన గురువైన పోతన్న అద్వైతి అయినా ఆ సంప్రదాయాలను ఎక్కడా చెప్పలేదు. తాను రచించిన భాగాల్లో తన విశిష్టాద్వైత సంప్రదాయాన్నే పాటించినట్లు తెలుస్తున్నదని సాహితీవేత్తలు నిర్ధారించారు. ఈయన రచించిన 11వ స్కంధంలో 'శ్రీకృష్ణుణ్ణి వైకుంఠానికి రమ్మని బ్రహ్మాది దేవతలు వేడుకోవడం, కృష్ణుడు తన శిష్యుడైన ఉద్ధవునికి పరమార్థాన్ని బోధించడం, యాదవుల మరణం, కృష్ణ బలరాముల నిర్యాణం' మొదలైన అంశాలు ఉన్నాయి. అదే విధంగా, 12వ స్కంధంలో 'శుకుడు పరీక్షిత్తుకు మరణభయం వదలి పెట్టమని చెప్పడం' మొదలైన అంశాలున్నాయి. తను రచించిన రెండు స్కంధాల్లోనూ నారయ మత్తేభం, శార్దూలం, ఉత్పలమాల, చంపకమాల, మత్తకోకిల వంటి వృత్తాలేగాక కందం, సీసం, ఆటవెలది, తేటగీతి వంటి దేశిపద్యాలతోపాటు మాలిని వంటి విశేష వృత్తాల్లోనూ రచన కొనసాగించాడు. వెలిగందల నారయ ఇతర రచనలేవీ తెలియకపోయినా 'శతక కవుల చరిత్ర'కారులైన వంగూరి సుబ్బారావు, నారయ 'సదానంద యోగి' శతక రచన చేసినట్లు తెలిపారు. ఆయన కూడా నారయకు గురుస్థానంలోని వాడేనన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇంతకు మించి వెలిగందల నారయ రచనలేవీ తెలుగు లోకానికి అందుబాటులో లేవు.

భాగవత రచనలో భాగస్వామి

'వెలిగందల'ను ఇంటిపేరుగా కలిగిన నారయ భాగవత రచనలో భాగస్వామి కావడం వల్ల అది నిలిచినంత కాలం నిలుస్తాడు. ఆయన వెలిగందల గ్రామానికి చెందినవాడు గనుక ఆ పేరుకూడా నిలిచింది. ఈనాటికీ ఆ పేరుతోనే కరీంనగర్ పట్టణానికి సమీపంలోని వెలిగందల ఒక చారిత్రాత్మక గ్రామం. నేటికీ అక్కడి ఆలయాలు, వెలువడిన శాసనాలవల్ల ఆ గ్రామ వైభవం తెలుస్తున్నది. కాకతీయుల కాలం నాటి నుంచి ఉన్న ఈ చారిత్రక గ్రామం 1905 వరకు కరీంనగర్‌కు జిల్లా కేంద్రంగా ఉండేది. ఈ జిల్లాకు పూర్వనామంగానూ ఉండింది. బమ్మెర వాడైన పోతన తిరిగిన ప్రాంతాల్లోనిదైన ఈ వెలిగందలకు కూడా భాగవతం చిరకీర్తిని ఇచ్చింది. ఆ కవిత్వం పోతన స్థాయిలో లేకున్నా, సాహితీవేత్తలు తన రచన విషయంలో ఎన్ని కావ్య దోషాలు చూపించినా, సంవిధానంలో పరిణతి తక్కువైనా, వెలిగందల నారయ 'భాగవత' రచనా భాగస్వామి కావడమే ఆయనను చిరకాలం స్మరించుకునే కవిగా నిలిపింది. ఇదే పోతన తన శిష్యునిపై చూపిన అనుగ్రహానికి నిదర్శనం.

కవిత్వంలో ఆనందానికి
కాలం చెల్లిందా?

డా. సంగనభట్ల నరసయ్య వెలువరించిన కవితా సంపుటి 'సమాంతర రేఖలు'. సాహితీ లోకానికి పరిశోధకుడిగా, పండితుడిగా, తెలివాహతో చరిత్రకారుడిగానూ పరిచయమైనా అద్భుత కవితా ప్రయోగాలతో కవిగానూ మరో పార్శ్వాన్ని దర్శింపజేశారు. నరసయ్య ఒకచేత సంప్రదాయాన్ని అభిమానిస్తూనే మరోవైపు నుంచి అభ్యుదయ భావుకుడు. 'సమాంతర రేఖలు'లో మొత్తం 31 కవితలు ఉన్నాయి. 'దివ్వె నేత్రాలు'లో కొన్ని పద్యాలున్నా ఇందులో మాత్రం అన్నీ వచన కవితలే. అవన్నీ సమకాలీన సమస్యలకు స్పందనలే. భిన్నత్వంలో ఏకత్వ భావాన్ని మరిచిన వారికి మానవత్వాన్ని గుర్తుచేశారు. మతోన్మాదులకు తనదైన శైలిలో జ్ఞానబోధ చేశారు. మతాల ప్రాథమిక సూత్రాలని అవగాహన చేసుకోకుండా వ్యవహరించే వారికి ఇదొక హెచ్చరిక.

సమాంతర రేఖలు
డా॥ సంగనభట్ల నరసయ్య

ఇవాళ కవులు పెరిగారు. కవితా సంకలనాల సంఖ్య కూడా పెరుగుతున్నది. కానీ, తీసుకున్న వస్తువును కవిత్వంగా మలచడానికి అవసరమైన భాషా పరిజ్ఞానం, అభివ్యక్తిలో విలక్షణత వంటివి కొరవడుతున్నాయి. పైగా 'ఎంత అర్థం కాకుండా రాస్తే అంత గొప్ప' అనుకుంటున్నారు కొందరు. 'నేను కవినయ్యాను, శబ్దం మీద అధికారం సంపాదించావా అనకండి, అర్థం అక్కర్లేనిది ఈనాటి కవిత్వం, ఆనందం అవుట్ డేటెడ్' అంటూ సంగనభట్ల వారు సెటైర్ విసిరారు. సముద్రాన్ని చాలామంది గంభీరతకు పోలికగా తీసుకుంటారు కానీ, నరసయ్య దాన్నొక ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతీకగా పేర్కొనడం విశేషం. 'ఓహ్ ఈ సముద్రం' అనే కవితలో 'ఈ సముద్రం ఎంత భయంకరంగా ఉంది, మూడొంతుల భూమిని మింగేసిన బడా భూస్వామి, భూదాహంలా మాటిమాటికి భూమి దురాక్రమణకు, అలల హస్తాలతో ఉద్యమిస్తుంది' అంటారు. ఆయన అభివ్యక్తి సామర్థ్యానికి ఇదొక ఉదాహరణ. మొత్తంగా మనసుకు మేధస్సుకు జరిగే సంఘర్షణనే సమాంతర రేఖలు'గా అక్షరబద్ధం చేశారాయన.

'ఆశలు ఆకాశంలో పయనిస్తామంటే, ఆచరణలు పాతాళంలో పరిగెడుతామంటున్నాయి. మనసు విషాన్ని కక్కుతుంటే, ముఖం ముసిగా నవ్వుతానంటుంది' అంటారు మరోచోట సీనియర్ కవి సంగనభట్ల. ఈ కవితలో నూతన ఆర్థిక సరళీకృత విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత ప్రకృతి సంపద జాతి సంపదగా కాకుండా బహుళ జాతి కంపెనీల గుత్తసొమ్ముగా మారడం, చివరకు పర్యావరణాన్ని దెబ్బ తీస్తూ, మనిషి ఉనికినే ప్రశ్నార్థకం చేయడం.. వంటి సందర్భాలను ఆయన కవిత్వంలో చూస్తాం. కరీంనగర్ జిల్లాలో తన కళ్ళ ముందే వందలాది గుట్టలు పిండిగా మారుతుంటే తట్టుకోలేని నరసయ్య, తన అనుభూతిని అందరి అనుభూతిగా వ్యక్తం చేశారు 'ఇంకెక్కడి కొండ' అనే కవితలో. 'అమ్మ పాలిస్తున్న స్థనంలా కొండ, పల్లెకు కొండంత అండగా నిలిచిన కొండ, పల్లీయుల ప్రాణాలకు సంజీవని కొండ, పైసలు అక్కర లేని పసివాళ్ళ అంగడి కొండ' అంటారు. 'చివరికి సంవేదనతో మనిషికి బతుకు నేర్పిన నేరానికి, తానే తెల్లారి పోయిన కొండ' అని ముగిస్తారు. ఇలా మన హృదయాలను ద్రవింప చేసే కవితలే అన్నీను. ప్రతిదీ పాఠకుల్ని ఆలోచింపజేస్తుంది. అభివ్యక్తిలో భాగంగా కవి అక్కడక్కడ ప్రయోగించిన 'మూడు ప్లాట్లు ఆరు బ్యాంకర్లు, అక్షర రాక్షసుడా, దినపత్రిక పావురం, తెల్లనాగుల సెలయేళ్లు, వార్ధక్యపు శిథిలాలు' మంచి పదబంధాలు. రుబ్బురోలు, తాజ్‌మహల్, మల్లెమొగ్గ మసిబొగ్గ, విచ్చుకున్న నేత్రం వంటి కవితలు భావగర్భితమైనవి. మానవీయ మూల్యాల పరిరక్షణకై కవితా శరసంధానం చేసిన సంగనభట్ల నరసయ్య సామాజిక అనుభూతికి, అభివ్యక్తికి అక్షరరూపమే ఈ సంపుటిని భావించాలి.

డా.శంకరమంచి శ్యాంప్రసాద్
9989148305

హైదరాబాద్ బజార్లలో..

సరోజినీ నాయుడు
జయంతి 13న

ఓ వ్యాపారులారా,
మీరు ఏమి అమ్ముతారు?
మీ వస్తువులు విస్తారంగా ప్రదర్శించబడ్డాయి.
ఎరుపు మరియు వెండి తలపాగాలు,
ఊదా రంగు బ్రోకేడ్‌తో తయారు చేసిన వస్త్రాలు,
అంబర్ ప్యానెల్స్ తో అద్దాలు, జాడే హ్యాండిల్స్ తో
చేసిన కత్తులు.
ఓ వ్యాపారులారా, మీరు ఏమి తూకం వేస్తారు?
కుంకుమ, పప్పు మరియు బియ్యం.
ఓ కన్యలారా, మీరు ఏమి రుబ్బుతారు?
ఓ పెడ్లర్స్, మీరు ఏమి పిలుస్తారు?
చదరంగం మరియు దంతపు పాచికలు.
గంధపు చెక్క, గోరింట మరియు సుగంధ ద్రవ్యాలు.
ఓ స్వర్ణకారులారా, మీరు ఏమి చేస్తారు?
మణికట్టు మరియు చీలమండ మరియు ఉంగరం,
నీలి పావురాల పాదాలకు గంటలు
డ్రాగన్‌ఫ్లై రెక్కలా బలహీనంగా ఉంటాయి,
నృత్యకారులకు బంగారు నడికట్లు,
రాజు కోసం బంగారు స్కాబార్డ్స్.
ఓ పండ్ల మనుషులారా, మీరు ఏమి ఏడుస్తారు?
సిట్రాన్, దానిమ్మ మరియు ప్లం.
ఓ సంగీతకారులారా,
మీరు ఏమి వాయిస్తారు?
సితార్, సారంగి మరియు డ్రమ్.

ఓ ఇంద్రజాలికులారా, మీరు ఏమి జపిస్తారు?
రాబోయే యుగాలకు మంత్రాలు.
ఓ పూల అమ్మాయిలారా,
మీరు ఏమి నేస్తారు నీలిరంగు మరియు
ఎరుపు రంగులతో కూడిన కుంచెలతో?
వరుడి నుదురుకు కిరీటాలు,
అతని మంచానికి దండ వేయడానికి చాప్లెట్లు.
చనిపోయిన వారి నిద్రను పరిమళించడానికి
కొత్తగా అలంకరించబడిన తెల్లటి పువ్వుల షీట్లు.

(ఆల్‌పొయెట్రీ.కామ్ సౌజన్యంతో)

పక్కవాడి కంటే నువ్వు పెద్ద కావాలంటే
నువ్వు పెద్ద గీత కావాలి
వాడి గీత కోసి మన గీత పెద్దదనుట సరికాదు
ఎదుగుతూ ఒదుగుతూ గెలవటమే ధన్యం
సత్యమిదే తెలుసుకో మిత్రమా.

బుర్రా వెంకటేశం, ఐఏఎస్

రచయితలకు ఆహ్వానం

'అక్షర' పేజీ కోసం రచయితలు వివిధ సాహిత్య ప్రక్రియలపై వ్యాసాలు పంపవచ్చు. కవితలకూ ఆహ్వానం. వ్యాసం నిడివి సుమారు 600 పదాలలోపు ఉండాలి. సమీక్షకోసం కొత్త పుస్తకాలు రెండు కాపీలు పంపాలి.

మా చిరునామా: 'విజయక్రాంతి'
తెలుగు దినప్రతిక, ఇంటర్‌కాంటినెంటల్
పబ్లికేషన్స్ ప్రై.లి., ప్లాట్ నం.1267/ఎ,
రోడ్ నం. 63/ఎ, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–33.
vk.aksharaa@gmail.com

ఒక్కటే

అనుభవం ఒక్కటే
శోకాలెన్నో.
స్నేహం ఒక్కటే
అర్థాలెన్నో.
బంధం ఒక్కటే
ప్రేమలెన్నో.
చైతన్యం ఒక్కటే
కావ్యాలెన్నో.
డబ్బు ఒక్కటే
సంపాదన లెన్నో.
దైవం ఒక్కటే
మొక్కులెన్నో.
సత్యం ఒక్కటే
మాయలెన్నో.
జీవితం ఒక్కటే
వ్యాఖ్యానాలెన్నో.

– తంగెళ్లపల్లి కనకాచారి

కందుకూరి శ్రీరాములు

డా. నందిని సిధారెడ్డి

డా. నాళేశ్వరం శంకరం

ముగ్గురు కవుల సప్తతి సభలు

ప్రకటన

తెలంగాణ రచయితల సంఘం (జంట నగరాలు), తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో ఈనెల 16న హైదరాబాద్, రవీంద్రభారతిలో కందుకూరి శ్రీరాములు, డా. నందిని సిధారెడ్డి, డా. నాళేశ్వరం శంకరం ముగ్గురు కవుల 'సప్తతి సభ' జరుగుతుంది. దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కొండపల్లి నీహారిణి, బైస దేవదాస్, డా. మామిడి హరికృష్ణ, దేవిప్రసాద్, బెల్లంకొండ సంపత్‌కుమార్, డా. తూర్పు మల్లారెడ్డి, కందాళై రాఘవాచార్య, డా. రూప్‌కుమార్ డబ్బీకార్, డా. ఏనుగు నరసింహారెడ్డి, గుండెల్లి ఇస్తారి, డా. పోరెడ్డి రంగయ్య, డా. వి.శంకర్, గడ్డం సులోచన తదితరులు సమావేశంలో పాల్గొంటారని 'తెలంగాణ రచయితల సంఘం' (జంటనగరాలు) ప్రధాన కార్యదర్శి డా. బెల్లంకొండ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రచనలకు ఆహ్వానం!

శ్రీలేఖ సాహితి, వరంగల్లు వారు గత సంవత్సరం మాదిరిగానే 2024 సంవత్సరానికి విశిష్టాద్వైత సాహిత్యానికి 'చెన్నమనేని రంగనాయకమ్మ గారి స్మారక సాహిత్య పురస్కారం' ఇవ్వడానికి నిర్ణయించారు. ఈ పురస్కారం విశిష్టాద్వైత సాహిత్య గ్రంథాలకు మాత్రమే. అనువాదాలు పరిశీలించబడవు. పద్యకావ్యాలు, వ్యాస సంపుటాలు పంపవచ్చు. రచనలు 2020–2024 సంవత్సరాల్లో ప్రచురితమై ఉండాలి. పరిశీలన నిమిత్తం నాలుగు ప్రతులు పంపాలి. **ఆఖరు తేది: 31 మార్చి 2025.** ఏప్రిల్‌లో(ఉగాదికి) పురస్కారం కింద రూ.5000/, శాలువా, మెమెంటోతో సత్కరిస్తారు.

పుస్తకాలు పంపవలసిన చిరునామా: డా. టి. శ్రీరంగస్వామి,
అధ్యక్షులు, శ్రీలేఖ సాహితి, ఇం.నం. 27–14–53, లిటిల్
సోల్జర్స్ స్కూల్ లేన్, మండల కార్యాలయం ఎదురుగా,
హసన్‌పర్తి–506371, హన్మకొండ. ఫోన్: 99498 57955

– డా. టి.శ్రీరంగస్వామి

ఒక నూతన కవిత

తెల్లారిన ఉదయం
మెల్లగా చీకటి పొగిలిపోతూ
చిన్నారి కాళ్ల పట్టీల చప్పుళ్లు
నాన్న గుండెల్లో మోగిన వేళ
ఆనందం నిండిన మనసుకి
ఏదో కొత్త ఊపిరి ఇచ్చినపుడే
ఆలోచించుకున్నా 35 ఏళ్ళ వయసులో
ఇదే కదా తండ్రి ఆనందబాష్పాలు!
తెల్లారిన ఉదయం
గుమ్మం ముంగిట నీళ్ల చప్పుళ్లు
నా చెవికి మధురమైన సంగీతం
ఏవండీ, ఇదిగోండి, లేవండీ...
అంటూ దగ్గర కొచ్చిన నెస్‌కేఫ్,
ఒక్కసారి గొంతులోకి వెళ్ళాక
మళ్ళీ కావాలా? అంటూ
నవ్విన నా వయ్యారి భామ!
తెల్లారిన ఉదయం
చేతిలోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్
చూస్తుండగానే మోగిన అమ్మ ఫోన్,
ఏం చేస్తున్నావ్? అంటూ నాన్న పలకరింపు
ఆ పలుకుతో లేచిన నా చిన్ని చిన్నూ!
ఇలాగే నిత్యం సాగిపోతున్న జీవితం,
అన్నీ మారినా మారని ఈ ఉదయం,
ఒక్కసారి ఊహించుకుంటే
తెల్లారిన ప్రతి ఉదయం,
ఒక నూతన కవిత!

– నవీన్
9642919779

హిందీ భావ కవితా వీచిక మహాదేవీ వర్మ

సాహితి

ఇరవయ్యవ శతాబ్దం రెండవ దశకంలో భారతీయ మహిళలలో నూతన చైతన్యం వెల్లి విరిసింది. అంతకు ముందున్న అడ్డంకులను అధిగమించడం ప్రారంభమైంది. మహిళల ఆలోచనా పరిధి విస్తరించసాగింది. వారి శక్తి వ్యక్తంకావడం మొదలైంది. యుగాల తరబడి మహిళలు బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఫ్యూడల్ చట్రంలో చిక్కుకుని ఉండేవారు. స్వతంత్రంగా వ్యవహరించడానికే వీలులేని ఆ దశలో స్వతంత్ర ఆలోచనలకు తావు ఉంటుందని ఊహించనైనా లేం. కొత్తవారు, అపరిచితులతో ఎలాంటి సంబంధమూ ఉండడానికి వీలులేని పరిస్థితి. మహిళలకు ఉన్న స్వేచ్ఛల్లా మరణించడానికి, ఆత్మహత్య చేసుకోవడానికి, లేదా సజీవంగా ఉండాలనుకుంటే ఒళ్లు అమ్ముకునే వ్యాపారంలోకి దిగడమే.

ప్రసిద్ధ హిందీ రచయిత్రి మహాదేవీ వర్మ (26-03-1907-11-09-1987) సరిగ్గా ఆ దశలోనే కలం చేతబట్టారు. మహాదేవీ వర్మ లోకాన్ని పరిశీలించేదశకు వచ్చే నాటికి ప్రేంచంద్, శరత్‌చంద్ర చటర్జీ, రవీంద్రనాథ్ ఠాగోర్ సమాజంలో మహిళల స్థానం గురించి తమ రచనలద్వారా చర్చించడం మొదలుపెట్టారు. అదే సమయంలో జాతీయోద్యమం సర్వవ్యాప్తమైంది. పరాయిపాలనలో దోపిడీకి, అణచివేతకు వ్యతిరేకంగా తలెత్తిన తిరుగుబాటు సమాజంమీదే కాక వ్యక్తులమీద కూడా ప్రభావం చూపించడం మొదలైంది.

మహాదేవీ వర్మ ఉత్తరప్రదేశ్‌లోని ఫరక్కాబాద్‌లో న్యాయవాదుల కుటుంబంలో జన్మించారు. ఇరవయ్యవ శతాబ్దం ప్రథమార్థంలో హిందీ సాహిత్యాన్ని మలుపు తిప్పిన ఛాయావాద్ (కాల్పనికవాదం- తెలుగు సాహిత్యంలో భావకవిత్వం లాంటిది)ను ప్రచారంలోకి తెచ్చిన సుమిత్రానందన్ పంత్, జై శంకర్ ప్రసాద్, సూర్యకాంత్ త్రిపాఠీ నిరాలా వంటి వారితో పాటు మహాదేవి వర్మ కూడా ఒకరు. నిజానికి ఈ సాహిత్యోద్యమంలో ఆమెదే ప్రధానపాత్ర అనొచ్చు. ఆ రోజుల్లో ఆదర్శవాదం వైపు మొగ్గు ఎక్కువగా ఉండేది. సాంప్రదాయికమైన ఫ్యూడల్ వ్యవస్థకు, సామ్రాజ్యవాదానికి మధ్య ఉండే లంకెను ఆలోచనాపరులు ఈసడించేవారు. అయితే ఫ్యూడల్ బంధాలను తెంచుకోవడం, సామ్రాజ్యవాదాన్ని ఎదిరించడం సానుకూల పరిణామాలే అయినప్పటికీ ఆనాటి సాహిత్యకారులు గతాన్ని కీర్తించడంలో మునిగి పోయారు. లేదా ప్రకృతి ఆరాధనలో లీనమయ్యారు. పరమాత్మను ప్రేమికుడిగా భావించి కీర్తించడంలో పడిపోయారు. మీరాబాయి కృష్ణుణ్ని గాఢంగా ప్రేమించినట్టే పరమాత్మను అమితంగా ప్రేమిస్తూ కవితలల్లిన మహాదేవీ వర్మను ఆధునిక మీరాబాయి అనేవారు. ఛాయావాద్ ఉద్యమాన్ని ప్రారంభించిన నలుగురిదీ మళ్లీ ఒకేదారి కాదు. సుమిత్రానందన్ పంత్ ప్రకృతి ఆరాధకుడైతే, జయశంకర్ ప్రసాద్ గతాన్ని కీర్తించేవారు. నిరాలా కవిత్వంలో గతకాలపు తాత్వికతతో పాటు వర్తమానంలోని చేదు అనుభవాలు మిళితమై ఉండేవి. మరోవేపు మహాదేవీ వర్మ తనను తాను బందీనని భావించారు. అందుకని ఆమె విమోచనకోసం పరితపించేవారు. ఈ లక్షణమే ఆమెను మిగతా సాహిత్యకారులకన్నా విశిష్టంగా నిలబెట్టింది.

మహాదేవి వర్మ గద్య, పద్య రచనలో విశేషమైన కృషిచేశారు. ఆమె 30 కవితా సంకలనాలు, కనీసం పది గద్యరచనలతో పాటు, వ్యాస సంకలనాలు వెలువరించారు. కాని ఆమె ప్రధానంగా గుర్తింపు పొందింది కవయిత్రిగానే. ఒక దశలో వేదాలనుంచి, ఉపనిషత్తులనుంచి అనువాదాలు కూడా చేశారు. ఆమె వచనం కవిత్వంలా పరుగెడుతుంది. వాస్తవికతతో తొణికిసలాడే వచనానికి, కాల్పనికమైన, భావుకతతో కూడిన కవిత్వ రచనకు మధ్య సంపూర్ణ సమన్వయం సాధించడం మహాదేవివర్మకు మాత్రమే సాధ్యమేమో అనేటంతటి వైవిధ్యాన్ని ఆమె కనబరిచారు. ఆమె కవిత్వంలో వైయక్తికమైన ఆగ్రహం వెలువడితే గద్యంలో ఆది బాహిరం అవుతుంది.

మహాదేవి వర్మ స్త్రీ విముక్తికోసం తన రచనలను వినియోగించారు. ఆమె వ్యక్తిగత జీవితానుభవాలే దీనికి కారణం అయిఉండొచ్చు. ఆమెకు ఏడవ ఏటనే పెళ్లి అయింది. కాని ఆమె భర్త స్వరూప్ నారాయణ్ వర్మ విద్యాభ్యాసం చేస్తున్నందువల్ల ఆయన వైద్యవిద్య పూర్తి చేసే దాకా మహాదేవి వర్మ పుట్టింట్లోనే ఉండిపోయారు. పెళ్లి అయినా ఆమె విద్యాభ్యాసం కొనసాగించారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో చదువుకున్నారు. ఆ తర్వాత అలహాబాద్ విశ్వవిద్యాలయం నుంచి సంస్కృత ఎం.ఏ. పట్టభద్రులయ్యారు. ఆమెకు రచనలతోనే కాక చిత్రలేఖనంలో కూడా మంచి అభినివేశం ఉంది. జంతువులంటే ఆమెకు విపరీతమైన అభిమానం. పశుపక్ష్యాదుల మీద రాసిన రచనలకు ఆమే చిత్రాలు గీసే వారు.

ఆమె మహిళాభ్యున్నతికి కృషి చేసిన మాట వాస్తవమే అయినా ఆమెను ఆధునిక స్త్రీ వాదులలో జమ కట్టలేం. మహిళాభ్యున్నతితో పాటు సంఘ సంస్కరణకు కూడా ఆమె పాటుబడ్డారు. మహిళలకోసం ప్రత్యేక మహిళా విద్యాపీఠ్ స్థాపించి, నిర్వహించారు. మొదట ఆ పాఠశాలకు ప్రధానాచార్యులుగా ఉన్న మహాదేవి వర్మ ఆ తర్వాత దానికి కులపతి అయిపోయారు. కుటుంబ బాధ్యతల కారణంగా చదువు కొనసాగించలేని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు ఈ విద్యాసంస్థలో చదువుకునేవారు. కొంతమంది దూర విద్యాభ్యాసం కూడా కొనసాగించారు. పేదలు, అణగారిన వర్గాలు, అంటరాని వారు ఆ విద్యాలయంలో చదువుకునేవారు. ఆమెను బడీ గురూజీ అనేవారు. కుటుంబంలో రెండు వందల సంవత్సరాల తర్వాత ఆ కుటుంబంలో పుట్టిన ఆడశిశువు మహాదేవీ వర్మ. అందుకే అపురూపంగా పెరిగినా స్వాతంత్ర్య పోరాట ప్రభావం ఆమెమీద అంతో ఇంతో లేకపోలేదు. ఒక కవిత్వపోటీలో ఆమెకు వెండిగిన్నె బహుమానంగా వస్తే దానిని విరాళం కింద గాంధీజీకి ఇచ్చేశారు. సత్యాగ్రహం జరిగేటప్పుడు కవి సమ్మేళనాలలో కవిత్వం చదివేవారు. భారత స్త్రీకి ఉండే ఔదార్యం, ఆధునిక మహిళకు ఉండే జ్ఞానం, గాంభీర్యం ఆమెలో కలగలసిపోయి ఉండేవి.

భర్త విద్యాభ్యాసం కారణంగా విడివిడిగా ఉండాల్సిన అవసరం వచ్చింది. ఆ ఎడబాటు కూడా ఆమె భావకవిత్వాన్ని, అనుభూతివాదాన్ని ఆశ్రయించడానికి దోహదం చేసి ఉండొచ్చు. భర్త మృతి తర్వాత ఆమె అలహాబాద్‌కు మకాం మార్చారు.

ఆమె ఒక దశలో బౌద్ధభిక్షువు కావాలనుకున్నారు. విద్యార్థి దశలోనే బౌద్ధం స్వీకరించాలని శ్రీలంకలోని ఒక బౌద్ధ గురువుకు ఆ విషయం తెలియజేస్తూ లేఖ రాసి నన్ను లంకవచ్చి బౌద్ధం స్వీకరించమంటారా లేదా మీరు భారత్‌వస్తారా అని అడిగితే తానే ఇక్కడికి వస్తున్నట్టు ఆ గురువు జవాబు రాశారు. తీరా వచ్చాక ఆమె ఆ గురువును చూడడానికి వెళ్తే ఆ గురువు ఆమె ముఖం చూడకుండా ముఖంమీద గుడ్డ కప్పుకున్నారు. ఇదేమిటి అని అడిగితే ఆయన మహిళలవేపు చూడరు అన్నారు. అంతమాత్రానికి ఆయనను గురువుగా భావించడం ఎందుకు అనుకుని ఆమె బౌద్ధం స్వీకరించాలన్న ఆలోచన మార్చుకున్నారు.

మహాదేవీవర్మ బహుముఖీన ప్రతిభ కనబరిచినట్టే ఆమె ఆలోచనలు కూడా భిన్నఆలోచనల సంగమమే. ఆమె ప్రధానంగా స్త్రీత్వానికి ప్రాధాన్యత ఇచ్చారు. 17వ శతాబ్దంనాటి రాణీ చెన్నమ్మ, 12వ శతాబ్దంనాటి అక్క మహాదేవి, 1564లో అక్బర్ సేనలతో పోరాడి రెండుసార్లు గెలిచి మూడవసారి ఓడిపోయిన రాణీదుర్గావతి, కింది కులానికిచెందిన వ్యక్తిని వివాహం చేసుకుని భర్త మరణం తర్వాత క్రైస్తవం స్వీకరించిన పండిత రమాబాయి, బండారు అచ్చమాంబ వంటి వారి ప్రభావం కూడా ఆమెమీద ఉంది. సాహిత్య, సామాజిక, విద్యా రంగాలలో ఆమె చేసిన కృషికి గుర్తింపుగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో ఆమెను ఉత్తరప్రదేశ్ శాసనమండలి సభ్యురాలిగా నామినేట్ చేశారు.

ఆమె కవిత్వమంతా వేదనామయమే. ఈ వేదన లౌకికమైంది కాదు. ఆధ్యాత్మికమైంది. అనుభూతి వ్యక్తీకరణకు తోడ్పడేది. మానవాళినంతటనీ ఒకే తాటితో కట్టగలిగే లౌకిక వేదన అన్నా ఆమెకు ఇష్టమే కాని ఆమె వేదన ప్రధానంగా ఆక్రందనతో కూడుకున్నది. ఆమె ఆక్రందన పూర్వకమైన వేదనకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినందువల్ల, అది ఏకాంతాన్ని కోరుకునేది కనక ఆమె కవితావస్తువులో వైవిధ్యం తక్కువ అనిపిస్తుంది. ఆమె కావ్యభూమిక విస్తృతం కాలేదు. దీనివల్ల ఆమెకు నష్టంతో పాటు లాభమూ కలిగింది. విషయ వైవిధ్యం లేకపోవడం నష్టమైతే పరిమిత క్షేత్రంలోనే అనుభూతిని అనేక కోణాలనుంచి చూపగలగడం లాభం. అయితే ఆమె అనుభూతుల్లో ఎక్కువ భాగం వైయక్తికమైనవే. దుఃఖం, బాధ, విషాదం అంటే మహాదేవీ వర్మకు ఇష్టం. సుఖం కన్నా దుఃఖం మీదే ధ్యాస ఎక్కువ. అనుభూతి వ్యక్తీకరణ వైయక్తికమైనా ఇతరులకు ఉపకారం చేయాలన్న ఆకాంక్ష ఆమెకు ఎక్కువ. తల్లి పూజ చేసుకునేటప్పుడు విన్న శ్లోకాలు, తులసీదాస్, మీరాబాయి కీర్తనలు ఆమెకు కవిత్వం రాయడానికి ప్రేరేపించాయి. అందుకే ఆమె చిన్ననాటే కలం పట్టారు. కళాశాలలో చేరే నాటికే ఆమె రచనలు ప్రచురితమైనాయి. అయితే ఆమెకు పూజలు, అర్చనల వంటి బాహ్య ప్రదర్శనలపై ఎక్కువ ఆసక్తి లేదు. ఆమె చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలకు సేవ చేసేవారు. ఉచితంగా మందులు అందజేసేవారు. భారతీయ సంస్కృతిని ఆమె ఎన్నడూ విడనాడలేదు. నిర్భీకత, స్వాభిమానం మెండు. 'హిందీ భాషతోనే మా ఆత్మగౌరవం ఇమిడి ఉంది' అని ఆమె అనేవారు. జాతీయ సమైక్యతకు హిందీ ఉపకరిస్తుందని ఆశించారు.

ఆర్వీ రామారావ్

శిథిలాల నుంచి భవనం రావాలి..!!



ఆ అభాగ్యుడి చీకటిగదిలో
గబ్బిలం రెక్కలో తిరుగుతూ
చిరు దీపాన్ని కూడా ఆర్పాలని
అహర్నిశలు శ్రమిస్తూనే ఉంది.

మనసు మౌనంగా రోదిస్తుంటే
విధి విన్యాసాలాడుతుంది
గుండె గదులు కన్నీరు కారుస్తూ
చిరు మాటకై ఎదురుచూపులే చూసే...

మానసిక దౌర్భాగ్యం ఉరిమితే
ఊతనిచ్చే కర్ర ఊడిపోతే
కలిసిరాని వెలుగు చీకట్లో నేటితే

చింతలే నిత్యం వేధిస్తుంటాయి...
చుట్టూ కమ్ముకున్న మబ్బు
మనసుకు జబ్బు చేసి ఏడిపిస్తుంది
ఎండిన నేల దాహానికి ఎదురుచూసే

వసంతపు చెట్లు కోసం కన్నీరుకార్చే...

పెంచుకున్న ఆశలకు నిప్పులు చల్లితే
దురదృష్టవంతుడు అదృష్టవంతుడు కాడు
ఎండిన గుండెకు తడి తగలదు
కాల రేఖ నుదుటి రాతలు మార్చదు...

శిథిలాల నుంచి భవనం రావాలి
ధిక్కార స్వరాలు ఉదయించి
మానవత్వపు గుండెల్లో సవ్వడి పెరగాలి
మాటే ఓదార్పు లేపనం పుయ్యాలి...

మనిషికి కావాల్సిందల్లా ఇప్పుడు
నలుగురు కలిసే కాస్త సమయం
నాలుగు మాటలు వినిపించే కూడలి
ధైర్యం చూపే వృక్ష తత్వపు సందేశం...

కొప్పల ప్రసాద్, 9885066235

ఆ గానం- అజరామరం!!

సంగీత రస గంగాధరం
ఘంటసాల గాన మాధుర్యం!
తారా చంద్రుల సయ్యాటలు
ఋతువుల పూల పరిమళాలు
తెలుగుల వెలుగు రేడు - వెన్నెల్లోంచి
విరహాగ్నుల్ని ఉపశమించిన రీతి
ఆనంద రాగాలు మేఘ మల్హారులే కురిపిస్తాయి
మయూర పింఛాలు పురి విప్పిన దృశ్యాలు
ఒక స్వాతంత్ర్య పోరాట యోధునిగా
తెలుగు భాషకు సౌగంధికతల్ని
అలదించుకున్నప్పటి వాగ్గేయతలు
విషాద గీతాల్లోంచి వైరాగ్యాలు
భగవద్గీతా గానంతో భక్తి మాధుర్యాలు
చెంగావి రంగు చీరల సొగసులు
రాధికా ప్రియతమా అన్నారు
శ్యామలా దండకంతో దేవీ ప్రార్థనం
తనువుల్ని పులకరించే వైదుష్యం
పద్యం- పాట- గేయ ఫణితులు
భావ సౌందర్యం- జానపథ స్నిగ్ధత్వం
పదాలు- పల్లవులు- చిరంజీవులు
ఆ గీతాల గగన విహారాలు
భువి నుంచి- దివి కేగిన దివ్యాత్ముడా
శత వర్షాల నవ్యాతి నవ్యాలు

(ఘంటసాల వర్ధంతి ఈ నెల 11 వ తేదీన)

-వి.ఎస్.ఆర్.ఎస్.సోమయాజులు
సెల్: 9441148158

గ్రంథ సమీక్ష

భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు

పత్రికా స్వేచ్ఛ మేడిపండుగా మారిన కాలమిది. జర్నలిజం విలువలు అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్న తరుణమిది. సమస్తవిలువల్ని ధ్వంసం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న వర్తమాన వ్యవస్థ జర్నలిస్టులపై నైతిక, భౌతికదాడులకు తెగబడుతున్న నేపథ్యమిది. జర్నలిజంవిలువలకు నిబద్ధులై నిలబడే జర్నలిస్టులు, అలాంటి పత్రికా యాజమాన్యాలు ఆత్మస్థైర్యాన్ని కూడ గట్టుకోవాల్సిన కాలమిది. సరిగ్గా ఈసమయంలోనే వచ్చింది "భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు" పుస్తకం. నాలుగుదశాబ్దాల క్రితం భౌతికంగా జీవనయాత్ర చాలించి వెళ్లిపోయిన జర్నలిస్టు ఎం.చలపతిరావు (ఎంసి) కూ ప్రస్తుతానికీ ఏమిటి సంబంధం? "పత్రికా స్వాతంత్ర్యం అనే దానికి ప్రస్తుత తరహా యాజమాన్యం, మేనేజ్మెంట్, అజమాయిషీలలో అర్థమే లేదు. ప్రసారం, జర్నలిజం వృత్తిని అనుసరించేవారు సామాజిక ఆశయంతో తమ కార్యకలాపాలను కొనసాగించాలి. ఈ లక్ష్యాలను సాధించాలంటే వారు మేధావులుగా, చిత్తశుద్ధితోనూ, ధైర్యంగానూ ఉండటమేకాక సామాజిక ప్రయోజనాల దృష్ట్యా ప్రచార సాధనాల పునర్వ్యవస్థీకరణకు వారు పనిచేయాలి." (పుట-214)

అంతేకాదు..."జర్నలిస్టు, హడావుడిగా రాసే చరిత్రకారుడు. తన వృత్తి పట్ల నిజాయితీ ఉన్న జర్నలిస్టు అయితే హడావుడిగా రాసినప్పటికీ అతను చారిత్రక దృక్పథాన్ని వదులుకోరాదు. చారిత్ర లక్ష్యాన్ని విస్మరించరాదు. అతను మేధో పాటవాలను సమ్మేళనం చేసుకోవాలి. తన చుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్న దానిని నమోదుచేయడంలోనూ వాటికి భాష్యం ఇవ్వడంలోనూ, అతడు సామాజికవేత్త (సోషియాలజిస్టు)గా కూడా ఉండాలి. నేటి కొత్త జర్నలిజంలో సామాజిక బాధ్యత లోపిస్తున్నది. చౌకబారు సంచలనం, కుంభకోణాలు, కుతంత్రాల సాంప్రదాయాల కొనసాగింపే ఈకొత్త జర్నలిజం. హెన్రీ లూయీ ప్రారంభించిన ఈ కొత్త జర్నలిజం పెట్టుబడిదారి విధానాన్ని కాపాడడానికి తరుచుగా ఉపయోగించుకుంటున్నారు." (పుట-209) అని 1982 జులై నెలలో ఆంధ్రుల రాజకీయ చైతన్య కేంద్రమైన విజయవాడలో చెప్పి వెళ్లారు ఎంసి. వర్తమానానికి ఎంసి ఆలోచనలకు ఉన్న సంబంధం ఇదే.

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్రను పోషించిన పత్రిక నేషనల్ హెరాల్డ్. ఆ పత్రికకు మూడు దశాబ్దాలకు పైగా సంపాదకునిగా పనిచేశారు. ఎం.సి. ఆంగ్ల జర్నలిజంలో జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని అందుకున్నారు. 1936 లో జర్నలిస్టు వృత్తిలో ప్రవేశించారు. సంపాదకుడు కుందూరు ఈశ్వరదత్ పత్రిక "పీపుల్స్ వాయిస్"లో అసిస్టెంట్ ఎడిటర్ కమ్ లీడర్-రైటర్‌గా చలపతిరావు తొలిసారి జర్నలిస్టు ఉద్యోగంలో ప్రవేశం. ఆ పత్రిక స్థాపకులు పిఠాపురం మహారాజా. పీపుల్స్ వాయిస్ 1937లో ఈ పత్రిక ఆగిపోయింది. అలహాబాద్ (నాడు ప్రయాగ)లో "ది వీక్ ఎండ్" పత్రికను చలపతిరావు కోసం కుందూరు ఈశ్వరదత్ స్థాపించారు. అదీ ఎక్కువకాలం నడవలేదు. త్రివేణి పత్రికకూ మానికొండ వ్యాసాలు రాసేవారు. మహాత్మా గాంధీ కుమారుడు దేవదాస్ గాంధీ సంపాదకత్వంలో నడుస్తున్న హిందుస్థాన్ టైమ్స్ పత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. అందులో 'మాగ్నస్' పేరుతో "ఆఫ్ ది రికార్డ్" అనే వీక్లీ కాలమ్ రాశారు చలపతిరావు. ఆ వ్యాసాలు నెహ్రూ దృష్టిని ఆకర్షించాయి. 1938 లో నేషనల్ హెరాల్డ్ పత్రికను కోటంరాజు రామారావు సంపాదకుడిగా స్థాపించారు. అందులో చలపతిరావు అసిస్టెంట్ ఎడిటర్, లీడర్- రైటర్‌గా చేరారు. ప్రభుత్వ ఆంక్షల కారణంగా గాంధీజీ పిలుపు మేరకు 1942 లో నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వచ్ఛందంగా మూతపడింది. ఈ కాలంలో చలపతిరావు రహస్యంగా పత్రికలను నడిపారు. 1945 నవంబరులో తిరిగి నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రారంభం అయింది. అందులో జాయింట్ ఎడిటర్‌గా చేరారు. 1946 జూలై 1న నేషనల్ హెరాల్డ్ పత్రిక సంపాదకుడిగా బాధ్యతలు చేపట్టారు. 1978 వరకు 32సంవత్సరాలు ఆ బాధ్యతలో పనిచేశారు.

భారతదేశంలో సోషలిజాన్ని నిర్మించాలని నేషనల్ హెరాల్డ్ యజమాని నెహ్రూతోనే వాదించిన సామ్యవాది. ఏ రాజకీయ పార్టీలోనూ సభ్యులు కాదు. ఒక తెలుగు బిడ్డడు. నీతికి, నిజాయితీకి, నిబద్ధతకు, నిమగ్నతకు నిలువెత్తు నిదర్శనం అతడు. 'ఎంసి' గా నాటి పాత్రికేయ ప్రపంచానికి సుపరిచితుడు మానికొండ చలపతిరావు. శ్రీకాకుళం జిల్లాలోని మారుమూల ప్రాంతానికి చెందిన అంబఖండి అనే కుగ్రామానికి చెందినవారు. 1908లోనో 1910లోనో (ఈ విషయంలో స్పష్టమైన సమాచారం అలభ్యం.) విశాఖపట్నంలో పుట్టారు. మద్రాసులో చదివి, న్యాయవాదవృత్తితో సంతృప్తి చెందలేక దానిని వదిలేసి అలహాబాదు, లక్నో, ఢిల్లీలో పత్రికారంగంలో దాదాపు అర్ధ శతాబ్ది కాలం పనిచేశారు. 1950 లో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే) స్థాపనలో కీలక పాత్ర పోషించారు. దానికి 1950- 55 అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 1968 లో తనను వరించివచ్చిన పద్మభూషణ్ పురస్కారాన్ని తిరిగి ఇచ్చివేశారు.

భారతీయ జర్నలిజం ధృవతార
మానికొండ చలపతిరావు
NATIONAL HERALD
అమరయ్య ఆకుల

భారతీయ జర్నలిజం ధృవతార
మానికొండ చలపతిరావు,
సంపాదకులు: అమరయ్య ఆకుల,
పుటలు: 216, వెల: రూ.225/-,
ప్రచురణలు: శ్రీ మిరియాల వెంకటరావు
బెనెవలెంట్ ఫౌండేషన్

"ఎం.చలపతిరావు...భారతదేశంలో పుట్టిన గొప్ప సంపాదకులలో ఒకరు. మన మాతృ భూమిపై పుట్టిన గొప్పవారిలో ఒకరు. వృత్తిలో సమగ్రత, ఆచరణలో చురుకుదనం ఆయన సొంతం. కత్తి మొనకున్నంత పదును ఆయన వాక్యంలో ఉంటుంది. మరెవ్వరూ ఊహించ లేనంత అత్యున్నత ప్రమాణాలకు ఆయన పెట్టింది పేరు. అటువంటి జర్నలిస్టును మునుముందు చూడడం కష్టమేమో." అంటారు నేషనల్ హెరాల్డ్ ఎం.డి. పి.డి. టాండన్. (చెదిరిన గుండెలపై చెరగని ముద్ర! పుట-66)

మరి వారి జీవన శైలో... "ప్రస్తుత షోకిల్లా ప్రపంచంలో ఆయన ఓ ముతకమనిషి. నంగినంగి మాటలు, వంగివంగి దండాలు, దస్కాలు, మెరమెచ్చు మాటలు, మర్యాదలు, నటించడాలు తెలియని మనిషి. డాంబికాలలో ఆయనకు పాండిత్యం లేదు. ఏకాంతంతో సావాసం ఆయనకు ఇష్టం. ఏకాకి జీవితం. బ్రహ్మచారి." (పుట- 69)

దేశంలో అత్యుత్తమ జర్నలిస్టు మహాత్మాగాంధీ అంటారు ఎం.సి. "చాలా విధాలుగా గొప్పవాడుకావడం వల్లనో లేక పరిపూర్ణత్వంతో వచ్చిన గొప్పతనం వల్లో ఆయన్ని గొప్ప జర్నలిస్టని అనడం లేదు. జర్నలిజమంటే పాండిత్యమేమీ కాదు. ఇంకోరకంగా చెప్పాలంటే అదో హడావిడిగా రాసే సాహిత్యం లేదా చరిత్ర. మరికొంత క్రియాశీలత (యాక్షన్) కూడా. జర్నలిస్టుకు ఏ అంశాన్నైనా అర్థం చేసుకునే శక్తి ఉండాలి. గాంధీ అర్ధ శతాబ్దం పాటు ఒంటిచేత్తో ఆ పనిచేశారు. ప్రజా సమాచారవ్యవస్థలో వన్ మ్యాన్ మీడియం ఆయనిది. అత్యంత నిర్భయుడు. ఆయన జీవితమే పోరాటాల గాథ. బతికినంత కాలం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు. ఆయనకు ఇతరేతర శక్తులనేకం ఉన్నా గాంధీ గొప్ప జర్నలిస్ట్ కూడా." (వినోబా దీక్ష- గాంధీ 'హరిజన్' మూత-మానికొండ చలపతిరావు. పుట-54).

ఈ ప్రమాణాలతోనే చూస్తే జర్నలిజంలో గాంధీజీ తరువాతి స్థానం చలపతిరావుదే అనిపిస్తుంది. ఎందుకు అంటే... నేషనల్ హెరాల్డ్ రజతోత్సవ సభలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మాట్లాడుతూ "జనాలు తరచూ నేషనల్ హెరాల్డ్‌ను నా పేపర్ అంటుంటారు కానీ అది తప్పు. వాస్తవానికి ఇది చలపతిరావు పేపర్. ఆయన అభిరుచితో, సామర్థ్యంతో, దృక్పథంతో మనసుపెట్టి రాస్తాడు.

పక్షపాతం దురుద్దేశం లేకుండా సంపాదకీయాలు రాయడం ఆయన ప్రత్యేకత. దేశంలోనే ఇంతటి సమర్థుడైన ఎడిటర్ని ఊహించలేను. ఎందుకంటే ఎడిటర్ సంయమనంతో, అవగాహనతో రాస్తాడు." అంటారు. (చెదిరిన గుండెలపై చెరగని ముద్ర! పి.డి.టాండన్, నేషనల్ హెరాల్డ్ ఎం.డి. పుట- 70).

భారతీయ జర్నలిజం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఈవేళ ఎంసి భావజాలం, వారి అనుభవసారం మనకు ఏమాత్రమైనా మార్గదర్శనం చేయించకపోదు అనే ఆశతో సంపాదకులు ఈ కష్టతరమైన పనిని నెత్తికెత్తుకున్నట్టు అనిపిస్తుంది. ఈ పుస్తకంలో మొత్తం 30 వ్యాసాలు ఉన్నాయి. అందులో కొన్ని ఎంసి రాసినవి. మరికొన్ని ఎంసి గురించి రాసినవి. నెహ్రూతో నా తొలి పరిచయం, వినోబా దీక్ష- గాంధీ 'హరిజన్' మూత, వార్తపుట్టని చోటేది..., జర్నలిస్టులు తమ సోర్స్ చెప్పాలా వద్దా..., ప్రత్యేక హక్కుల పేరిట పత్రికా స్వేచ్ఛను హరిస్తారా? పత్రికా స్వేచ్ఛంటే యజమాని స్వేచ్ఛ కాదు..., సామాజిక మార్పే పత్రికల ప్రధాన ధ్యేయం కావాలి. ఏడు వ్యాసాలు స్వయంగా ఎంసి రాసినవి (ఉపన్యసించినవి). మిగతావి ఎంసి గురించి ప్రసిద్ధ జర్నలిస్టులు, ఇతరులు రాసినవి.

చెదిరిన గుండెల చెరగని ముద్ర! పద్మభూషణ్ అవార్డు తిప్పి పంపిన మొనగాడు ఎంసి. అనే రెండు వ్యాసాలను నేషనల్ హెరాల్డ్ ఎం.డి. నాటి కేంద్ర సమాచార శాఖ మంత్రి, పి.డి.టాండన్ రాశారు. ఎంసీని కొలిచే తూనికరాళ్లు లేవు- నాటి కేంద్ర కార్మికశాఖ మంత్రి కే.వి.రఘునాథరెడ్డి, నెహ్రూ, ఎంసి ఒకే వరలో రెండు కత్తులు- నేషనల్ హెరాల్డ్ ఎండి, కర్నాటక మాజీ గవర్నర్ ఉమాశంకర్‌దీక్షిత్, నెహ్రూనీ వదలని ఎంసీ, శంకర్- విశాలాంధ్ర మాజీ సంపాదకులు సి. రాఘవాచారి, పత్రికా స్వేచ్ఛ మా జన్మహక్కు- ఎడిటర్ ఇన్ చీఫ్, ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, సీ.రాఘవన్, ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన ధీశాలి ఎంసీ! లోక్‌రాజ్ సంపాదకులు చతుర్వేది, సంపాదకత్వ సమగ్రతకి సజీవ రూపం ఎంసీ.-నాటి ప్రధాని ఇందిరాగాంధీ, ఎంసీ మేధస్సు ఇందిరకు అక్కరలేదు- స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎంపీ ఎన్జీరంగా, ఈశ్వరదత్‌తో భేదాభిప్రాయాలపై ఎంసీ- డాక్టర్ ఎ.ప్రసన్నకుమార్, నేషనల్ హెరాల్డ్ ఎందుకు పెట్టవలసివచ్చింది?- అమెరికన్ జర్నలిస్టు స్టాల్‌బర్గ్, ఎడిటర్లు చెప్పిందే వేదంగా సాగిన కాలంలో ఎంసీ- సీనియర్ జర్నలిస్టు దాసు కృష్ణమూర్తి, ది గ్రేట్ ఇండియన్ ఎడిటర్ ఎంసీ- వై.రామకోటయ్య, ప్రజాగళం, చైతన్య దీపం మా ఎంసీ- డాక్టర్ లీలా వరప్రసాదరావు, ఆంగ్ల జర్నలిజాన్ని శాసించిన తెలుగు బిడ్డ- ఎం.ఎల్.కాంతారావు పిహెచ్‌డి పరిశోధన పత్రం, ఇందిరాగాంధీపై వీవీగిరి చల్లని చూపు- ఆల్ ఇన్ ఆల్ బుక్ రివ్యూ- ప్రసన్న కుమార్, సమకాలీనులను మెప్పించిన మొనగాడు- చెప్పుకోదగిన పుస్తకం, ఎంసీ తర్వాత నేషనల్ హెరాల్డ్...! ఎంసీని కలిసినప్పుడు...సీనియర్ జర్నలిస్ట్ తాడి ప్రకాష్, త్రివేణి మంచి మిత్రుణ్ణి కోల్పోయింది!- భావరాజు నరసింహారావు, ఎంసీ మృతిపై ఎవరేమన్నారంటే... విశాలాంధ్ర దినపత్రిక, తుది విషాద ఘడియలు!- విశాలాంధ్ర దినపత్రిక.

ఇలా సేకరించి కూర్చిన వ్యాసాలు ఎంసీ వ్యక్తిత్వాన్ని, వృత్తి పట్ల నిబద్ధతను, నెహ్రూ- ఎంసీ మధ్య సాన్నిహిత్యం సంఘర్షణలను, జర్నలిస్టుగా ఎంసీ ప్రతిభాపాటవాల్ని అదే సందర్భంలో సమకాలీన సామాజిక రాజకీయ పరిస్థితుల్ని మనకు రేఖామాత్రంగా పరిచయం చేస్తాయి. తెలుగునాట వామపక్ష జర్నలిజం పితామహుడుగా ప్రసిద్ధిగాంచిన మద్దుకూరు చంద్రశేఖరరావు (చంద్రం) తొలి స్మారకోపన్యాసాన్ని విజయవాడలో 1982లో ఎంసి చేశారు. అందులో ఎంసి ప్రస్థావించిన కొన్ని ప్రధాన అంశాలు కొన్నింటిని ఇక్కడ ప్రస్థావించడం అప్రస్తుతం కాదనుకుంటాను.

"దురదృష్టవశాత్తు మహాత్మాగాంధీ కాలం నుంచి మేనకాగాంధీ కాలందాకా భారతదేశంలో పత్రికలు వ్యక్తి పూజలోనూ నేర్పు సంపాదిస్తున్నాయి. ఏదో వ్యక్తి చేసిన పనో, అతని ప్రవర్తన తీరూ, అతడు చెప్పింది ముఖ్యమైపోతున్నది తప్ప అసలు అంశాలు ముఖ్యం కావడంలేదు. మనుషులను కదిలించే లక్ష్యాలుగాని, సామాన్య ప్రజల అవసరాలుగాని, ఆకాంక్షలుగాని, గుడిసెవాసుల, పేవ్మెంట్‌పై కాలం వెళ్లబుచ్చే ప్రజల జీవన పరిస్థితులు గాని ముఖ్యం కావడంలేదు." (పుట-208)

"గుత్త సంస్థలు, గుత్త పత్రికలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రచార సాధనాల మధ్య, ప్రభుత్వం మధ్య లంకె పెరుగుతుండడాన్ని నిస్సహాయంగా గమనిస్తున్నాం. సమాజంలోని పెద్ద విభాగాలు వార్తల్లోకి రావడంలేదు. కార్మిక వర్గం, పేద రైతాంగం, భూమిలేని కార్మికుడు, ప్రజా ప్రచార సాధనాలకు కనిపించడమే లేదు." (పుట- 211)

"జర్నలిస్టులకు ఈవేళ ఈమాత్రమైనా వేతన భద్రత ఉందంటే అది ఖచ్చితంగా ఎంసీ నడుంకట్టి చేసిన ఉద్యమ ఫలితమే. తొలి ప్రెస్ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటైనా, పాత్రికేయులకు తొలి వేజ్‌బోర్డు వచ్చిందన్నా ఎంసీ కృషే కారణం. ఈ విషయం ఈవేళ చాలామంది జర్నలిస్టులకు తెలియకపోవచ్చును. కాని అది నిజం... ఎడిటర్‌గా ఉన్న పుణ్యానికే రాజ్యసభ సీటో, రాజసౌధమో, పొలమో, స్థలమో అడుగుతున్న కాలంలో ఈ 'పిచ్చిమనిషి' తనకు ఢిల్లీ చాణక్యపురిలో వచ్చిన స్థలాన్ని కాదంటాడు. పైసలిచ్చైనా, పైరవీలు చేసైనా ఏదో ఒక పద్మ అవార్డు వస్తే చాలనుకునే రోజుల్లో పద్మభూషణ్ అవార్డును తిరుగు టపాలో రాష్ట్రపతి భవన్‌కు పంపుతారు." అని ముందు మాటలో సీనియరు జర్నలిస్టు, ఈ పుస్తక సంపాదకుడు అమరయ్య చెప్పటంలో ఈ పుస్తకాన్ని తీసుకురావటంలోని ఔచిత్యం బోధపడుతోంది.

- కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ